అనివార్యములు

జీవితంలో తొంగిచూసే కొన్ని అనివార్య సత్యాలను అవగాహనతో అనుమతించకపోతే జీవికి శాంతి లభించదు. సమరం తప్పదు. అవి నీకు ఇష్టమా? అయిష్టమా? అనేది ప్రశ్న కాదు. ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నీవు అనుభవించాలి అనేది జీవన సత్యం. లొంగని కారణాన్ని ఈడుస్తూ అలసిపోవడంకన్నా అవగాహనతో ప్రశాంతంగా దానికి లొంగిపోవడమే శ్రేయోదాయకం.

నన్ను వ్యాధులు బాధిస్తాయి.

నన్ను వృద్ధాప్యం సమీపిస్తుంది.

నన్ను మృత్యువు కబళిస్తుంది.

ఈ ఆలోచనలు నిన్ను కుదిపేస్తున్నాయి. వీటిని పదే పదే స్మరించుకుంటూ నీవు కుమిలిపోతున్నావు. ఈ ఆలోచనలు నీ ఆంతర్యాన్ని యుద్ధభూమిగా మార్చేశాయి.

నీవు చేసే పై ఆలోచనలకు సంబంధించిన కార్యాలు సత్యాలే కానీ, అవి ఇంకా నిన్ను సమీపించలేదు అనేది కూడా సత్యమే. అయినా, ఎప్పుడొచ్చి పైన పడతాయోనని ఇప్పుడే మరిగిపోతున్నావు.

అది నిజమే. అవన్నీ అనివార్యములు. అనవసరమని నీవు అనుకున్నా అవి నీకు దూరంగా పోవు. అనివార్యాలు కనుక వాటిని ఆనందంగా అనుభవించడానికి నీవు సిద్ధం కావాలి. రాబోయే వాటిని ఊహించే పాండిత్యమున్న వాడివి, వచ్చిన వాటిని అనుభవించడంలో వెనుకంజ వేయడం దేనికి?

విద్వన్మృత్యు భయం జహీహి

"పండితుడా! మృత్యు భయాన్ని విడిచిపెట్టు"

మృత్యువు అనివార్యం. నిద్రించువాడు కలవరించునట్లు "నాకు మృత్యువు రాకూడదు" అని కలవరిస్తావెందుకు? అనివార్యమైన మృత్యువు నేను అనుభవించేందుకే ఉన్నది అని ధైర్యంగా ఉండు. సిద్ధంగా ఉండు.

అయినా నీ భ్రాంతి కానీ! నీది కానిది, నీకు లేనిది మృత్యువు. ఎందుకొచ్చిన ఆందోళన ఇదంతా! ఉన్నదానిని ఉన్నట్లు, లేని దానిని లేనట్లు గ్రహిస్తే సరిపోతుంది.

భవతో నాఽస్త్యేవ మృత్యుః క్వచిత్

"నీకు మృత్యువు ఎన్నడూ సంభవించదు."

నీవు సత్యాత్మవు. నిత్యాత్మవు. నీకు మరణ మెక్కడిది? దేహాభిమానంతో తయారైన దిగులే ఇదంతా! ఈ దేహమొక మట్టి ముద్ద అనే సత్యాన్ని సంభావించు.

పూలతో కప్పినంత మాత్రాన శవం చెడకుండా ఉంటుందా! చెడే శవం నీవు కావు. చెడని శివం నీవు. తొడుగుల్ని తొలగించి చూడు.

శవమయ్యే శరీరం నీవని భ్రమించావు. శరీర ధర్మాల్ని నీలో ఆరోపించు కున్నావు. వ్యాధులకు ఆహ్వానం పలుకుతున్నావు. వృద్ధాప్యానికి స్వాగతం చెబుతున్నావు. మృత్యువుతో కరచాలనం చేస్తున్నావు.

నీవు కాని దేహం నీకు లేనిదేనని ఈ క్షణాన భావించు. ఇక్కడే అంతరిస్తాయి ఆవేదనలన్నీ. కానీ ఇది చెప్పినంత తేలిక విషయం కాదు. దేహాత్మ భావాన్ని విస్మరించడం సులభసాధ్యం కాదు. ఆత్మానాత్మ వివేకంగల తీవ్ర ముముక్షువులకే ఇది సాధ్యం. అనాత్మను, అధ్యాసను చక్కగ తెలుసుకున్న వారికే సులభతరం. దోష దర్శనం సంపూర్ణంగా జరిగిన తరువాత దోష ప్రవర్తన తలెత్తడం సాధ్యమా?

ప్రదృశ్యతే వస్తుని యత్ర దోషో న తత్ర పుంసోఽస్తి పునః ప్రవృత్తిః
అన్తర్మహా రోగవతీం విజానన్ కో నామ వేశ్యామపి రూపిణీం వ్రజేత్

"ఏ విషయముల యందు దోషములను మానవులు పూర్ణంగా దర్శిస్తారో, ఆ విషయముల యందు తిరిగి మానవులు ప్రవర్తించరు. వేశ్యల పొందును అభిలషించెడి కాముకులు కూడా, వారి ప్రాణాలను అపహరించే తీవ్రమైన రోగములు ఆ వేశ్యల యందు నిండియున్నవని తెలియగానే వారిని కోరరు కదా!" అంటారు శ్రీశంకర భగవచ్ఛరణులు.

ఆత్మానాత్మ వివేకం ఈ దశలో లేకపోయినా ఫరవాలేదు. ఉండదు కూడా. నీవు ముందుగా "అనివార్యము" లను అంగీకరించాలి. దానివలన ఆంతరంగిక కల్లోలాన్ని కొంతవరకు ఆపగలవు. ప్రశాంతతను కొంత చేజిక్కించుకోగలవు.

"దేహం అనిత్యం. దేహానికి సంక్రమించే యౌవనం శాశ్వతం కాదు. దేహం పరిణామశీలమైనది. కనుక మార్పు చెందుతూ ఉంటుంది. మార్పు చెందే శరీరం ముసలితనం వైపు మరలక పోదు. వృద్ధాప్యం దేహానికి అనివార్యం.

"దేహం క్షణభంగురం. క్షయ పంజరం. క్షీణశీలమైన దేహం వ్యాధులకు, బాధలకు నిలయం. శరీరాలకు రోగాలు అనివార్యం.

"దేహం వచ్చింది. వచ్చింది ఏదైనా ఈ ప్రపంచంలో పోయేందుకే. దేహం నేడు కళకళలాడినా, ఓనాడు కనుమరుగై పోతుంది. దేహానికి మృత్యువు అనివార్యం.

"ఈనాడు ఈ ప్రపంచంలో నాకున్నవన్నీ, నా వనుకున్నవన్నీ మార్పుచెందే స్వభావాన్ని కలిగి ఉన్నాయి. క్షీణించే ప్రకృతితో కొనసాగుతున్నాయి. నశించే స్వరూపాన్ని కలిగి ఉన్నాయి. కనుక ఉన్నవాటితో ఏనాడైనా వియోగం తప్పదు.

వీడుకోలు తప్పదు. కనుక వియోగం అనివార్యం.

"నాకు లభించేవన్నీ ప్రారబ్ధాధీనాలు. అనుకున్నవి జరుగవు. జరిగేవి అనుకోకపోయినా జరుగుతాయి. బాగుపడే ప్రారబ్ధం లేనివారికి అధమ పురుషార్థం కూడా తోడైతే, వారిని బాగు చేసే ప్రయత్నం ఫలించలేదని దిగులుపడి సాధించే దుండదు. ఇది అనివార్యం."

ఈ అనివార్యాలను జీవితంలో చక్కగా అవలోకించాలి. ఇది చెప్పినంత తేలికగా, తెలిసినంత తేలికగా అనుభవంలోకి రాదు. తదేక మననం కావాలి. పున: పున: మననం సాగాలి.

వృద్ధాప్యం అనివార్యం అని తెలియగానే యౌవనగర్వం, ఆరోగ్య దర్పం సడలి పోతాయి. మృత్యువు అనివార్యం అని తెలియగానే జీవన సరళిలో అహంకారం అడుగంటి పోతుంది. వస్తు పరిణామం వంటబట్టగానే మమకారం మటుమాయ మవుతుంది. కార్యాల వెనుక కారణాలు బోధపడగానే కార్యాలు బాధించకుండా వెను దిరుగుతాయి. "అనివార్యము"లను గుర్తించడం వల్ల లభించే అవాంతర ఫలా లివన్నీ.

ఆంతర్య ప్రయాణానికి అడుగు ముందుకేసిన ఈ ప్రారంభదశలో "అనివార్యము" లను అంత:కరణకు అవగతం చేయాలని తెలుసుకున్నాం. దీనిని ఈ క్షణం నుండే ఆచరణలో పెట్టండి.

బ్రతుకు బండి తన దారిన అది సాగిపోతోంది. జీవించినంత కాలం ఇక జీవించకపోవచ్చు. ఇక చేయబోయేది కూడా గతంలో చేసిందే. చూసిందే. ఈ తనువు ప్రపంచంలో ఎంతదాకా ఉంటుందో! ఉన్నంత దాకా ఎన్ని రోగాలు పరామర్శిస్తాయో! ఎన్ని కష్టాలు కుదిపేస్తాయో! గుండెను గుడ్డను పిండినట్లు పిండే దుర్భర దుఃఖాలు ఎన్ని జీవితంలో ప్రవేశిస్తాయో!

నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతై రపి

"గతంలో చేసిన పనులు ఏదో ఒకనాడు అనుభవించక తప్పదు".

ఎండిన చెరువును ఎన్ని మంచు తుంపరులైతే నిండింప గలుగుతాయి? ఆ పని మేఘుడే చేయగలడు. ఎండిన బ్రతుకుల్ని పండించే కార్యమును శ్యాముడే చేయగలడు. నీలమేఘశ్యాముడే చేయగలడు. రామభద్రుడే చేయగలడు.

ప్రతిబంధకాలు - ప్రగతి

ప్రతి విషయంలోను కొందరు సమర్థవంతంగా కనిపిస్తారు. ప్రతి విషయంలోను మరికొందరు అసమర్థులుగా అగుపిస్తూ ఉంటారు. మొదటి వారి విషయంలో అందరికీ ఆశ్చర్యం. రెండవవారిని చూడగనే పైకి చెప్పలేకపోయినా అందరికీ విసుగు, అయిష్టత ఉంటుంది.

ఒక విషయంలో పరిపక్వత వస్తే అన్ని విషయాల్లోనూ వస్తుంది. కొందరికి మరపే మిత్రుడు. ఈ మరపు వారిలో ప్రాణం లాగ కొనసాగుతూ ఉంటుంది. ప్రాణం పోయే వరకు కూడా అలాగే ఉంటుంది. ఇలాంటి వారిలో ప్రాణ మున్నప్పుడు కూడా లేనట్లే ఉంటుంది. దీనిని ఇతరులు గుర్తిస్తారు. కాని, ఒకరి లోపాలను మరొకరు గుర్తించటం వల్ల ఒరిగే దేమీ ఉండదు. ఎవరికి దాహముందో వారే నీళ్ళు త్రాగాలి.

ప్రయత్నశీలురు పతన మెరుగరు. అవసరాన్ని గుర్తించి అవగాహనను పెంపొం దించుకుంటే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఉండదు. మనిషి ఏది పొందాలనుకున్నా దానిపైన పూర్ణాసక్తి ఉండాలి. దానిని సాధించే ప్రయత్నంలో నిండైన అవధాన ముండాలి.

సైకిల్‌పై ప్రయాణం చేస్తున్న వాడికి తాను ఎక్కడికి చేరాలో క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. దాని అవసరం ఏమిటో ఆంతర్యంలో సుస్పష్టంగా ఉండాలి. ఆ తరువాత ప్రతిక్షణము కాళ్ళు కదులుతూనే ఉండాలి. అంతేకాదు. గమ్యాన్ని చేరేవరకు కళ్ళు ముందొచ్చేవాటిని చూస్తూ పోవాలి. వెనుక దూసుకొచ్చే వాటిని మనసు గమనిస్తూ ఉండాలి. అప్పుడే అనుకున్న చోటికి చేరగలం. లేకపోతే, అనుకోని చోటికి చేరవలసి వచ్చిందే అని బాధపడవలసి వస్తుంది. బాధలు పడటం మనకు క్రొత్తేమీ కాదు. ఇలా బాధపడి సాధించేది ఏమీ ఉండదు అనేది కూడా క్రొత్తగా మనం తెలుసుకోవలసింది కాదు.

జీవితంలో కొన్నిటిని పొందటం ఎంతకష్టమో తిరిగి వాటిని నిలుపుకోవడమూ అంతే కష్టం. కొన్నిటిని పోగొట్టుకోవటం ఎంత కష్టమో తిరిగి రాకుండా చూసుకోవటం అంత కష్టం.

కష్టపడి ధనాన్ని సంపాదిస్తాం. ఉద్యోగాన్ని సంపాదిస్తాం. స్నేహాన్ని సంపాదిస్తాం. మంచి పేరును సంపాదించుకుంటాం.అజాగ్రత్త వల్ల ధనం పోతుంది. అవిధేయత వల్ల ఉద్యోగం పోతుంది. అవగాహన లేని కారణంగా స్నేహం పాడవుతుంది. స్వార్థం మనలో కదిలినా, ఈర్ష్య ఇతరులలో కలిగినా పేరు సమాజంలో పాడవుతుంది. ఇలా ఎన్నో!

అలాగే కష్టపడి కొన్నిటిని పోగొట్టుకుంటాం. కాని అవి తిరిగి వస్తూనే ఉంటాయి. కలుపు తీస్తూనే ఉంటాము. అయినా వస్తూనే ఉంటుంది. ఇల్లు తుడుస్తూనే ఉంటాం.

దుమ్ము చేరుతూనే ఉంటుంది. స్నానం చేస్తూనే ఉంటాం. దేహానికి మురికి అంటుకుంటూనే ఉంటుంది. దురలవాట్లను పోగొట్టు కొంటూనే ఉంటాము. తిరిగి రాబట్టు కొంటూ కూడా ఉంటాము. బట్టలు ఉతికి మురికిని పోగొట్టుకొంటూ ఉంటాము. తిరిగి అవి మలిన పడుతూనే ఉంటాయి.

ఇవన్నీ ఇలా జరగటానికి ఏవేవో కారణాలుగా అందరికీ అగుపిస్తాయి. వీటిలో చాలామటుకు స్వయంకృత అపరాధాలే అనే సత్యం అందరికీ కనిపించేది కాదు. ఈ సత్యాన్ని చూడగలిగితే బ్రతుకు మరో మలుపు తిరుగుతుంది.

కనిపించే వాటిని ఉన్నదున్నట్లు చూస్తూ పోయేవారికి బ్రతుకులో బాధలు, బరువులు తక్కువగా ఉంటాయి. తాము మనస్సులో సృష్టించుకున్న వాటిని చూస్తూ పోయేవారికి ఏ క్షణాన ఏదొచ్చి పడుతుందో చెప్పలేము. అలాంటివారి వలన వారికే కాదు, ప్రతిక్షణము చుట్టూ ఉన్నవారికి కూడా ప్రమాదం పొంచే ఉంటుంది.

జీవితాన్ని చూస్తూపోతే లాభముండదు. అధ్యయనం చేస్తూ పోవాలి. అనివార్యాలను అర్థం చేసుకొంటూ బ్రతుకు బాటలో సాగిపోవాలి. వాటిని అవరోధాలుగా భావించకూడదు.

ఉన్నవి అలాగే ఉండాలి అనుకుంటాం. అలా ఉంటే, సుఖముంటుందని భావిస్తాం. ఇది సాధ్యమేనా? ఆరోగ్యం ఉండదు. ధనం మిగలదు. ఇంతెందుకు? తలపై వెంట్రుకలు నిలువవు. నోటిలో దంతాలు మిగలవు.

ఉన్నవి కొన్ని పోవాలని కూడా అనుకుంటాం. ఇది కూడా సాధ్యం కాదని జీవితంలో నేర్చుకుంటాం. పోగొట్టుకోవాలనుకున్నా కొందరికి పేదరికం పోదు. కొందరికి సోమరితనం పోదు. బొల్లి పోతుందా అని కొందరు. బోదకాలు పోదుకదా అని మరికొందరు.

ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు. పోవటానికి వచ్చినవి ఉండమన్నా ఉండవు. వీటి మధ్య ఆనందంగా ఉండటం నేర్చుకోవాలి. ఇది చర్చలతో తేలేది కాదు. చర్యలలో తేలవలసిందే.

ప్రయత్నిద్దాం. ప్రారంభిద్దాం. జీవనసత్యాలను ఆకళింపు చేసుకుంటూ ముందుకు సాగిపోదాం. జీవితము ఎవరి దయినా మహా ప్రస్థానమే. వచ్చే వాటితో, తోడొచ్చే వాటితో కలిసి నడక సాగించటమే ఏకైక మార్గం. దారిలో జారిపోయే వాటిని, మారిపోయే వాటిని, పారిపోయేవాటిని, రాలిపోయేవాటిని పట్టించుకోకుండా, వాటిని జీవనసత్యాలుగా గుర్తించి, గ్రహించి మన మార్గంలో పట్టు విడవకుండా సాగిపోవటం నేర్చుకోవాలి. ఆ నేర్పే జీవితానికి తీర్పు.

సమజీవనం

నేడు ఎక్కడ చూసినా సేవాసంస్థలు, అభ్యుదయ సమాజాలు, జాగరణ సదస్సులు "సేవ - సేవ" అని కేకలేస్తూ అలసిపోతున్నాయి. ఇవన్నీ కాలక్షేపం కబుర్లేగాని కాంతి నిలయాలు కావని తేలిపోయింది.

తన సుఖం, తన గౌరవం, తన స్వార్థం - ఇవే ప్రధానంగా గల వ్యక్తులు ఒక చోట సదస్సుల పేరుతో గుమిగూడినా అక్కడ ఉండేది వ్యక్తేగాని వ్యక్తుల సమూహము కాదు.

ఎవరి ఆలోచన వారి సుఖం కొరకే పరిమిత మైనపుడు, ఎందరు కలిసి ఆలోచించినా అది ఏ ఒక్కరికో, లేదా కొందరికో ఉపయోగపడుతుందేమో గాని అందరికీ ఉపకరించదు. అన్ని కాలాలకు సరిపడదు.

'సర్వేజనాః సుఖినో భవన్తు' సర్వజనులకు సుఖము ప్రాప్తించుగాక! అని ప్రతి రోజు దీపారాధన చేసి ప్రార్థించిన ఋషుల బిడ్డలం మనం.

ఎత్తైన కొండలకు, లోతైన నదీజలాలకు మధ్య ఒక వృక్షఛాయలో కూర్చొని, తన నాశ్రయించిన ముముక్షువులతో "కనిపించే ఈ దృశ్యమాన ప్రపంచము సత్యమా?" అనే జటిలమైన ప్రశ్నను లేవనెత్తి చర్చించిన మహితాత్ముల ముని మనుమలం మనం.

అదంతా మనం మరచిపోయాం. అవసరం లేని ఆలోచనల్ని కదిలించటం అలవరచుకున్నాం. మన రక్తంలో లేని కొన్ని లక్షణాలను కష్టపడి తయారు చేసుకుంటున్నాం. కులాలు, జాతులు అనే వాటిని విపరీత ధోరణిలో తగిలించుకున్నాం. పరస్పర వైరుధ్యాలకు సిద్ధపడుతున్నాం. వాటివల్ల అనర్థాలు ప్రాప్తిస్తున్నా అర్థం చేసుకోలేక పోతున్నాం. ఇదొక అంటుజాడ్యంలా తయారైంది.

నిజానికి సుఖపడటం మన చేతిలో లేకుండాపోయింది. ఎందుకో తెలుసా! అసలు సుఖమేమిటో, అది ఎక్కడుందో మనకు తెలియకుండా పోయింది.

అసత్యాన్ని సత్యంగా, సత్యాన్ని అసత్యంగా భావించడానికి మించిన ప్రమాదం మానవాళికి మరొకటుండదు. ఈ ఊబిలో మన మున్నామా? లేదా? అని ఆలోచించుకోవాలి.

ఈ ప్రపంచంలో అందరము అందరితో ముడిపడి ఉన్నాం. మన సుఖమే మనకు ముఖ్యమని ఈ దశలో అనిపించినా, మన సుఖం మరొకరికి బాధను కలిగిస్తే మనం సుఖపడలేము అనే కఠిన సత్యాన్ని మనం నిరాకరించలేము. మనిషికి వ్యక్తిగతమైన ఆసక్తే ముఖ్యం కాదు అని తెలుసుకోవడానికి కొంత జ్ఞానము కలుగవలసి ఉంది.

మనమెవరో, ఈ ప్రపంచంతో మన సంబంధం ఎలాంటిదో, మనందరిలో నిగూఢంగా ఏ సత్యముందో మనకు తెలిసిరానంతవరకు జీవితం అస్తవ్యస్తంగానే ఉంటుంది. శబ్దంకన్నా వేగంగా మనిషి చరిస్తున్నాడు. అంతరిక్షాన్ని జయిస్తున్నాడు. కాని, ఎందుకనో తన అంతఃకరణమును అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు.

మనుషులు మరిగిపోతున్నారు. మనసులు నలిగిపోతున్నాయి. హృదయాలు పగిలిపోతున్నాయి. క్రోధాలు బుసలుకొడుతున్నాయి. ఈర్ష్యలు విజృంభిస్తున్నాయి. అందరమూ కోరికలకు బానిసలమే. స్వార్థానికి దాసులమే.

ఈ ధోరణులకు ఇక తెరపడాలి.

అందరము అందరి కొరకు ఉన్నామనే సందేశాన్ని మనందరము అర్థం చేసుకోవాలి. అప్పుడే బుద్ధులు వికసిస్తాయి. బ్రతుకులు శోభిస్తాయి.

మనసులు కలవకుండా చేతులు కలిస్తే ఒరిగేదేమీ ఉండదు. ధనాన్ని స్మరిస్తూ జనాన్ని విస్మరిస్తే మిగిలేది ఏదీ ఉండదు. ఏకత్వానుభూతిలోనే జీవన మాధుర్యం నిండి ఉంది.

కోను నస్యాత్ ఉపాయోత్ర యే నాహం సర్వదేహినామ్
అంతఃప్రవిశ్య సతతమ్ భావేయం దుఃఖ భావభాక్ ॥

"ప్రతి ఒక్కరి హృదయంలో ప్రవేశించి, వారి దుఃఖాన్ని నాదిగా చేసుకొని, ఆ అనుభూతిని పొందేమార్గమేదైనా ఉందా?" అని మహాత్ముడైన రంతిదేవుడు పరితపించాడు భాగవతంలో.

ఇలాంటి ఎన్నో హృద్యమైన భావనల ప్రేరణతో జీవించిన ఉత్తమ యోగుల, జ్ఞానుల సంతానం మనం.

వారి రక్తం మనలో ఉంది.

వారి స్పందన మనలో ఉంది.

వారి త్యాగం మనలో ఉంది.

వారి జ్ఞానం మనలో ఉంది.

జ్ఞాన స్ఫూర్తితో, క్రియాశీలతతో జీవించినపుడే సమజీవనాన్ని సమాజంలో మనం ఆవిష్కరించగలం.

చాలు అనేదే మేలు

దుర్గుణాలు అస్తమించాలి, సుగుణాలు ఉదయించాలి; అనేది నా సందేశం కాదు. దురవగాహనలు అస్తమించాలి, అవగాహనలు ఉదయించాలి అనేదే మా ఆదర్శం. ఆర్ష సంస్కృతీ వనసీమలో విరబూసిన జ్ఞాన కుసుమం వెదజల్లిన సందేశ సౌరభం.

అవగాహన చిగురించని మనస్సులలో సుగుణాలు నాటినా నిలువవు. జారిపోతాయి. దూరంగా పారిపోతాయి. దుర్గుణాలను తరిమినా వెన్నంటే నిలుస్తాయి. తెలియకుండా మనలో చేరిపోతాయి.

ఇది సందేశాలకు సమయం కాదు. సదవగాహనకు తరుణం. ధర్మజీవనానికి ఆవేశంతో పరుగులిడటం కాదు; అధర్మంగా చరిస్తే వాటిల్లే నష్టమేమిటో, కష్టమెవరికో సంయమనంతో అర్థం చేసుకుని బుద్ధికి పట్టించాల్సిన సమయం. ఇది జరిగితేనే అంతరించాల్సినవి అస్తమిస్తాయి, ఊరేగవలసినవి చెప్పకుండా ఉదయిస్తాయి. ఉద్యమిస్తాయి.

1. అర్థం కాని దానిని, అవసరం లేని దానిని ఆచరింప పనిలేదు. అర్థం చేసుకోవడంలోనే ఆచరణ యాభై శాతం తెలియకుండా జరిగిపోతుంది.

2. వట్టి చేతులతో ఈ ప్రపంచంలోకి మనం వచ్చి ఉండొచ్చు. ఏదీ తీసుకురాకుండా మనం రాలేదు. ఇక్కడ పెంచుకోవలసిన దానిని నాటుకొనే వచ్చాం. తెచ్చుకున్నది ఇచ్చుకొనేందుకు వచ్చాం. మనది ఇచ్చుకొనే ప్రకృతే గాని పుచ్చుకొనే వికృతి కాదు. వదిలించుకుంటే తేలికపడతాం; తగిలించుకుంటే బరువెక్కుతాం.

3. సేవ చేసేది పరులకోసం కాదు; మన కోసమే. ఈ సత్యం అర్థం కానంత వరకు సేవకు రూపం రాదు.

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి

ఏ సేవలోనైనా ఉండేది స్వార్థమే. నిస్వార్థ మనేది బంగారు పిచుక. ఇది తెలిసి సేవ చేసిననాడే పరమార్థం పల్లకి నెక్కుతుంది. నిస్వార్థమనే పదానికి నిజ నిర్వచనం కుదురుతుంది.

4. బ్రతుకు నవ్వులాట కాదు. నవ్వుతూ ఆడే ఆట. బ్రతుకులో నవ్వులేనివాడు నగుబాట్లకు గురి అవుతాడు. నవ్వులేని క్షణం మరణం. నవ్వుతూ బ్రతికే క్షణమే జీవనం. భావ కరువులో బుద్ధి బరువెక్కుతుంది. బరువులు, భారాలు నవ్వుల్ని దూరం

చేస్తాయి. ప్రతిక్షణము భావస్పందనతో జీవిస్తూ ఉండాలి. మంచి మంచి ఆలోచనలతో మనస్సులు గుబాళిస్తూ ఉండాలి. ప్రేమ మాలలు బుద్ధిలో వ్రేలాడుతూ ఉండాలి.

5. కర్కశాలు, కాఠిన్యాలు లేనివి కానవసరం లేదు. అవి మనకు తెలియకపోతే చాలు. తేలికపడి ఉంటాం. హాయిగా తేలిపోతూ ఉంటాం.

6. మార్పు బాధాకరం. మనుషుల్ని మార్చే ప్రయత్నంలో మనసుల్ని పిండుకోవటంవల్ల నిండుతనం రాదు. ఇది ఎండేందుకే గాని నిండేందుకు కాదు. నింపేందుకు కాదు. మార్చాలనుకొనేవారు సాధారణంగా ఓటమినే చవిచూస్తారు. ఈ విషయంలో గొప్పగా అపజయాన్ని పొందిన వారెవరో తెలుసా? భగవాన్ శ్రీకృష్ణుడే. దుర్యోధనుని మార్చాలని ప్రయత్నించి ఏమి సాధించాడో ఆయనకే తెలియాలి. కాని, మార్చలేకపోయానని బహిరంగంగా అంగీకరించటమే శ్రీకృష్ణుని అద్భుత విజయం.

ఎవరూ ఎవర్నీ మార్చాల్సిన అవసరం లేదు ఈ ప్రపంచంలో. జ్ఞానంతో, ప్రేమతో జీవించగలిగితే చాలు. కల్పవృక్షము క్రింద చేసే ప్రతిసంకల్పం ఫలించినట్లు, ఆశ్రితుల బ్రతుకులు అమృతమయ మవుతాయి.

7. నీవు కుటుంబంలో ఉండినా, సమాజంలో ఊరేగినా, ఉద్యోగాలలో వసించినా ఆశ్రమాలలో నివసించినా - ఎక్కడున్నావనేది విశేషం కాదు. ఎలా ఉన్నావనేది విషయం. నీవు ఎక్కడున్నా నష్టం లేదు. కాని, ఉన్నచోట తేలిగ్గా ఉండగలిగితేనే లాభం. ఇతరుల బరువులు, భారాలు మోయాలని ఉబలాటపడేవారు తమ మనస్సుల్ని తేలిక పరచుకోవాలి. గుండె బరువుతో భారాలు మోయాలనుకోవటం సుసాధ్యం కాదు.

8. అవసరాలకు మించిన ఆస్తులు ఆంతర్యంలో ఒత్తిళ్ళను పెంచుతాయి. గందరగోళాన్ని సృష్టిస్తాయి. తూర్పులో పడమరను చూపిస్తాయి. ఆశలన్నీ చెడ్డవి కావు. పేరాశ లేవైనా మంచివి కావు.

చాలు అనేది చిన్న పదం కాదు. ఆ ఒక్కమాట పలకటానికి యుగాలు జీవించినా మనిషికి శక్తి రావటం లేదు. నిష్ఠ కుదరటం లేదు.

చాలు అని సంతృప్తి చెందే క్షణం మనతో స్నేహం చేయాలని, చేస్తుందని ఆశిస్తాం. అలా ఆశీర్వదించమని అచ్యుతుని ప్రార్థిస్తాం.

గుర్తింపులు - గౌరవాలు

కర్మాధీనంలో పడి కాలం వెళ్ళబుచ్చుతున్న నిస్సహాయులం మనం. చేసుకున్నవి ఏ క్షణాన చేతుల్ని కాల్చుతాయో, చిత్తాన్ని పేల్చుతాయో అర్థంగాని అమాయకులం మనం. దారిద్ర్యంతో అలమటించే కొంపను దయ్యాలు కూడా ఆవరించినట్లు, కర్మ ఫలితాల చేతిలో కీలుబొమ్మలై అల్లాడే మనం, లేని కష్టాల్ని కోరి తెచ్చుకోనేందుకు ఉద్యమిస్తే ఆ తరువాత బ్రతుకు బయటపడుటకు వీలుపడని ఊబిగా మారిపోతుంది.

ఆరని ఆరాటం

తమ ప్రతిభను పదిమంది గుర్తించాలని, గౌరవించాలని చాలామంది ఆరాట పడుతూ వుంటారు. ఈ ఆరాటం ఆధ్యాత్మిక సాధకుల్ని కూడా పెనవేసుకొంటే ఆ తరువాత రోదనే సాధన అవుతుంది.

తనను పదిమంది గుర్తించి గౌరవించాలని ధనికులు చాలామంది అవసరం లేని చాలా వస్తువుల్ని కొంటూ ఉంటారు. విలువైన దుస్తులు, కార్లు, బంగళాలు, అలంకరణలు - ఓహ్, ఎన్నని?

ఎదురైన ప్రతి ఒక్కరిని పలకరించి, మాటకలిపి, మలుపుత్రిప్పి తాను వ్రాసిన కవితల్ని ఉత్సాహంగా వినిపిస్తూ ఉంటాడు కవి. వినేవారికి ఉత్సాహముందో లేదో, సమయముందో లేదో కూడా పట్టించుకోడు. తాను పడిన శ్రమనంతా శ్రమించి వివరిస్తాడు. ఈ పరిశ్రమ అంతా గుర్తింపుకు ఆర్భాటమే. గౌరవానికి ఆరాటమే.

కొందరికి పాడాలని ఉంటుంది. తమ గానం అందరూ వినాలి. సంగీతం ఇష్టమున్న వాళ్ళే వినగలరు. అందరూ ఎలా వింటారు? మరొకటి వినండి, మరొకటి, మరొకటి అంటూ జ్వరపీడితునికి గారెలు వడ్డించినట్లు ఇష్టం లేనివారికి తమ గానాన్ని వినిపిస్తూ ఉంటారు. ఇక ఉపన్యాసాల విషయం ఉండనే ఉంది. ఇటీవల అది కామెర్ల వ్యాధిలా పరిణమించింది. ఇదంతా అర్థరహితమైన ఆరాటం.

తీరని పోరాటం

ఆరాటానికి తోడుగా పోరాటం కూడా చేరితే బ్రతుకు ఇరకాటంలో పడుతుంది. నీలో ప్రతిభ లేదని నే ననడంలేదు. ఉండొచ్చు. అంతమాత్రాన ఇతరులు నిన్నెందుకు గౌరవించాలి? మనలోని ప్రతిభ మరొకరికి నచ్చనిది కావచ్చు. అలాంటప్పుడు మన ప్రతిభ విషయంలో వారికి గౌరవ మెందుకుంటుంది? విషయం మీద గౌరవం లేనపుడు వ్యక్తిమీద గౌరవం ఎలా వస్తుంది?

విలువ తెలిసినవారే విలువ కట్టగలరు. కనుక గుర్తిస్తారు. గౌరవిస్తారు. ఒకవేళ తెలిసినా మరికొన్ని వ్యక్తిగత కారణాల వల్ల గుర్తించకపోవచ్చు. గౌరవించక పోవచ్చు.

అదికూడా గాక, మనం ఎవరినుండి గౌరవాన్ని అభిలషిస్తున్నామో అతడు కూడా గౌరవాలను ప్రోది చేసుకొనే స్వభావం కలవాడైతే ఏం చేయగలం? యాచకుడికి శత్రువు ఎవరో ఎందుకుంటారు?

నన్ను అందరూ గుర్తించి గౌరవించాలనే పోరాట పటిమ చాలా విస్తృతంగా కూడా పయనిస్తుంది. కొందరు గౌరవాల్ని ఆశిస్తారు. పొందుతారు. అంతటితో తృప్తి చెందరు. వాళ్ళని గౌరవించడంతో సరిపెట్టుకోరు. మరి కొందరిని గౌరవించకూడదు అనే నియమాన్ని కూడా పెట్టుకొని ఉంటారు. ఇంకా కొందరైతే తమకు నచ్చని వాళ్లను ఇతరులు గౌరవించక పోవటమే గాక తమ ముందు వారిని అగౌరవంగా మాట్లాడితే వినాలని ఉబలాటపడుతూ ఉంటారు. ఆ విధమైన ప్రస్తావనకు తామే మెల్లగా శ్రీకారం చుడుతారు కూడాను. ఒకరిని అగౌరవంగా చూచే సంస్కారమున్నవాడు నిన్ను గౌరవిస్తాడని భావించడం భ్రమే అవుతుంది.

సడలని సందేహం

నాలోని ప్రతిభను ఎందుకు గుర్తించరు? నా గొప్పతనాన్ని ఎందుకు గౌరవించరు? నేను పడిన శ్రమంతా వృథా కావలసిందేనా? ఇలాంటి సందేహాలు, గౌరవాలు ఆశించేవారి బుద్ధిని, గబ్బిలములు దూలాన్ని పట్టుకొని వ్రేలాడినట్లు, వ్రేలాడుతూ ఉంటాయి.

నీవు శ్రమించడం వల్లనే నీకు ప్రతిభ సంక్రమించింది. దానిని గుర్తించి గౌరవించే శ్రమను ఇతరు లెందుకు తీసుకోవాలి? నీవు ఆశించినట్లు ప్రవర్తించడానికి వాళ్ళవద్ద ఉండేది నీ మనసు కాదు అనే సత్యం కూడా నీవు గుర్తించకపోతే ఎలా? గౌరవాన్ని ఆశించడం తప్పని నేననడం లేదు. అందకపోతే ఆవేదన చెందడంలో అర్థం లేదంటున్నాను. ఆశించడంలో బాధలేదు. అదొక హక్కుగా భావిస్తే ఎదురయ్యేవి చిక్కులే అంటున్నాను.

సహజమే సౌందర్యం

గౌరవించడం అనేది సహజ లక్షణంగా భాసించాలే గాని నటనా చాతుర్యంగా శోభించకూడదు. గురువు రాగానే లేచి నిలబడతాము. అది సహజం. రాజకీయ నాయకుణ్ణి చూచి కూడా లేచి నిలబడతారు. ఇది నటన. గురువు సదా గౌరవించ బడుతాడు. కారణం, అతడు అందరూ గౌరవించే స్థాయికి సహజంగా ఎదిగాడు. రాజకీయనాయకుడు సదా గౌరవింపబడడు. కారణం, అతని గౌరవం పదవి వల్ల సంక్రమించింది. పదవి పోగానే గౌరవమూ పోతుంది.

సహజంగా ప్రాప్తించే గౌరవాలు సామరస్యంతో .ఉంటాయి. సౌజన్యంతో శోభిస్తాయి. అడిగి పుచ్చుకొనేవి సంఘర్షణల్ని సృష్టిస్తాయి. సమస్యల్ని పుట్టిస్తాయి.

వెలితే వైచిత్ర్యం

తన మీద తనకు గౌరవం లేనివాడే పరులనుండి గౌరవాన్ని ఆశిస్తాడు అనే సత్యాన్ని మనస్తత్త్వ శాస్త్రాన్ని ఆపోశనం పట్టినవారే గ్రహించగలరు. అడుక్కు తినే అవసరం, అలవాటు బిచ్చగాని సొత్తు. కోటీశ్వరుడికి ఆ విషయంలో ఉండదు పొత్తు. తనకు ఉన్నదని తెలిసినవాడు బిచ్చమెత్తలేడు. తన మీద తనకు గౌరవ మున్నవాడు ఇతరుల నుండి గౌరవాలను ఆశించడు. యాచించడు.

ఒక వ్యక్తి ఉపన్యసిస్తాడు. ప్రసంగం కాగానే తనను సమీపించిన వారిని, "ఎలా ఉంది?" అని ప్రశ్నిస్తాడు. అంతవరకు బాగుంది. మరి వారి నుండి ఎలాంటి సమాధానాన్ని ఊహించి ఇలా ప్రశ్నించాడు? "బాగుంది సార్" అని వాళ్ళు చెప్తారనే కదూ?

ఇక్కడ కాస్త లోతుగా ఆలోచించాలి. ప్రసంగ విషయం బాగా తెలిసేది వక్తకా? శ్రోతకా? వక్త చెప్పినదానిని శ్రోత కొంత విడిచిపెట్టొచ్చు గాని వక్త చెప్పనిదానిని శ్రోత ఎలా ఊహిస్తాడు? మరి, ఎలా ఉంది అని వక్త శ్రోతను అడగటంలో ఔచిత్యమేమిటి? చెప్పమంటారా? తన ప్రసంగం మీద తనకే విలువలేదు. ఇదీ వాస్తవం.

కాని, కొందరు గొప్ప వక్తలు తమ ప్రసంగంపై, తమలో గొప్ప విలువను గుర్తించిన వారు కూడా తరచుగా "ఎలా ఉంది?" అంటుంటారు. వీరి మనోగతం వేరే! శ్రోత ఎంతవరకు గ్రహించగలిగాడా? అనే పరిశోధనే గాని, తమ ప్రసంగంపై వెలితి ఉండికాదు; ఇతరుల నుండి గుర్తింపును, గౌరవాన్ని ఆశించీ కాదు.

గౌరవాన్ని ఆశించి అడిగేవారికి లభించే సమాధానం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వారు మాత్రం వెలితిలోనే ఉంటారు. తమ మీద తమకు నమ్మకం లేకనే ప్రశ్నించారు కనుక ఇతరులు బాగుందని చెప్పినా వీరు బాగుండరు. ఒకవేళ, కర్మం కాలి వారు బాగలేదని సెలవిచ్చారా? ఇక సరేసరి. పుండుపై కొత్తకారం చల్లినట్లే. ఇదంతా వాస్తవానికి అహంకార సందడి. అభిమాన అంగడి.

వైభవం వ్యక్తిగతం

ప్రతిభలు, వైభవాలు ఎవరివద్ద ఉన్నవో, అవి ముందుగా వారికి ఆనందాన్ని పంచాలి. తన పాటతో తానే తృప్తి చెందలేని గాయకుడు ఎవరిని తృప్తిపరచగలడు? నీలో విరబూయని ఆనందాన్ని పరుల ముందు ఆరబోసి సాధించే దేముంటుంది?

నీ వైభవంతో నీవు జీవించడములో ఆనందముంది గాని పరులు దానిని గుర్తించి గౌరవించడంలో లేదు.

సూర్యోదయం ఎలా ఉంది? ఆ సౌందర్యాన్ని నీవు ఆస్వాదిస్తున్నావు. ప్రకృతిలోని సౌందర్యాన్ని అవలోకించి ఆనందించే నీవు నీలోని సౌందర్యాన్ని ఎందుకు ఆనందంగా అనుభవించలేకపోతున్నావు?

నీ జీవన సౌందర్యానికి పరుల గుర్తింపు ఎందుకు? నీ పాటను నీవు వినలేవా? నీ గాన మాధుర్యాన్ని శ్లాఘించడానికి ఇతరు లెందుకు? నీ కవితలు నీకు రుచించవా?

మరి, పరుల మన్ననల అవసరమేమిటి? ఆత్మగౌరవం తప్పుకాకపోవచ్చు. ఆత్మస్తుతి మాత్రం దారుణం. ఈ జబ్బు అంటుకుంటే, ఒక రాగాన నయమయ్యేది కాదు.

పువ్వులు వికసిస్తాయి. తమలోని సహజ సౌందర్యాన్ని, సౌరభాన్ని వెదజల్లుతాయి. అంతేగాని, తుమ్మెదలు రావాలని, వాటికి విందు చేయాలని ఆలోచించవు. పువ్వులలోని సహజసౌందర్యానికి తుమ్మెదలే ఆకర్షింపబడి సమీపిస్తాయి. నీ జ్ఞానంపై, నీ వైభవంపై నీకు గౌరవం ఉండాలి. ఇతరులు గుర్తించినా, గుర్తించకపోయినా ఫరవాలేదు. దానివల్ల వచ్చేది ఉండదు. పోయేది లేదు.

కృతులు - కృతజ్ఞతలు

నీలో గొప్పతనం ఉంటే, నీ ద్వారా గొప్పకార్యాలు వెలుగుచూస్తే, వాటికి నీవు పరమాత్మకు ఋణపడి యున్నావు అనే సత్యం నీకు తెలిసివస్తే, మరుక్షణంలో ప్రపంచం నుండి గౌరవాలను ఆశించే మనస్సు మాయమై, కృతజ్ఞతతో, భక్తితో పరమాత్మను హృదిలో నిలుపుకొనే బుద్ధి సిద్ధమౌతుంది.

"నేను అందంగా ఉన్నాను; అందరూ నన్ను గుర్తించాలి" అనుకుంటావు. ఈ అందం నీకెక్కడిది? నీవు కోరితే వచ్చేటట్లయితే ఈ ప్రపంచంలో వికారులే కనిపించరు. పరమాత్మ నీకు అందాన్నిచ్చాడు. ఆ మహితాత్ముని మరచి ప్రపంచం గుర్తింపుకు దేవులాడుతున్నావు.

నీకు జ్ఞానం ఉండొచ్చు. నీ జ్ఞానం వెనుక ఎందరున్నారో ఆలోచించావా? నీకు తెలియనివి ఎందరు నేర్పించలేదు? నీ జ్ఞానసముపార్జనకు ఉపకరించే గ్రంథాలను ఎందరు రచించలేదు? తల్లిదండ్రులు మొదలు గురువుల వరకు, స్నేహితుల నుండి సమాజం వరకు ఎందరు సహకరిస్తే నీకు జ్ఞానమొచ్చిందో ఆలోచించావా?

ఏ చిన్న పని కూడా ఈ ప్రపంచంలో ఒక్క వ్యక్తి సాధించలేడు. నేనొక్కడినే కుళాయి నుండి నీళ్ళు పట్టుకున్నాను అని నీవు చెప్పవచ్చు. కాని, ఆ కుళాయిని తయారుచేసింది ఎవరు? ఇలా ఆలోచిస్తూ పోతే, మనలో ప్రస్తుతం వ్యక్తమయ్యే వైభవాలలో అందరి పాత్ర ఉంది. ముఖ్యంగా నీవు పరమాత్మ కృపాపాత్రుడవు కావడమే విశేషం. ఇది సత్యం.

ఇతరులనుండి గుర్తింపులు, గౌరవాలు ఆశించకుండా జీవిస్తాం. మనతో మనం తృప్తిపడి ఉంటాం. పొగడ్తలకు పొంగిపోకుండా బ్రతుకుదాం. విమర్శలకు కృంగిపోకుండా నవ్వుతూ జీవిస్తాం. అనుక్షణము పరమాత్మ వర్షింపచేసిన దయను స్మరిస్తూ సాగుదాం. ఎన్నోవిధాల మనకు సహకరించిన, సహకరిస్తున్న వారి విషయంలో కృతజ్ఞతతో ఉంటాము. మన సుఖానికి, శాంతికి ప్రపంచంపై ఆధారపడకుండా సంయమనంతో జీవిద్దాం.

ఇలా జీవించగలిగితే జీవితంలో ఊహించని పరిణామం వెలుగుచూస్తుంది. పెద్ద బరువును దించుకున్నంతగా తేలిక పడతాము. తృప్తి పడతాము. సంతృప్తిలో పడి ఉంటాము. ప్రయత్నించండి.

ఎదురీత

అనుకూల ప్రతికూల పరిస్థితుల పొట్లమే జీవితం. అయితే, అనుకూలత అనేది కేవలం నీకు సంబంధించిన విషయం. ప్రతికూలత అనేది కొన్ని సమయాలలో బాహ్య పరిస్థితుల నుండి, వ్యక్తుల నుండి కూడా వస్తుంది. అది ప్రతికూలం అని భావించక పోతే అనుకూల మవుతుంది. బ్రతుకుకు గుర్తింపు, గౌరవం రాకపోతే, లేకపోతే, నీవు హాయిగా జీవించలేవు. అవి నీకు వస్తే చూచి సహించే మంచితనం సమాజంలో కొందరికి ఉండదు. అలాంటివారు నీ ప్రగతిని నిరోధించుటకు కారకులవుతారు. విషమ పరిస్థితుల్ని సృష్టిస్తారు. ఇవన్నీ నీ యెదనుండి పుట్టినవి కాకపోయినా, ఎదుర్కోవలసిన వాడివి మాత్రం నీవే.

శకుని, మంథరలను సమాజం నుండి వెళ్ళగొట్టడం ఎవరి తరమూ కాదు. వాళ్ళు పెట్టే బాధల్ని ఎదుర్కోవడం, సహించడం రాముడికి తప్పలేదు. కృష్ణుడికి తప్పలేదు. అభ్యుదయ పంథాలో నడిచేవారికి అవరోధాలు తప్పవు. పండ్ల చెట్టుకే ఎందుకుండాలి రాళ్ళదెబ్బలు? అనేది అర్థరహితమైన ప్రశ్న.

రావణుడు పెట్టిన బాధల్ని రాముడు ఎదుర్కొన్నాడు. కౌరవులు పెట్టిన బాధల్ని పాండవులు భరించారు. అంతేకాదు. వారు సహించడం అలా ఉంచి, వారు బాధలనుండి నేర్చుకొనిన పాఠాలను భావితరాలకు బోధలుగా అందించారు. అది కనుక జరుగకుండా ఉంటే, నేడు అందరూ రావణులే, శిశుపాలురే ఉండేవారు.

అనుకోనివి జరుగుతాయి... ఈ ఒక్క సత్యాన్ని అంగీకరిస్తే జీవితంలో పెద్ద బరువును దించుకున్న వాళ్ళమవుతాము.

ఒక వ్యక్తిలో అకస్మాత్తుగ క్యాన్సరువ్యాధి భయంకర రూపంతో కన్పించింది. ఒక వ్యక్తి కారు ప్రమాదంలో చూపు కోల్పోయాడు. తుఫాను తాకిడికి ఒక యువకుడు మరణిస్తే, యౌవనవతి అయిన అతడి భార్య వైధవ్యంతో మిగిలిపోయింది. షేర్‌మార్కెట్ తారుమారు కావడం వలన ఉన్నదంతా జారిపోయింది. ఇవన్నీ ఇలా జరుగుతాయని వాళ్ళు అనుకున్నారా? పోనీ, జరిగిన తరువాత చేయగలిగింది ఏముంది?

మార్పు చేయలేని వాటిని, మనసు నుండి తుడిచిపెట్టలేని వాటిని మనస్ఫూర్తిగ అంగీకరించడం మనిషి అలవరచుకోవాలి. అవి అసంభవాలైతే ఎందుకు జరుగుతాయి? నాకు ఇష్టం లేనివి జరుగవచ్చు. కాని, జరుగకూడనివి మాత్రం జరుగవు. ఈ మాత్రం అర్థమైతే గుండెకైన గాయాలు నయమవుతాయి. బాధ ఉపశమిస్తుంది. ఆ తరువాత పరిష్కారాలను ప్రశాంతంగా ఆలోచించవచ్చు.

ఇదీ జీవితం. ఇలా జీవించాలి. ప్రగతి కాముకులందరూ ఇలాగే జీవించారు. నిరాశ చెందలేదు. నిస్సహాయతను ప్రక్కన ఉంచుకోలేదు. పరిస్థితుల్ని ఆచితూచి అర్థం చేసుకొంటూ, ప్రతిచర్యలు లేకుండా ప్రశాంతంగా జీవించారు. వంచన ముందు మంచి కుంచుకపోదని దృఢంగా విశ్వసించి మరీ జీవించారు. 'రాహు' కాలం ఎప్పుడూ

ఉండదు. 'మంచి' కాలం వస్తుంది. కొద్దిపాటి రాహుకాలం పోతే మిగిలిందంతా మంచి కాలమే.

ఇది ఓదార్పు కాదు. ఓర్పు కాదు. నిజనిర్ణయాల తీర్పు. బాహ్య మార్పులకు ఆంతర్యంలో జరుగవలసిన చేర్పులు.

చెడిపోయినవారు నిన్ను చెడిపేందుకే ఉన్నారు. బాగుపడే దెలాగో నీవే శ్రమించి అర్థం చేసుకోవాలి. పరిస్థితులు వక్రించాయని ప్రవర్తనను వక్రింపచేసుకోకూడదు. అధర్మంతో రాజీ పడకూడదు. ఇది జరిగితే రాహుకాలం రాలిపోతుంది. కేతుకాలం కూలిపోతుంది. నీవు శాశ్వతంగా వెలిగిపోతావు.

చూడు నాయనా! అవరోధాలు లేకపోవడం అభివృద్ధి కాదు. అవరోధాల మధ్య జీవించడం అభివృద్ధి. అవగాహన కుదిరితే బ్రతుకు కుదుట పడుతుంది.

ఇదే నీవు చేయదగిన కృషి. ఆ తరువాత నిలిచేది భగవంతుని కృప. ఇతరులలో నీపై ఈర్ష్యాద్వేషా లున్నాయని నీకు తెలుసు. అవి ఏ మోతాదులో ఉన్నవో, వాటి ఫలితా లెలా ఉంటాయో నీకు తెలుసా? నీకు తెలియనివి పరమాత్మకు తెలుస్తాయి.

తెలిసినవాడు తొలగిస్తాడు. ఆ తొలగించేవానిని తగిలించుకొని తిరిగితే సరిపోతుంది. ఆ తరువాత జాతకమే తిరిగిపోతుంది. నీచుల్ని పట్టించుకోకు. నామాన్ని పట్టించుకో. అలలు ఉంటాయి. నామనౌకలో నీవు క్షేమంగా ఉంటావు. అంతఃకరణ కలుషితం కాకుండా ఉంటుంది.

అనుకోనివి జరుగుతాయి అని ముందే నిర్ణయించుకో. జరిగే వాటినుండి జారిపోవాలని ప్రయత్నించకు. అధర్మానికి దగ్గర గాకు. దైవానికి దూరంగా పోకు. అన్నిటినీ దైవబలంతో కాచుకో. కాని, యెద బాధలకు గురికాకుండా అవగాహనను పెంపొందించుకో. ఇలా ఆడుకో. కాని, ఓడిపోతే అపజయమని భావించకు. ఓడిపోవటంలో నీవు ఏదీ పోగొట్టుకోలేదు. ఓటమి ఎందుకు కలిగిందో తెలుసుకున్నావు. ఇక నిన్ను ఎవరు ఓడించగలరు? ఇక మీద గెలుపు నీదే.

ఈర్ష్యలు ఉండనీ. అసూయలు ఉండనీ. అవి ఎందుకున్నాయో తెలుసా? నిన్ను బాధించేందుకు కాదు. అవి నీలో ఉండకూడనివి అనే సత్యాన్ని ఎరుక పరచేందుకు. నీ జీవితంలో వెలుగుల తోరణాలను ఆవిష్కరించేందుకు.

అసూయలను ఆదరించ నవసరం లేదు.

ఈర్ష్యలకు ఆహ్వానం పలక నవసరం లేదు.

వాటి మార్గంలో వాటిని పయనించనీ. నీ మార్గాన్ని వీడకుండా నీవు సాగిపో. ఇది మహాప్రస్థానం. మార్గంలో అన్నీ కూలబడతాయి. గమ్యాన్ని నీవే చేరుతావు. అప్పుడు నీ ప్రక్కన విశ్వాసమొక్కటే ఉంటుంది. ధర్మమొక్కటే ఉంటుంది. అదే దైవం.

ధర్మమేవ జయతే

రాజమార్గం

మనలో బలహీనతలు ఉన్నాయి. రాగద్వేషాలు ఉన్నాయి. పరిమిత దృక్పథాలు ఉన్నాయి. సోమరితనాలు ఉన్నాయి. ఇవన్నీ మనవే కాని మరొకరివి కావు. అయితే, వీటిని వదిలించుకొనే కార్యక్రమం కూడా మన భుజాల మీద ఉన్నదే గాని మరొకరిపై లేదు.

వ్యాధి ఎవరి దేహంలో ఉందో, దాని నివారణకు వారే ప్రయత్నించాలి. వైద్యులు, ఇతరులు సహకరించవచ్చు. కాని, వ్యాధిని నివారించుకోవాలి అనే దృఢసంకల్పము, తత్సంబంధిత ప్రయత్నము రోగికే ఉండాలి. అప్పుడే రోగము అదృశ్యమవుతుంది.

తమలో బలహీనతలు, పరిమితాలు ఉన్నట్లు కూడా కొందరు గుర్తించరు. వాటిని గుర్తింప చేయటానికే ప్రవచనాలు, ప్రసంగాలు, పుస్తకాలు. గుర్తించిన తరువాత వారిలో శక్తిని నింపి, బలహీనతలను దూరం చేసి, జ్ఞానబలంతో శోభింప చేసేందుకే సాధనలు, జపధ్యానాదులు. వీటన్నిటిని సమకూర్చి, బ్రతుకును సమం చేసేందుకే ఆర్ష సంస్కృతిలో అనాదిగా ఆచార్యులు బోధలు అందిస్తూ ఉన్నారు.

ఇటీవల కాలంలో భక్తి పేరిట హైందవ సమాజంలో తలెత్తుతున్న ధోరణులు, వెర్రితలలు వేస్తున్న ఆరాధనలను చూస్తుంటే, పరమతాల ప్రభావం, అవగాహన, మనలో మనకు తెలియకుండా దిగిపోతున్నవేమో అనే భయాలు కలుగుతున్నాయి. ఇది చాలా ప్రమాదకరమైన విషయం. ఇలా అనటంలో పరమత ద్వేషం ఉందని ఎవరు భావించినా అది వారి సంకుచిత మనస్తత్వానికే అద్దం పడుతుంది.

సరోవరంలో చేపలు ఉంటాయి. సమాజంలో మహాత్ములు ఉంటారు. చేపల కారణంగా సరస్సు నిర్మలంగా ఉంటుంది. మహాత్ముల కారణంగా మహిలో మహిమ శోభిస్తుంది. ఇదంతా వాస్తవమే. కాని, గతంలో జీవించిన లేక నేడు జీవిస్తున్న మహాత్ములను వారాని కొక్కరోజో, లేదా రోజుకు కొన్ని నిముషాలో స్మరించుకొంటే, మన కష్టాలు పోతాయని, మనకు నష్టాలు రాకుండా ఉంటాయని విశ్వసించటం, ఇవి ఇతరులు విశ్వసించేలా ప్రచారం చేయటం, మందిర నిర్మాణాలు, ఆర్భాటపు అర్చనాదులు చేయటం, చేయించటం - తాత్కాలికంగా కొందరికి స్ఫూర్తిని కల్గించవచ్చు నేమోగాని జీవితంలో మాత్రం దీప్తిని దించవు.

ఈశ్వర జ్ఞానం లేకుండా సుఖపడట మనేది ఎండమావిలో దాహం తీర్చుకొనే ప్రయత్నం లాంటిదే. ఎవరో ఏదో చేస్తారని ఎదురుచూస్తూ కూర్చొనే వారికి యెదలు బరువెక్కుతాయే గాని మతులు స్థిరపడవు.

భగవంతునితో నీ సంబంధం భవిష్యత్తులో ఎప్పుడో ఎక్కడో గుర్తింపబడేది కాదు. ఈ క్షణాన కూడా నీవు భగవంతునితో సంబంధాన్ని కలిగియున్నావు. ఇది జ్ఞానం. ఈ

జ్ఞానం కలగాలి. గురువులు కలిగించాలి. కాని, అట్టి జ్ఞాన సముపార్జనకు మనం సిద్ధం కావాలి.

కల్పిత భావాలకు, పరిమిత దృక్పథాలకు ముగింపు పలకాలి. జ్ఞానంలేని గురువును ఆరాధిస్తే నష్టం లేదు. అనుసరిస్తే మాత్రం బ్రతుకులు అంటుకుపోతాయి. బలహీనతలలో, పరిమితాలలో ఈదులాడుతున్నంత వరకు ఈ సత్యం బోధపడదు.

జీవితంలో మనకు కావలసింది ఏమిటి? దాని స్వరూప స్వభావా లేమిటి? దానిని పొందే మార్గమేమిటి? ఇవన్నీ క్షుణ్ణంగా అర్థం కావాలి.

మన బలహీనత లేమిటి? పరిమితా లెలాఉన్నాయి? వీటిని ముఖ్యంగా గుర్తించాలి. స్పష్టంగా దర్శించాలి. ఈ అడ్డుగోడల్ని ఎవరు నిర్మించారు? మనమే. అయితే ఎవరు తొలగించుకోవాలి? మనమే.

గురువులు ఈ పనికి సహకరించాలి. మనం అనుసరిస్తున్న మార్గాలు ఈ పనిలో ముందుకు పోతున్నాయో లేవో పరిశీలనా దృక్పథంతో వీక్షించాలి. ఇది చాలా ముఖ్యం.

తెలియక చేతులు కాల్చుకుంటే, తెలిసి చికిత్స చేయించుకుంటున్నాం. తెలియక అజ్ఞాన మార్గాల్లో పరిభ్రమించి ఉండొచ్చు. తెలిసి జ్ఞాన రహదారుల్లో నడవటానికి నడుం బిగించాలి. అప్పుడే ప్రగతి. సద్గతి.

విశాల దృక్పథంతో ఒంటరిగా ఆలోచించండి. జీవితంపై సుస్పష్టమైన అవగాహనను ఏర్పరచుకోండి. బలహీనతలకు ముగింపు పలకండి. బలమైన మార్గాన్ని ఎన్నుకోండి. రాజీ పడకుండా జీవించేందుకు బుద్ధిని సిద్ధం చేయండి. ఎవరి ప్రగతి వారి ప్రయత్నం పైనే ఆధారపడి ఉంటుంది. ఇదే రాజమార్గం.

మనిషి గా పుట్టి చేసిన మంచి ఏమీ లేదు. నియమాలు లేవు. నిష్ఠలు లేవు. దానము లేదు; ధర్మమూ లేదు. పుణ్యం లేదు; పురుషార్థం లేదు. అయినా పరమాత్మ కరుణిస్తా డనే గొప్ప నమ్మకముంది. ఆ విశ్వాసంతోనే వేగంగా ఉద్ధరించమని ప్రార్థించడం జరుగుతున్నది. నారు పోసిన వాడు నీరు పోయడా - అనేది సామెతే అయినా, దీనిపై పూర్ణ విశ్వాస ముంచిన వారెందరో ఈ సత్యాన్ని అనుభవంలో దర్శించారు.

చేదు నిజాలు

సేవ చేయడం మానవ కర్తవ్యం. సేవ అనేది మనిషిని ఉన్నతునిగా మార్చాలి. ఉదారునిగా మార్చాలి. ఉజ్జ్వలంగా మార్చాలి. అది జరుగని నాడు సేవలు స్వార్థానికి ప్రతిబింబాలు. అహంకారానికి ప్రతిరూపాలు.

మహిమను దర్శించాలనే తపనతో మహిలో మతాలు ఉద్భవించాయి. వచ్చిన పనిని విస్మరించాయి. తోటి మానవులకు సహాయం చేయడమే ప్రధాన విషయంగా భావించి, రోజు రోజుకీ దిగజారిపోతున్నాయి. సేవాసంస్థల లాగా మారిపోయాయి. మత ధర్మాలకు నీళ్ళొదిలాయి.

ఆత్మను విస్మరించాయి. అన్నమునే స్మరిస్తున్నాయి. అన్నము అందకుంటే నోరు ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. "దేహానికి కాకుంటే ఎవరి కొస్తాయి జబ్బులు" అని మందులు పంచుతున్నాయి. ఈ విధంగా దేహ స్థాయిలో ఆలోచించడమే మత ధర్మమయితే, మానవాళికి ఆ మతము యొక్క ఆవశ్యకత ఏమిటి?

మనిషి ఉన్నాడు కనుక ఆవశ్యకత ఉంది అంటారా? ఆ మనిషి మాత్రం ఎందుకు? దేహ స్థాయిలో జీవించడమే ముఖ్య మనిపిస్తే, ఈ బాధంతా ఎందుకు? వెనుదిరిగి మృగంగానో, పక్షిగానో మిగిలిపోతే సరిపోతుంది కదూ?

సేవ చేయడం తప్పని నా ఉద్దేశ్యం కాదు. మతాలు సేవాకార్యక్రమాలకే పరిమితం కావడం దురదృష్టం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఈ మార్గానుయాయు లందరూ భవిష్యత్తులో, అంటే ఈ జన్మలో గాని, మరో జన్మలో గాని తప్పక భౌతిక వాదాన్ని పెనవేసుకొని నాస్తికు లవుతారు. బౌద్ధ మతాన్ని నాస్తిక దర్శనంగా గుర్తించడానికి కూడా కారణం ఇదే.

భౌతికావసరాలు మాత్రమే ముఖ్యంగా భావించేదేదో అదే భౌతిక వాదము. భౌతిక వాదము మనిషికి తృప్తి నివ్వలేదని నిర్ణయించి తాత్త్విక భావాలతో ముందుకొచ్చిన మతాలు, తమ తాత్త్విక చింతనకు తిలోదకా లిచ్చి సంఘసేవ అంటూ భౌతిక వలయంలో పరిభ్రమించడము అంటే మతాన్నుండి వెనుదిరిగి మళ్ళీ మొదటి కెళ్ళినట్లు కాదా!

నిర్మలంగా, నిస్తరంగంగా ఉండే కొలనులో తన ప్రతిబింబమును దర్శించాలని గట్టుపైకి చేరినవాడు, కాలు ఆడించే, చేయి జాడించే అలవాటుకు తాళం వేస్తూ గట్టున ఉన్న రాతి బండను కొలనులోకి తోసి, అలల మధ్య తన బొమ్మ స్పష్టంగా కనిపించడం లేదని విలపిస్తే ఎవరు మాత్రం ఏం చేయగలరు?

బుద్ధుడు పండ్రెండు సంవత్సరాలు తపస్సు చేసి లోకంలో తిరిగి అడుగు పెట్టింది సమాజ అభ్యుదయానికా? వ్యక్తి నిశ్శ్రేయసకా? సమాజోద్ధరణకే అయితే తపస్సు కొరకు వెచ్చించిన కాలమంతా వృథా అయినట్లు కాదా!

సత్యదర్శనం చేసి తిరిగి వచ్చిన మహాత్ముణ్ణి సంఘసేవకు ఉపయోగించుకొని సమాజం పోగొట్టుకున్న దేమిటో అవిద్యలో కూరుకుపోయినంత కాలం సమాజం అర్థం చేసుకోలేదు.

సేవలు ఎవరైనా అందించగలరు. జ్ఞానాన్ని అందరూ పంచలేరు. ఆహారం పెడితే పక్షీ తింటుంది; మనిషీ తింటాడు. జ్ఞానాన్ని మనిషి అందుకోగలడే గాని పశు పక్ష్యాదులు అందుకోలేవు. జ్ఞాన సముపార్జన చేయని నాడు మనిషి ఏ పక్షంలో చేరాలో ఆలోచించండి.

సేవల పేరుతో సమాజాన్ని జడంగా మార్చడం ధర్మం కాదు. సేవల పేరుతో చౌకబారు ప్రతిష్ఠలకు పోవడం సభ్యత అనిపించుకోదు. సేవలు..... సేవలు.....సేవలు. చేసేవాడు మానసిక రోగిగా మారుతుంటే, చేయించుకొనేవాడు శారీరకంగా రోగి అవుతున్నాడు. ఇదంతా చీకటి. సభ్యసమాజం "ఛీ" కొట్టవలసిన కటిక చీకటి.

Light must come. If a man feeds me everyday of my life, in the long run I shall lose the use of my hands. Spiritual death is the result of following each other like a flock of sheep.

"వెలుగు రావాలి. వెలుగు కావాలి. ఎవరైనా ప్రతి రోజూ నాకు ముద్ద కలిపి తినిపిస్తూపోతే, నా చేతులు భవిష్యత్తులో నాకు ఉపయోగపడకుండా పోతాయి. ఒకరి నొకరు గొర్రెదాటు లాగ అనుసరిస్తూపోతే దాని ఫలితం ఆధ్యాత్మిక మరణమే" అన్నారు స్వామి వివేకానంద.

వివేకానంద స్వామి సమాజానికి సేవ చేయలేదా? కానీ ఇలా ఎందుకు అంటున్నారు? దీనిని అర్థం చేసుకోమని పక్షికి చెప్పే ధైర్యం నాకు లేదు.

నిజాలు చేదుగా ఉన్నా మ్రింగిన వాడికే జ్ఞానారోగ్యము. అనితర సాధ్యమైన జ్ఞానావశ్యకతను మహాత్ములు బోధిస్తూ ఉంటే, వారేదో సమాజసేవకు విరోధులని భావించడం, భాషించడం విషజ్వరంతో మనసు నిలకడ లేని రోగి పలికే అసందర్భ ప్రలాపాలే అవుతాయి.

అజ్ఞాన చీకట్లు సమాజంలో అంతరించాలి. విజ్ఞాన వెలుగుల తోరణాలు ఆవిష్కరింపబడాలి. అర్థం చేసుకోండి. సమాజానికి నేడు కావలసింది "మంది" కాని, "మంద" కాదు.

మూడు దశాబ్దాలుగా నా సేవా జీవితంలో లెక్కకట్టలేని రీతిలో ఎందరినో చూశాను. ఆవేశాలతో అరుదెంచడం, నిరాశతో నిష్క్రమించడం. ఇలాంటి వారే ఎక్కువ శాతం కనిపిస్తున్నారు. ఉన్నవి కొన్ని తొలగించుకొని, లేనివి కొన్ని తగిలించుకున్నప్పుడే ఆధ్యాత్మిక సేవలో కొనసాగగలం. ఋజుత్వము, దృఢదీక్ష, అవగాహన, చిత్తశుద్ధి, పరమాత్మపై, గురువుపై అకుంఠితమైన విశ్వాసం, స్వీయభావాలను అర్పించే కార్యానికి స్వస్తి పలకడం - ఇలాంటివి అలవడని నాడు ఎంతటివాడైనా ఈ మార్గంలో ఎక్కువ కాలం స్థిరంగా నిలువలేడు.

అనేక బాధలను సహించినపుడే భూమి పంటను అందించ గలుగుతుంది. ఫలప్రదమైన ప్రగతిని సమాజానికి అందించాలని భావించేవా రందరూ భూదేవిలా సహనంతో బాధలను భరించాలి.

You must bear in mind that religion does not consist in talk, or doctrines or books, but in realization; it is not learning but being.

"మత మనేది ప్రవచనాలలో, సిద్ధాంతాలలో, పుస్తకాలలో లేదని, అది కేవలము అనుష్ఠానంలోనే ఉందని గుర్తుంచుకో. మత మనేది అభ్యసించేది కాదు; అనుభవించేది" అంటారు స్వామి వివేకానంద.

ఎవరికో ఏదో చేయడం ద్వారా మనకేదో ఒరుగుతుందని భావించి శ్రమించిన వారందరూ ఆధ్యాత్మికంగా తరిగిపోయారే గాని పెరగలేకపోయారు అనేది నూటికి నూరుపాళ్ళు సత్యం. ఆంతరంగిక ప్రశాంతతను, కల్తీలేని సంతృప్తిని అందించగలిగినప్పుడే "సేవ" అనే పదానికి పూర్ణత్వం.

సేవలో రమించే వ్యక్తిలో నిరాశ నిలువకూడదు. పేరాశ మిగలకూడదు. తనకంటూ ఆశలు ఉండకూడదు. అంతేకాదు. ఆధిక్యతలు ఆశించకూడదు. సమత్వమనేది అలవడని నాడు సేవలన్నీ సమరాలే.

అభిమాన మనేది ఆధ్యాత్మిక సేవామార్గంలో గొప్ప అవరోధంగా నిలుస్తుంది. ఇదంతా దేహాత్మభావం వల్ల జనించిన రోగమే. నమ్రతను, ఔదార్యాన్ని పెంచుకొంటే అభిమానం అంతరిస్తుంది. దేహం విషయంలోను, చిత్తవికారాల విషయంలోను ఉదాసీనంగా జీవించడం అలవరచుకోవాలి.

సకాలానికి ఆవుకు గడ్డి వేస్తాం. కుక్కకు అన్నం పెడతాం. అవి నివసించడానికి వసతిని కల్పిస్తాం. రోగాలొస్తే మందులు ఇప్పిస్తాం. చికిత్స చేయిస్తాం. దేహం విషయంలో కూడా ఈ విధమైన వైఖరిని పెంపొందించుకుంటే దేహాభిమానం దూరమౌతుంది. ఇవన్నీ దూరమైన నాడే మనం సేవకు దగ్గర కాగలం. మన్ననలు పొందాలని ఆశించే మనసులకు ముక్తి అనేది అనూహ్యమైన విషయం.

ఎన్నో జన్మలు గడిచాయి. మనవి అనుకున్న ఎన్నో దేహాలు మట్టిలో కలిశాయి. మమతలన్నీ మరుగై మతుల్ని తొలిచేశాయేగాని, మనల్ని యతులుగా మార్చలేకపోయాయి. గతించిన కాలం తిరిగిరాదు. వశించిన వయసు తిరిగి వికసించదు. ఈ ప్రపంచ గారడీలో ఎంతకాలం చరిస్తాం? ఈ సంసార ఎడారిలో మరెంతకాలం సంచరిస్తాం?

"ఈ ప్రపంచం అనిత్యం" అనే సత్యం వంటబట్టనంత వరకు వెంట నడిచేవి మంటలే. ఇదంతా అజ్ఞానపంకము. ఈ బురదను ఎలాగైనా కడిగేసుకోవాలి.

స్నానం చేసిన తరువాతే ఆలయ ప్రవేశం చేస్తాం. దైవదర్శనం చేస్తాం. మనో మాలిన్యాన్ని తొలగించుకోనిదే సాధనలో సాగలేము. సేవలో కొనసాగలేము. ఇదే నిత్య స్నానము.

స్నానం మనో మల త్యాగః

"మనస్సులోని మలినమును నిర్మూలించుకొనుటయే స్నానము" అని మహా భారతము. ఇదే మన తక్షణ కర్తవ్యం. పదండి పోదాం స్నానానికి.

జీవన సౌరభం

ఈ ప్రపంచంలో ఉండేవి ఉంటూ ఉంటాయి. పోయేవి పోతూ ఉంటాయి. వాటికి, మనము అనుభవించే సుఖదుఃఖాలకు సంబంధమే లేదు. ఉన్నప్పుడు సుఖాన్ని ఇవ్వలేనివి పోయినపుడు దుఃఖా న్నెలా ఇస్తాయి? పోయే స్వభావాన్ని కలిగినవి ఉన్నప్పుడు మాత్రం సుఖాన్నెలా పంచగలుగుతాయి?

సుఖదుఃఖాలనేవి రాగద్వేషాల మీద ఆధారపడి ఉంటాయి. మనకన్నా వేరుగా ఉండే వాటితోనే మనకు రాగద్వేషాలు. మనకన్నా వేరుగా లేనివాటిపై కోరిక జనించదు. కనుక రాగము ఉదయించదు. రాగము చెడితేనే ద్వేషము. రాగమే లేనపుడు ద్వేషము తాళం వాయించలేదు.

రాగము లేనిచోట కోరిక అంకురించదు. కోరిక లేనిచోట దోషముండదు. దోషము లేనిచోట పాపం మిగలదు. దోషాలు, పాపాలు లేనిచోట దుఃఖం కనిపించదు.

దుఃఖం అంతరించిన వారిలో శాంతము గోచరిస్తుంది. శాంతము గలవారికి సౌఖ్యము ఉంటుంది. సుఖించే వ్యక్తులున్న సమాజము అభ్యుదయంతో శోభిస్తుంది. కనుక సమాజ ప్రగతి వ్యక్తి సుగతిపై ఆధారపడి ఉంది. ఇదే భారతీయ జీవన స్రవంతిలో ముంజేతి కంకణంలా భాసించే తాత్త్విక అవగాహన.

ఓనాటి వైభవం నేడు క్షీణించిందని చాలామంది వాపోతున్నారు. ఇంకేముంది? అంతా క్షీణించి పోయింది అని కొందరు హర్షాతిశయంతో దంత ప్రదర్శన లిస్తున్నారు. వీరిరువురూ పడమరను చూస్తూ తూర్పును వర్ణించేవారే! నింగిని చూస్తూ నీటి లోతును అంచనా వేసేవారే.

గత వైభవం నేడు లేనంత మాత్రాన అది గతించిపోయింది అనడం వివేకం అనిపించుకోదు. అవివేకం అంటే బాగుండదని సంశయిస్తున్నాను. విదేశీ దుండగుల దండయాత్రలకి, స్వదేశీ గూండాలు సృష్టించిన గండాలకి భారతదేశం దెబ్బతిన్నంతగా మరొక దేశము గురికాలేదు. అయినా, ఈనాటికీ ఈ దేశానికి ఉన్న సుస్థిరత మరో దేశానికి లేదు అనేది నిర్వివాదాంశము.

మనం గతాన్ని స్తుతిస్తూ కూర్చుంటే లాభం లేదు. నేను గత వైభవాన్ని వర్ణించడంలో ఉజ్జ్వల భవిష్యత్తుకు పునాదిరాళ్ళు పరుస్తున్నానని మీరు గ్రహించాలి. మనది ఋషి సంస్కృతి. మనం ఋషి పుత్రులం. మన రక్తంలో వారి రక్తం ప్రవహిస్తోంది. మన నరాల్లో వారి సత్తువ వుంది. మన మదిలో చేవ ఉంది. మన హృదిలో లివ ఉంది. వీటన్నిటిని సంస్కృతి పరంగా మనం వినియోగించాలి. వితరణ చేయాలి.

ఇది జరిగిననాడు పూర్వ వైభవాన్ని నేడు దర్శించగలం. నేటి ప్రభావంతో రేపటికి రూపులు దిద్దగలం. గతంలో ఏది ఎందుకు జరిగిందో మనందరికీ తెలుసు. వాటికి సంబంధించిన పాటలు పాడుకొంటూ, ఆటలాడుకొంటూ ఉంటే చివరికి ఆట పాటలే మిగుల్తాయి. సమస్యలు చిరంజీవులై శోభిస్తాయి.

కీర్తించడంలోనే కీర్తి పెరుగుతుందని, స్ఫూర్తి కలుగుతుందని భావించడం సముచితం కాదు. కీర్తించడం మంచిదే. కానీ, జీవించడంలోనే కీర్తి పతాకం గగన విహారం చేస్తుంది. కనుక, మనమందరమూ కీర్తిస్తూ జీవిద్దాం. లేదా జీవిస్తూ కీర్తిస్తాం. ఇదే జీవన సౌరభం.

ఆర్జించడం, అనుభవించడం, ఆవేదన చెందడం, చివరికి అంతరించడం ఇదేనా జీవితం? ఇదే జీవితమైతే, ఆర్జనలు, అనుభవాలు, ఆవేదనలు లేకుండా ఇప్పుడే మరణిస్తే సరిపోతుంది కదా!

ఆలోచించండి. అమృతత్వాన్ని పొందేందుకు వచ్చింది ఈ జీవితం. దాన్ని సాధించడమే మన లక్ష్యం కావాలి. ఇదే సువర్ణబాట.

ఆత్మ ఉన్నదే. దానిని సాక్షాత్కరించుకోవలసిన అవసరం లేదు. మిథ్యా తెరలను తొలగించుకుంటే చాలు. చైతన్య ప్రవాహము వరదలా ఉరికి నిన్ను కాంతితో నింపేస్తుంది.

మనసును చూడు. కాని అందులో ఉండేది ప్రపంచమేనని మరచిపోకు. ప్రపంచాన్ని చూడు. కాని అది మనసు సృష్టించిందే అని తెలుసుకో.

చూడటం ఉన్నప్పుడే చూచేవాడు, చూడబడేది ఉన్నాయి. బాగా అర్థం చేసుకో. "నేను పువ్వును చూస్తున్నాను" ఇది వాక్యము. ఈ వాక్యము యొక్క తాత్పర్యము చూచుటలోనే ఉంది. చూచుటలో, "నేను-పువ్వు" ఆరోపించబడ్డాయి. చూచుట జరుగక ముందు, "నేను-పువ్వు" లేవు. చూడబడని పువ్వు, చూడని నేను చూచుటకు ముందు గోచరించలేదు.

మనస్సు వలన ప్రపంచం ఏర్పడిందా? లేదా, ప్రపంచం ఉండుట చేత మనస్సు తెలుసుకొంటూ ఉందా? ఏదీ కాదేమో! ప్రపంచం రూపమా? అయితే మనస్సు నామము. ఈ నామ రూపాలతోనే ప్రపంచం మనసులో ఉంది. లేదా, ప్రపంచంలో మనసుంది. నామరూపాలు మిథ్య అని తేలితే రెండూ లేవు. రెండూ లేని చోట ఒకటి ఉన్నట్లేనా? కాదు. రెండు కాని స్థితి ఉంది. అదే అద్వైతము. వాచారంభణ శ్రుతి వినిపించిన '**మృత్తికేత్యేవ సత్యమ్**'.

సంపూర్ణ మూర్తిమత్వం

అందమైనది ఏదైనా ఆనందదాయకమే. ఏది అందము? ఏది సౌందర్యము? పసిపాప.....పూలమొక్క......గలగల పారే సెలయేరు.....మబ్బుల్లో దోగాడే చందమామ, లేచిపడే సముద్రపు టలలు - ఇవన్నీ ఎలా ఉన్నాయి? అందంగా ఉన్నాయి.

ఇంకొక కోణం నుండి చూడండి. పోలియోకి గురైన పసిబిడ్డ......వాడిపోయిన మొక్క.......... ఎండిపోయిన సెలయేరు......... గ్రహణం పట్టిన చంద్రుడు......... తుఫాన్‌లో సముద్రం - ఇవి ఎలా ఉన్నాయి? భయంకరంగా ఉన్నాయి.

ఏది ఎలా ఉండాలో అలా ఉండకపోవడం వికారం. అలా ఉండడం ఆకారం. రాగద్వేషాలు అదృశ్యమైతే ఆకారమే అందం.

అవయవాల పొందిక దేహానికి అందం. చాలినంత ముక్కు లేకపోతే అందమైన ముఖం వికారంగా గోచరిస్తుంది. అవయవాల పొందికలో దేహ సౌందర్యం భాసించినట్లు, వాయిద్యముల పొందికలో సంగీతము సురుచిర స్థాయి నందుకుంటుంది. గొప్ప విద్వాంసు లెందరున్నా, కలిసి వాయించలేకపోతే అదంతా కాకివిందే. సంతగోలే.

మనిషి అందమైనవాడు. కానీ మనసు క్రూరంగా ఉంది. కాఠిన్యంతో కరుడుగట్టి ఉంది. అట్టి వ్యక్తి స్నేహాన్ని అభిలషించేవా రుండరు. అతనిలో అందం లోపించింది. మనిషి కేవలం మట్టిముద్దే అయితే ఏ బాధా లేదు. అతడు చలించే జీవి. చరించే జీవి. కనుక దేహము, మనస్సు కలిసే తాను. మనసును విస్మరించి దేహ సౌందర్యానికి విలువ నివ్వడం అంధత్వం. అలా ఇచ్చినవా రందరు గతంలో సుఖపడిన సన్నివేశాలు లేవు.

మనిషి వికాస దిశగా పయనించే కొద్దీ స్థూలంకన్నా సూక్ష్మమే అందాన్నిస్తుంది. మొక్కంతా ముళ్ళే అయినా గులాబీ మొక్కల్ని అందరూ పెంచుకుంటారు. గుబాళించే పుష్పాలకు నిలయం కావడమే కారణం. అష్టావక్ర మహర్షిని అందరూ ఆరాధించేవారు. జ్ఞాన సౌరభం విరజిమ్మ బడటమే కారణం.

దేహంకన్నా మనసు సూక్ష్మం. మనసు కన్నా బుద్ధి సూక్ష్మం. బుద్ధికన్నా హృదయం సూక్ష్మం. నేడు అంతా కృత్రిమమే కనుక ఎవరికి ఎప్పుడు ఏ రోగం వస్తుందో చెప్పలేము. ఇది అందరికీ తెలిసిపోయింది. పూర్వం లేనంతగా వ్యాయామాలు సాగుతున్నాయి. ఆహారపు టలవాట్లు మారుతున్నాయి. ఆరోగ్యం వైపు అందరికీ దృష్టి పడింది.

దేహం ఆరోగ్యంగా ఉన్నంత మాత్రాన మనిషి సుఖించగలడా? బుద్ధి పెరగనిదే ఈ పోటీ ప్రపంచంలో బ్రతుకు తెరువు గడవదు. అది కూడా చాలామందికి అర్థమై పోయింది. మాచింగ్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు అందుకే పెరిగిపోతున్నాయి. 'క్విజ్'లపై మోజు అదే. బుద్ధిని విషయాలతో నింపేయాలి. ఎన్నో విషయాల్ని మనసులో కుక్కేయాలి. అవసర మొచ్చినప్పుడల్లా కక్కేయాలి. ఇలా కుక్కుతూ కక్కుతూ మనిషి కష్టాల్లో కూరుకుపోతున్నాడు. బ్రతుకు బాధల్లో చిక్కుబడిపోతోంది. అన్నీ బరువులే. బాధలే. భారాలే.

యథా ఖరః చందన భారవాహి భారస్య వేత్తా న తు చందనస్య

“చందనపు కొయ్యల్ని మోసే గాడిదకు దాని బరువు తెలుసు. కాని విలువ తెలియదు” అని భర్తృహరి మహాశయుడు బుద్ధికి బరువెత్తుకుంటూ, హృదయాన్ని తేలికపరచుకోలేని గార్దభరాయుళ్ళను పదమూడు వందల సంవత్సరాల క్రితమే గట్టిగ మందలించాడు. మందబుద్ధులు కాకండి అని హెచ్చరించాడు. విషయాన్ని సేకరించడం విద్య కాదు. విషయాన్ని వంటబట్టించుకోవడం విద్య.

If you have assimilated five ideas and made them your life and character, you have more education than any man who has got by heart a whole library.

“నీవు ఒక ఐదు భావాలను వంటబట్టించుకొని నీ స్వంతం చేసుకొని వాటిని నీ జీవితంగాను, వ్యక్తిత్వంగాను తీర్చిదిద్దుకోగలిగితే ఒక గ్రంథాలయాన్ని పూర్తిగా కంఠస్థం చేసిన వాడికన్నా నీవే విద్యావంతుడివి” అన్నారు స్వామి వివేకానంద.

ఇలా జీవించడం తపస్సు. ఇది మనసుకు సంబంధించింది కాదు. హృదయానికి సంబంధించింది. మనోహృదయాలు ఏకమై పొందికగా శోభించేది ఇక్కడే.

స తపో అతప్యత “అతడు తపస్సు చేశాడు” అని విద్య నార్జించే బ్రహ్మచారినిగూర్చి మాట్లాడింది తైత్తిరీయోపనిషత్తు. మరి తపస్సు ఏమిటి? అని ప్రశ్నించినపుడు **మనసశ్చ ఇంద్రియాణాం చ హి ఏకాగ్ర్యం తప ఉచ్యతే.** “ఇంద్రియ మనస్సుల ఐక్యతయే తప”స్సని శ్రీ శంకరులు భాష్యంలో నిర్వచించారు.

విద్యా తపోభ్యాం పూతాత్మా

“విద్య, తపస్సుల ద్వారా పవిత్రుడివి కా” అన్నారు మహర్షులు. కానీ తపస్సు లేని విద్య నేడు మనోహృదయాల్ని ఐక్యం చేయలేకపోగా ఆ రెండింటి మధ్య పెద్ద అగాధాన్ని సృష్టించి బ్రతుకును అస్తవ్యస్తంగా మార్చేస్తోంది. కనుక ప్రతి మనిషి తన బుద్ధిలోని విషయానికి, తన ఆచరణకి మధ్య వారధిని నిర్మించుకొని ఐక్యతను సాధించ గలిగితే మనుగడ ఆనందప్రద మవుతుంది.

అదలా ఉంచండి. వ్యక్తిలో సాధించబడిన ఐక్యత అతని మూర్తిమత్వాన్ని పెంచుతుంది. బాగుంది. మరి బాహ్య ప్రపంచం విషయమేమిటి? అక్కడ భిన్న మనస్తత్వాలతో కూడిన వ్యక్తులు వ్యవహరిస్తున్నారు. వ్యష్టిలోని ఐక్యత సమిష్టిలో ఎలా వస్తుంది? అలా రానపుడు బాహ్య జీవితంలో అందం చెడి ఆనందం మరుగున పడినట్లే కదూ!

అవును. బాహ్య ప్రపంచం యమునా తీరం. అక్కడ ఎవరి ప్రపంచం వారిదే. నా ప్రపంచం నా ఊహలతో, మీ ప్రపంచం మీ ఊహలతో, ఆయన ప్రపంచం ఆయన ఊహలతో తయారై ఉంది. కాని మొత్తం ఈ ప్రపంచం అంతా మన సమిష్టి మనస్సులు కలిసి తయారు చేసిందే అని అంగీకరించక తప్పదు.

మరి, ఈ భేదాలు ఎలా సమసిపోతాయి? నా మనసును మీ మనసులతో ఐక్యం చేసినపుడే. అది ఎలా సాధ్యం? మీ ఆలోచనలు, నా ఆలోచనలు, వారి ఆలోచనలు, వేరు వేరుగా సాగవచ్చు. కానీ అన్ని ఆలోచనల వెనుక ఉన్నది ప్రేమ ఒక్కటే అని అంగీకరించక తప్పదు. మన ఆలోచనలు ప్రేమలో గ్రుంకులిడగలిగితే అక్కడ అందరమూ ఒక్కటైనట్లే. అదే భక్తి. అదే వేదాంతం.

ప్రేమ అంకురించిన వేళ భేదాలు, ద్వేషాలు అదృశ్యమవుతాయి. అయితే అందరినీ నేను ప్రేమించగలనా? అనే సందేహం నీకు కలుగవచ్చు. కానీ నీలో రాజుకుంటూ కదులుతున్న ప్రేమాగ్ని ఒకనాడు భేద పర్వతాల్ని తగులబెట్టేస్తుంది. కూల్చి పారేస్తుంది. అయితే, నీవు జాగ్రత్తగా ప్రయత్నించి సాధన సాగించాలి.

వాడిపోయే మొక్కకు నీళ్ళు పోసే దగ్గరనుండి ప్రారంభం కావాలి. ఆకలితో ఉన్న కుక్కకి అన్నం పెట్టడం అలవడాలి. చలికి వణుకుతున్న వ్యక్తిపై గుడ్డ కప్పే స్థాయికి ఎదగాలి. ప్రక్కవారి భావాల్ని ఓపికగా వినగలగాలి. సంకీర్తన జరిగే చోట నీవు పాడాలనే ఉబలాటంకన్నా మరొకరు పాడుతుంటే ఆనందంగా వినగలగాలి. సంపన్నులను చూచినా కళ్ళు చల్లగానే ఉండాలి. ఇదంతా ప్రేమ వైపు ప్రయాణమే. శాంతి వైపు పయనమే.

సచ్చిదానందం....

ఎంత మంచిమాట! ఎంత చక్కని పాట!
ఎంతవారి కైనా అంతు చిక్కని వేట!
ఇంతింతై వటు డంతయైన వేదాంత కోట!
చింత దీర్చు మాట! సచ్చిదానంద బాట!

ముజ్జగాలను మురిపించే, ఆనందంలో మైమరపించే మూడు మాటల మధురామృతమే సచ్చిదానందం.

సత్ -చిత్ - ఆనందం

ఇవి మాటలు కావు; మణులు; మాణిక్యాలు; మృత్యువును కబళించే అమృతరూపాలు. కలలను చెదరగొట్టే వెలుగులు.
ఇవి కారిపోని సంపదలు; మారిపోని సౌందర్యాలు; దొరలు దోచలేని సిరులు; దొంగలు అపహరించలేని సంపదలు.

మతాబుల కాంతులు

"కలకత్తాలో నెల రోజులుండి అక్కడ్నుంచి కర్నూలొచ్చాను. మాసం రోజుల్లోనే కడపకి మకాం మార్చాల్సి వచ్చింది. అదీ నచ్చలేదు. ఆ తరువాత మాసమంతా కాకినాడ రేవులోనే గడిపాను. చాతుర్మాస్యం పూర్తిచేసుకున్నట్లైంది", అంటాడు నిద్ర లేచిన పెద్దమనిషి.

పడుకొని నాలుగు నిముషాలు కాలేదు. నాలుగు మాసాల జీవితాన్ని స్వప్నంలో అనుభవించడము జరిగింది. ఇది స్వప్నానుభవం. మాయ. కాకపోతే నాలుగు మాసాల జీవితం నాలుగు నిముషాల్లో ఎలా అనుభవాని కొస్తుంది?

మేలుకున్న తరువాత కలకత్తాలో పుచ్చుకున్న కట్నం, కర్నూలులో జరిగిన కళ్యాణం, కడపలో కలిగిన సంతానం, కాకినాడ రేవులో లభించిన కాంచనం - అంతా కలే. కల్లే.

అంతే జీవితం కూడా. బాల్యము బంతిలా దొర్లిపోతుంది. యవ్వనం పక్షిలా ఎగిరిపోతుంది. వాగునీటిలా సాగిపోతుంది వార్ధక్యం. వ్యర్థంగా గతిస్తుంది వృద్ధాప్యం. అంతా వృథా. అంతా వ్యథ. ఈ ప్రపంచంలో మన ఆట నాలుగురోజులే.

మాపు ప్రక్కనే రేపు ఉంది అనుకుంటాం. ఈలోగానే పడుతుంది యముని చూపు. ఇక మాపు కూడా రాదు. అంతా మార్పే. ఇదే కాల మిచ్చే తీర్పు. నాడు గతించి పోయింది. ఒకనాడు అనేది వస్తుందో లేదో! నేడు కూడా తామరాకుమీద నీటిబొట్టే. గోకే దేదో తామర కాలంలోనే జరిగిపోవాలి. తారాడుతూ, జీరాడుతూ ఉంటే మృత్యు కూపంలోకి జారిపోవడమే. వర్షాకాల మేఘంలా ఈ ప్రపంచంలో కారిపోవడమే.

న కశ్చిదిహ జానాతి కిం కస్య శ్వో భవిష్యతి
అతః శ్వః కరణీయాని కుర్యా దద్యైవ బుద్ధిమాన్

ఎవరికి ఏ ఆపద రేపు సంభవిస్తుందో ఎవరికీ తెలియదు. కాబట్టి బుద్ధి గలవారు రేపు చేయాలనుకున్న సత్కార్యాన్ని నేడే పూర్తి చేసుకోవాలి.

చేయవలసింది మాని, చేయకూడనిది చేస్తూపోతే మరణం పలకరించినపుడు చేయగలిగిందంటూ ఏదీ మిగలదు. విరామస్థానం లాంటి ఈ ప్రపంచంలో విరివిగ పెంచుకొనే మమతలు మనిషిని వేదనాలయంలో కూర్చోబెడుతాయి.

ఈ ప్రపంచంలో ఎవరికి ఎవరి మీద హక్కు లేదు. 'ఇతడు నావాడు' అని చెప్పడానికి అతడెంత కాలం ఉంటాడో నీకూ తెలియదు. అతనికీ తెలియదు. ఒకవేళ ఉన్నంతవరకైనా కలిసి ఊరేగుదా మనుకున్నా, ప్రక్కవాడు నిరాకరిస్తే చేయగలిగింది ఏమీ ఉండదు. రెండు చేతులు కలిస్తేనే శబ్దం. అదీ క్షణికం. రెండు చేతుల్నీ ఎంతసేపు కట్టి ఉంచగలం? కలిసి శబ్దం చేస్తాయి. శబ్దం ఆగకముందే విడిపోతాయి. ఇవీ మమతలు ఈ ప్రపంచంలో. ఎవరు ఎవరిని ప్రేమించినా స్వార్థం కొరకే. ప్రేమలు, చింతకాయలు - నిజానికి కాయ సంబంధంతో ఏర్పడిన చింతలే. బరువులే. బాధలే.

ఈ వేదనలన్నీ మూడు విధాలుగా ఉంటాయి. 1. మన దేహంవల్ల కలిగే బాధలు 2. చుట్టూ ఉన్న మనుష్యుల వల్ల కలిగే వ్యధలు 3. ఆపుకొనే అవకాశాన్నివ్వకుండా, తెలియకుండా వచ్చి పడేవి. వీటిని పరిష్కరించే ప్రయత్నంకన్నా పరిశీలించి అర్థం చేసుకుంటేనే అవి సమసిపోతాయి.

'నీవు ఎవరి వాడవు? నీ వారెవరు?' పెళ్ళి కాకముందు భార్య లేదు. మధ్యలో ప్రవేశిస్తుంది. వచ్చిందేదైనా పోయేందుకే కనుక మధ్యలోనే నిష్క్రమిస్తుంది నాటకంలో పాత్రలాగా. పుట్టకముందు బిడ్డ లేడు. పోయేటప్పుడు వెంటరాడు. ఈలోగా అతడు మరణిస్తే? లేదా, ఉండి కూడా వదలి దూరంగా వెళ్ళి మనల్ని మరణ యాత్రకు గురిచేస్తే, చేసేదంటూ ఏమీలేదు. అంతా చూచేదే.

ఏవి నీకు సంక్రమించినా లేకుండా వచ్చినవే. ఇచ్చినవే. బంధుత్వాలు, సంపదలే కాదు. ఈ దేహం కూడా నీకు ఇవ్వబడింది. ఇవ్వబడింది కనుక తీసుకోబడుతుంది. మొరాయిస్తే మొరటుగానైనా మృత్యువు లాగేసుకుంటుంది.

నీ దేహమే నీవు కావు. దానితో సంబంధాలు పెనవేసుకున్న దేహాలు నీవెలా అవుతాయి? వారి దేహాలు నీవి కానపుడు నీ దేహము వారిదెలా అవుతుంది? కిస్ కా తూహై? నీవు ఎవరి వాడివి? (కస్య త్వం?) నీ వారెవరు?

విచార్యమాణే తత్త్వ దృష్ట్యా పుత్రాదయో న సన్తి!

"సత్యపరంగా అవలోకించి గ్రహిస్తే, నిజానికి పుత్రాదులు లేనేలేరు" అంతా స్వప్న తుల్యమే.

అన్నిటితో, అందరితో కలిసి జీవించవచ్చు. కానీ, ఎవరిపైనా ఆధారపడకూడదు. భావావేశంతోనే భవబంధాలు తగులుకుంటాయి. ఆవేశాలు, అభినివేశాలు ఎవరికైనా, ఎప్పుడైనా అవరోధాలే.

జ్ఞానాన్ని పొందేందుకు అనువైన మానవదేహం లభించింది. ఎంత నిర్మలమైనా, ఒక చోట నిలబడితే నీరు మురికి అవుతుంది. పారే నీటికి దోషమంటదు. మురికి కాకుండా, మృత్యువాత పడకుండా దేహాన్ని దాచుకోలేము. దయామయుడైన పరమాత్మ సేవలో దానికి సార్థక్యం కల్పించాలి. ఎన్నాళ్ళు బ్రతికినా అది మూన్నాళ్ళ ముచ్చటే. మమతలన్నీ మతాబుల కాంతులే. మమతా సర్పం కాటు వేసేసింది. విష మెక్క కుండా చూచుకోవాలి. విషానికి విరుగుడు వెదకాలి. దానికి ఔషధము భగవత్స్మరణమే.

సంసార సర్ప ద్రష్టానాం జంతూనా మవివేకినామ్

చంద్రశేఖర పాదాబ్జ స్మరణం పరమౌషధమ్

"సంసార సర్పముచే కరువబడిన అవివేకులకు పరమాత్మ చరణకమల సేవనమే గొప్ప ఔషధము" అని తరుణోపాయమును చూపింది శాస్త్రము.

స్మరణము - విస్మరణము

శోకతప్తమైన ఈ లోకంలో మానవుడు అనంత దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. దుఃఖానుభూతిని పంచిన కారణాలు విభిన్నముగా ఉండవచ్చు. పంచుతున్న పరిస్థితులు అనేక విధాలుగా ఏర్పడవచ్చు. దుఃఖ కారణ పరిస్థితులు, శోకజీవన కారణాలు మనస్సులో మెదలగానే తత్సంబంధిత దుఃఖస్మృతులు విజృంభించి మనిషిని అశాంతికి గురి చేస్తాయి. అట్టి స్థితిలో దుఃఖ కారణాలను, శోకప్రేరణలను మరచి జీవించగలగడం ఎంతటి అదృష్టమో? మరపు ఎంత మంగళదాయకము? కనుక మరచిపోవడం అలవరచుకో. మరచిపోవాలనే విషయాన్ని మాత్రం సదా జ్ఞాపకముంచుకో.

మరచిపోయావా! అయితే భగవంతుని పట్ల అన్యాయం చేశావన్నమాట. **భగవానుడు నీకు మతి ఎందుకిచ్చాడు! మరచిపోవడానికా? కాదు.** జ్ఞాపకముంచుకోవడానికి కూడా. అయితే ఇప్పుడు నీవు చేయవలసింది ఏమిటి? మరచిపోవాలి. అంతేకాదు. జ్ఞాపకం పెట్టుకోవాలి కూడా. కొన్ని విషయాలు యత్నించి మరచిపోవాలి. మరికొన్ని విషయాలు ప్రయత్నించి జ్ఞాపకం పెట్టుకోవాలి. ఏ విషయాలు మరవాలి? ఏ విషయాలు జ్ఞాపక ముంచుకోవాలి? చెబుతాను విను.

నీవు ఇతరులకు చేసిన మేలును, ఇతరులు నీకు చేసిన కీడును మరచిపో. అలాగే ఇతరులు నీకు చేసిన మేలును జ్ఞాపకముంచుకొని కృతజ్ఞతతో జీవించు. నీవు ఇతరులకు చేసిన కీడును స్మృతియందుంచుకొని సవరణ బుద్ధితో, పశ్చాత్తాపముతో బ్రతుకును కొనసాగించు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచాన్ని మరచి బ్రతుకు. భగవానుని తలచి జీవించు.

ప్రపంచ మొక భోగశాల. భోగానుభవములను పంచి రోగశాలకు తరలించే విచిత్ర వైద్యశాల. ఇదొక మయసభ. అనిత్య చిత్రములతో నిండిన మాయాసభ. ముట్టుకుంటే వదలిపెట్టని మకరసభ. పట్టుకుంటే పగిలిపోయే అద్దాలసభ. పట్టుకుంటే పరిమితం కాక తప్పదు. ముట్టుకుంటే మారణహోమం కాకపోదు. వదలిపెట్టడము నేర్చుకో. అలా కదలి సాగడము అలవరచుకో. చెట్టునిండా పండ్లున్నాయి. తిని కూలబడకు. చూసి నిలబడు. తిన్నవాడికి ఒకే పండు లేదా కొన్ని పండ్లు. తినక చూసినవాడికి ఎన్నో పండ్లు. కాదు. అన్ని పండ్లు వాడివే. అపరిమితమైన ఆనందాన్ని జుర్రాలంటే పరిమిత కర్మలకు, సంకుచిత భావాలకు స్వస్తి చెప్పు. అవగాహనతో శుద్ధిపడు. ఆంతర్యంలో సుఖపడు.

మరచిపోవలసిన దానిని స్మృతి నుండి పెకలించి దూరంగా పారేయి. జ్ఞాపక ముంచదగిన వానిని ప్రయత్నించి మనస్సులో నింపేయ్. మరచిపో. అంతేకాదు. జ్ఞాపకం కూడా పెట్టుకో. మరపులో స్మృతి, స్మృతిలో మరపు ఎలా నిండివున్నవో గ్రహించు. గ్రహించి అవలోకించు. అవలోకించి అభ్యసించు. అభ్యసించి ఆనందించు. ఆనందించి తరించు.

వినోదాలు - విషాదాలు

పాలను ఆశించి గోవును పోషిస్తాము. గోవు నుండి మనకు పాలు వస్తాయి. అంతే కాదు; పేడ కూడా వస్తుంది. పాలు ఇంట్లోకి తెచ్చుకుంటాం. పేడను ఇంటికి దూరంగా విసిరివేస్తాం.

ఆవు నుండి పాలు మాత్రమే రావాలి. పేడ రాకూడదు అంటే వీలు కాదు. కర్మలు కూడా ఇలాగే ఉంటాయి. ఏ కర్మ చేసినా, అది పూర్ణంగా అర్థవంతంగా ఉంటుందని చెప్పలేము. కొంత అభ్యంతరంగా కూడా ఉంటుంది.

సంబంధాలు కూడా ఇలాగే ఉంటాయి. ఏ సంబంధం లేకుండా, ఎవరితోను సంబంధం లేకుండా జీవించటం సాధ్యపడదు. కాని, సంబంధాలలో కేవలం సంతోషమే ఉంటుందని చెప్పలేము. విషాదం కూడా కలిసే ఉంటుంది.

మనం ఎవరితో కలిసి జీవించినా, వారు తల్లిదండ్రులు కావచ్చు, అన్నదమ్ములు కావచ్చు, భార్యాభర్తలు కావచ్చు, స్నేహితులు కావచ్చు, బంధువులు కావచ్చు, - వారిలో అన్నీ మనకు నచ్చిన గుణాలే ఉంటాయని చెప్పలేము. మనకు నచ్చనివి, వారు మెచ్చేవి కూడా ఉంటాయి. అలాంటివి ప్రేమకి, సఖ్యానికి ప్రతిబంధకాలే కావచ్చు. కాని, అవి లేకుండా సంబంధాలు లేవు. గులాబీల మధ్య ముళ్ళు తప్పనట్లు, సంబంధాలలో ఈ విధమైన సంఘర్షణలు తప్పవు.

భోజనం చేయాలి. ఆకును పడేయాలి. కాని, ఆకు లేకుంటే వడ్డించటమే జరగదు. ఆకలి తీరదు. ఆకలి అన్నంతోనే తీరుతుంది. అన్నం ఆరగించినంత వరకు ఆకును ఆదరిస్తూనే పోవాలి. పడేసేదే కదా అనుకోవచ్చు. కడుపులో అన్నం పడే వరకు ఆకు మన ముందే ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ అవసరం లేని క్షణం ఒకటి రావచ్చు. కాని, అవసరాలలో అవశ్యంగా తొంగిచూచే అనవసరాలను కూడా పెద్ద మనస్సుతో అంగీకరించే ఓర్పును పెంచుకుంటేనే అభివృద్ధిని సాధించటం మనిషికి సాధ్యపడుతుంది.

ఎవరినైనా మనం ప్రేమించాము అంటే వారిలో ఏవో సుగుణాలు ఉంటాయి. కానీ, వారిలో కేవలం సుగుణాలే ఉంటాయని భావిస్తే మాత్రం మనం చాలా పొరపడుతున్నామేమో. అంటే, వారిలో ఏ దుర్గుణాలు ఉన్నాయో అన్వేషించి అర్థం చేసుకోమని నా ఉద్దేశ్యం కాదు. ఏ పుట్టలో ఏ పాముందో చెప్పలేము అనేదే నా ఆంతర్యం. ఏది జరిగినా, ఎలా జరిగినా దానిని అర్థం చేసుకొనేందుకు బుద్ధి సిద్ధంగా ఉండాలనేదే నా అభిమతం. ఊహించనివి ఏవేవో జరిగాయని వాటినే ఊహించుకొంటూ బ్రతుకును ఏదో చేసుకోవటం యెదకు బాధేనని సూచించటమే నా అభిప్రాయం. ఫలం కావాలి అంటే పువ్వును గిల్లకూడదు. పువ్వులో అందం ఉంటుంది. పువ్వు అందంలో ఆహ్లాదముంది. పువ్వు రుచిలో ఆనందం లేదు. పువ్వు చప్పగా ఉంటుందే గాని తియ్యగా ఉండదు. పువ్వు నుండి ఎదిగే కాయ కాస్త చేదుగా కూడా ఉంటుంది. కాయ

పెరిగి దోరగా మారితే తీపి వగరుల కలబోతగా ఉంటుంది. అదే ఫలమైతే వడపోతలో వగరు కారిపోగా తీపి ముద్ద అవుతుంది. ముద్దు అవుతుంది. తిన బుద్ధి అవుతుంది.

రసపూర్ణ ఫలంగా మారేవరకు కాయ చెట్టును అంటుకొనే ఉండాలి. అలా ఉండటంలోనే పోవలసినవి పోగా, రావలసిన, కావలసిన రసం పండులో నిండుతుంది. పూర్వము ఉన్న వగరు, చేదు, పులుపు లాంటివి పండులో ఉండవు. పండులో అంతా తియ్యదనమే.

చెట్టులో పండినపండు పట్టుకోగానే చెట్టును వీడి చేతిలో పడుతుంది. అదే, కాయను పట్టుకుంటే చెట్టును విడిపోదు. బలవంతంగా కోస్తే, కాయ, చెట్టు రెండూ తడిగా ఉండటాన్ని మనం స్పష్టంగా చూడవచ్చు. ఇది తడి కాదు. కంటతడి. వీడలేని, విడి ఉండలేని బాధ అది. పండైతే ఇరువురికీ బాధ లేదు. అంతవరకు చెట్టును అంటిపెట్టుకొని ఉండక తప్పదు. జీవితంలో కూడా అన్నీ అలాగే ముడిపడి ఉన్నాయి. సమయం వచ్చే వరకు నియమం అనుసరణీయం. కలిసొచ్చిన కాలంలో అంతా కైవల్యమే.

సంబంధాలు తప్పవు. అవి అలా ఉండనివ్వండి. వాటిని బ్రతుకుకు బంధాలుగా భావించ నవసరం లేదు. తెలిసో, తెలియకో మనం కోరుకున్నవే మనవద్ద ఉన్నాయి. కోరినవన్నీ మనతో ఉండకపోవచ్చు. కాని, ఉన్నవి మాత్రం మనం కోరుకున్నవే. ఈ ఉద్యోగంలో సుఖం లేదు అని భావించే దెవరు? సుఖం ఉందని భావించి ఉద్యోగంలో చేరినవారే. సంసారంలో సుఖం లేదని చెప్పే వ్యక్తి సన్యాసి కాదు. ఇష్టపడి సంసారంలో దిగినవారే. ఏవి ఎవరికి ఎలా ఉంటాయో ముందే తెలిస్తే, వెనుక దుఃఖపడే స్థితి ఎవ్వరికీ రాదు. తెలియక తెచ్చుకున్న వాటిని తరిమితే పోవు. పోయే క్షణం వచ్చినపుడు తురిమినా నిలవవు. ఏడ్చినా వీడని నేస్తాలను నవ్వుతూ భరించటమే సుఖం. అక్కడే మనస్సుకు శాంతి.

తస్మాత్ అపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి

అనివార్యాలు అర్థం చేసుకునేందుకు ఉన్నవే గాని ఆవేదన చెందేందుకు కాదని గీతాచార్యుని మాట. మనతో ఉన్నవి ఏవైనా ఉన్నవే గాని అవి మనం కాము. అనుకుంటే మనవి అవుతాయి. శాంతి లేకుండా చేస్తాయి. కాని, అనుకున్నప్పుడు కూడా అవి మనవిగా ఉంటాయే గాని మనంగా ఉండలేవు.

నిర్దుఃఖో దుఃఖయోగ్యస్య నాహం తస్య న చైషమే
కశ్చిద్భవతి శైలస్య తత్త్వ ఏవ యథామ్బుదః

"కొండపై నున్న మేఘాలతో కొండకు సంబంధం లేదు. అలాగే ఆనంద స్వరూపుడనైన నాకు దుఃఖ యోగ్యములైన వాటితో సంబంధం లేదు". కలిసివున్నా కలవని సంబంధాలను అర్థం చేసుకుంటే కలతలు ఉండవు. కల్లోలాలు మిగలవు. బ్రతుకు కమనీయంగా, రమణీయంగా శోభిస్తుంది. ఉండేవి ఉంటాయి. అవి మనకు చెందకుండా ఉంటాయి. మనం వాటికి చెందకుండా ఉంటాము. ఒక దశలో, కాదు స్థితిలో, ఏవీ మిగలవు. నిర్విశేషంగా మనమే ఉంటాము.

సరిచేసి చూడటమా?
సరిపడి ఉండటమా?

ఏదో చేయటం, మరేదేదో చేయటం,

దీనివల్ల ఏదైనా రావచ్చునేమో గాని తృప్తి రాదు. ఇతరులకు ఏదో మనం చేయటం వల్ల, లేదా ఇతరులు మనకేదో చేయటం వల్ల ఏదైనా రావచ్చు; ఏదైనా పోవచ్చు. కాని, తృప్తి రాదు; అసంతృప్తి పోదు.

తృప్తి అంటే ఏమిటో విచారించకుండానే, ఇతరులను తృప్తి పరచేందుకు, మనం తృప్తి పడేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాము. ఈ విషయంలో ప్రయత్నాలుంటున్నాయే గాని ఫలితాలు లేవు. కాని, కాలమంతా, మన జీవితమంతా ఇతరులను తృప్తిపరచే ప్రయత్నంలోనే ఖర్చయిపోతూ ఉంది.

ఇతరులు మనల్ని మెచ్చుకోవాలి. వారు మనల్ని మెచ్చుకోవాలంటే, మన విషయంలో వారు తృప్తి పడాలి. అలా వారు తృప్తి పడే రీతిలో మనం ప్రవర్తిస్తాము. వేష భాషలు మొదలుకొని ఆహార విహారాదులు, చివరగ ఆలోచనా సరళి - అన్నీ ఆ కోణంలోనే సాగుతున్నాయి.

అంతటితో ఆగటం లేదు. ఎదుటివారి అభిరుచుల సంగీతానికి అనుగుణంగా ఆచరణలో నృత్యాన్ని చేయటం జరుగుతోంది. మనం చాలా మంది మెప్పును కోరుతున్నాం. అందరి ఆలోచనలు, అభిరుచులు ఒక విధంగా లేవు. మనం ఉత్తరాన్ని చూస్తే ఒకరికి సుఖం, దక్షిణాన్ని చూస్తే మరొకరికి సుఖం. ఏ వైపు చూడాలో కూడా అర్థంగాని స్థితిలో మనమున్నాం. దిక్కులు చూస్తూ చిక్కుల్లో పడిపోతున్నాం. బిక్కు బిక్కుమని అలమటిస్తున్నాం. ఈ పరిస్థితికి అంతమెక్కడో అర్థం కావటంలేదు. బాహ్యంలో అపార్థాలు, ఆంతర్యంలో ఆవేదనలు.

మనం చేయవలసింది మనం చేయాలి. అందులోను చేయగలిగింది చేస్తూ పోవాలి. ఒకరికి నచ్చటం, మరొకరికి మెచ్చటం అనేది వారి వారి మనోస్థితిపై, వారికున్న అనుభవ జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి మనల్ని చులకనగా చూడటం వల్ల మనం చులకన పడము. అతడు నన్ను చులకనగా చూశాడే అనే ఆలోచన వల్లే మనం బలహీనులమవుతాము.

ప్రతి విషయాన్ని విశ్లేషించుకొని మదింపు వేయాలి. ఒకరు మనల్ని బాధించటానికి, విమర్శించటానికి శత్రుత్వమే ఉండాల్సిన అవసరం లేదు. మురికి గుంటలకు మనకు శత్రుత్వమేముంది? ముక్కు ఉన్నందుకు భరించక తప్పదు. దోమలకు మనకు దోస్తీ ఏముంది? అలాగని శత్రుత్వం మాత్రం ఏముంది? అదే పనిగా కుడుతున్నాయి. వాటిని మనం అర్థం చేసుకోవాలి. అంతే. కొందరు మనుషుల్ని ఇలాగే అర్థం చేసుకొంటూ పోవాలి.

ఆలోచించకూడని వాటిని ఆలోచిస్తూ పోతే, ఒక దశలో మన ఆలోచనల్ని మనమే భరించలేని స్థితి వస్తుంది. విలువలేని వ్యక్తుల పలవరింతలకు, కలవరింతలకు విలువ కట్టడం ప్రయత్నిస్తే ఆ తరువాత మన జీవితమే విలువ లేనిదిగా మారిపోతుంది. వాన కురుస్తున్నా, ఇంట్లో ఉన్న నీవు తడవవు. నీలో నీవు నీవుగా ఉంటేనే తృప్తి. అంతేకాదు, అలా ఉండటంలో ఇతరుల్ని కూడా వాళ్ళున్న స్థితిలో నీవు అర్థం చేసుకొని విశాల హృదయంతో అంగీకరించగలవు. అవసర మనిపిస్తే, క్షమించగలవు. అంతవరకు నీవల్ల ఇతరులకు కూడా అసంతృప్తి మిగలదు. ఒక విధంగా చెప్పాలంటే, ఇది పరులకు నీవు పంచే తృప్తి. మానవ ప్రపంచంలో ఉన్నదంతా వాసనా వైచిత్ర్యమే. వడపోత తెలిస్తేనే ఒడి నిండుతుంది.

కాకి పలుకు కఠోరంగానే ఉంటుంది. అలాగని దానిపై వ్యాఖ్యానం చేయకూడదు. అది కాకి, దాని పలుకు కఠోరంగానే ఉంటుంది అనే సత్యాన్ని అర్థం చేసుకుంటే చాలు. అంతేగాని, దానిపై అవధానం సాగించి, ఆ కోణంలో ఆలోచనలు సాగించటం ఎవరికీ ఆరోగ్యకరం కాదు. పైగా కష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేస్తుంది.

ఆవు తోకనో, లేదా ఎద్దు తోకనో చేతికి పట్టించి, పట్టు వదలకుండా వెళ్తే చేరవలసిన చోటికి చేరగలడని, ఒక వ్యక్తి అంధుడైన వ్యక్తిని నియమిస్తే ఆ రెండవవాడు ఏ విధమైన బాధల్లో చిక్కుకుపోయినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. దీనిని శాస్త్రంలో **"అంధ గోలాంగూల న్యాయః"** అంటారు. అర్థమయ్యే వ్యవహార శైలిలో చెప్పాలంటే - కుక్క తోక పట్టుకొని ఎక్కడో ఈదటం మొదలెట్టి మరెక్కడో చేరినట్లు!

కుక్క తోకలకన్నా ఎక్కువ వంకరులున్న మనుషులే అన్ని రంగాల్లో అధికంగా గోచరిస్తున్న రోజులివి. జలక్షీర న్యాయాన్ని అనుసరించి జీవించటం క్షేమకరం. అక్కడ నుండే తృప్తి ప్రారంభ మవుతుంది. ఎక్కడో, ఎప్పుడో అది నిత్యతృప్తిగా మారిపోతుంది; కాదు కాదు; మిగిలిపోతుంది.

అనువు గాని చోటు అవరోధమే

దోమల గదిలో ఎవరు సుఖంగా జీవించగలరు? నల్లులున్న మంచముపై ఎవరికి సుఖనిద్ర పడుతుంది? నీచులున్నచోట జీవించడంకన్నా, నాచున్న బావిలో తలదాచుకొని మరణించడం మేలు.

జలం ఒకేసారి ముంచుతుంది. అగ్ని ఒకేకాలంలో దగ్ధం చేస్తుంది. నీచులు బాధించుటకు సమయాలుండవు. సందర్భాలుండవు.

పాములు ఉన్నచోట ఉండడం ప్రమాదం. కానీ, పాము ఎప్పుడు కరుస్తుంది? అంటే ఎవరు చెప్పగలరు?

నీవు ఎక్కగా అలంకరించుకున్న ఇంటిని గాలి దుమారం వచ్చి క్షణంలో పాడుచేసి వెళ్తుంది. ఆ తరువాత చూస్తే, నీ శ్రమంతా బూడిదపాలైందని నీవు చింతిస్తావు. శ్రమించి సుందరంగా తయారు చేసుకున్న పెళ్ళిపందిరిని, ఎవడో వినోదానికి ఎగుర వేసిన టపాకాయ వచ్చిపడి, సమస్తాన్ని దగ్ధం చేసి, కళ్యాణ వేదికను వల్లకాడుగా మార్చేస్తే గుండె ఎంతగా నీకు తరుక్కుపోతుందో!

గుడ్లగూబలు పగలు చూడలేవు. కాకులు రాత్రుల్లో చూడలేవు. నీచుల దుష్టకార్యాలకు కాలంతో పనిలేదు.

మంచికి చావు లేకపోయినా వంచన చిరంజీవిగా బ్రతికే చోట విలువలున్న మనిషి బట్టకట్టలేడు.

చెడు ప్రదేశము అనేది ఒకటుంటుందా? మంచిచెడులు మనిషివా? మన్నువా? అనే సందేహం మీకు రావచ్చు.

కొన్ని ప్రదేశాల్లో మన్నుకు మహిమ ఉన్నట్లే, కొన్ని ప్రదేశాల్లో మన్నుకు మోసముంటుంది. మురికి నీరు చేరిన ప్రదేశం పవిత్రంగా ఉండదు. లంకలో విభీషణుడు, సరమ, త్రిజట లేరని నేను చెప్పడం లేదు. ఉన్న రాక్షస సంఖ్యలో ఆ ముగ్గురు, మరో ముప్పైమంది ఉంటే మాత్రం ఉపయోగమేమిటి? లంకంతా కల్లోలమే. కామ కాలుష్యమే.

స్తోత్రాలుంటాయి. పూజలుంటాయి. పిశాచాలు వేదాలు వల్లించినట్లు చిలుక పలుకు లుంటాయి. హృదయాలు శ్మశానాల్ని మరిపిస్తాయి.

ముంచేవి మూడే

'ఏషా' అంటే కోరిక. 'ఏషిన్' అంటే కోరువాడు. ఏషణత్రయ మంటే త్రివిధ వాంఛలని అర్థము. అవియే (1) ధనేషణ (2) దారేషణ లేదా గృహేషణ (3) పుత్రేషణ లేదా లోకేషణ. మోక్ష మార్గములో ఇవి ప్రతిబంధకాలుగా యున్నందున వీటిని త్యజించాలి.

ధనేషణ

అవసరాలు వేరు; ఆసక్తి వేరు. ధనం అవసరాలు తీరేందుకు అవసరం. అంతేగాని, ధనమే అవసరం కారాదు. ధనమే అవసరంగా మారితే, కనీస అవసరాలు కూడా తీరక పోవుటయే గాక ధనాసక్తి పెరుగుతుంది. ఇక్కడ అవసరం ఆశగా మారుతుంది. అవసరానికి అవధి ఉంటుందేమో గాని ఆశకు హద్దు లేదు. ఆశ పెరుగుతుందే గాని తరగదు. తోడు పెట్టినా, తోడుపడినా పెరుగుతూనే ఉంటుంది. పెరుగు అవుతూనే ఉంటుంది. శాంతి తరుగుతూనే ఉంటుంది.

దారేషణ - గృహేషణ

ధనాసక్తి ఎలా ప్రతిబంధకమో కాంతాసక్తి, గృహాసక్తి కూడా అంతే. అంటే, భార్యను ప్రేమించటం తప్పా? ఇంటిని తీర్చి దిద్దుకోవటం నేరమా? అని అవగాహన లోపించిన వారు ఊగిపోతూ ఉంటారు.

భార్యను ప్రేమించటం తప్పు కాదు; భార్యలందరు పతి దేవుళ్ళను కోరేది అదొక్కటే. కలిసి జీవించే వారిని ప్రేమించకుంటే ఎలా? సమస్తాన్ని ప్రేమించమని చెప్పే వేదాంతము కళత్రాన్ని ప్రేమించవద్దని చెబుతుందా?

ప్రేమించటం వేరు. ఆసక్తి వేరు. ప్రేమ ఉందని భార్యకు ఏది జరిగినా గగ్గోలు పెట్టడం, తనకు ఏదో జరగలేదని గంతులేయటం ఆరోగ్యానికి మంచిది కాదు. అతి స్నేహాలు ఆపదలకు, ఆవేదనలకు ఆహ్వానం పలుకుతాయి.

ఏవి మనకు తోడైనా చెప్పి వచ్చినవి మాత్రము కావు. అందుకనే చెప్పకుండా పోతాయి. బ్రతుకే ఒక యాత్ర. పోయేవాళ్ళతో కలిసిపోవటం దోషం కాదు. కాని, పోయారని దుఃఖించటం, ఉండలేదని గుండె బాదుకోవటం మంచిది కాదు. ఇది అతి స్నేహం. అభిష్వంగం.

గృహం నిర్మించుకోవచ్చు. గృహాసక్తి పెంచుకోకూడదు. గృహంలో ఉండాలి. గృహం మనలో లేకుండా ఉండాలి. 'నాది' అనే మమకారం లేకుండా జీవించాలి. ఎందుకో తెలుసా? ఒకనాడు త్యజించి పోవాలి. కాని, మమకారం అనివార్యమైన అట్టి క్లిష్ట సమయంలో గుండెను కుదిపేస్తుంది.

ఒక ఆఫీసరు తన కార్యాలయాన్ని తనదిగానే భావిస్తాడు. వస్తువులన్నీ వినియోగించుకుంటాడు. కాని, బదిలీ కాగానే బాధ్యతల్ని అప్పగించి వెళ్తాడే గాని, భారంతో, బాధతో నిష్క్రమించడు.

గృహకళత్రాదుల విషయంలో అలా ఉన్నవారే కృతార్థులవుతారు. అలా గాకుండా కొంపే కైలాస మనుకుంటే మాత్రం, కైలాసం విషయం ఈశ్వరుని కెరుక; కొంప కూలటం, కళేబరం కాలటం మాత్రం లోకానికంతా ఎరుకే.

పుత్రేషణ - లోకేషణ

జీవనయాత్రలో వివాహం ఒక మజిలీ. అక్కడే, ఆ సత్రంలోనే సంతానం వచ్చి చేరుతుంది. యాత్ర ఆగదు. అక్కడ నుండి సాగుతుంది. మొదట్లో లేని సంతానం మధ్యలో తోడవుతుంది. వారికి మనం నీడ అవుతాము. నీడ ఎప్పుడూ తోడుగానే ఉండదు. తోడుగా ఉన్నదంతా నీడ కాలేదు.

పుత్రుడు కలగటం, పుత్రోత్సాహము ఇవన్నీ మంచివే. పుత్రాసక్తి విషయంలోనే కొద్దిగా అవగాహన పెంచుకోవాలి.

"నా కొడుకు నా మాటే వినాలి" - వింటాడు చెవిటివాడు కాకపోతే. ఆచరించాలని ఎక్కడుంది?

"నేను చూసిన అమ్మాయినే చేసుకోవాలి" - నిజమే. అంతకు ముందే, కళ్ళున్నందుకు, ఆయన ఎవరినో చూశాడట. ఏం చేద్దాం?

'నేను చెప్పిందే చదవాలి', - మంచిదే. చెప్పేది మాష్టారు. చదివేది విద్యార్థి. నేను చెప్పిందే చదవాలి అంటే ఎలా? ఒకరి అభీష్టాన్ని మరొకరు భుజాని కెత్తుకొని మోయగలరా?

మనకు పుట్టినంత మాత్రాన మనం చెప్పినదంతా చేసేందుకే పుట్టారని భావించటంలో అర్థం లేదు.

మరి, పున్నామనరకం విషయ మేమిటి? కాపాడితే కైలాసమే. నరకం నుండి కాపాడకపోయినా, నరకంలో తోయకపోతే అదే శ్రీరామరక్ష అని భావించాలి.

మరి, కొరవి? అదెవరు పెడతారు? సరే, పెడతారనే అనుకుందాం. అప్పుడు చూచేదెవరు? చూచేవాళ్ళు అడగటం లేదు. అడిగే వాళ్ళు చూసేందుకు ఉండరు. ఎక్కడి బాధలు ఇవన్నీ? ఎందుకొచ్చిన బరువులు? బాధ్యతల్ని నిర్వర్తించటం - బరువుల్ని పడేయటం. ఇంతే. ఇది చేయగలిగితే ధన్యులు.

సామాజిక స్ఫూర్తి

గోడ యొక్క గట్టితనం ఇటుకలపై ఆధారపడి యున్నట్లు, దేశము యొక్క ప్రగతి యువత మీద ఆధారపడి యుంటుంది.

సాధుత్వమును హింసించిన తండ్రిపై తిరుగుబాటునకు ప్రహ్లాదుడు వెనుకాడ లేదు. ధర్మాన్ని దారిమళ్ళించిన తల్లితో భరతుడు ఏకీభవించలేదు. వ్యక్తి సుఖానికై సమాజమును బలిగొనేందుకు ముందు కురికిన రావణునితో తమ్ముడైన విభీషణుడు ఏకీభవించలేదు. నేటి యువతరంలో కూడా అలాంటి ఆవేశము, ఆకృతి గోచరిస్తున్నాయి. కానీ, ఆదర్శాలు కాలేక పోతున్నాయి. ఎందుకని? ఇక్కడే యువతరం తన మనోతరంగ చలనాన్ని చక్కదిద్దుకోవాలి.

విద్యార్థిలోకంలో ప్రస్తుతం ఎక్కువగా విప్లవనాదం వినపడుతూ ఉంది. ఈ నాదంతో శ్రుతి కలిపి ఎందరో యువతీయువకులు బ్రతుకులను హారతి కర్పూరం చేస్తున్నారు. హత్యలకు, దారుణ మారణహోమాలకు కూడా వెనుకాడుట లేదు. ఇదంతా దేనికొరకు? ఆర్థిక సమానత్వానికా? ఆకలి బాపుకొనుటకా? అదే వాస్తవమైతే, ఈ ఆవేశానికి లక్ష్యము లేదనే భావము. వివిధ స్థాయిలలో ముడిపడియున్న బ్రతుకును ఒక కోణంలో దర్శించి ఏమి సాధించగలం?

సుస్థిరజీవనమును సాగించుటకు ధన మవసరము. కానీ ధనమే సుఖాన్ని పంచలేదు. ధనంలో సుఖముంటే ధనికులంతా సుఖంగా ఉండాలి. ఉన్నారేమో ఆలోచించండి. విప్లవాల వలన భేదాలు సమసిపోతాయా? అలా అయితే ఆ మార్గము కూడా కళ్యాణప్రదమే. మరి విప్లవపంథాలో నడచేవారిలో ఈ భేదాలు, అసూయలు, ఈర్ష్యలు, పదవులకై పోరాటాలు అంతరించాయా?

ఆవేశాలు ఆశయాలను ఫలింపజేయవు. ఆలోచనయే ఆశయానికి జీవం పోస్తుంది. సమాన ప్రతిపత్తియే గాకుండా సహజ ఉత్పత్తి కూడా ఉండాలి. సామాజిక స్ఫూర్తి కావాలి. కానీ అది వ్యక్తియొక్క దీప్తిపై ఆధారపడి ఉంటుందనే నగ్నసత్యమును మరువకూడదు.

అరాచకా లన్నింటికీ ధనమే మూలమని భావించకూడదు. ధనికుడు అరాచకం చేయవచ్చు. కానీ అరాచకాలు చేసేవారందరు ధనికులేనని చెప్పగలమా? ఆర్థిక సమానత్వం తెస్తే సరిపోదు. హార్దికంగా బాగుపడని సమాజము దానిని నిలుపుకోలేదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించాలి. మంచిని పోషించాలి. ఈ మార్పు నైతికశిక్షణ ద్వారానే జరుగుతుంది. సమాజం తనకన్నా భిన్నం కాదనే సామాజికస్ఫూర్తిని వ్యక్తిలో కలిగించడం ద్వారానే ఏర్పడుతుంది.

ప్రేమ అంతరించిన మనస్సులో హింస చెలరేగుచున్నది. హింస రేగిన మనస్సులో ప్రేమ చిగురించదు. హింసాప్రవృత్తికి అలవాటుపడిన హృదయం హింసను పంచగలదే

గాని ప్రేమను దించలేదు. వెలిగే దీపమే మరియొక దీపమును వెలిగించగలదు. ప్రేమించే హృదయమే మరొక హృదయములో ప్రేమను నింపగలదు.

తాను ధనికుడై తోటి మానవులను హింసిస్తున్నా డొకవ్యక్తి. తాను సంపాదించే నాలుగు పైసలు ఇంటిలోని నలుగురి కుపయోగించక తానొక్కడే త్రాగేసి తూలుతున్నాడు మరియొక వ్యక్తి. ఈ ఇరువురిలో ధర్మరాజెవరు? దానకర్ణుడెవరు? ప్రక్కవాడిని ఒకడు పాడుచేస్తే, తనవారికే మరొకడు కీడు చేస్తున్నాడు. ఈ రెండింటిలో ఏది పాయసము? ఏది పాషాణము? వాయసము వలె వాగకుండా సామరస్య జీవనానికి పునాదులు నిర్మించగలగాలి.

ధర్మబోధ వలననే వ్యక్తిలో దయ నిండుకుంటుంది. దయగల హృదయమే ఎదుటి వ్యక్తి హృదయాన్ని తృప్తి పరచగలదు. గాయాలను మాన్పగలదు. ఈ కార్యక్రమంలో యువకులు ముందుకు నడవాలి. సమాజాన్ని నడిపించాలి.

యదిష్టం తదేవ తస్య వా ధనం.

ఎవరికి ఏది ఇష్టమో అది వారికి ధనము.

కాని,

ఏ ధనమైనా వ్యయమే. క్షయమే.

జ్ఞానధన మొక్కటే అక్షయ ధనం.

అక్షయ ధనానికి అర్హులు ధన్యులు. కృతార్థులు.

అక్షయ ధనం ఏదో కాదు, మోక్షమే.

మోక్షాన్ని పొందిన ముక్త పురుషులు ధన్యులు.

మోక్షమును కోరే ముముక్షువులు కూడా ధన్యులే.

ఒకరిది సిద్ధావస్థ

మరొకరిది సాధనావస్థ.

నిన్నటి సాధకులు నేటి సిద్ధులు. నేటి సాధకులు రేపు సిద్ధులు. పవిత్రులు. కృతార్థులు. ధన్యులు.

అట్టి ధన్యాత్ములే ధరణిలో ఆరని దీపాలు.

పాత బస్తీలో కొత్త కుస్తీ

తోసుకొంటూ తొంబైలో పడ్డాము.* తూలుతూ, తోలుతూ, బ్రతుకు బండిని తొంబైలోకి నెట్టాము. తొలిమాసపు తొలకరి ప్రారంభమవుతూఉంది. తొలిపలుకును పలికేందుకు సిద్ధ మవుతున్నాము. కనీసము ఈ ప్రత్యూషమైనా జ్ఞానజ్యోతిని వెలిగిస్తుందా? జీవనశాంతిని విరజిమ్ముతుందా?

రోజులు దొర్లిపోతున్నాయి. వార్షికములు మరలిపోతున్నాయి. బ్రతుకు మరిగిపోతున్నదే గాని మెరుగు కావడం లేదు. పాతలోని రోత తెలిసిరావడం లేదు. కొత్తలో చెత్త దూరమగుట లేదు. నూతనత్వము తెలియని వార్షికాలు ఎన్ని వచ్చినా బ్రతుకు ఎండమావిగానే మిగిలిపోతుంది. ఈ పడిగాపులు, చెడు ఊహలు మనకొద్దు. ఇకపై ఆనందతోరణాలు వెల్లివిరియాలి. ఇది మనకు సాధన సంవత్సరం కావాలి.

విన్నవి ఎన్నియో? చదివినవి మరెన్నియో? పలికినవి ఇంకెన్నియో? చాలు... చాలు.....సంగీత మొచ్చేసింది. ఎందులకు? ఆలపించేటందులకు కాదా? వ్యక్తం గాని మూగస్వరాలు ఎవరిని తృప్తిపరుస్తాయి? ఎంతో నేర్చుకున్నాము. దేనికి? ఆచరించేటందులకు కాదా? ఆచరణ లేని జీవికి అనుభవ మెలా ప్రాప్తిస్తుంది? చలనములేని బ్రతుకు ఏమి సాధిస్తుంది?

చలించినంత మాత్రాన సరిపోదు. చేతనత్వముతో చరించే స్థితిని అలవరచుకోవాలి. ఆటోమాటిక్ వాచ్ చేతిపై నిలిచి కదులుతూనే ఉంది. అనుభవమును పొందలేని ఆ యంత్రము కదలి కదలి కూలబడుతుంది. అంతే. మనిషి కేవలం నడయాడే గడియారము కాదు. నడక తెలిసి, నాణ్యత గడించే గణ్యుడు కావాలి. గమ్యము తెలిసి చరించే ధన్యుడు కావాలి.

గతం గతించినది అంటారు. ఇది నిజమా? ఇదే వాస్తవమైతే భవిష్యత్తు పూలబాటయై నిలుస్తుంది. గతం గతించలేదు. అది పొయ్యిలో పడి కాలిపోలేదు. నుయ్యిలో పడి మునిగిపోలేదు. మనస్సులో ఊరుతూనే ఉంది. బుద్ధిలో తేలుతూనే ఉంది. క్రొత్త చింతకాయ లొచ్చినా పాత పచ్చడియే మిగిలియుంది. ఆలోచించండి.

నూతన సంవత్సర మనగానే నూతన ప్రణాళికలు, నూతన పథకాలతో కదలాలి యని ప్రతి ఒక్కరూ తీర్మానించుకొంటూ, తీర్పు చెప్పుకొంటూ ఉంటారు. దీనివలన బ్రతుకులో మార్పు రావడంలేదు. రాదు కూడా. క్రొత్తదనం క్రొత్త విషయాలలో లేదు. పాత చెడులు చిగురించకుండా చూసుకోవడంలో ఉంది. పాతబస్తీలో కొత్త కుస్తీ నేర్చుకోవడంలో ఉంది.

పాతమోతలను వదలకుండా క్రొత్త పుంతల నెలా త్రొక్కాలి? ఇది అసంభవము కాదా? అని మీరు ఆలోచించవచ్చు. పాతక్రొత్తల కలయికే జీవితం అనే నగ్నసత్యాన్ని విస్మరించేందుకు వీలులేదు. జీవితమొక క్రీడారంగము. ఆట సాగుతూ ఉంది. ప్రతిపక్షము కొంత ఆధిక్యతలో ఉంది. అలాగని క్రీడాకారుడు నీరసపడతాడా? వేగముతో

* ఇది 1990 నూతన సంవత్సరం సందర్భంగా స్వామీజీ వ్రాసిన వ్యాసం.

సాగి విజయమును పొందేందుకు యత్నిస్తాడు. ఇదీ అంతే. గతంలోని పొరపాట్లు తిరిగి జరుగకుండా చూసుకొంటూ ముందుకు దూసుకుపోవడంలో అందముంది. ఆనందముంది.

క్రొత్త తీర్మానా లవసరము లేదు. పాతను పరిశీలించుకోవాలి. సాధ్య రూపుడైన పరమాత్మను గూర్చి ఆలకించాము. కానీ సాధనను ఆరంభించలేక పోయాము. కోపాలు తగనివని విన్నాము. కానీ ఎదురైన వారందరిపై శాపాలను క్రుమ్మరించాము. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుర్తించాము. కానీ కాలాన్ని వృథా చేయడములో బుద్ధిని వినియోగించాము. ప్రగతిని ఊహిస్తూ పతనంలో కాలు మోపాము.

జరిగిపోయింది. వత్సరం కదలిపోయింది.

వగచి సాధించే దేముంది? వలచి సాగడంలోనే ప్రగతి నిలిచి ఉంది. క్రొత్త విషయాలలో క్రొత్తదనము లేదు. పాతవి తొంగి చూడకపోతే మిగిలిన దంతయూ క్రొత్తదనమే.

కాలాన్ని వృథా చేయకండి. కర్మలను సరిజేసుకుందాం. ఎక్కువ కాలాన్ని జప ధ్యానాదుల యందు గడుపుదాం. దోషాలు చూడకుండా జీవిద్దాం. ప్రేమిస్తూ బ్రతుకుదాం. కలిసి జీవించే నేర్పును అలవరచుకుందాం.

కొండను మోసిన కమనీయమూర్తి మనకు అండగా ఉన్నాడు. నిండు మనస్సుతో, కొండంత తృప్తితో దండిగా జీవించడమే మనం నేర్చుకోవాలి.

పరిశీలించండి. ప్రయత్నించండి. బలహీనతలను పూడ్చిపెట్టండి. సత్య ప్రేమలను అందల మెక్కించండి. ఆదర్శముగా జీవించండి. ఆనందముతో శోభించండి.

పద్మనేత్రా! మేము పండితులం కాము.
చూచి తరించేవారమే గాని చవిచూచి ఆస్వాదించలేము.
పాడే పెదవులు నీవి.
కాపాడే పదవులు నీవి.
మా బ్రతుకులు దారుణం.
మా ప్రారబ్ధమే కారణం.
తిమిరంలో తారాడే మేము తీరాన్ని చేరగలమా?
తాపంతో ఉన్నామే గాని పాపం తెలిసిన వారము కాము.
మేము పాపులం కాము
నీ పాపలం. నీ గుడి ముంగిట కాపులం.
పాలిచ్చే భారము నీదే
మము పాలించే బాధ్యతా నీదే.
మాకున్నది ఆర్ద్రతే......రక్తే.......అనురక్తే........భక్తే.......పరాభక్తే.......

అవకాశం ఇస్తేనే అలజడులు

తాను ఉన్నది ఎక్కడ? అని కాకుండా, తనలో ఉన్నది ఏమిటి? అనెడి విషయాన్ని దర్శించగలిగిన వారు అభివృద్ధిని సాధిస్తారు. తనకు ఏమి ఉంది? అని కాకుండా, తాను ఎలా ఉన్నాడు? అని ఆలోచించుకొనే వ్యక్తి ప్రగతిని పొందుతాడు.

మనకు ఏవైనా ఉండొచ్చు. అవన్నీ మన మనస్సులో ఉండనవసరం లేదు. ఉన్నవన్నీ మనస్సులో నింపుకుంటే అవి దూరమైన నాడు వాటిని మనస్సులో దూరం చేసుకోగలమా? భౌతికంగా దూరమై, భావంలో దూరం కానివి బుద్ధికి బరువవుతాయి. బ్రతుకుకు భారమవుతాయి.

ఉన్నవి ఏవైనా పోయేందుకే ఉన్నవి. ఉన్నంతవరకే వినియోగము. మితిమీరిన సాంగత్యాలు మిగిల్చేవి సంతాపాలే. ఉన్నవాటిని కుదించుకో నవసరం లేదు. వాటి విలువలను మదింపు వేసుకొని బ్రతకాలి.

గృహాన్ని త్యజింప నవసరం లేదు. గృహాసక్తిని త్యజించాలి. గృహమంటే ఇల్లేకాదు; ఇంటిలోని వస్తువులు, వ్యక్తులు అన్నీ కలిసి గృహం. కేవలం ఇటుక, సున్నం, సిమెంటు, ఆకాశము ఇవే గృహము కాలేవు. ఇవన్నీ అవసరాలే. ఆసక్తి స్థానాలు కాకూడదు. ఈ ఆశలే ఒకనాడు మనో గగనంలో నిరాశా గాలుల్ని భయంకరంగా కదిలిస్తాయి. లేని విలువల్ని ఊహించటం అలవాటైతే ఉన్న కొద్దిపాటి శాంతి కూడా చేజారిపోతుంది. వాస్తవాన్ని మదింపు వేయగలిగితే అవాస్తవాలు మనస్సు నుండి దూరమవుతాయి. రాగం తగ్గుతుంది. రాగం ఎంతగా తగ్గుతూ ఉంటుందో విరాగం అంతగా పెరుగుతూ ఉంటుంది. ఇదే వైరాగ్యం.

ఉన్నవాటిని త్యజించటం వైరాగ్యం కాదు. అవసరం కాని వాటిని మనస్సులో ప్రవేశించకుండా జాగ్రత్త వహించటం వైరాగ్యము.

గృహం బాధించదు; గృహాసక్తి బాధిస్తుంది. కాంత కలతపెట్టదు; కాంతాసక్తి కలత పెడుతుంది; ధనం కలవరపెట్టదు; ధనాసక్తి కలవరపెడుతుంది. ఏవైనా ఇలాగే ఉంటాయి. అవకాశం ఇస్తేనే అలజడులు. అర్థం చేసుకుంటే అన్నీ కదిలే అలలే. కరిగే కలలే.

ఈ విధమైన అవగాహన అవసరం లేనివాటిని బ్రతుకు నుండి తొలగిస్తుంది. అవసరాలను గుర్తిస్తుంది. ప్రగతికి సోపానాలను నిర్మించుకుంటుంది. పతన హేతువులను దూరం చేస్తుంది **(అధోగతి హేతుభూతమ్).**

అనువు గాని తను వెందుకు?

త్యాగము లేనిదే అమృతత్వము సిద్ధించదు. త్యాగము యొక్క పూర్ణ స్వరూపమే సన్యాసము. త్యాగమనగా వదలుట యని అర్థము. చక్కగా వదలగలిగితే సన్యాస మవుతుంది. అలాగని ఉన్న ఆస్తిని, భూమిని, సంపదను త్యాగం చేయటం సన్యాసమని భ్రమించకూడదు. అనంతరూపుడైన పరమాత్మను ఆలింగనం చేసికొని దివ్యానుభూతి నొందే ప్రయత్నములో అడ్డు నిలిచే అజ్ఞాన రూపాలను, భావాలను వదలుటయే నిజమైన త్యాగము.

సంసారాలను త్యజించి కొందరు సన్యాసమును స్వీకరిస్తారు. సంసారము వారికి దూరమౌతుంది. కానీ సంసారాన్ని దూరం చేసుకున్నాననే భావన దగ్గరే ఉంటుంది. అందుచేత వారి సన్యాసము మెడలో గుదిబండలా ఉంటుంది. మరీ మోయలేని స్థితిలో ప్రక్కన బెట్టే పరిస్థితి ఉంటుంది. ఈ సందర్భాలలోనే బ్రతుకు ప్రక్కకు నెట్టబడుతుంది.

ప్రపంచములో ఏదీ మనల్ని పట్టుకోకుండా ఉండాలి. వాటేసుకున్న దేదైనా కాటేసే వెళ్తుంది. కాచియుండుటయే మన పని, కాపలాకాయుటయే మనదైన పని. బాహ్యము నందలి సంసారము ఎవరినీ బాధించదు. మనస్సులో కదిలే సంసారమే మారణహోమాన్ని తయారు చేస్తుంది. తనకు లేనిదానిని ఆశించేవాడు దుఃఖపడుతాడు. తనకున్న దానిపై మమకారమును వీడినవాడు సుఖపడుతాడు.

కొమ్మల నెన్నిటిని ఛేదించినా మొదలు జీవంతో ఉంటే చాలు. కొమ్మలు వాటంతటవే చిగురిస్తాయి. మొదలును కూడా పెకలించాలి. దేనినైనా త్యాగం చేయవచ్చు. సమస్త బంధాలను ఛేదింపవచ్చు. కానీ దేహాత్మభావమనే మొదలును ఛేదించలేకపోతే సమస్త త్యాగాలు వృథా అవుతాయి. నేను దేహమనేడి భావనను విస్మరించి, సచ్చిదానంద రూపమైన ఆత్మనే నేను యనెడి భావము స్థిరపడనంత వరకు మన మాచరించే త్యాగాలేవీ సన్యాసానికి సోపానాలు కాలేవు.

విద్యుచ్ఛక్తి ఉంటేనే బల్బులో కాంతి. ఆత్మ ఉంటేనే దేహంలో కర్మలు. మన జననము, జీవనము, మరణము అన్నీ ఆత్మ వల్లనే జరుగుతున్నాయి. దానిని గుర్తించి గ్రహించాలి. ఆత్మను ఎక్కడనుండో తెచ్చి, హృదయంలో కూర్చోబెట్టి తాళం వేయాలనుకోవడం శుద్ధ పొరపాటు. మన ఆంతర్యంలో సదా భాసించేదే ఆత్మ. దానిని గ్రహించుటయే జ్ఞానము. ఈ జ్ఞానము మనకు కలిగితే చాలు. ఆ క్షణము నుండి మనము ఆనంద స్వరూపులము కాగలము. మన శాంతిని ఎవ్వరూ భగ్నం చేయలేరు. రేపు అనెడి ఆలోచన ఉదయించదు. సంకల్ప సుడిగుండ మేర్పడని నిత్యానంద రసప్రవాహము ఆంతర్యంలో ప్రవహిస్తుంది. అనుక్షణము ఆత్మయే దర్శనీయ మవుతుంది. ఇచ్చట యత్నము ఉండదు. ప్రయత్నము తెలియదు. ప్రమోదమే ప్రశస్తమై యుంటుంది.

విన్నంత మాత్రాన జ్ఞానం కలుగదు. ఆంతర్యంలోని అయోమయ ఘోష వినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటేనే లబ్ధి కలుగుతుంది. సభలు నిర్వహించినంత మాత్రాన శాంతి లభించదు. నిర్వాహకులు తమలోని అహంకార నిర్వాకమును వదలలేక శాంతి పేరుతో అశాంతి సభలనే నిర్వహిస్తున్నారు. ఆంతర్యంలో అవగాహన పెరగాలి. నిరంతరం ఆత్మధ్యానము కొనసాగాలి. దేహచింత దూరమై దైవచింత చేరువ కావాలి. ఆ క్షణం నుండే త్యాగము. ఆ తరువాత అంతా సన్యాసమే.

పెరిగే దేహము ఒకనాడు కరిగిపోతుంది. శ్మశానంలో తరిగిపోతుంది. అరిగిపోయే వాటిలో అందమేముంటుంది. అరగని రూపం, ఆరని దీపం ఆంతర్యంలో దర్శింపబడాలి. దేహము అందుకే ఉపయోగపడాలి. అనువుగానిచో తనువు నెందుకు పెంచినట్లు?

ఇందుకా యీ తనువును బెంచిన ॥ దిందుకా ॥
నీ సేవకు లేక - నీదు చెంతకు రాక
ఆస దాసుడై అటునిటు తిరిగే ॥ టందుకా ॥
నీవాడను పేరు, నిందు వహింపక
నావాడని యముడు నవ్వుచు బాధించే ॥ టందుకా ॥

అని త్యాగరాజ స్వామి వినిపించాడు. త్యాగానికి అలవాటు పడిన ఆధ్యాత్మిక చక్రవర్తులందరూ ఈ సత్యాన్నే వినిపిస్తారు. అనేవాడు వినినవాడై యుండాలి. వినేవాడు ఒకనాడు అనగలగాలి.

జ్ఞానం శ్రవణం వలన కలుగుతుంది. **(ఆత్మవా అరె శ్రోతవ్యః)** పరమాత్మ దర్శనానికి కళ్ళు మూసుకొని కూర్చోవలసిన పనిలేదు. కళ్ళు మూసుకుంటేనే జ్ఞానం కలిగేటట్లయితే ఈ ప్రపంచంలో గ్రుడ్డివాళ్ళందరూ జ్ఞానులే అవుతారు. కనిపించే ప్రపంచ మంతా పరమాత్మే. ఒకవేళ సాధకుడు కొంతసేపు కళ్ళు మూసుకొని కూర్చున్నా, అది సత్యాన్ని అర్థం చేసుకొంటూ నిర్ధారణ చేసుకొనేందుకే గాని ప్రపంచాన్ని నిరాకరించేందుకు కాదు. ప్రపంచంకన్నా అన్యంగా పరమాత్మను దర్శించేందుకు కాదు.

అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః

"కళ్ళు మూస్తే లోపల అదే. కళ్ళు తెరిస్తే బయట అదే. కళ్ళు మూస్తూ తెరుస్తూ ఉండినా మధ్యలోనూ అదే".

లోభం కాదెన్నడూ లాభం

లోభము విచిత్రమైన గుణము. లోభి విడ్డూరమైన వ్యక్తి. లోభివానికన్నా దోభియే నయం. మలిన వస్త్రాలను శుభ్రపరచేవాడు దోభి. శుభ్రంగా యున్న ధనరాశులను దాచియుంచి మలిన పరచేవాడు లోభి. దోభి తనవద్ద ఏదీ ఉంచుకోడు. లోభి తనదంటూ ఏదియు ఖర్చుపెట్టడు.

లోభివాని ప్రవృత్తి చిత్రమైనది. తాను ఏ మంచిపని చేయలేడు సరిగదా చేసే వానిని చూసి కూడా ఓర్వలేడు. తన సంపదతో మురిసిపోవడంకన్నా, మెరిసిపోయే ఇతరుల సంపదను గాంచి కురిసే కన్నీళ్ళను ఆపుకోలేడు. వారి కలిమి కూడా తన ఇంటిలో కులికితేనే బాగుంటుందని అభిప్రాయ పడుతుంటాడు. మేఘము వర్షిస్తున్నదని దుఃఖిస్తాడు. వాడే లోభి. ఊహలకు అందని ఊరపిచ్చుక. అనవసరంగా నీటిని మేఘము నేలపాలు చేస్తున్న దని దుఃఖిస్తాడు. నేలకు, నింగికి ఉండే సంబంధము నీతిబాహ్య సంకల్పాలతో వంగి, అసూయా ద్వేషాలతో క్రుంగే ఈ వ్యక్తికి ఏమి అర్థమవుతుంది? పరోపకార జీవనము, సామరస్య దృక్పథము అతనికి తెలిసివచ్చేది ఎప్పుడు?

లోభము ఒక దుర్గుణము. ఇది పోగొట్టుకోమని తెలిపేందుకే నిత్యము బిచ్చగాడు మన గృహానికి వస్తాడని శాస్త్రము చెబుతుంది.

భిక్షుకా నైవ భిక్షన్తి బోధయన్తి గృహే గృహే అదాన దోషేణ భవేద్దరిద్రః

గత జన్మలలో ఏ దానము చేయని దోషానికి నేను దరిద్రుడ నయ్యాను అని తెలిపేందుకే బిచ్చగాడు వస్తాడు అని శాస్త్రము లోభివాని చెంపను వాయించింది. “అయితే ఏమి? చెంపను సముదాయించేందుకు చేయిలేదా?” అనుకుంటాడు. వాడే లోభి. కాలప్రవాహంలో మనతోడు నడిచేవా రెవ్వరూ లేరు. దేనిని పట్టుకొని యున్నామో దానిని వదలిపెట్టక తప్పదు అనేది జీవనసత్యం. మితిమీరిన ఆశలు, మతి చెడిన ఊహలు మనిషికి గతి లేకుండా చేస్తాయనే నగ్నసత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

వదిలే ఇచ్ఛలేని దుర్గుణమే లోభము. ఇది వస్తువులతో సరిపోదు. విషయాలతో ఆగిపోదు. బ్రతుకునే విషతుల్యంగా మార్చుతుంది. త్యజించే అలవాటు లేని లోభము అజ్ఞానమును గూడా వదలకుండా పట్టుకుంటుంది. దేహాభిమానమును దూరము కానివ్వదు. అహంకారమును ఆవలికి నెట్టదు. ఇది పెద్ద ప్రమాదమై కూర్చుంటుంది. అందుచేతనే కృపణుడు అను పదమునకు లోభియనే సామాన్య భావమే గాక అజ్ఞానమును త్యజించలేని అయోమయ వ్యక్తి అని కూడా ఉపనిషత్తు నూతన నిర్వచనమును చేసింది.

లోభమును త్యాగముతో జయించాలి. వచ్చిన నీటిని ఆపుకోకుండా ముందుకు పంపుతున్నందున నది నిర్మలంగా ఉంది. త్యజించక నిలుపుకోవటం వలన కూపము మలిన పడుతూ ఉంది. మలినయుత మైనందున లోభము అజ్ఞానమునకు ప్రతీకము. నిర్మల మైనందున త్యాగము జ్ఞానమునకు ప్రతిరూపము.

నిద్ర లేపే నిజాలు

జీవన రహదారిలో ప్రయాణం ఊహించినంత సులభం కాదు. బాట అందరిది. అందరూ బాటసారులే. పదిమంది నడచే బాటలో కలిసి ప్రయాణం చేసినా బాధే. ఒంటరిగా నడచినా బాధే. బహుదూరపు ప్రయాణంలో దుఃఖమే నిత్య స్నేహితుడు. ఈ సత్యాన్ని తెలిసి జాగ్రత్తగా ప్రయాణం చేసేవారు ఆపదలకు గురికారు. ధూర్తులకు దూరం కాలేరేమో గాని దుఃఖానికి మాత్రం దూరమవుతారు. బుద్ధిలేని బాటసారి మాత్రమే దారిలో అనవసరంగా దుమ్మురేపుతాడు. చెడుగా పలవరించడం, చెడుగా ప్రవర్తించడం మాత్రమే తెలుసు మనిషికి. బండి చక్రము ఆ బండిని లాగే ఎద్దును అనుసరించునట్లు, చెడుజీవనానికి అలవాటు పడిన మొద్దును దుఃఖము అనుసరిస్తూ ఉంటుంది. చెడు యొక్క ఫలితము రానంత వరకు చెడులోనే మనిషికి మంచి కనిపిస్తుంది. ఫలితం వచ్చినప్పుడు దాని భీకరాకృతి తెలుస్తుంది.

పంట నంటియున్న కలుపు పంటనే పాడుచేస్తుంది. మనస్సు నంటియున్న ద్వేషం ఆ మనసునే దగ్ధం చేస్తుంది. మంచిగా బ్రతకడం మనిషికి భగవంతుడు ప్రసాదించిన వరం. మంచి చేయడానికి ఆలస్యం చేస్తే ఈలోగా మనసు చెడు నాచరించి తీరుతుంది. నిలువబెట్టిన పెరుగు పుల్లగా మారుతుంది. మనసులో నిలిచిపోయిన ద్వేషం బ్రతుకునే అమాంతం చేదుగా మార్చుతుంది.

ఈ చెడులు-చేదులే సమాజంలో ఎక్కువగా ఉంటాయి. అసూయలుంటాయి. వాటికి ఆడిపోసుకోవడమే తెలుసు. ద్వేషాలుంటాయి. అవి మోసాలకు వెనుకాడవు. ఈ మందలు నిందలు వేసేందుకే అలవాటు పడి ఉన్నాయి. బుద్ధ భగవానుడు ఇలా అంటాడు.

"This is an old saying, Atula, it is not a saying of today. They blame the man who is silent, they blame the man who speaks too much; and they blame the man who speaks too little. No man can escape blame in this world".

“అతులా! ఈ సూక్తి ఈనాటిది కాదు. ఇది ప్రాచీన సూక్తి. అసలే మాట్లాడని వ్యక్తిని లోకులు నిందిస్తారు. అతిగా మాట్లాడే వ్యక్తినీ నిందిస్తారు. అతి తక్కువగా మాట్లాడే వ్యక్తినీ నిందిస్తారు. ఈ ప్రపంచంలో ఎవ్వరూ నిందను తప్పించుకోలేరు”.

‘నింద’ యొక్క తత్వం ఆలోచిస్తే బహు అందంగా ఉంటుంది. నింద వ్యక్తిగతమైన సమస్య. ఒక వ్యక్తి లేదా కొందరు నిన్ను నిందించవచ్చు. అంతమాత్రాన ఒరిగిందేమిటి? జరిగిందేమిటి? నిందించడం ఆ వ్యక్తి లక్షణం. అతని స్వభావానికి నీవు బాధపడటం దేనికి? ఒకవేళ నీవు లేవనుకో. మరొకరిని ద్వేషిస్తాడు. ఎవరూ లేకపోతే, తననే తాను ద్వేషించుకుంటాడు. కట్టెలోని అగ్ని కట్టెను దహించివేయునట్లు మనిషిలోని ద్వేషం మనిషినే దహించివేస్తుంది. అసూయల మధ్య, ద్వేషాల మధ్య, ఈర్ష్యల మధ్య ఆనందంగా జీవించడం అలవడితే ఆధ్యాత్మికత వంటబట్టిందని అర్థము.

నీవు చెడ్డవాడివైతే ఎవ్వరూ నిన్ను విమర్శించరు. ఎందుకని? ఆ పని నీవూ చేస్తావు గనుక. నీవు మంచివాడి వైతే నీ మంచితనం సమాజంలో నీ ఖ్యాతిని పెంచుతుంది. పెరిగే ఖ్యాతి దుష్టులలో ద్వేషాన్ని పెంచుతుంది. ప్రసిద్ధిని గాంచి తృప్తి చెందే బుద్ధి బుద్ధిహీనుల కెందుకుంటుంది? ఖ్యాతిని, అపఖ్యాతిని రెండింటిని ప్రక్కకు నెడితే శాంతి చేరువవుతుంది.

నిందలేసే మందమతుల నుండి మహాత్ములు కూడా తప్పించుకోలేరు. అవతార పురుషులు కూడా తప్పించుకోలేరు. అంతమాత్రాన వారి ఖ్యాతి వక్రించిందా?

హోరుగాలికి ఎదురుగా నిలబడి దుమ్మెత్తి పోస్తే తిరిగి ఆ దుమ్ము పోసినవాడి కళ్ళలోనే పడుతుంది. హోరున గాలి వీచినా, జోరున వాన కురిసినా పర్వతం చలించదు. సమాజము మెచ్చుకున్నా, నొచ్చుకున్నా జ్ఞాని చలించడు. భక్తుడు చలించకూడదు. నిందాస్తుతులు అతన్ని తాకలేవు. భగవంతుడు మనిషికి మాట్లాడే శక్తినిచ్చాడు. వ్యర్థప్రలాపాలకు అలవాటుపడిన వ్యక్తి వృథాగా మిగిలిపోతాడు.

వ్రాయడం ఒక కళ. కొందరు రాతలు తుడిచే వ్రాతలు వ్రాస్తారు. కొందరి వ్రాతలు మంచి మనసులపై వాతలు పడేస్తాయి. ఏం చేద్దాం? కలం తప్పుచేయదు. కాగితం దోష మెరుగదు. కలి దూరిన మనసు నుండి కల్మషాలు తప్ప మరేమి కదుల్తాయి?

అవగాహన పెరిగితే నిందాస్తుతులు, మానావమానాలు, సుఖదుఃఖాలు నిన్ను స్పృశించలేవు. ఉండి బాధించేది దుఃఖం. లేక బాధించేది సుఖం. బాధించే లక్షణాలు రెంటికీ ఉన్నాయి. రెండిటిని దాటేస్తే- అంతా ఆనందమే.

సన్మానాలలో వెల్గొందేవాడు విద్వాంసుడు.

మానావమానాలలో శోభించేవాడు సాధువు.

సాధువు కాగలిగితే నీకు బాధ లెక్కడివి?

విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. వాటిని పరామర్శించడం పతనహేతువు అవుతుంది. పలవరించకుండా, పలకరించకుండా పర్యవేక్షిస్తూ ప్రయాణం సాగించాలి.

స్టీరింగు నెవ్వరైనా పట్టుకోగలరు. ప్రమాదమునకు గురికాకుండా నడుపుకు పోయేవాడే మేటి డ్రైవరు. జీవన రహదారిలో విమర్శల రాళ్ళగుట్టలు తప్పవు. చాకచక్యంతో బండిని నడుపుకుపోవాలి. అవగాహన పెరిగితే అవరోధాలు తొలగినట్లే.

విమర్శలు ఎవరినీ విడువవు. వాటిని పరామర్శిస్తూ పోతే నీవు ప్రగతిని సాధించ లేవు. నీవు సాధకుడివి. సాధనే నీ ప్రధానలక్ష్యం కావాలి.

గాలి వీచేవి మాకులు.

గోల చేసేవి కాకులు.

మాకుల్లా ఊగిపో నవసరం లేదు. కాకుల్లా ఊరేగ నవసరం లేదు.

హంసలా జీవించడమే మన కర్తవ్యం.

పరమహంసలా తరించడమే మన ధర్మం.

శ్వాసపై విశ్వాసమా?

అంత మెక్కడో తెలియని మానవుడు జీవితము ఎంతో ఉందని భ్రమిస్తూ, వింత వింత పోకడలతో కాలాన్ని వృథా చేసుకొంటూ ఉంటాడు. కాలము చాలా విలువైనది. కాలుని నోటపడక ముందే నావ తీరాన్ని చేరేలా చూసుకోవాలి. మానవుని పూర్ణ ఆయుర్దాయము వంద సంవత్సరాలు. అందులో సగ భాగము అనగా యాభై సంవత్సరాలు నిద్రించడములో కారిపోతూ ఉంది. నిద్రించు సమయాన మనిషికి బండకు తేడా ఏమున్నది? జడరూప వస్తువు వలె యాభై సంవత్సరాలు నిరర్థక మగుచున్నవి. ఇక మంచి చేసేందుకు, సంచితమును క్షాళనం చేసేందుకు యాభై సంవత్సరములు మాత్రమే మిగిలి ఉన్నవి. ఇందులో సగభాగము అనగా ఇరవై అయిదు సంవత్సరములు బాల్యము నందును, వృద్ధాప్యము నందును గడిచిపోతున్నాయి. బాల్య వృద్ధాప్యములు రెండునూ ఇతరులపై ఆధారపడి జీవించవలసిన దశలు. బాల్యంలో తనను కన్నవారిపై ఆధారపడాలి. వృద్ధాప్యంలో తాను కన్నవారిపై ఆధారపడాలి. ఇక కేవలము ఇరువదిఐదు సంవత్సరములు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి కూడా శారీరక వ్యాధులతో, మానసికమైన వియోగబాధలతో, భౌతికజీవన దుఃఖముతో, కుటుంబ శోకముతో కరిగిపోతున్నాయి. ఎక్కువకాలము భుక్తికొరకు ఇతరులను సేవించుటలో నిరుపయోగ మవుతూ ఉంది. ఇక మంచితనాన్ని పెంచుకొనేందుకు, మనిషితనాన్ని తనలో దించుకొనేందుకు మానవునికి సమయ మెక్కడుంది? "చేద్దాములే - చూద్దాములే" అంటూ పలవరించటం తప్ప. నీటి బుడగలాంటి బ్రతుకుపై మానవునికి ఎంత విశ్వాసము? ఇంతకన్నా భ్రాంతి మరియొకటున్నదా?

కాలం ఎవ్వరినీ కనికరించదు. కాలరూప సుడిగుండానికి ఆహుతి కాకూడదు. కాలాన్ని వినియోగించుకోవాలి. కదిలే ప్రతి క్షణమూ పరమాత్మతో నిండియున్నదో లేదో ఆలోచించుకోవాలి. ప్రవాహం చాలా తీవ్రమైనది. ప్రస్థానము ప్రసన్నముగా ఉందోలేదో చూసుకోవాలి.

దర్పణము - దర్శనము

ఒక అద్దము మరొక అద్దమును ప్రతిబింబించి నపుడు వాటిలో దేనిని ఏది ప్రతిబింబిస్తున్నది?

"స్వామిజీ! మీరు సాధువులని మేము నమస్కరిస్తే ఆశీర్వదించకుండా మాకు ప్రతి నమస్కారం చేస్తారేమిటి?" అని. భక్తులు పలికినపుడు ~~ఈ~~ అద్దమే నా ముందు అద్దంలా నిలుస్తుంది. బ్రతుకుకు అద్దం పడుతుంది. అర్థం చెబుతుంది.

జీవన చదరంగం

మనది చర్చల వేదాంతం కాదు. చేతల వేదాంతం. అనితర సాధ్యమైన అమోఘ కార్యాలను సాధించే భారాన్ని పరమాత్మ మనకు అప్పగించాడు. ఆనందంతో ముందు కురకడమే తక్షణ కర్తవ్యం.

గతాన్ని విస్మరించడం భవిష్యత్తును పాడుచేసుకోవడమే. గతాన్ని ద్వేషిస్తే భవిష్యత్తుకు రూపం రాదు. భూతభవిష్యత్తుల్ని వర్తమానంలోకి లాగడమే ఉత్తముల కర్తవ్యం. కాలానికి అతీతులై జీవించడం విజ్ఞుల వైభవం.

మంచిచెడుల మిశ్రమమే ప్రపంచం. జీవితం కూడా. ఎప్పుడూ తనకు మంచే జరగాలని మనిషి కోరుకుంటాడు. ఈ ప్రపంచంలో చెడు కూడా వినియోగంలో ఉంది. మంచే జరగాలి అనుకోవడం అంత మంచిది కాదు.

ఏది మంచో? ఏది చెడో? ఏది ధర్మమో? ఏది అధర్మమో?... వర్షం ఎంతో మేలు చేస్తుంది. అదే వర్షం పంటను పాడుచేయడమే గాకుండా, ప్రాణాల్ని కూడా తీసేస్తుంది కొన్ని సమయాల్లో.

సోదరుడని కూడా భావించక దుష్టుడైన రావణుణ్ణి వదలి రాముని వద్దకు వచ్చాడు విభీషణుడు. రాముని గెలుపుకు కారణమయ్యాడు. ఇది రామాయణం.

సజ్జనులైన పాండవులను వదలి దుష్టుడైన దుర్యోధనుని ప్రక్క నిలబడి యుద్ధం చేశాడు భీష్ముడు. దుర్యోధనుని ఓటమిని చూశాడు. ఇది మహాభారతం.

భీష్మవిభీషణులు ఇద్దరూ ధర్మాత్ములుగనే స్తవనీయులయ్యారు. ధర్మాధర్మాల విశ్లేషణము అంత సులభమైన విషయం కాదు. ద్వంద్వాలలో అందాలను నింపుకోవడం కష్టం. అవి వెలుగునీడలు. బ్రతుకుకు రెండు అంచులు. పరస్పరాధీనాలు. కాల నర్తకి ప్రదర్శించే విచిత్ర నాట్య భంగిమలు.

The white head and the black tail of the mystic dark

కారుచీకట్ల కాలభుజంగానికి తల తెలుపు - తోక నలుపు. ఇవే దివారాత్రాలు అంటాడు అరవింద యోగి.

ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతః స పన్థాః

"ధర్మం యొక్క స్వరూపము నిగూఢమైనది. మహాత్ములు నడచిన బాటయే మిగిలిన వారికి శ్రీరామరక్ష" అన్నది భారతము.

కాలాన్ని వాడుకోవాలి కాని కాలంతో ఆడుకోకూడదు. వాడుకలోనే ఉంది వేడుక. కాలమనేది అంతుపట్టే విషయం కాదు. అదొక భయంకర ప్రవాహం. సుడులు తిరుగుతూ

పరుగులిడే కాలప్రవాహంలో ఆశల దీపాలు ఆరిపోయేవే. బాంధవ్య నౌకలు పారిపోయేవే.

అస్మిన్ మహా మోహమయే కటాహే
సూర్యాగ్నినా రాత్రి దివేన్ధనేన
మాసర్తు దర్వీ పరిఘట్ట నేన
భూతాని కాలః పచతీతి వార్తా!

"ఈ ప్రపంచము మోహముతో నిండిన పెద్ద బాన. దీనికి రాత్రిపూట అగ్ని, పగటి పూట సూర్యుడు నిప్పుగా ఉన్నారు. మాసాలు, ఋతువులు అనే తెడ్డుతో కలియ బెడుతూ కాల పురుషుడు జీవులను వండుతున్నాడు. ఇదియే తాజా వార్త" అన్నది మహాభారతము.

క్షణంలో గండం. నిముషంలో మరణం. ఇదీ ప్రపంచంలో చదరంగం. క్షణం కూడా వృథా గాకుండా సన్మార్గంలో చరించడమే మన తక్షణ కర్తవ్యం.

సత్యమేవ జయతే.

రెండు ఉండటము ద్వైతము కాదు. అద్వైతము కాకుండానూ పోదు. భిన్నత్వ ముంటేనే ద్వైతము. భేదము ఉంటేనే ద్వైతము. రెండు కళ్ళున్నాయి. కాని, చూపు ఒక్కటే కదూ? రెండు పెదవు లున్నాయి. కాని, నవ్వు ఒక్కటే. రెండు చేతులు జోడించి ఒక నమస్కారం చేస్తున్నాము. ఇవన్నీ ద్వైతంగా కనబడినా అద్వైతము. ద్వైత ముంటే తప్పు లేదు. భేద ముంటేనే భ్రాంతి.

భేదమును శాస్త్రము అంగీకరించదు. తర్కము సమ్మతించదు. అనుభవము ఒప్పుకోదు. అఖండాత్మలో భేదములు అనూహ్యము. సృష్టికి అన్యంగా ఉండి సృష్టికర్త సృష్టి చేయలేడు. కనుక సృష్టి - సృష్టి కర్త ఒక్కరే. అలాంటప్పుడు జీవాత్మ పరమాత్మ కాకుండా ఎలా ఉండగలడు? కనుక **"అయమాత్మాబ్రహ్మ"** ఈ జీవాత్మయే పరమాత్మయని వేదము మహావాక్యము నందించింది. జీవ బ్రహ్మలు ఒకటే అయినపుడు బ్రహ్మ జగత్తులు ఒకటే అయినపుడు, జీవ జగత్తుల మధ్య భేదమెలా సాధ్యం? కనుక జీవ చైతన్యమే జగద్రూపంలో ఉంది. అంతయూ అఖండాత్మయే. ఇదియే సర్వవేదాంత సిద్ధాంత సార సంగ్రహము. సర్వశాస్త్రముల 'ఏకవాక్యతా' ఇదియే.

వెతలే వెలుగులు

ఆపదలు ఆటంకములని చాలామంది భావిస్తుంటారు. ఆపదలు ప్రగతికి ఆటంకములు కావు. అవి భగవంతుని నుండి మనకు లభించే ఆశీర్వాదాలు. బ్రతుకు బాటను కనుబరచే మణిదీపికలు. వెలుగు బాటను చూపే దివిటీలు.

బాధలు తెలియని బ్రతుకు బాగుపడదు. కష్టాల వాగు ఉండేది మనము కూరుకపోయేందుకు కాదు. ఈది బయట పడేందుకు. గత కర్మానుసారంగా వెతలు చుట్టుముడుతాయి. అంత మాత్రానికి భీతి ఎందుకు? సంచిత కర్మాగ్నిని ఆర్పేందుకు భగవత్కృప అనే జలము లేదా? శ్వాసపై విశ్వాస ముండకూడదు. విశ్వాసములో శ్వాస కదలాలి. విశ్వనాథుని అనుగ్రహ ఛత్రము మనలను కాపాడుతుందనే దృఢ విశ్వాసము కలగాలి.

బాధలు రాగానే కలత చెందే దురలవాటును సాధకుడు విడనాడాలి. భక్తులందరూ బాధలను అనుభవించినవారే. పిల్లవాడైనను ప్రహ్లాదుడు పెద్ద బాధల ననుభ వించాడు. బాధల మధ్యనే కుంతికి బోధ దొరికింది. బోధ అర్థమైనందున మీరా విషపానము చేసేందుకు కూడా వెనుకాడలేదు. భార్యను పోగొట్టుకొనినపుడు కూడా నరసీమెహతా నామగానము నాపలేదు.

సుఖాలకన్నా మనకు కష్టాలే మేలు చేస్తున్నాయి. ముక్తికి సోపానములై నిలుస్తున్నాయి. పుణ్యకర్మ ఫలితంగా సుఖము అనుభవమునకు అందుతుంది. సుఖము ననుభవించగనే పుణ్యము తరిగిపోతుంది. పాపకర్మాచరణ ఫలితంగా బాధలు కలుగుతాయి. బాధల ననుభవించగనే పాపములు ప్రక్షాళన మవుతాయి. పుణ్యము కరిగిపోవడము మంచిదా? లేక పాపము క్షాళనము కావడము మంచిదా? ఇలా ఆలోచిస్తే సుఖములకన్నా దుఃఖములే మనకు మేలు చేస్తున్నాయి. ఆపదలే ఆనందానికి సోపానములై ఉన్నాయి.

సుఖసంతోషాలు మన హృదయంలో వైరాగ్యమును తుడిచిపెడతాయి. విషయ సుఖానుభవానికి పరుగులు తీయిస్తాయి. బాధలు మన ఆంతర్యములో వైరాగ్యమును కదిలిస్తాయి. బ్రతుకును భగవంతుని వైపుకు నడిపిస్తాయి.

భగవంతుని చేరుటయే కదా నిజమైన సంపద. అందుకనే శాస్త్రము ఆపదలకు, సంపదలకు ఒక నూతన నిర్వచనము నిచ్చింది.

విప ద్విస్మరణం విష్ణుః సంప న్నారాయణ స్మృతిః

"పరమాత్మను మరచిపోవుటయే ఆపద. భగవంతుని జ్ఞాపకముంచు కొనుటయే సంపద" కనుక ధీరపురుషుడు బాధలు తనను బాగుచేసేందుకే వచ్చాయి అనే నగ్న సత్యమును భావపూరితంగా గ్రహించి నిత్యభాగ్యవంతుడై చరించాలి.

శకునాలు

న కాలస్య ప్రియః కశ్చిన్నద్వేష్యః

కాలానికి ఒకరు ఇష్టులు కారు, మరొకరు అయిష్టులు కారు. కాలానిది ధర్మదృష్టి. అధర్మసృష్టి కాదు.

కాలంలో ఏది జరిగినా, దాని వెనుక ధర్మాలు ఉంటాయి. అవి అర్థం కాకపోతే, దోషం కాలానికి ఆపాదించబడుతుంది.

ఈ ప్రపంచంలో జీవులున్నారు. వస్తువులున్నాయి. విషయాలున్నాయి. సన్నివేశాలున్నాయి. కాని, ఇవేవీ స్వతంత్రంగా లేవు. ప్రతిదీ మరొక దానితో ముడిపడి ఉంది. ఈ సంబంధం శాస్త్రీయంగా, సహేతుకంగా అర్థమైతే, ఆ తరువాత ఏ ఒక్కటి అర్థమైనా సర్వం అవగత మవుతుంది.

మేఘం యొక్క తీరును బట్టి వర్షము యొక్క ఆగమనాన్ని చెబుతారు. వర్షం లేదు. కాని, రాబోతుంది అని ఊహిస్తాము. ఈ ఊహ వెనుక అవగాహన లేదనగలమా? అసందర్భ ప్రలాపంగా కొట్టిపారేయ గలమా?

భూగర్భ జలాలను పరిశోధించటంలో శాస్త్రీయ పరికరాలను వినియోగించకుండానే భూమి ఉపరితలాన్ని పరీక్షించి నిర్ణయించే విధానాన్ని మనం కాదని తోసేయగలమా?

'కాకి అరుస్తూ ఉంది. ఎవరో బంధువు లొస్తున్నారు'

వచ్చేవి కాకికి ఎలా తెలుసు? భవిష్యత్తులో జరుగబోయేవి తెలుసుకొనే జ్ఞానం కాకికి ఉందా? లేదు. ఉండబోదు.

కాకి అరుపులో భవిష్యత్కార్యం ఉందని ఎవరు చెప్పారు? ఇంటివైపు వస్తున్న చుట్టం ఇంట్లో ఉన్న వారికి ఎలా కనిపిస్తాడు? ఇంటిపైనో, చెట్టుపైనో ఉన్న కాకికి కనిపిస్తాడు. దగ్గరవుతూ ఉంటే కాకి అరుస్తుంది. ఆ తరువాత వ్యక్తి ఇంట్లోకి వస్తాడు. లోనున్న వారికి ఏది భవిష్యత్తో, కాకికి అది వర్తమానం. కాకి అందించేది వర్తమానమే.

సరే. అలాంటప్పుడు ఎవరో వస్తున్నారు అనేందుకు బదులు బంధువు లొస్తున్నారు అని ఎలా చెబుతారు? ఇంటికి వచ్చేవారు ఎవరైనా పూర్వపు రోజుల్లో బంధువులే. ఇంటికి వచ్చి వాసాలు, కూసాలు లెక్కెట్టేవారు పూర్వం చాలా అరుదు. వచ్చేవారెవరైనా బంధువులే కనుక కాకి అరుపు వినగానే ఇంటిలోని వారు ద్వారం వద్దకు వచ్చి స్వాగతం పలికేవారు. ఎవరినీ ఇంటికి రానివ్వక, వచ్చిన వారిని ఉండనివ్వక, చిరాకుల విందుతో సాగనంపే సంప్రదాయానికి ప్రతిరూపంగా కనిపిస్తున్న నేటి సమాజంలో **'అతిథి దేవోభవ'** అనేది మ్రింగుడుపడని విషయమే కావచ్చు.

పక్షి శకునం. శకున మంటేనే పక్షి. సంస్కృతంలో పక్షిని **'శకునః'** అంటారు. **శకున్తిః-శకునిః-శకున్తః-శకునః-ద్విజః** (పక్షీ) అని అమరకోశము.

తెలుగులో కూడా శకునము అంటే పక్షి. సాధారణంగా జరుగబోయే మంచిని సూచించే విషయాన్ని కూడా శకునము అంటాము. అది కూడా పక్షి ద్వారా సూచింపబడే శుభమునే శకునము అంటారు. అదే ఒకవేళ అశుభమైతే దుశ్శకునము అనాలి. కేవలం శకునము అంటే మాత్రము శుభము అనే అర్థము.

మరి, కుక్క ఏడిస్తే?

అది శకునం కాదు. ఎందుకని? కుక్క పక్షి కాదు కనుక. శకునం కానపుడు మరి అదేమిటి? అది నిమిత్తం. ఏదో ఆపదకు సూచితం.

కుక్కలు సహజంగా మొరుగుతాయి. అరుదుగా చెలగాట మాడుతాయి. ఎప్పుడో కాని ఏడవవు.

మొరగటం సహజం. చెలగాటం ఉత్సాహం. ఏడవటం కష్టం. కారణం లేకుండా కుక్క మొరగదు. ఆనందమొస్తే చెలగాట మాడుతుంది. తీవ్రంగా ఆకలి వేస్తే ఏడుస్తుంది.

పట్టెడు అన్నానికి నోచుకోని పెంపుడు కుక్క దొంగను పట్టిస్తుందా? ఇదే భవిష్యత్తులో ఎదురయ్యే ఆపద. అండజేరిన వారిని ఆదరించలేకపోతే బ్రతుకే గుదిబండగా మారుతుంది.

కాకుల మీద, కుక్కల మీద ఈ భాష్యాలేమిటి బాబూ! అనిపించవచ్చు. నోరులేని వాటినే ఇంత చక్కగా అర్థం చేసుకొనే సంస్కృతిలో మనసు, మాట ఉన్నవారిని ఇంకా ఎంత చక్కగా అర్థం చేసుకొనేవారో వేరే చెప్ప నవసరం లేదు. ఇదంతా పూర్వ వైభవం. మన పూర్వీకుల వైభవం.

పక్షి అరిస్తే శకునం అంటున్నాము. పిల్లి ఎదురైతే? కాలికి రాయి తగిల్తే? ఇవి శకునాలు కావు. నిమిత్తాలు. రాబోయే ఆపదలకు సూచితాలు. చూసి నడవాలి. పరిశీలించి పానం చేయాలి. చూడకుండా నడిస్తేనే రాయి తగుల్తుంది. చూడకుండా నడవటమంటే కళ్ళు మూసుకొని పోవటం అని కాదు. చూడలేని స్థితిలో మనస్సు ఉందని అర్థము.

ఇలాంటి మనస్సు వ్యవహార యోగ్యతకు ఉపకరించదు. కార్యసాధనకు పనికిరాదు. కనుకనే, "కాసేపు కూర్చొని వెళ్ళు. కాసిన్ని చల్లని నీళ్ళు త్రాగి వెళ్తువు గాని" అనేవారు. చల్లని పానీయం త్రాగి, మనస్సును కూడా చల్లబరచుకొని వెళ్ళాలి అనేదే ఆంతర్యం. అన్నిటితో అన్నీ ముడిపడి యున్న ఈ పవిత్ర సృష్టిలో వర్తమానం అటు భవిష్యత్తుతోను, ఇటు గతంతోను ముడిపడి ఉంది.

శకునాలు, నిమిత్తాలు వర్తమానాలే. కాని, భవిష్యత్తుకు దర్పణాలు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవా!

"విపరీతములైన నిమిత్తాలను నేను చూస్తున్నాను కృష్ణా" అని కురుక్షేత్రంలో అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పాడు.

రాబోయే ఆపదలేవో అర్జునుని కళ్ళముందు దోబూచులాడుతున్నాయి. ఇవి నిమిత్తాలు. శకునాలు కావు. అందుకనే, 'నిమిత్తాని' అనే పదాన్ని అందంగా వాడాడు అర్జునుడు.

అక్రూరుని రథం చుట్టూ లేళ్ళు ప్రదక్షిణం చేశాయి. అది నిమిత్తం. కంసుని తలపై గ్రద్ద రివ్వుమని తిరిగింది. ఇది శకునం.

నిమిత్త మనేది ఫలితాన్ని సూచించేదే గాని ఫలితా న్నిచ్చేది కాదు. ఫలితానికి కర్మే కారణం. నిమిత్త మనేది ఫలహేతువు కాలేదు.

మా కర్మ ఫలహేతుర్భూః మా తే సంగోऽ స్త్వ కర్మణి

"అర్జునా! కర్మ ఫలానికి నీవు హేతువు కావద్దు. అలాగని కర్మలను మానుట యందు ఆసక్తిని కలిగియుండకు" అన్నాడు శ్రీకృష్ణుడు.

కర్మఫలము ఏదైనా బంధమే. అందుచేతనే ఫలము నిష్ఫలము. మరి కర్మల యందు నిమిత్తంగా ఉండమంటున్నాడు.

"నాకు విపరీతములైన నిమిత్తాలు గోచరిస్తున్నాయి" అని ఫలాసక్తిలో పడి అర్జునుడు అల్లాడిపోతూ ఉంటే,

నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్

అంతా కాకతాళీయం నాయనా! కాకి కాలు పెడితే తాటిపండు పడుతుందా? ఇదే అహంకారం. పండు పడే స్థితిలో కాకి కాలు దానిమీద పడింది. అంతే. అర్థం చేసుకో.

కాకి నిమిత్తం కాదు శకునం అని నీవు అనుకున్నా తప్పులేదు. నీవు మాత్రం కర్మ రంగంలో నిమిత్తమని గ్రహిస్తేనే సుఖం.

జరగవలసింది జరిగి తీరుతుంది. ఇది ధర్మం. ధర్మంతో కరచాలనం చేస్తే బ్రతుకు పండుతుంది. కర్తృత్వంతో విర్రవీగట మంటే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించటం. అధర్మంగా చరించటం. అధర్మం ప్రగతిని నిరోధిస్తుంది. పవిత్రతను పాడు చేస్తుంది.

మా కర్మ ఫల హేతుర్భూః కర్మఫలానికి కారణం కావద్దు. **మరి ఎలా ఉండాలి? నిమిత్త మాత్రం భవ!** నీవు నిమిత్త మాత్రుడివిగా ఉండిపో.

ఇలా ఉంటూ **ఏం చేయాలి?** కర్మలే చేయాలి. కర్మలను మానకూడదు. **(మాతే సంగోऽ స్త్వ కర్మణి).** కర్మలలో వేగం తగ్గనవసరం లేదు. అర్జునుడు రెండు చేతులతో బాణాలు సంధించి సవ్యసాచి అయ్యాడు. నీవు కూడా పుష్కలంగా కర్మల నాచరించు. కానీ నిమిత్తమాత్రంగా ఉండు.

నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్!

గీత పదకొండవ అధ్యాయంలో పదకొండు అక్షరాలతో శోభిస్తున్న మహావాక్యమిది.

ఆత్మ బంధువులారా!

ఆనాడు అర్జునుడు పలికినట్లే నేడు అందరూ పలుకుతున్నారు. విపరీతములైన నిమిత్తాలు అందరికీ గోచరిస్తున్నాయి. అన్నీ శకునాలే. కాకి అరుపులే. ఈ అరుపులు నిమిత్తాలే గాని ఫలితాల నందిస్తాయా?

రాజకీయం రాచపుండుగా మారింది. హింసలు సాగిపోతున్నాయి. విలువలు వీగిపోతున్నాయి. అసూయలు గాలుల్లా వీస్తున్నాయి. ద్వేషాలు వానలై కురుస్తున్నాయి. వంచనలు ఊరేగుతున్నాయి.

ఇవన్నీ కూడా నిమిత్తాలే.

వీటి వెంట నడిచి ఏం సాధిస్తాం? వీటిని గూర్చి పలవరించి ఏం పొందుతాం? కాళ్ళు నొప్పి పుడితే నడిచేవాళ్ళు కూర్చుంటారు. నోళ్ళు నొప్పి పుడితే తెరిచిన నోళ్ళు మూసుకుంటాయి.

నిమిత్తాలను విమర్శించటం, విమర్శలను పరామర్శించటం నేటి సమాజంలో సంస్కారులకు కర్తవ్యం కాదు. అర్థరహితమైన విషయాలలో కాలక్షేపం చేయటం విజ్ఞులకు వినోదం కాకూడదు.

నిమిత్తాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. నిజమే. ప్రగతి కాముకులందరు కొన్ని నిర్ణయాలను సుస్పష్టంగా దర్శించి అమలు చేయవలసిన సమయమిది.

కాలాన్ని వృథా చేయకుండా జ్ఞానార్జనలో అందరూ తలమునకలై యుండాలి. ఏదో ఒక సత్కార్యాన్ని ఆచరించి తృప్తి చెందుతూ ఉండాలి. సామూహిక ప్రయోజనాన్ని సాధించే కార్యాలలో పాల్గొని హృదయాలను ఏకం చేసుకొని జీవించే అలవాటును పెంపొందించుకోవాలి.

మంచి చేసుకొంటూపోయే మనస్సుకు వంచనకు సమయముండదు. ప్రేమించుటకు అలవాటు పడినవారు ద్వేషించి హాయిగా నిద్రపోలేరు. సద్భావన సత్కర్మను ఆవిష్కరిస్తుంది. సత్కర్మలలోనే సత్పురుషులు దర్శనమిస్తారు.

దుర్జనః సజ్జనో భూయాత్ సజ్జనః శాంతి మాప్నుయాత్

శాంతో ముచ్యేత బంధేభ్యో ముక్తశ్చాన్యాన్ విమోచయేత్

"దుర్జనుడు సజ్జను డగుగాక! సజ్జనుడు శాంతి నొందుగాక! శాంత చిత్తుడు బంధము నుండి ముక్తుడగు గాక! ముక్త పురుషుడు ఇతరులను ముక్తులను చేయు గాక!

ఈ మార్గంలోనే నిమిత్తంగా మన ప్రయాణం.

మరోలా అనుకోకపోతే, మీ పేరు?

క్రొత్తవారిని పలకరించేటప్పుడు సాధారణంగా ఈ విధంగా పేరు నడుగుతాం. పేరు మనిషికి చాలా ప్రధానమైంది. ఈ ప్రపంచంలో ఎక్కువ పనులు పేరుతోనే నడుస్తున్నాయి. పేరు కోసమే పరుగెడుతున్నాయి. పేరు చెబితే కూర్చుంటున్నాయి. పేరు లేకపోతే పడుకుంటున్నాయి.

పుట్టిన వారికి పేరు పెడతారు. పేరుతో మనిషి పుట్టడు. పుట్టేది రూపం. పెట్టేది నామం. నామకరణం! ఇదొక ఉత్సవం. ఉత్సాహంతో జరుపుకొనే కుటుంబ మహోత్సవం.

పేరు ఎలాంటిదై ఉండాలి? ఎలాంటి పేరు పెట్టాలి? మన సంస్కృతిలో ఇది చాలా ప్రశస్తమైన విషయం. పరిశీలించి పెట్టాల్సిన విషయం. అందుకే పేరు పెట్టమని పెద్దల నాశ్రయించటం మన సంప్రదాయం.

పేరుకు అర్థం ఉంటుంది. అర్థం సమర్థంగా ఉంటే పరమార్థం ద్యోతకమవుతుంది. పేరుతో పెనవేసుకొని వ్యక్తులు చేరువవుతారు. కనుక నామాలయొక్క ప్రభావం మానవాళిపై చాలా ఉంటుంది.

మమ కుమారస్య ఆయుష్యాభివృద్ధ్యర్థం, సద్వ్యవహారార్థం నామ ధాస్యావహే

లోక వ్యవహారమునందు కీర్తి ప్రతిష్టలు, దీర్ఘాయువు ప్రాప్తించాలనే సద్భావనతోనే తల్లిదండ్రులు బిడ్డలకు నామకరణ సంస్కారం నిర్వహిస్తున్నట్లు పై సంకల్ప వాక్యం స్పష్టం చేస్తోంది.

"సుగుణ" అనగానే చక్కని గుణములు కలది అనే భావం స్ఫురిస్తుంది. ఆ పేరు గలవారు అలాంటి వ్యక్తిగా తయారు కావాలని భావిస్తే, ఆ పేరును పిలిచే వారి మనస్సులలో వెన్నెలలు పూస్తాయి.

అలాగే భగవంతుని పేర్లు, మహాత్ముల పేర్లు, పుణ్యక్షేత్రాల పేర్లు, మాతా పితల పేర్లు కలిసిన పేర్లు, కుటుంబ ప్రవంతిని సూచించే పేర్లు పెడతారు. రామచంద్ర, హరిశ్చంద్ర, యమున, గుప్త, శాస్త్రి, వర్మ ఇత్యాదులు.

మహారాష్ట్రలో వ్యక్తిపేరు తరువాత ఇంటి పేరు వస్తుంది. గోల్వాల్కర్, సోల్కర్, అగర్కర్, గవాస్కర్ ఇవన్నీ ఇంటి పేర్లు.ఇది మరాఠీ సంప్రదాయం. ఆ రాష్ట్ర సంప్రదాయం ఆ రాష్ట్రానికి శోభనిస్తుంది. మన రాష్ట్ర సంప్రదాయాన్ని మనం పాటిస్తే హాయిగా ఉంటుంది. అనుకరణలు ఒకొక్కప్పుడు మ్రింగుడు పడనివిగా మిగుల్తాయి. ఒక వ్యక్తి పేరు "గొర్రె ప్రకాశ్." ఆయన ఇప్పుడు "ప్రకాశ్ గొర్రె" గా మారాడు. ఇలాగే చాలా ఉన్నాయి నాకు తెలిసి. "నారాయణ మేక" - "స్వర్ణలత చింత" - "వీరయ్య పెంట".

ఇలా మార్చుకొని ఏమి సాధించినట్లు? స్వరాష్ట్రంలో అర్థం తెలుసు కనుక మార్చుకొని ప్రయోజనం లేదు. వేరే రాష్ట్రాల్లో అర్థం అవగతం కాదు కనుక ఎలా ఉన్నా ఒక్కటే. మార్చుకోవలసిన అవసరమే లేదు.

ఇంకొక తమాషా కూడా ఉంది. ఈ సందర్భంలో ముచ్చటించటం సబబే అనుకుంటున్నాను. ప్రథమ సంతానం నుండి వరుసగ పుట్టిన పిల్లలు మరణిస్తూ ఉంటే, ఇక మరణించకుండా రక్షించేందుకు తరువాత పుట్టిన బిడ్డకు వికృతంగా నామకరణం చేస్తారు. ఇది ఏ శాస్త్రమో, దీని మర్మ మెక్కడుందో నా మటుకు నాకు తెలియదు. ఇలా పేరు పెట్టడం వలన ప్రస్తుతం పుట్టిన బిడ్డ చనిపోలేదు అంటే, గతంలో చనిపోయిన వారందరూ మంచి పేర్లు కలిగియున్న కారణంగానే పోయినట్లు నిర్ణయించవలసి వస్తుంది కదా? కొద్దిసేపు ఆలోచిస్తే, ఈ తీగ కదిలించే డొంక ఎలాంటిదో మీకే అర్థమవుతుంది.

మూఢ విశ్వాసాలకు పీటవేసి "దుర్భిక్షం", "మలనేత్రి", "చంచల", "పెంటయ్య" లాంటి పేర్లు పెట్టడం తేలికే. వాటిని పిలిచేవారు ఏ సుఖాన్ని పొందుతారు? పిలిపించు కునేవారు ఏ శాంతి ననుభవిస్తారు? ఇటీవల ఒక వ్యక్తి "స్వామీజీ ! మా తల్లిదండ్రులు చిన్నప్పుడు ఈ పేరు పెట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో కొంత ఇబ్బందిగా ఉంది. మీరొక పేరివ్వండి, ఇక అది నా పేరని చెబుతాను" అన్నాడు. నేను అతనిలోని రాపిడిని అర్థం చేసుకొని, క్షణం కూడా ఆలోచించకుండా "సుభాష్" అన్నాను. అతను సంతోషంగా వెళ్ళాడు.

పేరు మంచిగా ఉన్నా, ప్రేమతో పిలవటంలో అది ఏదో అయిపోతూ ఉంది. "సబర్మతి"ని "సబ్బూ" అని, వడయవర్లును "వడ" అని, పద్మావతిని "పద్దు" అని, నిర్మలను "మల" అని, శంకర్రావును "శంక" అని. పేర్లు సుందరంగా పెట్టి లాభం లేదు. సుందరంగా పిలవటం ఎలాగో కూడా నిర్ణయించుకొని మరీ పిలవాలి.

పేరులో ఎంతో ఉంది. అందుకనే హిందూ సంస్కారములలో నామకరణం కూడా చేరింది. మనం పెట్టే పేరు, మనం పిలిచే పేరు ఆ వ్యక్తితో పాటు జీవించినంత కాలము ఉంటుంది. ఆదర్శమైన జీవితమైతే, భావికాలాలకు కూడా అందించబడి, వ్యక్తి లేకున్నా నామధేయం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. కనుకనే నామవైభవాన్ని, నామకరణ ప్రాభవాన్ని దేవగురువైన బృహస్పతి ఎంతో అందంగా వర్ణించారు.

నామాఖిలస్య వ్యవహారహేతుః శుభావహం కర్మసు భాగ్యహేతుః

నామ్నైవ కీర్తిం లభతే మనుష్యః తతః ప్రశస్తం ఖలు నామకర్మ

"సమస్త వ్యవహారములు పేరుతోనే నడుస్తూ ఉంటాయి. కర్మలలో పేరు శుభదాయకంగా శోభిస్తుంది. పేరు ద్వారా వ్యక్తి ప్రఖ్యాతిని గడిస్తాడు. పేరు ద్వారానే కీర్తిని పొందుతాడు. కనుకనే, నామకరణము చాలా ప్రశస్తమై యున్నది."


కనుక, ప్రతి ఒక్కరు మంచి పేరును పొందాలి. మంచి పేరుతో జీవించాలి. మంచి పేరును విడిచిపెట్టి వెళ్ళాలి.

జిహ్వా మే మధుమత్తమా!

నా నాలుక తియ్యని పలుకులను పలుకుగాక!

విలువలు - వెలుగులు

ఇందులో...



పిలుపు

గూడు కట్టుకొనేది గుట్టుగ పట్టున పదికాలాలు హాయిగా జీవించేందుకే గాని, గుర్తు లేకుండా పోయేందుకు కాదు.

తాను అందముగ నేసిన గూడు
తననే మూసిన వైనము చూడు

అని సాలీడును దారికి తోడుగా అభివర్ణించిన చైతన్య గాన లహరి కేవలం గుండెను తాకి నిష్క్రమించేందుకు కాదు; గుండెను కదిలించి గుర్తు తెలిపేందుకు.

నేడు,
ఎక్కడ చూచినా,
ఎప్పుడు చూచినా
మత కలాపాలే కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి.
పూజల హోరు
భజనల పోరు
ఆలయ దర్శనాలు
క్షేత్ర సందర్శనాలు
పుణ్య స్నానాలు
తీర్థ సేవనాలు
ఊ...... అంటే ఉపవాసాలు
ఆ...... అంటే, సత్సంగ సహవాసాలు
నూతన ఆలయ నిర్మాణాలు
పురాతన ఆలయ పునరుద్ధరణలు
వాడవాడలా వైభవంగా ఊరేగింపులు
పదిమంది దొరికితే అధికంగా ప్రసంగాలు
ప్రలోభ పెట్టే వచనాలు
అవాస్తవాలతో రచనలు
ప్రసాదంగా ఫణం
అభివందనంగా ధనం
విమర్శల పరామర్శలు
విశృంఖల పరహత్యలు
ఓహ్! ఎన్నని?
ఇంత పెద్ద సంత మతాలకి గతంలో ఎన్నడూ లభించలేదనేది నిర్వివాదాంశం.
ఈ సంత జరిగేందుకు సంపద ఎంత కావాలి?

అవును. కావాలి. ఎంతో కావాలి.
అంతా సమకూరుతూనే ఉంది.
రాజులు పోషించటం లేదు. మహారాజులు అర్పించటం లేదు.
పెద్ద మనస్సుతో ప్రజలే రాజులై సంతోషంతో విరాళాలను విరివిగా అందిస్తున్నారు.
ఏ మతమైనా కానివ్వండి,
వారువారు చేసే కార్యక్రమాలకి ప్రజలు ముందుకొచ్చి
ఎందుకు నడుం బిగిస్తున్నారు?
వారి వెనుక ధనరాశు లుండి కాదు (ఎక్కువ శాతం),
వారి ముందు ఆశ మిగిలి ఉండి.
ఏమిటా ఆశ?
మత కార్యక్రమాలు మతులను సరిచేస్తాయనే ఆశ.
యతి జీవనాన్ని ఆవిష్కరిస్తాయనే ఆకాంక్ష.
సమాజ అభ్యుదయం సాధించవచ్చనే ఆసక్తి.
అందుకు తమవంతు సమర్పించుకోవాలనే అభిలాష.
ఈ ఆశా వెలుగులో
స్వార్థం లేదు. కల్మషం లేదు. మోసం లేదు. హింస లేదు.
పవిత్రమైన ఈ పెట్టుబడికి ఫలితాలు
స్వార్థాలయితే?
కల్మషాలయితే?
మోసాలయితే?
హింసలయితే?........ఏదీ తోచక,
దాతృత్వాన్ని ప్రదర్శించిన సమాజం
దగాపడి దిగులుతో బిక్కుబిక్కుమని చూస్తోంది.
దీనికి పరిష్కారమేమిటి?
సమస్యలు క్రొత్తవి కావచ్చు. పరిష్కారం మాత్రం పాతదే.
దారి తప్పటమే సమస్యలకు కారణం. చక్కని రాజమార్గమే ఏకైక పరిష్కారము.
ఇదే జ్ఞానమార్గం. తెలుసుకోదగింది. జ్ఞాతవ్యం. జ్ఞాతవ్యమే కర్తవ్యం.
ఇదొక చక్కని మలుపు. పరమాత్మ పిలుపు.
"రిచ్యువలిజమ్" నుండి "స్పిరిచ్యువలిజమ్" వైపుకు తిరుగవలసిన తియ్యని వలపు.
ఈ వలపు పంట ప్రేమ ఫలాలనిస్తుంది. అవగాహనా కుసుమాలతో అంతఃకరణను అలంకరిస్తుంది. సమతా ఊయలలో సమాజాన్ని కూర్చోబెడుతుంది. పవిత్రతయనే పల్లకీలో ఊరేగిస్తుంది.

విలువలు - వెలుగులు

దీపం లేని ఇల్లు నీరు లేని బావి లాంటిది. వెలుగు లేని బ్రతుకు సూర్యుడు లేని ఆకాశం వంటిది. వ్యక్తిలో వెలుగు రావాలి. కాంతి నిండాలి. అప్పుడే వ్యక్తి సుఖించగలడు; వ్యక్తుల సమూహమైన సమాజము శోభించగలదు.

వ్యక్తి వెలిగిపోవాలి, ఆనందంతో పండిపోవాలి యని ఆలోచించేవారు రెండు తెగలుగా తెలుస్తున్నారు. (1) అలక్ష్యపరులు - అనగా బ్రతుకులో ఏ లక్ష్యము లేకుండా జీవితమును సాగించేవారు. అంతేగాదు బ్రతుకు శోభించడానికి విలువలు, వ్యక్తిత్వము అవసరంలేదని భావించేవారు. వీరిది స్వార్థబుద్ధి. వీరికి మంచి చెడులతో పని లేదు. తాము ఆనందంగా బ్రతికేందుకు ఎన్ని నేరాలైనా చేస్తారు. మోసాలకు వెనుకాడరు, ద్రోహాలకు దూరంగా పోరు.

రెండవ తెగకు చెందినవారు లక్ష్యపరులు. అనగా బ్రతుకులో ఏదో లక్ష్యాన్ని పెట్టుకొని దానిని సాధించేందుకు కృషి చేయువారు. వీరిలో ఉన్నతమైన భావాలుంటాయి. స్పందించే హృదయముంటుంది. వీరు రాజకీయాలలో ఉండొచ్చు, సేవా సంస్థలలో కొనసాగవచ్చు లేదా ఆధ్యాత్మిక పంథాలో నడక సాగించవచ్చు.

మొదటివారైన అలక్ష్యపరులకు వెలుగులు కావాలి. కాని విలువలు అవసరం లేదు. రెండవ వారైన లక్ష్యపరులకు విలువలు అవసరం. విలువలతోనే వెలుగు లొస్తాయని వారి నిశ్చితాభిప్రాయం.

అలక్ష్యపరులకు విలువలు లేనందున వారు విలువగలవారు కారు. రెండవ వారైన లక్ష్యపరులకు విలువ లున్నాయి కనుకనే వారు విలువలను గూర్చి సమాజంలో ప్రసంగిస్తున్నారు. మరి విలువలను గూర్చి ప్రసంగించే ఈ లక్ష్యపరులు విలువైన వారేనా? ఇది నేటి మన సమస్య.

విలువలను గూర్చి ప్రసంగించడము వేరు. విలువగా బ్రతకడం వేరు. నీతిని గూర్చి ప్రసంగించే వారికి నీతి మంచిదని తెలుసు. కానీ నీతిగా మసలుకోవడం తెలియదు. అభ్యుదయం విశిష్టమైనదని దానిని గూర్చి మాట్లాడే రాజకీయవేత్తలకు తెలుసు. అభ్యుదయ భావాలతో నిండిన నాయకునికి ఆదర్శంగా బ్రతకడం చేతకాదు. భక్తి ఉత్తమమైనదని భక్తులకు తెలుసు. కానీ భక్తి చేయడం తెలియదు. సాధన శ్రేష్ఠమైనదని సాధకులకు తెలుసు. కానీ సాధన చేయడం సాధ్యం కాదు. మంచి యనునది విశిష్టమైన విలువ. తెలిసి మంచిగా జీవించలేకపోవడం కొనితెచ్చుకొన్న శిలువ. ఈ ద్వంద్వ వైఖరికి కారణమేమిటి?

"నిజమే పలకాలి" అనేది బాల్యము నుండి మనకు జీర్ణించుకుపోయిన విలువ. కానీ నిజం మాట్లాడడం చేదుగా మారిపోయింది. "నేను ఇంట్లో లేనని వచ్చిన వ్యక్తికి చెప్పు" అని తండ్రి కొడుకుకు చెప్పినపుడు ఈ మాట యొక్క ప్రభావము బిడ్డపై ఎలా ఉంటుంది? అదే తండ్రి "నాయనా! నిజము పలకాలి" అని బిడ్డకు బోధించినపుడు ఆ పిల్లవాని మనస్సు దేనిని నమ్మాలి? దేనిని ఆచరించాలి? ఈ క్లిష్ట పరిస్థితిని బిడ్డ పెరుగుతూ ఎలా అర్థం చేసుకుంటాడో తెలుసా?

నిజం పలుకుట మంచిదే ..... కానీ అది మనిషికి సాధ్యం కాదు

అబద్ధం చెప్పకూడదు .... అయినా బ్రతికేందుకు చెప్పి తీరాలి.

ఇదీ జరిగేది. విలువల యొక్క విశిష్టత వ్యక్తి ఆంతర్యంలో నిలిచి ఉంది. కానీ అది వ్యక్తికి జీర్ణం కాలేదు. సరిపెట్టుకొని, సర్దుకొని జీవించే అలవాటు ప్రగాఢంగా వ్యక్తిని పెనవేసుకొని యున్నది. ఈ సర్దుబాటు కూడా విలువగా వ్యక్తి భావనలో నిలిచి ఉంది.

నిజం పలకాలి అనేది ఒక విలువ. అవసరమైనపుడు అబద్ధం చెప్పవచ్చు అనేది రెండవ విలువ. ఈ రెండును ఒకే వ్యక్తిలో నిలిచి ఉన్నాయి. ఈ రెండింటిలో ఏదో ఒక్కదానినే నిలుపుకోవలసిన క్లిష్ట పరిస్థితి ఆసన్నమైనపుడు వ్యక్తి ఏ విలువకు విలువనిస్తాడు? ఏ విలువను తేలికగా త్యజిస్తాడు?

వంటబట్టని తిండి వాంతియైనట్లు, జీర్ణంగాని విలువే త్యజింపబడుతుంది. నిజం నెట్టబడి అబద్ధం అందల మెక్కుతుంది. అన్యాయాలు సేవ జేస్తుంటాయి. అక్రమాలు అవసరాలు తీరుస్తుంటాయి. దౌర్జన్యాలు దరి చేరుతాయి. దమనకాండలు వెలిగిపోతుంటాయి.

నిజం పలికి నిలకడను కోల్పోయేకన్నా అబద్ధాలాడి అందల మెక్కవచ్చు. మంచి చేసి కుంచుకుపోయేకన్నా చెడు చేసి కులుకుతూ జీవించవచ్చు. విలువలు - విలువలు అని వేసారిపోయేకన్నా విలువలను కాలరాచి వ్యక్తి శోభించవచ్చు. చుట్టూ ఇవే జరుగుతున్నాయి. నేనూ వాటి చుట్టే తిరుగుతాను. ఇదే నేటి ప్రపంచంలో అవగాహన.

జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేక పోవడమే ఈ దురవగాహనకు కారణము. తన ఆలోచనలకు, ఆచరించే కర్మలకు ఫలితాలు ఎలా ఉంటాయో అర్థంగాని అయోమయ ధోరణియే ఈ దుశ్చింతనను కొనసాగిస్తున్నది. ఈ ప్రపంచములోని ప్రతి వస్తువు మీద "అశాశ్వతం" అనెడి ముద్ర ఉన్నట్లు చూడకపోవడమే ఈ దురంతాలకు ఊపిరి అయింది. అక్రమమార్గాల్లో చరించి తాత్కాలికంగా ప్రేయస్సు ననుభవించినా శాశ్వతముగా శ్రేయస్సు దూరమగుచున్నదని వ్యక్తి గ్రహించలేకున్నాడు. చెడు దారుల్లో చరించే వ్యక్తి కట్టుకున్న మేడలు, కులుకుతున్న దారులు కనిపిస్తున్నాయే గాని, అతని జీవితంలో ఎదురయ్యే సమస్యలు, నిలదీసే పరీక్షలు, జారిపోయే శాంతి, కృంగదీసే అశాంతి తెలిసిరావడం లేదు.

'ప్రపంచం అలా ఉంది' అని దానిని విమర్శించి సాధించే దేమియును ఉండదు. 'నేనూ అలాగే పోవాలి' అని ప్రపంచ ఊబిలో కూరుకుపోయి సంగ్రహించే దసలే ఉండదు. ప్రపంచము నిర్విరామంగా బోధిస్తున్న పాఠాలను చక్కగా అధ్యయనం చేసే

నీవు చక్కని విద్యార్థివి అయితే చిక్కని శాంతి చిక్కుతుంది. చిక్కులను దీర్చి, శాంతి నీ హక్కు అని చాటుతుంది.

క్షణిక సుఖాల కొరకై ప్రశస్తమైన మానవ జన్మను వృథా చేసుకోకూడదు. అగ్నితో శుద్ధిపడిన బంగారు లాగా అధ్యయనంలో బంగారు బ్రతుకును తయారు చేసుకోవాలి. జీవితంలో ఎన్ని కష్టాలైనా ఎదురు కావచ్చు. కానీ బ్రతుకును శోభాయమానంగా తీర్చి దిద్దుకునేందుకు మానవజన్మయే ఏకైక పరిశోధనాలయము.

నిజమైన విలువలకు విలువ కట్టడం నేర్చుకోవాలి. అప్పుడే బ్రతుకులో వెలుగులు నిండుతాయి. వెతలు తొలగుతాయి. విలువలు లేని విచ్చలవిడి బ్రతుకే వేదనలకు బీజములు పరుస్తున్నదని మరువకూడదు.

బ్రతకడం మనిషికి చేతనయింది. కానీ బ్రతుకంటే ఏమిటో తెలియకుండా పోయింది. బ్రతుకనేర్చిన సమాజంలో మనిషి క్షణక్షణానికి మరణిస్తాడు. బ్రతుకు నేర్పే సమాజంలో మనిషి అమృతరూపు డవుతాడు.

బ్రతికి తెలుసుకోలేని దౌర్భాగ్యంకన్నా తెలిసి బ్రతికే సౌభాగ్యమే శ్రేష్ఠమని గ్రహించాలి. విలువలు తెలిసి లాభం లేదు. విలువలు వంటబట్టాలి. శుద్ధమైన జ్ఞానమే ఆరోగ్యకరమైన వంట. వంటబట్టించే మహాత్ముడే సద్గురువు.

గురువును ఆశ్రయించాలి. జ్ఞానమును ఆరగించాలి. ఆవేదనా ఆకలిని పోగొట్టుకోవాలి. శాంతి యనెడి ఆరోగ్యముతో శోభించాలి. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇదియే ఏకైక మార్గము.

> నిన్నటి స్వప్నం ఇప్పుడు లేదు; అది గతం. రేపటి స్వప్నం ఇప్పుడు లేనేలేదు; అది భవిష్యత్తు. ఇప్పుడు కల లేదు. ఇది వర్తమానం. కలలు లేని కళ, జీవన కళ వర్తమానమే అనేదే జీవికి దేవుడు పంపే వర్తమానం.
>
> గతించింది తిరిగి రాదు. వచ్చేది ఏదో వస్తే గాని తెలియదు. ఉన్నదే ఉన్నది. ఉనికై ఉన్నది. ఊరేగుతూ ఉన్నది. ఉత్సవ మూర్తిగా శోభిస్తూ ఉన్నది.

తీపి పలుకు

మాటలాడుట ఒక వరము లాంటిది. మధురముగా మాటలాడకపోవుట ఒక శాపమనే చెప్పాలి. పలుకు లందరికీ లభ్యం.... తియ్యగా పలకటం కొందరికే సాధ్యం.

సాధకుడు సంభాషణలో సావధానచిత్తుడై ఉండాలి. మాట్లాడే ముందు ఆ మాట అవసరమైనదో కాదో రెండుసార్లు ఆలోచించి మరీ మాట్లాడాలి. అవసరమని తేలితే అప్పుడు మాట్లాడాలి. అది కూడా అందముగా పలుకగలగాలి. ఎక్కువ విషయాన్ని తక్కువ మాటలలో నింపగలగాలి. చెప్పే విషయము సూటిగా ఉండాలి. పలుకు ధైర్యంగా ఉండాలి. ఈ ధైర్యం వెనుక అహంకారము చోటు చేసుకోకూడదు. ఆత్మ స్థైర్యం నిండియుండాలి.

మన మాట వినే వ్యక్తి యొక్క మనస్సును కదిలించ గలగాలి. ఇతరులు ఆలోచించుటకు అనుగుణంగా భావస్ఫూర్తితో పలకాలి. మాటను బయటకు పంపే ముందు మనస్సును ఒక క్షణం లోనికి మరల్చాలి. పంచదారతో కలిపిన పిండి తియ్యగా మారునట్లు మాధవుని స్పృశించిన మనస్సు మధురభాషణము చేయగలదు.

ఇతరులను బాధించే మాటలు మాటలాడకూడదు. ఇది చెప్పినంత సులభమైన పని కాదు. ఎదుటి వ్యక్తిలో పరమాత్మను దర్శించినపుడే అది మనకు సాధ్యమవుతుంది. కనుక ఎవరిని మనం సమీపించినా మొదట వారిలో పరమాత్మను దర్శించి ఆ తరువాత భాషించడము అలవరచుకోవాలి. ఇదియే మధురజీవనము.

విమర్శించుట మన పని కాదు. మనం సాధకులం. విమర్శలో విషమత్వ ముంటుందని మరచిపోకూడదు. ఇతరులలో దోషదర్శనము చేయకూడదు. దోషులపై మన కుండవలసింది సానుభూతియే గాని ద్వేషము కాదు. రోగిపై వైద్యునికి ద్వేషముంటుందా? మంచివానికి చెడ్డవానిపై ద్వేషమెలా కలుగుతుంది? సరళ స్వభావము కలిగియుండాలి. ఇతరుల భావాలకు మనం బానిసలం కాకూడదు. అలాగే మన భావాలకు ఇతరులను బానిసలు చేయకూడదు.

కులప్రసక్తి అనుకూలమైనది కాదు. "నీ కులమేమిటి?" అని ఎవ్వరినీ ప్రశ్నించ కూడదు. మాట్లాడు సందర్భాలలో "అర్థమైనదా! అర్థమైనదా!" అనెడి అనుచిత వచనమును పలుకకూడదు. అర్థమయ్యేలా ఎలా చెప్పాలో మనమే ఆలోచించుకోవాలి.

ఇతరులు మన మాటను గౌరవించలేదని వ్యథ చెందకూడదు. అంగీకరించలేదని అలమటించకూడదు. బట్టల వ్యాపారి కొనుగోలుదారునకు తనవద్ద నున్న వస్త్రములన్నీ చూపుతాడు. అన్నిటినీ చూపి వచ్చిన వ్యక్తి నచ్చలేదని వెళ్తాడు. అంత మాత్రాన వ్యాపారి వ్యథ చెందడు. మరొకరు వస్తారనే విశ్వాసముతో ఎదురు చూస్తూ ఉంటాడు. మన దగ్గర మంచి ఉంది. అవసరమున్న వ్యక్తి అందుకుంటాడు. ఈ విషయములో ఆవేదనకు తావు ఎక్కడుంది?

మనం మాటలలో ఇతరులను గాయపరచక పోవచ్చు. కానీ ఇతరుల మాటలు కూడా మనల్ని గాయపరచకుండా చూసుకోవాలి. మనస్సును ఎవ్వరూ గాయపరచలేరు. బాహ్యంలోని వ్యక్తులు ఆంతర్యంలోని మనస్సును ఎలా గాయపరచగలరు? మనస్సుకు ఏర్పడే గాయము ఇతరులు చేసేది కాదు. మనము చూసేది.

మనల్ని చెడ్డవారని ఇతరులు పలికినపుడు మన మనస్సు గాయపడుతుంది. అయితే వారు పలికే చెడ్డ మనలో ఉన్నదా? బాగా ఆలోచించుకోవాలి. ఉన్నదా? అయితే బాధ ఎందుకు? సరిజేసుకొంటే సరిపోతుంది. ఒకవేళ మనలో దోషము లేదనుకుందాం. అలాంటప్పుడు మనం బాధపడవలసిన అవసర మేముంది? లేనిదానికి లేమి ఎక్కడ? నవ్వి ఊరుకోవడమే.

"మన మనస్సు గాయపడక పోవచ్చు. కానీ మనలో లేని దోషమును ఇతరులు ప్రస్తావించుట వలన సమాజములో మన విలువ తరిగిపోదా?" అనెడి సందేహము మనకు రావచ్చును. సమాజము యొక్క గుర్తింపు మనకు అవసరమా? అయితే మనం ఎప్పుడూ సాధకులం కాలేము. వ్యక్తుల సముదాయమే సమాజము. మనస్సు గలవాడు మనిషి. మారిపోయే స్వభావము కలదియే మనస్సు. చెదిరే మనస్సులతో కదిలే మనుష్యులు మనల్ని గుర్తించాలా? గుర్తిస్తారా? మనల్ని చూసే చూపు దివ్యంగా వెలుగుతోంది. మనం చూడవలసిన రూపు అపురూపంగా నిలిచి ఉంది. నిలిచే దేమిటో, నీరసించి నశించే దేమిటో తెలిస్తే చాలు.

గాలి తీవ్రంగా వీస్తున్నా లాంతరు ఆరిపోకుండా వెలుగు నందిస్తుంది. సమాజములో ఎదురయ్యే ప్రతికూల పవనాలు తీవ్రంగా వీస్తున్నా అచంచల విశ్వాసముతో వెలిగిపోయే స్థితిని సంపాదించుకోవాలి. ఇదియే వెలితి తెలియని వెలుగు.

వాగి వాగి ఆగుతాడు వదరుబోతు
బాధలొస్తే మారుతాడు పొగరుబోతు
వ్యాధికి భయపడి మానేస్తాడు త్రాగుబోతు
ఏది వచ్చినా మారనివాడు సోమరిపోతు

విజయ రహస్యం

నేను చేసే పని నీవు చేయవు. నీవు చేసే పని ఇతరులు చేయరు. అందరూ ఒకేపని చేయటం సాధ్యం కాదు. కాని, ఏదో ఒక పని చేయకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు. ఏదో చేయటం తప్పదు. ఏది చేసినా అలసిపోవడం కూడా తప్పదు. అలసట తెలియని పని, ఆవేదన పంచని ఫలితం కావాలనేదే, రావాలనేదే అందరి అభిమతం.

రాకుండా ఉండే జ్ఞానము లేదు.
పోకుండా ఉండే అజ్ఞానమూ లేదు.

అయితే ఇవన్నీ దైవానుగ్రహంతోనే జరగాలి అని భావించటం మంచిది కాదు. మన ప్రయత్నమే ప్రధానం. ఆ తరువాతే ఏదైనా. ఇది అర్థమైన వారికే దైవసహాయం.

1. మనకు ఏది కావాలో అది మరొకరికి తెలిస్తే ప్రయోజనం ఉండదు. మనకే తెలియాలి. తెలిస్తే లాభం లేదు. ఆ వైపు ప్రయాణం సాగాలి. పరిశ్రమ సాగాలి. జ్ఞానం విజ్ఞానం వైపు మలుపు తిరగాలి. ఈ విషయంలో రెండవ ఆలోచనకు తావు లేకుండా చూడాలి. ఇది కార్యారంభం. **(ఉద్యమం)**

2. ఆశ ఒక్కటే సరిపోదు. ఆశించే వస్తువును పొందాలనే ఆసక్తి ఉండాలి. ఉత్సాహం ఉండాలి. నిస్పృహ తెలియని ఉత్సాహ స్పృహ ఉండాలి. ఉత్సాహంతో సాగే ప్రయత్నంలో తృప్తి ఉండాలి. తృప్తితో అడుగులు ముందుకు వేసుకొంటూ నడక సాగించే నేర్పరితనం కావాలి. ఇది కార్యాచరణం. **(సాహసం)**

3. పిరికితనంలో పిల్లి పరుగులుంటాయే గాని పులి అడుగులు అగుపించవు. ఈ ప్రపంచంలో అందరూ ఒంటరివారే. ధైర్యమే తోడుగా నిలవాలి. కార్యాచరణలో నిర్భయత్వ ముండాలి. భయమనేది పెద్దభారం. దానిని అందరూ మోయలేరు. కనుకనే, భయ మున్నవా రందరూ బ్రతుకును భారంగా ఈడుస్తూ ఉంటారు. కనుక నిర్భయంగా కార్యాచరణములో ముందుకు పోవాలి. ఇది పటుత్వం. **(ధైర్యం)**

4. ఇవన్నీ జ్ఞానము అనే పునాది పైనే నిర్మించబడాలి. ఆశించటం జ్ఞానము; ప్రయత్నించటమూ జ్ఞానమే; నిర్భయంగా సాగాలి అని నిర్ణయించుకోవటము కూడా జ్ఞానమే. జ్ఞానశుద్ధి లేకుండా కర్మశుద్ధి రాదు. కనుక, మనము ఆచరించే కార్యానికి సంబంధించిన జ్ఞానము ముందుగా మనకు స్పష్టం కావాలి. ఇది అవగాహన. **(బుద్ధిః)**

5. అన్నీ ఉన్నాయి. బలం లేదు. ఇక ఆ ప్రయాణము ఎలా ఉంటుంది? పెట్రోలు లేని శకటము నడిచినట్లే ఉంటుంది. తింటూ, తిరుగుతూ దేహానికి బలాన్ని పెంచినట్లు, ఆలోచిస్తూ అవలోకిస్తూ అంతఃకరణకి బలాన్ని పెంపొందించాలి. ఇది ఆధారం. **(శక్తిః)**

6. ప్రయత్నము చక్కగా ఉంటుంది. పనిలో ఆసక్తి ఉంటుంది. ఆసక్తిగల కర్మలో ధైర్య ముంటుంది. ధైర్యమున్న పనిలో జ్ఞానం కూడా తోడుగా ఉంటుంది. శక్తి

జోడుగా నడుస్తుంది. ఇన్ని ఉన్నా, ఇన్ని చేసినా ప్రతిబంధకాలు పరామర్శించక పోవు. అవరోధాలు పలకరించకపోవు. ఆటంకాలు అడ్డు నిలువక పోవు. అడ్డంకులు ఎదురు రాకుండా ఉండవు. అలాంటి పరిస్థితులలో మొక్కవోని విశ్వాసంతో ముందు కురికే చొరవ ఉండాలి. ఇది పట్టుదల. **(పరాక్రమం)**

ఇన్ని ఉన్నా ఎన్నోసార్లు ఎన్నో విషయాల్లో ఎందరో విఫల మనోరథులై విచలిత మనస్కులై విలపిస్తూ ఉండటం మనం చూస్తూనే ఉన్నాం.

మన ప్రయత్నాలు మనం చేస్తాం. ఫలితాలు ఎలా ఉంటాయో మనం ముందుగా చూడలేము. ఫలితాలు వచ్చినపుడు ఇష్టం లేకున్నా చూడక తప్పదు. ఫలితాన్ని చవిచూడక తప్పదు.

ప్రయత్నశీలురు ప్రగతికి దూరం కారు. పతన మెరుగరు. పైన తెలిపిన ఆరు విషయాలను మనస్సులో పెట్టుకొని ధర్మమార్గం వైపు నడక సాగించేవారికి దైవ సహాయం లభిస్తుంది.

బియ్యం, పప్పు, కూరలు, ఉప్పు, నెయ్యి, పొయ్యి అన్నీ ఉన్నాయి. అగ్నిలేకపోతే వంట తయారు కాదు. అగ్ని లేనిదే వంట తయారుకానట్లు **(పాకస్య వహ్నివత్)** దైవ సహాయం, దైవానుగ్రహం లేనిదే ఏ కర్మ కూడా ఫలించదు.

అగ్ని ఉన్నా, పదార్థాలు లేకపోతే మంట ఉంటుందే గాని వంట తయారు కాదు. అలాగే దైవకృప ఉండినా పైన తెలిపిన ఆరు సుగుణాలు లేకపోతే ధర్మమార్గంలో దారి కనిపించదు. ఉంటే మాత్రం, దైవం తోడుగా ఉన్నట్లే.

ఉద్యమం సాహసం ధైర్యం బుద్ధి శ్శక్తిః పరాక్రమం
షడేతే యత్ర వర్తన్తే తత్ర దేవః సహాయకృత్ ॥

"ఉద్యమము, సాహసము, ధైర్యము, జ్ఞానము, శక్తి, పరాక్రమము - ఈ ఆరు లక్షణాలు ఎవరిలో కనిపిస్తూ ఉంటాయో వారికి దైవకృప తోడుగా ఉంటుంది" అని శాస్త్రోక్తం. అనుభవ సూక్తం.

కంప్యూటర్ శోభిస్తున్న ప్రపంచంలోనే కాకి తిరుగుతూ ఉంది. కంప్యూటర్ కావాలని కాకి ఆశించదు. దానికి జ్ఞానశక్తి లేదు. కనుక ఇచ్ఛాశక్తి ఉండదు. ఇక ప్రయత్న మెలా ఉంటుంది? కనుక క్రియాశక్తి కూడా శూన్యమే. మనం తిరిగే కాకులం కాము. రాలే ఆకులం కాము. కదలలేని మాకులం అసలే కాము. బుద్ధితో చరించే మనుష్యులం. జ్ఞానం కలవాళ్ళం. శక్తి గలవాళ్ళం. తెలియనివి ఎన్నో ఉన్నా, ప్రయత్నించి ఎన్నిటినో తెలుసుకున్నవాళ్ళం. తెలుసుకుంటున్న వాళ్ళం.

జీవన సత్యాలను అర్థం చేసుకుంటూ నడకను సాగించటం మనం నేర్చుకోవాలి. పరిమితాలను ఒకవైపు గుర్తించినా, ప్రయత్నాలకు మరొకవైపు పదును పెట్టుకుంటూ ముందుకు పోవాలి.

దీనులమనే అధైర్యం వద్దు. దీనబాంధవుడు ఉన్నాడనేదే హద్దు.

జీవితం ఒక మహారణ్యం. జగన్నాథుడే మనకు ఏకైక శరణ్యం.

మాట తీరు

స్వామీజీ! మీరు బాగా మాట్లాడుతారు. అందుకనే మీరు రావద్దని చెప్పినా జనం మిమ్మల్ని విడిచిపెట్టరు; అన్నాడు మొన్న హైదరాబాద్‌లో ఒక భక్తుడు.

నేను బాగా మాట్లాడుతానా? లేక, నేను మాట్లాడే విషయం బాగుంటుందా? అని నేను తిరిగి ప్రశ్నించాను. ఆ తరువాత మా సంభాషణ అనేక సత్యాంశాలను స్పృశిస్తూ సాగింది. వాటిలో కొన్నిటిని మీతో కూడా పంచుకోవాలని ఈ ప్రయత్నం.

మాట్లాడటం ఒక అవసరమా? లేక అవసరమైన దానిని మాట్లాడటం అవసరమా? మనం చాలా మాట్లాడుతాము. అవి అవసరములా? కావా? అని యోచించము.

స్వామీజీని చూడాలని వస్తూ ఉంటారు. పరిస్థితుల కారణంగా కొంతసేపు నిరీక్షించవలసి వస్తుంది. అప్పుడు అక్కడున్న వ్యక్తులను పలకరించి, 'బాగున్నారా?' అంటూ ప్రారంభమై, ఆ తరువాత తాను ఆఫీసరు అయితే తన ఆఫీసులో ఆయన ఎలా నిర్వహిస్తున్నదీ, ఒకవేళ వ్యాపారి అయితే నేటి వ్యాపారము - లాభాలాభాలు, ఒక సంస్థను నిర్వహించే వ్యక్తి అయితే ఎడతెరిపి లేకుండా, ఎదుటి వ్యక్తి భావా లెలా నడుస్తున్నాయో కూడా పట్టించుకోకుండా ఆత్మస్తుతి నగారా, భార్యాభర్తలు, తండ్రీకొడుకులు, స్వామిభృత్యులు, మిత్రులు పరస్పరం ఎదుర్కొంటున్న సమస్యలు - ఇలా, అలా, అలలు అలలుగా సంభాషణలు సాగిపోతాయి.

ఈలోగా స్వామీజీని కలిసే అవకాశమొస్తే, ఏదో మొక్కు చెల్లించినట్లు నమస్కారాలు, ఫలపుష్పాలు సమర్పించి, వెంటనే - "స్వామీజీ! ఈ విషయంలో మీ అభిప్రాయ మేమిటి? నా దృక్పథాన్ని ఇప్పుడే బయట చాలామందికి వివరించాను. వాళ్ళందరూ సంతోషించారు" అంటూ బయట ఆగిన విషయాన్ని లోపల కూడా సాగిస్తారు.

ఇతడు బయట అవన్నీ మాట్లాడవలసిన అవసరమేమిటి? విన్నవాళ్ళు సంతోషించారని నాతో చెప్పడానికి ఋజువు లేమిటి? సరే, ఆ విషయాన్ని మళ్ళీ నా ముందు ప్రస్తావించడంలో ఆంతర్యమేమిటి? నన్ను కూడా వాళ్ళలాగా సంతోషపడినట్లు జమ కట్టేందుకా? ఒకవేళ సంతోషించలేకపోతే, నిరాశావాదుల కోవలో తోసేందుకా? అవసరం ఆలాపన అయినపుడు మాట పాటలాగా ఆహ్లాదాన్నిస్తుంది. ఇక అవసరం లేని విషయాల్ని అసందర్భంగా మాట్లాడుకుంటూ పోవడం వ్యాపకం కాదు; వ్యసనం.

వ్యసనాలన్నీ ఖర్చుతో కూడుకొని ఉంటాయి. వాగ్వ్యసనం ఒక్కటే ఖర్చు లేకుండా ఉంటుంది. కానీ, దానివలన ఎంత శక్తి నశిస్తుందో ఆలోచించే జ్ఞానం ఉంటే ఇదే ఖర్చు లన్నిటిలో అధికమైనదని నిర్ణయించవలసి ఉంటుంది.

ఈ వాగ్వ్యసనం చాలా భయంకరమైనది. ఇది పిచ్చివాడి చేతిలో రాయి కాదు; పిల్లవాడి చేతిలో కత్తి. వాగ్వ్యసనపరుల వల్ల పరులకు జరిగే హానిని నిర్మూలించ వచ్చునేమో

గాని, తమకు కలిగే ప్రమాదాన్ని దూరం చేయడం బహు కష్టము. మనస్తత్వ శాస్త్ర పరిధిలో నిలబడి నిగూఢంగా యోచిస్తే గాని ఈ విషయం అంతుపట్టదు.

నా మాటలు బాగుంటాయి అని నీవు అన్న విషయాన్ని నేను అంగీకరిస్తాను. అయితే, ఒక్క విషయాన్ని నీవు అర్థం చేసుకోవాలి. ఎందుకు బాగుంటాయో తెలుసా? నేను బాగా మాట్లాడటం వల్ల కాదు; బాగుండే మాటల్నే మాట్లాడటం వల్ల.

మనం ఏమి మాట్లాడుతున్నామో మనకు పూర్ణంగా తెలిసి ఉండాలి. స్వతంత్ర భావాలు శాస్త్రీయంగా మనసులో నిలిచి ఉండాలి. అవి కూడా సుస్పష్టంగా ఉండాలి. అంతేగాని, వాటి కారణంగా దురద లేకపోయినా తలకు గోకుడు ఉండకూడదు. మాట సహేతుకంగా ఉండాలి. సత్యమై ఉండాలి. సరళంగా ఉండాలి. సానుభూతి, ప్రేమ అనే రెండు చక్రాలు గల వాక్శకటంపై మాటల మూటలు కదిలిపోవాలి. అప్పుడే అవి వినేవారి హృదయాలపై కట్టని కోటలై శోభిస్తాయి...............................

అనవసరమైన పదాలను ఎక్కువగా ఉపయోగించకూడదు. కంటిలో కాటుకలా, కూరలో ఉప్పులా ఉండాలి పదముయొక్క ఉపయోగం.

ఉపయోగం లేని పదాలు, వాక్యాలు వృథాగా ఉచ్చరింపబడటం వల్ల వృథా ఫలితాలు వస్తాయే గాని సత్ఫలితాలు రావు. కనుకనే ఆచార్యుల వారు **న తు వృథా వాక్యం సముచ్చార్యతామ్** అన్నారు సాధన పంచకంలో. వృథావాక్యాలు, వ్యర్థ ప్రసంగాలు సాధకులు అనివార్యంగా త్యజించాలి.

అధిక ప్రసంగి ఏ క్షణాన అయినా అబద్ధాలకోరు కావచ్చు. అసత్యవాదిగా మిగిలిపోవచ్చు. వాక్కును నియమించాలి. ఇది బ్రతుకులో ఒక నియమం కావాలి. సుగుణంగా మారాలి. అప్పుడే వ్యక్తికి కాంతి. సమాజానికి శాంతి. మితిమీరిన మాటలు నరకానికి బాటలు నిర్మిస్తాయి. తెలిసి పలికే పలుకులు, రెండు గట్ల మధ్య ప్రవహించే జీవనది లాగ సాగే భావగర్భిత సత్యవాక్కులు విశ్వాన్ని సమ్మోహింప చేస్తాయి.

బాబూ! నా మాటలు బాగుండటానికి మరొక కారణం నా మాటల్లో మాట్లాడేవాడు కనిపించకపోవడం. నాది విషయ ప్రధానంగా నడిచే ప్రసంగమే కానీ 'వ్యక్తి' ప్రధానం కాదు. నేనెంతసేపు మాట్లాడినా సత్యాన్ని విశ్లేషిస్తూ పోతానే గాని నా వ్యక్తిత్వాన్ని దానిలో కలపను. ముఖ్యంగా నా ప్రసంగాలు అశేష ప్రజానీకాన్ని ఆకర్షించడం వెనుక ఇదికూడా ఒక ముఖ్యాంశమే.

ఒకొక్కసారి 'నేను' అంటూ ప్రసంగించడం కూడా ఉంటుంది. కొన్ని వేదికలపై ఈ పదం ప్రసంగ విషయాన్ని బట్టి అనేకసార్లు దొర్లుతూ ఉంటుంది. మచ్చుకు ఒక విషయం చెబుతాను.

నేను చెడ్డవాణ్ణి అనుకోండి. చెడుకార్యాలు చేస్తాను. చెడు ఫలితాలను అనుభవిస్తాను; అని చెప్పుకు పోతాను. అంతేగాని, మీరు చెడ్డవాళ్ళు అనుకోండి అని అన్నానంటే,

వినేవాడు ప్రతిచర్యతో స్పందిస్తాడు. ఇలా వినేవారిని కలత పెడుతూ మాట్లాడే వారి మాటలు వినసొంపుగా ఉండవు.

నా చిన్నతనంలో నేనొక స్వామిజీ ఉపన్యాసానికి వెళ్ళాను. ఆయన మహా ఆవేశంతో ప్రసంగిస్తున్నాడు. ఆ ఆవేశ ప్రవాహంలో దుఃఖము యొక్క ఆగమనాన్ని చెప్పదలచి, “మీరు ఇప్పుడు నా ఉపన్యాసం వింటున్నారు. సపోజ్ ఎవరైనా ఇప్పుడు మీ వద్దకు వచ్చి, మీ భార్య చనిపోయిందని చెబితే మీకు ఎలా ఉంటుంది?” అని ఏదో ప్రయోగాత్మకంగా పలికినట్లు పలికి శ్రోతల్ని కుదిపేశాడు. కలవర పెట్టేశాడు.

ఉపన్యాసానంతరం తిరిగి వెళ్తున్న శ్రోతలందరూ ఈ విషయాన్ని గర్హించారు. అందులో ఒక వ్యక్తి అన్నాడు “అసలు సన్యాసుల వద్ద వినకూడదండీ. పండితుల దగ్గర వినాలి” అని. నాకు ఇప్పుడు జ్ఞాపకం లేదు గాని చాలామంది చాలా చాలా మాట్లాడారు. అప్పుడే నేను నిర్ణయించుకున్నాను మాటల్లో మనం ఎవరినీ చంపకూడదు అని.

కనుకనే, ఇలాంటి విషయాల్ని ప్రస్తావించవలసి వచ్చినపుడు నేను 'మీ' వాడను. 'నా' వాడుతాను. మీ వాడను కనుక మీరు పట్టించుకోరు. నాకు ఎలాగూ భార్య లేదు కనుక నేనూ పట్టించుకోను. ఇదీ పద్ధతి. పట్టింపులు లేని ప్రసంగం పట్టు విడుపులు లేకుండా ధారాప్రవాహంగా సాగిపోతుంది. ఇక్కడే వక్తకు శ్రోతలపై పట్టు దొరికేది.

శ్రోతల స్మృతుల్ని కదిలించకుండా ఊహల్ని కదిలించుకుంటూ పోవడం వక్తకు బాగా తెలిసి ఉండాలి. “మీ భార్య మిమ్మల్ని నిందించింది అనుకోండి” అనగానే వినేవాడు అనుకోడు. గతంలో ఎప్పుడెప్పుడు ఎలా ఎలా నిందించిందో వాటి నన్నిటినీ ఏరుకొని ముందు ఆరబోసుకుంటాడు. ఇక ఆ క్షణం నుండి ఆలోచనా మార్గము దారి తప్పుతుంది. ఒకవేళ ఆవేదన కలిగినా ఆశ్చర్యపడ నవసరం లేదు. ఇలాంటి సమయాల్లో నేను ఇష్టపడి లేని భార్యచేత తిట్టించుకుంటాను. ఇదొక నిర్హేతుక ప్రారబ్ధం. దీనినే నేను ప్రసంగ ప్రారబ్ధం అంటాను. కొందరు సాధువులు “మేము ఎవరినీ బాధించము. వినేవారికి అనుకూలంగా ఉండేలా మాట్లాడుతాము” అంటుంటారు. ఇదొక సమస్య. దీనిని నేను అర్థం చేసుకోలేను. వినేవాడు తెలియనివాడు. తెలియని వాడికి తాళం వేస్తూపోతే వక్త సంఘర్షణకు గురి అవుతాడు. శ్రోత సమస్యలలో చిక్కుకొని పోతాడు.

వినేవాడికి అనుకూలంగా మాట్లాడకూడదు. నీవు మాట్లాడేది వినేవాడికి అనుకూలంగా ఉండాలి. నా ఉపన్యాస వేదికల వద్ద ఈ సత్యాన్ని మీరు సుస్పష్టంగా చూడవచ్చు. ఉపన్యాసానంతరం “ఈ రోజు స్వామిజీ నాకే చెప్పినట్లుంది. నాకేదో గొప్ప నిధి లభించినట్లుంది” అని చెప్పుకుంటూ ఇళ్ళకు వెళ్తూ ఉంటారు వేలాదిమంది శ్రోతలు. చెప్పిన విషయం ఒక వ్యక్తికి అనుకూలమైతే మరొకరికి అనుకూలంగా ఉండకపోవచ్చు. కాని,అందరికీ అనుకూలంగా, ఆసక్తికరంగా ఉన్నది అంటే, అది శ్రోతలకు అనుకూలంగా భాషించిన ప్రసంగం కాదు. భాషించిన దంతా శ్రోతలందరికీ

అనుకూలంగా ఉంది. ఎందుకో తెలుసా? ఈ శక్తి ఎవరిదో తెలుసా? వక్తది కాదు; విషయానిది. సత్య విషయానిది. వక్త ఏమీ చేయనవసరం లేదు. తన పైత్యాన్ని జోడించకుండా సత్య స్వరూపిణి అయిన శాస్త్రాన్ని శాస్త్రీయంగా వివరించుకుంటూ పోతే చాలు. శిరముపై గంగాజలం సంప్రోక్షించినట్లు, ఉరముపై పువ్వులను విసిరినట్లు బోధ ఆహ్లాదకరంగా ఉంటుంది.

వినేవాడికి అనుకూలంగా మాట్లాడట మనేది చాలా విడ్డూరమైన విషయం. శ్రోత ఇష్టాయిష్టాలు మారుతూ ఉంటాయి. వాటికి అనుకూలంగా ప్రసంగిస్తూపోతే మనం ప్రసంగించేది శ్రుతిని గూర్చి కాదు. వినేవాడి మతిని గూర్చి. ఇలా పరస్పర వైరుధ్యంగల భావాల్ని పురుషార్థనిశ్చయమున్న వ్యక్తి ప్రసంగించలేడు.

ఈ విధంగా భాష విషయంలో, భావ విషయంలో, ప్రసంగ ధోరణిలో వక్త విలక్షణంగా శోభించాలి. క్రమశిక్షణతో వ్యవహరించాలి.

కాని, ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రసంగానికి సంభాషణకి తేడా అవసరం లేదు. భాష ద్వారా భావప్రకటనే ముఖ్యం. సంభాషణలో ఒకరితోనో, మరో ఇద్దరితోనో మన భావాలు పంచుకుంటాం. ప్రసంగంలో అశేష ప్రజానీకంతో పంచుకుంటాం. అంతే.

ఒకరికి చెప్పినా అదే విషయం. పది వేల మందికి చెప్పినా అదే విషయం. నాకు ఎక్కువ మంది శ్రోతలు ఉంటేనే ఉత్సాహం, స్పందన ఉంటాయి అంటూ ఉంటారు చాలా మంది. ఇది మరీ భయంకరమైన విషయం. శ్రోతల వల్ల వక్త ఉత్సాహపడట మంటే గుఱ్ఱం ముందు బండి నుంచడమే.

ఈ విషయంలో శ్రోతల నుండి ఉత్సాహాన్ని అభిలషించే వ్యక్తుల్ని నేను తప్పు పట్టడం లేదు. ఇలాంటి వ్యక్తులకు ముప్పు ఎప్పటికీ తొలగదు అంటున్నాను. కనుకనే వారెంతెంతగా పబ్లిసిటీ చేసుకున్నా వాలే ఈగ ఉండదు. ఒకవేళ వాలినా మధ్యలోనే ఎగిరిపోకుండా ఉండలేదు.

వ్యక్తిగతంగా భక్తులు నాతో చర్చించేటప్పుడు నేను ఎలా మాట్లాడుతానో వేదిక మీద అలాగే మాట్లాడుతాను. అర్థం గాని పదాలను వాడను. ఒకవేళ వాడవలసి వస్తే వెంటనే మరొక పర్యాయ పదాన్ని వాడి అవగాహనను సుగమం చేస్తాను. ఎలా మాట్లాడుతానో అలాగే వ్రాస్తాను. కనుకనే, ప్రసంగాల పలుకుబడికి తీసిపోకుండా పలుకులమ్మ ఏలుబడి ఒక్క వెలుగు వెలిగింది. ఒడి ఒడిలో ఆమెకు గుడి వెలిసింది. గ్రంథాలను విశేష సంఖ్యలో ముద్రించడములో గాని, విక్రయించడములో గాని సుందర చైతన్యాశ్రమం అసమాన శోభతో రికార్డు స్థాయిలో నిలిచిపోయింది.

పదముల పలుకుబడిని తోడు చేసుకొని, సమయ సందర్భాలను దృష్టిలో ఉంచుకొని, వాక్యనిర్మాణం చేసుకుంటూ సరళంగా, అతి సామాన్యంగా పలికే వాక్నియమం అలవరచుకోవాలి. ఇదే వాక్ తపస్సు.

మాట్లాడటం ఆపి, అవసరాన్ని గుర్తించి మాట్లాడటం అలవరచుకోవాలి. అనవసరంగా మాట్లాడే వారికి అవసరమైన విషయాల్ని ఆలకించే అదృష్టం ఉండదు. భాషణం భూషణంగా శోభించాలి. వాక్కు భూషణం. వాగుడు దూషణం. వాగుడు కలవాటు పడ్డవారు మౌనాన్ని భరించలేరు. వారైనా మాట్లాడాలి. లేదా మరొకరైనా వారితో మాట్లాడాలి. ఇది నాలుకకు ప్రాప్తించిన దురద. నోటికి పట్టిన బురద. దురదలో గోకుడు తప్పదు. బురదలో జారుడు తప్పదు.

పలికే నేర్పు తెలియనినాడు పలుకులన్నీ పతనాలే.

పలుకు నేర్చి పలికిన నాడు పలుకులన్నీ రతనాలే.

తుమ్మెద ఎటు ఎగిరినా, ఎక్కడ తిరిగినా పువ్వుపై వాలినప్పుడే నవ్వుతుంది. తనకు ఆకలి తీరేది, ఆనందం కలిగేది పువ్వు ఒడిలోనే. ఆ గుడిలోనే.

అరవిందము ఎవరికైనా అందంగానే అగుపిస్తుంది. కానీ భ్రమరానికి అందులో అందమే కాదు; ఆనందం కూడా లభిస్తుంది. ఎందుకో తెలుసా! అరవిందంలో దాగిన మకరందమును జుర్రే భాగ్యం తనకే ఉంది గనుక.

పరమాత్మ పాదారవిందము సర్వులకు ఆధారము. కానీ భక్తులైన భ్రమరాలకు ఆ చరణారవిందము ఆధారస్థానమే కాదు; ఆనంద నిలయము కూడా.



స్నేహ పురాణం

సమానధర్మములు గలవారి మధ్య సఖ్యము సాధ్యము. ఇది సాధారణ విషయము. కొన్ని సమయాలలో, సందర్భాలలో అపరిచితుల మధ్య కూడా స్నేహము సాధ్యమవుతుంది. అప్రయత్నంగా స్నేహము లభిస్తుంది. ప్రయత్నము లేకనే మిత్రులు దొరకునట్లు, కొన్ని సమయాలలో ప్రయత్నము లేకుండా శత్రువులు కూడా లభిస్తారు. జీవనరీతిని బట్టి జీవనమాధుర్య ముంటుంది.

నీ స్నేహితుడు నీకు ప్రియంగా గోచరిస్తాడు. ఇది సామాన్య విషయం. నీ మిత్రునికి మిత్రుడు నీకు తెలియకపోయినా పరోక్షంగా నీకు మిత్రుడవుతాడు. నీ భావాలకు అతని భావాలకు పొంతన లేకపోయినా నీ మిత్రునికి మిత్రుడగుటచేత నీకూ మిత్రుడౌతాడు. ఇది సర్వులకు అర్థమయ్యే సామాన్య విషయము.

మిత్రుని మిత్రుడు మనకూ మిత్రుడౌతాడు. కానీ మన శత్రువు యొక్క శత్రువు మనకు శత్రువు కాడు. పైగా మిత్రుడౌతాడు. ఇక్కడే మనం కాస్త ఆలోచనలను కదిలించాలి. నీ శత్రువునకు అతడు శత్రువగుట వలన మీ ఇరువురి మధ్య సమాన ధర్మములు లేకపోయిననూ అతడు నీకు మిత్రుడౌతాడు. కర్ణదుర్యోధనుల భావములలో సామ్యము లేకున్నను దుర్యోధనునకు శత్రువైన అర్జునుడు కర్ణునికి శత్రువగుటయే కర్ణ దుర్యోధనుల మిత్రత్వమునకు కారణమైనది.

ఇచ్చట మనము ముఖ్యంగా రెండు విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. (1) నా స్నేహితుని శత్రువు నాకూ శత్రువేనా? (2) నా శత్రువు యొక్క మిత్రుడు నాకు మిత్రుడు కాగూడదా? ఈ ఆలోచనలు కొన్ని ఆసక్తికరమైన జీవనరీతులను మనకు దర్శింప చేస్తాయి.

నా మిత్రుని శత్రువుపై నేను శత్రుత్వం వహిస్తే నా మిత్రుడు ఆనందంతో పొంగిపోతాడు. అలాగాక అతనిపై నేను ప్రేమను పెంచుకొని సఖ్యము చేస్తే నా మిత్రుడు బాధపడతాడు. అంతేకాదు. నన్ను విస్మరించే ప్రమాదము కూడా కలుగవచ్చు.

సాధారణంగా స్నేహము ప్రారంభం కాగానే అప్రయత్నంగా స్నేహితులు ప్రమాణాల పర్వాన్ని సాగిస్తూ ఉంటారు. "మిత్రమా! ఈ క్షణం నుండి మనము స్నేహితులం. మన మధ్య స్నిగ్ధమే గాని స్పర్ధలుండవు. మన స్నేహము జీవితాంతము ఇలాగే ఉంటుంది. నిన్ను నేను ఎట్టి పరిస్థితులలోను కష్టపెట్టను".

బాగుంది. నీవు నీ మిత్రుని కష్టపెట్టవు. కానీ అతడే కష్టాలను వరిస్తే? అప్పుడు నీవేమి చేయగలవు? కనుక దీనిని కూడా దృష్టిలో ఉంచుకొని ప్రమాణాలు అనే పరమాన్నంలో పంచదారలాగ ఒక విషయాన్ని కలుపుకోవాలి.

"మిత్రమా! నిన్ను నా ప్రాణసమానంగా భావిస్తాను. అంతేగాదు. నీ కొరకు నా ప్రాణాన్నైనా అర్పిస్తాను. నా స్నేహాన్ని నీవు కాంక్షించు. కానీ నీ శత్రువుతో నా శత్రుత్వాన్ని ఆకాంక్షించకు. ఇది మన మిత్రత్వానికి అంత మంచిదికాదు. నేను నిన్ను ప్రేమిస్తాను.

నీ శత్రువును కూడా ప్రేమిస్తాను. శత్రువులైన మీ ఇరువురికి నేను మిత్రుడగుట వలన మీలోని స్పర్ధలను పోగొట్టి స్నేహాన్ని కల్పించే అవకాశమునకు నోచుకోగలను. మిత్రత్వము లాలిపాడి నిద్రపుచ్చుతుంది. శత్రుత్వము తట్టి లేపి జాగరణ చేయిస్తుంది".

ఈ విధంగా కుదిరిన ఒడంబడిక నిన్ను ఒంటరివానిని చేయదు. నీ మిత్రుని శత్రువుని నీవు ప్రేమించినను నీ మిత్రునితో నీ స్నేహము భగ్నంకాదు. పైగా వారిరువురిని నీవు ఏకం చేయగలిగితే మీరు ముగ్గురు మిత్రులవుతారు. ఒకవేళ వారిరువురి మధ్య నిలిచియున్న అపార్థాలను తొలగించలేకపోతే తటస్థ విధానము ననుసరించ వచ్చు. అంతమాత్రాన ఎవరితోనూ నీ స్నేహము భంగము కాదు. భగ్నము కాదు. నీ మిత్రుని శత్రువుతో నీవు శత్రుత్వమును వహింపలేవని నీ మిత్రునికి ముందే తెలుసు గనుక అతడు నిన్ను మరో విధంగా భావించడు. ఒకవేళ నీవు వారిరువురిని ఏకం చేయవచ్చు. అంతటి శక్తి నీకు లేకపోతే నీవు తటస్థముగా ఉండవచ్చు. కష్టాలు, నష్టాలు వాటిల్లే అవకాశము లేదు.

ఇక రెండవ విషయం. నా శత్రువు యొక్క మిత్రుడు నాకు శత్రువు కావలసిందేనా? అవసరం లేదు. నా శత్రువు యొక్క మిత్రులను నేను శత్రువులుగా పరిగణింప నవసరము లేదు. మనస్సును సంస్కరించుకుంటే అందరూ మిత్రులే. పుట్టుకతో మనకు శత్రువులెవరు? అవగాహన లోపించినపుడు శత్రువులు మొదలయ్యారు. అవగాహనతో చరిస్తే అందరూ బంధువులే.

శత్రువునే శత్రువుగా భావించకూడదు. ప్రయత్నముతో శత్రువును కూడా మిత్రుడుగా మలచుకోవాలి. శత్రువే శత్రువు గానపుడు శత్రువు యొక్క మిత్రుడు నీకు శత్రువెలా అవుతాడు? నీకు అవగాహన కుదిరింది గనుక నీవు సరిపెట్టు కుంటున్నావు. మరి నీ శత్రువు యొక్క మిత్రుడు నిన్ను మిత్రుడుగా అంగీకరించుటకు సమ్మతించకపోతే, - - నీ మిత్రత్వాన్ని నిరాకరిస్తే, అప్పుడేమి చేయాలి? తటస్థ వైఖరి ఉండనే ఉంది. ఉదాసీనంగా ఉండటమే. మన బలహీనతలను మనం పోగొట్టుకోగలిగితే చాలు. ఇతరుల బలహీనతలకు మనం నీరసించడ మెందుకు?

దయ, ప్రేమ, క్షమాది గుణములు నిండిన హృదయములో పరమాత్మ వసిస్తాడు. భగవంతునితో మనకు మైత్రి కలిగితే సమస్త ప్రపంచముతో మనకు మైత్రి సిద్ధిస్తుంది. పరమాత్మ మనకు మిత్రుడు కాకపోతే అన్నిచోట్ల మనకు శత్రువులే అగుపిస్తారు. వెలుగున్నచోట చీకట్లు ఉండవు. ప్రేమున్నచోట ద్వేషాలు అంకురించవు. ప్రేమ హృదయగతం. సంశయాలు మనోగతం.

అందరినీ ప్రేమించాలి. ప్రేమించలేని నిర్భాగ్యులను క్షమించి అంగీకరించాలి.

ఎవరినీ బాధించకూడదు. బాధించే వారి వలలో పడకూడదు.

మిత్రత్వము దైవలక్షణం. శత్రుత్వము అసురజీవనం.

తక్షణ కర్తవ్యం

విషాదం, నైరాశ్యం - ఈ రెండింటిని చక్రాలుగా పొందిన జీవనశకటంపై ఆధునిక మానవుడు జీవనయాత్రను సాగిస్తున్నాడు.

తన బుద్ధికి అనుగుణంగా ప్రపంచంలో అంతా జరిగిపోవాలి అనేది మానవ జీవితంలో విషాదానికి కారణమైతే, అది అలా జరగనపుడు బ్రతుకులో నైరాశ్యం తొంగిచూస్తున్నది.

విజ్ఞాన శాస్త్ర పరిశోధనా వైభవములు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రాభవములు గతంలో ఎన్నడూ లేనంతగా శోభిస్తూ ప్రపంచపోకడనే శీఘ్రంగా మార్చేస్తున్నాయి. మానవుని వివేకం ముందు విశ్వం చాలా చిన్నదై పోతున్నది. బుద్ధి ద్వారా మనిషి సాధించిన విజయాలు ఊహాతీతములు. వాటితో పాటు రుచిచూచిన వైఫల్యాలు కూడా తక్కువైనవి కావు.

పరిసరాలు ప్రతికూల వాతావరణంలో పడిపోయాయి. విచక్షణతో పాటు వైషమ్యాలు, వైమనస్యాలు కూడా ఆంతర్యంలో నిలబడిపోయాయి. ఋజుమార్గంలో దేనినీ అంగీకరించే స్థితిలో మానవుని మనస్సులేదు. ప్రతి విషయంలోను స్తనశల్య పరీక్షే. ఎవరిమీద ఎవరికీ నమ్మకం లేదు. తమపై తమకు అసలే లేదు.

శుష్కపాండిత్యాలతో, శూన్య హృదయాలతో బ్రతుకులు ఛిద్రమై పోయాయి. పోతున్నాయి. మాటకు విలువలేదు. మనిషికి విలువ లేదు. విలువకు విలువలేదు. విత్తానిదే పెత్తనమంతా. ఫలితం? భయాలతో, ద్వేషాలతో, మోసాలతో పగలతో మానవులు పరస్పరం కరచాలనం చేసుకుంటున్నారు. వాక్చాతుర్యంతో విశ్వం నడిచిపోతుందని, వాగ్దానాలతో మానవాళి తరించిపోతుందని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. సుస్పష్టంగా గోచరిస్తున్న ఈ కుట్రను **(transparent conspiracy)** ఎక్కువ శాతం ప్రజానీకం అర్థం చేసుకొనే స్థితిలో కూడా లేకపోవడం శోచనీయం.

ఈ పవిత్ర భారతావనిలో మానవ హృదయక్షేత్రాలు ఆధ్యాత్మిక బీజాలు మొలకెత్తుటకు అనుకూలమైనవి. ఋషులకు, మహర్షులకు, సంత్‌లకు, సాధువులకు, యోగులకు, త్యాగులకు నిలయమైన పుణ్యభూమి ఇది. కొన్ని యుగాలుగా ఈ పుణ్యభూమిలో మానవాళిపై ఆధ్యాత్మిక జ్ఞానప్రభావ ముంది. విలువల్ని పెంపొందించుటలో, వెలుగుల్ని ఆరబోయటంలో ఎందరో మహానుభావులు తమవంతు పాత్రను తాము నిర్వహిస్తూ నడిచారు.

కాని, కొన్ని శతాబ్దాలుగా సాగిన పాశ్చాత్య కర్కశ పాలనలో జాతీయత కుంటుపడింది. విలువలు అడుగంటిపోయాయి. త్యాగం పాండవులవలె అజ్ఞాతవాసంలోకి

వెళ్ళింది. స్వార్థం దుర్యోధనునివలె పట్టాభిషేకం చేయించుకున్నది. దాని పర్యవసానం భారతం ద్రౌపదిలా నలిగిపోతూ ఉంది.

స్వాతంత్ర్యం లభించింది. పెకలించబడిన సంస్కృతీ వృక్షాన్ని తిరిగి నాటుకోవలసిన బాధ్యత, నీరుపోసి పెంచుకోవలసిన ధర్మం పాలకులపై పడింది. ఐదు పదులు నిండిన స్వతంత్ర భారతదేశంలో ఆ ప్రయత్నాన్ని కొనసాగించాలనే ఆలోచన నాయకుల్లో కలగకపోవటము అలా ఉంచి, సంస్కృతి శాశ్వతంగా మరుగున పడిపోయే రీతిలో విజృంభించిన కార్యక్రమాలకు పదవీ దాహంతో ఊపిరిపోయటం కూడా కళ్ళముందే జరిగిపోతూ ఉంది.

పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించడం, వ్యవసాయ రంగంలో నూతన దృక్పథంతో పురోగమించడం, ఆర్థిక సంస్కరణలతో శోభించడం, న్యూక్లియర్ కవచంతో రక్షణ స్థితిని పటిష్టం చేయడం, ఆహార, విద్యా, వైద్య సదుపాయాలను సమకూర్చడంలో ముందు చూపుతో నడక సాగించడం........

ఇవన్నీ జరుగుతూ ఉండినా, జాతీయ సంస్కృతీ వృక్షానికి నీరు పోయాల్సిన తక్షణ కర్తవ్యాన్ని ప్రభుత్వాలు మరచిపోతే మాత్రం ఆ ప్రభుత్వాలు తీవ్ర అపజయాన్ని పొందాయని అంగీకరించవలసి వస్తుంది. అలాంటి పరిస్థితి రాకూడదని పరమాత్మను పవిత్రంగా ప్రార్థించటంకన్నా మనం చేయగలిగింది లేదు.

'దేశోఽయం క్షోభరహితః'

చీమ చిన్నదే అయినా దాని నోట్లో చక్కెర ఉంటుంది. ఏనుగు పెద్దది అయినా దాని తలమీద అంతా దుమ్మే. తలకు ఎక్కించుకోవలసింది ఏదీ లేకపోయినా తలగడల రూపంలో చెత్త నింపిన పుస్తకాలను కొందరు రచయితలు సమాజ భుజానికి ఎత్తుతూ ఉంటే, కొండ అద్దమందు కొంచెమై ఉండదా అన్నట్లు విశిష్టమైన పెద్ద విషయాన్ని తక్కువ మాటల్లో పొదిగి అందించగలిగే నేర్పు నూటికో, కోటికో ఏ ఒక్కరికో ఉంటుంది. వారే గురువులు. ఆచార్యులు.

తండ్రి మనసు తల్లికి రాదు. తల్లి హృదయం తండ్రికి ఉండదు. కానీ ఈ రెండూ ఆచార్యునికి ఉంటాయి. **ఆచార్య దేవో భవ!** గురువు నీకు దేవుడు అగుగాక! అని ఆశీర్వదించింది వేదమాత. అట్టి ఆచార్యులు ధర్మాన్ని, ప్రేమని కలబోసి జ్ఞానాన్ని అందిస్తారు.

దేశోయం క్షోభరహితః

'దేశం క్షోభ నుండి విడిపడి శోభతో వెలిగిపోవాలి', అనేది అందరి అభిమతం. ఈ సూక్తి రేపు ఎందరికో స్ఫూర్తి కేంద్రమై, ఇదే ఒక మతంగా పరిఢవిల్లినా ఆశ్చర్యపడ నవసరం లేదు. ఏ మతమైనా మతి నుండి పుట్టిందే కనుక.

దేశం క్షోభకు గురి కాకూడదు. ఇది బాగానే ఉంది. గురి అయిననాడు, ఆ పురిని విప్పడానికి బాధ్యతల్ని, ధర్మాన్ని మరచి, హక్కుల పోరాటమే ప్రధానమని భావిస్తే ఆ తరువాత మిగిలేవి చిక్కులే.

హక్కుల నినాదాలతో ఈరోజు ఆకాశం మారుమ్రోగుతున్నదే గాని బాధ్యతల బోర్డులు కట్టుకొని భూమాత సుఖపడలేక పోతోంది.

అసలు 'హక్కు' అనే పదమే ఒక నెగటివ్ కిక్.

జీతం పెంచమని ఉద్యోగులు సమ్మె చేస్తారు. ఇది తమ హక్కు కనుక పోరాటం సాగిస్తామంటారు. వాస్తవాన్ని అవలోకిస్తే, అక్కడ కనిపించేది హక్కుల ప్రదర్శన కాదు. బాధ్యతల విస్మరణ.

'జీతాలు పెంచాలి' - ఇది ఉద్యోగుల హక్కు కాదు. ప్రభుత్వం బాధ్యత.

'భర్త భార్యను పోషించాలి' - ఇది భార్య హక్కు కాదు. భర్త యొక్క బాధ్యత.

అలాగే,

లంచం పుచ్చుకోకూడదు.

పన్నులు కట్టాలి.

నల్లధనం ఉంచుకోకూడదు.

దానగుణం కలిగియుండాలి.

కుటుంబాన్ని పోషించాలి.

పొరుగువారిని ప్రేమించాలి - ఇవన్నీ బాధ్యతలే. వీటిని గూర్చి ప్రాచీన భారతం బాధ్యతగా ఆలోచించింది. సూర్యోదయంతో చీకట్లు మాయ మగునట్లు బాధ్యతలను చేపట్టిన సమాజంలో హక్కుల పోరాటం, చిక్కుల ఆరాటం ఉండదని భావించింది.

ఈ 'విజన్'(vision) పాశ్చాత్య దేశాలకు లేదు. అందువల్ల అక్కడ 'డివిజన్' (division) వెర్రితలలు వేసింది. అర్థంగాని అయోమయదశలో 'యూనియన్, యూనియన్, యూనియన్' (Union) - ఈ మాటే మిగిలింది. ఒక విధంగా చెప్పాలంటే, కష్టాలకు అడ్డుగోడై నిలిచింది.

అష్టకష్టాలు పడి పారిపోయి వచ్చిన కాందిశీకులకు ఆశ్రయ మిచ్చిన ఈ పవిత్ర భారతదేశం,

రోమ్ నిరంకుశత్వంలో తమ పవిత్ర దేవాలయం కూలిపోయినపుడు శరణార్థులై దక్షిణ భారతంలో అడుగుపెట్టిన ఇజ్రాయిల్ ప్రజలను ఆదుకొని అండగా నిలిచిన ఈ పుణ్య భారతావని,

ఆశ్రయించిన క్రైస్తవ మతాచార్యుని తృప్తిపరచే ప్రయత్నంలో ధనధాన్యాదులను సమర్పించుటయే గాక, వారి అభీష్టమును నెరవేర్చుటకు కేరళ దేశంలో అనేకమంది హిందువులకు నచ్చచెప్పి క్రైస్తవులుగా మార్చిన సహనశీలత గల హిందూరాజులను కన్న ఈ భరతమాత - తన బిడ్డల్ని బాధ్యతల వెన్నతో పెంచిందే గాని, హక్కుల మన్నుతో పెంచలేదు. కనుకనే, ఈ దేశంలో పుట్టినందుకు గర్విస్తూ,

I am proud to belong to a religion which has taught the world both toleration and universal acceptance.

"విశ్వానికి సహనము, సర్వసమ్మతము అనే సందేశాలను అందించిన మతానికి నేను సంబంధించిన వాడినని చెప్పుకొనేందుకు గర్వపడుతున్నాను;" అన్నారు చికాగోలో స్వామి వివేకానంద.

ఈ దివ్యభావాలు వంటబట్టిన కారణంగానే మచ్చలేని దేశంగా భారతదేశం భాసిస్తోంది.

ఇంతవరకు,

నిర్దాక్షిణ్యంగా, కుట్ర, కుతంత్రాలతో తనను ముట్టడించిన వారికి అలసిపోకుండా ఐశ్వర్యాన్ని పంచి ఇచ్చిందేగాని, ఇంతపెద్ద దేశమైనా ఏనాడూ మరొక దేశంమీద దండయాత్ర చేసిన దాఖలాలు లేవు.

ఇది భారతీయ సమాజం.

బాధ్యతలకు అలవాటు పడిన సమాజం. అభ్యుదయ సమాజం.



న్యాయానికి న్యాయం

న్యాయాలద్వారా వేదాంతాన్ని తార్కికంగా గ్రహించవచ్చు. న్యాయాలే ఇంత గొప్పగా విజ్ఞానాన్ని పంచుతూ ఉంటే, ఇక వేదాంత శాస్త్రాన్ని అభ్యసిస్తే ఎలా ఉంటుందో వేరే చెప్పవలెనా? అని అనిపిస్తుంది కదూ? అలా అనిపించడం కూడా న్యాయమే. దీనినే **'కైముతిక న్యాయము'** అంటారు.

కైముతిక న్యాయము అంటే "వేరే ఏమి చెప్పాలి?" అని అర్థము. ఇలా అనడంలోనే చెప్పలేనిదంతా చెప్పినట్లే అవుతుంది. ఇదియే కైముతిక న్యాయము. సోదాహరణంగా తెలుసుకుందాం.

-కంచే చేనుమేస్తే ఇక చెప్పే దేముంటుంది?

బిడ్డల భవిష్యత్తును తల్లిదండ్రులే విస్మరిస్తే ఇక బిడ్డల ప్రగతి ఎలా ఉంటుందో వేరే చెప్పవలెనా?

సాధువులే అసూయతో కుమిలిపోతూ ఉంటే, అలాంటివారిని ఆశ్రయించిన ముముక్షువుల మోక్షం ఎలాంటిదో వేరే చెప్పవలెనా?

ఎన్నుకోవలసిన ఓటర్లే డబ్బుకు అమ్ముడు పోతుంటే, ఎన్నుకోబడిన నాయకులు కాపాడే ప్రజాస్వామ్యం ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పవలెనా?

పుష్టిని కల్పించవలసిన ఆహారము విషపూరితంగా మారుతూ ఉంటే అట్టి ఆహారాన్ని గ్రహించినవారి ఆరోగ్యము ఎలా ఉంటుందో వేరే చెప్పవలెనా?

కుక్షింభరిత్వానికై చేయకూడని పనులు చేసిన బుక్షుని లాంటి పాపాత్ముడే రామనామ ప్రభావంతో వాల్మీకిగా మారినపుడు రామనామము పాపమును పోగొట్టునని వేరే చెప్పవలెనా?

పశువులు మేసే దాణానే మిగల్చకుండా భుజించే ప్రబుద్ధులు ప్రజల నోటికి దేనినీ అందనివ్వరని వేరే చెప్పవలెనా?

జ్ఞానాన్ని బోధించవలసిన సన్యాసులు తాయెత్తులు కట్టేందుకు, తీర్థాలు పోసేందుకు పరిమితమైతే ఇక సాధకుల గతేమిటో వేరే చెప్పవలెనా?

అపి చేత్సుదురాచారో భజతే మా మనన్యభాక్
సాధురేవ సమన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥

"మిక్కిలి దురాచారవంతు డైనను అనన్యభక్తి కలిగి నన్ను సేవించినచో, స్థిరబుద్ధి గల అతడు సాధువే యని భావించాలి" అని భగవద్గీత - రాజవిద్యా రాజగుహ్య యోగములో భగవానుడు తెలిపినాడు.

సుదురాచారవంతుడే అనన్యభక్తి కలిగి సాధువుగా మారుతుంటే, సదాచారవంతుని విషయం వేరే చెప్పవలెనా? ... ఇక్కడ **అపి.. చేత్..** అంటూ పరమాత్మ చేసిన పద ప్రయోగము కైముతిక న్యాయము.

న్యాయమును కాపాడవలసిన చట్టము అన్యాయ చక్రములో కదలకుండా బిగించ బడినపుడు ఆ చట్టము ఎవరికీ న్యాయము చేయలేదని చెప్పడానికి మరొక న్యాయము కావాలా?

తన చిత్తమును నిగ్రహించుకొనుట తెలియని యతి అన్యుల మతులను సరి జేసేది శూన్యమేనని ప్రత్యేకించి ప్రవచించవలెనా?

చెరువులే ఎండిపోతూ ఉంటే చిన్న చిన్న గుంటల విషయం ఇక చెప్పాలా?

ధర్మ ప్రబోధకులే అధర్మ మార్గాన చరిస్తూ ఉంటే సామాన్యుల స్థితి, సాధారణ ప్రజల గతి ప్రత్యేకించి చెప్పవలెనా?

తాను తినక, పరులకు పెట్టక గడ్డివామిపై కూర్చున్న లోభివానికి వచ్చిన లాభము ఏదైనను అది వాస్తవానికి నష్టమేనని వేరే చెప్పవలెనా?

ఉట్టికి ఎక్కలేని తల్లి స్వర్గానికి చేరుతుందా అన్నట్లు, ఇంద్రియ నిగ్రహమే లేనివారికి అతీంద్రియ జ్ఞానము కలుగదని వేరే చెప్పవలెనా?

ఎంత బోధించినా కొంతైనా ఆచరణలో తొంగిచూడని వారికి ఎంతెంత బోధించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అని వేరే చెప్పవలెనా?

ఇలా ఉంటుంది కైముతిక న్యాయము.

కనీసం ఈ న్యాయానికైనా మనం న్యాయము చేయగలిగితే బ్రతుకు అన్యాయము కాదని వేరే చెప్పవలెనా?

ఒకవేళ, 'చెప్పాలి' అని మరీ పట్టుపడితే చెబుతాం. అది వేరే విషయం. కాని, చెవులకే పని చెప్పి, చిత్తాన్ని నిద్రపుచ్చితే నిరంజనాన్ని పొంది తరించడం శూన్యమని వేరే చెప్పనవసరం లేదనుకుంటాను.

చెప్పింది చాలు. చేస్తేనే ఇక మేలు.

పూర్వ భాషణమే అపూర్వం

చేదు బ్రతుకును భరించడం ఎవరికైనా కష్టమే. తీపి చేదులనేవి ఎక్కడ నుండి సంప్రాప్త మవుతున్నాయి? అవి వ్యక్తిలో ఎలా చోటు చేసుకుంటున్నాయి? బయట నుండి వస్తున్నాయా? లేక ఆంతర్యంలో జనిస్తున్నాయా?

బాహ్యంలో చేదుండినా, ఆ చేదును చూసే మనస్సు మనవద్ద లేనపుడు చేదు - చేదుగా తెలియదు. భరించలేని చేదును మనస్సులో దించుకొనిన దెవరు? మనస్సే. మనస్సులో చేదు ఎందుకు ప్రవేశించింది? తీపి లేకపోవుట చేత. మధురమంటే ఎవ్వరికైనా ఇష్టమే. తీపిని వాంఛిస్తారే గాని తియ్యగా జీవించలేరు. మధురపదార్థము చుట్టూ ఈగలు చేరినట్లు, మాధుర్య జీవనము గలవాని చుట్టూ మనుజులు చేరుతారు.

సత్త్వగుణము వృద్ధి చెందితే వ్యక్తిలో సౌకుమార్యం జనిస్తుంది. సున్నితత్వం పెరుగుతుంది. నమ్రత పెనవేసుకుంటుంది. నాణ్యత గోచరిస్తుంది. ఇది మన బ్రతుకులలో మాధుర్యాన్ని పెంచుతుంది.

మధురభాషణము గలవారు ధన్యజీవులు. సర్వులను తమ వైపునకు ఆకర్షించు కుంటారు. పలుకు తియ్యగా ఉండాలి. అది పలుకులోని తీపి. చూపు చల్లగా ఉండాలి. అది చూపులోని తీపి. ఇతరులను నొప్పించకుండా సేవ చేయాలి. అది సేవలోని తీపి. ప్రవర్తన సౌమ్యంగా ఉండాలి. అది ప్రవర్తనలో తీపి.

కొందరు చల్లగా, హాయిగా భక్తితో కీర్తనలు పాడుతారు. అది గానంలో తీపి. కొందరు పాడుతుంటే పిండిమిల్లు ప్రక్కన యున్నట్లే ఉంటుంది. ఎవరికైనా వీరి పాటలు చేదుగానే ఉంటాయి.

మాటలు పరుషంగా ఉండకూడదు. చల్లగా ఉండాలి. అందరి హృదయాలు గాయాలతోనే నిండి ఉంటాయి. నీ పలుకులు వారి గాయాలపై నవనీతాన్ని పూసినట్లు ఉండాలి. కారం చల్లినట్లు ఉండకూడదు.

మనిషి రాగానే చల్లగా చూడాలి. మెల్లగా పలుకరించాలి. ఎవరు ముందు పలుకరించాలి? అని ఆలోచించడం తప్పు. నీ బ్రతుకులో తియ్యదనం రావాలంటే, కావాలంటే ముందుగా నీవే మాట్లాడాలి. పూర్వభాషియే మధురభాషి యని మరువ కూడదు.

నా మాటలు రోకటితో దంచినట్లున్నా, నా మనస్సు మాత్రము చాలా మంచిది, వెన్నలాంటిది అని కొందరు చెబుతూ ఉంటారు. మనస్సు అంత మంచిదైనపుడు మాటను కూడా మంచిగా నడుపుకుంటే ఎంత బావుంటుంది? మనస్సు మంచిదైనా మాట మంచిగా లేవందున మనస్సుకు, ఆ మనస్సును కలిగిన మనిషికి కూడా అగచాట్లు తప్పటం లేదు. పని కులుకే కాదు మంచి పలుకు కూడా ఉండాలి. కొందరు తిడుతూ పెడతారు. తినేవాళ్ళు తింటూ తిడతారు. ప్రేమలేని వినియోగము వాస్తవానికి శనియోగమే. మనోరోగమే. ప్రేమలేని కానుకలు ఎవ్వరికీ రుచింపవు. ప్రేమయే నిజమైన కానుక.

సేవా శకటం *

మిత్రమా!

నమస్తే. గిరిధారి కదలి రెండు నిముషా లైనట్లుంది. వేసింది రెండు అడుగులైనా, చేసింది ఎంతోలా కనిపిస్తున్నది.

మూడవ అడుగు వేయబోయే ముందు ముచ్చటగా మూడు మాటలు చెప్పాలను కున్నాను. నా ఈ మూడు మాటలు అందరికీ అర్థం కావాలని భాషానుడులను, భావ ముడులను ప్రక్కకునెట్టి సంపాదకీయాన్ని సవినయ మనవిగా మీ ముందు ఉంచదలిచాను. సముత్కర్ష ప్రగతిని ఆశిస్తున్నాను.

మోక్షప్రియా!

సేవ చేయాలని అందరూ సంబరపడలేరు. సేవ చేయాలనే సంకల్పం ఉంటే చాలదు. సేవలో తృప్తి చెందే హృదయం కూడా కావాలి. అదొక కళ.... కళా హృదయం... హృదయ కళావైభవము.

సేవా శకటం సదా నది వలె కదుల్తూనే ఉంటుంది. దేనినో కదిలించాలని కదుల్తుంది. అలా కదిలించే ప్రయత్నములో తానే కదలికను కోల్పోయి, కదలలేక కూలబడుతుంది. చివరగా నిరాశను భుజించి, నిట్టూర్పును త్రేపుతుంది.

సోదరా! సేవ చేస్తావా! అయితే విను.

నీవు సేవ చేసేది ఎవరికి? సమాజానికి..... అయితే సమాజం నిన్ను అర్థం చేసుకుంటుందా? సమాజానికి నీవు అర్థం కావడము అంటే నీవు చేసే సేవయొక్క స్వరూపం సమాజానికి తెలిసిపోయింది అని భావము. అదే నిజమైతే నీ నుండి సమాజం సేవలను అందుకోదు. తానే సేవ చేస్తుంది. ఆలోచించు...... ఆవేశాన్ని ప్రక్కకునెట్టి ఆలోచించు.

సరే..... సమాజము అర్థం చేసుకోలేదు అనుకుందాం...... అర్థరహితమైన సమాజం నుండి వ్యర్థపు మాటలు కదులుటలో ఆశ్చర్యమేముంది? అది అలా ఉండబట్టే దానికి సేవ చేసే అవకాశం నీకు లభించింది. ఆలోచించు. నీవు చేస్తున్నావు గనుకనే సమాజం నిన్ను బాధిస్తుంది. ఆ బాధలోనే నీ ప్రగతికి సంబంధించిన బోధ ఉంది.

ఆలోచించు

రాళ్ళ దెబ్బలు ఎవరికి? పండ్లులేని చెట్టుకా? కాస్త ఆలోచించు. నీ దగ్గర పండ్లున్నాయి. సమాజం దగ్గర రాళ్ళున్నాయి.....

మిత్రమా!

ఇంకొక చేదునిజం వింటావా! నీవు చేసే సేవ సేవకొరకా లేక గుర్తింపుకొరకా? సేవ కొరకే అయితే నీకు గుర్తింపు లేకపోవుటయే నయం..... సమాజంలో జ్ఞాన మొక్కటే

* ("గిరిధారి" పత్రిక విడుదలై రెండు వసంతాలు పూర్తియైన సందర్భంగా వ్రాయబడినది)

కాదు. అసూయలు, ఈర్ష్యలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ ఒక్కచోట సమావేశమైతే ఆ తరువాత నీ మనుగడయే మిగలదు.

నీవేమి గాంధీ కన్నా గొప్పవాడివా?

సోక్రటీస్ కన్నా యోగ్యుడివా?

దయానంద కన్నా ఉన్నతుడివా?

అదే నిజమైతే వారు అనుభవించిన వాటికన్నా అధికమైన బాధలకు నీవు సిద్ధం కావలసి వస్తుంది. ఆలోచించు.

మోక్షప్రియా!

ఇదీ వరుస. అర్థమయిందా? నిన్ను తెలుసుకోలేని సమాజం, నీ వైభవమును తెలుసుకోలేని సమాజం నిన్ను విమర్శిస్తుంది, హింసిస్తుంది. కనుక విమర్శలను పరామర్శించకు. ప్రశంసలను గుర్తించకు. ఈ స్థాయికి చేరినపుడే నీవు సేవ చేయగలవు.

"సేవ చేయలేము..... చేసే అవకాశము లేదు. అప్పుడేమి చేయాలి?" అనుకుంటున్నావా?

సోదరా!

చెబుతాను విను. అవకాశము లేనపుడు చేసేదే నిజమైన సేవ. అవకాశా లున్నపుడు ఎవరైనా చేయగలరు. ఏ అవకాశమూ లేనపుడు కూడా సేవ చేయగలవాడే నిజమైన సేవకుడు.

ఇది చెబితే వచ్చేది కాదు. లక్ష్యము స్థిరముగా యున్న వ్యక్తికి అనుభవములో తొంగి చూసేది. ఈత రానివాడు నదిలో మునిగిపోతాడు. మునిగియున్న తనకు నీటిలో గాలి లభించదు. అది అతనికి తెలుసు. అలాగని శ్వాసించుట మానేస్తాడా? ప్రయత్నిస్తూనే ఉంటాడు. సేవకుడు కూడా అలా ఉండాలి. సేవాజీవనము అనివార్య శ్వాసక్రియ కావాలి. ఆలోచించు.

మోక్షప్రియా!

ఇంకొక్క విషయం చెప్పనా! నీ మనస్సులో నడిచే సంశయ మేమిటో నాకు తెలుసు. దానికి కూడా పరిష్కారమును అన్వేషిద్దాం.

సేవ చేయాలి.... చేద్దాం.... లక్ష్యముతో జీవిద్దాము. స్ఫూర్తి కలిగి బ్రతుకుతాము. విమర్శలను ప్రక్కకు నెట్టుతాము. ప్రశంసలను ఆలకించము. శ్వాసలాగ సేవను కూడా బ్రతుకులో భాగంగా మార్చుకుందాం....... సేవ చేద్దాం..... కానీ ఫలితం శూన్యమైతే! అప్పుడేమి చేయాలి?

ఏదో చేయాలి అనే భావనను ప్రక్కకునెట్టి చేసే పనిలోనే నిండుశోభను నింపేందుకు యత్నించాలి. శిల్పి మట్టితో అనేక బొమ్మలు చేస్తాడు. కొన్ని బాగా తయారవుతాయి. కొన్ని తయారై పగిలిపోతాయి. బొమ్మలు పగిలాయని శిల్పి పని నుండి అలిగి దూరంగా పోతాడా? మళ్ళీ ప్రయత్నించి నూతనంగా బొమ్మలను చేస్తాడు.

నీవూ అదే చేయాలి. పనికిరానివి పగిలిపోనీ. పనివాడవు నీవు. పనితనము నీది. పనిచేసి చూపు. పనివాడ వనిపించుకో.

తెలిసిందా! ఇక సేవ చేసేందుకు ప్రారంభించు. చెప్పిన మూడు విషయాలు గుర్తున్నాయా!

సోదరా!

1. విమర్శలలో క్రుంగిపోవడము, ప్రశంసలలో పొంగిపోవడము మానేయి.
2. సేవ సేవకొరకేనని భావించి జీవించు. బాధలను భరించి ప్రేమించే ఎదను తయారు చేసుకో.
3. నీ సేవ నిష్ఫలమైనదని వగచకు. పతనాన్ని మరచి ప్రగతిని వలచి సాగిపో.

సాధకా! సాగిపో........ మెల్లగా సాగిపో.

భోజరాజును చూస్తే చాలు. సామాన్యుడు కూడా కవిగా మారుతాడు అని ప్రతీతి. భోజరాజు రాజధానియైన ధారానగరంలో కవి కానివాడు ఉండడట. ఒకనాడు గుడ్డలు నేసే సాలెవాణ్ణి "కవి కాడు" అనే నేరంపై భటులు బంధించి తీసుకొని వస్తారు. భోజరాజు ముందు నిలుపుతారు. భోజరాజు ఆ సాలెవానిని చూచి "కవిత్వం చెప్పగలవా?" అని ప్రశ్నించాడట.

సాలెవాడు:- **కావ్యం కరోమి "కావ్యాన్ని వ్రాయగలను"**

భోజరాజు:- **ఆహా!**

సాలెవాడు:- **నహి చారుతరం కరోమి "అంత మనోహరంగా వ్రాయలేను"**

భోజరాజు:- **ఊ!**

సాలెవాడు:- **యత్నాత్ కరోమి యది చారుతరం కరోమి "ప్రయత్నిస్తే వ్రాయ వచ్చు"**

భూపాల మౌళి మణిరంజిత పాదపీఠః

హే సాహసాంక! కవయామి వయామి యామి.

"హే భోజరాజా! గొప్ప గొప్ప రాజులు శిరస్సులు వంచి నీ చరణాలకు ప్రణమిల్లే సమయాన వారి కిరీటముల యందు పొదుగబడిన మణుల కాంతులు నీ పాదపీఠంపై ప్రతిబింబిస్తూ ఉంటాయి. అట్టి ఓ దివ్య సాహసాంకా! నేను కవిత అల్లుతాను (కవయామి). వలువలు నేస్తాను (వయామి). నీ ఆజ్ఞ అయితే వెళ్తాను (యామి)" అని చెప్పినాడట.

పితృ దేవోభవ

స్నేహాలు, సంబంధాలు లేకుండా జీవన యాత్రను మనిషి సాగించలేడు. ఏ జీవితాన్ని చూచినా లెక్కకు అందని సంబంధాలు కొన్ని దాగి ఉంటాయి. మరికొన్ని ఆగి ఉంటాయి. ఇంక కొన్ని సాగుతుంటాయి. సంబంధాలెన్నున్నా ప్రతి మనిషికి ప్రాప్తించే ప్రథమ సంబంధం తల్లిదండ్రులు.

తల్లిదండ్రుల సంబంధం పుట్టుకతో పుడుతుంది. చచ్చేవరకు చావకుండా ఉంటుంది. మరుపు లేకుండా ఉంటుంది. వ్యక్తులు జారిపోయినా స్మృతులు మారిపోవు. విషాదాలు ముంచెత్తినా, వినోదాలు ముందుకొచ్చినా ఆ జ్ఞాపకాలే ముందు నిలిచి మౌనంగా పలకరిస్తాయి. దూరతీరాలకు తీసుకెళ్ళి విశ్రమింప చేస్తాయి.

పసితనంలో వారిది పసివాడని అండ. యౌవనంలో వారి సలహా వాడని పూదండ. మధ్య వయస్సు సంఘర్షణలో వారి అనుభవం బలమైన కొండ. ఏదశలోనైనా వారు లేరనే కొరత మోయలేని బాధల గుదిబండ.

తల్లి ఒడిలోనే తొలిగా మనకు జీవిత పాఠాలందాయి. ఒడిలోకి రాకముందు తొమ్మిది మాసాలు ఆమె కడుపు మనపాలిట గుడియై రక్షించింది. ఆమె చూపుల్లోనే మనం ఏ ప్రమాదం లేకుండా కదిలాము. పెరిగాము. దూసుకుంటూ ముందు కెళ్ళాము. కనుకనే మాతృమూర్తిని ఎవరితోనూ పోల్చే సాహసం చేయలేకపోయాం. ఆమెను దైవం ప్రక్కనే కూర్చోబెట్టాం. **'మాతృదేవోభవ'**. "తల్లియే నాకు దైవ మగుగాక!" అని తైత్తిరీయ శ్రుతి నీడలో నిలిచి తల్లిని మనసారా కీర్తించాం.

అవసరాలను తల్లి చూస్తూపోతే, తండ్రి రక్షకుడై కాపాడాడు. నిర్భయంగా జీవించటానికి ఆ మహాత్ముని అనుగ్రహమే ఛత్రమై నిలిచింది. కనుకనే తండ్రి నిర్ణయాలను శ్రద్ధతో పాటించి ప్రగతిని సాధిస్తాం. తండ్రిని దైవంగా పూజిస్తాం.

'పితృదేవోభవ' అని శ్లాఘిస్తాం. ఆదర ప్రేమలతో చలించిపోతాం.

ఈ సందర్భంలో కౌటిల్యుని అర్థశాస్త్రం తండ్రి వైభవాన్ని ఎంత అందంగా చెప్పిందో చూడండి.

అన్నదాతా భయత్రాతా యస్య కన్యా వివాహితా।

జనితా చోపనేతా చ పంచైతే పితరః స్మృతాః॥

(1) ఆహారాది సౌకర్యములు సమకూర్చువాడు (2) భయమును పోగొట్టువాడు (3) కన్యాదానము చేయువాడు (4) జన్మనిచ్చువాడు (5) అధ్యయనమునకు ప్రవేశ పెట్టువాడు. ఈ ఐదు రకాలైనవారు తండ్రులని పిలువ బడుతారు.

పూర్వకాలంలో ఆ ఐదు పాత్రలు తండ్రియే పోషించేవాడు. కాలం మారింది. అవగాహన కూడా మారాలి. పై కార్యములు మన విషయములో ఎవరు చేసినా వారిని తండ్రులుగా భావించి పూజించాలి. ఇది సంప్రదాయం ప్రసాదించిన సదాచారం.

అమృత వాహిని

దీర్ఘకాల సుఖాన్ని ఒకవైపు ఆశిస్తూ, శీఘ్రుకాల ఫలితాల కొరకు మరోవైపు శ్రమించటమే మానవుని జీవన విధానంలోని లోపాన్ని సుస్పష్టం చేస్తూ ఉంది.

విద్యార్థి దశలోనే విద్యార్జనకు స్వస్తి పలికి, అవసరం లేకపోయినా ధనార్జనవైపు మరలుతున్న విద్యార్థులు ఎలాంటి భవిష్యత్తును ఊహిస్తున్నారో?

మంచి చదువు, అంతకు మించిన ఉద్యోగము ఉండినా, కోటికి పడగలెత్తాలనే ఉబలాటంతో అక్రమ సంపాదనకు అలవాటుపడి, తరతమ భేదాలను కూడా పాటించక, సమాజ రుధిరాన్ని జలగల్లాగ పీల్చుకొంటున్న అవినీతిపరులు ఈ సృష్టిలో ధర్మాలే లేవని భావిస్తున్నట్లేనా? తమ వర్తమానం భవిష్యత్తుకు అందేది కాదని నిశ్చయించు కున్నట్లేనా?

పది కాలాలపాటు సుఖపడాలని కళ్యాణవేదికపై కాలు పెట్టి, తాళి కట్టిన మరుక్షణం నుండి కట్నాలు, కానుక లంటూ కాంతలను కష్టపెట్టే కలి మానవులకు వివాహము యొక్క విశిష్టత అర్థమైనట్లేనా? గుండెను పగలగొట్టి బండినెక్కి ఊరేగితే ఒరిగే దేమిటో?

సర్వబంధ విముక్తులు కావాలని, సర్వోపద్రవ రహిత స్థితియైన మోక్షాన్ని పొందాలని తత్త్వశాస్త్రాన్ని, తాత్త్వికమార్గాన్ని ఎంచుకున్న ముముక్షువులు జిజ్ఞాసను గాలికి వదలి, విత్తానికి ఏ మంత్రం? పదవికి ఏ తంత్రం? వ్యాపారాభివృద్ధికి ఏ యంత్రం? అని దారినపోయే దానయ్య మొదలు, దారిలో పడని సన్యాసి వరకు కాలికి బలపం కట్టుకొని తిరుగుతూ ఉన్నారంటే, మతి చెడిన ఈ ముముక్షువులు ఏమి పొందాలనుకుంటున్నారు? వీరిని ప్రేరేపించి, ప్రోత్సహించే జ్ఞానహీనులు ఏమి సాధించాలను కుంటున్నారు?

ఈ ప్రస్తావన మధ్యలో ఎందుకు వచ్చి పడిందంటే,

ఇటీవల నా వయసున్న ఒక వ్యక్తి ఇరవై సంవత్సరాల తరువాత నన్ను కలిసి, బాల్యంలో అర్థాంతరంగా ఆగిపోయిన చదువును కొనసాగించి ఎలాగైనా కళాశాల డిగ్రీని పొందాలని తాను భగీరథ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పటం వలన. అతడు ప్రభుత్వోద్యోగి కాడు; డిగ్రీ వచ్చినా ప్రమోషన్ రావటానికి. డిగ్రీవల్ల తనకు ఏ ఉపయోగం లేదు. అయినా తోకంటూ ఉంటే, అవసర మొచ్చినపుడు ఆడించుకోవచ్చు అనే ఉబలాటం.

మధ్యలో, ఒక చిన్న పిడకల వేట..........

ఒక కుర్రాడు ఆ మధ్య నాతో, "స్వామిజీ! ఈ రోజుల్లో, చదువుకున్న వారిలో పట్టభద్రులు కానివారు అరుదుగా కనిపిస్తారు. మీరు గమనించండి. పేరు ప్రక్కన బి.ఎ; అని ఏ కుర్రవాడు వేసుకోడు. పాతవాళ్ళు బోర్డుకట్టుకొని మరీ ఊరేగుతుంటారు? ఎందుకని?" అన్నాడు.

ఏం చెప్పాలి నేను? బాబూ! ఎలాగూ విలువలేనిదే కదా అని కుర్రాళ్ళు తగిలించుకోవటం లేదు. విలువలేనిదే కదా తొలగించి మాత్రం సాధించే దేముంటుంది? అని పెద్దోళ్ళు తగిలించుకుంటున్నారేమో? అని, పారేసిన దాన్ని గుర్తు తెచ్చుకొని నవ్వి పారేశాను. అంతేగాని, నవ్వును పారేసుకోలేదు. మీరూ నవ్వేయండి పిడకల వేటే గదా!

మళ్ళీ మొదటికొస్తే,

దీర్ఘకాలం కళకళ లాడాలనే కాంక్ష అందరికీ ఉన్నా, శీఘ్రకాలంలో అందుతున్నాయని వెలవెల పోయే తళతళలను తల కెక్కించుకొని తైతక్క లాడటం వలన తలలు బరు వెక్కుతాయే గాని జీవితాలు తేలికపడవు.

రాముణ్ణి ప్రక్కనే పెట్టుకొని బంగారు జింకను ఆశించిన సీతమ్మ బంగారు బ్రతుకును బండ బ్రతుకుగా ఎలా మార్చుకొన్నదో మనకు తెలియని విషయం కాదు.

పావనాత్ముడైన శ్రీకృష్ణ పరమాత్మను కాలదన్ని పారిజాత పరిమళాల వైపు పరుగులెత్తిన సత్యభామకు ఒరిగిందేమిటో మనకు తెలిసిందే.

చదువు ఉన్నంత మాత్రాన సంస్కారం తోడౌతుందని చెప్పలేము.

సంస్కారం ఉంటే మాత్రం చదువు దివ్యంగా పరిమళిస్తుంది.

అందుకనే,

చదువు సంస్కారం ఉండాలి అంటుంటారు పెద్దలు. సంస్కారము అనేది వయస్సుకు పరిమితం కాదు. దానికి లింగభేదం లేదు. రూపభేదం లేదు. అది హాయిగా వీచే గాలిలాంటిది. చల్లగా పారే నది లాంటిది.

"శబరీ! ఏమి కావాలో కోరుకో?" అన్నాడు రాముడు.

"సుదామా! నీ వాంఛను చెప్పు. తీరుస్తాను" అన్నాడు శ్యాముడు.

"ఎంత తపస్సు చేశావు ఉమా? ఏ ఫలం కావాలి?" అన్నాడు శివుడు.

"ప్రహ్లాదా! చెప్పు నీకు ఏం కావాలి?" అన్నాడు వెన్నుడు.

"నచికేతా? ఏదైనా ఇస్తాను" అని ముందడుగు వేశాడు యముడు.

అందరికీ ఒకే ప్రశ్న. సంస్కారవంతులు కనుక అందరిదీ ఒకే సమాధానం.

"మోక్షమే భూయాత్"

"మాకు మోక్షమే కావాలి. తాపస మందారా! మాకు ఇదొక్కటి చాలు. పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి. ఇదే చదువులలో మర్మము. ఇదే మర్మమైన చదువు. రాజవిద్య ఇదే. రాజగుహ్య మిదే.

మెరిసే వాటి మధ్య మురిసిపడే కన్నా, వలచిన దానిని, కావలసిన దానిని పొందే ప్రయత్నమే శ్రేయస్కరము. దేహికి, దేశానికి ఇదే శ్రీరామ రక్ష.

దేశోయం క్షోభరహితః

బాధ్యతలు విస్మరిస్తే భారాలే మిగులుతాయి

ఉదయభానుడు రోజంతా ఊరేగడు. బాలభానుని దర్శించి సంతసించే భాగ్యాన్ని నిరీక్షించి పట్టుకోవాలి. చేజారినవి మళ్ళీ చేజిక్కితే చాలా మంచిది. కాని, అది అంతగా అందరికీ సులభం కాకపోవచ్చు.

బిడ్డలే తమ భాగ్యమని తల్లిదండ్రులు భావిస్తారు. వారిని భాగ్యవంతులుగా చూడాలని అభిలషిస్తారు. ఆ కృషినంతా తమ భుజాలమీదికే ఎత్తుకుంటారు. తామనుకున్న దేదో సాధిస్తారు. ఈలోగా ఒక సత్యం కళ్ళముందు నిలుస్తుంది. తాము భాగ్యమని భావించింది భారంగా పరిణమించిందని. భాగ్యము ఎన్నడూ భారం కాదు. దౌర్భాగ్యాన్ని భాగ్యంగా భావిస్తే మాత్రం అది భారం కాకుండా ఉండలేదు.

బాల్యం పువ్వులాంటిదైతే యౌవనం కాయ లాంటిది. ఈ రెండు దశల్లో జాగ్రత్త వహించకుంటే ఫలరూపం నిష్ఫలమే.

నేడు ఎక్కువ శాతం యువకుల్లో గోచరిస్తున్న అలతలు కలతలు గుండెను పిండేలా ఉన్నాయి. నిగూఢమైన ఆంతర్యపు లోతులలో చెలరేగుతున్న అశాంతికి బాహ్యరూపాలే ఈ కల్లోలాలని ముఖ్యంగా తల్లిదండ్రులు గుర్తించాలి. విలువలు వంటబట్టని కారణంగా వెలుగులు వెలవెలపోతున్నాయి.

ఆధ్యాత్మిక మొక్క నుండి విరబూసే పువ్వులే విలువలు. మొక్కను కాపాడుకోలేనివారు పువ్వులను కోసుకోలేరు.

వేదాంత మనేది వ్యక్తిగతమైన విషయమని, అది వారివారి ఇష్టాలపై ఆధారపడి ఉంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. వేదాంత సాధన వ్యక్తిగతం కావచ్చునేమో గాని, వేదాంత అవగాహన విశ్వంలో అందరికీ అవసరమని మరువకూడదు.

తమ జీవన విధానము యొక్క ప్రభావం తమ బిడ్డల హృదయాలపై ఎలాంటి ముద్ర వేస్తుందో ఈనాడు ఎక్కువమంది తల్లిదండ్రులకు తెలియకపోవడం చేత తమను తామే వంచించుకుంటూ, పరోక్షంగా బిడ్డలను తెలియకుండానే బాధల్లో ముంచేస్తున్నారు.

The Child is the father of man అని పలకడం తేలికే. కాని భవిష్యత్తులో బిడ్డల తండ్రిగా బ్రతకవలసిన వాణ్ణి నేను పెంచుతున్నాను అని ఎందరు తల్లిదండ్రులు ఆలోచించగలుగుతున్నారు? నిజానికి తల్లిదండ్రుల్లో ఈ ఆలోచన వస్తే బిడ్డల భవిష్యత్తు భవ్యంగా, దివ్యంగా మారిపోతుంది.

మనమెలా తయారుచేస్తే బిడ్డలు అలా తయారవుతారు. **(Children are what you make them)** మనం మన బిడ్డల్ని ఎలా తయారుచేస్తున్నాం? వారి భవిష్యత్తును ఎలా ఉండాలని ఊహిస్తున్నాం? సంపదని పంచాలనుకుంటున్నాం. సంస్కారాన్ని దించాలనుకుంటున్నామా?

సంస్కార ముంటే సంపద లేకపోయినా జీవితం సంతృప్తిగా సాగుతుంది. సంపద లుండి సంస్కారం శూన్యమైతే బ్రతుకు కాలిపోతుంది. మాడిపోతుంది. మసై పోతుంది.

ధన సంపాదన తప్పని నేను చెప్పను. రోజంతా ధన సంపాదనలోనే కారిపోవడం దురదృష్టమంటాను. ఈ నిర్వాకంలో కనీసం పది నిముషాలైనా బిడ్డల భవిష్యత్తును గూర్చి ఆలోచించడానికి కేటాయించలేకపోవడం దౌర్భాగ్యమంటాను. దౌర్బల్య మంటాను. కుండకున్న చిల్లిని పట్టించుకోకుండా కుండలో నీళ్ళు నింపే ప్రయత్నాన్ని అంతకన్నా ఏమని చెప్పుకోవాలి?

నీవు చెప్పిందే నేనెందుకు చదవాలి?

నీవు వెళ్ళొద్దంటే నేనెందుకు ఆగాలి?

నీకు నచ్చినంత మాత్రాన నేనెందుకు చేసుకుంటాను?

నా జీవిత భాగస్వామి ఎలా ఉండాలో నేను ఆలోచించుకోగలను.

ఎంతకాలమని మీతో కలిసి ఉండాలి? - ఇలాంటి ప్రశ్నలతో విషమించబోయే పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుందని ఏ తల్లిదండ్రులు ఊహించరు. ఎదురైననాడు గుండెను పగలకుండా ఆపుకోలేరు.

ఎంత దారుణం? ఎంత ఘోరం? అంటూ విలపిస్తారు. కానీ ఈ దారుణ పరిస్థితుల్ని సృష్టించింది తామే నని తెలుసుకోలేరు. తెలిసినా అంగీకరించలేరు. అంగీకరిస్తే బలం చేకూరుతుంది. ఆవేదన చెందితే భారం పెరుగుతుంది.

ఈ చర్చలో మిమ్మల్ని అసందర్భంగా విషయం నుండి దూరంగా తీసుకెళ్తున్నానని మీరు భావించకపోతే వాస్తవమైన ఒక సన్నివేశాన్ని మీ ముందుంచుతాను.

మనస్తత్వ శాస్త్రవేత్త కారల్ యుంగ్ తన చికిత్సలో భాగంగా విశ్లేషించిన ఒక విచిత్ర సన్నివేశాన్ని చూద్దాం.

ఒక తల్లి తన రెండు సంవత్సరాల బిడ్డకు తొట్టె స్నానం చేయిస్తూ ఉండింది. అది కొండ ప్రాంతం. శుద్ధమైన జలం త్రాగడానికే చాలినంత లభించదు. అందుచేత త్రాగడానికి ఉపయోగపడని జలంలో ఆ బిడ్డను స్నానం చేయిస్తూ ఉండింది. నీరు మురికిగా ఉంది. ఆ బిడ్డ నీటిలోని పాచిని చప్పరిస్తూ ఉందని తల్లి గుర్తించలేదు.

బిడ్డకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. ఒక వారం తరువాత బిడ్డ మరణించింది. తల్లి తీవ్ర ఆవేదనకు గురైంది. మానసికంగా స్థిమితాన్ని కోల్పోయింది. ఆమెను ప్రొఫెసర్ కారల్ యుంగ్ వద్దకు తీసుకొని వచ్చారు.

తల్లి వివరాలేమీ చెప్పలేకపోతూ ఉంది. ఒక మానసిక శాస్త్రవేత్తగా యుంగ్ అనేక కోణాల్లో ఆమె విషయాన్ని విశ్లేషించుకుంటాడు. చివరగా, **"You have killed the child"** - 'నీవే బిడ్డను చంపావు' అని యుంగ్ తల్లితోనే చెప్పాడు. విచిత్రమేమిటంటే

ఆ క్షణం నుండే ఆమె ఆరోగ్యం కుదుటపడుతుంది. ఒక వారం రోజుల్లో సహజ స్థితికి వస్తుంది. ఆమెపై పడుతున్న భారాన్ని అంగీకరించడంలోనే ఆమె ఒత్తిడి నుండి విడిపడి ఆరోగ్యాన్ని పొందింది అంటాడు యుంగ్. **(A return to normal was prevented by her incapacity to accept her burden).**

ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. తల్లియొక్క ఉదాసీన వైఖరి, పరిశీలన లోపించడం, జాగ్రత్తలేని ప్రవర్తనే బిడ్డ మరణానికి కారణమైంది.

కాని యుంగ్ విశ్లేషణ వేరే. ఒకరిని ప్రేమించి మరొకరిని పరిణయమాడి, ఇష్టం లేని వ్యక్తి వలన కలిగిన సంతానాన్ని ప్రేమించలేని తల్లి యొక్క దుర్బలత్వమే బిడ్డ చావుకు కారణమైంది అనేది యుంగ్ అభిప్రాయం. కనుకనే "నీవు బిడ్డను చంపేశావు" అని తల్లిని అనగలిగాడు.

ఆమె బిడ్డను చంపింది అనేది సత్యం కాదు. కాని ఆ మాటను అంగీకరించడం లోనే ఆమె ఆరోగ్యం కుదుట పడటం విశేషం.

బిడ్డను తల్లి చంపింది అనేది నిజం కాకపోయినా బిడ్డ విషయంలో శ్రద్ధ వహించక పోవడము వల్లనే బిడ్డ మరణించింది అనే ఆలోచన కారణంగానే ఆమె మతిస్థిమితం కోల్పోయింది. దానిని అంగీకరించలేని అసమర్థతలో ఆమె స్వస్థతను పొందలేకపోయింది.

ప్రొఫెసర్ యుంగ్ పరిశోధనలో ఆమె పూర్వగాథ (ప్రేమకథ) వెలుగు చూచింది. చికిత్స మరొక కోణంలో సాగినా ఫలితం మాత్రం రావలసిన మార్గంలోనే వచ్చింది. కారణా లేవైనా కావచ్చు. భారాన్ని మోయడంలోనే బరువు తీరుతుంది తగ్గుతుంది అనేది యుంగ్ అభిప్రాయం. బ్రతుకులో చుట్టుముట్టే బాధ్యతలు, అవి పంచే బరువులు మోయడం మనిషికి తప్పదు అంటాడు.

"ఆమె స్వస్థతను పొంది ఇంటికి వెళ్ళేనాడు పెద్ద భారాన్ని మోస్తూ వెళ్ళిపోయింది. అది తప్పదు" అంటాడు యుంగ్.

When she was discharged, she departed bearing her heavy burden. She had to bear this burden of responsibility - అని వ్యాఖ్యానించాడు ప్రొఫెసర్ యుంగ్. ఈ సన్నివేశాన్ని తన ఆత్మకథలో వ్రాశాడు కారల్ యుంగ్.

ఇక మన విషయానికి రండి.

పిల్లలు ఎలా తయారైనా ప్రధాన బాధ్యత తల్లిదండ్రులదే అని అంగీకరిస్తే కొంత భారం తగ్గినట్లే అవుతుంది. అంగీకరించలేని అసమర్థత బరువును పెంచుతుంది. మనసుపై ఒత్తిడిని పెంచుతుంది అని చెప్పడానికే మధ్యలో యుంగ్‌ని దూర్చాను.

పిల్లలకి అక్షయ సంపద నివ్వాలనే ప్రయత్నంలో కొన్ని నిముషాలు కూడా సంతోషంగా బిడ్డలతో గడపలేని వాళ్ళను మనం చూస్తున్నాం. బిడ్డలు నిద్రలేవక ముందే

వీధినబడి, బిడ్డలు నిద్రించిన పిదప గూటికి చేరే డబ్బు పక్షుల్ని, ధన గబ్బిలములను చూస్తూనే ఉన్నాం.

ధనం మనిషికి అవసరం కాదు. అవసరాలు తీరేందుకు ధనం కావాలి. ఈ మాత్రం చిన్న విషయాన్ని గుర్తించగలిగితే మనసు చాలా తేలిక పడుతుంది.

బిడ్డలకు సంస్కారాన్ని అందించడంలో గృహమే కేంద్రస్థానం కావాలి. ఆ తరువాత బడి, బడిని దాటితే గుడి - ఇదీ వరుస.

ఈ మూడిటికి సమన్వయ బిందువు, సంధానకేంద్రము మళ్ళీ ఇల్లే. అది మరచి ముల్లే ప్రధానమనుకొంటే దారి పొడుగునా ముళ్ళే ఎదురవుతాయి.


నా మాట వినండి. ఇది మీ సమస్య. నాది కాదు. మీ సమస్యను నాదిగా చూడటంలో ఇదంతా చెప్పవలసి వచ్చింది.

బిడ్డల్ని ప్రేమతో పెంచండి. వారితో కొంతకాలం గడపండి. జీవితాన్ని గూర్చి, ధర్మాన్ని గూర్చి, వారిలో అవగాహనను పెంపొందించండి. మీ దగ్గర ధనం ఉంటే ఉంచుకోండి. కాని, ధనం విలువ పిల్లలకు తెలిసేలా చేయడం మీ కనీస ధర్మం.

ఇక్కడ స్వేచ్ఛ హరింపబడుతున్నట్లు అవగాహన లేనివారు భావించవచ్చు. కాని, ఇవన్నీ నిజమైన స్వేచ్ఛకి సోపానాలని గుర్తించడానికి కొంత విజ్ఞానం అవసరం. అంతే.


"నా బిడ్డను సుఖపెట్టాలి" అనేది మంచిదే. కాని, 'నా బిడ్డ సుఖపడాలి' అనేది చాలా మంచిది. చాలా గొప్పది. చాలా మంచి గొప్పది.

సూర్యుడు ఈ ప్రపంచానికి గొప్ప వరం లాంటి వాడు. గురు భాస్కరుడు శిష్యులైన వారికి పరమాత్మ అనుగ్రహించిన వరం. గురువును చాలామంది పట్టు కుంటారు. కాని, చాలా తక్కువ మంది మనసులో పెట్టు కుంటారు. మరీ తక్కువమంది హృదయంలో నిలబెట్టు కుంటారు. నిలుపు కుంటారు. హృదయాన్ని గురునిలయంగా మార్చుకుంటారు.















వైభవాలు - వైఫల్యాలు

"పెద్ద పెద్ద సభలను నిర్వహించడం, గొప్పగొప్ప కార్యక్రమాలను అనితర సాధ్యంగా రూపొందించడం మీకే సాధ్యం" అని ఇటీవల ఒక మేధావి నాతో అన్నప్పుడు కొన్ని క్షణాలపాటు నా హృదయం గట్టున పడ్డ చేపలా ఏదో అయింది.

సభలు నిర్వహించడం నా లక్ష్యం కాదు. కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించాలనే దురద ఎలా ఉంటుందో నాకు అనుభవంలో లేదు. కానీ గొప్ప కార్యాలకు, పెద్ద సభలకు, ఒక గొప్ప ఉద్యమానికి నేను పనిముట్టు నయ్యాను. ఇదంతా పరమాత్మ చిద్విలాసం. భగవానుని కృపా విశేషం.

నిర్జన ప్రదేశంలో జనార్దనుని కొరకు విలపించే ప్రవృత్తితో, ప్రపత్తితో నా బాల్యం మొదలైంది. జనతలో జనార్దనుని దర్శించే ఆరాధనలో నా యౌవనం నీరాజనమైంది. బాధలు నాకెప్పుడూ బంధాలు కాలేదు. పైపెచ్చు, వీడని బంధువులై నడిచాయి. బోధల్ని విరివిగా పంచాయి. ఈ శక్తితోనే నేను అన్యుల బాధల్ని సానుభూతితో అర్థం చేసుకుంటాను.

ప్రేమ, సానుభూతి, సున్నితత్వం లేని బోధలు సమాజాన్ని ప్రభావితం చేయలేవు. అంతర్మథనంలో కాగిన పవిత్రమైన హృదయాలే లోకకళ్యాణానికి శ్రీకారం చుట్టగలవు.

సభా మర్యాదలనే ముసుగులలో తలలు దూర్చి డాంభిక పదజాలంతో అర్థరహిత ఆడంబరాలతో శోభించాలని ఆలోచించి సభలను నిర్వహించిన వారందరూ, ఎప్పుడైనా, ఎక్కడైనా, అపహాస్యాలకే లోనయ్యారు.

మనసుకు హత్తుకొనే భాషలో, స్వచ్ఛత లోపించని ధైర్యంతో, స్వానుభవంతో కూడిన సత్యాలను సానుభూతితో ప్రవచించిన వారే శ్రోతల హృదయాలలో జ్ఞాన జ్యోతులను వెలిగించగలిగారు.

తాను వెలుగుతున్నట్లు దీపానికి ఎలా తెలియదో తమ ఔన్నత్యం తమకు తెలియని వారి కార్యక్రమాలే దేదీప్యమానంగా శోభిస్తాయి. కారణమేమిటో తెలుసా! అహం లేకపోవడం. అచ్యుతుడు వచ్చి ఉండడం. అంతే.

శాంతి జీవనం

శాంతి; శాంతి; శాంతి; ఎక్కడ చూచినా ప్రపంచంలో ఇదే ఆక్రందన. ఇదే ఆకలి. యుద్ధాలు ఉన్నప్పుడే శాంతిని అన్వేషిస్తాం. ఆశిస్తాం. ఈనాడు అందరూ శాంతినే అర్థిస్తున్నారు కనుక అన్నిచోట్ల యుద్ధమే ఉందని అంగీకరించాలి. అక్కడా ఉంది. ఇక్కడా ఉంది. అవే **అ, ఇ** - లు.

అ, ఇ -లు అంటే అక్కడ ఇక్కడ అని. అంటే, అమెరికా, ఇరాక్‌లని నా ఉద్దేశ్యం కాదు. అమెరికా ఇరాక్‌ల మధ్య అయితే ఆ యుద్ధం కూడా పరిమితమే. కాని, **అంతః** కరణము ఇంద్రియాల మధ్య సాగే యుద్ధము కనుక, ఇది సర్వత్ర ఉంది. సర్వత్ర యుద్ధం ఉంది కనుక సర్వత్ర శాంతి నినాదం వినపడుతోంది.

మనసులో యుద్ధం లేకపోవడమే శాంతి. సంఘర్షణా సమరము అంతరించడమే శాంతి. దీనికి వేదాంతమే అవసరము లేదు. నాస్తికుడికైనా శాంతి కావాలి. ఆత్మ విషయమును అలా ఉంచినా, కనీసం అంతఃకరణమైనా స్వస్థతతో ఉండాలి. శాంతితో ఉండాలి. నిత్య జీవితంలో కూడా శాంతిగల మనస్సును పొందినవాడే ఏ కార్యాన్నైనా చక్కగా, అందంగా చేయగలడు. ఫలితాలను సాధించగలడు.

మన మహర్షులు ఉపనిషత్తును అధ్యయనం చేయడానికి ప్రారంభములో "శాంతి" పలికేవారు. ముగింపు కూడా 'శాంతి' తోనే చేసేవారు. ఏ పని మొదలు పెట్టినా మనసును శాంతిగా ఉంచుకొని ఆరంభించాలని దాని అర్థం. శాంతితో ప్రారంభమైన కార్యాలు శాంతితోనే ముగుస్తాయి.

"నేను చెప్పే విషయం కాస్త శాంతంగా వినండి" అంటూ ఉంటారు. అశాంతితో ఉండే మనసు విషయాన్ని చక్కగా అర్థం చేసుకోలేదు. అలాగే అశాంతిమయంగా ఉండే మనసు విషయాన్ని స్పష్టంగా ఎరుక పరచలేదు. చెప్పేవారి, వినేవారి మనసులు ప్రశాంతంగా ఉన్నప్పుడే చెప్పేవారు ఏమి చెప్పాలనుకున్నారో అది వినిన వారికి వంటపడు తుంది.

అశాంతి ఉంటే ఉండనివ్వండి. తప్పులేదు. అశాంతిని గుర్తించండి. కాని, అశాంతికి గురికాకండి. మన మహర్షులు అశాంతి తెలియనివారు కారు. అశాంతి వారిని సమీపించే ఉండింది. అయితే, వారు దానిని దాటిపోయారు.

తమసోమా జ్యోతిర్గమయ

అని శాంతి పలుకును వినిపించింది మహర్షులే. తమస్సును వారు చూశారు. గుర్తించారు. కాని, వారి గురి అంతా జ్యోతిమీదనే ఉండింది. అందువలన తమస్సుకు గురి కాకుండా దూరమయ్యారు. జ్యోతికి చేరువయ్యారు. చెప్పేటప్పుడు, వినేటప్పుడు, విచారించేటప్పుడు సర్వవేళల యందు మనస్సును శాంతిగా ఉండేలా చూసుకోవాలి. ఉద్వేగం లేకుండా మాట్లాడితే వినే వ్యక్తి ఉద్రేకానికి గురి కాడు. ఉద్వేగం లేకుండా

వినగలిగితే చెప్పేవాడిలో ఉద్రేకాగ్ని శిఖలు లేచినా, వినేవాడి శాంతి జలపాతంలోపడి చల్లబడిపోతాయి. ఇలా భక్తుడు ఉభయతారకంగా ఉంటాడు.

యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః

"ఎవని వలన లోకమునకు ఉద్వేగముండదో, లోకము వలన ఎవడు ఉద్వేగము చెందడో" వాడే భక్తుడు అని భగవద్గీత. లోకాన్ని చూచి బందిపోటు భయపడడు. కనుక లోకానికి వాడు భయపడక పోవడమే కాదు, వాణ్ణి చూచి లోకం కూడా భయపడకుండా ఉండాలి. ఈ భయోద్వేగాలు ఎక్కడ తలెత్తినా ఎవరిలో తలెత్తినా అక్కడ శాంతి మిగలదు. సంఘర్షణే ఉంటుంది. సమరమే ఉంటుంది.

అనుద్వేగకరం వాక్యం - నీవు మాట్లాడే మాట సత్యంగా ఉండొచ్చు. ప్రియంగా ఉండవచ్చు. హితంగా కూడా ఉండవచ్చు. కాని అది వినే వ్యక్తిలో ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని కలిగించకూడదు. ఇలా కలిగించకుండా ఉండాలంటే చెప్పేవాడిలో ఉద్రేకము ఉండకూడదు. అంటే, శాంతి ఉండాలి. శాంతి ఉండాలి అంటే ఆంతర్యంలో సంఘర్షణలు ఉండకూడదు. సంఘర్షణలకు దారితీసే ఆలోచనలనుండి, కార్యాలనుండి వ్యక్తి విడిపడి ఉండాలి. అప్పుడే ఆంతర్యంలో శాంతి దీపం వెలుగుతూ ఉంటుంది. ఆ దీపకాంతి చేరువైన వారిపై పడుతూ ఉంటుంది. ఉద్వేగం లేకుండా మాట్లాడటం ఎలా శాంతికి సోపానమో వినేటప్పుడు ఉద్రేకం లేకుండా వినడం కూడా అంతే.

కొందరి మాటలు వినాలంటే మరి కొందరికి విసుగు. కొందరి ఆలోచనా సరళి మరి కొందరికి అసలే గిట్టదు. ఇలా నచ్చని, గిట్టని విషయాలు ఎదురైనపుడు వ్యక్తుల్లో నరాల ఉద్రిక్తత, చర్మపు ముడతలు, ముఖంలో ముడతలు, ప్రక్క చూపులు, రోగంలేని మూలుగులు వ్యక్తమవుతూ ఉంటాయి.

దీనికి ప్రధాన కారణం వారి ఆలోచనలు, పోకడలు మనకు నచ్చకపోవడం కాదు. మన ఊహలు, మన పోకడలు వారికి నచ్చవు అనే మనలోని అనుమానం. మనల్ని గూర్చి ఇతరులు ఆలోచించేది కాదు మనకు సమస్య. మనల్ని గూర్చి ఇతరులు ఏమి ఆలోచిస్తున్నారో అని మనం చేసే ఆలోచనే మనకు సంఘర్షణ.

ఒకరి ఊహలకు మరొకరి వద్ద సాక్ష్యాధారాలు లేవు. మనం ఏది ఆలోచించినా అది నిజాల గుడి కాకుండా అబద్ధాల అంగడిగా, అపోహల గారడిగా మిగిలిపోతూ ఉంది. కనుక మనం సంఘర్షణకు గురియై, అశాంతితో అలమటించడానికి ఇతరులు కారణం కారు. నిన్ను కలతపెట్టే అవకాశాన్ని నీవు ఇతరులకు ఇచ్చినప్పుడే ఇతరులు నీ అశాంతికి కారణమవుతూ ఉంటారు.

నీ ఊహలపై నీకు అధికార మున్నంతవరకు, నీ ఆశల్ని అదుపు చేసుకొనే చాకచక్యం నీకున్నంతవరకు, నీ ఇంద్రియ వ్యాపారాలలో పొదుపు జరుగుచున్నంత వరకు, కల్పిత భావాలకు, అసత్య జీవనానికి నీవు చెల్లు చీటి సమర్పించినంత వరకు, ప్రతిఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించే ఓర్పు, ప్రతి పని వెనుక పరమాత్మ పనితనమును వీక్షించే నేర్పు ఉన్నంతవరకు అశాంతి నిన్ను సమీపించదు. శాంతి నిన్ను విడిచివెళ్ళదు.

ఎవరు చెప్పారని కాదు - ఏమి చెప్పారని

"తిండిని బట్టి త్రేపు" అనేది అనుభవ సూక్తి. మంచివారే మంచిని పలుకగలరు. సత్యాత్ములే సత్యాన్ని ప్రవచించగలరు. ప్రవచింపబడేది సత్యమైనపుడు దీనిని ప్రవచించే వారు ఎవరు? అని చూడ నవసరం లేదు. వ్యాకరణం బోధించే పంతులుగారికి రేచీకటి ఉంటే ఉండనీ. నీకొచ్చిన నష్టమేమిటి?

న్యాయబద్ధమైన మాట, ధర్మబద్ధమైన పలుకు ఎవరి నుండి కదిలినా దానిని గ్రహించడం, గౌరవించడం అలవరచుకోవాలి. ఉపనిషత్తులు వ్రాసిన మహాత్ములెవరో మనకు తెలియదు. కానీ వాటిని మనం అధ్యయనం చేస్తున్నాం. ప్రమాణంగా భావిస్తున్నాం. విషయాన్ని బట్టే విలువల నిర్ణయం.

యుక్తి యుక్తం వచోగ్రాహ్యం బాలాదపి శుకాదపి

"ధర్మబద్ధమైన విషయమైనపుడు, అది శిశువులు చెప్పినా, శుకములు పలికినా అంగీకరించాలి" అని దాని అర్థం.

ఇకపోతే, - "మాకు వయస్సు పెద్దది. అనుభవం గొప్పది. మేము చెప్పిందే వేదం. మేము పలికిందే పురాణం. నేతులన్నీ పూర్వం మా తాతలవే" అని ప్రగల్భాలు పలుకుతూ తమకు తోచిందంతా సత్యమేనంటూ చిత్తంలోని చెత్తనంతా సమాజంపై ఊడ్చి ఎత్తి పోస్తుంటారు కొందరు. అలాంటివారి మాటలను పట్టించుకోవాలా? వద్దా?

అవసరం లేదు. వేషభాషలలో, వచోవైభవంలో వారు వెలిగిపోతున్నా, యుక్తి యుక్తంగా లేనపుడు వారి మాటలను పట్టించుకో నవసరం లేదు. త్యజించవచ్చు.

యుక్తిహీనం వచస్త్యాజ్యం వృద్ధాదపి శుకాదపి

"న్యాయసమ్మతం గాని మాటలను పెద్దలు పలికినా, శుకము పలికినా త్యజించ వచ్చు" - అనేది దాని భావం.

ఇక్కడ "శుకాదపి" అంటే "భాగవతము పలికిన శుకబ్రహ్మ అయినా"; అనే ధ్వని ఉంది.

స్నేహము - స్నేహితులు

నీకు నీవు తోడు కానపుడు ఏది తోడున్నా, ఎవరు తోడున్నా, అదంతా తోడు కాదు. నీడే. ఛాయే. మాయే.

స్నేహం చాలా గొప్పది. స్నేహితులు స్నేహమంత గొప్పవారు కారు. ప్రేమ చాలా విలువైంది. ప్రేమికులు ప్రేమంత విలువైన వారు కారు.

స్నేహం లేతగా ఉండాలి. ముదరకూడదు. అభిస్నేహం మంచిది కాదని శ్రీకృష్ణ పరమాత్మ అభిప్రాయం. స్నేహితుడు దూరంగా ఉన్నా నీ మనస్సులో ఉంటాడు. అతని సుఖదుఃఖాలు నీ సుఖదుఃఖా లవుతాయి.

ఎవరి చరిత్రలో ఏ పుట త్రిప్పినా స్నేహితులు గుండె భారాన్ని మోయక తప్పలేదు. గుండెను ఎవరైనా పగులగొట్టి ఉండొచ్చు. ఇచ్చిందెవరు? చేసిన స్నేహాలన్నీ గుండెల్లో గునపాలే దించాయి.

బంధించేది ఏదీ స్నేహం కాదు. అవసరానికి పనికి వచ్చేవాడే స్నేహితుడన్న ఆంగ్ల సూక్తి పవిత్రమైన స్నేహాన్ని వ్యాపారంగా చూపింది. గాలిలా వనవిహారం చేసేదే స్నేహం గాని తెగిపడిన చెట్టుకొమ్మలా ఒకచోట పడుండేది కాదు. పడి ఎండేదీ కాదు.

శ్రీకృష్ణుడు గోపికల్ని ప్రేమించాడు. గోపికలు శ్రీకృష్ణుని ప్రేమించారు. ప్రేమించిన గోపికల్ని వదలి శ్రీకృష్ణుడు పోగలిగాడు. గోపికలు శ్రీకృష్ణునికి దూరమై బ్రతకలేక విలపించారు. కృష్ణుని ప్రేమలో జ్ఞానముంది. దానికి దూరతీరాలు తెలియవు. ఆ ప్రేమకు ఎడబాటు తెలియదు. అది పరిమితం కాదు.

ఈ ప్రపంచంలో ఏది నీకున్నా (స్నేహితులతో సహా) అవి నీకున్నాయి అనేది సత్యం. కాని, అవి నీవి అనుకోవటం అసత్యం. ఇలా చాలా కాలంగా అనుకొంటూ వచ్చాం. ఇది చిరకాల భ్రాంతి. దీనిని ఇకనైనా విస్మరించాలి. స్నేహం పరిమితం కాకూడదు. ప్రేమ సంకుచితం కాకూడదు.

తస్మాత్ చిరస్థాయీతి భ్రాంతిం పరిత్యజ్య ఆత్మజ్ఞానే ప్రయత్నం శీఘ్రమేవ కురు

"అందుచేత ఈ చిరకాల భ్రమను విడిచిపెట్టి పవిత్రమైన ఆత్మజ్ఞానానికి వెంటనే ప్రయత్నించు" అన్నారు స్వయంప్రకాశ యతీంద్రులు.

స్నేహితులు అవసరం లేదు. స్నేహ జీవనం అలవరచుకోవాలి. నది తన నీటిని కొందరికే పంచదు. ఎందరికైనా పంచుతుంది. కొందరికి పంచితే వాళ్ళే మన వాళ్ళు. అందరికీ పంచితే ఎవరూ మనవాళ్ళు కారు. మనం అందరికీ సంబంధించిన వాళ్ళ మవుతాం. ఇది ఫలితా లాశించని మహోత్తమ కార్యం. ఒక్కమాటలో చెప్పాలంటే యజ్ఞ జీవనం.

గాలి వీస్తూ ఉంటుంది. మనకు చాలా హాయిగా ఉంటుంది. గాలి ఒక చోట నిలవదు. వచ్చిపోతూ ఉంటుంది. వచ్చిపోతే సమస్య లేదు. వచ్చి ఉంటేనే ఏదైనా సమస్య. (జ్ఞానం తప్ప).

చుట్టం వచ్చిపోతే సమస్య లేదు. వచ్చి ఉంటేనే సమస్య. జ్వరం వచ్చిపోతే సమస్య ఉండదు. కరువు వచ్చిపోతే బాధలేదు. స్నేహితులు కూడా వచ్చిపోతూ ఉండాలి చుట్టాలలాగా. స్నేహం సదా ఉండాలి.

స్నేహం ఉంది కనుక వచ్చే ప్రతివాడూ స్నేహితుడే. వచ్చినవాడు వెళ్ళగానే ఎప్పుడూ ఉండే వాసుదేవునితో నీ మనస్సు హాయిగా ఉంటుంది. లేదా, స్నేహితుడు నీ మనస్సును వెంటబెట్టుకొని పోతాడు. అతని వెంట నీవు తిరుగుతూ ఉంటావు. ఇంకెక్కడి సుఖం? ఇంకేమి జ్ఞానం?

యస్సర్వత్రానభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

“ఎవడు అంతట అభిస్నేహము లేనివాడై, తత్సంబంధములైన శుభాశుభములు కలిగి నపుడు సంతోషమును, ద్వేషమును లేకుండా యుండునో అట్టివాని జ్ఞానము స్థిరమైనది” అని భగవద్గీతలో శ్రీ భగవానువాచ.

పద్మనాభా! నీదే శోభ!

పద్మహస్తా!
పద్మ మే పుణ్యము చేసెనో తెలుపు కాస్తంత!
నీ సతి పద్మజ
నీవు పద్మనాభుడవు
నీ బిడ్డ పద్మజుడు. మరో కుమారుడు పద్మశరుడు
సంసార భయాలు మా ముందు నిలిచియున్నా,
వెన్ను దట్టి ఆదుకుంటున్నావు అభయహస్తా!
కోర్కెలను తీర్చుతున్నావు కమలహస్తా!
మరొకరి వల్ల కోర్కెలు తీరితే అవి మళ్ళీ చిగురిస్తాయి.
నీవు తీర్చే కోర్కెలకు నూకలు చెల్లిపోతాయి.
పుట్టగతులు లేకుండా పోతాయి.
బాధలు పారిపోతాయి.
భయాలు భస్మమైపోతాయి.
అందుకే నీ కరపద్మము అభయహస్త మైంది.
నా మస్తకము భయ నిలయము.
నీ హస్తము అభయ రూపము.

గృహలక్ష్మి

విభిన్న ప్రవృత్తులు గల వ్యక్తుల సముదాయమే కుటుంబము. పరస్పర భిన్నమైన చిత్తవృత్తులు గల వ్యక్తుల హృదయాలను సమన్వయ దృక్పథంతో ఏకోన్ముఖం చేసి గృహమును దేవాలయముగా మార్చే శక్తి ఒక్కరికే ఉంది. అందుచేతనే ఆ దివ్యమూర్తిని గృహలక్ష్మి యని హిందూధర్మము కీర్తించింది.

ఏ గృహంలో ఏవిధమైన సమస్య తలెత్తినా అది అపరిష్కృతంగా మిగిలింది అంటే ఈ ధోరణికి గృహలక్ష్మి అసమర్థతయే ముఖ్యకారణమై ఉంటుంది.

సమాజసేవ ద్వారా తరించాలని ఈరోజుల్లో తల్లులు భావించి ఇంటిని వదలి సేవా కార్యక్రమాలలో కాలిడుతున్నారు. మంచిదే. కానీ సమాజసేవకు అంకితమైన తల్లి తన ఇంటిని ఎంతవరకు చక్కదిద్దగలిగింది? ఆమె ఊహించే సమాజంలో తన ఇల్లు ఉందా లేదా? గృహంలో శాంతిని నింపి ఆ తరువాత సమాజంలో శాంతిని దింపాలి. ఇంటికి మించిన సేవాకేంద్రము మరెక్కడో లభిస్తుందని నేను అనుకోవటం లేదు. భర్త విషయంలో, పిల్లల విషయంలో, అత్తమామల విషయంలో, అతిథుల విషయంలో తల్లులకు అనేక బాధ్యతలు ఉన్నాయి. సక్రమంగా వీటన్నిటిని అవగత మొనర్చుకొని ఆచరించగలిగితే గృహము స్వర్గతుల్య మౌతుంది.

బిడ్డలపై తల్లి ప్రభావం పడినట్లు మరెవ్వరి ప్రభావమూ పడదు. ప్రథమంగా బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే తాను సాగించే సత్సంకల్పముల ద్వారా, తీసుకొనే సాత్వికాహారము ద్వారా తల్లి బిడ్డకు గొప్ప మేలు చేయగలుగుతుంది.

పిల్లలలో సాధారణంగా అనుకరణ సహజాత ముంటుంది. వారు సదా పెద్దలనే అనుకరిస్తూ అభినయిస్తూ ఉంటారు. తల్లి అలవాట్లు పిల్లలకు అలవడుతాయి. అందుచేత సూర్యోదయానికి ముందే తల్లి నిద్ర లేవాలి. దైవప్రార్థనల యందు కొంతకాలము గడపాలి. అతిథులను ప్రేమతో పలుకరిస్తూ ఉండాలి. భర్తను, అత్తమామలను గౌరవిస్తూ ఉండాలి. సకాలానికి పనులు చేయగలగాలి. తీరిక సమయాలలో ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతూ ఉండాలి. ఈ విధమైన తల్లి ప్రవర్తన పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దుతుంది.

పిల్లలతో కఠినంగా ప్రవర్తించకూడదు. ప్రక్కయింటి పిల్లలతో పోల్చి నిందించ కూడదు. బిడ్డలలో ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా ప్రేమించకూడదు. మాట వినని బిడ్డ ఎవరో కాదు. గత జన్మలోని మన కర్మల యొక్క ఫలితమే. ఓర్పును వహించి నేర్పుతో జీవించటం అలవరచుకోవాలి.

ఇంటిలో ఎందరు పరిచారికలు ఉన్నా కుమార్తెలు కూడా ఇంటి పనులలో నిమగ్న మయ్యేటట్లు చూసుకోవాలి. ఇది ఎలా సాధ్యం? తల్లులు ఆచరించినపుడే బిడ్డలు ఆచరిస్తారు. పని తెలియని, చేయలేని ఆడబిడ్డ భవిష్యత్తులో అత్తవారింట గృహలక్ష్మిగా శోభించలేదు.

ఇంటిలో పాదరక్షలతో తిరుగకూడదు. ఏవిధంగా చూసినా ఇది అనాచారమే. ఇంటిలో శుభ్రత లేకపోతే శుద్ధి చేసుకోవడమే కర్తవ్యము. పాదరక్షలు ధరించి తిరుగుట కాదు.

పిల్లల ముందు పొరుగువారిని, బంధువులను విమర్శించకూడదు. పిల్లల ఎదుట పెద్దలను గౌరవించే సుగుణాన్ని కలిగియుండాలి. నిగ్రహము లేని భర్త పిల్లల ఎదుట భార్యను దూషించవచ్చు. ఇక్కడే తల్లి పాత్ర శోభించాలి. భర్త కోపాన్ని శాంతముగా అనుభవించాలి. నవ్వుతూ కనిపించాలి. ఈ విధమైన వైఖరిని తల్లి ప్రదర్శించగలిగితే భవిష్యత్తులో తన బిడ్డలు అత్తవారింట సుఖంగా జీవించేందుకు అనువైన బాటను నిర్మించ గలిగినదని భావము.

ప్రతి స్త్రీమూర్తి బ్రతుకులో దుర్భరమైన బాధలను అనుభవించే ఉంటుంది. ఈ సత్యము నాకు తెలియక పోలేదు. కానీ తాను అనుభవించిన బాధలను పిల్లల ఎదుట పలవరించకూడదు. ఒకవేళ తాను చెప్పాలి అనుకుంటే తన జీవితంలో అలవరచు కొనిన సుగుణాలు, భగవద్భక్తి, అనుభవించిన భగవత్కృప ఇలాంటివే పిల్లలతో ముచ్చటించాలి. పిల్లల హృదయాలలో నిరాశావాదము, హింసాప్రవృత్తి, ద్వేషవృత్తి చోటు చేసుకోకుండా జాగ్రత్తపడాలి.

బిడ్డను పట్టించుకోకుండా తల్లి ప్రక్కింటి వారితో సంభాషిస్తూ ఉంటే బిడ్డ ఓర్చుకోలేడు. కొంగుపట్టి లాగుతాడు. పిలుస్తాడు. ఏడుస్తాడు. తల్లి తన వంక చూచి నవ్వగనే సంతోషిస్తాడు.

జగదంబ దృష్టి అమృతదృష్టి. ప్రేమదృష్టి. ఆమె ప్రేమామృత వర్షధారచే మొలకెత్తిన భక్తిమొక్క, సుమధుర భావ సుమాలను విరబూసి, జ్ఞానామృత ఫలమును ప్రసాదిస్తుంది.

మొక్క నుండి పువ్వు, పువ్వు నుండి కాయ, కాయ నుండి పండు వచ్చేలోగా ఆ మధ్యలో మొక్క నశించి పోవచ్చు. ఇదే భక్తిలో ఉపేక్ష. అలాంటి సమయాలలో, తోటమాలి దృష్టి మొక్కను నశింపకుండా కాపాడునట్లు, అమ్మదృష్టి మనలోని ఉపేక్షను తొలగించి భగవంతునిపై అపేక్షను పెంచి బ్రతుకును దివ్యంగా మార్చుతుంది.

బిడ్డలకు సంపదలా? సంస్కారాలా?

చిల్లులు పడిన జీవన వస్త్రాలను అల్లుకపోయే ప్రేమమూర్తులు తల్లులు. అశ్లీల విల్లు విసిరే శరములను తప్పించి, అధర్మ ముళ్ళు పరచియున్న బాటను తెలియపరచి, అక్రమదృష్టిని అందించు కళ్ళను బాగుచేసి, అధర్మ జీవనానికి చెల్లుచీటి వ్రాయించే బ్రతుకును అందించు ఆదర్శమూర్తులు భారతీయ మాతృమూర్తులు.

తొలి నడవడి తల్లి ఒడిలో కదులుతుంది. బీజాన్ని చక్కగా పోషిస్తే చాలు. చెట్టును బీజమే పోషించుకుంటుంది. బిడ్డను తల్లి బాగు చేస్తుంది. బ్రతుకును బిడ్డ బాగుచేసుకుంటాడు.

ప్రతి తల్లికి తన బిడ్డ మహావ్యక్తి కావాలనే ఉంటుంది. ఈ ఆశయము ఫలించేందుకు ఏ తల్లి కృషి చేస్తున్నది? మొక్కకు నీరు పోయకుండా, అది వృక్షమై ఫలము లందించా లనుకోవడము ఎంత సమంజసము? ఆచరణ పునాదిపై ఆశయ భవనము నిలిచి ఉంటుంది. పునాది కదిలితే భవనం కూలిపోతుంది.

మన పుణ్య భారతావనిలో ఎందరో మహాత్ములు ఉద్భవించారు. వారి ప్రగతి గృహము నందే ప్రారంభమైంది. తల్లులే తనయులను ఉత్తములుగా తీర్చిదిద్దారు.

ఇది తల్లుల బాధ్యత. ఈనాటి తల్లులలో ఎక్కువ శాతం తమ కర్తవ్యాన్ని విస్మరించారు. విదేశీ సంస్కృతీ వ్యామోహము పెచ్చుపెరిగింది. విద్యావిలువలు అడుగంటి పోయాయి. సంస్కృతికి మూలస్తంభాలై రాణించవలసిన బిడ్డలు నిష్కృతి లేని పతనావస్థకు దిగజారుతున్నారు.

నైతిక విలువలు సడలిపోయిన నేటి సమాజం మానవ ప్రగతికి సమస్యగా అడ్డు నిలిచి ఉంది. స్వార్థ జీవనము ప్రతిధ్వనించు ప్రవర్తనా అలజడి శాంతిని పాతిపెట్టే శ్మశాన సంగీతమై నిలిచింది. సృష్టికి మణిపూసలాంటి మానవుడు దురలవాట్లకు బానిసయ్యాడు. చెడుమార్గమును చక్కగా చూపేందుకు చలనచిత్రాలు తయారయ్యాయి. ఆరోగ్యాన్ని అంతమొందించేందుకు అన్నశాలలు, పొట్టను పాడుచేసేందుకు ఫలహార శాలలు ప్రతివీధిలో ప్రత్యక్ష మయ్యాయి. బాహ్యములో పెచ్చుపెరిగిన యంత్రాలు, మానవుని ఆంతర్యములో దోబూచులాడే కుతంత్రాలు సమజీవన శకటానికి అమర్చిన చక్రాలను ముక్కలుగా విరిచాయి. చికిత్సలు చితిని పేర్చుతున్నాయి. మందులు మారణాయుధాలై గోచరిస్తున్నాయి. రాజకీయాలు అవినీతిలో రాటుతేలాయి. విద్యావిధానము వింతగా మిగిలింది. విచిత్ర వేషాలు, వినూత్న రోషాలతో సమాజనాడి నీరసించిపోతున్నది.

మీ ఇంటిలో వెలిగే చిట్టి దీపాలను అమరజ్యోతులుగా తీర్చిదిద్దండి. మీ ఇంట పెరిగే చిన్నారి మొక్కలను సంస్కృతీ కల్పవృక్షాలుగా తయారుజేసి, విజ్ఞాన కుసుమాలతో

విరాజిల్లేలా, దరిజేరిన వారలకు శాంతిఛాయలను ప్రసాదించేలా రూపు తీర్చండి. అవి మొక్కలు కనుక వంగుతాయి. వంచవలసిన సమయాలలో వంచకపోతే ఆ తరువాత పెరిగిన మొక్కలు అందించేవి చిక్కులే.

నైతిక విలువలను పిల్లలలో పెంచాలి. దైవభక్తిని వారిలో నింపాలి. పెద్దల యెడ గౌరవము, కర్తవ్యము ఎడల శ్రద్ధ ఇనుమడించాలి.

విజ్ఞానఖనియైన వేదమును వేదమాతయని ఆర్ష సంస్కృతి పిలిచింది. జ్ఞాన దాయినియైన భగవద్గీతను గీతామాత యని సనాతన ధర్మము పలికింది. "మాతృదేవోభవ" అంటూ ఉపనిషత్తు ముందు కురికింది.

బరువులను దించేది తల్లి. బాధలను తొలగించేది కూడా తల్లియే. తల్లియేకదా బ్రతుకుకు తొలి. తల్లి! ఆహా! ఎంతటి తియ్యని పలుకు! ఎంత కమ్మని పిలుపు! తల్లి కొఱకు తల్లడిల్లే ఆ పలుకులో ఎంత ఊరడింపు! అందులో స్వర్గాన్ని మరపించు ఆనందముంది. వర్గములను ఛేదించు అభేద దర్శనముంది. ప్రశాంతి నందించు పారవశ్యముంది. జన్మను కడతేర్చు అమృతభాండముంది.

మార్పు కావాలి. అది తల్లి ఓదార్పులోనే రావాలి. తల్లి నుండే తీర్పు రావాలి. అది సుగుణ రత్నాల కూర్పుగా బిడ్డకు అందాలి.

ప్రతి గృహము ఒక స్వర్గధామం కావాలి. ఇంటిలో పెరిగే ప్రతిబిడ్డ దేశానికి ఒక ఆశాజ్యోతి కావాలి. లేవండి. మనస్సులను పదును పెట్టండి. కర్తవ్య చెంగును నడుముకు బిగించండి.

మన సంస్కృతిని మనమే రక్షించుకోవాలి! మన బిడ్డలను మనమే తయారు చేసుకోవాలి.

నేటి బాలలే రేపటి పౌరులు. నేటి క్రమశిక్షణయే రేపటి ప్రగతికి పునాది రాయి అవుతుంది. క్రమమైన శిక్షణను పిల్లలకు అందించుటలో తల్లులు చాలా జాగ్రత్త వహించాలి.

కాల విలువను మీరు ముఖ్యంగా గుర్తించి అది పిల్లలలో నిలిచేలా చూడాలి. సకాలములో జరుగని పనులు సత్ఫలితా లివ్వవు. కాలము ధనముకన్నా చాలా విలువైనది. పోయిన ధనాన్ని తిరిగి రాబట్టుకోవచ్చు. గడచిన కాలము తిరిగివచ్చేది ఉండదు.

సకాలానికి పిల్లలు కార్యము లాచరించే సదలవాటును పెంపొందించాలి. సకాలానికి చేరనిచో రైలు మనకై ఆగుతుందా? కాలమూ అంతే.

నిత్యము నిర్ణీత కాలమునందే నిద్రలేచుట -ఆహారము గ్రహించుట-మరల నిద్రించుట. ఈ అలవాటును పిల్లలు చక్కగా ఆచరించునట్లు చూడాలి. పసితనములో

ఈ అలవాటు లోపించుట చేత వయస్సు మరలిన దశలో కలిగే పరిణామాలు పెద్దలకు తెలియనివి కావు.

సూర్యుడు నిత్యము సకాలానికే ఉదయిస్తాడు. సకాలానికే అస్తమిస్తాడు. అదియే అతని ఉజ్జ్వలకాంతికి కారణము. సకాలమున పను లాచరించువారు సూర్యునివలె కాంతిమంతులవుతారని మీరు పిల్లలకు తెలపాలి.

నిత్యము ఏదో ఒక అనుకూల సమయమునందు పిల్లలను దైవదర్శనానికై ఆలయానికి పంపాలి. వీలుకానిచో కనీసము వారమునకు ఒక్కసారైనా ఆలయమునకు వెళ్ళునట్లు చూడాలి. పిల్లలను ఆలయానికి పంపునపుడు ఏదైనా ఒక భక్తుని చరిత్రను గాని లేదా భక్తిని కలిగించు ఒక సంఘటనము గాని చెప్పి వారిని ఆలయానికి పంపాలి. అప్పుడు వారి శరీరమునే గాక మనస్సును కూడా ఆలయానికి పంపినవాళ్ళ మవుతాము. ఆలయములో ప్రవేశించిన తరువాత ఏ విధమైన భాషణము చేయకుండ మనస్సును భగవంతుని యందే మరల్చి భక్తితో చరించునట్లు చూడాలి.

సకాలములో కర్మ లాచరించుటచేత క్రమశిక్షణ, మనోస్థైర్యము, ఆరోగ్యము చేకూరుతాయి. దైవభక్తి ద్వారా కర్మలలో సౌందర్యము స్ఫురిస్తుంది. ఈ రెండు విషయాలు పిల్లలలో తప్పక ఏర్పడేలా చూడాలి.

వేదాంతము ప్రచార సాధనము కాదు. ప్రబోధ విషయము. ప్రమాణము. ఈ విషయము అర్థంగాని వారి ప్రసంగాల్లో ప్రబోధ సుధకన్నా ప్రచార వ్యథ ఎక్కువగా ఉంటుంది.

ప్రబోధము ప్రభావితం చేస్తుంది. జ్ఞానాన్ని ప్రసాది స్తుంది. ప్రచారము విచారానికి నోచుకోని సమాచా రంతో బుర్రను నింపేస్తుంది. బ్రతుకును చిందర వంద రగా చింపేస్తుంది. ప్రగతిని చంపేస్తుంది.

సుఖపెట్టు ..... సుఖపడు

కాలువలు నీటిని అందిస్తాయి. వడ్రంగి పనిముట్లు చేస్తాడు. కంసాలి కత్తిని పదును చేస్తాడు. మనిషే మనస్సును నిగ్రహించలేడు.

మనం మానవులం. పశుపక్ష్యాదులకన్నా అతీతులం. వాటికి లేని మనో బుద్ధులను కలిగి ఉన్నాం. అందుచేత మన ప్రవర్తన వాటికన్నా ఉన్నతంగా, ఉజ్వలంగా ఉండాలి.

పుష్పమునుండి తుమ్మెద మకరందమును గ్రోలుతుంది. అలా చేయడములో అది పుష్పాన్ని మలిన పరచదు. దాని సౌందర్యాన్ని, సౌరభాన్ని పాడుచేయదు. మనమూ అలాగే నడుచుకోవాలి. ఇతరులతో మెలిగే టప్పుడు వారి మనస్సులను నొప్పించ కుండా మనం స్నేహాన్ని కొనసాగించాలి. మాట్లాడే ప్రతి విషయాన్ని రెండుసార్లు ఆలోచించిన తరువాత మాట్లాడే అలవాటు చేసుకోవాలి. అప్పుడే మనం తియ్యగా మాట్లాడగలం.

ఇతరులతో మనం స్నేహము చేసేటప్పుడు మనలోగాని, వారిలోగాని అసంతృప్తి రాకుండా మసలుకోవాలి. మధుర భాషణము ద్వారా, మనసుల్ని అర్థం చేసుకోవటం ద్వారా స్నేహితులను తృప్తిపరచవచ్చు. కానీ ఆ తృప్తి మనలో కూడా ఉండాలి. ఎప్పుడూ నవ్వుతూ జీవించే సదలవాటును కలిగియుండాలి. పుష్పము తనలోని సువాసనను అందరికి పంచుతుంది. అంతమాత్రాన దాని బరువు తగ్గుతుందా? అది గుర్తుంచు కోవాలి. ఇతరులతో మనం ఏర్పరచుకొన్న సంబంధము వలన మనము వెలితి పడకూడదు.

ప్రతి వ్యక్తి తాను ఆకర్షణీయంగా ఉండాలనుకుంటాడు. కానీ ఆకర్షించలేడు. కారణమేమిటి? ఆదర్శజీవనమును సాగించువాడే అన్యులను ఆకర్షించగలడు. పుష్పాలే తుమ్మెదలను ఆకర్షిస్తాయి గాని మొగ్గలు ఆకర్షించలేవు.

ఆదర్శజీవన మనగానేమి? ప్రేమ జీవనమే ఆదర్శ జీవనము. సర్వులను ప్రేమించే సదలవాటును ఏర్పరచుకోవాలి. అది నిన్ను సంపూర్ణ మానవునిగా తీర్చి దిద్దుతుంది.

ఈ ప్రేమ జీవనము మొదట గృహంలో ప్రారంభం కావాలి. మన కుటుంబీకులను ప్రేమించటం మొదట అలవరచుకోవాలి. శ్రీరాముడు ఆదర్శ జీవనమును గడిపాడు. చిన్ననాడు రాముడు, భరతుడు కలసి ఆడుకొనేవారు.

భరతుడు గెలిస్తే రాముడు గంతు లేసేవాడు. కానీ తనను గెలిపించడానికే శ్రీరాముడు ఓడిపోతున్నాడని భరతుడు బాధపడేవాడు. చూశారా! ఇది నిజమైన ప్రేమ.

ప్రేమ ప్రపంచాన్ని ఊగిస్తుంది. పర్వతాలను కదిలిస్తుంది. సాగరచలనాన్ని నిరోధిస్తుంది. ఆకాశాన్ని అంబరముగా చుట్టబెడుతుంది.

ప్రేమగా జీవించడము ఒక కళ. అద్భుతమైన కళ. ప్రేమజీవులు ధన్యజీవులు. పెనుతుఫాను వచ్చినా పర్వత మెలా చలించదో, భయంకర బాధలు సంభవించినా ప్రేమజీవులు చలించరు.

ప్రేమ భేదాన్ని చూడదు. శ్రీకృష్ణుడు తన స్నేహితులందరికి సంతోషంగా వెన్న పంచిపెట్టేవాడు. అంతేకాదు. కోతులకు కూడా పెట్టేవాడు. అందుచేతనే ప్రపంచమంతా ఆ ప్రేమమయుని పూజిస్తూ ఉంది. సత్కార్యము సదా సత్ఫలితాన్నే అందిస్తుంది.

కానీ సత్కార్యములు చేయువారికి దుష్ఫలితాలు రావడం, దుష్టకార్యము లాచరించువారికి సత్ఫలితాలు రావడం చూసి "ఇదేమిటి?" అని చాలామంది కలతపడు తుంటారు. చెబుతాను వినండి.

ఒక వ్యక్తి ఆలయంలో భగవంతుని సేవించి వెను తిరిగి వస్తూ ఉన్నాడు. అతనిని తేలు కుట్టింది. అక్కడ ఒక నాస్తికుడు ఉండి "దేవుడెక్క డున్నాడయ్యా! అంతా పిచ్చిగాని" అని వాగుతున్నాడు. ఇరువురూ కొంతదూరము నడిచారు. ఈలోగా ఆ నాస్తికునికి ఒక రూపాయి బిళ్ళ దొరికింది. ఇదేమి విచిత్రము! దైవభక్తి చేసిన వానిని తేలు కుట్టింది. దైవదూషణ చేసిన వానిని రూపాయి వరించింది. అందరూ ఆశ్చర్యపడ్డారు.

కానీ వాస్తవ మేమిటో తెలుసా? ఆలయమునకు వెళ్ళి దైవభక్తి చేసినవాడు చనిపోవలసి ఉంది. దైవభక్తి అతనికి తోడ్పడి గండం తప్పించి తేలుకుట్టుతో సరిపెట్టింది. నాస్తికునికి కోటి రూపాయలు విలువగల నిధినిక్షేపాలు లభించవలసి వుంది. దైవదూషణ వలన అదిపోయి ఒక్క రూపాయి మిగిలింది. చూశారా! ఇక్కడ ఎవరు లాభ్దిపొందారో? ఎవరు నష్టపోయారో?

కనుక సదా భగవానుని పూజించాలి. సర్వులను ప్రేమించాలి. ఉన్నత భావాలతో ఆదర్శంగా జీవించాలి.

నిన్ను మారమని నేను చెప్పలేదు. నేను చెప్పేదేదో నేను విరామం లేకుండా చెబుతూ ఉన్నాను. నీవు మారటం, మారకపోవటం కేవలం నీ మీద ఆధార పడి ఉంది. నీవు హాయిగా, తృప్తిగా ఉంటే, ఎందుకు మారాలి? ఒకవేళ నీవు అసంతృప్తిగా ఉండి, అయినా మారకపోతే ఎలా సుఖపడాలని భావి స్తున్నావు? ఆలోచించుకో. నేను ఆలోచింపచేశాను. అంతే.

చైతన్యగాన లహరి

పల్లవి: నిను గని పూజించు జనులు ఘనులు
నిజముగ భువిలో వారే ధన్యులు ॥ నిను॥

చరణములు:

1. నీ విభవము గని పులకరించిన
ఆకాశమె అనంతమాయె
తీపి తలపులతో తూగిన లతలు
పూజా వేళకు పువ్వులు తొడిగె ॥నిను॥


2. దీపారాధన అర్కుని పుణ్యము
మాల సమర్పణ హరివిల్లు భాగ్యము
నిండు మనసుతో పండుజాబిలి
హారతు లిచ్చి నిను అర్చించె ॥నిను॥

3. పొంగే తరంగాల అంగాలు చాచి
నీ అడుగుల పడినది గంగమ్మ తల్లి
కులుకుల పైటను మెల్లగ పరచి
తన యెదలో దాచెను యమునాదేవి ॥నిను॥

4. మ్రోగుచున్నవి గుడిలో గంటలు
మోయుచున్నవి గుట్టుగ గాలులు
తడుపుచున్నవి చల్లని వానలు
తన్మయమైనవి చైతన్య తలపులు ॥నిను॥

బాధలు - బోధలు

ఇందులో...



బాధల పురాణం

కష్టపెట్టటం బాధాకరమనే విషయాన్ని అందరూ గుర్తించలేరు. కాని, కష్టపడటం బాధాకరం అనే సత్యం వంటబట్టనివా రుండరు. నిజానికి ఇవి రెండు విషయాలు కావు. విషయ ప్రధానంగా చూచినా, విషయి ప్రధానంగా చూచినా కష్టము ఒక్కటే. కష్టపడేవా రెవ్వరైనా ఆ వ్యక్తి మనిషే. ఒక్కడే లేదా ఒక్కతే.

బాధ అనేది సుఖంగా భరించదగినది కాదు. గాయం మచ్చను ముద్రిస్తుందని ఖచ్చితంగా చెప్పలేము. బాధమాత్రం గుండెపై చెదరని ముద్రను వేస్తుందని గంటకొట్టి మరీ చెప్పొచ్చు. గుండెకు తెలియకుండా గండికొట్టేవి బాధలు.

బ్రతుకంతా వీడని నేస్తంలా వెంటాడే బాధల పురాణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోకపోతే, జీవితంలో ప్రతివిషయం అస్పష్టంగా, అయోమయంగా గోచరిస్తుంది. ఈ విధమైన బ్రతుకు చీకటికి చుట్టమే గాని వెలుగుకు బంధువు కాలేదు.

ఎందుకు పుట్టామో తెలుసుకొనే సత్తా అందరి సొత్తు కాకపోయినా, ఆలోచిస్తే, ఎలా పుట్టామో సులభంగా తెలుసుకోవచ్చు. తల్లి బాధపడితేనే నేను బయట పడ్డాను. మరొకరిని బాధపెట్టటం లోనే నా బ్రతుకు శ్రీకారం చుట్టింది.

ఆ తరువాత ...? నేను పెరగటానికి ఎందరో కష్టపడ్డారు. ఇదంతా నాకు తెలిసి జరగలేదు. కాని, పెరుగుతూ, తిరుగుతూ తెలిసో తెలియకో, ఇతరుల్ని ప్రయత్న పూర్వకంగా బాధించే నిర్వాకానికి ప్రతి మనిషి సిద్ధపడతాడు. ఇంతకీ వడ్లగింజలో బియ్యపు గింజలా తేలేదేమిటి? ఒక వ్యక్తి బాధపడటం. ఒకవ్యక్తి.....ఒకవ్యక్తి....ఒక వ్యక్తి......ఒకే వ్యక్తి.

ఆ వ్యక్తి ఎవరు? నీవు కష్టపెట్టే మరొకరు కావచ్చు. మరొకరు కష్టపెట్టే నీవు కావచ్చు. మొదటి విషయంలో మచ్చపడేది వేరొక గుండెపై అనుకుంటే, రెండవ విషయంలో ఆ మచ్చను ధరించేది నీ గుండే. నా గుండే. ఎవరి గుండె అయినా గుండె ఒక్కటే. ఇలా ఓటికుండల లాగా పగిలిన గుండెలు ప్రోగయిన కుటుంబం గాని, సమాజం గాని, దేశం గాని, సంస్థ గాని - బ్రతికితే బ్రతకవచ్చునేమో గాని బట్టకట్టి భవ్యంగా జీవించలేదు.

అమాయకమో, అజ్ఞానమో, ఏదయితేనేమి మరొకరిని తెలిసో తెలియకో బాధించటం బ్రతుకులో భాగమైపోయింది. బాల్యము నుండి ఇదే ఆట. ఈగను కొట్టిచంపటం, తూనీగను పట్టి తోక విరచటం, ఒకరిని గిల్లటం, మరొకరిపై బురద చల్లటం - ఇవన్నీ మరొకరిని బాధించే కార్యాలు. ఎవరూ చెప్పకుండా వంటపట్టిన వినోదాలు. ఒకనాడు పసితనంలో కదిలిన ఈ వినోదాలే మరోనాడు విరబూసిన బ్రతుకులో వెదజల్లబడే వికారాలు.......నిజానికి విషాదాలు.

విషాదం ఆనందంగా అందుకొనే ప్రసాదం కాదు. తృప్తిగా అనుభవించే భోగం కాదు. నిజానికి, అది గుండెను పట్టుకొనే రోగం.

తప్పులు చేస్తూ బ్రతుకు పెరగటం తప్పుకాదు. పెరిగే బ్రతుకు తప్పులను సరిదిద్దుకోలేకపోతే బ్రతుకు బండబారిపోతుంది. భారమైపోతుంది. సుఖమనేది మనిషికి దూరమైపోతుంది.

నేను ఒక వ్యక్తిని బాధపెడితే అతని హృదయం మెలికలు తిరిగిపోతుంది. అది బాధ. అతను పడే బాధ. అది బాధ అని పడేవాడికే కాదు; బాధపెట్టిన నాకు కూడా తెలుసు. ఇది కూడా జ్ఞానమే. బాధల జ్ఞానము. బాధపడేవారు ప్రత్యక్షంగా అనుభవిస్తారు. బాధపెట్టేవారు పరోక్షంగా అనుభవిస్తారు. బాధలో వ్యత్యాసా లుండవచ్చు నేమోగాని బాధ మాత్రం ఒక్కటే. ఈ పరమ సత్యాన్ని గ్రహించటానికి మనిషి పడమటి చూపును తూర్పుకు త్రిప్పుకుంటే సరిపోతుంది. బ్రతుకులో తూర్పార పట్టటము మొదలవుతుంది. ఈ పవిత్ర కార్యములో వ్యథలతో నలిగిన గుండెలలో పిండారబోసినట్లు వెన్నెలలు నిండుకుంటాయి.

ఇంతకీ, చెప్పొచ్చిందేమిటంటే - పిండుకొంటే పాలొస్తాయి. గుండెల్ని పిండుకొంటే నీళ్ళొస్తాయి. కన్నీళ్ళొస్తాయి. మరొకరిని బాధించటములో మన బాధ కూడా మనకుంటుంది అనే సత్యాన్ని వంటపట్టే వరకు ఆలోచించాలి. అంతే కాదు. నీ గుండెను పిండే కార్యం కూడా ఎంత మంచిదయినా దానిని త్యజించటమే త్యాగం. ఇతరులకు కాంతినిచ్చి తాను కాలి కనుమరుగయ్యే క్రొవ్వొత్తి కవులకు కథావస్తువైతే, తాను వెలుగుతూ వెలుగునిస్తూ, తనలో వెలుగులారని భానుడే మనకు మిత్రుడు. అతడు మనకు కథావస్తువు కాదు; కథానాయకుడు.

ఇది బోధపడితే మన జీవిత కథ ఒక మలుపు తిరుగుతుంది. సుఖానికి పిలుపు నిస్తుంది. శాంతికి తలుపు తడుతుంది.

ఇప్పటి వరకు తెలియక ఎందరినో బాధించాము. ఇక తెలిసినవారమై, తెలివిగల వారమై ఎవరినీ బాధించకుండా (సాధ్యమైనంతవరకు) జీవిద్దాం. అంతేకాదు. ఇంతవరకు తెలియక మనం కొనితెచ్చుకొని బాధల ననుభవించాం. ఇక మీదట బాధలు అంటకుండా గుండెల్ని కాపాడుకుంటాం. జీవితం చాలా విలువైంది అనే వాక్యం పెద్ద విలువైనది కాదు. విలువలను జీర్ణించుకొని బ్రతికితే జీవితం ఎలా విలువైనదో తెలుస్తుంది. ఇలా బ్రతికే జీవితము భవ్యము. ఇలా బ్రతికేవాడే ధన్యుడు. అతడే భక్తుడు.

యస్మాత్ న ఉద్విజతే లోకః లోకాత్ న ఉద్విజతే చ యః

ఎవని వలన లోకానికి ఉద్వేగము లేదో, లోకము వలన ఎవనికి ఉద్వేగ ముండదో, భయముండదో, బాధలుండవో - అతడే భక్తుడని భగవద్గీత భవ్య సందేశము.

ఇది ఆదేశం కాదు. నిర్దేశం కాదు. సందేశం. దేశాలు కారిపోయినా, కాలాలు మారిపోయినా, కారిపోని, మారిపోని సందేశం. సందేశాలను విని సంబరపడితే లాభముండదు. సంబరంతో సందేశాలను బ్రతుకులో సందర్శిస్తేనే సమదర్శనం. సమ్యక్ దర్శనం. సందర్శనం.

విజ్ఞాన వసంతము

మనం ఎందరితోనో కలిసి జీవిస్తున్నాం. వారందరిని అర్థం చేసుకొంటూ మరీ జీవిస్తున్నాం. అలాగే వారు కూడా మనల్ని అర్థం చేసుకోవాలని ఆరాటపడుతున్నాం. ఒకరికి ఒకరు అర్థం గాక కలిసి జీవించే వ్యక్తులు

తల్లిదండ్రులైనా, అన్నదమ్ములైనా

అక్కచెల్లెళ్ళైనా, భార్యాభర్తలైనా

బంధుమిత్రులైనా, గురుశిష్యులైనా - ఎవరైనా సరే,

ఒకరికి మరొకరు బరువౌతా రనేది సత్యం. భారమౌతా రనేది వాస్తవం. కష్టపడి దేహంతో బరువులు మోయవచ్చు. గుండె భారాన్ని మోయడం తేలికైన పనికాదు.

ఒకరివల్ల మనం బాధకు గురయితే మన గుండె బరువెక్కుతుంది. ఇది అందరికీ తెలుసు. మనవల్ల మరొకరు బాధ పడితే కూడా మన మనస్సు కుంచుకు పోతుంది అనే సత్యాన్ని గ్రహించటానికి మనిషి జ్ఞానవంతుడు కావాలి. జ్ఞానం కలిగితే, మన విషయంలో తప్పు చేసిన వారిని కూడా పెద్ద మనస్సుతో క్షమిస్తాం. మన వల్ల తప్పు జరిగితే పెద్దతనాన్ని ప్రక్కన బెట్టి క్షమించమని కోరుతాం. ఇది ధర్మం. ధర్మంగా జీవించే మార్గం.

ఇలా జీవించి తరించేందుకు అనుగుణంగా ఒక అందమైన శ్లోకాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ఈ శ్లోకం గాయాలు చేసే మనస్సును చక్కబరచి సున్నితంగా శుద్ధిచేస్తుంది. గాయపడిన మనస్సును ఓదార్చి పదిలంగా ఉంచుతుంది.

క్షమేஉ హం సర్వాన్ వై జీవాన్ తే చ క్షమ్యన్తు మాం సదా

మైత్రీ స్యాత్ సర్వభూతేషు న మే ద్వేషోஉ స్తు కేనచిత్ ॥

"నేను సర్వులను (నన్ను బాధించిన వారిని) క్షమించెదను గాక! వారు నన్ను (వారిని బాధించినందుకు) సదా క్షమించెదరు గాక! సర్వులలో మైత్రీభావము నెలకొనుగాక! ఎవరూ ఎవరినీ ద్వేషింపకుందురు గాక!"

ఆశలు - అవరోధాలు

ప్రతి మనిషికీ మనస్సుంది. ప్రతి మనసుకీ కొన్ని అభిరుచులు, అలవాట్లు, పరిమితాలు ఉన్నాయి. తనకు మించి తానుగా ఏ మనసు ప్రవర్తించలేదు. ఊహించలేదు. తనలోని వాతావరణాన్ని అనుకున్నంత తేలికగా మార్చుకోనూ లేదు.

మనుషులు కొందరు ఒకచోట ఉండొచ్చు. మనసులు అలా ఒకేచోట ఉండలేవు. ఎవరి నేపథ్యం వారిది. ఎవరి గతం వారిది. ఊహలు అందరికీ ఉన్నాయి. అందరి ఊహలు ఒకేలా లేవు. కనుకనే ప్రతిమనిషి తన చర్యల కన్నా ఎక్కువగా ప్రతి చర్యలతో (reactions) జీవిస్తూ ఉంటాడు. మరోలా జీవించటం అతనికి చాలా కష్టతరంగా ఉంటుంది. ఇది మనకు అర్థం కావాలి.

ఇతరులు ఇలా ఉండాలి అని మనం ఆశిస్తాం. వారు మరోలా ప్రవర్తించినపుడు ప్రతిచర్యతో ఊగిపోతాం. ఇలాంటి పరిస్థితుల్లో అతని నేపథ్యాన్ని కనుక మనం అర్థం చేసుకొనే ప్రయత్నం చేయగలిగితే అతనిపై మనలో సానుభూతి కలుగుతుందే గాని మరొకటి జనించదు.

ఇది చెప్పినంత తేలికైన విషయం కాదు. ఎందుకో తెలుసా? మన నేపథ్యం మనకుంది. ఈ విధమైన సానుకూల అవగాహన మన నేపథ్యానికి ఇమడక పోవచ్చు. కాని, ప్రయత్నిస్తే, ఫలితాలు తప్పక వస్తాయి. జ్ఞానపూరితమైన విషయం కనుక ఫలితం సులభం కాకపోవచ్చునేమో గాని అలభ్యం మాత్రం కాదు.

జగన్నాటకం

నాటకం నవరస భరితం. అందులో సుఖాలు గోచరిస్తాయి. కష్టాలు కనిపిస్తాయి. హాస్యం ఉంటుంది. శృంగారం ఉంటుంది. భీభత్సం ఉంటుంది. కరుణ ఉంటుంది. భయం ఉంటుంది. ఇవన్నీ ఉంటాయి. ఉంటేనే నాటకం.

ఈ జగత్తు ఒక రంగస్థలి. దానిపై మన జీవితమొక నాటకం. నాటకంలో నటుని ప్రక్కన సుఖపెట్టే పాత్రలు కొన్ని ఉంటాయి. బాధించే పాత్రలు కొన్ని ఉంటాయి. పాత్ర పోషణ చాలా ఆనంద దాయకమైన విషయం.

ఒక నటుడు ప్రేమతో వెన్ను చరిస్తే, మరొక నటుడు ద్వేషంతో కన్ను పొడవ వచ్చు. నటన పరంగా చూస్తే మొదటి వాని కన్నా గొప్పగా నటించే అవకాశాన్ని రెండవ వాడే కలిగించాడు. కాని, పాత్ర పోషణలో వెన్ను చరిచిన వానిపై ప్రేమ లేదు. కన్ను పొడిచిన వానిపై ద్వేషమూ లేదు. ఎందుకని? అది నటన కనుక. అంతేకాదు. తన నిజ జీవితముపై ఆ రెండిటి ప్రభావం అసలే లేదు కనుక తాను భోక్త కాడు. భోక్తృత్వం పాత్రదే గాని తనది కాదు.

అలాగే నాటకంలో తానే మరొక వ్యక్తిని మోసం చేయవచ్చు. అలా చేసినందుకు తన మనస్సు బాధ పడుతుందా? క్షమాపణ చెబుతుందా? చెప్పదు. ఎందుకని? తాను మోసం చేయలేదు. అది పాత్ర పోషణ. తాను కర్త కాడు. తనకు కర్తృత్వం లేదు. తన ద్వారా జరిగిన దానికి తాను "అకర్త" గా నిలిచి పోతాడు. నటించే వాడికి తాను నటుడని తెలిసి నటించడమే ఈ వైభవానికి కారణము.

అభోక్త - అకర్త

ఎవరు గతంలో మనకు ఏది చేసినా దాని ప్రభావం నేటి మన జీవితంపై ఉండ కూడదు. నీవు అభోక్తవు. కనుక నీకు అందరితో మైత్రియే. ఎవరితోనూ ద్వేషం లేదు.

వారు నాకు అన్యాయం చేశారు అనే బాధ నీ మనస్సులో నిలవదు. ఇది సానుభూతితో కూడిన క్షమ.

మనకూ గతం ఉంది. బాల్యము నుండి నేటి వరకు మనమూ ఎందరినో బాధించి ఉంటాం. మోసగించి ఉంటాం. అదంతా గతానికి సంబంధించింది. అజ్ఞానానికి, అహంకారానికి సంబంధించింది. అలాంటి పనులు ఇప్పుడు చేయగలమా? చేయలేము. మనం అలా ప్రవర్తించే నైజం గలవారమైతే ఇప్పుడు కూడా అలాగే ప్రవర్తించ గలగాలి. ఎందుకు పశ్చాత్తాప పడుతున్నాం? ఆలోచించండి.

పశ్చాత్తాపం కూడా హృదయాన్ని బాధపెట్టేదే. పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలు పరిష్కారాలు కాలేవు. పరిజ్ఞానమే పరిష్కారము. గతాన్ని మరువ నవసరం లేదు. అది మనకు సంబంధించింది కాదు అని జ్ఞానపూరితంగా గుర్తించాలి. అప్పుడు గతం యొక్క ప్రభావం స్వగతంలో ఉండదు.

ప్రసన్నత - పరిపూర్ణత

ఎవరూ ఎవరినీ ఈ ప్రపంచంలో మార్చాల్సిన పనిలేదు. మార్పు అలా జరిగేది కాదు. తీర్పులిచ్చే అలవాటును ప్రయత్నించి వదులుకొంటే మంచిది. ఏదో చేయాలని అశాంతితో కుమిలి పోవటంకన్నా, చేయలేని దానిని చేయలేమని అంగీకరించే పెద్ద మనస్సుంటే, పదిలంగా ఉన్న పది రోజులు సుఖంగా జీవించవచ్చు. ప్రసన్నంగా బ్రతకవచ్చు.

సంస్కర్తలకు నేటి సమాజంలో కొరత లేదు. అది ఒకరు ఇచ్చే ఉద్యోగం కాదు. తనను తాను నియమించుకొనే పద్ధతి కనుక సంఘ సంస్కర్తలు కుప్పతెప్పలుగా, గుంపులు గుంపులుగా లభిస్తారు. వాళ్ళది సంస్కరించే పని. కాని, వారి చేత సంస్కరింప బడేందుకు సమాజం సిద్ధంగా లేదు.

పర సంస్కర్తలను చూడాలని మానవ సమాజం ఉవ్విళ్ళూరటం లేదు. ఆత్మ సంస్కర్తలను గాంచాలని కుతూహలంతో ఉంది. చింతలులేని, వాంఛలు లేని, అశాంతి లేని, కాఠిన్యం లేని ప్రసన్న వదనులైన వారిని కళ్ళారా చూడాలని కలలు కంటోంది. వారి చూపుల దర్పణములో తమ జీవన రూపాన్ని సరిదిద్దుకోవాలని తహతహ లాడుతోంది. వెలితి తెలియని పూర్ణ హృదయాలతో సఖ్యం చేయాలని గంతులేస్తోంది.

వెలిగే దీపానివి కా!

వెలగటం శోభ. ఆరిపోవటం క్షోభ. అందుకే సాయం సంధ్యా సమయాన దీపారాధన చేసి **"దేశోఽ_యం క్షోభరహితః"** అంటూ స్వస్తి పలుకుతున్నాం, క్షోభ ఎక్కడా ఉండకూడదని ప్రార్థిస్తున్నాం. ఇది చాలా అందమైన కార్యము. ఆదర్శమైన కార్యము.

"సర్వే జనాః సుఖినో భవన్తు" అని మనం ప్రార్థిస్తున్నాము. అందరినీ సుఖపెట్టే శక్తి మనకు లేదు కనుక అట్టి శక్తి గల అప్రమేయ వరదుని ప్రార్థిస్తున్నాము.

ప్రపంచాన్ని సుఖపెట్టే శక్తి మనకు లేకపోవచ్చు. కాని మన వరకు మనం ఎవరినీ కష్టపెట్టకుండా జీవించేందుకు ప్రయత్నించవచ్చు. అది చేయగలిగితే మరోవిధంగా ప్రపంచాన్ని సుఖపెట్టినట్లే.

ఇక్కడ ఒక విషయాన్ని, కాదు, సత్యాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఎవరినీ కష్టపెట్టకుండా జీవించేందుకు ప్రయత్నించవచ్చు. అది చేయగలిగితే మరో విధంగా ప్రపంచాన్ని సుఖపెట్టినట్లే.

ఎవరినీ కష్టపెట్టకుండా జీవించటం ఎప్పుడు సాధ్యపడుతుందో తెలుసా? నిన్ను నీవు కష్టపెట్టుకోకుండా జీవించ గలిగినపుడే, ఇతరులను కష్టపెట్టకుండా జీవించటం జరుగుతుంది. నిదానంగా, ఓ విధానంగా అర్థం చేసుకోవలసిన సున్నితమైన విషయమిది.

బాధించేది మనస్సు. బాధపడేదీ మనస్సే. మన బాధలకు ఇతరులు కారణం అని చెప్పటానికి జ్ఞానం అవసరం లేదు. మన బాధలకు మనమే కారణమని గ్రహించటానికి జ్ఞానం కావాలి. ఇది అర్థమైతే మనం బాధ పడకుండా జీవించగలం. ఆ స్థితిలో ఇతరులను బాధించటం ప్రయత్నించినా సాధ్యపడదు. ఎందుకో తెలుసా? అది గోడపై విసిరిన రబ్బరు బంతి లాంటిదే కనుక. అర్థం చేసుకోండి.

వెలిగే నీవు - వెలుగే నీవు

నీవు ఈ క్షణాన వెలిగే దీపానివి. అందమైన రూపానివి. ఆనంద స్వరూపానివి. ప్రసన్నతవు, పరిపూర్ణతవు. నిన్ను దర్శించటంలో లోకం సుఖిస్తుంది. జనులు తృప్తి చెందుతారు. వాతావరణం పవిత్రతకు నిలయ మవుతుంది. నీ గుండె లోతుల్లో నుండి పెల్లుబికి వచ్చే శాంతి జలాలలో జలకమాడి జగత్తు పులకరిస్తుంది. నీ నుండి ప్రసరించే ఆనంద కిరణాలకు పరవశించిన ప్రపంచం పురివిప్పి నాట్యం చేస్తుంది.

ఆహా!..... ఏమి ఈ విచిత్రం? చెప్పకనే ఎంత పని చేసింది నీ ప్రసన్నత! చేయకనే ఎంత మార్పు తెచ్చింది నీ పరిపూర్ణత! నీవు బుద్ధుడివా! శంకరుడివా! పరమహంసవా!
వారెవరు? ఆత్మస్వరూపులు.
ఇప్పుడు చెప్పు. మరి నీవు?
నీవూ ఆత్మవే. నేనూ ఆత్మనే. ఈ విశ్వమూ ఆత్మయే.

సర్వమాత్మైవ

అంతయూ ఆత్మయే. ఆనందమే. అనంతమే.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఒంటరి ప్రయాణం

దేహము పాంచభౌతికము. అందులో భూభాగము ప్రధానము. పాంచ భౌతికములై ఈ ప్రపంచమున చలించే దేహాలు నాలుగు విధాలు. అవి: **1. జరా యుజములు:-** నరమృగాదులు; **2. అండజములు:-** గ్రుడ్డు వలన పుట్టునవి, **3. స్వేద జములు:-** చెమట వలన పుట్టునవి **4. ఉద్భిజములు:-** భూమిని ఛేదించుకొని జనించే వృక్షాదులు.

ఈ నాలుగు మాత్రమే గాక మానసదేహము అని ఐదవ దేహమున్నది. అది దేవతలకే ఉంటుంది. శుక్రశోణితముల కలయిక వలన ఏర్పడుటచేత మానవ దేహము జరాయుజమైనది. పక్షి సర్పాదులు అండజములు. నల్లులు, పేలు స్వేదజములు. వృక్ష గుల్మాదులు ఉద్భిజములు. సురులు మానసులు.

ప్రారబ్ధమును అనుభవించుటకు జీవుడు స్త్రీ గర్భమున తొమ్మిది నెలలు కాపుర ముంటాడు. మొదటి నెలలో ద్రవరూపముగా ఉంటాడు. రెండవ నెలలో ద్రవము ఘనీభవిస్తుంది. మూడవ నెలలో చేతులు, కాళ్ళు, తల ఏర్పడుతాయి. నాల్గవ మాసములో సూక్ష్మ దేహము తయారవుతుంది. అప్పుడే తల్లి కడుపున బిడ్డ చలించడము జరుగుతుంది. పుత్రుడైతే కుడిప్రక్కన, పుత్రిక అయితే ఎడమప్రక్కన కదులుతూ ఉండడం జరుగుతుంది. నపుంసకుడైతే గర్భ మధ్యముననే ఉండడం జరుగుతుంది. నాల్గవ నెలలోనే కాళ్ళు చేతులకు వ్రేళ్ళు, గోళ్ళు కూడా పుడతాయి.

ఐదవ మాసమున తెలివి కలుగుతుంది. రక్తమాంసముల పుష్టి కలుగుతుంది. ఆరవ మాసమున ఎముకలు, నరాలు, వెంట్రుకలు విస్తరిస్తాయి. ఏడవ మాసమున దేహమునకు రంగు ఏర్పడుతుంది. ఎనిమిదవ నెలలో చర్మము, చలనము కలుగుతుంది. ఓజస్సు ఉద్భవిస్తుంది. తేజస్సు ప్రభవిస్తుంది. తొమ్మిదవ మాసమున బిడ్డను ప్రసవించడం జరుగుతుంది. గర్భవాసము నందు శిశువు అనుభవించు దుఃఖము రౌరవాది నరకముల కన్నను భయంకరముగా ఉంటుంది.

తల్లి గర్భము నుండి పెద్దగా రోదిస్తూ బహిర్గతమై బిడ్డ నేలపై వెల్లకిల పడడం జరుగుతుంది. అశక్తతతో మాంస పిండము వలె పడియున్న ఆ బిడ్డను కుక్క, పిల్లి మొదలగు మాంసాహారులైన జంతువులు ఈడ్చుకొని పోకుండా పెద్దలు కాపాడుతారు. పెరిగిన బిడ్డడు యౌవనవంతు డవుతాడు. ఇక అక్కడి నుండి ఆడటమేనా! పాడటమేనా! ఈలలేనా! గోలలేనా! ఆగడాలేనా! జగడాలేనా! ఓహ్....ఎన్నని? దయ్యం పట్టినట్లు గర్వంతో ఊగిపోవడమే.

చెట్లు ఎక్కే వీరోచిత కార్యాలన్నీ ఇప్పుడే. శాంతిగా జీవించేవారిని అశాంతికి గురి చేసేది ఈ దశలోనే. ఎముకలు, మాంసము, నాడులు గల స్త్రీ మర్మాదులపై మోహము జనించేది ఈ దశలోనే. తనను మోహానికి గురిచేసే అందమైన ఆ స్త్రీ శరీరము చనిపోయిన అయిదు రోజుల తరువాత ఎలా ఉంటుందో ఆ వయస్సులో ఊహించలేడు.

యౌవనము గతించగనే వృద్ధాప్యము ప్రవేశిస్తుంది. అదొక అమర్యాదకరమైన దశ. అయోమయ దశ. ఉదరమంతయూ శ్లేష్మముతో నిండి ఉంటుంది. ఇంటిలో అందరి పక్షాన రోజంతా ఒక్కడే దగ్గుతూ ఉంటాడు. తినాలని ఉంటుంది. తింటే వంట పట్టదు. జీర్ణం కాదు.

పదవులు పోగానే పరివారము దూరమగునట్లు, వృద్ధాప్యములో దంతాలు కదలడం, ఊడడం ప్రారంభిస్తాయి. మరీ అప్పగించి చూస్తే గాని దగ్గరున్నవాడు కూడా కనిపించడు. వాతము అధికమై నడుము తనంతట తానే వంగిపోతుంది.

ముసలితనంలో స్వజనులు దూరంగా పోతూ ఉంటారు. అది చూచి సానుభూతితో రోగాలు దగ్గరౌతుంటాయి. పిల్లలచే కూడా అపహాస్యం చేయబడుతాడు. ఇలా రోజురోజుకి కదలికను కోల్పోయిన కాయము ఒకనాడు కాటికి చేర్చబడుతుంది.

మరణ కాలము దుర్భరమై ఉంటుంది. ప్రాణాది వాయువులు స్తంభించిపోతూ ఉంటాయి. హస్త పాదముల కీళ్ళు ఊడిపోతూ ఉంటాయి. ఎదురుగా బంధువులు కనిపిస్తున్నా, మాట్లాడే శక్తి రానందున కేవలం చూపుతోనే తృప్తి చెందుతాడు. ఒకవైపు యముడు కాలపాశముచే లాగుతూ ఉంటాడు. మరొక వైపు ప్రేమపాశంతో స్వజనులు ఈడుస్తూ ఉంటారు.

శ్వాసలు ఆడవు. ఎక్కిళ్ళు నడవడం ప్రారంభిస్తాయి. గాలిలో దీపము కొట్టుకొనునట్లు భయంకరంగా ఆంతర్యంలో పెనుగులాడుతూ ప్రాణాలు వదలిపెడతాడు.

ఇక ఆ దేహాన్ని క్షణము ఉంచరు. కాటిలో కట్టెల మధ్య ఉంచి దారుణంగా కాల్చేస్తారు. ఒకవేళ పూడ్చి పెడితే, కాకులు, గ్రద్దలు, కుక్కలు దానిని పొడిచి పొడిచి, కొరికి కొరికి, నమిలి నమిలి, చప్పరించి మ్రింగేస్తాయి. ఇక ఆ దేహము మళ్ళీ భవిష్యత్తులో కనిపించదు.

అందరూ తోడుగా ఉన్నట్లే ఉంటారు. కాని, జీవుడు ఎప్పుడూ ఒంటరివాడే. ఒక్కడే వచ్చి ఒక్కడుగా వెళ్ళేవాడే.



మనసు - మనుగడ

పరిస్థితులపై మనిషి ప్రభావం ప్రత్యక్షంగా ఉండదు. తన ఆలోచనలపై ముందుగా పట్టు సాధిస్తే, ఆ తరువాత పరోక్షంగా దాని ప్రభావం పరిస్థితులపై పడుతుంది.

మంచి ఆలోచనలు, మంచి పనులు చెడు ఫలితాల నివ్వవు. చెడు సంకల్పాలు, చెడుపనులు సత్ఫలితాల నివ్వలేవు. ఈ ధర్మరూప సత్యాన్ని పరిస్థితుల మధ్య చాలామంది చూస్తూ వుంటారు. కాని, మనోస్థాయిలో వీటి ఫలితాలెలా ఉంటాయో కొందరే చూడగలుగుతారు.

దుఃఖాన్ని దూరం చేసుకోవాలని ఆశించేవా రెవరైనా సరే, దుఃఖమనేది పరిస్థితుల పుత్రిక కాదని, సంకల్పాల ముద్దుబిడ్డనే సత్యాన్ని ముందుగా గుర్తించాలి.

బాధపడటం ఎవరికీ ఇష్టముండదు. కనుక బాధపెట్టే ఆలోచనల్ని ఇష్టపడి ఏ మనిషీ చేయడు. కాని, అలవాట్లు మనిషి చేత ఇష్టం లేని పనిని చేయిస్తాయి. నేడు మనిషిపై పూర్తి పట్టును సాధించియున్న అలవాట్లు ఒకనాడు మొగ్గ తొడిగిన ఆలోచనలే.

ఒక మంచి వాతావరణంలో పెరగటం, సంస్కారవంతులైన పెద్దల పంచన బుద్ధిగ బ్రతకటం, సజ్జనులైన వారితో సహచర్యం కలిగియుండటం లాంటివి బాల్యంలో లభించ గలిగితే, అలాంటివారి బ్రతుకంతా శ్రీరామరక్షగా ఉంటుంది.

దురదృష్టం వెంటాడి బాల్యంలో చెడు సంస్కారాలు అలవడితే, అవి బ్రతుకులో ప్రతిక్షణము క్రూర మృగాల్లాగ వెంటాడి శాంతిని భగ్నం చేస్తూ ఉంటాయి. చేయకూడని పనులను చేయిస్తూ ఉంటాయి. చేయవలసిన పనులను ఆపుతూ ఉంటాయి. వీటి ఫలితంగా అశాంతి పవనాలు మనస్సును ఊపుతూ ఉంటాయి.

ఈ వాస్తవాలను మనస్సుకు పట్టిస్తే, అలవాటు లేకపోయినా మంచి ఆలోచన చేసేందుకు మనస్సు ప్రయత్నిస్తుంది. ఇది చిన్న పరిణామం కాదు. జీవితంలో ఇదొక గొప్ప మార్పు. ఒక్క మంచి ఆలోచన అలజడి బ్రతుకుల్లో శాంతిని, ఊరటను, ఓదార్పును మహిమాన్వితంగా ప్రవేశపెడుతుంది. పవిత్రమైన ఒక్క ఆలోచన వ్యక్తి హృదయాన్ని ఆనంద సాగరంగా మార్చుతుంది. ఇది మండుటెండలో పయనించే బాటసారికి చల్లని నీడనిచ్చే చెట్టులాంటిది. తుఫాన్‌లో చిక్కుకు పోయిన వ్యక్తికి అండ నిచ్చే కొండ శిఖరం వంటిది.

మూన్నాళ్ళ జీవితంలో గుండెలు కుంచుకపోయే ఆలోచనలు సాగించటం, పనులు చేయటం శ్రేయస్కరం కాదు. ఇలాంటివాటి వల్ల జీవితం వసంతం పోసుకుంటుందని వివేకవంతులు ఎప్పుడూ భావించరు. ఆదిలోనే జాగ్రత్తపడితే బాధలులేని బ్రతుకును సాగించవచ్చు.

దుష్ఫలితా లొస్తాయనే విషయాన్ని జ్ఞానపూరితంగా గ్రహించగలిగితే ఏ మనిషీ దుష్టకర్మల్ని చేయడు. దుష్టకర్మలకు పునాదులైన దుష్ట సంకల్పాలను కదిలించడు. ఏది ఏమైనా, జరిగింది జరిగిపోయింది. జరగకూడనిదైతే ఎలా జరుగుతుంది? గాయం కావడం అసహజం కాదు. గాయాన్ని మాన్పుకొనే ప్రయత్నం చేయకపోవటం సహజమైతే మాత్రం పెద్ద ప్రమాదమే.

దండయాత్రలు ఏ దుండగులైనా చేయగలరు. తీర్థయాత్రలు పుణ్యాత్ములే చేస్తారు. పదవులు, ఆస్తులు పెంచుకొనేందుకు అధర్మ మార్గాల్లో చరించి, ఆవేదనలతో, అవమానాలతో కుమిలిపోవటం కన్నా, శాంతిని, సుఖాన్ని పొంది హాయిగా విశ్రమించేందుకు ధర్మమార్గంలో జీవించటమే మనిషికి ఏకైక కర్తవ్యము. ఆశల స్థానంలో అవసరాలు, స్వార్థం స్థానంలో అవగాహన చోటు చేసుకుంటే చాలు. హృదయంలో శాంతిని మాయం చేసేవి ఎన్ని ఉండి ఏం లాభం?

ఖరీదైన పడకను ధనంతో కొంటాము. నిద్రను దేనితో కొనగలం? పాడు సంపాదన, పాడైన ప్రవర్తన బ్రతుకులో ఆరాటాన్ని కల్పిస్తాయే గాని విరామాన్ని ప్రసాదించవు.

పొరపాట్లు అలవాట్ల ప్రతిరూపాలే కనుక సహజం. మొండి మనస్సుతో బిగుసుకు పోయి కాలంలో దుర్భర పరిస్థితులలో చిక్కిపోవటం కాకుండా, పొరపాట్లను మనసారా అంగీకరించి, జీవితాన్ని మలుపు త్రిప్పుకొనేందుకు విశాల హృదయంతో ఈ క్షణాన ప్రయత్నిస్తే, ప్రారంభిస్తే శాంతి సుఖాలు ఈ క్షణమే మన హృదయంలో తిష్ఠ వేస్తాయి. ఒక్కసారిగ ప్రపంచం రెండింతలు విశాలమైనట్లు అనిపిస్తుంది.

'సర్వేజనాః సుఖినో భవన్తు'

ఆద్యంతములున్న ఈ ప్రపంచంలో అసంతృప్తే అందరికీ ఆహారము. నిరాశే పానీయము. నిస్సహాయతే నిద్ర. ఆశలే స్వప్నాలు. చింతలే ఆభరణాలు. భయ శోకాదులే సంపాదనలు. వెగటు లేని వెలుగు వెతికినా కనిపించదు. ప్రతి విషయానికి ఏదో విధమైన వైరుధ్యము ఉంటుంది. ఎంతటి వాడైనా కొందరికి నచ్చకుండా ఉంటాడు. ఏ వస్తువైనా అందరికీ ఉపకరించదు. అందరికీ అనుకూలమైన చోటు ఎక్కడో ఇప్పటికి ఎవరికీ అంతుపట్టలేదు. అందరినీ సంతృప్తి పరచగలిగేది ఏదో దానికొరకే అందరూ ప్రయత్నిస్తున్నా, ఎవరూ కృతకృత్యులు కాలేకపోతున్నారు. అందుచేత,

దేవ! ప్రపన్నార్తి హర! ప్రసీద
ప్రసీద విశ్వేశ్వర! విశ్వవంద్య!
ప్రసీద గంగాధర! చంద్రమౌళే!
మాం త్రాహి సంసారభయా దనాథమ్ ॥

"దేవా! భక్త సంతాపహరా! విశ్వేశ్వరా! విశ్వనాథా! విశ్వవంద్యా! చంద్రశేఖరా! గంగాధరా! నన్ను రక్షించు. సంసార భయము నుండి అనాథుడనైన నన్ను కాపాడు" అని పరమాత్మను ప్రార్థించాలి.

గాలిలో దీపం

ఈ ప్రపంచంలో వాంఛలతో తృప్తిచెంది వెళ్ళినవారు లేరు. కోరికలు అందరినీ కుదిపేశాయే గాని కుదుట పరచలేదు. ఈ ప్రపంచము ఎవరి ఆస్తిగాను మిగలదు.

అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః

"దేహాలు శాశ్వతాలు కావు. ధనాదులు అశాశ్వతములు"

అయినా దేహాన్ని ఎలాగైనా నిలుపుకోవాలని, ధనాన్ని ఏవిధంగానైనా సంపాదించి కూడబెట్టాలని, తన సుఖానికి అవే హేతువులని మానవుడు భ్రాంతి చెందుతాడు. పేరుకుపోయేవన్నీ అదనపు భారాలే. పేరుకు పోయే వారందరూ ఆవేదనా రూపాలే. పేరుకుపోయినా (ధనం) పేరుకు పోయినా (కీర్తికాంక్ష) దుఃఖం తప్పదు. ఇదంతా ఆశా పిశాచముయొక్క క్రీడలేనని గుర్తించాలి.

ఆశా నిర్గుణ సస్యానాం ఫలితా శరదాపదాం
హిమం సంవిత్ సరోజానాం తమసాం దీర్ఘ యామినీ ॥

"వివేకాది సుగుణ పంటకు ఆశ పిడుగు వంటిది. ఆపదలనే పంటకు అనుకూలమైన శరత్కాలము. జ్ఞానము అనే కమలానికి మంచువంటిది. అజ్ఞానమునకు హేమంత రాత్రి".

క్షణభంగురమైన జీవితంలో ధనానికి, దేహానికి గొప్పతన మేముంది? లంకలో ఉన్న సంపదను మరొకచోట చూడగలమా? కాని, దానిని పాలించిన రావణాసురుడేడి? బలవంతంగా విడిపోయే ధన దేహాదుల్ని భ్రాంతిలో కౌగిలించుకుంటున్నాం. బ్రతుకును బాధలమయం చేసుకుంటున్నాం.

గువ్వకైనా వసించడానికి గూడు కావాలి. మనిషి మనుగడకు గృహం కావాలి. కాని, కోట్లాది ధనం వెచ్చించి చిన్నగ్రామ మంత భవనం కట్టుకున్నా ఇంకా ఏదో సరిపోలేదనే మనిషి భావిస్తున్నాడు. బాగున్న భవనాలను కూడా కొట్టి కొట్టి కడుతున్నాడు. ఈ భవనాల్లో ఎంతకాలం ఉంటాం? అని ఆలోచించలేక పోతున్నాడు. మానవదేహం ప్రాణంతో ఉన్నంత వరకు విలువైన భవనాలలో పవ్వళించినా ప్రాణం పోయిన తరువాత శ్మశానానికి చేరాల్సిందే. కట్టెల మధ్య భయంకరంగా కాలిపోవలసిందే. ఎలా?

దేహంలోని ఎముకలన్నీ, మోపు కట్టిన కట్టెల్లా కాలిపోతాయి. కేశములన్నీ ఎండుగడ్డిలాగా మండిపోతాయి. చర్మము పగిలి, చీకి మసై పోతుంది. కండలు కరిగి బూడిదై పోతాయి. చూస్తుండగనే కొండంత మనిషైనా కాలి బూడిద కుప్పలా మిగిలి పోతాడు. ఇది ఎవరికైనా తప్పదు. ఎందుకీ ధనాశ! ఎందుకీ దేహాభిమానం?

వాతాంతర్దీపక శిఖాలోలం జగతి జీవితమ్
తడిత్ స్ఫురణ సంకాశా పదార్థ శ్రీర్జగత్రయే ॥

"గాలిలోని దీపములాగా జీవితము చంచలమైనది. ముల్లోకముల యందలి వస్తువుల సౌందర్యము మెరుపు వంటిది".

మహిలో మనిషి మనుగడ ఎంతకాలమో చెప్పలేము. మనిషి ఉన్నంత వరకు భవనాలు, బంధువులు, భార్యాపుత్రులు, సంపదలు, పదవులు, పేరుప్రఖ్యాతులు అన్నీ ఉన్నట్లే ఉంటాయి. సరుకులు తెచ్చే నౌక సముద్రంలో మునిగిపోగానే ఆ నౌకలోనివి కూడా మునిగి పోయినట్లు, మనిషి జీవితం సమాప్తం కాగానే అంతా పోయినట్లే. ఈలోగా పడిన ఆవేదనకు మూల్యమేమిటి? అశాంతి. అశాంతి. అశాంతి. క్షణికమైనవి అంతకన్న ఏమి ఇవ్వగలవు? అశాశ్వతాలు శాశ్వత శాంతిని పంచుతాయా? క్షణికాలు స్థిరత్వాన్ని అందిస్తాయా? ఏముంది ఈ ప్రపంచంలో? అంతా క్షణికమే

ఆపదః క్షణమాయాంతి క్షణమాయాంతి సంపదః
క్షణం జన్మ క్షణం మృత్యుః మునే కిమివ న క్షణమ్ ॥

"మహర్షీ! క్షణంలో ఆపదలొచ్చి పడుతున్నాయి. క్షణంలో సంపదలొస్తున్నాయి. క్షణంలో జన్మ వస్తూ ఉంది. క్షణంలో మృత్యువు మ్రింగేస్తుంది. ఇక, ఇక్కడ క్షణికం కాని దేముంది? అని శ్రీరాముడు యోగవాసిష్ఠంలో ప్రశ్నించాడు. కనుకనే దేహాభిమానము, ధనాభిమానము దౌర్బల్యాలని గ్రహించాలి.

ప్రపంచ మొక క్రీడారంగము. జీవులందరు క్రీడాకారులే. సదా మనతో కలిసి క్రీడించువారు బంధుమిత్రాదులే. సంసారమే క్రీడాస్థలము. ఆటలన్నీ నీటి మూటలే.

ఆటలో ఎందరో కలుస్తారు. ఎందరో విడిపోతుంటారు. ఇచ్చట గెలుపు ఓటమిలు మనో కల్పితాలు. కొలిమి నుండి వెలువడే నిప్పు రవ్వలవలె క్షణంలో ఆరిపోతాయి. ఇదొక మోహ వలయం. మాయా నిలయం. ఈ సత్యాన్ని గ్రహించలేని జీవులు ఆశా అంబారీలో ఊరేగుతూ ఆవేదనా జ్వాలలకు ఆహుతియై కష్టాల కుంపటిలో కాలిపోతున్నారు.

ఈ బంధాలన్ని ఒకనాడు విడిపోయేవియే. నిజమైన అందము, ఆనందము బ్రతుకులో వెల్లివిరియాలంటే అచ్యుతుడైన శ్రీకృష్ణుని ఆశ్రయించుట ఒక్కటియే మార్గము.

బాధలు - బోధలు

మనలో ప్రతి క్షణము సాగే గుండె చప్పుడులో గుట్టు చప్పుడు కాకుండా పరమాత్మ కొనసాగుతూనే యున్నాడు. అనుక్షణము మన నుండి కదిలే ప్రతి సంకల్పములో భగవంతుడు సాక్షిగా ప్రకాశిస్తూనే యున్నాడు. అందుతున్న ప్రతి కర్మఫలంలో అందంగా దాత రూపంలో దర్శన మిస్తున్నాడు.

అయినా,

అనంతుడైన ఆ మహితాత్ముడు సదా మనకు అపరిచితుడే.

అందీ అందని అందమే.

పొందీ పొందని ఆనందమే.

మనలో ప్రేమ ఉంది.

పరమాత్మలో అదే ఉంది.

మన ప్రేమ ప్రేమించేందుకుంది. పరమాత్మ ప్రేమ ప్రేమగా ప్రకాశించేందుకుంది.

మన ప్రేమలో అవసరమైతే అధర్మం ఒదిగిపోతుంది.

పరమాత్మ ప్రేమలో అధర్మం ఇమడలేదు.

అందుకే నేమో,

దయామయుడైనా, అనంత సహనంతో మన బాధల్ని చూస్తున్నాడు.

శవంగా పవ్వళించినపుడు కూడా దీప రూపంలో తల దగ్గరే ఉన్నాడు.

తనకు దూరంగా మనం తలదాచుకోలే మంటున్నాడు.

మన కర్మ ఫలాలలో ధర్మం ఉంది.

ధర్మమేదో కాదు.

పరమాత్మ దేహం.

అందుకనే,

దారి తప్పని దాత దారి తప్పిన మన రాతను చూస్తూ ఉన్నాడు.

ఇవన్నీ మనకు వైఫల్యాలు.

తనకేమో అవి వైఖరులు.

పూర్ణత్వం వైపు మలుపు తిరిగే సూచికలు.

ఆనంద ధామానికి సాగిపోయే మార్గాలు.

వీటిని వెతలుగా మనం భావిస్తున్నాం. అనుభవిస్తున్నాం.

తానేమో,

వాటిని వెతలుగా గాక

వెలుగు బాటను చూపే దీపికలుగా దర్శిస్తున్నాడు.

వెలుగును దర్శించే రాస్తాలో వెతలే నేస్తా లంటున్నాడు.

కళ్ళల్లో పూర్ణకాంతులు నిలిచేది కష్టాలలోనే నట.

జ్ఞాన కమలాలు విరబూసేది కన్నీళ్ళలోనే నట.

యెదలు శాంతిలో పవ్వళించేది బాధలలోనే నట.

అవును.

బాధల్లో మన ప్రక్కన ఉంటున్నది భగవంతుడే.

అలా ఉండేది మన బాధల్ని తొలగించేందుకు కాదు.

ఆ బాధల వేడి గాలుల మధ్య చల్లని బోధను అందించేందుకు.

అవగాహనను పెంచేందుకు. ఆవేదనలు అధ్యాసయేనని అర్థమయ్యేలా చేసేందుకు.

లేనిది లేనట్లు తెలియటం లేమి కాదు; వాస్తవానికి అది కలిమి.

ఉన్నది ఉన్నట్లు తెలియకపోవటమే లేమి. కలిమిలో కదిలేవాడే లేమికి ఆధారంగా ఉన్నాడు.

ఇది తెలిస్తే,

లేమి కూడా కలిమే. కాని, కలిమి లేమి కాదు.

మిథ్య కూడా బ్రహ్మమే. కాని, బ్రహ్మము మిథ్య కాదు.

నాస్తి విద్యా సమం చక్షుః నాస్తి సత్య సమం సుఖమ్
నాస్తి రాగ సమం దుఃఖం నాస్తి త్యాగ సమం సుఖమ్ ॥

"జ్ఞానంతో సమానంగా చూచే కళ్ళు లేవు. సత్యంతో సరితూగే సుఖం లేదు. సంగత్వానికి సరిపడే దుఃఖము లేదు. త్యాగానికి సమమైన సుఖం లేదు".

ఇది జ్ఞానం. ఆనందం. ఆర్షధర్మం అందించే అమృతానందం.

సుఖాన్ని పొందే ప్రయత్నాలు ఇక ఆపుదాం.

సుఖరూపులై ఉంటాం.

లోచూపు

తల్లి నుండి మనం ఆవిర్భవించాము కనుక తల్లిని ప్రేమిస్తాము. జన్మనిచ్చింది తండ్రి కనుక తండ్రిని ప్రేమిస్తాము. దేహానికి సంబంధించిన వారు కావటం చేత బంధువుల్ని ప్రేమిస్తాము. మనస్సుకు అనుకూలురు కనుక స్నేహితుల్ని ప్రేమిస్తాము. జీవనయాత్రలో సహచరులైన సహోద్యోగులు మొదలైన వారి నందరిని ప్రేమిస్తాము. జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు కనుక గురువును ప్రేమిస్తాము.

సంబంధాలలో ప్రేమ జనిస్తుంది. ఆ తరువాత పెరుగుతుంది. కాని, ఏ సంబంధం లేకుండా సాగే ప్రేమలో అనురక్తి ఏమిటో, ఆసక్తి దేనికో అర్థం చేసుకోవాలి.

నవ్వే పువ్వుల్ని ఎందుకు ప్రేమిస్తాము? పువ్వుల్లా నవ్వే పిల్లల్ని ఎందుకు ప్రేమిస్తాము? ఎగిరే గువ్వలు, పారే నదులు, పొంగే సాగరం, పండ్లభారంతో వంగిన వృక్షాలు, ఆడే నెమలి, పాడే కోకిల - ఇవన్నీ మన హృదయాలను దోచేసుకుంటాయి. ఈ విధమైన ప్రేమల వెనుక ఏ సంబంధ ముంది? ఉంది.

ఏ సంబంధం లేకపోతే ప్రేమ ఎలా సాగుతుంది? నవ్వులు మనకున్నాయి. పొంగే మనస్సు మనకుంది. ఆటలు మనకి క్రొత్తవి కావు. పాటలు మనకు పాతవే. నడకలు, పరుగులు, ఎగుర్లు, దుముకుళ్ళు మనకు తెలియనివి కావు. ఇవన్నీ మనో పరిధిలో అనుభవ చలనాలు.

కానీ, నవ్వులు, నవ్వుల కారణాలు భిన్నంగా ఉన్నా, ఆ నవ్వుల వెనుక నవ్వించే శక్తి ఏదో ఉంది. అందరి మాటలు ఒక విధంగా లేకున్నా, మాట్లాడించే శక్తి అందరిలో ఒక్కటే. చూపులు వేరైనా, చూచే శక్తి అందరిలో ఒక్కటే. ఆలోచనలు మనిషికి మనిషికి వేరుగా తెలుస్తున్నా, ఆలోచనలకు ఆధారమైన శక్తి అందరిలోను ఒక్కటే. అందరిలో భాసించే ఒకే శక్తి తనను తాను ఆకర్షించుకొంటోంది.

ఒకరి శక్తి మరొకరి శక్తిని, ఒకరి జ్ఞానం మరొకరి జ్ఞానాన్ని ఆకర్షిస్తోంది. ఇదొక గొప్ప ఆకర్షణ. ప్రేమ. దివ్యమైన ప్రేమ. విచిత్రమైన సంబంధము. మనకు తెలిసిన సంబంధముల వంటి సంబంధము కాదిది. ఇదేదో అర్థంగాని సంబంధం. పరమార్థానికి సంబంధించిన సంబంధం.

అన్యములైన సంబంధాలలో ప్రేమ పెరిగితే పెరగవచ్చు; కాని తరగదని చెప్పలేము. అరగదని చెప్పలేము. పారమార్థిక ప్రేమ తరిగేది కాదు; అరిగేది కాదు. అది ఇరువురి మధ్య ఆగే ప్రేమ కాదు; ఇరువురిలోని ఒకే చైతన్యములో సాగే దివ్య ప్రేమ. ఒకే చెట్టులో పక్వమైన ఫలాలలోని రసం లాంటిది. ఒకే నదిలో వేర్వేరు రేవులలో లభించే జలం వంటిది.

మనిషి ఎప్పుడూ నవ్వలేడు. కాని, నవ్వగలిగే శక్తిని ఎప్పుడూ కలిగియున్నాడు. మౌనంగా ఉన్నంత మాత్రాన మాటలు రావని కాదు. మన నుండి కదిలే ఆలోచనల వెనుక, మన నుండి సాగే మాటల నడుమ, మనకు తెలిసే విషయాల మధ్య మౌనంగా, మర్మంగా ఉన్న దెవరో తెలిస్తే, ఆ తరువాత ఒక అందమైన అలౌకిక వాతావరణాన్ని ఆంతర్యంలో అవలోకించటం జరుగుతుంది. ఆంతర్యంలోని అందాలే బాహ్యంలో ఆరబోసుకోవటం జరుగుతుంది. బాహ్యాభ్యంతరాలలో ఒకే అందం, ఒకే సౌందర్యం, ఒకే ఆనందం, ఒకే వీక్షణం దోబూచు లాడుతుంది. అదొక దివ్యానుభూతి. దివ్యమైన అద్వైతానుభూతి.

అది అనుభూతి మాత్రమే కాదు; అద్భుతం. స్వల్పాలను, అల్పాలను అన్వయం చేసే అద్వితీయం. పరిమితాలను పరిపూర్ణంగా దర్శింప చేసే అదృష్టము. ఆవేదనలను అంతం చేసే ఆనందము. అంధకారాన్ని అదృశ్యం చేసే దివ్యధామము. పరంధామము.

అందచందాలతో, స్వేచ్ఛానందాలతో ప్రకృతి పరవశించి నాట్యం చేస్తోంది. పరమాత్మ సృష్టిలో మకుటంలాంటి మానవా! దుఃఖించుట ఇకనైనా మానవా? స్వార్థపు సంకెళ్ళను ఇప్పుడైనా త్రెంచుకోవా?

దివ్యమైన ప్రేమను కదలనీ. గుండె గోడల్ని అంటుకొని ప్రాకనీ. సుగంధ పరిమళాలతో ప్రాకిపోనీ. కర్పూర జ్యోతిలా వెలిగిపోనీ.

అనుక్షణము తలుపు తడుతూనే వుంది పిలుపు. మగతను వీడు. కునుకును విడిపోనీ. నీవు విడి ఉండు. ప్రేమను వీడకుండా ఉండు. తెరలు తొలగిపోనీ. దొరలా నీవు వెలిగిపో.

వెను దిరిగి చూడకు. వెన్ను దిప్పి నడవకు. రాలేందుకున్నవి రాలిపోనీ. సాగేందుకున్నవి నడచిరానీ.

బాధలను తొలగించుకొనే ప్రయత్నంలో మిగిలేదంతా బాధే. బోధల నడుమ బాధలను మరపురానీ. మనసు వాటిని మరచిపోనీ. మార్చటం - మారటం రెండూ ఒక్కటే. మార్చటంలో ఏం జరుగుతుందో మారటంలో అదే మిగుల్తుంది. కాకపోతే, మార్చటం కష్టతరం. మారటం శ్రేయస్కరం. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి.

ఉద్ధరేదాత్మనాత్మానం

అని భగవంతుని మాట. అమృతమయమైన తియ్యని పాట.

మన్నును తేనెగా మార్చుకో

దేహానికి రోగాలు తప్పవు. మనసుకి ఆవేదనలు తప్పవు. శరీరము వ్యాధికి గురి అయినపుడు మనసు ఆందోళన చెందడమే కాక, ఏదీ ఆలోచించలేని అయోమయ స్థితిలో పడిపోతుంది. అలాగే మనసులో ఈర్ష్యాసూయలు, కామక్రోధాలు విజృంభించినపుడు వాటి ప్రభావం దేహం మీద పడి దేహము అనారోగ్యానికి గురి అవుతుంది.

దేహం అనారోగ్యంతో ఉంది. మనసు తట్టుకోలేక అల్లాడిపోతోంది. మనసు దేహంతో తాదాత్మ్యం చెందడమే ఈ దుఃఖానికి కారణము.

ప్రారబ్ధం రోగాల నిచ్చింది. పురుషార్థాన్ని ఉపయోగించి మనసును మేను నుండి మరల్చి మాధవునిలో ఉంచే ప్రయత్నం చేయాలి. అభ్యాసంలో అస్థిరత తొలగిపోతుంది.

మనసు మేను వైపు నడిస్తే మిగిలేది మన్నే. అదే మనసు మధుసూదనుని వైపు నడిస్తే దొరికేది మకరందమే. అమృతమే.

కష్టాలు రావచ్చు. అలాగని వాటినే మనసు మననం చేస్తూపోతే బ్రతుకే కష్టాల ఊబిలో దిగిపోతుంది. కష్టాలను చింతించే మనసును కృష్ణునిపైకి త్రిప్పితే మరుక్షణంలో మనసు శాంతినిలయ మవుతుంది.

దుఃఖాల్లో ఎవ్వరైనా ఏడవగలరు. దుఃఖాల వెనుక నిలిచియున్న సుఖాన్ని దర్శించి తృప్తి చెందడం భక్తులకే సాధ్యం. సాధకులకే లభ్యం. ఇదొక గొప్ప విద్య. సంస్కారానికి సంబంధించిన విద్య. సౌజన్యానికి సంబంధించిన విద్య. విషాన్ని అమృతంగా మార్చే విద్య. ద్వేషాన్ని ప్రేమగా మార్చే విద్య. అందుకే,

మధుమత్ పార్థివం రజః

"మన్నును మకరందంగా మార్చుకో" అన్నారు మహర్షులు.

ఏం జరుగుతుందో? ఏ ప్రమాదం ముంచు కొస్తుందో? ఎవరు దూరమవుతారో? రేపు ఎలా ఉంటుందో? ఈ భయం అంతా దేని నుండి వచ్చింది. ఆలోచన నుండే కదూ?

ఏది జరగాలో అది జరుగుతుంది. అంతా సవ్యంగానే ఉంటుంది. అన్నిటికీ ఈ ప్రపంచంలో అన్నిటితో సంబంధం ఉంది. దూరభారాలు లేనే లేవు. ఇప్పుడు భయముందా? ఈ అభయస్థితి దేని నుండి వచ్చింది? ఆలోచన నుండే కదూ?

ఆలోచనలో ఇంత శక్తి ఉందా? ఆ శక్తి ఎవరిది? అది ఎలా ఉంది? ఇదే నిజమైన అభయ స్థానము. ఆ స్థానము ఏదో కాదు. నీవే. నేనే. నీలోని నేనే. నాలోని నువ్వు. **త్వమేవాహం.**

ఏకాంతం

ఎందరున్నా, అందరున్నా, ఎవ్వరైనా నిజానికి ఎవరికి వారే.

అందరూ ఏకాకులే. అందరిదీ ఏకాంతమే.

ఏకాకులైనా, ఏ కాకులైనా చికాకులు తప్పడం లేదు. ఛిద్రాలు తొలగడం లేదు. క్షుద్రాలు కరగడం లేదు. భద్రాలు వెలగడం లేదు.

ఈ ప్రపంచంలో ఎవడైనా బాటసారే.

ఈ జగతి ఎవరికైనా ఎండమావే.

ఆశలన్నీ అడియాసలే. విలాసాలన్నీ విషాదాలే.

యమునాతీరం ఎక్కడో తెలియదు. ఎవరికి వారే ఇక్కడ అని అందరికి తెలుసు. చిల్లి కుండలో ఎంత నీరు పోసి ఏమి లాభం? చెల్లిపోయే బంధాలను ఎంతగా పురిపెట్టినా ఏమి ప్రయోజనం? మళ్ళీ మళ్ళీ నింపడంకన్నా చిల్లి ఎక్కడుందో వెతుకు. నీళ్ళు కారిపోకుండా చూసుకో.

ఇది గాలిబ్రతుకు

వీచే గాలి మేఘాన్ని దూరంగా తరలిస్తుంది. పీల్చేగాలి ఒకనాడు ప్రాణాన్ని బహుదూరానికి తరిమేస్తుంది.

శ్వాసలను మనం అరగదీస్తుంటే, ప్రాణాలు మనలో కరిగిపోతున్నాయి. దానితో పాటు మనసు మరిగిపోతోంది. బ్రతుకు తరిగిపోతోంది. శ్వాసలు అమృతాలు కావాలి. ప్రతి శ్వాసకు మనం ప్రాణం పోయాలి. మన ప్రాణనాథుడైన శ్రీకృష్ణదేవుని నామస్మరణతో శ్వాసలు అమృతమయ మవుతాయి. బ్రతుకు పారిపోతే పోనీ. భగవంతుడు జారిపోకుండా చూసుకోవాలి.

సమస్తం అస్తమయం

ఉదయాస్తమయాలు సూర్యచంద్రులకే తప్పడం లేదు.

ఉదయించిన మనం అస్తమించకుండా ఉండగలమా?

దీపం వెలుగుతూ ఉంటే తైలం తరుగుతూ ఉంటుంది. దీపశిఖ ఒరుగుతూ ఉంటుంది. తరిగిపోయే తైలం ఒక దశలో దీపాన్నే చీకటిలోకి తోసేస్తుంది. తరిగే కొద్దీ తైలాన్ని నింపుకుంటూ పోతే దీపం ఆరదు. చీకటి చేరదు.

ఆలోచనలు, యోచనలు, అలజడులు అంతరంగ పవనాలై ప్రాణదీపాన్ని అల్లల్లాడిస్తాయి. కొడిగట్టిస్తాయి. కాడిగట్టినట్లు ఆడి ఆడి బ్రతుకుబండిని వల్లకాటికి ఈడుస్తాయి. ఆలోచనల్ని అమృతమయం చేసుకోవాలి. యోచనలన్నీ అర్చనలు కావాలి. అలజడులు అదృశ్యమై ఆరాధనలు శోభించాలి.

ఇదం మాయామయం

దేహాలు శ్మశాన దిక్కుగా పయనిస్తున్నా సందేహాలు మనసుకు దూరం కావడం లేదు. మనసొక మాయానర్తకి. మనో నర్తకి నృత్యభంగిమల ప్రదర్శనలో కదలాడే ఛాయలే సందేహాలు, సంశయాలు, సంకల్పాల సంతర్పణలు.

ఈ ప్రపంచంలో మనం బ్రతుకుతున్నాం. ఇక్కడ అంతా మనది కాదు. అంతా మనకు లేదు.

ఇక్కడ మనకు నచ్చేది సగం. నచ్చనిది సగం.

నచ్చేది రాగం. నచ్చనిది ద్వేషం.

రాగమున్న చోటికి పరుగులు తీస్తాం.

ద్వేషమున్న చోటు నుండి దౌడు తీస్తాం.

రాగద్వేషాలను విడిచిపెడితే పరుగులు తీయ నవసరం లేదు. ఎక్కడ కాలు పెట్టినా క్రింద పరుపులే ఉంటాయి. ప్రపంచం నేడున్న దానికన్నా నాలుగురెట్లు విశాలమవుతుంది. **(త్రిపాదస్యామృతం దివిః).**

నిరాశాగాలులు

ఏవో లేవని దుఃఖిస్తాం. అవి మనకు అవసరాలు కావని, కనుకనే అవి అందడం లేదని గుర్తించం.

ఆశల చిగుళ్ళు తొడిగించుకుంటూ ఉంటే దుఃఖఫలాలు రాకుండా ఉంటాయా?

ఇదంతా పరమాత్మ కృప.

అందవలసిందంతా నీకు అందింది. అందుతూ ఉంది. అందబోతోంది.

ఇక్కడ మినహాయింపు లుండవు. స్వార్థసొంపులు ఉండలేవు.

అందిన దానిని అర్థం చేసుకోలేక అసహ్యించుకొంటూ,

అందనిదానికి అనూహ్యంగా అర్రులు చాస్తూపోతే,

బ్రతుకంతా నిరాశే నిలిచిపోతుంది.

సమజీవనమే సమాచారం

మాటే రానపుడు పాట ఎలా వస్తుంది? ఆచారమే లేనపుడు ప్రచారమెలా సాగుతుంది?

"బుద్ధి" మొగుడికి "మనసు" పెంకిపెళ్ళాం.

ఒకరు చెప్పింది మరొకరు చేయనని బిగుసుకుంటే ఇక అక్కడ మిగిలేది దాంపత్యం కాదు. దహనం.

మనం చేసే ప్రతికర్మ ప్రేమకు వ్యక్త స్వరూపం కావాలి.

జ్ఞానానికి ప్రతిరూపంగా మిగలాలి.

ఇంతవరకు ఈ ప్రపంచంలో ఎవరు ఏది సాధించినా ప్రేమతోనే సాధించారు.

పరమాత్మ మనల్ని సేవకులుగా సృష్టించలేదు.

మనమే ఆ మహితాత్ముని మన ప్రభువుగా ఎన్నుకున్నాం.

అన్ని రూపాలు ఆయనవే. అన్ని కర్మలు ఆయన కొరకే. ఏది చూచినా, ఏది విన్నా, ఏది తిన్నా, ఏది ఆఘ్రాణించినా, ఏది స్పృశించినా ఆ పరమాత్మ అవ్యక్త చైతన్యమే మనకు స్ఫురించాలి.

"నేను" పడిపోతే, "తాను" మిగులుతుంది. వెలుగుతుంది.

ఇదే కర్మయోగం.... కర్మలలో యోగం. చక్కని ఆచారం. ఆచార్యులందించిన సమాచారం. సమజీవన సదాచారం.

విశాలమైన ప్రదేశంలోనే వాసుదేవుడు క్రీడిస్తాడు. మన యెదలను విశాలంగా మార్చుకొన్నప్పుడే ఆయన పాదాలు మనలో సుందరంగా కదుల్తాయి.

అదే నీవు

జేబులో పెద్దమొత్తాన్ని పెట్టుకొని నిద్రించినవాడు స్వప్నంలో బిచ్చమెత్తుకొంటున్నాడు. ఆకలితో అలమటిస్తున్నాడు. మరి, అతడు సుఖించేదెలా? దీనికి మార్గమేమిటి? మేలుకోవడమే. మేలు తెలిసేది అక్కడే.

ఏకాకృతిలో వెలిగేవాడు ఏకాంతరాముడు.

అతడు ఒంటరివాడు. కనుక అతని వద్దకు మనదీ ఒంటరి ప్రయాణమే.

ఏది వెలిగినా, దాని వెనుక వెలుతురు తానే. ఇది "అరచేతిలో అమలకం" లాంటి సత్యము. అందరికీ అవగతం కావలసిన నిత్య సత్యము.

"ఇది నా అరచేయి" అనుకొంటూ, "ప్రభాతే కరదర్శనం" అని పలుకుతూ ఉదయాన్నే అరచేతిని దర్శించుకుంటాం.

అరచేతిని చూస్తున్నపుడే, ఆ చేతిని మనకు చూపే వెలుతురు కూడా అక్కడ ఉంది అనే సత్యాన్ని మరువలేము. వెలుగు లేకుంటే చేయిని చూడగలమా?

కానీ, కాంతి చేతిని చూపెడుతున్న సమయంలో చేతిని క్రిందికి దించేశామనుకోండి. అప్పుడు కాంతి కూడా దూరమౌతుందా? ఆలోచించండి.

వెలుగు ఎప్పుడూ ఉంది. వెలిగించబడింది దూరమైనంత మాత్రాన వెలుగు దూరం కాలేదు. ఆ వెలుగే నీవు.

వెలిగేవి - వెలుగు

వెలిగే వాటికి వెలుగుకు తేడా ఏమిటో నీకు అర్థం కావాలి. అంతవరకు బ్రతుకులో వెలుగు రూపంలో చీకటే మిగులుతుంది.

ఈ రెండిటి మధ్య తేడాను గుర్తింపచేసేవే నిజమైన బోధలు. బోధలు చేసే పనినే బాధలు కూడా చేస్తాయి. బాధ ఏదో కాదు. బ్రతుకును భవ్యంగా మార్చుకోమని పరమాత్మ పంపిన బోధయే బాధ.

వెలిగే వాటిని విస్మరిస్తే నీవే వెలుగై నిలుస్తావు.

అది జాగ్రదవస్థ నుండి నిద్రలోకి పారలడం వంటిది.

జడం నుండి చైతన్యానికి ప్రాకడం లాంటిది.

నేత్రాలు మూసి పడుకున్న నిన్ను నిద్ర తన ఒడిలోకి తీసుకొనునట్లు, అంతర్ముఖుడవై ధ్యానంలో నిలిచిన నిన్ను పరమాత్మ తనలోకి తీసుకుంటాడు.

ఆచార్యుని ఆదర్శం

చెప్పింది అర్థం కానపుడు చేసి చూపడమే సముచితం.

గురువులు చేసి చూడమంటారు. అలా కానపుడు, చేసి చూపిస్తారు.

అలా చేయడానికి

వారు చరించ నవసరంలేదు. చలించ నవసరం లేదు (చరిస్తే తప్పుకాదు).

సూర్యుడు, చంద్రుడు, తారకలు మన జీవనానికి ఎంతో ఉపకరిస్తున్నాయి. ఉన్నచోటనే ఉండి మన ఉనికికి ఉపకరించడమే వాటి ఔన్నత్యం.

ఊడిగం చేయడం లోని వైభవం ఉనికిలోనే ఉంది.

ఏమీ చేయకపోయినా అంతా చేయడమే అవుతోంది. లేకుంటే

ఆత్మ సంస్థం మనః కృత్వా న కించి దపి చిన్తయేత్

"మనస్సును ఆత్మయందు నిలిపి ఏ కొంచెమైనను చేయకుండా ఉండిపో" అని గీతాచార్యుడు ఎందుకు చెబుతాడు?

అలా వెలిగిన అమర దీపాలే మహర్షులు, గురువులు.

ఇదిగో రామకృష్ణజ్యోతి. అదిగో రమణ పరంజ్యోతి.

అన్నీ శంకర దీపాలే. శివశంకరి రూపాలే.

మరి నేను

మాధవ చైతన్యంలో మధుమాసాన్ని.

సుందర చైతన్యంగా సహవాసాన్ని.

ఇది నిజం. ఇదే నా నైజం.

నాదొక వినూత్నమైన సందడి.

నాదొక విచిత్రమైన అంగడి.

కృతజ్ఞతతో మీరు స్పందిస్తున్నారు. ప్రతిస్పందించలేని అశక్తతలో నేను సాక్షినై వీక్షిస్తున్నాను.

"సంతకెళ్ళాలి. పూలు అమ్ముకోవాలి. ధనం గడించాలి. ఆకలి తీర్చుకోవాలి" అని ఒక తోటమాలి పూలబుట్టను తలపై పెట్టుకొని ఒక వీధి గుండా వెళ్తూ వుంటే, ఆ వీధిలోని వారికి పూలవాసన రావచ్చు. సంతసించిన ఆ జనం "థ్యాంక్స్" అని స్పందిస్తే, తోటమాలి ఎలా ప్రతిస్పందించాలి?

"అయ్యా! పువ్వులను అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని నేను సంతకెళ్తున్నానే గాని మీకు సువాసనను అందించాలని నేను ప్రయత్నించ లేదు. నేను పోతూ ఉంటే, సౌరభాన్ని మీరు ఆఘ్రాణించారు. ఇక్కడ నా త్యాగమేమీ లేదు. నేను ప్రతిస్పందించలేకున్నాను" అంటాడు తోటమాలి.

నేనూ అదే అంటున్నాను. నా ముక్తి కొరకు నేను నడిచే దారుల్లో నాకు తోడైన మీకు నానుండి ఏవో దొరికి ఉండవచ్చు. అదంతా మీ కొరకు నేను చేసింది కాదు. నా కొరకు నేను చేసుకున్నదే. మీ కృతజ్ఞతలతో నా గమనాన్ని ఆపకండి. నన్ను సాగనివ్వండి; అని అంటున్నాను. మకరందాన్ని భృంగాలకు అందించాలని పద్మము విరబూయలేదు. కనుక తుమ్మెదలు "ఝు"మ్మని స్పందిస్తే పద్మము ప్రతిస్పందించదు. కమలము ప్రతిస్పందిస్తే, తుమ్మెదలతో కాదు. తన బంధువుతో. తన ఆప్తునితో.

కమల బాంధవునితో, కమలాప్తునితో.

"నీ కిరణ ప్రసార ప్రసాదమే నాకు ముక్తిని ప్రసాదించింది. నీవు తలుపు తీయబట్టే తుమ్మెదల తలపులు పండాయి" అని నింగిని చూసి వంగి నమస్కరిస్తుంది కమలం. దయాసాగరుడైన పరమాత్మ కృపావీక్షణ కిరణాలను తలచుకుంటూ, తలపోసుకుంటూ, తల నింపుకుంటూ, "తండ్రీ! తవదాసోహం" అని నేను ఐదు పది చేస్తున్నాను.

ఇది ఒంటరి వాని వద్దకు నా ఒంటరి ప్రయాణం.

రాళ్ళు విసిరిన వారిని విమర్శించే దుండదు.

పూలు చల్లేవారిని పరామర్శించే దుండదు.

నాలో నేను నన్ను చేరే ప్రయత్నంగాని ప్రయాణంలో అనంతునికి ప్రణామాలు.

నమస్తే సమస్త ప్రపంచ ప్రభోగ ప్రమాణ ప్రవీణ...... నమస్తే........

అయితే మీరు

మీరే నిర్ణయించుకోవాలి.

ప్రగతి లేకపోవడానికి మన ప్రవర్తనే ప్రతిబంధకమని గుర్తించాలి.

మీరు ఆర్ష సంస్కృతీ తరువులో పచ్చని ఆకులు.

ఆర్షవిద్యా మహోద్యమ శరీరంలో అవయవాలు.

అవయవాలు ఆరోగ్యంగా ఉంటేనే ఆకృతి నిలుస్తుంది.

దేహంలో గుండె ఉంది. కఫమూ ఉంది.

ఊపిరితిత్తు లున్నాయి. వాతమూ ఉంది.

మెదడు ఉంది. పిత్తమూ ఉంది.

మరి, మీరెలా ఉంటారు?

ఎలా ఉంటే మీరు మీరుగా ఉంటారో అలా ఉండండి.

మరోలా ఉంటే, క్షీణించేది ఆరోగ్యమే.

నేను నిరామయుణ్ణి నమ్ముకున్నవాణ్ణి. ఆరోగ్యాలు, అనారోగ్యాలు నా మార్గానికి ప్రతిబంధకాలు కావు.

ఏవైనా మీ ప్రగతికి సోపానాలు కావాలే కాని అడ్డుగోడలు కాకూడదు.

మీ స్వేచ్ఛకు నేను ఎన్నడూ అడ్డుగా లేను. అడ్డు కాను.

తెడ్డు వేసుకొంటూ నావను నడుపుకుపోయే నావికుణ్ణే కాని, ఎవరు ఎక్కుతున్నారు? ఎవరు దిగుతున్నారు? అని పట్టించుకొనే 'సంచారి'ని కాను.

ముందు చూపుతో బండిని నడుపుకుపోయే "డ్రైవర్నే" కాని జమా ఖర్చులు చూసుకొనే "కండక్టర్ని" కాను.

చెప్పదలచుకున్నది చెప్పేశాను.

చెప్పదగింది మాత్రమే ఇక చెప్తూ ఉంటాను.

చేయగలిగిందంతా చేసేశాను.

చేయదగింది మాత్రమే ఇక చేస్తూ ఉంటాను.

నాకు బదిలీ అయింది.

చేసే "పని" నుండి చూసే "స్థితి"కి.

ఇక ఉంటాను, ఏదైనా వింటాను.

వింటూ ఉంటాను

ఉంటూ వింటాను.

శుభమస్తు.

నిందాస్తుతులు

"నిందాస్తుతులు" నిజజీవితానికి నిత్యాభరణాలు. నింద తెలియని బ్రతుకులో అందం లేదు. కీర్తిగల వానికి స్తుతులు చుట్టాలే. నిజస్తుతి వాస్తవానికి వీనులకు విందే. కాని అసత్యపు పొగడ్తలు విందులుగా గోచరించినా అవి విషాలే.

వంచనకు అలవాటు పడిన వారు ఇతరులలో మంచిని చూడలేరు. మంచి చెడులు మనిషి మనస్సుకు తేలికగా దొరకవు. మంచివారిలో కొంత చెడు లేకపోలేదు. చెడ్డవారిలో కొంత మంచి ఉండకపోదు.

నీలో మంచిని అందరూ చూడలేరు. మంచివాడే మంచిని చూడగలడు. కొందరు మంచిని గ్రహించలేకపోయినా చెడును మాత్రం గ్రహించరు. మరికొందరు చెడును గ్రహించడమే జీవితధ్యేయంగా పెట్టుకొని ఉంటారు.

చెడ్డవారు చెడినవారే గనుక చెడుమాటలు, చెడు చేష్టలకే పరిమితులు. వారికి పెద్ద, చిన్న తారతమ్యము తెలియదు. పరులను బాధించడములో వారికి పరమాన్నం లభించినట్లు ఉంటుంది.

నీవు సాధకుడవు. నిందలను చూసి కృంగిపోకూడదు. వందనీయులను కూడా నిందలు వదలవు. గొర్రెలమందకు గౌరవ మేమిటో తెలియదు.

నీవు పెరుగుతున్నావంటే నీతో పాటు, నీ చుట్టూ నిందలు పెరుగుతూ ఉంటాయి. అది సహజం. వాటి మధ్య నీవు చెదిరిపోతేనే అసహజం. నిందలను సవాళ్ళుగా స్వీకరించాలి. నిన్ను పెంచేందుకే నిందలు నిలిచి ఉన్నాయి.

తన శిష్యుల సహాయంతో బుద్ధుడు ఒక స్త్రీని హత్యచేసినట్లు వదంతులు వ్యాప్తి చేశారు కొందరు నీచులు. చాలామంది వ్యతిరేకులు బుద్ధుని విమర్శించారు.

శిష్యుడైన ఆనందుడు బుద్ధుని సమీపించి, "మనం ఈ ఊరు వదలి మరొక ఊరికి వెళ్దాము" అన్నాడు.

"మరి ఆ ఊరిలో కూడా నిందిస్తే ఏం చేద్దాం?" అన్నాడు గౌతమబుద్ధుడు.

"ఇంకొక ఊరికి వెళ్దాం" అన్నాడు ఆనందుడు.

"ఆనందా! అయితే మనం ఉండేందుకు ఈ దేశంలో స్థలం దొరకదు. ఓర్పుతో జీవించు. ఈ నిందలు కాలంలో కరిగిపోతాయి" అంటాడు బుద్ధుడు.

ఈ ప్రపంచంలో దోషము లేనివారు ఉండరు. మన దోషాలు మనకు గోచరించవు. అందుచేత అవి అంతర్యంలో పటిష్ఠంగా స్థిరపడి ఉంటాయి. ఇతరులు మనల్ని దూషించి

నపుడు మనలోని దోషాలేవో మనకు తెలిసివస్తాయి. వెంటనే కాలికి అంటిన బురదను కడిగినట్లు దోషాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఒకవేళ నిర్దోషులైన మనల్ని ఇతరులు దూషిస్తే ఎలా? అనే శంక నీకు రావచ్చు. అప్పుడూ మంచిదే. లేని దోషాలను ఇతరులు మనకు చూపడం వల్ల ముమ్ముందు అవి రాకుండా మనం జాగ్రత్తపడే అవకాశం వారు కల్పించారు. కనుక వారు అభినందనీయులే.

క్షమను వృద్ధి చేసేందుకు క్షామం వస్తుంది. ఆపదలు అభివృద్ధికి పునాదులు. బాధలే బ్రతుకును తీర్చిదిద్దే బోధలు. ఈనాటి వెతలే ఓనాటి వెలుగుల తోరణాలు. ప్రతికూల పరిస్థితులను కూడా అవగాహనతో అనుకూలంగా మార్చుకొనువారే ధన్య జీవులు.

తాత్త్వికుడైన సోక్రటీస్ మహాశయుని భార్య గయ్యాళి. భర్తను తిట్టడము ఆమె నిత్యకృత్యాలలో ముఖ్య కార్యము. ఒకరోజు ఆమెకు ఆరోగ్యం బాగలేక భర్తను తిట్టడమనే కార్యక్రమాన్ని సాగించలేకపోయింది.

సోక్రటీస్ స్నేహితుల మధ్య ఉన్నాడు. సోక్రటీస్ విషాదముగా గోచరిస్తున్నందుకు కారణ మేమిటని స్నేహితులు ప్రశ్నించారు. అనారోగ్య కారణంగా తనను భార్య తిట్టలేదని, తన బాధకు కారణమదియేనని సోక్రటీస్ చెబుతాడు.

"దానికి సంతోషించక బాధపడతావెందుకు?" అన్నారు స్నేహితులు.

"ఆమె తిడుతూ ఉంటే నేను సహనాన్ని వృద్ధి చేసుకొనే అవకాశం కలుగుతూ ఉండేది. ఈరోజు నాకు ఆ భాగ్యం కలుగలేదు. అందుకే దుఃఖిస్తున్నాను" అంటాడు సోక్రటీస్.

ఇవే బ్రతుకులో ప్రతిబింబించదగిన నిత్యసత్యాలు. బాహ్యపరిస్థితులు ప్రతికూలమైనా వాటిని ఆంతర్యంలో అనుకూలంగా మలచుకోగలవారే బ్రతుకు విలువ తెలిసినవారు. వారే ప్రపంచంలో బలవంతులు.

మన అభివృద్ధికి ప్రతికూలాలు అవసరమని నా ఉద్దేశ్యం కాదు. ప్రతికూలాలను అవరోధాలుగా భావించక అనుకూలాలుగా మార్చుకోవాలి అనేదే సందేశం.

"పరిస్థితులు బలహీనుల్ని పరిపాలిస్తాయి. బలవంతులకు పనిముట్లుగా సహకరిస్తాయి." అంటాడు ఆలివర్ గోల్డ్‌స్మిత్.

అనడం-వినడం-విస్మరించడం గాకుండా బ్రతుకులో వాటిని కనడం మన ప్రధాన కర్తవ్యం కావాలి. ఇదే సాధన. రోదనను, వేదనను రూపుమాపే ఆరాధన.

ఇబ్బందులకు ఇతరులు కారణమా?

నేతి మిఠాయి తిన్నా నాలుకకు ఏ మాత్రం జిడ్డు అంటుకోదు. ముట్టుకోగానే జిడ్డు చేతిని పట్టుకుంటుంది.

శాంతి మిచ్ఛన్తి సాధవః. సత్పురుషులు శాంతిని కోరుతారు. విషయలోలురు తాము కోరుకున్నది జరిగితేనే శాంతిస్తారు. మొదటివారికి అశాంతి అర్థం కాదు. రెండవవారికి శాంతి అంతుపట్టదు.

అనుకున్నది ఉండాలి అని కాకుండా ఉన్నదానిని అనుకోవాలి అనే మనసుండే వారికి శాంతి దూరం గాదు. అశాంతి సమీపించదు.

"ఎంతో శ్రమించాను. ఎంతెంతో చేశాను. నన్నెవ్వరూ అర్థం చేసుకోరు" - ఈ వాక్యాలు చాలామంది నుండి వినిపిస్తూ ఉంటాయి. ఇలాంటి వారందరూ అశాంతిని ఆహ్వానించేవారే. ఈ విషయాన్ని సునిశితంగా విశ్లేషిద్దాం.

నీ వాక్యాన్ని మేము తప్పుపట్టడం లేదు. నిన్ను ఇతరులు అర్థం చేసుకోలేదని నీవు చెప్పినమాట నిజమే. కాని, వాళ్ళు 1. అసలు నిన్ను ఎందుకు అర్థం చేసుకోవాలి? నీవు బ్రహ్మ పదార్థమా? నిన్ను అర్థం చేసుకొని వాళ్ళేమి బావుకుంటారు? శోభనాధ్యాసలో గోచరించే వాటిలో నీవూ ఒక బొమ్మ. పగిలిపోయే మట్టిబొమ్మ. నిన్ను వాళ్ళెందుకు అర్థం చేసుకోవాలి? వాళ్ళకు ఉపయోగం లేదు కనుకనే నిన్ను వాళ్ళు అర్థం చేసుకోరు. ఒకవేళ "నాకు ఉపయుక్తం కనుక వారు నన్ను అర్థం చేసుకోవాలి" అంటావా? ముందు అది వాస్తవమో కాదో యోచించుకోవాలి.

2. నిన్ను ఇతరులు అర్థం చేసుకోవడం వల్ల నీకేమీ ఒరగదు. ఎదుటివారు నిన్ను అర్థం చేసుకున్నారా? లేదా? తెలుసుకోవడానికి నీ దగ్గర కొలతబద్ద ఏమిటి? నీకు, వారికి ఏవిధమైన మానసిక చుట్టరికమూ లేదు. నిన్ను ఆంతర్యంలో నచ్చకనే, బయటికి నచ్చినట్లు నటిస్తే నీకు అర్థమయ్యే దేముంటుంది?

3. ఒకవేళ బాహ్యాభ్యంతరాలలో ఒకే విధంగా ఉన్నారు అనుకున్నా, నీవు వారిని అర్థం చేసుకొనేలోగా ఎదుటివాడు మారడని నమ్మక మేమిటి? మార్పు అతనిలో జరిగినపుడు, నీ తీర్పుకు ఒరిగేదేమిటి? ఈనాడు ఒక వ్యక్తి నిన్ను అర్థం చేసుకోవడంవల్ల నీకు సుఖం కలిగేటట్లయితే, ఆ సుఖం నీకు సుఖంగా నిలుస్తుందా? ఆలోచించు. అతను మారినా, దూరమేగినా, మరణించినా నీ సుఖం కూడా గతిస్తుంది. ఇప్పుడు చెప్పు. ఇతరులు అర్థం చేసుకోలేదని వ్యథ చెందడం ఎంత సమంజసం?

4. అదలా ఉంచు. నిన్ను ఇతరులు అర్థం చేసుకోలేదని నీవు ఏదో అవుతున్నావు. ఎదను పగులగొట్టుకొంటున్నావు. ఇంతకీ, నీ మనస్సు నిన్ను అర్థం చేసుకుంటున్నదా? నీవు చెప్పినట్లు వింటూ ఉందా? అదే కనుక వినేటట్లయితే "ఇతరులు అర్థం

చేసుకోకపోయినా, మనసా! నీవు పాడుగాకు", అని నీవు చెబితే మనసు వినాలి. అదే జరిగితే ఇక సమస్యే లేదు. ఇతరులు నిన్ను అర్థం చేసుకోకపోతే, ఒకవేళ అది సమస్యగా పరిణమిస్తే ఎదుటివాడికి కావాలే గాని నీకు మాత్రము కాదు. ఎందుకో తెలుసా! నీ మనస్సు నిశ్చింతగా ఉంది కనుక.

5. నా మనసు నా మాట వినడం లేదు కనుకనే ఎదుటివాడు నన్ను అర్థం చేసుకోవాలని కోరుతున్నాను అంటావా? సరే. మంచిది. కాని ఒక్క విషయం. నీ మాట నీ మనసు వినదు. ఇతరుల మనస్సులు వాళ్ళ మాటల్ని విని విధేయతతో ఆచరణలో పెడుతున్నాయని తమ అభిప్రాయమా? నీ మాట నీ మనసు ఎలా వినదో, వాళ్ళ మనసులు కూడా వాళ్ళ మాటల్ని వినవు. పాపం! ఇప్పుడు వాళ్ళేం చేయాలి? నీ మాట వినాలని వారికున్నా వాళ్ళ మనసులు సహకరించనపుడు వాళ్ళేం చేస్తారు? నీలాగే వాళ్ళు కూడా నిస్సహాయంగానే ఉన్నారు.

6. నా మనసు కొన్ని పరిస్థితుల్లో నా మాట వింటోంది. అలాగే వాళ్ళ మనస్సులు కూడా కొన్ని సమయాల్లో వాళ్ళ మాటలు వినకుండా ఉంటాయా? అలాంటప్పుడైనా వాళ్ళు నన్ను అర్థం చేసుకోవచ్చు కదా? నిజమే. కాని, కొన్ని సమయాల్లో నీ మనసు నీ మాటను నిరాకరించడం జరుగుతోందని నీవే అంగీకరిస్తున్నావు కదా? అలాగే వాళ్ళ మనసు కూడా కొన్ని సమయాల్లో వారి మాటను నిరాకరించవచ్చు కదా? అంటే, - ఒక్క విషయం జాగ్రత్తగా అర్థం చేసుకో. ఏ విషయంలో అయితే నీ మనసు అనుకూలతను ప్రదర్శిస్తున్నదో, ఆ విషయంలో ఎదుటివారి మనసు ప్రతికూలంగా ప్రతిస్పందించవచ్చు కదా! అలా కాకుండా నీ మనసుకు అనుకూలమైన విషయాల్లో వాళ్ళ మనసులు కూడా అనుకూలంగా ఉండి, నీ మనసు ప్రతికూలంగా ఉన్న విషయాల్లో, వాళ్ళ మనసులు కూడా ప్రతికూలంగా ఉండాలా? **"ఎవరికి వారే యమునాతీరే"** అనే ఈ ప్రపంచంలో ఈ రెండింటికి రాజీ కలిపేదెవరు? మూడవ వ్యక్తా? ఒకవేళ ఈ రెండు మనసులతో అతని మనసు విభేదించి రాజీని కాలరాచేస్తే? అప్పుడేం కావాలి? ఆ మూడవ మనసు కూడా అనుకూలంగానే ఉండాలా? ఈ ఆజ్ఞలు ఎవరివ్వాలి? మిత్రమా! ఇది సాధ్యమేమో మమ్మల్ని సాధించకుండా, బాధించకుండా ఆలోచించు.

7. స్వామిజీ! మీరు కూడా కాస్త ఆలోచించి అర్థం చేసుకోండి. మీరు ఇప్పటి వరకు చేసిన వాదమంతా బాగానే ఉంది. కాని, ఒక్క విషయాన్ని మీరు మరచి పోతున్నారు. నన్ను అర్థం చేసుకోవాలని నేను ఎవరినో ప్రాధేయపడడం లేదు. నేను అడిగేది నా వారిని, నన్ను కట్టుకున్న వారిని, నన్ను చుట్టుకున్న వారిని. నా వాళ్ళు నన్ను అర్థం చేసుకోకపోవడమేమిటి? నా మాట వినకపోవడమేమిటి? ఇదెక్కడి న్యాయం?"

నాయనా! దీనికి న్యాయాలు, చట్టాలు అనే పెద్ద పెద్ద పదాలు ఎందుకులే! న్యాయస్థానాల్లో ఏదో జరిగిపోతున్నట్లు.

చూడు! కట్టుకోవడం, చుట్టుకోవడం ఏం మాటలయ్యా ఇవన్నీ? కట్టుకున్న పంచె, చుట్టుకున్న ఈగలు కూడా అర్థం చేసుకోవాలటయ్యా? కట్లు ఊడిపోతాయని, చుట్లు విడిపోతాయని కూడా నీకు తెలియకపోతే నేను ఏమి చేసేది?

నీవారు కనుక వారు నిన్ను అర్థం చేసుకోవాలా? వారు నీవారైనపుడు నీవు వాళ్ళవాడివి కావా? వాళ్ళని నీవు అర్థం చేసుకోవాలని వాళ్ళు కూడా భావించవచ్చు కదా? నా భావాల్లో వాళ్ళెందుకు కలసిపోకూడదు పాలలో పంచదారలా, అంటావా? వాళ్ళూ అదే అంటున్నారు. మేము అతనికి సంబంధించిన వాళ్ళమే కదా, పెట్రోలులో కిరసనాయిలులా అతనెందుకు కలిసిపోకూడదు? అంటున్నారు. ఇప్పుడేం చెప్తావు?....

ఇంకేమీ చెప్పనవసరం లేదు. చెప్పేందుకు కూడా ఏమీ లేదు. ఎవరో అర్థం చేసుకోలేదని; వేడుకతో గడుపవలసిన బ్రతుకును ఏడుపులో ఈడ్చుకుంటున్నాం. ఇంత వరకు మనం విశ్లేషించిన ఏడు కారణాలే ఇతరులు అర్థం చేసుకోలేదని ఏడవడానికి ప్రధానంగా తెలుస్తున్నాయి. అవి ఎంత అహేతుకమో సహేతుకంగా నిర్ణయించడం, దానికి సశాస్త్రీయ అవగాహనను అందించడం జరిగింది.

ఈ విషయాలను పదే పదే మననం చేయండి. ఈ సత్యాలు జీర్ణమై వంటబడితే బ్రతుకులో పెద్ద ప్రతిబంధకాన్ని ఛేదించినట్లే.

ఏడుపంటే ఎవరికైనా బాధే. ఆ ప్రస్తావనే మనిషి సహించలేడు. అందుకే ధాన్యం కొలిచేవాడు 'ఆరున్నొకటి' అంటాడే కాని 'ఏడు' అనడు. 'ఏడు' అంటే ఏడ్వవలసి వస్తుందని భయపడిపోతాడు.

చెట్టెక్కినవాడు దిగాలంటే ఎక్కిన చెట్టు మీద నుండి దిగాలే గాని మరొక చెట్టు నుండి కాదు. ఏడుపులో ఉన్నవాడు కూడా దాని నుండే విముక్తిని పొందాలి. దానిని విస్మరించి కాదు. అందుకేనేమో 'ఏడు'ను చూచి ఏడుపును స్మృతికి తెచ్చుకొని భీతి చెందే మానవుని ఉద్ధరించేందుకు భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ 'ఏడు'నే ఆలంబనంగా తీసుకొని బోధించాడు.

ఏడవ అధ్యాయం - ఏడవ శ్లోకంలో ఏడుపును ఏడిపించేశాడు. వేడుకను వెలిగించేశాడు.

మత్తః పరతరం నాన్య త్కించిదస్తి ధనంజయ!

"అర్జునా! నాకంటే శ్రేష్ఠమైనది మరొకటి లేదు" అన్నాడు. అందుకే ఏడును ఎన్నుకున్నాడేమో! ఏమైనా ఏడుకొండలవాడు కదా! ఎత్తైన దేవుడు. ఆయనకన్నా ఎత్తైన వాడు (పరతరం) ఎవడుంటాడు?

ప్రతిబింబాలు

"నేను ఏమి ఆలోచిస్తున్నాను?" అనే ఆలోచనను అవలోకించడం కన్నా "నన్ను గూర్చి ఇతరులు ఏమనుకుంటున్నారు?" అనే ఆలోచనే చాలామంది మనస్సులలో ఎక్కువకాలం సాగుతూ ఉంది. 'ఇతరులు నన్ను గూర్చి ఏమనుకుంటున్నారు?' అనే ఆలోచన కూడా తన ఆలోచనేయని, తన మనసులో లేచిన అలయేనని గుర్తించే అవకాశానికి కూడా నోచుకోలేని విధంగా మనసు ఇతరుల అభిప్రాయాలను గూర్చి ఆలోచిస్తూ ఉంది.

ఇది వ్యసనమా? వ్యాపకమా? అనేది వేరే విషయం. ఏదైనా సరే, ఇది అసలు ఎందుకు జరుగుతూ ఉంది? అని ఆలోచించినపుడు మనలో ఏదో నిస్సహాయ స్థితి, నిరాధారస్థితి చోటుచేసుకొని ఉందని, ఏదో అర్థంగాని నిరాశ గూడు కట్టుకొని కాపురముందని తెలుతుంది.

నీకు మనసెలా ఉందో ఇతరులకూ అలాగే ఉంది. నీవు ఎలా ఆలోచిస్తున్నావో, వాళ్ళు కూడా ఆలోచిస్తారు. ఆలోచించే మనస్సు ఉన్నంతకాలం ఆలోచించకుండా ఎవ్వరూ ఉండలేరు.

అందరూ ఆలోచిస్తారు. అయితే అందరూ ఒకేలాగ ఆలోచించలేరు. అందరికీ మనస్సు ఉండవచ్చునేమో గాని, అందరి అనుభవాలు ఒకే విధంగా లేవు. అనుభవాలను, స్మృతులను బట్టే ఆలోచనలు సాగుతాయి కనుక అందరూ ఒకే విధంగా ఆలోచించలేరు.

ప్రతి మనిషి ఈ ప్రపంచంలో దేనిని అర్థం చేసుకున్నా తన అనుభవాన్ని జోడించే అర్థం చేసుకుంటాడు కనుక, తాను అర్థం చేసుకున్నది పూర్ణత్వాన్ని సంతరించుకోదు. నీ అనుభవజలం ఆవిరైతే కాని సత్యమనే క్షీరము స్వచ్ఛతను వ్యక్తం చేయలేదు.

అనుభవాలు జోడించి అర్థం చేసుకున్నది పూర్ణం కాదు. అనుభవాలను జోడించకుండా అర్థం చేసుకోవడం అసలు సాధ్యపడదు. కనుక సత్యావగాహనకు సంబంధించిన సంఘర్షణ ఏ వ్యక్తి ఆంతర్యంలో తలెత్తినా అది తన మనసులో నిలిచియున్న స్మృతులు రేపిన అలజడియే గాని మరొకటి కాదు.

కనుక, ఇతరులు మనల్ని గూర్చి ఏదో ఆలోచిస్తున్నారు అనేది కాదు మనలో సంఘర్షణ. ఇతరులు మనల్ని గూర్చి ఇలా ఆలోచిస్తున్నారు అనే ఆలోచనే మనలో నిజమైన సంఘర్షణ.

ఇతరుల అభిప్రాయాలకు నీవు ఎంత వరకు బాధ్యుడవు? ఇతరుల ఆలోచనలు సరియైనవో కావో నీవు ఎలా తెలుసుకోగలవు? ఒకవేళ తెలుసుకున్నా నీవు చేయగలిగే దేముంటుంది? సరిచేస్తావా? పోనీ, అలా సరిచేయడానికి ఇతరుల మనస్సులపై నీకు

పట్టు దొరుకుతుందా? ఒకరి మనసు మరొకరి మనస్సుకన్నా భిన్నమై ఉన్నప్పుడు ఒక మనసుకి మరొక మనసుపై పట్టు ఎలా సాధ్యం? రెండు మనసులూ ఒకటే అంటారా? అలాంటప్పుడు సరిచేయవలసిన అవసరమేముంది? ఒకవేళ సరిచేయాలి అని భావిస్తే, రెండూ ఒకటే కనుక ఒక్క మనసును సరిచేస్తే, రెండవది సరిపడి ఉన్నట్లే కదా? అదే నిజమైతే, ప్రయత్నానికి ఆలస్యమెందుకు? ఏ మనసును సరిచేయాలి అనేదే ఆలస్యానికి కారణమైతే, నీకు సమీపంలో ఉండేది, స్వాధీనంలో ఉండేది నీ మనసే కనుక దానినే సరిచేస్తే సరిపోతుంది కదూ? అయితే, నీ మనస్సును సరిచేసుకొనే ప్రయత్నంలో ప్రక్క మనసును సరిపోల్చుకోవలసిన అవసరం, అగత్యం ఉందా? లేదు. అలా లేకుండా ఉన్నప్పుడే సరిచేయాలి అనుకొనే నీవు నీ మనస్సుతో ఉండటం జరుగుతుంది. అలా ఉన్నప్పుడే సరిచేయడం జరుగుతుంది.

ఇలా మనస్సును పురిపెట్ట గలిగితే, మనస్సు గట్టిపడి సరిపడుతుంది. ఇతరులు నిన్ను ఎలా అర్థం చేసుకుంటున్నారు? అనే ఘర్షణ నీవు కల్పించుకున్నది. ఎవరు ఎలా అర్థం చేసుకున్నా నీకు ఒరిగేది లేదు. తరిగేది ఉండదు. అయితే, ఒక్కటి మాత్రం సత్యం. నిన్ను నీవు సరిగ అర్థం చేసుకోలేకపోతున్నావు అనేది నూటికి నూటపది పాళ్ళు సత్యం. ఈ సత్యాన్ని గుర్తించి గ్రహించలేకపోతే వాటిల్లే నష్టము అంచనాలకు అందేది కాదు. కాని, నష్టం ఎవరికి? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం సుస్పష్టం. ఎవరికి? నీకే. నీకే. నీకే. మరెవరికీ కాదు. అందుచేత, ఈ విషయాన్ని ఎవరో అర్థం చేసుకోవడం వల్ల లాభం లేదు. నీవే అర్థం చేసుకోవాలి. నీకే అర్థం కావాలి.

నిన్ను నీవు అర్థం చేసుకున్నావా? ఇది జరిగే ఉంటే, ఇక నీకు దుఃఖ మెక్కడిది? నీవు ఎంత ప్రయత్నించినా దుఃఖ వలయం నుండి విడిపడలేక పోతున్నావు అనేది అర్థంకావడానికి ప్రయత్నం అవసరం లేదు.

నీవు ప్రయత్నించినా దుఃఖం నీకు దూరం కాదు. దూరం కావడానికి దుఃఖము ప్రాణి కాదు. దుఃఖము అనేది అనుభవము. భావము. చుట్టము వచ్చినట్లు దుఃఖము రాలేదు. రాలేదు కనుక పోదు. పోనిది కనుక చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఎందుకని? నీవు చుట్టబెట్టుకున్నావు కనుక.

"నేను పరిమితుణ్ణి. జీవుణ్ణి. వ్యాపారిని. గాయకుణ్ణి;" ఇలా నిన్ను నీవు ఊహించుకున్నావు. ఈ ఊహల్లో వాస్తవం మరుగున పడింది. దుఃఖం బయటపడింది. ఈ దుఃఖాన్ని ఎవ్వరూ పంచలేదు. దుఃఖం ఎక్కడినుండో రాలేదు. నీకు నీవే సృష్టించుకున్నావు. నీవు ఇష్టపడి సృష్టించుకున్న దాని నుండి నీవు ఎలా బయటపడగలవు? అందుచేతనే, ఏ యోగం అనుష్ఠించినా దుఃఖవియోగం సిద్ధించడం లేదు.

దుఃఖము నుండి విడిపడాలని ప్రయత్నించినంత వరకు పరిస్థితి ఇలాగే ఉంటుంది. దుఃఖము లేనిదేనని గ్రహించినపుడే స్థిమితము, స్థిరత సిద్ధిస్తుంది. 'లేనిదే అయితే ఎలా తెలిసింది? అని ప్రశ్నించి మళ్ళీ లేని దుఃఖాన్ని తోడు తెచ్చుకోవద్దు. లేని దానిని

ఉన్నట్లు చూపేదే అవిద్య. లేదా అజ్ఞానము. అది చేయలేనిదంటూ ఉండదు. ముత్తెపుచిప్పలో దండిగ వెండిని చూపింది, ఆశను రేపింది అవిద్యయే. అజ్ఞానమే.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః

"జ్ఞానము అజ్ఞానముచేత కప్పబడి ఉంది. అందుచేత జనులు మోహము నొందుచున్నారు" అని భగవద్గీత.

"క్షత్రియోఽహం". నేను క్షత్రియుడను అనగానే నీవు పరాధీనుడవని తేలిపోయింది. నీవు ప్రభువువే కావచ్చు. కాని సైన్యము మీద, జనుల మీద ఆధారపడియున్నావు. మరొకరిపై ఆధారపడి జీవించే వారికి దుఃఖము ఎలా దూరమవుతుంది?

నేను ఆత్మను. అఖండాత్మను. పరాత్పరుడను. అకర్తను. అభోక్తను అని గ్రహించినపుడే నీకు దుఃఖం దూరం కాగలదు. ఇదే జ్ఞానము. సత్య స్వరూప జ్ఞానము. ఇది లేకపోవడం అజ్ఞానం. కనుక మనకే మనం అర్థం కావడం లేదు. మనల్ని మనం అర్థం చేసుకోలేకపోగా ఇతరులు మనల్ని ఎలా అర్థం చేసుకుంటున్నారో ఆలోచించుకొని సుఖదుఃఖాల చక్రభ్రమణంలో పరిభ్రమిస్తున్నాము. అర్థమైందా? ఎవరు మనల్ని ఎలా అర్థం చేసుకున్నా నష్టం లేదు. మనల్ని మనం అపార్థం చేసుకోకపోతే ఈ ప్రపంచంలో మనకు మించిన భాగ్యవంతులుండరు. అట్టివారే ధన్యజీవులు. వందనీయులు.

తేవై సత్పురుషా ధన్యా వంద్యాస్తే భువనత్రయే

"అట్టి సత్పురుషులే ధన్యులు. సర్వత్ర వందనీయులు" అన్నారు శ్రీ శంకరాచార్య స్వామి.

బంధాలను తొలగించుకుందాం.

అందాలను వెలిగించుకుందాం.

వందనీయులై వెలిగిపోదాం.



బాధల భారతం

తీపి తిని తెచ్చుకున్న అనారోగ్యాన్ని చేదు మ్రింగి పోగొట్టుకోవాలి. తీపి తిన్నంత మాత్రాన బ్రతుకులో తియ్యదనం రాదు. చేదు అయినంతమాత్రాన ఆరోగ్యాన్ని ప్రసాదించకపోదు.

బాధలు అనుభవించడానికి దోషాలు ఉండనవసరం లేదు. బాధలు లేనంత మాత్రాన దోషులు నిర్దోషులు కాలేరు. స్వార్థపరులున్న చోట పండ్లచెట్లకు రాళ్ళ దెబ్బలు తప్పవు. దుష్టులున్నచోట సాధువులకు బాధలు తప్పవు.

నాటి భారతంలో పాండవుల దోషాలేమిటి? నేటి భారతంలో సత్పురుషుల లోపాలేమిటి? ఏమీ లేవు. అయినా బాధలు వారికీ తప్పలేదు; వీరికీ తప్పలేదు. ఇది బాధల భారతం.

సుఖం సుఖే నేహ న జాతు లభ్యం

దుఃఖేన సాధ్వీ లభతే సుఖాని

"సుఖమనేది సుఖాల నుండి రాదు. బాధలనుండే సుఖాలు లభిస్తాయి" అని మహాభారతం - అరణ్యపర్వంలో ద్రౌపది సత్యభామతో చెబుతుంది.

సర్వాన్ని మరపించేది సుఖం. సమస్తాన్ని ఎరుక పరచేది దుఃఖం. అంతరేక్షణ పెరిగేది, అవగాహన అంకురించేది ఆపదలలోనే.

భక్తులైన వారికి అంతరేక్షణ, అవగాహన ఇంకా పెరగాలి అని భగవంతుడు భావిస్తే వారికి బాధల్ని సరఫరా చేయడంకన్నా మరొకటి చేయలేడు.

బాధలొచ్చాయని సాధకులు భీతి చెందనవసరం లేదు. వాటి వెనుక భాసించే అచ్యుతుని అదృశ్య హస్తాన్ని వీక్షించే అలవాటును కలిగియుండాలి.

ఇది బాధల ప్రపంచం. స్వార్థసర్పాలు చరిస్తున్న ప్రదేశం. ఇక్కడ బాధలు తప్పవు. సమస్యలు తప్పవు. కాని ఆ సమస్యలు పరమాత్మను చూపే జ్యోతులైనపుడు సమస్యలు నీకు స్నేహితులే. బాధలన్నీ బంధువులే.

ప్రపంచంలో వాటిని ఉండనీ.

పరమాత్మలో నీవు ఉండిపో.

గృహం - అనుగ్రహం

గృహస్థాశ్రమము పరమ పవిత్రమైంది. గృహస్థుడు పుణ్యాత్ముడు. "గృహస్థ" అంటేనే గృహమునందు స్థిరపడినవాడని భావము. గృహమంటే ఇల్లు అని భావము కాదు. స్వస్థానము అని అర్థము. పరంధాముడే మనకు స్వగృహము. నిజ బంధువు కూడా.

నివాస శ్శరణం సుహృత్

అని భగవద్గీత కూడా ప్రవచించింది. ఈ సత్యము హృదిలో స్థిరపడితే గృహస్థుడు ఆత్మస్థుడే కాగలడు. ఆత్మస్థితుడై జీవించేందుకు అనువైనది అగుటచేత గృహస్థాశ్రమము పవిత్రమైన ఆశ్రమముగా నిర్ణయింపబడింది.

దేవాలయము వలె గృహాలయము కూడా భగవత్సేవకు ఉపకరించే దివ్య మందిరమని గృహస్థులు భావించాలి. ఆలయము వలె ఇల్లు కూడా పవిత్రంగా ఉండాలి. ఆలయంలో అడుగు పెట్టగనే దివ్య సంకల్పాలు మనస్సులో కదులునట్లు, ఇంటిలో ప్రవేశించగనే ప్రశాంతత బుద్ధి నావరించాలి. స్పర్ధలు, కార్పణ్యాలు, ఈర్ష్యలు, రాగ ద్వేషాలు లేకుండా చూసుకోవాలి. అప్పుడే గృహము ఆలయమవుతుంది. ఆలయంలో ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తీ మనకు పరమాత్మనే జ్ఞప్తికి తెస్తూ ఉంటారు. కుటుంబ సభ్యులు, పనివాళ్ళు, అతిథులు, బంధువులు అందరూ పరమాత్మను గుర్తు చేసేవారై ఉండాలి.

ధరించియున్న వస్త్రము ముళ్ళపొదకు తగులుకొంటే అడుగు ముందుకు వేయలేము. మెల్లగా, చల్లగా ఆ తగిలింపులను తొలగించుకొని ఆ తరువాత ముందుకు చరిస్తాము. గృహస్థాశ్రమములో కూడా అంతే. ఎదురయ్యే అడ్డంకులను అవగాహనతో ప్రశాంతముగా అధిగమించే అలవాటును గృహస్థుడు అలవరచుకోవాలి.

ఇంటికి వచ్చే అతిథులను ప్రేమతో ఆహ్వానించాలి. వారిలో పరమాత్మను వీక్షిస్తూ ప్రేమతో పలుకరించాలి. ఇది గొప్పదైన, దివ్యమైన సుగుణము. ఈ సద్భావము సద్రూపుడైన పరమాత్మను ఒకనాడు మన ఇంటికి నడిపించి తీసుకొని వస్తుంది. ఈ అవగాహన నేడు ఆశ్రమాలలో కూడా కనిపించడము లేదు. కార్యాలయ సిబ్బందివలె ప్రవర్తిస్తూ, వచ్చినవారు నొచ్చుకొనేలా పలవరిస్తూ ఉంటారు. పైగా ఈ ప్రవర్తనను అందరూ మెచ్చుకోవాలని ఆరాట పడుతూ ఉంటారు కూడాను. ఏంచేస్తాం? సరియైన ఆశ్రమాలలో ఎందరైనా నివసించగలరు. కానీ కొందరే జీవించగలరు. అవగాహనతో, ప్రేమతో జీవించే గృహస్థుడు ఆశ్రమవాసి కన్నా ఉత్తముడేయని నా అభిప్రాయము.

అతివాగుడు అనర్థాలను తెచ్చిపెడుతుంది. ఇంటికి వచ్చిన వారితో వ్యర్థ ప్రసంగములు చేయకూడదు. ఇతరులను విమర్శించుకొంటూ జీవించడం మంచిది కాదు. వచ్చిన వారితో సద్విషయాలనే ముచ్చటించాలి. ప్రేమించే హృదయానికి

శత్రువులు లేరు. మనలో కదిలే ప్రేమప్రవాహములో ఇతరుల దోషాలు అమాంతం మునిగిపోతాయి. కనిపించకుండా కనుమరుగవుతాయి.

బ్రతుకులో బాధలు దొర్లుతూ ఉంటాయి. అలాగని కన్నీళ్ళతో పొర్లుతూ విలపించకూడదు. బాధలలో బోధలు లభించాలి. ఆవేదనలలో ఆనందమును చేజిక్కించుకోవాలి. బ్రతుకొక నాటకమని సదా గుర్తుంచుకోవాలి. నటుడు తానెవరో తెలిసే పాత్ర నభినయిస్తూ ఉంటాడు. నీవు ఆత్మవేననెడి భావనను ఆంతర్యములో స్థిరపరచుకొని, బాహ్యంలో నీ పాత్రను పోషించాలి. ఈ అవగాహనలో బాధలు స్ఫురించవు. బాధ్యతలు తెలుస్తాయి. బోధలు అందుతాయి.

ఇంటిలోనివారు సద్భావాలకు విలువ నివ్వటంలేదని వ్యథ చెందకూడదు. మన మాటలు వారి మనస్సును కదిలించలేకపోవచ్చు. కానీ మన మౌనం వారి హృదయాన్ని తట్టి లేపుతుంది. "భగవాన్! నా మంచి పలుకులు వారి మనస్సుల నుండి జారిపోకుండా రక్షించు" అని ప్రేమతో ఎదుటి వ్యక్తిలోని పరమాత్మను దర్శిస్తూ సంభావించటం అలవరచుకోవాలి. వెంటనే వారిలో అనూహ్యమైన మార్పును మనం చూడగలము.

వ్యక్తులకు దూరమై ఎవ్వరూ బ్రతుకలేరు. మన వ్యక్తిత్వంలో మార్పు రాగలిగితే నేర్పుతో జీవించగలము. కడలి స్నానానికి కెరటాలు అడ్డురావు. బ్రతుకులో స్ఫూర్తితో జీవించేందుకు బాధలు అడ్డురావు. పైగా జీవన నౌకకు తెడ్డులా సహకరిస్తాయి. గడ్డును తొలగిస్తాయి. ఒడ్డుకు నడిపిస్తాయి.

బిడ్డ తల్లి కొరకు రోదిస్తాడే గాని, ఆమె కట్టుకున్నది పట్టు చీరేనా? ఆమె పెట్టుకున్నది పసిడి నగలేనా? అని చూడడు. అందుచేత అమ్మ మోమును చూస్తూ విలపిస్తాడు. అమ్మ ముఖారవిందము కనిపించగనే బిడ్డ ఏడవడం మానేస్తాడు. అమ్మ ముఖం తప్ప అన్ని ముఖాలు ఇక్కడ ఏడిపించేందుకే ఉన్నాయి.

ప్రపంచాన్ని చూస్తే మోహం జనిస్తుంది. ఈ ప్రపంచంలో ఏ ముఖమైనా వాంఛలను రేపేందుకే ఉంది. జగజ్జనని మోము కమల శోభతో గోచరిస్తుంది. అది జ్ఞానవైభవము. కనుక మోహమును తుడిచేస్తుంది. మోక్షానికి దారిని సుగమం చేస్తుంది.

ఊడేవన్నీ ఊరేగింపులే

నీవు నిర్వికారుడవు. బాధలకు నీలో చోటు లేదు. వికారము చెందే ప్రపంచము నిర్వికారుడవైన నిన్ను కలతపెట్టలేదు. అనిత్యమైన ప్రపంచానికి నీవు ఇచ్చే అసత్యపు విలువలే నిన్ను కలవరపెట్టి, కలుషితం చేస్తున్నాయి.

కదిలే కాలంలో కనుమరుగయ్యే బంధాలన్నిటినీ ప్రయత్నించి మరచిపో. పెట్టుకుంటే అన్నీ బంధాలే. పట్టుకుంటే అందరూ బంధువులే. కలనుండి బయటపడితే అన్నీ కల్లలే.

పెరిగే మమతలే బాధల వలయాలని మరువకు. ఊడినవి ఊడిపోనీ. అంత మాత్రాన నీవు ఓడిపోలేదు. నీ మంచి మాడిపోలేదు. ఈ ప్రపంచములో ఏదీ నీదిగా భావించకు. ఈ భావనలు నిన్ను కలలో కూడా సుఖపడకుండా చేస్తాయి. "నాది" అని నీవు దేనిని పిలుస్తావో అది నీ సుఖమును కొంత హరించేదేనని మరచిపోకు. "నావి" అని ఎన్నిటిని పిలుస్తావు? "నా వారు" అని ఎందరిని పలుకరిస్తావు? నా వాళ్ళనెడి సంఖ్య ఎంతగా పెరుగుతుంటే నీలోని సౌఖ్యము అంతగా దూరమవుతూ ఉందని భావము.

బాధలు తీరాలని క్రొత్త బాధలను తెచ్చిపెట్టుకోకు. పరులకు బోధలనందించే నిన్ను తృప్తి పరచేందుకు భగవానుడు నీకు బాధలను అందిస్తాడు. బాధల నిజస్వరూపము తెలియాలి అంటే అవి అభిమానులనుండే రావాలి. ఆత్మీయుల నుండే కదలాలి. అందుకే నీవు నమ్మినవారే నిన్ను వమ్ము చేస్తారు. నమ్మలేని ద్రోహం చేస్తారు.

ఇలా ఎందుకు జరిగింది? అని ఆలోచించకు. నీలో మార్పును భగవానుడు వాంఛిస్తున్నాడనే సత్యాన్ని దర్శించు. గాలిమేడలు నిర్మించుకుంటే కూలిపోయిననాడు జాలి చూపేవారెవ్వరూ ఉండరు.

కల్మషాలను కరిగిపోనీ. తరగని నిధి నీలోనే ఉంది. చెదరని ప్రేమ నీ ఆంతర్యములో నిండి ఉంది. వంచనకు అలవాటు పడిందీ లోకము. విచారించకు. మాధవుడు నీలోని మంచిని చూస్తూనే ఉన్నాడు. నిన్ను ఆశీర్వదిస్తూనే ఉన్నాడు.

అజ్ఞానంతో బరువును తల కెక్కించుకున్నావు. భారాన్ని తగ్గించాలని పరమాత్మ పనిగట్టుకున్నాడు. అర్థం చేసుకో. ఆవేదనకు గురికాకు. అసమ్మతిని ప్రకటించకు. దూరమైన బంధాలన్నీ నిజానికి చేరువైన అందాలే.

ఇచ్చినవాడికే పుచ్చుకొనే హక్కు ఉంది. జీవితంలో దరిజేరిన సుఖాలన్నీ భగవానుడు ప్రసాదించినవియే. ఒకవేళ అవి దూరమైతే ఏం జరిగింది? ఇచ్చినవాడే తిరిగి పుచ్చుకున్నాడు. ఇది ధర్మం. అవగతమైన ధర్మం బుద్ధిలో ఆవేదనను దించదు. అందుకున్నది సుఖము. అందేది శుభము.

"నావి" అనుకున్న వేవీ నీవి గావు. ఇది నిజం. చేదుగానే ఉంటుంది. అయినా చేరదీసి చూడు. చేయూతనిచ్చి నిన్ను రక్షిస్తుంది. చింతలను అదృశ్యం చేస్తుంది. మిణుగురు పురుగుల కాంతిలో ఏ గ్రంథాన్ని చదువుతాము? స్వార్థపరుల నీడలో ఏ అనురాగపు మేడను నిర్మించుకుంటాము?

"నావి" అని ఈరోజు ఎగురుతాము. "నావి" దూరమైన వని రేపు ఏడుస్తాము. నీవైతే నిన్నెందుకు వదుల్తాయి? వదిలే వాటిని వదిలించుకో. వదలనిదేదో తెలిసి తగిలించుకో. తరించే ముందు తారసిల్లే వన్నీ తరలింపులే. ఉద్ధరింపబడే సమయ మాసన్న మైనపుడు ఊడేవన్నీ ఊరేగింపులే.

మహామహులందరు మట్టిలో కలిసిపోయారు. రాజభవనాలన్నీ రాతి గుట్టలయ్యాయి. కనుమరుగయ్యే వాటి కొరకు కలవరించకు. నిత్యమైన సత్యరూపుడు భగవానుడొక్కడే. అర్థంగాని సత్యం వ్యర్థమైన బంధాలను తగిలించింది. అవగతమైన సత్యం వెతలను అంతమొందిస్తుంది.

జరిగేది నాటకం.
మన పాత్ర వీక్షణం.

నేర్చినవి ఎన్నో! కానీ, అవి బాధల్ని తీర్చినవి మాత్రం కావు. బ్రతుకును తీర్చిదిద్దినవీ కావు. భయాల్ని బుద్ధికి రుద్దినవే కాని శాంతిని హృదయానికి అద్దినవి కావు. బుద్ధి వికసనమే గాని హృదయ విలసనము లేదు. ఉపశమనమే గాని ప్రశమనము కాదు. ప్రసిద్ధియే గాని సిద్ధి లేదు. అన్నీ ప్రలోభాలే గాని నిజలాభాలు లేవు. ప్రమాదాలే గాని ప్రమోదాలు తెలిసిరావు. అన్నీ ప్రయత్నాలే. ప్రయాసలే. చివరికి అడియాసలే.

మనం తయారు చేసుకున్న పురాకృత రహదారిపైనే విధాత నిర్ణయాల శకటం పయనిస్తోంది. అది సాగేదే కాని ఆగేది కాదు. ఆ వ్రాత తుడిపితే పోయేది కాదు. కడిగితే కనిపించకపోదు. దానిని తుడిచే శక్తి, చెడిపే యుక్తి మనకు లేవు. అందుకే, పరమాత్మ చరణకమలాలను ఆశ్రయించాలి.

అంతర్యం

దుఃఖపడవలసి వచ్చిందని చాలామంది వ్యథ చెందుతూ ఉంటారు. దుఃఖము అనేది ఆలోచనా జనిత మనే సత్యాన్ని ఎందరు గుర్తిస్తారు?

ఆలోచించకుండా ఎవరూ దుఃఖానికి గురికారు. కాని ఆలోచించేవారు తమ ఆలోచన దుఃఖానికి ఎలా దారి తీస్తుందో గ్రహించలేరు.

ఒకరు మనలను చులకనగా చూస్తున్నారనుకుందాం. అంతమాత్రం చేత దుఖం రాదు. వారు మనల్ని చులకనగా చూస్తున్నారు అనే విషయాన్ని మనం అనేక కోణాల నుండి దర్శించి ఆలోచించటము వలన దుఃఖము కల్గుతుంది.

మనల్ని గూర్చి మనకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. మనలో లేని దోషాన్ని ఇతరులు చూస్తున్నారనుకుందాం. వారు చూచిన దోషం మనలో లేనందున ఇతరులలో కనిపించిన దోషదృష్టికి మనము కలవరపడతాము. అదలా ఉంచండి.

మనలో లేని మంచి గుణాన్ని ఇతరులు శ్లాఘించారనుకుందాం. అప్పుడెలా ఉంటుంది? హాయిగా ఉంటుంది. కదూ? అయితే, లేని మంచిని ఇతరులు మనలో చూచినపుడు సంతోషించిన మనం, మనలో లేని చెడును ఇతరులు చూచినపుడు కూడా సంతోషపడగలిగి ఉండాలి. ఇది జరగటం లేదని మనకు తెలుసు.

ఇప్పుడు ఆలోచించండి. మనలో లేనిది ఇతరులకు ఉన్నట్లు తోచటం మనకు అనంగీకారమైతే, గుణదోషాలలో ఒకే విధంగా స్పందించగలగాలి.

ఇంతకీ విషయమేమిటంటే, మనలో ఏమున్నది అనేది మరుగున పడిపోయి, ఇతరుల మనస్సులలో మనమెలా ఉండాలి? అనేది కేంద్రవిషయమైంది.

కాని, ఇక్కడ నిప్పులాంటి నిజ మొకటుంది.

ఇతరులు నిన్ను ఎలా అనుకున్నా, ఆ అనుకున్నదేదో అదే నీలో ఉన్నదయితే, అది కూడా నీవు మనస్ఫూర్తిగ అంగీకరిస్తేనే నీకు సుఖం కలుగుతుంది. ఇతరుల చూచింది నీలో లేనపుడు అది మంచియే కావచ్చు. కాని స్వప్రయోజనానికి దానిని అంగీకరించే పొరపాటు చేయటంవలన వంచనకు గురయ్యేది నీవే. సంఘర్షణకు లోనయ్యేది నీవే.

నీవెవరివో, ఎలా ఉన్నావో బాగా ఎరిగినవాడివి నీవే. ఇతరుల ఊహల్లో మరొకరు పూర్తిగా ఇమిడిపోగల రనేది కల్ల. కనుక ఇతరుల మనస్సులకు నీవు పూర్తిగా చిక్కవు. అలాంటప్పుడు నీవు వారికి అర్థమే కావు. అర్థం కానపుడు వారు ఏమనుకుంటే మాత్రం ఏం పోతుంది? ఇంతకీ ఇతరుల మనస్సులలో నీవు ఎలా ఉన్నావో నీకెలా తెలుస్తుంది? ఎలా తెలిసినా అదంతా కేవలం నీ ఆలోచనా సరళియే. ఇక్కడ సమస్య మరో మలుపు తిరిగింది.

ఇతరులు నిన్ను గూర్చి చేసే ఆలోచన వేరు. ఇతరులు నిన్ను గూర్చి ఆలోచిస్తున్నారని నీవు ఆలోచించే విధానం వేరు.

ఇక్కడే ఆవేదనలు ఆరంభమవుతాయి. కష్టాలు కదుల్తాయి. కన్నీళ్ళు జారుతాయి. గుండెలు పగులుతాయి.

ఇతరుల అభిప్రాయాలకు నీలోని వాస్తవాలకు పొంతన కుదరదు. ఎవరు మనల్ని ఎలా చూచినా మనం అలా లేమని వాళ్ళని నమ్మించేందుకు అహర్నిశలు యత్నిస్తూ ఉంటాము. **"నా మాట నమ్ము, నేను చెప్పేది సత్యం......కాకపోతే"**......అంటూ ప్రతిజ్ఞలు, శాపనార్థాలు. ఇవన్నీ శూన్య హృదయాలు వినిపించే శుష్కవాదాలు.

సుఖపడేందుకు ఇది మార్గం కాదు. లోకులు కాకులనేవాణ్ణి నేను కాను. కాని, వాళ్ళకి వాక్కులున్నా యంటున్నాను. ఆ వాక్కుల మధ్య నీవు సుఖించాలని భావిస్తే మిగిలేది దుఃఖమే నంటున్నాను. ఈ దుఃఖాన్ని కూడా ఇతరులు ప్రయత్నించి నీలో దించలేరు. నీవు ఆహ్వానిస్తేనే అందిస్తారు. కలతలకు స్వాగతం పలికే కార్యాన్ని ఆవిష్కరించకపోతే ఆవేదన లందించేవారు మిగలరు.

నిన్ను గూర్చి ఇతరులకు తెలిసినదానికి, నిన్ను గూర్చి నీకు తెలిసిన దానికి భేదం ఉంది. ఇక్కడే అన్యులతో మనకు సంఘర్షణ, సమరమూను.

ఇకపోతే,

నిన్ను గూర్చి నీకు తెలిసినదానికి, నిన్ను గూర్చి శాస్త్రానికి తెలిసిన దానికి మధ్య చాలా భేదం ఉంది. తత్ఫలితంగా మనలో మనకు మనతోనే సంఘర్షణ. మనతోనే సమరం.

నేను పోలయ్యను అని నీవు... కాదు, నీవు పరమాత్మవు అని శాస్త్రం.

పోలికే లేదు. పొంతనే లేదు.

కనుక నిన్ను తెలియని ఇతరులు నిన్ను గూర్చి ఏమనుకుంటే మాత్రం నీకు నష్టమేమిటి? ఇకపోతే, నిన్ను గూర్చి నీకే తెలియనపుడు నిన్ను గూర్చి నీలో నీకు వచ్చే **కష్టమేమిటి?**

నామాట విను.

నేను మాత్రం నీకు ఇతరుణ్ణి కానా? కనుక నా మాట నీకు వద్దు. నీ మనస్సు నీకు అసలే వద్దు. శాస్త్రం మాట విను. శాస్త్రం మాటే నా మాటయితే నా మాట కూడా విను. ఒకవేళ నీ మాట కూడా శాస్త్రం మాటే అయితే, నీ మాట కూడా విను. శాస్త్రానికి భిన్నమైన మాట ఎవరిదైనా పట్టించుకోకు.

'శాస్త్రమేవ శరణం'

మనస్సు - మహిమ

"నీకు మెదడు ఉందా?" అని ఒకడు మరొకణ్ణి ఈ ప్రపంచంలో ప్రశ్నిస్తున్నాడే గాని, కేవలం మెదడు ఉండి మాత్రం ఏం లాభం? అని తనను తాను ప్రశ్నించుకోలేక పోతున్నాడు.

బ్యాంక్ లాకర్ ఉంది. కాని, ఖాళీగా ఉంది. దానివలన ఏమి ప్రయోజనం? లాకర్‌లో విలువైన సంపద ఉంది. కాని, తాళం చెవి లేదు. చెవి ఉంది; కాని త్రిప్పే అర్హత లేదు. ఇవన్నీ ఏమి ప్రయోజనం? మెదడు ఇలా ఉంది. మెదడు మనిషికీ ఉంది; గొఱ్ఱెకి కూడా ఉంది. కాని మనస్సు మనిషికుందే గాని గొఱ్ఱెకు లేదు. ఇప్పుడర్థమయిందా? మనస్సు పనిచేసేందుకు మెదడు అవసరమేమో గాని, మెదడే మనస్సు కాదు.

మెదడు దాచుకొనేందుకే పనికొస్తుంది. మనస్సు సంపాదిస్తుంది. అలాగే ఖర్చుపెడుతుంది. నాడుల కూడలి మెదడు. ఇప్పటివరకు అందినదంతా దానిలోనే ఉంది. అందిన వాటిని మెదడు ఉంచుకోవచ్చు. లేదా పారేసుకోవచ్చు. అందని వాటిని పట్టుకోవడం, తెచ్చుకోవడం మెదడుకి చేతకాదు. మనస్సుకే సాధ్యం.

కంప్యూటర్‌ని మెదడు కనిపెట్టలేదు. మనస్సు కనిపెట్టింది. కంప్యూటర్‌లో ఉన్నదంతా మెదడే గాని మనస్సు కాదు. మనిషి మనస్సు కంప్యూటర్‌కి చిక్కితే ఆ తరువాత కమాండ్స్ ఇచ్చేది మనిషి కాదు. కంప్యూటరే.

మనం దాచిందంతా(ఇన్ పుట్) కంప్యూటర్‌లో ఉంటుంది. ప్రక్రియ(Process) అంతా అందులోనే నడుస్తుంది. అప్పుడే ఫలితం (ఔట్‌పుట్) వస్తుంది. అయితే ఈ ప్రక్రియనంతా మనిషే నడపాలి. అంటే మనిషి మనసే నడపాలి. ఇక్కడే మనస్సుది పైచేయి అయింది.

కంప్యూటర్‌లో విషయం నిక్షిప్తమై ఉన్నట్లు మెదడులో చాలా విషయాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఈ ప్రోగ్రాం అంతా మనసే చేసింది. ఏమున్నాయి మెదడులో? అభిప్రాయాలు, అనుభవాలు, సిద్ధాంతాలు, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, అలవాట్లు - ఇలా ఎన్నో గతంలో తయారుచేసుకున్నవి మెదడులో దాగి ఉన్నాయి. ఇలా దాచింది ఎవరో కాదు; మనస్సే.

కంప్యూటర్‌లో విషయాలున్నాయి. మనస్సు లేదు. మెదడులో కూడా విషయాలున్నాయి. అంతేకాదు; మనస్సు కూడా ఉంది. ఇక్కడే కొద్ది లోతుగా ఆలోచించాలి.

కంప్యూటర్‌లో ఏది దాచామో అదే వస్తుంది. కాని మెదడులో లేనిదానిని కూడా మనస్సు ద్వారా వ్యక్తం చేయవచ్చు. కాకరకాయ నాకు ఇష్టం లేదు. ఈ విషయం మెదడులో ఉంది. వస్తుగుణం తెలిసి దానిని మనిషి మనస్సు ద్వారా వాంఛించి

పొందవచ్చు. ఇక్కడ మెదడు నిరాకరించి సాధించేదుండదు. ఈ విధమైన మార్పుకి మెదడులో అవకాశముంది.

మెదడు కూడా కంప్యూటర్‌లాగా దాచినవాటినే ప్రదర్శించటానికి అలవాటు పడి, మార్పుకు అవకాశ మివ్వకపోతే, కంప్యూటర్‌లో లేని మనస్సు మెదడులో ఉండి ప్రయోజనమేమిటి? కంప్యూటర్‌లో వైభవముంది. మనస్సులో వైభవంతో పాటు వ్యక్తి దాగి యున్నాడు. అర్థం చేసుకో.

దాచినవి గాక వేరేవాటిని కంప్యూటర్ వ్యక్తం చేయలేదు. కాని నీలో అది వ్యక్తం కావాలి. అప్పుడే కంప్యూటర్ కన్నా నీ ద్వారా ఎక్కువ మేలు జరుగుతుంది. దానికన్నా నీవే ఆకర్షణా, కేంద్రమవుతావు.

ఇంతకీ, నేను చెప్పొచ్చేం దేమిటంటే,

మన మెదడులో నిలువయున్న విషయాలకి అనుగుణంగా మనమూ ప్రవర్తిస్తే మనమూ కంప్యూటరే అవుతాము. దానిలాగే మనమూ అమ్ముడుపోతాము. వైరస్‌కి కూడా గురి అవుతాము. కంప్యూటర్‌ది వాడుకలో వేడుక. నీది వేడుకలో వాడుక.

మన అభిరుచులకు, అవసరాలకు, అలవాట్లకు అనుగుణంగా ఆలోచించడం మనకు తెలుసు. ఇది కంప్యూటర్ విధానం. ఈ పని చేయడానికి మెదడు సరిపోవచ్చు. బుద్ధి అవసరమేమిటి? ఇతరుల అవసరాలను, అభిరుచులను, ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని ఆ మార్గంలో కూడా మన ఆలోచనల్ని కదిపినపుడే బుద్ధి ఉన్నందుకు సార్థకత.

నేను ఆలోచించినట్లు ఇతరులు ఆలోచించాలి అని కాకుండా ఇతరుల దృక్కోణం నుండి కూడా నా ఆలోచనల్ని కదిపే ప్రయత్నం నేను సాగించాలి. ఇతరుల స్పందనలకు నా స్పందన తోడై ఆలోచించాలి. ఇతరుల అవసరాలలో నా ఆసక్తి ఇమిడిపోవాలి. అప్పుడు తాత్కాలికంగా మనం మరొకరిలో చేరిపోతాము. తద్వారా మనవల్ల ఇతరులు ఇబ్బందికి గురికారు. పైగా మన సిబ్బందిగా మిగులుతారు. మనకు కూడా ఎంతో తృప్తి ఉంటుంది.

ఒక్క సత్యాన్ని కష్టపడి అయినా అర్థం చేసుకోవాలి. ఇతరుల ఆలోచనలతో కలిసి కొంతసేపు ఆలోచించడానికి మించిన సేవ ఈ ప్రపంచంలో మరొకటి లేదు. దీనిని అంగీకరించటానికి అనుభవ మొక్కటే సరిపోదు. సౌజన్యంతో కూడిన జీవితం కావాలి.

అదొక్కటి లేని కారణంగా ఇంతవరకు మానవ సమాజంలో ఎంతో మారణహోమం, దారుణపాపం జరిగిపోయింది. ఎందరు దంపతులు విడిపోయారు? అన్నదమ్ములెందరు విడిపోయారు? ఎందరి స్నేహం బుగ్గిపాలైంది? ఎందరి రక్తం ఏరులై పారింది? ఎన్ని దగాలు! ఎన్ని మోసాలు! ఎన్ని మాయలు! ఎన్ని ద్రోహాలు! - ఇవన్నీ దేని ఫలితం? ఒకరి ఆలోచనలతో కలిసి మరొకరు ఆలోచించలేని దౌర్బల్యం యొక్క ఫలితం. పాప ఫలితం.

మనం కంప్యూటర్ కాదు. మెదడు కాదు. మనస్సున్న మనుష్యులం. పదిమందితో కలిసి జీవిస్తున్న మనుష్యులం. సభ్య సమాజంలో కదులుతున్నవాళ్ళం. ఇతరులను కష్టాల్లో, కన్నీటిలో ముంచి మనం సుఖాల్లో, పన్నీటిలో తేలి ఆడలేము.

అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ

"సర్వభూతముల యందు ద్వేషము లేనివాడు, మిత్రత్వము కలిగినవాడు భక్తుడు" అన్నాడు గీతలో భగవానుడు.

అనడమే కాదు. చేసి చూపాడు. ఆదర్శంగా శోభించాడు. పాండవులు, విదురుడు, ద్రౌపది, కుచేలుడు - వీరందరూ బాధల్లో ఉన్నవారే. బాధాపూరితమైన ఆలోచనల్ని కదిలించినవారే. శ్రీకృష్ణుడు వాళ్ళ ఆలోచనలతో కలిసి ఆలోచించాడు. ఆ విధంగా వారిని ఆపదలనుండి కాపాడాడు.

ఎవరి ఆలోచనలతో దుర్యోధనుడు శ్రుతి కలిపాడు? ఒక్క క్షణం ఆలోచించండి. భీష్మద్రోణాదుల పవిత్ర సంకల్పాలతో విభేదించాడు. కన్న తల్లిదండ్రుల ఆలోచనలతో కూడా ఏనాడూ ఏకం కాలేదు. ఫలితం? తానొక్కడే ఏకాకిగా మిగిలిపోయాడు. అపకీర్తితో రాలిపోయాడు.

ఇతరుల ఆలోచనలకు మనము తల ఒగ్గాలి అనేది నా అభిమతం కాదు. ఒకరి భావాలకు మనం బానిసలం కానవసరం లేదు. కాకూడదు కూడా. కాని, ఇతరులతో కలిసి జీవించేటప్పుడు వారి ఆలోచనలెలా ఉన్నవో కొంతకాలం కలిసి నడిస్తేగాని అర్థం కాదు. ఈ విధమైన ఆలోచనా విధానం వల్ల ఇతరులకు మనవల్ల అన్యాయం జరుగదు. కనుక మనకు పాపం అంటదు.

అంతేగాదు. అలా ఆలోచించటము వలన ఇతరుల యదార్థస్థితి మనకు తెలుస్తుంది. తద్వారా మన ప్రవర్తన ఋజుమార్గంలో పయనిస్తుంది. వారికి మనద్వారా మంచి జరుగవచ్చు. ఈ కారణంగా మనకు పుణ్యం ప్రాప్తిస్తుంది.

ఇవన్నీ ఎలా ఉన్నా, నాతో కలిసి ఆలోచించే మిత్రుడు నాకు లభించాడు అని ఒక్కరు మన వలన తృప్తి చెందగలిగినా మన జన్మ ధన్యమైనట్లే. ఇది అత్యుత్తమ సేవయని నా అభిప్రాయము. అగ్రశ్రేణి సేవయని నా ప్రగాఢ విశ్వాసము. మీరూ ఆలోచించండి.

లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు



సాధు జీవనం

ఇందులో...



ఆచార్య సన్నిధి

దారి దప్పిన వాళ్ళమే ఉన్నాం ఈ ప్రపంచ రహదారిలో.

చిరునామాలు పోగొట్టుకున్న వాళ్ళమే తిరుగుతున్నాం ఈ జగత్తులో.

పోగొట్టుకున్నది తిరిగి పొందేందుకు తిరుగుతున్నాం.

దూరమైన ప్రేమికుని చేరేందుకు తిప్పలు పడుతున్నాం.

దివ్య ప్రేమను అందుకొనేందుకు ఆరాటపడుతున్నాం.

అది లేనిదే బ్రతకలేము అని తెలుసుకొని మరీ అన్వేషిస్తున్నాం.

పొందాలని ఉన్నాం.

ఎలా పొందాలో తెలియకుండా ఉన్నాం. ఇది అజ్ఞానం.

అజ్ఞానం ఆవరించిన మనస్సుకు ఏది సత్యమో, ఏదసత్యమో తెలియదు. తెలిసిరాదు.

ఉన్నది అర్థం కానపుడు మిగిలున్నదంతా దిగులే. దుఃఖమే. చీకటే.

చీకట్లు అలుముకున్నప్పుడు ఉన్నదేమిటో. లేనిదేమిటో కూడా అర్థం కాదు.

తెలియని వారికి తెలిసిన వారు చెబితేనే తెలుస్తుంది. మరొక మార్గం లేదు.

అజ్ఞాన చీకట్లు జ్ఞానజ్యోతి ద్వారానే అదృశ్యమవుతాయి. జ్ఞానజ్యోతిని వెలిగించటం గురువుకే సాధ్యం.

సంసార తుఫానులో చిక్కుకొని జనన మరణాల ఊబిలో కూరుకుపోతున్న వారిని గురువు తప్ప మరొకరు రక్షించలేరు.

అజ్ఞానమనేది ఒక విచిత్రమైన చత్వారము. చత్వారము ఆవరించిన నేత్రాలకు ఉన్నది ఉన్నట్లు తెలియకపోగా లేనిది ఉన్నట్లు తెలుస్తూ ఉంటుంది.

అజ్ఞాన చత్వారమును జ్ఞానమనే కాటుకే పోగొడుతుంది. ఆ కాటుక గురుదేవుని కృపయే గాని మరొకటి కాదు.

దారి తప్పిన బాటసారికి దిక్సూచి లాగా, మార్గాన్ని పోగొట్టుకున్న జీవికి దారి చూపించి, దరి చేర్చేవారు గురువులు. జ్ఞాన మార్గంలో ఆశాజ్యోతులు.

గుకార శ్చాంధకారో హి రుకార స్తేజ రుచ్యతే
అజ్ఞాన గ్రాసకం బ్రహ్మ గురురేవ న సంశయః ॥

'గు' అనగా తిమిరము. 'రు' అనగా తేజము. కనుక గురువు ఎవరో కాదు. అజ్ఞానమును అమాంతం మ్రింగునట్టి పరబ్రహ్మమే. ఈ విషయంలో సందేహము లేదు.

పాదముద్రలు

కాల్చితే కాంతినిచ్చి, అర్పితే కమ్మని వాసన నిచ్చే కర్పూరంలా ఎందరు శోభించగలరు? వాడడం తథ్యమని తెలిసి, పరమాత్మ అడుగుల కడ పడి, ఓటమిని దాటిన పువ్వులా ఎందరు జీవించి తరించగలరు?

సూర్యుని తాపాన్ని భరించి అవనిని వెన్నెలతో చల్లబరచే జాబిల్లిలా ఎందరు జీవించగలరు?

"నాది కాకపోయినా, నాకు లేకపోయినా, పువ్వుల సుగంధాన్ని మోసికొని వచ్చి ముక్కులకు మొక్కు దీర్చుతాను" అనే గాలిలా ఎవరు సంచరించగలరు?

ఎవరు అలా చరించినా, సంచరించినా వారందరూ మహాత్ములే. మహికి ఆత్మలే.

శాన్తా మహాన్తో నివసన్తి సన్తో వసంతవ ల్లోకహితం చరన్తః

"శాంతులు మహాంతులు అయిన సంత్ పురుషులు వసంతఋతువులాగ లోకానికి హితం చేస్తూ చరిస్తారు" అంటారు శ్రీ శంకర భగవచ్చరణులు.

ఆహా!..... ఆమనికి, ఆ మునికి ఎంత చక్కని పోలిక?

"వసంతం" ఆగమనంతో చెట్లు ఫలపుష్పాలతో నిండి శోభిస్తాయి. భూమాత పచ్చని చీరను ధరించినట్లు తృణపూర్ణమై శోభిస్తుంది. ఆకాశం వినిర్మలంగా ప్రకాశిస్తుంది. పండువెన్నెలతో చందమామ చల్లగా వెలుగుతాడు.

ఆమని అరుదెంచి అవనిని నిత్యవెలుగులతో అలంకరించి, పచ్చతోరణాలను ఆవిష్కరిస్తుంది. ఇవన్నీ ఫలితాలాశించని మహోత్తమ కార్యాలు.

తాను శోభిస్తూ, సర్వులకు శోభనిచ్చే ఆమని

తాను తరించి, అన్యులను ఉద్ధరించే ఓ ముని....... ఇరువురు నిజానికి, నిర్మల రూపాలు. నిరాశ్రయ స్వరూపాలు. దివ్యజీవన ప్రకాశాలు.

ఆమనికి ఎవరు పంపారు ఆహ్వానం?

సంతులకు ఎవరు పలికింది స్వాగతం?

'అడిగితే గాని అమ్మయినా పెట్టదు......అప్పయినా పుట్టదు' అనేది అందరెరిగిన మాట.

అడగకపోయినా ఆకలి తీర్చేవారు మహాత్ములు.

అహేతునాఽన్యానపి తారయన్తః

తాము తరించడమే కాకుండా కారణం లేకుండా ఇతరులను కూడా తరింప చేస్తారు. మూల్యాన్ని ఆశించకుండా అమూల్యమైన వైభవాన్ని జనుల హృదయాలలో దింపుతారు. నింపుతారు. దరి తెలియక, దిక్కు తోచక శోకమోహాదులలో మునిగి పోయిన అర్జునుడికి గీతామృతాన్ని ప్రసాదించి తరింపచేశాడు శ్రీకృష్ణుడు.

ఈత తెలిసినవాడు మునిగిపోతున్న వ్యక్తిని ఫలాపేక్ష లేకుండా రక్షిస్తాడు. శ్రీకృష్ణుడు అదే చేశాడు.

స్వప్రయోజనా భావేఽ పి భూతానుజిఘృక్షయా వైదికం హి ధర్మద్వయం
అర్జునాయ శోకమోహ మహోదధౌ నిమగ్నాయ ఉపదిదేశ

"తనకు స్వప్రయోజనము ఏదీ లేకున్నను సర్వులను ఉద్ధరించుట కొరకు శోకమోహాదులలో కూరుకుపోయిన అర్జునునికి ద్వివిధములైన (ప్రవృత్తి, నివృత్తి) వేద ధర్మమును బోధించాడు" అని శ్రీకృష్ణ పరమాత్మ దివ్యమైన ఔదార్యాన్ని గీతాభాష్యంలో పరవశించి పలికారు శ్రీ శంకరాచార్య స్వామి.

అటువంటి మహనీయుల ఉనికియే మనకొక ఉజ్జ్వల సందేశము. ఆపద నెరుగని సంపద.

పదుగురు నడిచిందే బాట అవుతుంది. సత్పురుషులు చరించినదే సన్మార్గ మవుతుంది. ముందు నడిచిన వారి పాదముద్రలను దర్శిస్తూ సాగిపో. నీ బాట ఇతరులకు ఆదర్శంగా నిలుపుతూ ముందుకు సాగిపో.

జీవనచక్రము వడివడిగా సాగిపోతున్నది. ఛిద్రమైన నడకకు స్వస్తి చెప్పు. రుద్రభూమిలో కాలిడక ముందే భద్ర జీవితమును ఆవిష్కరించుకో. నిద్రలో కురికి వచ్చిన పనిని మరచిపోకు.

బాట సున్నితమ్ముగా ఉంది. సునాయాసంగా సాగడము అలవరచుకో. బండి బాగానే ఉంది. సందడి తగ్గించుకో. అంగలార్చే సంసార అంగడిని ముందుంచుకోకు. గమ్యమును చూస్తూ నడక సాగించు. ముందుచూపు గలిగి అందముగా సాగిపో.

సాధకా! సాగిపో......మెల్లగా సాగిపో.

ప్రతి మనిషికి అప్పుడప్పుడు తృప్తి కలుగుతూ ఉంటుంది. ఎప్పుడూ తృప్తి గలవాడు సాధువు. తన తృప్తి ప్రపంచంపై ఆధారపడింది కాదు. కాలానికి పరిమితమైనదీ కాదు. తనకు బలము భగవంతుడే. కనుకనే అతడు సుకృతి. **సుకృతీ పుణ్యవాన్ ధన్యః** అని అమరము. సుకృతి యనగా పుణ్యాత్ముడు లేదా ధన్యుడు అని భావము.

మట్టిలో మాణిక్యాలు

మట్టిలోనే మాణిక్యాలు. మహిలోనే మహాత్ములు. దేహం ఆభరణాలతో ఎంతగా శోభిస్తుందో చెప్పలేము. కాని, దేశం మహాత్ములతో కళకళలాడుతుంది. ప్రవేశించిన వారికి మాత్రమే పవిత్రతను, ప్రశాంతతను అందిస్తాయి మందిరాలు, ఆలయాలు. చల్లని గాలిలాగా పవిత్రులై చరిస్తూ, సర్వులకు పవిత్ర జ్ఞానాన్ని, ప్రసన్న చిత్తాన్ని ప్రసాదిస్తారు జాలిగుండె గల మహాత్ములు, ఆచార్యులు. అందుకనే, సాధువులను చరించే దేవాలయాలుగా భావించింది మన పుణ్యసంస్కృతి.

గురువులు శాస్త్రాన్ని అందిస్తారు అనేది అందరికీ తెలుసు. గురువుల జీవితాలు శాస్త్రంకన్నా భిన్నం కాదని ఎందరికి తెలుసు? వాళ్ళ మాటలే మంత్రాలు, వాళ్ళ కర్మలే పూజలు అనే సత్యాన్ని ఎందరు జీర్ణించుకోగలరు? వారి చూపుల్లో ధ్యానమూర్తి అయిన శివుని, వారి నడకలో నడయాడే నారాయణమూర్తిని ఎందరు దర్శించగలరు?

భూదేవి ఒక గాడిలోనే పరిభ్రమిస్తుంది. సూర్యుడు తత్సంబంధిత కోణాల్లోనే ప్రకాశిస్తాడు. గాలిని పట్టాలపై నిలబెట్టి నడపటం ఎవరికి సాధ్యం? గాలిలా పవిత్రులై చరించే మహాత్ములకు విధి నిషేధాలను నిర్ణయించగలిగేవారు ఎవరు? ఆ పనికి వేదమాతే సాహసించలేకపోయింది. జలప్రవాహము అలా సాగట మేమిటి? అని ప్రశ్నించేవారు బద్ధులు. పవిత్రమైన ఆ నదీజలాలలో స్నానాదు లాచరించి చల్లబడేవారి బుద్ధులే బుద్ధులు. అట్టి సద్బుద్ధులు గలవారే సుద్దులెరిగిన తద్బుద్ధులు. తదాత్ములు. తన్నిష్ఠులు. తత్పరాయణులు.

తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః
గచ్ఛ న్త్యపునరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః

"బ్రహ్మము నందే బుద్ధిగలవారు, ఆత్మ పరమాత్మయేనని తెలిసినవారు, బ్రహ్మము నందే నిష్ఠ గలవారు, పరమాత్మే పరమగతియని ఎరిగినవారు జ్ఞానము చేత పాపమును నశింపచేసుకొన్నవారై యున్నారు. తిరుగులేని ముక్తి ధామాన్ని చేరుతున్నారు" అని గీతాచార్యుని ప్రబోధము.

గొప్ప సంగీత విద్వాంసుడు గానాలాపనలో శృతి తప్పలేడు. గొప్ప భాషావేత్త వ్యాకరణ దోషాలకు గురికాలేడు. సాధు జీవనంలో అపశ్రుతులు అనూహ్యం. మహాత్ములు పొందవలసింది ఏదీ ఉండదు. కనుక, వారు లాభం తెలియనివారు. ఏది లభించినా వారికి మిగిలేది సంతృప్తే.

యదృచ్ఛాలాభ సంతుష్టః

"అయాచితంగా లభించే దానితో తృప్తి చెందువాడు" కనుక ఏ కర్మ కూడా మహాత్ముని బంధించలేదు అని గీతలో భగవద్వాణి.

లాభమే కాదు; మహాత్ములకు నష్టం కూడా తెలియదు. వారు పోగొట్టుకొనేది కూడా ఏదీ ఉండదు. లాభనష్టాల బరువులు తెలియని వారి బ్రతుకులు ఎంత తేలికగా

ఉంటాయో! అందుకనే వారు ఆనందంలో తేలిపోతూ ఉంటారు. పరమానందంలో తూలిపోతూ ఉంటారు.

మహాత్ములు నోరు తెరిస్తే చాలు; లోకం మాణిక్యాలు ఏరుకుంటుంది. వారి చల్లని చూపుల్లో సమాజం అమృత స్నానం చేస్తుంది. మహాత్ములు ప్రార్థిస్తే, ప్రపంచం శాంతి గాలుల్ని పీల్చుకుంటుంది.

వారి సన్నిధిలో క్రౌర్యాలు కరుణలవుతాయి. అసూయలు ఆప్యాయతలుగా మారుతాయి. అహంకారాలు అవగాహనల్ని ఆదరిస్తాయి. భయాలు అభయాలుగా మారుతాయి. పరుసవేది లోహాన్ని మాత్రమే బంగారం చేస్తుంది. పరమహంసలు బండ బ్రతుకుల్ని సయితం భవ్యంగా, బంగారంగా తీర్చిదిద్దుతారు. మహాత్ముల ముఖపద్మాలలో చతుర్ముఖుడు ఆసీనుడై దర్శనమిస్తాడు. చతుర్వేదాలు వెలుగుల్ని విరజిమ్ముతూ ఉంటాయి. వారి ముఖ కమలాలలో సృష్టినంతా చదువుకోవచ్చు. వారి పలుకుల్లో సంగీత సాహిత్య సౌరభాలతో సరస్వతీ దేవి సాక్షాత్కరిస్తుంది.

మహాత్ముల హృదయాలు ఎక్కడికీ వెళ్ళవు. తమను సమీపించిన వారి కొరకు తెరుచుకొనే ఉంటాయి. ఆకాశమనే గుడిలో దివ్యమూర్తులై శోభించే మహాత్ముల్ని ప్రకృతి సదా పరవశించి పూజిస్తూ ఉంటుంది. తన భాగ్యానికి పులకరిస్తూ ఉంటుంది.

మహాత్ములను తమ పంజరాలలో బంధించాలని సంకల్పించిన పార్థివ దేహాలు విఫల యత్నంతో వారి వైభవాలను విరజిమ్మే పవిత్ర కాంతి పుంజాలుగా మిగిలిపోయాయి. వారిని బలంగా బంధించాలని సాహసించిన కోరికలు శక్తులుడిగి కరిగిపోయాయి. పాదాలను కడిగేందుకు జలాలుగా మారాయి.

వెలుగుల వగలను ఎంతగా ఆరబోసినా పగలును మ్రింగేందుకు సాయంత్రం సిద్ధంగా ఉంది. మహాత్ముల జ్ఞాన వెలుగుకు అస్తమయమే అర్థం కాదు. ఆ తేజాన్ని హరించేందుకు ఏ తిమిరమూ సిద్ధంగా లేదు. అంతేకాదు; అభయమూర్తులే అయినా, ఎందుకనో వారి రాక నెరిగి భయంతో చీకట్లు దౌడు తీస్తున్నాయి.

అల్లరికి అలవాటుపడిన మనో శిశువు వారి హృదయ ఊయలలో ప్రశాంతంగా ఆదమరచి నిద్రిస్తుంది. మేలుకోగానే, సరోవర జలాల్లో చేపలు చలించినట్లు, సంకల్ప మత్స్యాలు చిత్తంలో చల్లగా, హాయిగా చలిస్తూ ఉంటాయి. అవి అలా అలా సందడుల అలల మధ్య అందంగా కదులుతూ ఉంటే, ఎందరెందరో ఆనందంతో, ఆశ్చర్యంతో అనుభూతుల ఆకాశవీధుల్లో రెక్కలు లేకుండా విహరిస్తారు.

పెట్టుబడి తెలియని ఆ అంగడిలో అందరూ ఖాతాదారులే. అందరూ వాటాదారులే. ఆ దివ్య ధామానికి అన్నీ రహదారులే. ఆ మహాసాగరాన్ని చేరేందుకు పుణ్యాత్ములందరు ప్రవహించే ఏరులే.

సముద్రాన్ని చేరితేనే నదులకు శాంతి.
మహాత్ములను ఆశ్రయిస్తేనే మనుషులకు కాంతి.

సర్వేజనాః సుఖినో భవన్తు

సాధువు

పవిత్రమైన మన హిందూ సంస్కృతిలో సాధువు గోవులాంటివాడు. ఇది అందరి భావన. కానీ వాస్తవానికి సాధువు గోవు లాంటివాడు కాదు, గోవత్సము లాంటివాడు. ఇది నా అభిప్రాయం. అంటే లేగదూడ. తల్లిఆవును వెతుక్కునే లేగదూడ.

సాధువుకు ఇల్లు ఉండదు. అంటే ఇల్లు లేనివాడని కాదు. ఉన్న ఇల్లును వదులుకున్నవాడని అర్థం. సర్వబంధాలను త్రెంచుకున్నవాడని అర్థం. తన బ్రతుకును, తన భావాలను తన వాళ్ళు అనుకునే వారికి ధారపోయడానికి ఇష్టపడనివాడు అని అర్థం. కుండలో ఒక సమయంలో నీళ్ళు ఉండవచ్చు. ఇంకొక సమయంలో మజ్జిగ ఉండవచ్చు. వేరొక సమయంలో బెల్లం ఉండవచ్చు. మరొక సమయంలో సున్నం ఉండవచ్చు. కానీ, కుండకు ఆకాశంతో ఉండేది నిత్య సంబంధం. నీళ్ళతో, మజ్జిగతో, బెల్లంతో, సున్నంతో ఉండేది అనిత్య సంబంధం.

ఇది క్షుణ్ణంగా తెలిసినవాడు సాధువు. తాను ఎక్కడ పుట్టాడో, ఎవరికి పుట్టాడో ఆ సంబంధాలన్నీ కుండకు నీళ్ళతో ఉన్న సంబంధం లాంటివి అని తెలిసి రక్త సంబంధాలకు నీళ్ళు వదిలేసినవాడు సాధువు. ఏదో ఒక క్షణాన మనసును చల్లబరచే స్నేహితులు కుండను చల్లబరచే మజ్జిగలాంటివారే గాని ఎప్పుడూ ఉండేవారు కాదనే సత్యాన్ని బాగా ఎరిగినవాడు సాధువు. తీపిని జీవితంలో అందించే భార్య లేదా భర్తతో ఉండే సంబంధం కూడా బెల్లంతో కుండకు ఉండే సంబంధమే. బెల్లం యొక్క తియ్యదనం కుండకు ఏ మాత్రమో జీవితంలో భార్య లేదా భర్త అందించే తియ్యదనం కూడా అంతేనని బాగా తెలుసుకున్నవాడు సాధువు. కారంతో, అహంకారంతో విర్రవీగే సమాజంతో తనకున్న సంబంధం సున్నంలాగ ఘాటైన అనుభవమేనని బాగా తెలుసుకున్నవాడు సాధువు. కుండ తయారు కాకముందు, తయారైన తరువాత, పగిలిన తరువాత కూడా అది ఉండేది ఆకాశంలోనే. కుండలో ఒకొక్కప్పుడు ఒకొక్క వస్తువు ఉండవచ్చునేమో గాని, ఏది ఉండినా ఏది లేకపోయినా ఎప్పుడూ ఉండేది ఆకాశమేనని, ఈ నిత్య సంబంధాన్ని క్షుణ్ణంగా గుర్తించినవాడు సాధువు కనుక అనిత్య సంబంధాల్ని మనసులోనుంచి అతి తేలికగా నెట్టేయగలడు. అందుకే సాధుదర్శనం పుణ్యం అంటాము మన సంస్కృతిలో.


కానీ, ఇన్నిటిని త్యజించిన సాధువు దేహాన్ని, ఆకలిని (అవి అనిత్యమే అయినా) త్యజించలేడు. పక్షికి ఎలాగైతే తలదాచుకునేందుకు గూడు అవసరమో శీతోష్ణాల నుండి తనను తాను కాపాడుకొనేందుకు సాధువుకు కూడా ఇల్లు అవసరం. అన్నిటిని, అందరిని వదులుకున్నవాడు కనుక, ఆకలి వేస్తే ఎవరైనా అంత కబళం పెడితే వాళ్ళు తిడుతూ పెట్టినా, పెట్టి తిట్టినా, లేక తిట్లే పెట్టినా వాటిని అట్లులాగా, పెసరట్లు లాగా ప్రియంగా స్వీకరించేందుకు వెనుకాడనివాడు సాధువు. అందరినీ త్యజించి వచ్చిన తనకు పట్టెడన్నం పెట్టే సమాజంతో తనకు మిగిలి ఉండేది మంచితనం, మిత్రత్వం. ఒకవేళ సమాజం తనకు అన్నం పెట్టకపోయినా సాధువు చేయగలిగింది ఏమీ లేదు. పట్టెడన్నం పెట్టి


తలదాచుకునేందుకు గూడు నిచ్చి, ఆ మాత్రం తనను కాపాడిన సమాజానికి తిరిగి మేలు చేయకుండా సాధువు ఉండలేడు. అందరిని వదిలిన సాధువుకి ఇక్కడ సమాజంతో ఒక సంబంధం ఏర్పడిపోయింది. మరి ఈ సమాజ ఋణం తీరేదెట్లా? ఋణం తీరకుంటే జన్మ తప్పదు. తనకు అన్నం పెట్టి పోషించిన సమాజ ఋణాన్ని, జ్ఞానాన్ని ప్రశాంతతను ప్రసాదించిన ఋషి ఋణాన్ని తీర్చుకోవాలి అని భావించిన సాధువు యొక్క జీవితం ఇక్కడే ఒక అందమైన మలుపు తిరుగుతుంది.


ఒక స్వచ్ఛమైన, నిర్మలమైన, పుణ్య నదీ ప్రవాహం పిల్లకాలువల్ని నిరసించలేదు. బురద నీటిని నిరాకరించలేదు. ఫ్యాక్టరీ కాలుష్యాన్ని కాదనలేదు. బట్టలు ఉతికే వారిని వారించలేదు. మలమూత్రాలు విసర్జిస్తూ స్నానాలు చేసేవారిని 'నేను పానయోగ్యమైన పుణ్య తీర్థాన్ని' అని నివారించలేదు. కలిసేవాటిని కలుపుకుంటూ, ఇష్టాయిష్టాల్ని ప్రక్కకి నెట్టి, ధర్మాధర్మాల బాటలో ప్రవహించేదే జీవనది. సాధువు నిర్మలమైన ఒక పుణ్యనది లాంటివాడు. తృప్తితో పొంగేటటు వంటి ఆంతరంగిక ఆనందం ఒకవైపు, అలా పొంగే హృదయాన్ని కృంగదీసే బాహ్య పరిస్థితులు మరొకవైపు, వీటి మధ్య మంచి చెడులను కలుపుకుంటూ నది ఎలాగైతే సాగిపోతూ ఉంటుందో అలా నడక సాగించేవాడు సాధువు. కడలిని చేరేంత వరకు నది కదిలిపోతూనే ఉంటుంది. తన గమ్యమైన మోక్షపదాన్ని చేరేంతవరకు సాధువు నడక సాగిస్తూనే ఉంటాడు . ఎవరికి ఏమిచ్చాడో భగవంతుడు తెలియదుగాని, ఎవరినీ నిరసించలేనటువంటి అశక్తతను మాత్రం సాధువుకు భగవంతుడే ఇచ్చాడు. అది అదృష్టమో దురదృష్టమో, వరమో, శాపమో ఊహకు అందదు కానీ భగవంతుడు ఇచ్చాడు కనుక అది ప్రసాదమే. ఎక్కడైనా సాధువు ఏ బాధలకైనా గురి అయితే దానికి ఇదే కారణమై ఉంటుంది అనేది నా వ్యక్తిగతమైన అభిప్రాయం. సాధు జీవితంలో కష్టాలు ఎప్పుడూ ఉండవు, కొనితెచ్చుకుంటే తప్ప. బాధలు కొనితెచ్చు కోవడమనేది సాధువుకు ప్రత్యేకంగా భగవంతుడే ప్రసాదించిన హృదయ సౌందర్యమేమో!


తన ఆత్మనే అంతటా దర్శించే గురువుకి ఇతరులను ప్రేమించడం సాధారణమైన విషయము. గురువు తనపై చూపే అపారప్రేమకు తన అర్హతే కారణమని, తన ధనము కారణ మని, హోదా కారణమని భావించడం శిష్యుని అయోగ్యతకు ప్రతిరూపము. ఒకవిధంగా చెబితే అది అతని దుర దృష్టము.

ఇతరుల అవసరం తనకు ఉందని భావించేవాడు ఎన్నడూ గురువు కాలేడు. ఆత్మజ్ఞానములో అవసరాలు లేవు; అభిరుచులు ఉండవు. ఈ సత్యము సామాన్యుల స్థాయికి దిగదు. భయశోకాదులు ఆత్మజ్ఞానంలో అనూహ్యములు. ఆత్మజ్ఞానియైన గురువు విషయంలో అసంగతములు.









ఆశాజ్యోతులు

తాము పొందవలసింది ఏదీ లేకపోయినా ప్రపంచానికి ఏదో కొంత మేలు జరుగుతుందని మహాత్ములు అహర్నిశలు శ్రమిస్తారు. ఒకవేళ జరిగితే ఆ మేలు సమాజానికే గాని తమకు కాదు. ఒకవేళ జరగకపోతే, తమకంటూ ఆశించింది ఏదీ లేదు కనుక నిరాశ చెందే ప్రసక్తి కూడా ఉండదు.

వారిదొక నిస్వార్థ ఉద్యమం. నిర్మల గంగాప్రవాహం వంటి మహోద్యమం. ధైర్యంతో కూడిన ప్రశాంత పవిత్రోద్యమం. పేరు ప్రఖ్యాతుల నాశించని ప్రచారోద్యమం.

Calm, silent and steady work, no news paper humbug, no name-making, you must remember.

"ప్రశాంతత, మౌనం, నిశ్చలమైన కార్యం సాగిపోవాలి. వార్తాపత్రికల గారడి తెలియని, పేరు కొరకు ఆరాటం లేని కార్యాలు జరగాలి. జ్ఞాపకం పెట్టుకోండి" అన్నారు స్వామి వివేకానంద.

సమాజానికి అందరూ సేవ చేయలేరు. ఉద్యమాలు అందరూ నిర్వహించలేరు. సేవ చేయాలంటే చెరువులో నీరు నిండి యున్నట్లు హృదయంలో ప్రేమ నిండి యుండాలి. ఉద్యమాలు నిర్వహించాలంటే ప్రేమ, త్యాగం, సానుభూతి ఉండాలి.

శ్రీకృష్ణుని పలుకుల వెనుక దాగి యున్న ఆశయం ఇదే. బుద్ధుని ప్రచార కార్యక్రమంలో కేంద్ర వస్తువు ఇదే. శంకరాచార్యుల వారి మహోద్యమంలో ఆరని జ్యోతి ఇదే. అందుకే వారి కార్యాలన్నీ చిరంజీవత్వాన్ని సంతరించుకున్నాయి. మరణిస్తున్న జాతికి ఊపిరి పోశాయి. గుండెలకు బలాన్నిచ్చాయి. తలలపైనున్న భారాన్ని దించాయి. నూతనోత్తేజంతో ముందుకు దూసుకుపోయేలా చేశాయి. గానుగెద్దుల్లాగా పరిభ్రమించే జీవనానికి ముగింపు పలికించాయి.

ప్రయాణంలో ధూళి అంటకపోదు. ధూళి అంటడం తప్పు కాదు. దులపక పోవడం తప్పు. అనంత జీవనయాత్రలో మనమంతా బాటసారులం. ధూళి చేరుతూ వుంది. అనేక జన్మల నుండి తెరలు పొరలుగా చేరిపోతూ ఉంది.

అలాగని నీరసపడకూడదు. దుమ్ము చేరినంత మాత్రాన దర్పణం పాడుగాలేదు. దుమ్మును దులిపితే చాలు. మరుక్షణంలోనే దర్పణం వస్తువును ప్రతిబింబింప చేస్తుంది. దర్శనం ప్రాప్తిస్తుంది.

దులపడం సేవ....... దర్శనం ధ్యానం.

కీర్తనాచార్యులు

చల్లని వెన్నెలను కురిపిస్తూ పుడమిని శాంతపరచే జాబిలి,
తాము మండుతున్నా ఆశ్రయించిన వారికి నీడనిచ్చే తరువులు,
కాచే వెన్నెల విడిది చేసేందుకు మల్లెల చాపను పరచిన వసంతం,
మిన్నును మన్నుతో కలిపి తాపజగతికి చలువలు పంచేందుకు కరిగిన మేఘమాల,
గాలి, నీరు, మబ్బు, మెరుపు,
మెత్తని ఇసుక, చల్లని కడలి,
వెదురు వేణువులు, వీణ తంత్రులు,
నిర్మల ప్రేమకు నిజ దర్పణాలు.

యథా వృక్షస్య సంపుష్పితస్య దూరా ద్గంధో వాతి
ఏవం పుణ్యస్య కర్మణో దురాద్గంధో వాతి

విరబూసిన చెట్లు వెదజల్లే పరిమళం ఎంతో దూరం పయనించి ఎందరికో ఆనందాన్ని పంచుతుంది. పుణ్యాత్ముల పవిత్ర కర్మల ప్రభావం హద్దులు లేకుండా పయనించి లోకాన్ని కాంతిమయం చేస్తుంది. శాంతిమయం చేస్తుంది.

పవిత్ర హృదయులైన పుణ్యాత్ములు, మహాత్ములు విడిచిన గాలితో పునీతమైన భారతావని పుణ్యభూమి; యోగభూమి; జ్ఞానభూమి; కర్మభూమి.

అత్రాపి భారతం శ్రేష్ఠం జంబూద్వీపే మహామునే
యతో హి కర్మభూరేషా హ్యతోన్యా భోగ భూమయః ॥

భారతావని ఒక్కటే కర్మభూమి యని, అన్యములు భోగభూములని విష్ణు పురాణం వినిపించిన వాస్తవం.

భారతీయ పుణ్య సంస్కృతి పురాతనం; చిరంతనం. **'వసుధైవ కుటుంబకం'** అనే సత్యాన్ని ధ్రుమించింది, త్రేపింది ఈ సంస్కృతే.

గ్రీకు, రోము దేశాల ప్రభావం వెలుగు చూడకముందే, ఈజిప్టు, బాబిలోనియా ప్రపంచంపై పట్టును సాధించక పూర్వమే, భారతదేశం ఆనంద కిరణాలను విరజిమ్మే లేత సూర్యుని వలె శాంతి ప్రేమలను వెదజల్లుచు విశ్వగగనంలో వెలిసింది. వెలిగింది.

సృష్టి కందని నాటి నుండి మతి కందుతున్న నేటి వరకు మాతృ భారతాన్ని చిన్మయం చేసిన **'చిరంతనానాం'** - మహర్షులకు మహాత్ములకు, సంతులకు మహంతులకు, సాధువులకు సత్పురుషులకు, భక్తులకు భాగవతులకు మనం ఋణపడియున్నాం. సర్వభూతాంతరాత్మను హృదిలో నిలిపి, సర్వ ధర్మ సమానత్వాన్ని ప్రబోధించిన మహాత్ముల మాటలు మనకు శిరోధార్యాలు. ఆ మహితాత్ముల బాటలు మనకు ముక్తి ద్వారాలు.

సనాతన సంప్రదాయంలో మన భాగ్యంగా మనకు సంక్రమించిన జ్ఞాన సంపదను మనం సంరక్షించుకోవాలి. భావ దారిద్ర్యంతో, భౌతిక భోగలాలసతో క్రుంగుతున్న మానవాళికి మంచి బాటను చూపే మార్గదర్శకత్వం మనపైనే ఉంది.

ఆ పని జరగాలంటే మనసులో శని వైదొలగాలి. ముని మానస పుత్రులుగా జీవించినపుడే అది సాధ్యం. మహాత్ములు బోధించిన సదుపదేశాలను జీవితంలో ఆచరించినపుడే అది లభ్యం.

తస్యాః సాధనాని గాయన్త్యాచార్యాః

అన్నారు భక్తిసూత్రాలలో నారద మహర్షి. ఆచార్యులు సాధనలను గానం చేశారట. అవును. వారివి మాటలు కావు. పాటలు. అక్షయ సంపదతో నిండిన మూటలు. నిర్మల భావపూతాలు.

సాధనలు బండలు మోసినట్లు ఉండకూడదు. జలప్రవాహం కదిలినట్లు సాగాలి. మొగ్గలు పువ్వులైనట్లు ఉండాలి. చిరుగాలులు చిమ్మినట్లు ఉండాలి. అందుకే మన మహాత్ములు మంచి మాటల్ని సుగంధభరితంగా పాటల్లోకి మలచి, మంచిగంధం లాంటి భక్తిని మనసులకు పట్టించారు. జీవితాలను భక్తి సౌరభాలతో పరిమళింప చేశారు.

సంత్ పురుషులు భక్తిభావ బంధురమైన తమ గీతాలను అనేక భాషలలో రచించారు. కాని, వాటి భావమంతయు ఒక్కటే. మాధవ నామామృత పానం. ముకుంద స్మరణామృత గానం. గోవింద కీర్తనామృత ధ్యానం. కేశవ ధ్యానామృత స్నానం.

కీర్తనాచార్యు లందరూ సనాతన ధర్మ కల్పవృక్ష ఫలాలే. అచ్యుతానుగ్రహ నందనవనంలో విరబూసిన పారిజాతాలే. పరమాత్మ ప్రతిరూపాలే.

అసూయ అర్థం గానివారు
స్వార్థంతో సరిపడని వారు
క్షమాగుణంతో శోభించేవారు
'ఏమి?' అని లేమిని ప్రశ్నించని వారు
కలిమికి బలిమి నివ్వని వారు
మానావమానాలకు అతీతమైనవారు
నిందాస్తుతులకు కదలనివారు
నిశ్శబ్దాన్ని, నిర్మలత్వాన్ని ప్రేమించేవారు
ప్రేమను అందల మెక్కించినవారు

జ్ఞానాన్ని ఊరేగించినవారు..... వారే మహాత్ములు . . . సాధువులు . . సంత్ పురుషులు.

చేస్తూ చేయని ఆ పవిత్రాత్ములు ఏదీ మన నుండి గ్రహించకుండా ఎన్నో మనకు అనుగ్రహించారు. అది వారి ఔదార్యం... హృదయ సౌందర్యం. అందుకే వారు దాతలు. జ్ఞానప్రదాతలు.

ప్రపంచంలో గొప్ప దాతలైన వారు కూడా మహాత్ములకి దాసులయ్యారు. మిణుకు మిణుకు మంటూ వారిలో ప్రకాశించే దాన గుణము దివ్య శోభలీను మహాత్ముల హృదయ దీపం నుండి వెలిగించుకొన్నదే. అందుకే పరిపాలించే ప్రభువును రాజు అని, పరిరక్షించే పరమహంసను మహారాజు అని పిలుస్తాము. ఇదంతా మనకు సంస్కృతి పంచిన సంపదే.

దేహీతి వచనం కష్టం నాస్తీతి వచనం తథా
దేహి నాస్తీతి యద్వాక్యం మా భూ జ్జన్మని జన్మని ॥

'ఇమ్ము' అని ఒకరి నడుగుట నాకు కష్టము. అలాగే ఎవరైనా అడిగినపుడు 'లేదు, పొమ్మ' అని పలకడం కూడా కష్టమే. కనుక "ఇమ్ము - లేదు పొమ్మ" (దేహి - నాస్తి) అను ఈ రెండు పదాలు నాకు జన్మజన్మలకు లేకుండుగాక! - అని కర్ణుడు శ్రీకృష్ణుని ప్రార్థించి, మహాత్ములు హృదయంలో నాటిన మొక్కకు నీళ్ళు పోశాడు.

మహాదాతలైన మహాత్ములు మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ మహోపదేశాలను గానం చేశారు. అవే కీర్తనలు. అందరూ కరములు జోడించి పరమాత్మకి నమస్కరిస్తే మహాత్ములు కీర్తనలనే కరములుగా చేసుకొని అంజలి నర్పించారు. అందుకే ఆ అర్చన 'కీర్తనాంజలి' అయింది.

వారి కీర్తనలు రాగయుతాలు.అనురాగయుతాలు. భక్తి భావయుతాలు. ప్రేమ దీప్తియుతాలు.

పువ్వులు అందంగా ఉంటాయి. కానీ వివిధ రంగుల పువ్వులు రమణీయంగా మాలలో ముడిపడితే మరీ ఆహ్లాదంగా, మనోహరంగా గోచరిస్తాయి.

కుంద కుంజ మముం పశ్య సరసీరుహలోచనే
అమునా కుంద కుంజేన సఖీ మే కిం ప్రయోజనమ్

"హే కమలలోచనా! ఈ మల్లెతోట (కుందవనము) ఎంత సొంపుగా ఉందో - చూడు" అన్నదట మాయ లెరుగని ఒక గోపిక.

"చాల్లేవే! మహా చెప్పొచ్చావు! 'ము' లేని కుందవనము వల్ల మన కేమి ఉపయోగమే" అన్నదట మర్మ మెరిగిన మరొక గోపిక.

అవును మరి! కుందవనము ముందు 'ము' చేరితే అది ముకుంద వనమవుతుంది. ముక్తి వనమవుతుంది.

శంకర వైభవం

ఒక్కసారి గతంలోకి తొంగి చూస్తే ప్రపంచ చరిత్రలో - పరస్పర విరుద్ధమైన రెండు మహోన్నత వ్యక్తిత్వాలు మన కళ్ళ ముందు నిలుస్తాయి. ఇరువురూ కేవలం తమ 32 సం॥ల జీవితకాలంలో అసాధారణమైన రీతిలో జీవించి, తమ ఆలోచనలతో, ఆచరణతో మానవ జాతిపై చెరుపరాని, చెరిగిపోని ప్రభావముద్రను విడిచి వెళ్ళినవారే. దృఢ సంకల్పం, అసమాన కార్యదీక్ష వారిరువురి సొంతం.

వారిలో......

ఒకరు ప్రపంచ మంతటికి తానే ఏకైక ప్రభువు కావాలన్న తీవ్ర సామ్రాజ్య కాంక్షతో అసమాన శౌర్య పరాక్రమాలను ప్రదర్శించిన చక్రవర్తి. ఇతడి పదవీ వ్యామోహం, కీర్తి దాహముల కారణంగా రక్తం ఏరులై పారింది. ప్రపంచం అల్లకల్లోలమైంది. అతడే మహామహుడు అలెగ్జాండర్. కాగా.....

ఆ రెండవ వ్యక్తియే శ్రీ ఆది శంకరాచార్యుల వారు. పదవుల నెరుగకపోయినా, సంపదలకు నోచుకోకపోయినా, సౌమ్యులై, కల్మష రహితులై, మానవతా విలువలకు మాత్రమే విలువ నిస్తూ మనుగడ సాగించే సదాచారవంతులైన భక్తదంపతులకు భగవదను గ్రహంతో కలిగిన బిడ్డ డీతడు.

ఆచార్యులవారి ఆగమనం జగత్తును జ్ఞాన విజ్ఞానమయ కాంతి పుంజములతో ప్రదీప్తం చేసింది. వారు ప్రపంచం నుంచి నిష్క్రమించి పన్నెండు వందల సంవత్సరాలైనా నేటికీ సర్వులకు అదే జ్ఞానప్రకాశం దారిజూపుతోంది; మానవ జీవన గమ్యం దరిజేర్చుతోంది. తమ మహోన్నత భావ సంపదతో, చైతన్యవంతమైన కార్యదీక్షతో ఆచార్యుల వారు విశ్వ శ్రేయస్సుకై అందించిన సేవలు మరపురానివి; మరువలేనివి. కాల ప్రవాహ తాకిడికి అవి కదలలేవు. చెదిరిపోవు.

ఆచార్యులవారి సునిశిత పరిశీలనా శక్తి, సుతీక్ష్ణమేధా సంపత్తి, ముందుచూపు అద్భుతం, అసమానం.

మూఢాచారాలతో, తప్పుడు వ్యాఖ్యానాలతో సనాతనధర్మ సత్య సందేశాలకు గ్రహణం పట్టిన దుర్దశలో ఆవిర్భవించారు ఆది శంకరులవారు. అశాస్త్రీయ ఆచరణ అందల మెక్కి, ఆస్తికత్వం అడుగంటిన సమాజమది. శూన్యహృదయులైన విద్యావంతులు, కేవలం పుస్తక పరిజ్ఞానంతో విర్రవీగే పండితులు తమ సారహీనమైన తెలివితేటలతో, పసలేని పాండిత్యంతో సామాన్య జనాన్ని తికమకపెట్టి తప్పు త్రోవ పట్టించిన సమయమది.

ఇట్టి విపత్కర పరిస్థితిలో మానవాళిని ఆదుకొనుటకు అరుదెంచారు శంకరాచార్యుల వారు. మన సనాతన సంస్కృతి అందించిన కాలాతీతమైన అక్షయ

భావాలను తాము పునః వ్యాఖ్యానించి అటు పండితులు ఇటు పామరులలో సైతం సదవగాహనను కల్పించి, ఈ సత్య సిద్ధాంతాలను వారు జీర్ణించుకొని తదనుగుణంగా జీవించే సామర్థ్యాన్ని వారికి కలిగించారు శ్రీ శంకరులు. తమ దివ్య ప్రబోధాలతో, అద్భుత రచనలతో సమస్త మానవాళిని అజ్ఞాన నిద్రనుండి మేలుకొలిపారు.

శ్రీ శంకరులవారి రచనలు నిరుపమానములు. అసమాన ధీశక్తి, సుకోమల భావ సౌందర్యముల నుండి పొంగుకొచ్చిన ఆచార్యులవారి సాహిత్యం నిజంగా అద్భుతం. ఒక ప్రక్క వారి ప్రస్థానత్రయ భాష్యములు మన శాస్త్రములలో గహనమై, నిగూఢముగ తెలియవచ్చు సందేశాలను సామాన్యునికి సైతం సుబోధమగు శైలిలో వివరిస్తుండగా మరొక ప్రక్క 'శివానందలహరి', 'శివాపరాధ క్షమాపణ స్తోత్రం', 'లక్ష్మీనృసింహ స్తోత్రం', 'ప్రబోధ సుధాకరం' మరియు జగత్ప్రసిద్ధమైన 'భజగోవిందం' వంటి రచనలు మన హృదయాలను పవిత్ర భావాలతో నింపి, భక్తిప్రేమలలో ఓలలాడునట్లు చేస్తాయి.

అపరిమిత సామర్థ్యం కలిగిన ఆచార్యుల వారు ఒక మహోన్నత రచయిత. సదాచార ప్రేరకములైన వారి రచనలు అత్యంత ఉపయుక్తములు. సనాతన భారతీయ సంస్కృతికి, సాహిత్యానికి తిరుగులేని సేవలందించారు శ్రీ శంకరులు. గంభీరమైన గద్యరచన, పరవశింపజేయు పద్యరచన వారి కలమునకు సొంతం. శంకర సాహిత్యం ఒకవైపు మనలను వర్ణనాతీతమైన సుందర భావాలతో స్పందింప జేస్తుంది; మరోవైపు మహోన్నత భావవైశాల్యంతో అలరారుతూ, ప్రామాణికమైన, సర్వజనామోద మైన జ్ఞానాన్ని అందిస్తుంది. వారి సాహిత్యం - అమూల్యమైన సద్భావ మణులనేకములు కలిగిన ఒక జ్ఞానపేటిక; మనందరిని పరమమైన, మహోన్నతమైన గమ్యం దిశగా పయనింప జేయుట కది దారిదీపిక.

ఆది శంకరులవారు తమ బౌద్ధిక, మానసిక ప్రావీణ్యాన్ని, సకల కళా నైపుణ్యాన్ని, తమ శక్తి సామర్థ్యాలను సమస్త మానవాళి సుఖసంతోషాల కోసం పూర్ణంగ అంకితం చేశారు.

శ్రీ శంకరు లోక శ్రేష్ఠమైన వ్యవస్థాపకులు. మన సనాతన ధర్మ సంరక్షణకు, సముద్ధరణకు వారు రూపొందించిన ప్రణాళికలు, అమలుపరచిన కార్యక్రమాలు అనుకరణీయములు మరియు అనుసరణీయములు.

కేవలం ఎడ్లబండ్లు మాత్రమే ప్రయాణ సాధనములుగ ఉన్న ఆ రోజుల్లో శ్రీ శంకరులు తమ భావాలను, సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ సమస్త భారతదేశమంతటా కాలినడకన పర్యటించారు. వారు మూఢనమ్మకాలను, శాస్త్ర విరుద్ధ ఆచరణను జనుల మానసముల నుండి తరిమికొట్టారు. భారతీయ సంస్కృతి అందించే సద్భావాలను, సనాతన ధర్మం బోధించిన సత్యసందేశాలను అంతటా విస్తరింపజేసి సమాజ అభ్యుదయానికి ప్రతిబంధకమై నిలిచియున్న దురవగాహనలను, దురాచారాలను సమూలముగ పెకలించి వేశారు.

శంకరాచార్యుల వారొక సన్యాసి. అయినా ఆయన సంఘజీవనానికి దూరమై, తపస్సు కొరకు అరణ్యాలకు వెళ్ళలేదు. ఆచార్యులవారి భావంలో తపస్సంటే కఠోర నియమాలతో కూడుకున్న ఒంటరి జీవితం కాదు. వారి ఉద్దేశ్యంలో సమాజంలోని అజ్ఞాన తిమిరాలను తరిమికొట్టడానికి చేసే తీవ్ర ప్రయత్నమే తపస్సు. వ్యక్తిగత వాంఛలను ప్రక్కకు నెట్టి, సమాజ శ్రేయస్సు కొరకు జీవించడమే నిజమైన త్యాగం. ఈ మహోన్నత ఆదర్శాలకు రూపకల్పన గావించుటలోనే తమ జీవితాన్నంతా వెచ్చించారు శ్రీ శంకరులు. ఆయనకు ఈ విశ్వమే దేవాలయం; మానవ జాతియే అందలి దైవం. మానవజాతికి సేవలందించుటయే ఆచార్యుల వారి అర్చన.

సామాజిక, రాజకీయ స్థితిగతులపై ఆధారపడిన సంఘ ఏకీకరణ కాల పరీక్షకు తట్టుకొని నిలువలేదు. ఆధ్యాత్మిక ఏకత్వమే పునాదిగా, నైతిక, బౌద్ధిక విలువలతో, కట్టుబాట్లతో నిర్మింపబడే ఏకీకరణయే కలకాలం నిలువగలదు. ఇట్టి ఏకీకరణను సాధించుటయే లక్ష్యముగ కలిగిన శ్రీ శంకరులు తమ అద్వైత సిద్ధాంతం ద్వారా, సర్వులలో విరాజమానమై ఉన్న ఆధ్యాత్మిక ఏకత్వమును అనుభవమునకు తెచ్చుకొనునట్లు జనులలో జాగృతిని కలిగించారు. శంకరులవారి అద్వైతం సర్వుల హృదయాలలోని భేదభావాలను క్షాళన మొనర్చి, సమాజంలోని అసమానతలను పూర్తిగ తొలగించింది. ఆచార్యుల అద్వైత సిద్ధాంతముచే ప్రభావితులైన జనులు తమలోని అహంకారాన్ని ఆవలకు నెట్టి, అసూయా ద్వేషాలను అంతమొందించి సదవగాహనతో, శాంతి ప్రేమలతో జీవితాలను ఆనందమయముగ తీర్చిదిద్దుకున్నారు.

శ్రీ శంకరులవారు తమ మాండూక్య కారికా భాష్యంలో తెలియజేసినట్లుగా

రోగార్తస్యేవ రోగనివృత్తౌ స్వస్థతా తథా దుఃఖాత్మకస్యాత్మనో ద్వైత ప్రపంచోపశమే స్వస్థతా అద్వైత భావః ప్రయోజనమ్। ద్వైత ప్రపంచస్య చావిద్యా కృతత్వాద్విద్యయా తదుపశమః స్యాత్

"రోగపీడితుడైనవాడు రోగము నిర్మూలింపబడినపుడే స్వస్థత నొందగలడు. అదే విధముగా దుఃఖితులైన జనులు తమ అంతర్యంలోని ద్వైత జగత్తు నశించినపుడే సంతృప్తి నొందగలరు. అద్వైతస్థితియే ఇక్కడ ప్రయోజనము. ద్వైత ప్రపంచము అవిద్యా కల్పితము. విద్యచే అది ఉపశమిస్తుంది." అద్వైత సిద్ధాంతము ఉపనిషత్తుల నుండి పుట్టినదే. అయినప్పటికీ దానిని వివరించి, సామాన్య మానవునికి సైతం అది ఉపయుక్తమగునట్లు చేసిన ఘనత శంకరులకే దక్కుతుంది.

ఆదిశంకరుల వారు కీర్తింపబడినది, భవిష్యత్తులో కీర్తింపబడబోయేది ఒక బోధకునిగా మాత్రమే కాదు. ఒక దివ్య ఆచార్యునిగా.

దివ్యాచార్య శంకర భగవత్పాదుల వారికి ఒక చక్కటి శ్లోకంలో తన ప్రేమాంజలిని సమర్పించారు గతంలో ఒకరు. ఎవరు వ్రాశారో, ఎప్పుడు వ్రాశారో తెలియదు గాని శంకరులవారి వైభవానికినిలువుటద్దమైన ఈ శ్లోకాన్ని ఇక్కడ ఉదహరించడం అత్యంత సముచితం.

గురవో బహవః సన్తి శిష్య విత్తాపహారిణః ।
తమేకం శరణం వన్దే శిష్య సంతాపహారిణం ॥

"శిష్యుల విత్తాన్ని అపహరించే గురువులు అనేకులున్నారు. కాని శిష్యుల సంతాపమును హరించే ఏకైక గురువరేణ్యులైన శ్రీశంకరభగత్పాదులకు శరణాగతుడనై వందన మొనరించుచున్నాను".

ఆహా! ఎంతటి అరుదైన ఆరాధనాభావం! శ్రీ శంకరుల అవ్యాజమాన ప్రేమ జనుల హృదయాలను ఏవిధంగా స్పందింపజేస్తుందో ఇది మనకు చక్కగా చూపెడుతుంది.

శ్రీశంకరుల ననుసరించి మానవుని పరిపూర్ణునిగ తీర్చిదిద్దుటయే విద్య యొక్క ప్రధానోద్దేశ్యం. విద్య విద్యార్థిలోని భావసంపదను పెంపొందించి, వివేకాన్ని వృద్ధి చేయాలి. కేవలం విషయ పరిజ్ఞానంతో విద్యార్థుల మెదళ్ళకు మోతగా మిగలకుండా, విద్య, నైతిక శిక్షణతో తమ చిత్తమును వారు శ్రేయోమార్గంలో నడుపుకొనే విధంగా సహకరించాలి.

కేవలం విషయ సమాచారంతో నిండిపోయిన మనసులో విజ్ఞానం ఉదయించదు. అటువంటి మనసు జడమై నిలుస్తుంది. వ్యక్తిలోని ఈ జడత్వం సమాజ ప్రగతిని సైతం నిరోధిస్తుంది. సమాజం జాగృతం కావాలని మనం ఎన్ని కలలు గని ఏమి లాభం? వ్యక్తిలో నైతిక విలువలు వెలుగు చూసినపుడే వ్యవస్థకు పట్టిన మత్తు వదులుతుంది.

మానసిక ఆందోళన శరీరారోగ్యాన్ని ఆటంకపరచునట్లు, చిత్తంలోని జడత్వం దేహాన్ని కూడ నిస్సత్తువగ చేసి, చేతనత్వాన్ని నశింపజేస్తుంది.

వివేకానందుల వారంటారు: "విద్యాహీనునికి వివేకాన్నివ్వాలి; విద్యావంతునికి మరింత వివేకాన్నందించాలి. కారణం - చదువులేని వానికన్న పండితునికే వివేకం యొక్క ఆవశ్యకత ఎక్కువగా ఉంది" అని. వారి భావంలో మానవుని బుద్ధి కుశలతను వృద్ధి చేయని, మనసుకు నైతిక శిక్షణ నందించని మరియు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దని విద్య విద్యయే కాదు.

అందువల్ల వ్యక్తిని వివేకవంతునిగ మార్చడం, సత్యాన్ని గ్రహించే సామర్థ్యాన్ని, చక్కటి అవగాహనను కలిగించడం, అతడిని విజ్ఞానతేజంతో శోభించునట్లు చేయడం ఇవియే విద్య యొక్క ముఖ్యోద్దేశ్యాలు కావాలి. ఉపనిషత్తులు విద్యార్థిని 'తపస్వి'గా వర్ణిస్తుండగా - చిత్తైకాగ్రత, ఇంద్రియ స్థిరత్వములనే తపస్సుగా నిర్వచిస్తారు శంకరులు. ఇవియే మానవుని మహోన్నత కర్తవ్యము మరియు విద్యుక్త ధర్మము.

కనుక అక్షరాస్యత మాత్రమే బోధనకు పరాకాష్ఠ కాకూడదు. మానవుని ఉన్నతునిగ, సద్భావ సంపన్నునిగ, శీలవంతునిగ తీర్చినపుడే విద్యకు పూర్ణత్వం సిద్ధిస్తుంది. మన విద్యావిధానాన్ని వ్యవస్థీకరించుటకు ప్రణాళికలు రూపొందించునపుడు మన విద్యావేత్తలు, విద్యాశాఖ మరియు ఉపాధ్యాయులు బోధనయొక్క ఈ ముఖ్యోద్దేశ్యాన్ని మదిలో ఉంచుకోవాలి. విద్య మానవుని శ్రేయస్సునకే గాని సమాజంలో స్థాయి కొరకు లేదా లౌకిక అవసరాలకు కాకూడదు. విద్య సంకల్ప శుద్ధికేగాని ఆడంబరాలకు, చౌకబారు ప్రదర్శనలకు కాకూడదు. విద్య - నిస్వార్థ ప్రేమ, త్యాగముల కొరకే గాని వ్యక్తిగత వాంఛలను ఈడేర్చుకొనుటకు కాదు. అన్ని కాలాలకు ఆదర్శవంతమై నిలిచే ఆచార్య శంకర భగవత్పాదుల దృష్టిలో ఇదియే విద్యయొక్క నిజ లక్ష్యం.

శ్రీ శంకరుల జ్ఞాన పరిపక్వత, భావ స్వాతంత్ర్యం, విశ్వతోముఖ దృక్పథం - నేటికీ వారి కీర్తి మన కర్ణములలో శంఖధ్వనివలె మారుమ్రోగునట్లు చేశాయి.

రోధ స్తోయ హృతశ్శ్రమేణ పథిక శ్ఛాయాం తరోర్వృష్టితో
భీత స్స్వస్థ గృహం గృహస్థ మతిథి ర్దీనః ప్రభుం ధార్మికమ్
దీపం సంతమసాకులశ్చ శిఖినం శీతావృత్తస్త్వం తథా
చేత స్సర్వ భయాపహం వ్రజ సుఖం శంభో పదాంభోరుహమ్

"జలప్రవాహమున కొట్టుకొని పోవువాడు తీరము నాశ్రయిస్తాడు. అలసిన బాటసారి చెట్టు నీడ నాశ్రయిస్తాడు. పెద్ద వర్షము వలన భయపడిన వాడు రక్షణ గల ఇంటిని ఆశ్రయిస్తాడు. అతిథి గృహస్థు నాశ్రయిస్తాడు. దీనుడు ధర్మాత్ముడైన ప్రభువు నాశ్రయిస్తాడు. చీకటిలో యున్నవాడు దీపము నాశ్రయిస్తాడు. చలితో బాధపడువాడు అగ్నిని ఆశ్రయిస్తాడు. మనసా! సమస్త భయములను పోగొట్టునదియు, సుఖదాయక మైనదియు నగు పరమేశ్వరుని పాదకమలమునే ఆశ్రయించు".



భద్రాచల రామదాసు

భద్రాచలం అనగానే రామదాసు మదిలో మెదుల్తాడు.

రామదాసు అనగానే భద్రాచలం హృదిలో కదుల్తుంది.

భద్రాచలం మహాక్షేత్రము. రామదాసు మహాభక్తుడు. గొప్పవైన రెండు పుణ్యాలు ఏకమై దర్శన మిస్తున్నట్లు అనిపిస్తుంది భద్రాచల రామదాసు అనే పేరు వినగానే. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జన్మించిన ఈ మహాభక్తుని పేరు గోపన్న. కంచర్ల ఆయన ఇంటిపేరు. భద్రాచలంలో తహసీలుదారు ఉద్యోగము చేస్తూ ప్రభుత్వ ధనమును ఆలయ గోపుర ప్రాకారాది కార్యాలకు, భగవన్మూర్తుల అలంకారములకు వెచ్చించి దారుణమైన బాధలను కొనితెచ్చుకొని, వాటిని అనుభవించడములోనే రామానుగ్రహమును పొంది తరించిపోయిన దివ్యాత్ముడు రామదాసు.

స్వశ్రేయసం శివం భద్రం కళ్యాణం మంగళం శుభం

భద్రం అనే పదాన్ని ఈ విధంగా నిర్వచించడం జరిగింది. ఈ వాక్యంలో 'భద్ర' మనే పదం మధ్యలో ఉంది. అనగా భద్రం భద్రంగా ఉందని అర్థం. అది భద్రంగా ఉంది కనుక యావద్విశ్వాన్ని భద్రంగా ఉండేలా చూస్తుంది.

రాముడు రామభద్రుడుగా పిలువబడింది ఇక్కడే. భద్రాచల రాముడుగా, భద్ర రాముడుగా అయింది ఇక్కడే. కనుకనే శ్రీరాముని

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే

రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః

అని ప్రార్థిస్తాము. లోకమును రంజింపచేయు మంగళకరమూర్తి అయినందున శ్రీరాముడు రామభద్రుడు అని పిలువబడినాడు. ప్రపంచాన్నంతా భద్రంగా చూస్తున్న రామభద్రుడు భద్రాచలంలోనే కొలువైనాడు.

శ్రీరాముని దివ్య పాదస్పర్శతో గౌతమీ తీరాలన్నీ పావనమయ్యాయి. సీతమ్మను అన్వేషిస్తూ గోదావరి తీరము పొడవునా శ్రీరాముని పవిత్రచరణములు చరించాయి. పరమ పవిత్రత చేకూరింది ఈ కారణం చేతనే.

ధర్మావతారమూర్తి రామచంద్రుడు చరించిన పుణ్యగౌతమీ తీరాన గోపన్న రామదాసు అయ్యాడు. కవిగా రాణించాడు. భక్తుడుగా స్థిరపడ్డాడు. వాగ్గేయకారుడిగా శోభించాడు. శతక కవిగా కీర్తి గడించాడు. పేరుకు రామదాసే గాని, నిజం చెప్పాలంటే రామదాసుకు రాముడే దాసుడయ్యాడు. రామదాసు పంపినట్లు రాముడు తానీషా వద్దకు వెళ్ళి డబ్బు చెల్లించాడు. తాను రామదాసు సేవకుడనని చెప్పుకున్నాడు. భగవద్భక్తి భగవంతుని భక్తునికి దాసుణ్ణి చేస్తుంది అనే సత్యాన్ని రామదాసు భక్తిమయ జీవితం ధృవపరచింది.

రామదాసు భక్తిలో ఒక ప్రత్యేకత ఉంది. దివ్యపారవశ్యముంది. తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రమూర్తిని ప్రత్యక్షంగా దర్శించాలని, భాషించాలని రామదాసు హృదయం తల్లడిల్లింది.

ఏమిరా రామా! నావల్ల నేర మేమిరా! అని రాముణ్ణే ప్రశ్నించడం జరిగింది. **ఆశించి యుండిన దాసుని శ్రీరాములూ - నీకు పోషించే భారము లేదా శ్రీరాములూ** అంటూ రామునికి కర్తవ్యాన్ని గుర్తుచేసే స్థాయికి కూడా వెళ్ళింది రామదాసు భక్తి. **అడుగు దాటి కదలనివ్వను - నా కభయ మివ్వక నిన్ను విడువను** అని శ్రీరాముని అప్పిచ్చిన వానివలె నిలదీసిన సన్నివేశాలు కూడా ఉన్నాయి.

పిలిస్తే రాముడు పలకలేదని **'పలుకే బంగార మాయెనా! కోదండపాణి'** అని ఎత్తి పొడిచాడు. ఇలా అనితరసాధ్యమైన రీతిలో భక్తిని చేసి శ్రీరాముని కృపతో తన పలుకును బంగారం చేసుకున్నాడు భద్రాచల రామదాసు.

బంగారు కీర్తనలు రచించాడు. భక్తి పరిమళం గల బంగారు శతకాన్ని రచించాడు. అదే దాశరథీ శతకము. రామదాసు భక్తి హృదయం ఈ శతకంలో ముంజేతి కంకణంలా ప్రస్ఫుటమౌతుంది. రామదాసు కృతులు అనగానే ముందు మనసులో కదిలేది దాశరథీ శతకమే. భక్తిభావ బంధురమై, అమృతధార లొలుకు పదాలతో, రామదాసు మెత్తని మనసు సుతిమెత్తని కవిత్వముతో అందించిన అమృతకలశమే ఈ దాశరథీశతకము.

అమృతము అమరత్వాన్ని ప్రసాదిస్తుంది. దాశరథీశతకంలోని రామభక్తి అమృతత్వాన్నే అనుగ్రహిస్తుంది. పఠించండి. హృదయానికి పట్టించండి.

తక్కువేమి మనకు రాముం డొక్కడుండు వరకు

అని మనం కూడా ధీమాగా జీవిద్దాం.

రాముడు ఘోరపాతక విరాముడు సద్గుణకల్పవల్లికా
రాముడు షడ్వికారజయ రాముడు సాధుజనావనవ్రతో
ద్దాముడు రాముడే పరమదైవము మాకని మీయడుంగు గెం
దామరలే భజించెదను దాశరథీ కరుణాపయోనిధీ!

దశరథకుమారా! దయాసాగరా! నీవు భయంకరమైన పాపములను అంతరింపజేయువాడ వనియు, సుగుణ కల్పలతతో కూడిన వనము వంటి వాడ వనియు, అరిషడ్వర్గములను జయించిన ఆత్మారాముడ వనియు, సాధు పురుషులను రక్షించు దీక్షావ్రతుడ వనియు నీకన్నా పరమదైవము లేదని నమ్మి నీ పాదకమలములనే సేవించుచున్నాను.

సుభాషితాల భర్తృహరి

సుభాషితం అంటే మంచిమాట.

మంచి తెలిసిన మనీషి లేదా మహర్షి పలికిన మాట. మంచిని వాంఛిస్తూ చెప్పిన మాట. మనసును అనునయిస్తూ ప్రబోధించిన మాట. అందమై, ఆదర్శమై అందరూ అనుకరించి, అనుసరించి ఆచరించుటకు అనువైన మాట. సుద్దులు నేర్పి బుద్ధులను దిద్దే మాట.

సుభాషితం అనగానే భర్తృహరి సుభాషితమా? అని ప్రశ్నిస్తారు? నిజమే. భారతీయ తత్త్వ సాహిత్యంలో భర్తృహరి సుభాషితానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మనసులో నాటుకోని సుభాషితం నోళ్ళల్లో గలగల మనినా పదికాలాలపాటు పచ్చగా మనలేదని భర్తృహరి భావం. కనుకనే అతని ప్రబోధం ఒక ప్రత్యేక పంథాలో నడిచింది. మాటను ముఖంలో కాకుండా మనసులో మకాం పెట్టించే ప్రయత్నం చేసిన కవియోగి అతడు. రాజకవియోగి.

యథా ఖరః చందన భారవాహీ భారస్య వేత్తా న తు చందనస్య

గాడిద చందనాన్ని మోసినా తెలుసుకొనేది బరువునే గాని విలువను కాదు అంటాడు. విలువ తెలియని భారవిద్య నీరు లేని బావి వంటిదని, వాసన లేని పువ్వు వంటిదని ఆయన అభిప్రాయం.

భర్తృహరి 6వ శతాబ్దికి చెందినవాడు. మధ్యప్రదేశ్‌లో ఉజ్జయినీ సంస్థానాధీశుడు అంటారు. భర్తృహరి మాటల్లో అడుగడుగున వైరాగ్యం తొంగి చూస్తూ ఉంటుంది. విలువలు గల సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు అనిపిస్తుంది. సర్వానర్థములకు ఆది కారణాన్ని అన్వేషించి అతడు ధిక్కరించే విధానము అనితర సాధ్యమనిపిస్తుంది. అలాంటి సందర్భాలలోనే పాఠకులు తికమకపడి గ్రహించవలసిన విషయాన్ని ప్రక్కకు నెట్టి వ్యక్తిని ప్రత్యేక కోణంలో చూచేందుకు ప్రయత్నిస్తారు. ప్రయత్నించారు. భర్తృహరి జీవితం హఠాత్తుగ వైరాగ్యంలో పాతుకపోవడానికి ఏవేవో సంఘటనల్ని కారణాలుగా ఊహించారు. మార్పు అనేది ఒక్క క్షణంలో పిడుగు పడ్డట్లు జరిగేది కాదు అనే సత్యాన్ని మనస్తత్వశాస్త్ర లోతుల్ని తరచి చూడనివారు సులభంగా గ్రహించాలని ఆశించడం కూడా తొందరపాటే అవుతుందేమో.

యాం చింతయామి సతతం మయి సా విరక్తా సా ప్యన్య మిచ్ఛతి జనం సజనోఽ న్యసక్తః
అస్మత్కృతే చ పరితుష్యతి కాచి దన్యా ధిక్ తాం చ తం చ మదనం ఇమాం చ మాం చ ॥

"ఎవరిని గూర్చి సదా నేను ఆలోచిస్తూ ఉంటానో ఆమెకు నేనంటే ఇష్టంలేదు. ఆమె మరొకడిని కోరుకుంటోంది. అతడు వేరొక స్త్రీని వాంఛిస్తున్నాడు. ఇంకొక స్త్రీ నన్ను కోరుకుంటోంది. నేను వలచిన ఆమె, ఆమె వరించిన అతడు, నన్ను అభిలషించిన ఈమె, దీని కంతటికి కారకుడైన కాముడు, నేను, - అందరిపై ధిక్కారము. ధిక్కారము".

ఈ శ్లోకము భర్తృహరి సునిశిత పరిశీలన గల అనుభవ సహిత పాండిత్యానికి అద్దం పడుతుంది. ఇదేదో గాయపడిన గుండె గీపెట్టిన గేయమని భావిస్తే విషయానికి న్యాయం జరుగకపోగా విషయికి అన్యాయం జరుగవచ్చు.

వ్యక్తిలోని సంఘర్షణను, సామాజిక కాలుష్యాన్ని అరచేతిలో అమలకంలా దర్శించిన భర్తృహరి తాత్త్విక హృదయ విహంగం అన్యులు అనుసరించుటకు సాధ్యపడని విధంగా విచిత్ర లోకాల్లో విహరించింది. ఆచరించమని జీవన సత్యాల్ని తెచ్చి ముందు పరచింది.

భర్తృహరిని కేవలం ఒక కవిగా, యోగిగా, రాజుగా చూస్తే లాభం లేదు. అతని సంపద వేరే.

మనసి చ పరితుష్టే కోఽ ర్థవాన్ కో దరిద్రః

"మనస్సు తృప్తి చెందాలే గాని, ధనికు డెవరు? దరిద్రు డెవరు?" అని ప్రశ్నించిన భర్తృహరి వ్యక్తిత్వం చాలా విలక్షణమైనది.

ఏది ఏమైనా, ఆయన సుభాషితం వికాసాన్నిచ్చి వ్యక్తిని తృప్తి పరుస్తుంది. అభ్యుదయాన్ని అందించి సమాజాన్ని సంతృప్తి పరుస్తుంది. హరి సదనాన్ని చేరడానికి మార్గాన్ని సుగమం చేశాడు భర్తృహరి.

వాక్కు అనేది మానవునికి పరమాత్మ అనుగ్రహించిన వరం. వాణీపతి అనుగ్రహించిన వాక్సుధను దుర్వినియోగం చేసుకోవడం దురదృష్టం. శాపగ్రస్తం.

సకాలము నందు నాటిన బీజమే మొలకెత్తుతుంది. సమయాలు, నియమాలు ఎరిగి భాషించునపుడే వాక్కు అమృత తుల్యంగా ఉంటుంది. అలా భాషించలేక, భాషించక, గాలికి వృక్షశాఖలు చలించునట్లు, మనసు ప్రేరేపించినట్లు వాగి జీవన మార్గంలో మలిన వాగుల్ని సృష్టించువాని కన్నా మూగయే నయం.

తిరువళ్ళువర్

ఇలా ఉంది అనే దాని నుండి '**అలా ఉండాలి**' అనే దానివైపు పరుగులు తీయడానికే సృష్ట్యాది నుండి మానవాళి అలవాటు పడింది.

ఉన్నది ఇలా ఎందుకున్నదో గ్రహించే శక్తి మానవునికి లోపించడం వలన, లేని దానిని ఆశించి పరుగులెత్తడం జరుగుతోంది. తన ప్రయత్నం ద్వారా గాని, అన్యుల సహకారంతో గాని, లేదా ఊహించని పరిణామాల వల్ల గాని '**ఇలా**' ఉన్నది '**అలా**' మారుతుందేమో అనే ఆశ.

ఒకనాడు '**అలా**' అని ఊహించిందే నేడు '**ఇలా**'గా తెలుస్తున్నది అనే సత్యం అర్థం కానివానికి రేపు '**అలా**'గా మిగిలేది కూడా నేడు '**ఇలా**'గా తెలిసిందే అనే వాస్తవం ఎలా అవగతమవుతుంది?

'**ఇలా**' ఉన్న దానిని మార్చడం కాకుండా, దానితో మనుగడ సాగించడం సత్య జీవనము. అదియే జీవన కళ.

'**ఇలా**' ఉన్నది '**అలా**' కాలేదు. దానిని మనిషి అర్థం చేసుకోవాలి. H_2O నీరుగా ఉంటుంది. నింగిలో ఊరేగినా, నేలపై పారినా అది నీరే. అది మరోలా ఉండ లేదు. ఇది జీవనసత్యం. మార్పు చేసేందుకు వీలులేనిది. మేలుకానిది. ఇలాంటి విషయాలలో అవగాహనతో కలిసి జీవించడం మనిషికి అర్థం కావాలి.

అర్థం కానపుడు ఏది తెలిసినా అది వ్యర్థమే అవుతుంది. కనుకనే తాను నివసిస్తున్న ప్రపంచం మనిషికి వ్యర్థంగా స్ఫురిస్తోంది. కారణం, తాను వ్యర్థంగా మిగిలి ఉండుటయే.

వ్యర్థజీవికి ప్రపంచమంతా వ్యర్థంగా కనిపిస్తుంది. సమర్థత చేకూరితే అంతా పరమార్థంగా తెలిసివస్తుంది.

'వ్యర్థం' అనే దానికి అర్థమేమిటి? వ్యర్థము అనే దానిని మనిషి చూస్తున్నాడా? లేక, 'వ్యర్థము, అనే భావనను కలిగియున్నాడా? చూస్తూ ఉన్నట్లయితే అది సత్యమే అవుతుంది. సత్యమైనది వ్యర్థమెలా అవుతుంది? ఒకవేళ, భావమే అయితే అది ఉన్న దానితో విభేదిస్తున్నదని అర్థం. ఈ విభేదము '**ఇలా**' ఉన్నదాని నుండి '**అలా**' ఉండాలి అనుకున్న దానివైపు పరుగులు తీస్తుంది. కనుక మనిషి పరుగులెత్తేది భావాలలోనే గాని వాస్తవాలలో కాదు. తన ఆంతరంగిక ప్రవృత్తిలోనే గాని బాహ్య ప్రపంచంలో కాదు. ఈ రెంటికి మధ్య తేడా అర్థం కానంతవరకు బ్రతుకు కుదుటపడదు. మనసుకు కునుకు పట్టదు.

బాహ్యంలో అనిశ్చిత పరిస్థితి ఉంది. అనివార్య పరిణామం సాగుతోంది. గందర గోళం గూడు కట్టుకొని ఈ ప్రపంచంలో జీవిస్తోంది. వ్యాధులు పీడిస్తున్నాయి. ఇవన్నీ అనివార్యములని అర్థమైతే, వ్యాధులు ఉంటాయి; కాని వ్యథలు ఉండవు.

మృత్యువు వస్తుందని బాధపడుతూ ఉంటాము. ఇది భావం. మృత్యువు అనేది వచ్చి యున్నదే గాని రాబోయేది కాదు. జన్మలోనే మృత్యువు కూడా కలిసి వచ్చింది. కలిసి జీవిస్తున్నది. కనుకనే ఏనాడైనా కబళించ గలుగుతుంది. ఇవి '**ఇలా**' అర్థమైతే, '**అలా**' ఉండాలి అనిగాని, ఉండకూడదు అని గాని అనిపించదు. అనిపించని నాడు భావాలు లేవు అని అర్థం. భావాలు కలతపెట్టని నాడు సత్యాలు శోభిస్తూ ఉంటాయి.

మానవ స్వభావంలోని ఈ నిగూఢ భావ మెలికలను క్షుణ్ణంగా పరిశీలించి, మానవుని మనుగడ ఈ ప్రపంచంలో అర్థవంతంగా, సమర్థవంతంగా సాగేందుకు రాజమార్గమును నిర్మించిన ఎందరో మహానుభావులలో పదిహేను వందల సంవత్సరాల క్రితం తమిళదేశంలో తళుక్కుమనిన తపోరత్నము **శ్రీ తిరువళ్ళువర్.**

తిరువళ్ళువర్ గొప్ప తపస్వి. తపోహృదయంతో ఆనాటి సామాజిక వ్యవస్థను కాచి వడపోసిన గొప్ప మనస్వి. తాను దర్శించిన సత్యాలను సమాజ శ్రేయస్సునకు ఉపయోగించి సర్వులచే ఆరాధించబడిన యశస్వి.

ఆయన రచించిన **తిరుక్కురళ్** అనే పద్య కవిత తమిళ సమాజాన్ని బాగా కుదిపి వేసింది. గుండె గుండెను తట్టి మరీ పలకరించింది. ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహను కదిలించింది. ధార్మిక జీవనమును ఆవిష్కరించింది. వైద్యుడు రోగిని పరిశీలించి చికిత్స చేయునట్లు, తిరువళ్ళువర్ ఒక గొప్ప భిషగ్వరుడై సామాజిక రుగ్మతలను దూరంగా తరిమాడు. మానవత్వము, సహకార జీవనము, ధర్మాచరణము, నైతిక శిక్షణము, కర్మ సిద్ధాంతము, ఈశ్వరత్వము - ఈ విషయాల చుట్టూ వారి బోధ విచ్చలవిడిగ చరించింది. జాతికి, నీతికి పట్టిన చెదలను దులిపింది.

అయస్కాంతము ఇనుప ముక్కను ఆకర్షించినట్లు తిరువళ్ళువర్ బోధలు మేధావుల్ని ఆకట్టుకున్నాయి. ఆనాటి మేధావుల్నే గాక ఆధునికంగా మహాత్ములు, మాననీయులు అనిపించుకున్న గాంధీజీ, వినోబాజీ, రాజాజీ వంటి ప్రజ్ఞావంతుల్ని కూడా **తిరుక్కురళ్** గ్రంథం విశేషంగా ఆకర్షించింది.

ఆత్మజ్ఞానమును పొందుటకు అంతఃకరణశుద్ధి ప్రధానమైనది అనే సత్యాన్ని తిరువళ్ళువర్ గుర్తించారు. అందుచేత, వారి బోధలన్నీ ఎక్కువగా ధార్మిక పంథాలోనే సాగాయి. బుద్ధుడు, కన్ఫ్యూషస్, జినుడు లాంటి మహాత్ముల బోధలతో వీరి బోధలకు సామ్యం కన్పిస్తుంది. ఆ కారణం చేతనే వీరిని జైన మతస్థుడని కొందరు అర్థరహిత నిర్ణయం కూడా చేశారు.

రాజ్య పరిపాలనము, ధర్మము అనేవి వేరు కాకూడదని వీరి ప్రగాఢ విశ్వాసము. వ్యక్తి జీవనము, మతము అభేదంగా సాగాలని ఆయన నిశ్చితాభిప్రాయము. అందుచేత వారి బోధలు రాజీ పడకుండా నడిచాయి. మచ్చుకు కొన్ని పుచ్చుకొని చూద్దాం.

- ధర్మజీవనము ద్వారా లభించే సుఖమే నిజమైన సుఖము. అన్య సుఖములన్నీ దుఃఖ కారణాలు; అగౌరవ హేతువులు.

- అతిథికి పెట్టిన తరువాత ఆరగించే అలవాటు కలవాడే భూమిలో విత్తనాలు చల్లుటకు అర్హుడు.*

- ఒక వ్యక్తి తన జీవితంలో అనేక తాత్త్విక సిద్ధాంతాలను జీర్ణించుకోవచ్చు. సందేహాలను తొలగించుకొని ఉండవచ్చు. కానీ, సదాచార జీవనమే చివరగ సమున్నతమై శోభిస్తుంది. కనుక ఎన్ని కష్టా లెదురైనా సదాచారమును విస్మరించకూడదు.

- చెడు నుండి చెడు పుడుతుంది. అగ్ని ఎలా దహింపచేస్తూ విస్తరిస్తుందో అలాగే చెడు వ్యాపిస్తుంది. కనుక మానవులు చెడును అగ్నికన్నా భయంకరంగా భావించి స్పృశించడం మానేయాలి.

ప్రతి మనిషి అలలా **'అలా'** దొర్లిపోకుండా **"ఇలా"** ఇలలో నిలబడేలా తిరువళ్ళువర్ చేసిన ధర్మబోధ ఆర్షసంస్కృతీ కిరీటంలో ఒక మణిపూసలా శోభిస్తోంది.

నిద్రపుచ్చే చీకటిలా ఎందరైనా చిలుకపలుకులు పలకగలరు. తట్టి లేపే వెలుగులా బోధల్ని అందించేవారే మహాత్ములు. ఈ మహిలో చరించిన దేవతా స్వరూపాలు.

అద్దం లేనిదే మన ముఖం మనకు కనిపించదు. జ్ఞానము లేనిదే మనలోని సత్యం మనకు అవగతం కాదు. ఈ జ్ఞాన దీపాలు పుణ్య భారతావనిలో ఎన్నడూ ఆరవు. వాటి వెలుగులు నిత్య కాంతులు. అవి పురాతనాలు. చిరంతనాలు. నిరంతరం నింగిలో శోభించే విజ్ఞాన తారామండలాలు.

'వాణి' పాతదే అయినా క్రొత్త 'బాణీ'ని సమకూర్చుకొని దేశకాలాదుల పరివర్తనము పరిశీలిస్తూ బోధలను పంచడం ఈ సంస్కృతిలో అనూచానంగా వస్తున్న ఆచారం. సదాచారం. సత్సంప్రదాయ సారం.

'సాధవో హృదయం మమ' - సాధువులు నా హృదయమై ఉన్నారని భగవద్వాక్యము. సాధుహృదయాన్ని తృప్తి పరిస్తే భగవంతుడు తృప్తి పడతాడు. సాధు సంతాపమునకు కారణమైతే పరమాత్మను బాధించినట్లే అవుతుంది. సాధువాక్కు సర్వజన సమ్మోహనము. అది పసివాడని పువ్వు వంటిది. కారణము అది సత్యవాక్కు. మర్మమైన వాక్కు, మనోనిగ్రహముతో పలికే వాక్కు.

* 'దున్నేవాడిదే భూమి' అనే సిద్ధాంతానికి, దీనికి తారతమ్యాన్ని గుర్తించాలి.

కారుచీకట్లలో కాంతిరేఖలు

వరద నెవరైనా వరిస్తారు. బురదను బుజ్జగించేవారెవరుంటారు? శిల్పాన్ని చూసి ఎవరైనా ఆనందిస్తారు. దానికి కారణమైన శిలను గూర్చి ఎవరు ఆలోచిస్తారు? తెరుచుకున్న కళ్ళు కొందరికి కారాగృహంలో మూతపడితే, మూతపడిన కళ్ళు కొందరికి కారాగృహంలో తెరుచుకుంటాయి. సుందరమైన కమలాన్ని ప్రసాదించింది బురదే కదూ? సజీవ శిల్పంలా గోచరించే సౌందర్యానికి ఆధారము నిర్జీవ శిలయే కదూ? బురద నుండి కమలం రావచ్చు. కాని బురదలో పడ్డవన్నీ కమలాలు కాలేవు.

కారాగృహాలు కొందరికి నిర్దయ కుటీరాలై కనిపిస్తే, మరికొందరికి కైవల్య నిలయాలై శోభించాయి.

ఒస్కార్ విల్డేని ఒక మహాకవిగా ప్రవేశపెట్టింది అధ్యయన కారాగృహమే కదూ? జాన్ బున్యన్ "పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్"ను రూపొందించింది బెడ్‌ఫోర్డ్ కారాగృహంలోనే కదూ? బాలగంగాధర తిలక్ "గీతారహస్యము"ను బయట పెట్టింది మాండలే కారాగృహమే కదూ? మరి, అరవింద యోగి......?

అది 1908వ సంవత్సరము మే నెల 2వ తేది. సూర్యోదయం కాబోతోంది. మధ్యాహ్నపు మార్తాండుని ఎండలా మండిపడుతూ తుపాకీలు పట్టుకొని పోలీసులు కలకత్తాలో అరవిందయోగి గృహాన్ని ముట్టడించారు. శ్రీ అరవిందుని బంధించి పోలీసు స్టేషనుకి తీసుకెళ్ళారు. అక్కడ నుండి అలీపూర్ జైలుకి తరలించి అక్కడే సంవత్సరం పాటు ఉంచారు. అతివాద బలగానికి అరవిందుడే అధినాయకుడని అభియోగం మోపారు. కథలు సృష్టించారు. కవితలు పుట్టించారు. కానీ, అవన్నీ కల్లలుగానే మిగిలిపోయాయి. భగవత్కరుణా కిరణాలను నిరోధించలేకపోయాయి. కారాగృహంలో బ్రిటీషువారు అరవిందయోగిని కర్కశంగా నిర్బంధించినా, జ్ఞాన భాస్కరుని కిరణ స్పర్శతో పులకరించి, పరవశించి విరబూస్తున్న ఆయన హృదయారవిందాన్ని విచ్చుకోకుండా ఆపే శక్తి ఎవ్వరికీ లేకపోయింది. అలీపూర్ కారాగృహము అరవిందయోగికి అచ్యుతుని కోవెలగా మారిపోయింది.

శ్రీ అరవిందుల అలీపూర్ జైలు జీవితము ఆధ్యాత్మికంగా జాజ్వల్యమానమైంది. ఆయన తన కాలాన్నంతా గీత, ఉపనిషత్తులను అధ్యయనము చేయుటలోను, ధ్యాన, యోగాదులను అనుష్ఠించుటలోనే గడిపేవారు. ఈ సమయంలోనే ఆయన జీవన దృక్పథంలో గొప్ప మార్పు చోటుచేసుకుంది. ఈ విషయాన్ని అలీపూర్ జైలులో అరవింద యోగితో పాటు రాజకీయ ఖైదీగా బంధింపబడి యుండిన శ్రీ ఉపేంద్రనాథ్ బందోపాధ్యాయుడు తాను రచించిన "నిర్వాసితుని ఆత్మకథ" అనే గ్రంథంలో **(Auto biography of an exile)** సుస్పష్టంగా ఇలా విశదీకరించారు:

ఎన్ని మాటలు వినబడుతున్నా, ఎన్ని శబ్దాలు చెవినిపడుతున్నా అరవిందబాబు నిశ్చేష్టుడై నిశ్శబ్దంగా అలా చూస్తూ ఉండేవాడు. మాకు జైలులో తలనూనెను ఇచ్చేవారు కారు. కాని, అరవిందుని శిరోజములు తైలసంస్కారమును పొందినట్లు తళతళ మెరిసిపోతూ ఉండేవి.

బాబూ! స్నానం చేసేటప్పుడు మీరు నూనె రాసుకుంటారా? అని ఒకనాడు నేను అడిగాను.

నేను స్నానం చేస్తేగా! అని అరవిందబాబు అనగానే నాకు మరోమాట పెగల లేదు. కొద్దిగా తేరుకొని, మరి, మీ వెంట్రుకలు తైలసంస్కారముతో శోభిస్తున్నట్లు గోచరిస్తున్నాయే? అన్నాను.

అవును. నా ఆధ్యాత్మిక సాధన పెరుగుతూ ఉంటే నాలో సుస్పష్టంగా గోచరిస్తున్న మార్పులను నేను కూడా చూస్తున్నాను; అన్నారు శ్రీ అరవింద.

సచిన్ అనే యువకుడు ఒకనాడు, అరవిందబాబూ! సాధన ద్వారా మీరు ఏమి సాధించారు? అని ప్రశ్నించాడు. "నేను చూడాలనుకున్న దానిని చూశాను" అని సమాధాన మిచ్చారు శ్రీ అరవింద. **(I have found what I have been looking for).**

మీరు కూడా మాతోపాటే ఈ జైలులో ఉన్నారు. ఈ యోగసాధన మీకు ఎలా లభ్యమైంది? అని ప్రశ్నించాము ఒకనాడు.

ఒక మహాపురుషుడు నా సూక్ష్మ శరీరాన్ని ఆశ్రయించుకొని నాకు సాధనలు నేర్పించాడు; అన్నారు శ్రీ అరవిందులు.

అయితే మీపై మోపిన కేసు విషయమేమిటి? అని ప్రశ్నించాము. "నేను విడుదల అవుతాను" **(I shall be released)** అన్నారు.

శ్రీ అరవిందులు ఇలా చెప్పారు: "నన్ను పోలీసులు బంధించినపుడు నేను బాగా కదిలిపోయాను. నా మనస్సు విచలితమైంది. నా విశ్వాసము సన్నగిల్లింది. పరమేశ్వరుని సంకల్పాన్ని నేను పసిగట్టలేకపోయాను. నా హృదయం ఒకనాడు అతణ్ణి నిలదీసింది.

"ఇదంతా నాకెందుకు జరిగింది? నా దేశ ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత నాపై ఉన్నట్లు నేను విశ్వసించాను. ఆ పని ముగిసే వరకు నీ రక్షణ నాకు ఉండి ఉండాలి. మరి, ఇప్పుడు నేను ఇక్క డెందుకున్నాను? నాపై ఈ అభియోగ మేమిటి? - ఇలా ప్రశ్నించాను.

"రెండు మూడు రోజులు గడిచాయి. ఒకనాడు ఆంతర్యం నుండి 'ప్రశాంతంగా ఉండు - జరిగేది చూస్తూ ఉండు' - అని నాకు వినిపించింది. ఆ క్షణం నుండి నేను ప్రశాంతంగా ఉండిపోయాను. కానీ దివారాత్రములు పరమాత్మ పలుకు కొరకు నిరీక్షిస్తూ ఉండినాను. నాకు ఏమి చెబుతాడో, నేను ఏమి చేయాలో తెలుసుకొనేందుకు ఉత్సాహంతో, ఆనందంతో ప్రశాంతంగా నిరీక్షించాను.

"ఒకనాడు ఆ పలుకును నేను విన్నాను. బంధాలను తొలగించుకొనుటకు నీవు శక్తిహీనుడవైనందున నేనే ఆ బంధాలను తొలగించాను. నీవు సాగించే పనిలో నీవు కొనసాగడము నా అభిమతమూ కాదు; నాకు ఇష్టమూ లేదు. నీవు చేయవలసిన పని వేరే ఒకటుంది. అందుకే నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చాను. నీకు నీవుగా నేర్చుకోలేని విషయాన్ని నీకు నేర్పించి నా కార్యంలో నిన్ను నిమగ్నం చేసేందుకు ఇక్కడికి నిన్ను చేర్చాను; ఇలా నాకు వినిపించింది.

"అవును. ఇప్పుడు నాకు జ్ఞాపకముంది. నేను అరెస్టు అయ్యేందుకు నెల రోజుల క్రితం నాకు ఒక పిలుపు వినిపించింది. నేను చేసే పనిని ప్రక్కన బెట్టి, కొంత కాలం ఏకాంతంలో గడిపితే అతనితో నాకు సామీప్యం కుదురుతుందని వినిపించింది. నా బలహీనతలో నేను ఆ మాటను వినలేదు. నేను లేకపోతే నా పని జరగదనే గర్వమే నన్ను అలా విన నివ్వకుండా చేసుంటుంది.

"ఇప్పుడు అతని శక్తి నాలో నిండిపోయింది. నాకు కారాగృహ మంతా వాసుదేవ నిలయంగా గోచరిస్తూ ఉంది. నా గదికి ముందున్న చెట్టు క్రింద నేను నడుస్తూ ఉంటే, ఆ చెట్టు కొమ్మలతో ఊగుతున్నట్లు నాకనిపించలేదు. శ్రీకృష్ణుడు తన అనుగ్రహ ఛాయను నాపై ప్రసరింప చేస్తున్నట్లు అనిపించింది. నా గది తలుపులు కూడా కృష్ణుడుగానే కనిపించాయి. కాపలా ఉన్న సెంట్రీ కూడా వాసుదేవుడుగానే కనిపిస్తున్నాడు. కారాగృహంలోని ఖైదీలు, హంతకులు, బందీలు నాకు కృష్ణుడుగానే కనిపించారు. నా కిచ్చిన దుప్పటిని నేను కప్పుకుంటే అది నాకు దుప్పటిలా అనిపించలేదు. శ్రీకృష్ణుడు తన బాహువులలో నన్ను బంధించినట్లు గోచరించింది. ఇది మొదట అతడు నాకు ప్రసాదించిన లోతైన అనుభూతి. దివ్యదర్శనము.

"భౌతిక విజ్ఞాన శాస్త్రము వివరించలేని విషయాలు నా ముందు చాలా నిలిచాయి. నేను మొదట్లో అతడిని భక్తుడుగా సమీపించలేదు. జ్ఞాన ఎరుకలో దగ్గర చేరలేదు. నాలో అకుంఠితమైన విశ్వాసము కూడా ఉండేది కాదు. నాలో బిరుసుతనం ఉండేది. కొద్దిపాటి నాస్తికుడు కూడా నాలో లేకపోలేదు. అసలు భగవంతుడున్నాడనే పూర్ణ విశ్వాసం కూడా లేదనే చెప్పాలి.

"కానీ, ఏదో నన్ను నడిపించి వేదానికి దగ్గరగా తీసుకెళ్ళింది. గీతకు చేరువుగా నడిపించింది. హిందూమత సమీపానికి నడిపించింది. వేదాంతముపై ఆధారపడియున్న ఈ మతంలో గొప్ప సత్యము ఏదో ఇమిడి ఉందని నాకనిపించింది". - అన్నారు శ్రీ అరవిందులు.

ఈ విధంగా అనిర్వచనీయమైన పరమాత్మ అద్భుతశక్తి శ్రీ అరవింద యోగిని సత్యసదనము వైపు అడుగులు వేయించింది. అందల మెక్కించింది. భావితరాలకు ఉపకరించే మహనీయమైన, మహోత్కృష్టమైన యోగదీపికను ప్రజ్వలింపచేసింది. కారు చీకట్లలో కదిలిన కాంతిరేఖలు కల్లోల ప్రపంచంలోని కల్మష చీకట్లను చెదరగొట్టాయి.

వేమన యోగి

అమలమైన పలుకు లభిషేక వారిధి

తనువు దేవళంబు తాల్మి నొంది

యాత్మ శివునిఁజేర్చు నాతఁడే శివయోగి

విశ్వదాభిరామ వినురవేమ!

పవిత్ర పలుకులు పలుకుటకు నోచుకొనిన పుణ్యాత్ములు తీర్థయాత్రలకై తిరుగ నవసరము లేదనియు, అభిషేకములకు సాగర జలమును తీసుక రానవసరము లేదనియు, ఆలయములు నిర్మించి దేముని ప్రతిష్ఠ చేయ నవసరము లేదనియు, అట్టి పుణ్య చరితుల పవిత్ర మేనులే పరమాత్మకు ఆలయములు కాగా, శివుని దర్శించు వారి ఏకాగ్రదృష్టియే యోగమనియు, వారే శివయోగులనియు వేమనయోగి అభిప్రాయపడినాడు.

వేమనయోగి ఒక విచిత్రమైన వ్యక్తి. అతడు వ్యక్తి కాదు; వ్యవస్థ. అంటే సుస్థిరమైన ఒక వ్యవస్థయా? కాదు. వ్యవస్థనే నిలదీసి, నిగ్గుదీర్చే ఒక దుడుకు వ్యవస్థ. సుడులు తిరిగే దుర్వ్యవస్థలను తట్టి ఆపే సద్విమర్శనాత్మక వ్యవస్థ. విమర్శలలో రమిస్తూ విమర్శలకు దక్కని, పరామర్శలకు చిక్కని ఒక అపూర్వ వ్యవస్థ. అది సంస్థా పరమైన వ్యవస్థ కాదు. వ్యవస్థాపరమైన సంస్థ. గోడలు లేని సంస్థ. మేడలు తెలియని సంస్థ. సమస్యలకు నిలయమైన సంస్థ. సమస్యలను పరిష్కరించే సంస్థ; పారద్రోలే సంస్థ.

వేమవ పేరులోనే ఉంది స్పందన. వేమనను "మన" అని కొద్దిమందియే పిలువ గలుగుతారు. కారణము ఏమి? 'మన'కు ముందు వేముండుటయే. "వేము" ఎవరికైనా కష్టమే గదా!

తినగ తినగ వేము తియ్యనుండు

అని తానే చెప్పుకొని యున్నాడు. వేమన కవిత్వము ప్రారంభములో వేమును అందించినా మననము చేయు సంస్కారము తోడైనచో మననములో 'మన' లభిస్తుంది. అప్పుడే వేమన కొద్దిగా అర్థమవుతాడు. ఎంత అర్థమయిననూ వేమన నుండి వేమును తొలగించి చూడలేక జనులు, కవులు, పండితప్రకాండులందరు బిగిసిపోతుంటారు. విసిగిపోతుంటారు. విమర్శిస్తూంటారు.

వేమన విమర్శను లెక్కచేయునా? అలను చూసి సాగరము భీతిచెందునా? గాలిని చూసి ఆకాశము బెదురునా?

దిక్కులు తెలియని వేమనకు దిక్సూచి అవసరమేమి? 'నీవు వ్రాసిన "ఆంధ్ర కవుల చరిత్ర" గ్రంథములో నాపేరెందులకు తొలగించినావు?' అని కందుకూరి వీరేశలింగము గారిని వేమన ప్రశ్నించునా?

అలంకారములు అగుపించని, కళలు కనుపించని సామాన్య భాష వేమనది అని వారిని నిరసిస్తూ, మనస్సులను కదిలించి కరిగించే హృదయభాష వాది అని వేమన సమాధాన మిచ్చునా?

సత్యమునకు అనుకూలముగ చరించువానిని కులరొంపిలో దింపి వేమన జంగాల జాతివాడు అని నిర్ణయించిన బ్రౌను దొరను ఔను కాదని వేమన వాదించునా?

లింగధారికన్న దొంగలు లేరు

అని నుడివి ఊరకుండును.

మరి వేమన కవిత్వమునందు ప్రామాణ్య మేపాటిది? అని కొందరు చర్చించుచుందురు. ఏ ప్రమాణము నంగీకరించని వాని కవితకు ప్రమాణమేమిటి? ప్రమ నిండిన హృదిలో, భ్రమ చెదిరిన మదిలో నిక్షిప్తమైన ప్రమాణము అమమావ వైఖరి ద్వారా ఎలా గ్రహించవలెనో ప్రమాతలు ఆలోచించాలి.

వేమన సాహిత్యమంతయూ ప్రమాణమైనదియే నని నేను అంగీకరించలేను. కానీ వసంత ఋతువువలె లోకహిత మొనర్చుచు చరించే సంత్ పురుషులు యత్నించి పొందదగిన ఎన్నియో జ్ఞానరత్నములు వేమన కవిత యందు ఉన్నవని నేను చెప్పగలను.

వేమన కవిత్వమునందు ప్రక్షిప్తములున్నవా? కోకొల్లలుగా యున్నవని నా అభిప్రాయము. సామాన్యభాషలో ఉండుటచేత తమ స్వలాభానికి వేమనను ఉపయోగించుకొనుట దుర్మతులగు వారికి దుర్భేద్యమేమీ కాదు. కానీ ప్రామాణ్యము లోపించిన కారణముగా వేమన సాహిత్యమునందు ప్రక్షేపములను చేర్చువారు పెక్కుమంది ఉండరు అని తన దృక్కోణమునుండి దర్శించి నిర్ణయము చేసిన రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి అభిప్రాయముతో నేను ఏకీభవించలేను. ప్రక్షేపములు జరుగుట ప్రామాణ్యమును దృష్టి యందిడుకొని కాదు; ప్రజాదరణను మదిలో దర్శించుకొనియే.

వేదసారమెల్ల వేమనయే యెఱుఁగు

నను మాటను జూడగా బడాయిమాట తప్ప వేఱు గాదు అని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. వేమన నుడివినది వేదసారమేగాని వేదము కాదు. వేమన వాక్కు నుండి వేద మంత్రములను విన కుతూహల పడువారికి ఆ పండితవర్యుల విమర్శ రమణీయముగా నుండునేమోగాని, వేదసారమైన ఆత్మవాణిని ఆలకించ గోరువారికి మాత్రం ఆ విమర్శలు చర్మమును వేడెక్కిస్తాయి.

విమర్శలనే పరామర్శించు వేమనను విమర్శించకుండా ఉండుట కూడా కష్టతరమే. ముందు వెనుకలు చూడని విమర్శను సాహితీ సింహాసనమున కూర్చుండబెట్టి పట్టాభిషేక మొనరించిన ప్రథమ ఘనత వేమనకే దక్కినదనుటలో అతిశయోక్తి లేదు. తనపై ఇతరులు చేయు విమర్శను అతడు లక్ష్యపెట్టడు. దోషములను చూపిన చెదిరిపోడు.

తప్పులెన్ను వారు తండోప తండంబు

లని సరిపెట్టుకొనును. సరిపడి నిలుచును.

వేము డిట్లు చెప్పు వేయి పద్యంబుల
తప్పులెన్నియున్న నొప్పియుండు

నని తానే చెప్పుకొనియెను.

వేమన అద్వైతి యని నిస్సందేహముగా నమ్మవచ్చును. అతని యోగమెచ్చట ఆగినదో, జ్ఞానమెచ్చట ప్రారంభమైనదో నాకు తెలియుటలేదు కానీ అతడు అద్వైత జ్ఞానమును పుణికి పుచ్చుకొన్న తాత్త్వికు డనుటలో అతిశయోక్తి లేదు.

ఉన్నవాళ్ళు ఎందరైనా ఉండొచ్చు. హాయిగా ఉన్నవాళ్ళు ఎందరున్నారీ ప్రపంచంలో? సంపదలున్నా, సుఖాలున్నా, మనసు శాంతిని కోల్పోయి నపుడు మనుగడలో మాధుర్య మేముంటుంది? మదనపడుతూ, మనసును మరగబెట్టుకొంటూ కాలాన్ని నెట్టుకపోతూ ఏం సాధించాలని?

జీవితం శాశ్వతం కాదు. శ్మశానం పెద్ద దూరంలో లేదు. దూరమైనా, దగ్గరైనా కాలానికి కరుణలేదు. కాలాలు, దూరాలు కనికరించవు. ఏదో ఓ క్షణాన కర్కశంగా ఈడ్చుకొని పోతాయి కాటికి.

దాచింది దగా చేయకపోదు. మూసిందంతా మోసం చేసేదే. పెరుగుట విరుగుటకే. కూడిక తరువాత తీసివేతయే. సంయోగాలన్నీ వియోగాలే. వినోదాలన్నీ విలాపాలే. సంబరాలన్నీ సంతాపాలే.

ఎంత ఈదినా కామానికి తృప్తి లేదు. ఎంత చేదినా లోభానికి భర్తీ తెలియదు. ఎంత ఖర్చు చేసినా క్రోధానికి నష్టం అర్థం కాదు.

తరాలు గడచిన ఈ జగన్నాటకంలో తల్లులెవరు? తనయులెవరు? తాతలెవరు? దాతలెవరు? చక్రాన్ని త్రిప్పాలనే ఆశ అందరికీ ఉంటుంది. తిరిగే చక్రాన్ని ఆపాలనే ఆతృత ఎందరి కుంటుంది? చావు నా చేతిలో లేదు. మరి బ్రతుకు నా చేతిలో ఎలా ఉంటుంది? లేనిది ఎలా వస్తుంది?

ఇవన్నీ మానవ మస్తిష్కంలో మౌలికప్రశ్నలు. మనసులో ప్రశ్నలు పుట్టడం సహజం. ప్రశ్నలతో మనిషి చావడం అసహజం. ప్రపంచ జల్లెడతో కాలం నిర్వహించే వడపోతలో అందరూ కారిపోయేవారే. అలాగని ప్రశ్నలతో పారిపోకూడదు. జవాబులు జేబులో పెట్టుకొని జారిపోవాలి.

శేషప్ప కవి

అనేక తారకలను అలంకరించుకొని ఆకాశం అందాన్ని ఒలకబోసినట్లు, వివిధ సుమపరిమళాలను వెదజల్లుచు కుసుమపాద మెల్లగా కులికినట్లు, అనేక రంగులను కలబోసుకొని హరివిల్లు వెలుగులతో విడిది చేసినట్లు, తనివి తీరగ తియ్యని భావాలను గుండెల్లో నింపుకొనిన **నరసింహ శతకము** తన యశఃపతాకమును వేదాంత వినువీధుల్లో ఎగురవేసింది.

ఇది సుందర సుమధుర భక్తి శతకం. మధురభక్తితో మత్తెక్కిన మనోబుద్ధులు మైమరచి రచించిన కవిత్వం. ఇందులో, మనసు గండుమల్లె మంచిగంధం వెదజల్లింది. బుద్ధి నిండు జాబిలి వివేక వెన్నెలను విరజిమ్మింది.

మంచిమాటకు మన్నన దూరం కాదు. మంచి పలికేవారికే మర్యాద పీట వేస్తుంది. కానిమాటకు కళలు, కాంతులు ఉండవు. చెడు పలికే వారిని అమర్యాద సన్మానిస్తుంది. ప్రియంగా పలుకుతుందని చిలుకకు పండ్లు పెట్టి, పాలు పోసి పెంచుతారు. అప్రియంగా అరుస్తుందని కాకిని రాళ్ళతో కొట్టి తరుముతారు.

ప్రియవాక్య ప్రదానేన సర్వే తుష్యన్తి జన్తవః
తస్మా త్తదేవ నక్తవ్యం వచనే కా దరిద్రతా ॥

ప్రియంగా పలకడం వలన సర్వ జీవకోటి సంతోషిస్తున్నది. కనుక సదా ప్రియంగా మాట్లాడాలి. ముల్లెకు ఉండొచ్చేమోగాని, మాటకు దారిద్ర్య మెందుకు?

ఈ శతకకర్త శేషప్ప ఆ విషయంలో గొప్ప ఐశ్వర్యవంతుడు. మంచి మంచి మాటల్ని పలికే పువ్వు వంటి మనసున్న కవి. ఇతని కవిత్వంలో నవత్వముంది. నవరసాల్ని సీసం పోసిన గట్ల మధ్య ఏరులా పారిస్తాడు శేషప్ప కవి. ఇతనికంటూ కొన్ని స్థిరమైన భావాలున్నాయి. సహజంగా ఇతని నుండి కవితా వరద ప్రవహించిందే గాని కవిత్వము చెప్పాలనే దురద లేదు. ముఖ్యంగా, ఈ కవికి, కాదు ఈ భక్తకవికి పురుషార్థ నిర్ణయము సుస్పష్టంగా ఉంది. కనుకనే రచన చాలా ప్రబోధాత్మకంగా, పవిత్రంగా సాగింది.

దేహము అశాశ్వతం. ధనం అనర్థం. అవసాన కాలాన స్మరణ జరుగుతుందో లేదో ఇప్పుడే ఆ చేసేదేదో చేయాలి అంటాడు. తాను చేసే భక్తి పరుల మెప్పును వాంఛించదంటాడు. రక్షరేకులు, భూతవైద్యాలు, పాముమంత్రాలు, తాయెత్తులను దగ్గరికి రానివ్వడు. నామమందే అతనికి రుచి.

నీవు కలలో కూడా కనిపించవు. నేను దుష్టుడను కనుకనా! అని పిల్లవాని హృదయంతో చలింపచేస్తాడు. అడవిలోని మృగాలకు, చెట్లపైన పక్షులకు ఆహార మెవరిచ్చారంటూ పరమాత్మని విశ్వంలో సర్వాధ్యక్షునిగా దర్శిస్తాడు.

పిలిస్తే పలకవెందుకని? అంటూ నిజాయితీ కలిగి భగవంతుని నిలదీస్తాడు. పూర్వం భక్తుల గొప్పేమిటి? అని వెటకారం చేస్తాడు. కాపాడకపోతే కదలనివ్వను అని గగుర్పొడిచేలా జగడ మేస్తాడు. వర్ణాశ్రమాలకు వేద నిర్వచన మిస్తాడు. కులప్రసక్తి తెచ్చి కుళ్ళునంతా కడిగి కళ్ళు తెరిపిస్తాడు.

"నాకు మోక్ష మొక్కటే కావాలి" అని ఖచ్చితంగా పలుకుతాడు. మచ్చుకు కొన్ని వాక్యాలు చూద్దామా!

ధరణిలో వెయ్యేండ్లు తనువు నిల్వగబోదు ధన మెప్పటికి శాశ్వతంబు గాదు
అంత్యకాలమునందు నాయాసమున నిన్ను తలతునో తలపనో తలంతు నిపుడె
చిత్తశుద్ధిగ నీకు సేవ చేసెద గాని పుడమిలో జనుల మెప్పులకు కాదు
పాము కాటుకు నిన్ను భజన చేసెద గాని దాని మంత్రము నేను దలపనయ్య
అమరేంద్ర వినుత నేనతి దురాత్ముడనంచు గలలోన నైనను కనులబడవు
అడవి పక్షుల కెవ్వ డాహార మిచ్చెను మృగజాతి కెవ్వడు మేత పెట్టె
ఇభరాజవరద నిన్నెంత పిల్చినగాని మాఱు పల్కవదేమి మౌనితనము
ప్రహ్లాదు డేపాటి పైడి కానుక లిచ్చె మదగజం బెన్నిచ్చె మౌక్తికములు
నేడు కరుణింపకుంటివా నిశ్చయముగ తెగబడెద జూడు నీతోడ జగడమునకు
జందె మింపుగ వేసి సంధ్యవార్చిన నేమి బ్రహ్మమందక కాడు బ్రాహ్మణుండు
వ్యాసు డే కులమందు వాసిగ జన్మించె విదురు డే కులమందు వృద్ధి బొందె
నేను గోరిన దొక్కటే నీలవర్ణ చయ్యునను మోక్ష మిచ్చిన జాలునాకు

ఇలా శేషప్ప పలుకుతుంటే అశేష భక్తకోటి పరవశించింది. వ్యక్తిలో మెరిసిన భక్తితో విశ్వం మురిసింది. విశ్వకళ్యాణ ద్వారానికి మంగళతోరణం కట్టింది నరసింహ శతకం.

ఈ శతకమంతా వివేకమయం. వైరాగ్యమయం, భక్తిమయం, భగవన్మయం, "నాగశయనా! గరుడగమనా!" అంటూ పదాలతో ఈ కవి కదం త్రొక్కుతుంటే, పాము పుణ్యమేమి? పక్షి సుకృతమేమి? అని మన ఒడలు పులకరిస్తుంది.

ఈ శేషప్ప కవి నైజాం మండలం వాడని అంటారు. చిత్తూరు నెల్లూరు మధ్యన ఉండినాడేమో అనిపిస్తుంది శతకం చదువుతూ ఉంటే. నాకు ఇలాంటి వివరాల మీద ఆసక్తి ఉండదు. నేను పరిశోధకుణ్ణి కాను. అతడెక్కడ ఉండినాడో చెప్పలేను గాని అతని మనస్సు మాత్రం సదా నరసింహమూర్తి చరణ కమలములందు ఉండినదని చెప్పగలను. ఇకపోతే ఆయన కాలం......

శేషప్ప కవి పదవ శతాబ్దము వాడని కొందరు అంటారు. పోతనామాత్యునికి ముందు వాడేనని కొందరు, తరువాత వచ్చినాడని మరికొందరు చెబుతారు. ఈ శతకకర్త ప్రభావం భద్రాచల రామదాసుపై కూడా ఉందని, ఆయన దాశరథీ శతకం వ్రాయడానికి పురికొల్పింది నరసింహ శతకమే నని కొందరి అభిప్రాయము.

ఈ కవి కాలం నేను నిర్ణయించలేను. ఇతడు భక్తుల నాల్కలపై ఉంటాడు కలకాలం - అని చెప్పగలను.

వెన్న కన్నను సాధువే మిన్న

హృదయము గలవానిలో ప్రేమ ఉదయిస్తుంది. శరీరములో హృదయము ఉంది. హృదయము అనెడి పదములో మధ్య నున్న రెండు అక్షరములు "దయ"గా ఉన్నది. కనుక దయగల హృదయమే భగవ న్నిలయము. ఎవరి హృదయము దయామృత ధారలతో తడిసి ఉంటుందో అట్టి హృదయమును సాధారణముగా వెన్నతో పోలుస్తారు. వేడి తగిలితే వెన్న కరుగుతుంది. పైగా వెన్న సున్నితముగా ఉంటుంది. అలాగే సజ్జనుని హృదయం కూడా సున్నితంగా ఉంటుంది. వెన్న కరిగేందుకు అగ్ని అవసరము. కానీ తాను ఏ బాధాగ్నికి గురి కాకుండానే సజ్జనుడు ద్రవిస్తాడు. తనకు వేడి తగులుట చేత వెన్న ద్రవిస్తుంది. కానీ పరుల బాధలను చూచి సజ్జనుడు ద్రవిస్తాడు. తన బ్రతుకు హాయిగా సాగుతున్నా అన్యుల బాధలలో బోధల నందుకొని పరితపించే సౌజన్యమూర్తి సజ్జనుడు. కనుక సజ్జనుడు వెన్నకన్నను మిన్నయై ఉన్నాడని శాస్త్ర నిర్ణయము.

శ్లో॥ సజ్జనస్య హృదయం నవనీతం యద్వదన్తి కవయ స్తదలీకమ్
అన్యదేహ విలస త్పరితాపా త్సజ్జనో ద్రవతి నో నవనీతమ్ ॥

భావము:- సాధు హృదయం నవనీతము వంటిదని కవులు ప్రవచిస్తారు. అది నిజము కాదు. ఇతరుల బాధలను గాంచి సాధువు ద్రవిస్తాడు. కానీ వెన్న ద్రవించదు.

ఇతరుల బాధలను మనము అర్థము చేసుకొన గలిగినపుడే అచ్యుతుడు మన బాధలను అదృశ్యం చేస్తాడు. ప్రక్కవాని నావకు తెడ్డువేసి నపుడే మన నావ హాయిగా తీరం చేరుతుంది.

బాధ లనేవి ఒక వ్యక్తికే పరిమితం కావు. ఒక వ్యక్తినే అంటిపెట్టుకోవు. కష్టాలు ఎవరినీ కనికరించవు. కన్నీళ్ళు ఎవరినీ విడిచిపెట్టవు. ఈ దినం మనము హాయిగా జీవించుచున్నను రేపు మన బ్రతుకు బాధలమయం కాదనే నమ్మకము లేదు. ప్రమాదములో చిక్కిన వారికే ఇతరుల ప్రమాదములు అవగతము కానపుడు మరి ఎవరికి అర్థమవుతాయి? బాధా జీవులను గాంచి పరితపించే హృదయాన్ని సాధకులు కలిగి యుండాలి. అట్టివారే సజ్జనులు లేదా సాధువులు అని పిలువబడుతారు. పిట్టకు కలిగిన బాధను గాంచి ఆదికవి కలత చెందాడు. కుక్కకు జరిగిన అన్యాయమును చూసి వ్యాసుడు కలవర పడ్డాడు. శునకమునందు నామదేవుడు పాండురంగని దర్శించాడు. పక్షి కొరకు శిబిచక్రవర్తి శరీరాన్ని కోసిపెట్టాడు. భూతదయ అనేది భగవత్ప్రాప్తికి ముఖ్య సోపాన మని మరువకూడదు.

దేహస్థాయిలో జీవించే వారి యందు ఈ స్పందన గోచరించదు. దేహ స్థాయి భేదమును సూచిస్తుందే గాని సమజీవనమును చిగురింప చేయదు. మనోస్థాయిలో కాస్త కదలిక జనిస్తుంది. వాస్తవానికి చైతన్య స్థాయిలోనే పూర్ణ స్పందన అభివ్యక్తమవుతుంది.


దేహములు పరిమితాలు కనుక సంకుచిత భావము చిగురించి భేదభావములు రూపుదిద్దుకుంటాయి. చైతన్యము అద్వయము గనుక వ్యక్తి చైతన్యస్థాయిలో జీవించగలిగితే తన అవసరములవలె ఇతరుల అవసరాలు గోచరిస్తాయి. తన బాధల వలె ఇతరుల బాధలు బోధపడుతాయి. ఇక్కడే వాస్తవమైన యజ్ఞజీవనము ఆవిష్కరింప బడుతుంది.

ఏ సమాజము సజ్జనులతో నిండి ఉంటుందో అట్టి సమాజము విశ్వశాంతికి నాంది పలుకుతుంది. సమసమాజ నిర్మాణమనేది సమదర్శనము గల వ్యక్తుల కృషి ఫలితముగానే లభిస్తుంది.

ఉన్నాయి ఎన్నో ప్రపంచంలో కొనేందుకు
ఉన్నది నిజానికి పరమాత్మ ఒక్కడే కనుగొనేందుకు
కొన్న వెన్నడూ తీర్చవు బ్రతుకులో కరువు
ఉన్న వెన్నుడే జీవులందరికి కల్పతరువు
సౌకర్యాలు ప్రాప్తిస్తాయి పుష్కలంగా ఉంటే సిరి
సుఖాలు కావాలంటే హృదయంలో నిలవాలి హరి
ధనం కనికరిస్తే ఎవరైనా పొందగలరు ఔషధం
దైవం కరుణిస్తేనే ఎవరికైనా ఇలలో ఆయుర్దాయం.
ఎన్ని వున్నా లేదేదో అనేదే మనిషిలో ఏకైక కామం
ఏదీ అవసరం లేదని తృప్తి నిచ్చేదే మహిలో నామం.

ధ్యాన దీపం

ఇందులో...



ధ్యాన యోగము

సాధ్యము - సాధన

దేనిని నీవు సాధించాలని భావిస్తావో అది నీకు 'సాధ్యము' అవుతుంది. అట్టి సాధ్యాన్ని దేని ద్వారా సాధిస్తావో అది సాధన అవుతుంది. సాధన ద్వారా సాధ్యమును సాధించే నీవు సాధకుడవు అవుతావు.

జీవితంలో సాధ్యాలు మారుతున్నాయి. కనుక ఇష్ట సాధనలు కూడా మారుతున్నాయి. జీవితంలో ఏది ఇష్ట సాధనో తెలియనపుడు ఏది పొందినా దాని వలన దుఃఖమే ప్రాప్తిస్తుంది.

పొందక ముందు ప్రతిదీ ఇష్టంగానే ఉంటుంది. పొందగానే మరొక దానిని పొందాలి అనిపిస్తుంది. ఈ విధంగా మనసులో సాధ్యాలు మారుతుంటాయి. వాటికి అనుగుణంగా సాధనలు మారుతుంటాయి. కాని సాధకుడు మాత్రం మారడు. తనకన్నా సాధ్యం వేరుగా ఉందని భావించటం చేత తాను సాధకుడని అభిప్రాయపడతాడు. కాని, శాస్త్ర దృష్టిలో సాధ్యము తానే. నీవు స్వతఃసిద్ధమైన ఆత్మవు. అనంతుడవు. ఈ సత్యం తెలిస్తే మనసు అన్య సాధ్యములను అన్వేషించదు. మరి తానే అనంతుడైనపుడు తనకు ఎందుకు తెలియడం లేదు? అజ్ఞానము ఉండుట చేత. ఈ అజ్ఞానమే ఆవరణ దోషము.

ఫలించని ప్రమాణం

అజ్ఞానము జ్ఞానము వలన నశిస్తుంది. గురువు జ్ఞానమును ఇవ్వగనే ప్రమాణం లభించుట చేత ఆవరణ భంగం కావాలి. మరో సాధన అవసరము లేదు. కాని, కాలేదు. ఎందుకని? ప్రమాణం ఫలించలేదు. ఫలించనిది ప్రమాణ మెలా అవుతుంది? కనుక ప్రమాణం ఫలించక పోవడానికి కొన్ని ప్రతిబంధకాలు ముముక్షువులో ఉండాలి. కాదు; ఉన్నాయి. అవియే 1. మల దోషము, 2. విక్షేప దోషము. ఈ దోషాల వలన గురువు అనుగ్రహించిన ప్రమాణం ఫలించకుండా పోయింది.

దృశ్యన్తే హి పురుషాః రాగాది గౌరవాత్ శాస్త్రం అతిక్రామన్తః

"రాగద్వేషాలతో నిండిపోయిన వారు శాస్త్రమును కూడా ధిక్కరిస్తూ ఉంటారు" అని శ్రీ శంకరులు బృహదారణ్యా కోపనిష ద్భాష్యంలో తెలుపుతారు. అలాంటప్పుడు ప్రమాణమైన శాస్త్రము ఎలా ఫలిస్తుంది?

ప్రతి బంధకములు - నివారణము

మొదటిది మలదోషము. రాగద్వేషములే మల దోషము. రాగద్వేషాలు ఉన్నంత వరకు ఉన్నవాటిలో సగ భాగాన్ని రాబట్టుకొనేందుకు యత్నించాలి. సగమును పోగొట్టు

క్కొనేందుకు ప్రయత్నించాలి. రాగద్వేషాలు పోతే ఏదీ పొందనవసరము లేదు. దేనినీ వదిలించుకో నవసరమూ లేదు. రాగద్వేషాలు పోగానే వాంఛించిన శాంతి పదింతలై కనిపిస్తుంది.

రాగద్వేషాలనే ఈ మలదోషము ఉండుటచేత మనస్సు చపలంగా, చంచలంగా కదులుతూ ఉంటుంది. ఇది రెండవ దోషము. దీనిని విక్షేప దోషము అంటారు. ఈ రెండు దోషాలు తొలగితే మనస్సు విశుద్ధ మవుతుంది. అట్టి మనసు ప్రమాణమును స్వీకరించే శక్తి కలిగి ఉంటుంది. ప్రమాణమును గ్రహించుట చేత అజ్ఞానము అంతరిస్తుంది. అజ్ఞానము నశించగనే ఆత్మ స్వతఃసిద్ధమై భాసిస్తుంది.

విశుద్ధం ప్రసన్నం ఆత్మావలోకన క్షమం భవతి

'ఎప్పుడైతే మనస్సు విశుద్ధమై, ప్రసన్న మవుతూ ఉందో ఆత్మను దర్శించుటకు అర్హతను కలిగి ఉంటుంది" అని శ్రీ శంకరులు బృహదారణ్యా కోపనిష ద్భాష్యంలో తెలిపారు.

విశుద్ధము అంటే రాగద్వేషాల నుండి విడిపడటము అని అర్థము. నీకు అందిన వాటికన్నా, అందబోయే వాటికన్నా అందమైనది, అద్భుతమైనది నీలో ఇప్పుడే ఉంది. ఈ దివ్యానందమునకు ప్రతిబంధకములైన మల విక్షేపాదులను తొలగించుకోవాలి.

గీతలో బోధించిన విధంగా కర్మయోగమును అనుష్ఠించుట చేత రాగ ద్వేషములనే మలదోషము పోతుంది. ఇది బహిరంగ సాధన.

మలదోషము దట్టముగా ఉన్నప్పుడు అంతరంగంలో మనస్సు తీవ్రంగా చలిస్తూ ఉంటుంది. ఇదియే విక్షేపము. ఈ విక్షేపమును నిరోధించుటకు ధ్యానము నాచరించాలి. ఇది అంతరంగ సాధన.

ధ్యానయోగో సమ్యగ్దర్శనస్య అంతరంగమ్

"ఆత్మ దర్శనానికి (జ్ఞానానికి) ధ్యానము అంతరంగ సాధన" అని శ్రీ శంకరులు భగవద్గీత 5వ అధ్యాయములో 27వ శ్లోకమునకు వ్యాఖ్యను ప్రారంభిస్తూ తెలిపారు.

'దీపదర్శనం' లో ఇంతవరకు బహిరంగ సాధనకు ప్రాధాన్యమిస్తూ మలదోషమును పోగొట్టుకొనే ప్రయత్నములో కొన్ని విషయాలను చర్చించాము. ఇంకా చర్చించవలసినవి చాలా ఉన్నాయి. వాటిని సందర్భానుసారంగా అందిస్తూ పోతాను. ప్రస్తుతము "ధ్యానము" అనే అంతరంగ సాధన వైపుకు వెళ్తున్నాము.

ధ్యానమెందుకు?

ధ్యానము అనేది కొన్ని పద్ధతులలో బిగించబడిన ప్రక్రియ. ఒక విధంగా చెప్పాలంటే అదొక క్రియ. కర్మలు, క్రియలు కర్తను అందించవు. ముందుంచలేవు. ధ్యానంవల్ల ఆత్మజ్ఞానం కలుగదు. పూర్ణత్వం సిద్ధించదు.

మనసులోని విక్షేపాన్ని ధ్యానం అరికడుతుంది. తద్వారా విశుద్ధమైన అంతఃకరణ జ్ఞానమును పొందుటకు అనుకూలమవుతుంది.

విక్షేప నిర్మూలనకు ధ్యానమే ఎందుకు చేయాలి? ధ్యానంగాని, జపంగాని చేసేటప్పుడు కొందరు సగుణముపై, మరికొందరు నిర్గుణముపై చేస్తారు. గురువు ధ్యానమంత్రాన్ని ప్రసాదిస్తాడు. ఆ మంత్రాన్ని మనం జపిస్తాము. లేదా ధ్యానిస్తాము.

ప్రారంభ సాధకులకు పూజ ఉపకరిస్తుంది. కాని, పూజలో విక్షేపానికి ఎక్కువ అవకాశముంది. బుట్టలో పువ్వులున్నాయి. "ఓం శ్రీకృష్ణాయనమః" అంటూ అష్టోత్తరం ప్రారంభించి భగవానుని చిత్రముపై, లేదా మూర్తి పాదపద్మములపై పూలు వేస్తూ ఉంటాము. ఈలోగా అందమైన ఆ పూలబుట్ట తెచ్చి ఇచ్చిన స్నేహితుడు జ్ఞాపకం వస్తాడు. గతవారం ఆ స్నేహితుని కుమారుని నీవు కాలేజిలో చేర్పించిన విషయం జ్ఞాపక మొస్తుంది. ఆ ప్రిన్స్‌పాల్ జ్ఞాపక మొస్తాడు. వెంటనే నీవు చిన్నప్పుడు చదువుకొనిన కళాశాల ప్రిన్స్‌పాల్ జ్ఞాపక మొస్తాడు. ఇలా సంకల్పాల సందడి జోరుగా తెలియకుండా సాగుతుంది. ఇదే విక్షేపము.

ధ్యానంలో లేదా జపంలో మంత్ర మొక్కటే ఉంటుంది. ప్రతిదీ ప్రతిదానితో సంబంధము కలిగి యున్న ఈ ప్రపంచంలో మంత్రము ఒక ప్రత్యేక స్థితిలో నిలిచి ఉంటుంది. "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని మంత్రము నుచ్చరించాము. ఆ తరువాత మళ్ళీ అదే మంత్రాన్ని ఉచ్చరిస్తాము. దేనికి అదే సమాప్తంగా ఉంటుంది. పూలబుట్ట ఎక్కడెక్కడో త్రిప్పినట్లు తిరిగే అవకాశము చాలా తక్కువ. అందుచేత విక్షేపమును బాగా తగ్గించే ధ్యానము యొక్క, లేదా జపము యొక్క అవసరం ఎంతైనా ఉంది.

ధారణ - ధ్యానము

ధారణ అనేది ఏకాగ్రత. ధ్యానము అనేది సాధన. ధారణ ఉంటే ధ్యానం బాగా జరుగుతుంది. నిజం చెప్పాలంటే ఆసక్తి మీదనే ధారణ ఆధారపడి ఉంటుంది. కొందరికి ఆసక్తి తక్కువగా ఉండినా శ్రద్ధగా ధారణ చేయుట చేత ఆసక్తి ఇనుమడించడం కూడా జరుగుతూ ఉంటుంది.

ధ్యానానికి ఏకాంతము చాలా ఉపకరిస్తుంది. ఈ దశలో ఒంటరితనాన్ని ఏకాంతంగా భావించటంలో దోషం లేదు.

ఏకాంతంలో ప్రశాంతంగా కూర్చో. ఏ ఆలోచన లేకుండా ఖాళీగా. అలా ఎంతవరకు ఉండగలవో అంతవరకు ఉండు. నేను ఏకాంతంలో ఏ ఆలోచన లేకుండా ఉన్నాను అనే ఆలోచన కూడా లేకుండా ఉండటం ముఖ్యం.

ఇలా కొంత సమయం ఉండగలిగితే తద్వారా మహత్తరమైన ఆనందం కలుగుతుంది. అది వదిలిపెట్టలేని స్థితిలో నిన్ను పడేస్తుంది. ఇదొక ప్రశాంతమైన స్థితి.

ఈ స్థితిలో ఆలోచన వస్తే, నేను హాయిగా ఉన్నాను అనే ఆలోచన వస్తుంది. ఆ హాయి ఏమిటో నీకు తెలిసింది కదా! కనుక నేను హాయిగా ఉన్నాను అని కాక, హాయిగా ఉన్న మనోస్థితికి నేను సాక్షిగా ఉన్నాను అని గుర్తించాలి.

ధ్యానంలో నీవు చేరాలనుకొనేది మనస్సు లేని చోటికి. ఇప్పుడు నీవున్నది ప్రశాంతమైన మనసున్నచోట. ఈ తేడాను జాగ్రత్తగ అర్థం చేసుకో. ఇది తయారు చేసుకోగలిగితే ధారణ సిద్ధించినట్లే. ధారణ సిద్ధిస్తే ధ్యానం సునాయాసంగా సాగుతుంది.

ధ్యాన ప్రవేశం

రూపం లేనిదే కొందరు ధ్యానించలేరు. అట్టివారు మూర్తి ధ్యానం చేస్తారు. తప్పు లేదు. అఖండమైన పరమాత్మ నుండి ఏ రూపమూ వేరుగా ఉండలేదు. రూపం అవసరమయితే ఉంచుకో. కాని అవగాహనను పెంచుకో. మూర్తిని ఒక బొమ్మగా, చిత్రంగా పరిమితం చేయకు. ఆ మూర్తి ఏ దీప్తిని వ్యక్తం చేస్తూ ఉందో దానిలోనికి స్ఫూర్తితో బుద్ధి చొచ్చుకొని పోయేలా చూసుకో. ఇది చాలా ముఖ్యం.

"మనసా! ధ్యానం చేయబోతున్నాను. నీవు ప్రపంచము వైపు వెళ్ళకు" అని చెప్పకు. "మనసా! ఈ ధ్యాన సమయంలో నీవు అఖండానంద పరబ్రహ్మమువైపు దొర్లిపో", అని చెప్పు. ప్రపంచం నుండి విడిపో అని మనస్సుకు సూచన ఇవ్వకూడదు. పరమాత్మలో పడిపో అని స్ఫూర్తి నివ్వాలి.

జపం చేసే టట్లయితే జపమాలను వాడండి. మీకు జపం ఇష్టమైతే జపం చేయండి. ధ్యానం ఇష్టమైతే ధ్యానం చేయండి. ఆ రెండిటి మధ్య ఈ దశలో భేదం చూడనవసరం లేదు. అవసరాన్ని బట్టి నేను వివరణ నందిస్తూ పోతాను.

మనసులో మంత్రం

ప్రపంచాన్ని మనసే చిత్రించింది. మనసు ఆగితే ప్రపంచం ఆగుతుంది. మనస్సు కన్నా వేరుగా ప్రపంచం లేదు. కనుక ప్రపంచం స్ఫురిస్తే మనసున్నదని అర్థం. మనస్సు ఉంటే మనస్సులో ప్రపంచంకన్నా అన్యమైనది ఉండదు.

కాని, ఇప్పుడు మన మనసులో మంత్రముంది. 'ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ' - ఏ మంత్రమైనా కావచ్చు. మంత్రమేదైనా అది తెలుపుతున్నది ప్రపంచాన్ని కాదు. పరమాత్మని. ఇంతవరకు మనసులో ప్రపంచమే ఉండింది. ఇప్పుడు ప్రపంచానికి అతీతుడైన పరమాత్మ మంత్ర రూపంలో మనసులో దిగాడు. 'ఓం నమశ్శివాయ' అంటే మంగళకరుడైన వానికి నమస్కారము అని అర్థము. ఏది మంగళము? అనే ప్రశ్న ఉదయించగనే ప్రపంచము అస్పష్టమై, పరమాత్మ స్పష్టమౌతున్నాడు.

అలాగే, అందరిలో వసించే జ్ఞాన చైతన్యము వాసుదేవుడు. అలాంటిది ప్రపంచములో మరొకటి లేదు. కనుక మనసులో నిలిచిన మంత్రము మనసును మహిమతో నింపేస్తుంది.

అర్థరహితమైన శబ్దాలను మంత్రాలుగా కొందరు ఇచ్చి, ధ్యానాలు నేర్పిస్తున్నారు. ఎవరి ఇష్టానుసారము వారు పోవచ్చు. కాని అలాంటి, శబ్దాలను ధ్యానమంత్రాలుగా స్వీకరించకూడదు. పూర్ణావగాహనతో ఈ మాట చెబుతున్నాను. దానిపై ఈ సందర్భంలో వ్యాఖ్యానించి, స్థలాన్ని సమయాన్ని, సందర్భాన్ని వృథా చేయలేను.

ధ్యాన విహారము

ధ్యానానికి ఆసనముపై కూర్చోవడం, లేదా జపమాల తీసుకొని జపము చేయుటకు సిద్ధం కావడమంటే, టిక్కెట్టు కొని రైలు ఎక్కినట్లు భావించాలి. ఇక బండి తానంతట తాను నడిచిపోతుంది. ఎక్కడైనా ఆగితే స్టేషన్ వచ్చి ఉంటుంది. ఆగేది సాగేందుకేనని తెలిస్తే చాలు. ఆదుర్దా ఉండదు.

ఏదీ ఆలోచించకుండా ప్రశాంతంగా పడుకోగానే నీవు నిద్రలోకి ఎలా జారిపోతావో అలాగే జపమాల పుచ్చుకొని కళ్ళు మూసుకోగానే, లేదా ధ్యానమునకు ఉపక్రమించి కళ్ళు మూయగనే జపంలోకి, లేదా ధ్యానంలోకి అలా అప్రయత్నంగా జారిపోవాలి.

మంత్రం లోన నడుస్తూ ఉండాలి. నిద్రలోకి జారకుండా, ప్రపంచంలోకి ప్రాకకుండా మనస్సు మంత్రాన్ని జపిస్తూ ఉంటే, లేదా ధ్యానిస్తూ ఉంటే, నీవు నీకు తెలియకుండానే ఏదో సాధిస్తున్నావు అనేది సత్యం.

ఇక్కడ ఓ విధమైన ఆనందం కలుగుతుంది. ఈ ఆనందాన్ని నీవు అనుభవిస్తున్నట్లు నీకు తెలుస్తూ ఉంటుంది. కనుక ఈ అనుభవము సాక్ష్యానుభవము కాదు. అసలు అనుభవము అనే పదము సాక్షీ చైతన్యానికి అతకదు. అనుభవం అనే విషయాన్ని మనం ప్రపంచంలో ఏరుకున్నాము. స్వరూపానుభూతిలో అనుభవం చెలామణి కాదు. ఈ సత్యం తెలిసి ఉండటము చాలా అవసరం.

అనుభవాన్ని అందించే మనస్సుపై ప్రస్తుతమున్న నీ దృష్టిని సాక్షీ చైతన్యము వైపుకి త్రిప్పాలి. ఇది అనుభవం కాదు. తిరిగిన దశలో అనుభవ ముండదు. అనుభవం తెలియని, శూన్యం కాని స్వరూప స్థితిలో అఖండంగా ఉండిపోవుటయే అవుతుంది. మనసు అలా మూగబోయిన దశలో ఏది ఉంటుందో దానిని గూర్చి ఆలోచించకు. సాక్షియై వీక్షించు. ఇది ధ్యాన జీవితము. ఇది నీవు ఆలోచించేది కాదు; నిన్ను ఆలోచింప చేసేది కాదు. నీవు తయారు చేసుకొనేది. ఆ తరువాత సాక్షియై వీక్షించేది. నీలో నీవు నీవుగా మిగిలిపోయేది.

ఆగిన ప్రయాణము

బండి ఆగినంత మాత్రాన మనం దిగ నవసరం లేదు. అది మన స్టేషనో కాదో, ఇంతకీ బండి ఎందుకు ఆగిందో - ఇవన్నీ తెలుసుకోదగిన విషయాలే ప్రయాణంలో.

హాయిగా సాగే ధ్యానం బండి ఆగినట్లు ఆగిపోతుంది. కొంతసేపు ధ్యానం లేదా జపం చక్కగా నడుస్తుంది. మరి కొన్ని సమయాల్లో నడవదు. అప్పుడు ధ్యానం చెడిపోయింది అనుకుంటావు.

ధ్యానం చెడిపోయింది అని భావించటం వాస్తవం కాదు. ప్రతిబంధకాలు అడ్డు నిలిచాయి. విచారణ చేస్తే ఆ ప్రతిబంధకాలు రాగద్వేషాలై ఉంటాయి. ఇవి జీవితంలో మనం తయారు చేసుకున్నవి. వాటిని అవగాహనతో తటస్థ పరచాలే గాని ధ్యానం చెడిందని, జపం పాడైందని నిరాశ చెందకూడదు. ఇక్కడ సాధన చెడిపోలేదు. ఒక నూతన మలుపు తిరిగింది. దీనిని జాగ్రత్తగా గుర్తించాలి.

ఉన్నవే.....ఉపకరించేవే

చాలా కాలంగా చిమ్మకుండా ఉన్న గదిలో దుమ్ము ఎంత ఉందో మనకు తెలియదు. చిమ్మటము ప్రారంభించగనే మేఘసరంలా దుమ్ము లేస్తుంది. గదిలో ఎంత దుమ్ము ఉండిందో అప్పుడు తెలుస్తుంది. దుమ్ము ఉందని గుర్తించగనే దులిపేందుకు ప్రయత్నిస్తామే గాని దానిలోనే పడి దొర్లాలి అనుకోము.

అవరోధాన్ని గుర్తించటం కూడా గొప్ప అవగాహనే. గుర్తించ గలిగితే అవరోధాన్ని కూడా నీవు అభినందించ గలుగుతావు. ప్రతిబంధకాలతో కరచాలనం కూడా చేస్తావు.

నిత్యము చిమ్మకపోతే ఉపయోగం లేదు అని లేచిన దుమ్ము నిన్ను వాస్తవంలో కూర్చోబెట్టినట్లు, ప్రతిరోజు జప ధ్యానాదులు సాగించకుంటే లాభం లేదని ప్రతిబంధకాలు నీకు బోధిస్తాయి. సోమరిపోతును కూడా శ్రమించి సంపాదించే వానిలా తయారు చేసేది అప్పుల వాళ్ళే అనే సత్యాన్ని మరచిపోకూడదు.

ప్రయత్నము వెంటే ప్రగతి

వేగంగా నడవలేక పోవడం లోపం కాదు. వెనుకంజ వేయడమే దోషం. ధ్యాన యోగి ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకోకూడదు. పట్టింపులు మనసును ఒత్తిడికి గురి చేసి మార్గాన్ని తప్పిస్తాయి. వచ్చేవి వస్తుంటాయి. పోయేవి పోతుంటాయి. వాటి విలువ ఏమిటో, ఉపయోగమేమిటో అంచనా వేయడం అలవాటు చేసుకోవాలి. దాగుడు మూతలు ఆడే పిల్లలు దొరికి పోయినపుడు కూడా విరగబడి నవ్వుతారు. ఓటమిలో నీవు కూడా అలాగే ఉండాలి. అప్పుడే ధ్యానం నిరాటంకంగా సాగుతుంది.

అరుణోదయానికి ముందు అంధకారం దట్టంగా ఉంటుంది. జ్ఞానోదయానికి ముందు కూడ అంతరంగం చీకట్లతో దట్టంగానే ఉంటుంది. భయపడకు. వెలుగు నీ వద్ద ఉంది. ఎలా ఉందో నేను చెబుతాను. చీకట్లు పారిపోతాయి.

మళ్ళీ మొదలు

'ఓం నమశ్శివాయ' - మళ్ళీ మంత్రాన్ని ప్రారంభించాలి. రెండు.....ఇరవై రెండు... ఎనభై ఆరు....నూట ఎనిమిది. మాల త్రిప్పు. సంఖ్య ముఖ్యం కాదు. మంత్రము

ఒక్కటే. ఎన్ని మార్లు చెప్పినా ఒక్కటే. ఎన్నిమార్లు మంత్రాన్ని పఠిస్తే తెలియకుండానే అన్ని మార్లు నిశ్శబ్దాన్ని అనుభవించక తప్పదు. అది ఎంతకాలమో చెప్పలేము. కాని, లేదని మాత్రం నిరాకరించలేము.

మంత్రానికి మంత్రానికి మధ్య గోపభామల మధ్య గోపాలు డున్నట్లు నిశ్శబ్దం ఉంది. మంత్రము నీకు దగ్గరైనపుడు నీవు నిశ్శబ్దానికి దగ్గరవుతున్నావు. నిశ్శబ్దం ఎప్పుడూ ఉంది. మంత్రం వచ్చిపోతూ ఉంది. ఎప్పుడూ ఉండే నిశ్శబ్దం మంత్రమున్నప్పుడు లేకుండా ఎలా ఉంటుంది? అప్పుడు కూడా ఉంది. మంత్రానికి ముందు, మంత్రము తరువాత ఏ నిశ్శబ్దముందో అది మంత్రము నడిచేటప్పుడు కూడా ఉంది. ఇప్పుడు జాగ్రత్తగా అర్థం చేసుకో. నీవు మననం చేసే మంత్రము సంఖ్య ఎంతయినా, అవన్నీ నిశ్శబ్దంలోనే - అదే, నీలోనే నడుస్తున్నాయి. ఇప్పుడు నీవూ నిశ్శబ్దమే - నీకు తెలిసేది నిశ్శబ్దమే. ఇదియే ధ్యానం. ఇదియే జపం. ఇదియే సాధన. సాధకుడైన నిన్ను సాధ్యమైన నీకు దగ్గర చేర్చే ధ్యాన సాధన. జప యోగ సాధన.

పారిపోతే పోనీ.......నీవు జారిపోకు

ధ్యాన సమయంలో ప్రశాంతత ఉంటుంది. నీవు ఆనందిస్తావు. ఈలోగా పోతుంది. అంటే, మనసు మరెక్కడికో పారిపోతుంది. దానికి కారణం మళ్ళీ రాగద్వేషాలే కదిలుంటాయి. ఆ ఒత్తిడికి మనసు మనసులో నిలువలేక పారిపోయి ఉంటుంది.

"ధ్యానంలో నా మనస్సు నిలవడం లేదు. చంచలమై పోతోంది"; అని ఇలాంటి పరిస్థితినే చాలా మంది నిలకడ లేని స్థితిగా చెబుతూ ఉంటారు. దీనిని ఒక పెద్ద సమస్యగా పరిగణించి భూతద్దంలో చూపిస్తూ ఉంటారు. మనస్సు బాహ్యానికి పరుగులెత్తడం సమస్య కాదు. సహజం. సహజమైన దానిని సమస్యగా చూడటమే వాస్తవానికి సమస్య.

మనస్సు పారిపోతే పోనీ, అంతమాత్రాన నీ వెందుకు జారిపోవాలి? ధ్యానంలో మనస్సు బహిర్ముఖం కాకూడదు అని నీ ఉద్దేశ్యం. ఇది సరియైన అవగాహన కాదు. మనస్సు బహిర్ముఖం కావడం కూడా ధ్యానానికి సంబంధించిన అంశమే. ఇదే మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

మనస్సు బహిర్ముఖ మవుతోంది. అవగాహనతో, ప్రయత్నముతో నీవు దానిని అంతర్ముఖం చేస్తున్నావు. ఇది ధ్యానసమయంలో చోటు చేసుకోవలసిన విషయం. ఇది ధ్యానానికి వ్యతిరేకం కాదు. ధ్యాన సమయంలో సాధించదగిన విషయం. నీవు ధ్యానం చేస్తున్నావు. మనస్సు చలిస్తోంది. సంచరించే ప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయత్నమును నీవు ధ్యానంలో త్రిప్పికొడుతున్నావు. ఇదే ధ్యానం. అసలు మనసు

బహిర్ముఖం కాలేదనే అనుకుందాం. ఇక అప్పుడు ధ్యానమేమిటి? అది సమాధి అవుతుంది.

ధ్యానం లేకుండానే సమాధి వస్తుందా? మరి ధ్యానంలో మనస్సు చలించకుండా ఉంటుందా? మనస్సు చలించడం సమస్య కాదు. చలించడమే మనస్సు స్వభావం అని తెలియక పోవడమే ధ్యానంలో పెద్ద సమస్య.

అవధానము - అవలోకనము

'ధ్యానము' అనెడి పవిత్ర విషయమును మనము ఇంతవరకు కొంత అర్థం చేసుకున్నాం. బాగుంది. ధ్యానానికి ఉపక్రమించక ముందు "నేను ధ్యానం చేయబోతున్నాను. దాని ద్వారా ఏదో జరుగుతుంది" (ప్రశాంతతను పొందడమో, లేక భగవద్దర్శనమో) అనే ఆలోచన ఉంది. ధ్యాన సమయంలో "నేను ధ్యానం చేస్తున్నాను. ఏదో జరుగుతున్నది" (మనస్సు నిలవడమో, లేక నిలవక పోవడమో) అనే ఆలోచన ఉంది. ధ్యానం చేయకముందు ఆలోచన ఉంది. ధ్యానం చేసేటప్పుడు ఆలోచన ఉంది. ధ్యానానికి ముందు ఆలోచనల్ని నిగ్రహించబోతాను అనే ఆలోచన ఉంది. ధ్యానసమయంలో నిగ్రహించే ప్రయత్నంలో ఉన్నాను అనే ఆలోచన ఉంది. బాగా ఆలోచించండి. ఇక ధ్యాన స్థితికి, ధ్యానం కాని స్థితికి భేద మేమిటి?

ఇంతకీ ధ్యానంలో ఏం జరగాలి? ఆలోచించడమా? అది ధ్యానం లేనపుడు కూడా జరుగుతూనే ఉంది కదా? ప్రత్యేకించి ధ్యానమెందుకు?

ఆలోచించకుండా పడి ఉండటమా? నిద్రలో జరిగేది అదే కదా? దానికి మాత్రం ధ్యాన మెందుకు?

ఇటు అర్థమయ్యే ఆలోచన గాకుండా, నిద్రలాంటి శూన్య స్థితి గాకుండా అర్థరహిత మైన పదాన్ని మననం చేయడమా? దీనినే ఇంద్రియాతీత ధ్యానమంటూ ప్రచారం చేస్తున్నారు. అర్థరహితంగా, వ్యర్థమైన శబ్దాల్ని కదిలిస్తూ, మనసులో "నేను అనర్థంగా మిగిలిపోతున్నాను" అని వ్యథ చెందడం, "పోనీలే. ఆరోగ్యం బాగుంటుందట" అని సరిపెట్టుకోవడం ఒక విధంగా మనసును పురిపెట్టడం కాదా? అర్థరహితమైన శబ్దాల్ని బాహ్యంలో కదిలించినవాణ్ణి పిచ్చివాడు అనేది మనమే. ఆ శబ్దాలనే కళ్ళు మూసుకొని ఆంతర్యంలో కదిలిస్తే, ఆయన గొప్ప ధ్యానయోగి అనేది కూడా మనమే.

ప్రత్యేకతలు లేని సహజస్థితి

బండ మోసినట్లు ధ్యానాన్ని మోయ నవసరం లేదు. ధ్యాన మనేది దినచర్యలో ఒక భాగం కాకూడదు. యాంత్రికమూ కాకూడదు. ఏదో జరగాలి అనే ఒత్తిడి మనసుకు ఉండకూడదు. ఏదైనా జరిగిపోతుందేమో అనే భయం ఉండకూడదు. నిన్న జరిగిన ధ్యానాన్ని గూర్చిన భావాలు కదలకూడదు. రేపు జరుగబోయే ధ్యానముయొక్క ఆలోచనలు ఉండకూడదు. ప్రస్తుతము ధ్యానములో ఇలా అనుభూతి కలుగవచ్చు

అనేది అసలు పనికిరాదు. ఈ విషయాల నుండి పూర్ణంగా విడిపడితేనే ధ్యానం. ఈ సరుకులన్నిటిని దించితేనే ధ్యానశకటం కదుల్తుంది. **(ధ్యానం నిర్విషయం మనః)**

సరే. బాగుంది. మనస్సును ఇలా ఖాళీ చేసిన తరువాత ఇక మనసే ఉండదు కదా? మరి ధ్యానం చేసేదెవరు? ధ్యానం చేసే కర్తే లేనపుడు ఇక ధ్యానమనే కర్మకు అవకాశమెక్కడుంది? అనే సంశయం మీకు కలుగవచ్చు. ఈ సందేహమును కూడా శాస్త్రము కదిలించి కరిగించింది. మీకు, నాకు కలిగే ప్రతి సందేహాన్ని శాస్త్రం స్పృశించే ఉంది.

యదా న భావ్యతే భావః క్వచి జ్జగతి వస్తుని
తదా హృదంబరే శూన్యే కథం చిత్తం ప్రజాయతే ॥

"ప్రపంచానికి సంబంధించిన విషయమును భావించనపుడు హృదయము శూన్యమగుచున్నది కదా? మరి చిత్త మెట్లు కదుల్తుంది? (ధ్యానించుటకు) అని ప్రశ్నను లేవనెత్తిన ఉపనిషత్తు

సర్వ మన్తః పరిత్యజ్య శీతలాశయవర్తి యత్
వృత్తి స్థ మపి తచ్చిత్త మసద్రూప ముదాహృతమ్ ॥

"ఆంతర్యంలో సమస్త భావాలను త్యజించి, ప్రశాంతముగా, చల్లగా ఉండు చిత్తము సంకల్పమును కదిలించినను అది చిత్తము కాదు, అచిత్తమే. మనస్సు కాదు; అమనస్సే" అని సమాధానమిచ్చింది.

బాగా ఆలోచించండి. మనస్సులో బరువును నింపుకొని ధ్యానం చేయలేము. బరువునంతయు దించేస్తే ధ్యానించేందుకు ఇక మనసెక్కడుంది? అనుకుంటున్నాము. ఇది సరికాదు. ధ్యానించేందుకు మనస్సుంది. అయితే అది మామూలు మనస్సు కాదు. మనస్సు కాని మనస్సు. ఈ మనస్సు తయారైనపుడే ధ్యానం సాగుతుంది. మరి ఇది మాత్రం ప్రయత్నం కాదా? కాదు. ఇది ప్రయత్నం కాని ప్రయత్నం. అప్రయత్నం కాని ప్రయత్నం. ఒక విధంగా చెప్పాలంటే, అప్రయత్నంకాని, ప్రయత్నం కాలేని ప్రశాంత అప్రమత్తత. సహజమైన ఆంతరంగిక అప్రమత్తత.

ధ్యానం - లక్ష్యం

భగవంతునికి సంబంధించిన మంత్రాన్ని మననం చేస్తూ ధ్యానించడం తెలుసుకున్నాము. అది 'ఓం నమశ్శివాయ' కావచ్చు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' కావచ్చు. 'ఓం నమో నారాయణాయ' కావచ్చు. 'శ్రీరాం జయరాం జయజయరాం' కావచ్చు. మంత్రమేదైనను అది సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, అద్వయుడు అయిన భగవంతుని సూచిస్తోంది. చైతన్యాన్ని హృదిలో నిలుపుతోంది. అనంతుడైన పరమాత్మను ధ్యానించే నీవు పరమాత్మతో సంబంధాన్ని కలిగియున్నావు. అంటే, ఇతరములైన సంబంధముల నుండి విడిపడియున్నావు.

మంత్రము అనంతుడైన పరమాత్మను సూచిస్తోంది. మంత్రానికి ముందు, వెనుక నిశ్శబ్దంగా చైతన్యముంది. మంత్రానికి ముందు, వెనుక ఏ చైతన్యముందో అది మంత్రము నడిచేటప్పుడు లేకుండా ఎలా ఉంటుంది? ఎప్పుడూ చైతన్యమే ఉంది. మధ్యలో మంత్ర రూపంలో ఆలోచన వస్తూ ఉంది. ఆ ఆలోచన కూడా చైతన్యాన్నే వ్యక్తం చేస్తోంది. ఇప్పుడు ధ్యానం ధన్యమైంది.

కేవలం మంత్రాన్ని మననం చేసినంత మాత్రాన ఈ అవగాహన రాదు. అవగాహన కలిగి మంత్రాన్ని మననం చేసినపుడే ధ్యానం ధన్యమవుతుంది. సంకీర్తన కూడా అంతే. ఇది అర్థం కాకపోవడంవల్ల గావుకేకలు పెట్టడం, పిచ్చి అరుపులు అరవటం, గంతులెయ్యడం సంకీర్తనలౌతున్నాయి.

మొదలు

'ఓం నమో భగవతే వాసుదేవాయ'
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ

మంత్రం నడుస్తోంది. మంత్రానికి ముందు వెనుక స్పష్టంగా తెలుస్తున్న ప్రశాంతత మంత్రం సాగేటప్పుడు స్పష్టంగా కాకపోయినా తెలుస్తూ ఉంటుంది.

ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ

ఇప్పుడేదో వేరే ఆలోచన కదిలింది. ఏ ఆలోచన అయినా సరే గత స్మృతులకన్నా వేరుగా ఉండదు. ఇవే జ్ఞాపకాలు. జీవితంలోలాగే ధ్యాన సమయంలో కూడా అవరోధాలు. గతస్మృతులు - అర్థం చేసుకోండి. గతం గతించగా జ్ఞాపకాలు మిగిలి ఉన్నాయి బాధించేందుకు. గతించిన గతానికి సంబంధించిన స్మృతులు ఉండి సుఖపెట్టేదేముంటుంది? కనుక వాటి విషయంలో అవగాహన కావాలి. రావాలి. అంతవరకు ధ్యానం యాంత్రికంగా నడుస్తూ ఉంటుంది.

ఆ జ్ఞాపకాలు, వాటికి సంబంధించిన ఆలోచనల్ని నిరోధించేందుకు ప్రయత్నించకండి. వాటిని చూచి భీతి చెందకండి. వాటివలన ధ్యానం పాడైందని భావించకండి. పాము విడిచిన కుబుసమును గూర్చి తెలిసినవారు దానిని చూచినా భయపడరు. ఉద్వేగము చెందరు. గతించిన గతానికి సంబంధించిన జ్ఞాపకాలు కూడా అంతే.

అవి వస్తే రానీ. నీవు వాటివెంట పోకు. సాక్షిగా ఉండు. లేచిన అలలు పడుతూ ఉంటాయి. వచ్చిన సంకల్పాలు పోతూ ఉంటాయి. అవి వచ్చినపుడు నీవు ఉన్నావు. అవి పోయినా నీవు ఉంటావు. నీవు సాక్షివి. నిన్నేవీ స్పృశించలేవు.

ఓం నమో భగవతే వాసుదేవాయ.......ఓం నమో భగవతే వాసుదేవాయ

కంచుగంటను మ్రోగించినపుడు దాని శబ్దము మెల్లగా ప్రశాంతతలో లయించునట్లు మంత్రమును నిశ్శబ్దంలో లయించనివ్వండి.

ఓం నమో భగవతే వాసుదేవాయ......ఓం నమో భగవతే వాసుదేవాయ.

మళ్ళీ ఆలోచనలు విజృంభిస్తున్నాయా? సాక్షిగా ఉండలేకపోతున్నారా? పోనివ్వండి. రెండు నిముషాలు ధ్యానం ఆపండి. ఆపి ఏం చేయాలి? చెబుతాను. చేయండి.

మజిలీ

అదిగో. చూడండి. ప్రశాంతమైన, గంభీరమైన సముద్రము. చూశారా! నిస్తరంగంగా ఉంది కదూ! అలలు లేని సాగరం!

ఇప్పుడు అలలు లేస్తున్నాయి. చూడండి. అదిగో.... ఎంత చక్కని అల... ఉజ్.... జ్... జ్...జ్........అదిగో .... పడిపోతోంది అల .... పడిపోయింది.

మళ్ళీ ..... మళ్ళీ ..... మళ్ళీ ..... అలలు ..... లేస్తున్నాయి. పడుతున్నాయి.

అల లేచేముందు సముద్రముంది. అల లేచినపుడు సముద్రముంది. అల పడినప్పుడు కూడా సముద్రముంది.

నీవే సముద్రము .... సంకల్పాలన్నీ అలలు.

సముద్రము పూర్ణము. నదీజలము లొచ్చి సముద్రంలో పడవచ్చు. కాని సముద్రము యొక్క పూర్ణత్వము వాటిపై ఆధారపడి లేదు. సాగరజలము ఆవిరైనంత మాత్రాన దాని పూర్ణత్వమునకు లోటు రాదు. నీవూ అంతే.

నీవు కూడా సాగరపూర్ణుడవు. సంకల్ప కెరటాలు నీకు అవరోధాలు కావు. నీ నుండి కదిలే సంకల్పాలు లేచిపడే ఆనందపు టలలు. సాగర తరంగాలు సాగరంకన్నా వేరు కావు. సాగరానికి అవరోధమూ కావు. ఆనందపు టలలు ఆనందం కన్నా వేరుకావు. ఆనందానికి అవరోధమూ కావు.

లేచి పడే అలలకు ఆధారమైన సముద్రము తనలో ఏ మార్పు లేకుండా అలల్ని వీక్షిస్తోంది. లేచి పడే సంకల్పాలకు ఆశ్రయమైన నీవు నీలో ఏ వికారము లేకుండా సంకల్పాలను సాక్షిగా వీక్షిస్తున్నావు.

ఇప్పుడు అలలెలా ఉన్నాయి? తగ్గుముఖం పట్టాయి. పలుచబడిపోయాయి. పరుండిపోయాయి. అలలు లేకుండా సాగరం గంభీరంగా, ప్రశాంతంగా ఉంది. అలాగా! అయితే, ఆ సాగర రూపుడివి నీవే. తెలిసిందా? ఇక కానీ!

మళ్ళీ మొదలు

ఓం నమో భగవతే వాసుదేవాయ .... ఓం నమో భగవతే వాసుదేవాయ

రెండు మంత్రముల మధ్య నిశ్శబ్దం ఇప్పుడు మీకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. ఇది కాస్త ఎక్కువ సమయం కూడా భగవత్కృప వల్ల నిలువవచ్చు. ఈ ప్రశాంత స్థితిని అనుభవపరమైన సమాధిగా భ్రమించవద్దు. ఇది స్వరూపము అనే ఎరుక కలిగి ఉంటే చాలు.

మంత్రము ఉన్నా, లేకున్నా నిశ్శబ్ద ముంది అనేది నీ కర్థమైంది. అవునా! సంకల్ప మున్నా, లేకున్నా నీవు ఉన్నావు అనేది కూడా తెలిసింది. ఇక మరొక్కటి తెలియవలసి ఉంది. జగత్తు ఉన్నా, లేకున్నా నీవు ఉంటావు. ఆ నీవే ఇప్పుడు ధ్యానంలో మంత్రానికి మంత్రానికి మధ్య స్పష్టంగా తెలుస్తున్నావు. కానివ్వండి.

ఓం నమో భగవతే వాసుదేవాయ .....ఓం నమో భగవతే వాసుదేవాయ......

ఓం నమో భగవతే వాసుదేవాయ ...... ఓం నమో భగవతే వాసుదేవాయ.......

.............................ఓం నమో భగవతే వాసుదేవాయ..

...ఓం...

నీవే నిశ్శబ్ద బ్రహ్మమై శోభిస్తున్నావు. సంకల్పానికి, మంత్రానికి నీవు ఆధారమే గాని నీకు ఆధార మెవ్వరూ లేరు; అని తెలిసి, అదిగా ఉండిపోవుటయే ధ్యానము. ఆనందము.

బ్రహ్మైవాస్మీతి సద్వృత్త్యా నిరాలంబతయా స్థితిః
ధ్యానశబ్దేన విఖ్యాతః పరమానందదాయకః

"నేను బ్రహ్మమై ఉన్నాను; అనెడి సత్సంకల్పముచే నిరాధారముగా నిలిచి యుండుట ధ్యానమని ప్రసిద్ధి. పరమానంద దాయకమని ప్రతీతి"; అన్నది ఉపనిషత్తు.

సర్వాధారములకు ఆధారమైన నిరాధార చైతన్యము వద్ద నిలిచియున్నాం. ఇక పడిపోకుండా నిలవటమే జరగాలి. ఇలా ఎంతకాలం అనే ప్రశ్న ఉదయిస్తూ ఉంది కదూ? అదే సెన్స్. వాస్తవానికి న్యూసెన్స్. మరో విధంగా చెప్పాలంటే నాన్సెన్స్.

జీరో అవర్

యుగాల తరబడి ఆవరించిన అజ్ఞాన నిద్ర నుండి మేలుకొన్నది ఇప్పుడే. ఇక్కడే. ఇది జీరో అవర్. ఇక కదలాలి కాలం. కదలకుండా మిగిలిపోతే జీరో అలాగే ఉంటుంది. ఇక్కడే శోభించేది హీరో.

నా ధ్యానంలో సమాధి కలిగింది అంటుంటారు. నేను సమాధిలో పదినిముషాలే ఉండినాను అని ఒకరు. అతికష్టం మీద ఇరవై నిముషాలు ఉండగలిగాను అని మరొకరు. ఎక్కువకాలం సమాధిలో ఉండలేకపోతున్నాను అని ఇంకొకరు. ఇదీ వరుస.

ఇంతకీ సమాధిలో ధ్యానము, ధ్యానించే మనస్సు ఉన్నాయా? లేవా! ఉన్నాయి అనుకుందాం. ఇక అది ధ్యానమే అవుతుంది. మరి, సమాధి ఏమిటి? సమాధిలో

మనస్సూ లేదు. ధ్యానమూ లేదు. కేవలం చైతన్యమే ఉంది అంటారా? అదే నిజమైతే చైతన్యమంటే ఏమిటో అర్థం కావాలి.

చైతన్యములో కాలం తెలుస్తుందా? కాలం మనోజనితము. చైతన్యములో కాలం అనుభవానికి అందింది అంటే మనసున్నదని భావము. మనస్సు ఉంటే సంకల్పాలూ ఉంటాయి. ఇక సమాధి ఏమిటి?

కాలం తెలియని కాలాతీత స్థితియే చైతన్యము. అదియే సమాధిలో అనుభవమైతే నేను సమాధిలో పది నిముషాలున్నాను. రెండు నిముషాలే ఉన్నాను అనే మాటలకు అర్థమేమిటి? కాలాతీత స్థితిలో ఒక నిముష మేమిటి? పది నిముషా లేమిటి? వీటి మధ్య వ్యత్యాసాలేమిటి? అంతా గందరగోళం.

దూరాలు వేరు చేయలేని, కాలం కరిగించలేని సంబంధం గాని సంబంధమది. అందుకే అది జీరో అవర్.

మళ్ళీ

ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
....
....
....

ఏ శబ్దమైనా నిశ్శబ్దం నుండే పుడుతుంది. తిరిగి నిశ్శబ్దంలోకే చేరుతుంది. ఏ మంత్రమైనా మనసు నుండే కదుల్తుంది. మనసులోనే పడిపోతుంది.

మనస్సు నుండి కదిలిన మంత్రం మనసులో పడిపోయింది. పోనీ. అలాగే మనస్సు ఎక్కడనుండి కదిలిందో అక్కడ పడనివ్వండి, పడిందా?

ఓం నమో భగవతే వాసుదేవాయ
....
ఓం నమో భగవతే వాసుదేవాయ

ఏవో ఏవో ఆలోచనలు వస్తున్నాయి కదూ? కంగారు పడకండి. ఇక్కడ 'ఎగ్జిట్' **(Exit)** తీసుకోవాలి. తప్పదు.

మరో మజిలీ

అదిగో ఆకాశం. పున్నమినాటి రాత్రి. గగనంలో మెల్లగా ప్రాకుతున్న పూర్ణచంద్రుడు. మధ్యమధ్యన ప్రాకే చంద్రునిపై దోగాడే మబ్బు తునకలు. మబ్బు లొస్తున్నాయి, పోతున్నాయి.

మేఘ శకలాలు పైకి వచ్చినపుడు చంద్రుడు కనిపించటం లేదు. అవి జారిపోగానే జాబిలి వెలిగిపోతున్నాడు.

నింగిలో నిండు జాబిలి ..... పండు వెన్నెల ..... ఆవరించిన మబ్బు తునకలు..... మళ్ళీ జాబిలి....... మబ్బులు................... జాబిలి .... వెన్నెల.. .. . .

జాబిలిని మబ్బు క్రమ్మినపుడు చంద్రుడు ఉన్నట్లా? ఊడి క్రిందపడినట్లా? మబ్బు మూసినపుడు కూడా చంద్రుడు అక్కడే ఉన్నాడు. అసలు చంద్రుని ప్రకాశం వల్లనే మేఘం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. చంద్రుడే లేకపోతే మేఘాలు కూడా తెలిసిరావు.

అవిగో చంద్రునిపై మబ్బు తునకలు. జారిపోతున్నాయి చూడు. అదిగో జాబిలి. ఆహా పండు వెన్నెల. తెల్లగా .. చల్లగా....... కదూ!

వెన్నెలతో వికసించే జాబిలిని చూడు. చూస్తున్నావా? ఇప్పుడు జాబిలిని చూడకుండా వెన్నెలనే చూడు. ప్రయత్నించు.

అదిగో వెన్నెల జాబిలి ... వెన్నెల ... జాబిలి.... వెన్నెల ..... జాబిలి ......వెన్నెల......

వెన్నెల ...... వెన్నెల.......వెన్నెల .... నువ్విలా.

మబ్బులు లేవు. చంద్రుడు లేడు. ఆకాశమూ లేదు. అంతా వెన్నెలే... వెన్నెలే.. హృదయమంతా వెన్నెలే. వన్నెలు అర్థం గాని వెన్నెలే ఆనందం........................ అనంతం...........స్వరూపం. సహజం.

ఇక్కడ నీవు ఆనందంగా ఉండటం కాదు. నీవే ఆనందమై ఉండటం. అనంతమై ఉండటం. అదియే ఆత్మ.

స ఆత్మా స్వాత్మత్వేన విజ్ఞేయః

"ఆ ఆత్మయే తన నిజస్వరూపంగా గుర్తించాలి" అంటారు శ్రీ శంకరాచార్యస్వామి.

ఇది గుర్తించగలిగితే, గ్రహించగలిగితే దేనికీ దూరం కానవసరం లేదు. దేనికీ దగ్గర కానవసరం లేదు. దేనినీ వ్యతిరేకించ నవసరం లేదు. దేనితోను వ్యవహరించ నవసరం లేదు. ఇదియే ఆత్మ స్వరూపము. అంటే, ఆత్మ లక్షణముగా దానిని అర్థం చేసుకోవాలే గాని గుణంగా కాదు. ఇదియే చైతన్యము. అదియే అందరిలో భాసించే వాసుదేవ చైతన్యము. దానిని గుర్తించి, అదిగా మిగిలిపోవడము కాకుండా మిగిలి ఉండటమే ధ్యానం యొక్క విశిష్టత.

ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
....
....

ధ్యానంలో ప్రశాంతత స్వరూపం ఏమిటో అర్థం చేసుకున్నాం. పాయసం ఆరగించిన వానికి పాయసం త్రేపు వస్తుందే గాని కాఫీ వాసన రాదు. ధ్యానంలో ప్రశాంతత అనుభవించిన వారికి నిత్యజీవితంలో ప్రశాంతత పల్లవిస్తుందే గాని అశాంతి తొంగి చూడదు.

అశాంతి అనేది రాగద్వేషాల బిడ్డ. రాగద్వేషాలను మనం క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాం. ఈ దశలో రాగద్వేషాలు మన మనసును కుదిపేస్తున్నాయా? కుదుట పరుస్తున్నాయా?

రాగద్వేషాలు విజృంభిస్తున్నాయి అంటే ఇంతవరకు మన మాచరించిన సాధనలో రాగద్వేషాలే చోటు చేసుకొని ఉన్నాయని భావము. ధ్యాన జీవితం రాగద్వేషాలను తటస్థ పరచే ధన్యజీవితం. రాగద్వేషాలతో చలించే మనసు ధ్యానాన్ని కొనసాగించలేదు.

ధ్యానయోగి కర్మయోగియే. ధ్యానం కూడా కర్మయే కనుక ధ్యానయోగి కూడా కర్మయోగియే. కర్మయోగి రాగద్వేషాల వలలో చిక్కడు. ఇష్టాయిష్టాల ఊబిలో చిక్కుకోడు. అతనికి ధర్మాధర్మాలే చర్చనీయాంశాలు. ధర్మాధర్మాల వివేకంతో కర్మల నాచరించే పుణ్యాత్ముడైన కర్మయోగిని రాగద్వేషాలు చలింప చేయలేవు.

ధ్యానంలో ధ్యానం ద్వారా దైవంతో సంబంధం పెట్టుకున్న మనం కర్మలలో పరమాత్మ నుండి విడిపోకూడదు. ధ్యానం కర్మే కదా! పరమాత్మను విస్మరించకుండా కర్మలలో చరిస్తే కర్మ కూడా ధ్యానమే అవుతుంది.

ధ్యానము పరమాత్మ సంబంధమైనది కనుక మనకు శాంతిని ప్రసాదిస్తుంది అని భావిస్తే, కర్మ కూడా పరమాత్మ సంబంధమైనదియే కనుక ప్రతి కర్మ కూడా శాంతిని ప్రసాదించాలి. ఆనందాన్ని అందించాలి. ఆంతర్యంలో అందిన ఆనందం బాహ్యంలో తొంగి చూడాలి.

శ్రీకృష్ణ పరమాత్మను చూడండి. ఆయన సదా మురళిని మ్రోగిస్తూ బృందావనంలో చరించాడు. రాసక్రీడలో నాట్యం చేశాడు. నవ్వుతూ జీవించాడు. నవ్వుతూ పనిచేశాడు. నవ్వుతూ గీతను బోధించాడు (ప్రహసన్నివ). నవ్వుతూ కన్ను మూశాడు.

ఇదే ఆనందము. దివ్యానందము. ఆత్మానందము. ఈ ఆనందము వ్యక్తమైతే ప్రేమ అవుతుంది. ప్రేమను పిండితే దానిలో ఆనంద రసమే ఉంటుంది. ప్రేమిస్తే ఆనందం రాదు. ఆనందం ఉంటేనే ప్రేమించడం జరుగుతుంది. ఇది ప్రేమలాగా చాలా సున్నితమైన విషయం.

ప్రేమ ఆనందము యొక్క వ్యక్త స్వరూపం. కనుక ప్రేమ కార్యాలన్నీ ఆనంద ప్రదమైనవే. ఆనందము లేకుండా ప్రేమ వ్యక్తమైంది అంటే అది కామమై ఉంటుంది. కామమే కనుక ఆ బండి రాగద్వేషాల చక్రాలపైనే సాగుతుంది.

కనుకనే, ప్రేమపందిరిలో కూర్చుని ఉన్నామనుకొనేవారు కన్నీటి కాఫీని పానం చేస్తూ ఉండటం మనం తరచుగా చూస్తుంటాము. ఆనందం తెలియని ప్రేమ అంతకన్నా ఏమిస్తుంది?

భగవంతుడు ప్రేమమయుడు అంటాము. దాని అర్థము ఇదియే. పరమాత్మ ఆనంద స్వరూపుడు కనుకనే ప్రేమమయుడు. భగవంతుడు ప్రేమమయుడు కనుక భక్తి కూడా ప్రేమమయమే. కనుకనే,

సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా

భగవంతుని యందు ఉత్కృష్టమైన ప్రేమను కలిగి యుండుటయే భక్తి అని ప్రబోధించారు నారదమహర్షి.

ధ్యానయోగి కళ్ళు మూసుకొని పద్మాసనంపై కూర్చోవచ్చు. కాని అలా కళ్ళు మూసుకొని కూర్చున్న వారందరూ ధ్యానయోగులు కాలేరు. ధ్యానంలో దైవాన్ని గ్రహించినట్లే, కర్మలలో ధర్మాన్ని గుర్తించేవారే నిజమైన ధ్యానయోగులు.

ధర్మరూపంగా ఉన్నది ఎవరో కాదు; దైవమే. కనుకనే **రామో విగ్రహవాన్ ధర్మః** అన్నారు. ధర్మాన్ని విడిచిపెట్టడం అంటే దైవాన్ని విస్మరించట మనే భావం. ధ్యానయోగులు ఈ విషయాన్ని మరువకూడదు.

అధర్మపరులు ధర్మానికి దూరులు. అంటే, దైవానికి దూరులు. దైవానికి దూరులైనవారు ధ్యానానికి ఎలా దగ్గరవుతారు? దైవం లేని ధ్యానం ధ్యానమవుతుందా?

ఈ అవగాహన లోపించటం చేత కొందరు సాధకులు విచిత్రంగా ప్రవర్తిస్తూ ఉంటారు. గ్రంథాలు పఠించటం, సత్కర్మ లాచరించటం, సేవాకార్యాలు నిర్వహించటం సాధనకి ప్రతిబంధకాలుగా భావిస్తూ ఉంటారు. అన్నిటినీ వదలి, దూరంగా వెళ్ళి, ఒంటరిగా నేను అసంగాత్మను అనుభవించాలని ఉంది అని అభిభాషిస్తూ ఉంటారు.

ఇదొక అయోమయ ధోరణి. అసంగాత్మ నీ స్వరూపం. అది అనుభవింపబడేది కాదు. కర్మలలో నిస్సంగుడు కాలేని దద్దమ్మ అసంగాత్మగా శోభించాలనుకోవడం గుఱ్ఱం ముందు బండిని పెట్టే ప్రయత్నం చేసేవాడే కాని వివేకి కాడు. ఇదంతా విపరీత ధోరణి. దారితప్పిన ఆలోచనా విధానము **(Negative thinking).**

ఫొటోగ్రాఫర్ నెగటివ్‌లను చీకట్లోనే డెవలప్ చేస్తాడు. అజ్ఞానాంధకారంలోనే నెగటివ్ థింకింగ్ కూడా జోరుగా సాగుతుంది.

బుద్ధి ఋజుమార్గంలో సాగితే నెగటివ్ థింకింగ్ ఉండదు. పోజిటివ్ థింకింగ్ వస్తుంది. కాని, మనకు కావలసింది నెగటివ్ థింకింగ్ కాదు; పోజిటివ్ థింకింగ్ కూడా కాదు. ప్రోపర్ థింకింగ్ **(Proper thinking)** అని ధ్యానయోగి గుర్తించి గ్రహించాలి.

కర్మను పూజగా మలచుకోవాలి. రాగద్వేషాలను ధర్మాచరణంతో నిర్వీర్యం చేయాలి. ఉద్రేకాలు లేకుండా అవగాహనను పెంచుకోవాలి. పరమాత్మను విస్మరించి ప్రపంచంలో చరించకూడదు. మనస్సు చల్లగా ఉండాలి. హృదయంలో వెన్నెల విరబూయాలి.

ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ

ధ్యానాలు - ధ్యాసలు

"స్వామీజీ ధ్యానం కళ్ళు మూసి చేయాలా? కళ్ళు తెరిచి కూడా చేయవచ్చా?" అని ఒక సాధకుడు నన్ను ప్రశ్నించాడు. "కళ్ళు తెరిస్తే ప్రపంచం బయట కనిపిస్తుంది. కళ్ళు మూస్తే లోపల కనిపిస్తుంది. అంతే కదా?" అన్నాను నేను.

ధ్యానం మనసులో నడుస్తుంది. పరమేశ్వరునికి సంబంధించిన మానస వ్యాపారమే ధ్యానం. చిత్తంలో శివుడు ఉండటమే ప్రధానం. చేరవేసేవి కళ్ళే అయినా మనసుకు చేరినవే కళ్ళకు కనిపిస్తాయి. కళ్ళల్లో పడినవన్నీ మనసుకు చేరవు. చెవుల్లో దూరినవన్నీ మనసులో ప్రవేశించవు. కాని, మనసులో ఉన్నవే కళ్ళకు కనిపిస్తాయి. చెవులకు వినిపిస్తాయి.

మన ధ్యానంలో ప్రపంచ మున్నదో, పరమేశ్వరు డున్నాడో ముందుగా మనమే నిర్ణయించుకోవాలి. ఆ తరువాత, ధ్యానంలో కళ్ళు మూయాలా? లేక, కళ్ళు తెరవాలా? అనే ప్రశ్న తలెత్తుతుంది. కొందరికి పారేసుకునే మనస్తత్వం ఉంటుంది. వారికి మూతలే నయం. కొందరికి మరీ మూసుకుపోతాయి. అలాంటి వారు కళ్ళు తెరిస్తేనే మంచిది. అలవాటు ప్రకారం మూసుకుపోతున్నా, వారి కళ్ళు తెరిపిస్తేనే మంచిది. లేకపోతే, మరీ పూడుకుపోయే ప్రమాద ముంటుంది.

మనస్సును మూస్తే, కళ్ళు చెవులు దృశ్య శబ్దాదులను వెంటబెట్టుకొని మనోమందిరాన్ని సమీపించినా "ప్రవేశం లేదు" అనే బోర్డును చదువుకొని వెనుదిరగక తప్పదు. కాని, కళ్ళు మూసినా, మనస్సు ప్రపంచంలో ప్రవేశించాలి అనుకుంటే రెప్పలు అడ్డు నిలవవు. అంతేకాదు, బాహ్య జగత్తులో ప్రవేశించకనే మనస్సు దానిని ఆంతర్యంలో దర్శించగలదు. అదే జరిగితే, ధ్యానంలో ఉన్నది ప్రపంచమే గాని పరమేశ్వరుడు కాడు. ధ్యానంలో ప్రపంచమే ఉండేటప్పుడు కళ్ళు మూస్తే ఏం జరుగుతుంది? తెరిస్తే ఏం కరుగుతుంది?

నిద్ర అందరికీ తెలిసిందే. అందరికీ తోడున్నదే. అందరూ పోయేదే. ఎక్కువ మంది కళ్ళు మూసుకొని నిద్రిస్తారు. కొందరు నిద్రలో కళ్ళు తెరిచే ఉంటారు. "స్వామీజీ కళ్ళు తెరిచి నిద్రించాలా? కళ్ళు మూసి నిద్రించాలా?" అని అడిగితే ఏం చెప్పగలం? అలవాట్లను బట్టి కునుకుపాట్లు. నిద్రపోయేది మనస్సు. అది పోగలిగితే, కళ్ళు ఎలాఉన్నా నష్టం లేదు. అది పోకపోతే కళ్ళు మూసినా తెరవక తప్పదు. కొన్ని భవనాల్లో బయట నైట్ వాచ్‌మెన్ నిద్ర పోతూఉంటాడు. లోపల యజమాని లైటు వేసుకొని కూర్చొని ఉంటాడు. పోయేవాళ్ళను ఆపలేము. ఉండేవాళ్ళను పంపించలేము. ధ్యానంలో కూడా అంతే.

మనస్సు అలసిపోతే నిద్రవస్తుంది. ఆశలు నెడుతూ ఉంటే, ఆవేదనలు గుంజుతూ ఉంటే మనస్సుకు నిద్రపట్టదు. ప్రపంచంలో అసంతృప్తి నిచ్చే ఆయాసాలే గాని,

సంతృప్తినిచ్చే పాయసాలు లేవని మనస్సుకు తెలియాలి. ఆశ లుడిగిన మనస్సు, రాగద్వేషాలను రాల్చేసుకున్న మనస్సు సదా ధ్యానంలోనే ఉంటుంది. నాకు తెలిసిన ఒక వ్యక్తి సినిమా హాల్లో కూర్చుంటే చాలు. సినిమా మొదలు కాగానే ఆయన నిద్రలోకి జారిపోతాడు. సినిమా పూర్తి కాగానే కళ్ళు తెరిచి లేచి వస్తూ ఉంటాడు. అతనితో కలిసి సినిమాకి పోవాలంటే స్నేహితులు చిరాకు పడుతూ ఉంటారట.

ఏముంది చిరాకు పడటానికి? చింతాకు రాల్చటానికి? కలిసి సినిమాకి పోయినంత మాత్రాన కలిసి చూచే దేముంది? ఎవరి సినిమా వాళ్ళదే. తెరమీద దొర్లే బొమ్మలు అందరికి ఒకేలా కనిపించినా, బుద్ధిలో నడిచే బొమ్మలు ఎవరివి వారివే. బుద్ధిలో బొమ్మలు కదలటం ఆగినవారు సినిమాకెళ్తే బొమ్మల్ని చూడాలనుకున్నా బొమ్మలు ముడుచుకుంటాయి.

"స్వామీజీ! ధ్యానం ఒంటరిగా చేయటం మంచిదా? సామూహిక ధ్యానం మంచిదా?" ఏం చెప్పగలం? అందరు కలిసి సినిమా కెళ్ళినా, ఎవరికి వారుగానే చూస్తారు. నిద్ర వస్తే, ఎవరికి వారుగా నిద్రపోతారు. కలిసి నిద్రపోలేరు. కలిసి చూడనూ లేరు. కలిసిపోవటమే కలిసి రావటం. అదే సామూహికం.

సినిమా చూచేటప్పుడు ప్రక్కవారు ఆవలిస్తే మనం ఎలా ఆవలించగలం? ప్రక్కవారు నవ్వినంత మాత్రాన మనం నవ్వాలని ఎక్కడుంది? **"ఎవరికి వారే సినిమా తీరే"**. అంతే సామూహిక ధ్యానం కూడా. సామూహిక మనేది ఎక్కడున్నా ఆయువుపట్టు బొగ్గుపులుసు వాయువే. ఇంతకీ నేను చెప్పొచ్చింది ఏమిటంటే, మంచి చెడులను బేరీజు వేసుకోవటం కన్నా మనస్సును మంచి చేసుకోవటమే ధ్యానానికి మంచిది అంటున్నాను. అంతే. ఆ తరువాత అంతా నిశ్చింతే.

మనసా! మర్మం తెలుసుకో!. చర్మం చిట్లేలోగా కర్మం కాలే దెలాగో ఆలోచించు. ఉరి తీసే ఊహల వైపు గురి పెట్టకు. పురి పెట్టే ఆశలను విడిపించుకో. సరి పెట్టుకొంటే సిరి చేరినట్లే. అవసరం లేనివాటిని ఏరి పారేయ్. అనుకూలమైన వాటిని చేరిపోనీ. ప్రతికూలాలను మారిపోనీ. ప్రతిబంధకాలను పారిపోనీ. ఆవేశాలను ఆరిపోనీ. తాపత్రయాలను ఎగిరిపోనీ. రాగద్వేషాలను ఇగిరిపోనీ. కల్పిత రూపాలను చిత్తంలో చెరిగిపోనీ. అహంకారాన్ని కరిగిపోనీ. అభిమానాన్ని ఒరిగిపోనీ. అజ్ఞానాన్ని తరిగిపోనీ. స్మృతిని తిరిగిరానీ. జ్ఞాన వెలుగులో బ్రతుకు దరిచేరిపోనీ. 'గిరిధారి' ఒడి చేరిపోనీ.

ఇలా మనస్సుకు చెప్పాలి. గిచ్చకుండా నచ్చచెప్పాలి. తలపై భారపు మూటలుంచి నిద్ర పొమ్మంటే ఎవరికి సాధ్యం? మనస్సులో బరువులు నింపుకొని ధ్యానం చేయటం కూడా అంతేనేమో. బరువైన ధ్యానం బుద్ధిని తేలిక పరచలేదు. ఖాళీ చేసుకొనే ఖాళీ అయితేనే నిండేది. మనస్సు ఖాళీఅయితేనే ధ్యానం పండేది. ఖాళీ చేసుకొనే ప్రక్రియ కూడా ధ్యానంలోని విషయమే. ధ్యాన విషయ మేదైనా ఉపకారియే. విషయ ధ్యానం ఎప్పుడైనా అపకారియే. ఉపకరించేవి విరివిగా లభ్యమవుతున్నాయి. వినియోగించుకొంటే బ్రతుకు విమలమవుతుంది.

ధ్యానము - జ్ఞానము

ఆలోచన లేకపోతే ఏ పని జరగదు. కానీ, అన్ని పనులకు ఆలోచన అవసరం లేదు. ఆకలి దప్పులు, నిద్ర - వీటికి మనిషి ఆలోచించ నవసరం లేదు. నిద్ర 'వస్తుంది', మనిషి నిద్ర 'పోతాడు'. ఇది ఒక రాకపోకల వేడుక. కాబట్టి నిద్రపోయేందుకు మనిషి ఆలోచించ నవసరం లేదు. మేల్కొనేందుకు మనిషి ఆలోచించాలి.

కళ్ళకు కనిపించే రూపాలు, చెవులకు వినిపించే శబ్దాలు మనసులో కదులుతాయి. అందుకే మనసు వాటిని గుర్తించగలుగుతుంది. ఈ విధంగా విషయ జ్ఞానం కలుగుతూ ఉంది. కానీ, మనసులో కదిలేవి కళ్ళకు కనిపించ నవసరం లేదు. చెవులకు వినిపించ నవసరం లేదు. సన్యసించాలి అనుకునే వారికి ఇక్కడే ఒక పెద్ద అవరోధం ఎదురౌతుంది. కారణం, ఏవి ఎప్పుడు కనిపిస్తాయో ఏవి ఎప్పుడు వినిపిస్తాయో తెలియదు. ఏ నిమిషం ఏ ఆలోచన వస్తుందో చెప్పలేము. ప్రతి మనిషికి సాధువు కావాలనే ఉంటుంది. ఎందుకని? ప్రతి మనిషికి సుఖమే కావాలి. ఒక్క సాధు జీవితంలో తప్ప సుఖమెక్కడా లేదనేది అందరికీ తెలుసు. కానీ, వ్యక్తి సుఖపడేది కాషాయం ధరించినప్పుడు కాదు, సాధు హృదయం కలిగి ఉన్నప్పుడు.

ఋషి ఋణాన్ని, సమాజ ఋణాన్ని తీర్చుకోవాలి అని నదిలాగా కదిలొచ్చిన సాధువుకు తనదంటూ ఏదీ లేదు. నాలుగు గోడలున్న ఖాళీ గదిలాంటి వాడు సాధువు.

పురుషార్థ నిశ్చయం జరిగిన తరువాత సన్యాసం తీసుకొనిన వాడు సాధువు. సన్యాసం తీసుకోక ముందు భగవంతుడ్ని పొందాలి అనుకునే ముముక్షువు కర్మయోగి. సన్యాసం రెండు రకాలు: 1. వివిదిషా సన్యాసం 2. విద్వత్ సన్యాసం.

వివిదిషా సన్యాసం

వివేక వైరాగ్యాలు కలిగి ఈ ప్రపంచంలో ఉండే సుఖాలు అనిత్యం కనుక అవి తనకు అనవసరం అని భావించి, భగవంతుడితో తనకుండే నిత్య సంబంధాన్ని గుర్తించి సన్యసించేవాడు వివిదిషా సన్యాసి. ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, వివాహం, ఇవన్నీ మార్గాన్ని విరోధిస్తాయని, కేవలం శ్రవణమనన నిధిధ్యాసలకే పూర్తి కాలాన్ని వినియోగించు కోవాలి అనే ఉద్దేశంతో పూర్ణ హృదయంతో సన్యసిస్తాడు. ఇతడు రాగద్వేషాలను జయించినవాడై యుండాలి. ఇతడు కూడా జ్ఞాన సాధన ద్వారా భగవంతుడ్ని పొందుతాడు.

కర్మయోగి గృహస్థాశ్రమంలోనే ఉంటాడు. సన్యసించడు. ఎందుకని? తనలో ఇంకా రాగద్వేషాలు ఉన్నాయి. బాధిస్తూ ఉన్నాయి. సన్యాసం పుచ్చుకున్నంత మాత్రాన అవి తొలగే అవకాశం లేదు కనుక తాను గృహస్థుడిగానే ఉండి, కర్మ యోగాన్ని ఆచరిస్తూ ఏది చేసినా ఈశ్వరార్పణంగా భావిస్తూ, ఏది లభించినా ప్రసాదంగా స్వీకరిస్తూ,

రాగద్వేషాలను తటస్థపరచి భక్తి భావనతో కర్మయోగి చరిస్తూ ఉంటాడు. ఒక దశలో రాగద్వేషాలు తటస్థమైన తరువాత సన్యాసం పుచ్చుకుంటాడు. కాబట్టి ముందు కర్మయోగిగా ఉండి తరువాత సన్యాసం పుచ్చుకున్నవాడు వివిదిషా సన్యాసి.

విద్వత్ సన్యాసం

విద్వత్ సన్యాసి అంటే జ్ఞాని, స్థితప్రజ్ఞుడు, సాక్షాత్ భగవత్స్వరూపం. కర్మయోగంలో ఉండే గృహస్థుడు సన్యాసం తీసుకొని వివిదిషా సన్యాసి అయి, తరువాత విద్వత్ సన్యాసిగా జ్ఞానాన్ని పొంది తరించిపోవచ్చు. లేదా, సన్యాసం పుచ్చుకోకుండానే కర్మయోగంలోంచి సూటిగా విద్వత్ సన్యాసి అయిపోవచ్చు. జనకుడు గృహస్థుడిగానే ఉంటూ కర్మయోగం ద్వారా రాగద్వేషాలను తటస్థపరచుకొని గురువు ఇచ్చిన జ్ఞానాన్ని అందుకొని సూటిగా విద్వత్ సన్యాసి అయ్యాడు. అంటే జ్ఞాని అయ్యాడు. ఇతడు సన్యాసం తీసుకోలేదు. వివిదిషా సన్యాసి అయిన తరువాత సాధకుడు వెనక్కి తిరిగి వెళ్ళలేడు.

సన్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ
తయోస్తు కర్మ సన్యాసా త్కర్మ యోగో విశిష్యతే ॥ (భగవద్గీత 5 - 2వ శ్లోకం)

'అర్జునా! కర్మ సన్యాసము, కర్మయోగము రెండును మోక్ష దాయకములే. కానీ, ఆ రెంటిలోను కర్మసన్యాసము కంటెను కర్మయోగమే శ్రేష్ఠమైనది'. అంటే వివిదిషా సన్యాసం తీసుకోవడం కన్నా గృహస్థుడిగా ఉంటూనే కర్మయోగం ద్వారా రాగద్వేషాలను తటస్థ పరచుకొని చివరికి జ్ఞానాన్ని పొంది తరించిపోవచ్చు. కాబట్టి సన్యాసం గొప్పదా? గృహస్థాశ్రమం గొప్పదా?

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ (భగవద్గీత 5 - 5వ శ్లోకం)

"అర్జునా! సాంఖ్యయోగులకు ఏ స్థానము లభించునో కర్మయోగులకు కూడా అదియే లభించును. ఈ రెంటిని ఒక్కటిగ దర్శించువాడే జ్ఞాని". సాంఖ్యయోగి అంటే సన్యాసి. కాబట్టి కర్మయోగి, సన్యాసి ఇద్దరి గమ్యం విద్వత్ సన్యాసమే. అదే జ్ఞానం, మోక్షం, కైవల్యం. సన్యాసము, కర్మయోగము - ఈ రెండు ఒక్కటే అని ఎవరికైతే తెలుసో అతడే ఈ ప్రపంచంలో చక్కగా సత్యాన్ని దర్శించినవాడు. జ్ఞానం సన్యాసికి కావాలి, గృహస్థుడికి కావాలి. కాబట్టి అందరూ ధ్యానం చేయాలి. మీరూ ధ్యానం చేయాలి. మీకు మంత్రం ఇచ్చిన గురువు ధ్యానం చేస్తూనే ఉన్నాడు. అందరి జీవితాలు ఈ విధంగా ధ్యానమయం కావాలి. ఆ తరువాత, జ్ఞానమయం కావాలి.

చైతన్యగాన లహరి

పల్లవి: రాధికా! కృష్ణా! రాధిక
నీ చెంతకు రాదిక
నీ చెలిమికి రాలేదిక ॥ రాధికా ॥

అనుపల్లవి:
కాలమేమో ఆగదు
కరుణ నీలో కదలదు ॥ రాధికా ॥

చరణములు:

1. వేణువు నీతో ఉండనీ
పింఛము నీపై కదలనీ
రాధ ఏదని అడగనీ
రాదనే బాధ మిగలనీ ॥ రాధికా ॥


2. యమున యెదతో పారనీ
నను నీ మదిలో పారిపోనీ
కన్నీరంతా కారిపోనీ
యమునలోనే చేరిపోనీ ॥ రాధికా ॥

3. వేడుకగా నీ చేతిలో
వెదురు మురళి ఊరేగనీ
వేదనతో ఈ భామిని
ఎదురు రాదని మురియనీ ॥ రాధికా ॥

4. చూపులు లేవు కంటికి
మాటలు రావు నోటికి
కాంతులు ఉండవు కొందరికి
మనసులు మూగవి అందరికి ॥ రాధికా ॥

శాస్త్ర దర్పణం

ఇందులో...



శాస్త్రం ఎలా ప్రమాణము?

ఈ ప్రపంచంలో మరొకటి ఉన్నట్లు గుర్తించడానికి ముందుగా నీవు ఉండాలి. కానీ నీవు ఉన్నట్లు గుర్తించడానికి నీకు మరొక దాని సహాయము అవసరం లేదు. ఈ విధంగా నీవు స్వతః ప్రమాణము.

స్వతః ప్రమాణమైనది స్వతఃసిద్ధమై ఉంటుంది. కనుక తనంతట తాను ప్రకాశిస్తూ ఉంటుంది. దానిని అనుసరించి సమస్తమూ ప్రకాశించడం జరుగుతూ ఉంటుంది. తాను మాత్రము మరొక దానిపై ఆధారపడి ప్రకాశించదు.

ఏదయితే స్వతఃప్రమాణము కాదో అది స్వతఃసిద్ధమూ కాదు. స్వతఃసిద్ధము కానిది తన మనుగడకు మరొక దానిపై ఆధారపడి ఉంటుంది. అయితే, దేనిపై తాను ఆధారపడి యున్నదో అది కూడా స్వతఃసిద్ధము కాకపోతే ఆధారము అనే మాటకే అర్థం లేకుండా పోతుంది.

ఒక నూలు బట్టను తీసుకున్నపుడు అది దేనిపై ఆధారపడి యున్నది అని ఆలోచిస్తే, నూలు మీద ఆధారపడి ఉంది అని తేలుతుంది. మరి, ఆ నూలేమిటి? ఆ దారపు పోగు లేమిటి? దూదియే. ఆ దూది ఏమిటి? అది కూడా అణువుల సముదాయమే. ఇలా ఆలోచిస్తూపోతే, ప్రతిదీ మరొకదాని మీద ఆధారపడి ఉంది. ఈ విషయం కూడా మళ్ళీ నీవు ఆలోచించే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. కనుకనే ఒక విషయానికి సంబంధించి అందరి నిర్ణయాలు, నిర్వచనములు ఒకే విధంగా ఉండవు.

నిర్వచనములు, నిర్ణయాలు మనిషి మనిషికి భిన్నంగా ఉండవచ్చు. అవి అన్నియు భావనలే అనేది అభిన్న సత్యం. ఈ భావాలు కూడా మార్పు చెందుతూ ఉంటాయి. మార్పు చెందే భావాలు అలా మార్పు చెందడానికి ఏదో ఆధారముండాలి. దేనిపై ఆధారపడి భావాలు మారుతున్నాయి? దేనిపై ఆధారపడి యుండినను, అలా భావాలను ప్రకాశింప చేయునది ఏదియో అది స్వతఃసిద్ధమై ఉండాలి. అట్టిది స్వతః ప్రమాణమే అయి ఉంటుంది కనుక అది మరొక దానిపై ఆధారపడదు. అదియే ఆత్మ. అదియే నీవు. అట్టి నీకన్నా అన్యంగా తెలియునది ఏది ఉన్ననూ అలాంటిది నీ మీద ఆధారపడి ప్రకాశించుచున్నందున అది స్వతఃసిద్ధము కాదు. కనుకనే ఈ ప్రపంచంలో ఏది గోచరించినా మరొక కాలములో అది గోచరించకుండా ఉంటుంది. కనుక ప్రపంచంలో అన్నీ పరిమితాలే. అన్నీ నశించేవే.

కాని, అన్నిటికీ ఆధారముగా ఉంటూ, తాను స్వతఃప్రమాణంగా ప్రకాశించే స్వతః సిద్ధమైన ఆత్మ మరొక దానిపై ఆధారపడి యున్నది కానందున అది నశించదు. కనుక ఆత్మ నిత్యమై శోభిస్తూ ఉంది. అదే నీవు. ఈ సత్యము తెలిస్తే ఇక బంధ మెక్కడిది? మోక్ష మెవరికి? బంధము ఆరంభమైన దెప్పుడు? మోక్షము అంతమయ్యే దెక్కడ?

ఆలోచిస్తే విచారించి చూస్తే అంతా విచిత్రమే. నీవు లేని దెప్పుడు? ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేని దేహాలతో తాదాత్మ్యం చెందిన దోషం వల్ల ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేనివారుగా మనల్ని మనం భావించుకుంటున్నాం. ఇవన్నీ కల్పిత భావనలే. బంధాలే. ఈ భావనా శృంఖలాల నుండి బయటపడి తరించేందుకు ప్రమాణం అవసరం. అదియే శాస్త్రము.

ఇది మరీ విడ్డూరంగా ఉంది కదూ? ఆత్మ స్వతఃప్రమాణ మైనపుడు, ఆత్మను తెలుసుకొనుటకు శాస్త్రము ప్రమాణమైతే, శాస్త్రముపై ఆధారపడి ప్రకాశించే ఆత్మ స్వతఃసిద్ధ మెలా అవుతుంది? అవును. ఇక్కడ శాస్త్రము ఎలా ప్రమాణము అంటే, ఆత్మను ప్రకాశింపచేయుటకు కాదు. ఆత్మకు సంబంధించి మనం ఏర్పరచుకున్న కల్పిత భావాలను తొలగించేందుకు. అది జరిగితే మనము ఆత్మవిదులమై ప్రకాశిస్తాము.

"మేము ప్రాణ స్నేహితులం. మేమిరువురము ఒక్కటే. దేహాలు రెండైనా ప్రాణం ఒక్కటే. ఆత్మ ఒక్కటే" అని ఆవేశంలో స్నేహితులు మాట్లాడుతూ ఉంటారు. అది నిజమా? కాదు. ఆ విషయం వారికే తెలుసు. అందుకనే, ఒకరి భుజాలపై మరొకరు చేతులు వేసుకొని ఉంటారు. ఆయన శరీరం ఆయనిదే, ఈయన శరీరం ఇతనిదే. "ఎక్కడికైనా మేమిద్దరమే కలిసి వెళ్తాము" అని వారు అంటే, "అది సాధ్యం కాదు. అతనితో కలిసి నీవు పోలేవు. నీతో అతను రాలేడు" అని చావు కబురు.

కలిసి ఉండొచ్చు. కలిసి పోలేము. పోయినా కలవ లేము. ఇది అర్థమైతే, భుజాలపైకి బరువు లెక్కవు. హృదయాలలో సుఖశాంతు లుంటాయి.

వేదాంత ప్రమాణం

జీవితంలో నీవు ఏది సాధించాలని భావిస్తున్నావో అది నీకు స్పష్టంగా తెలియాలి. క్షుణ్ణంగా అర్థం కావాలి.

ఇదే పురుషార్థ నిశ్చయం.

పురుషార్థ నిశ్చయం లేకుండా చేసే ప్రయత్నాలు, సాధనలు నిరాశనే కల్పిస్తాయి.

బ్రతుకునే పాడుచేస్తాయి.

ఒక విధంగా చెప్పాలంటే,

అది చీకటిలో ప్రయాణం వంటిది.

క్షణక్షణానికి మునిగిపోతున్న నావలాంటి పరిస్థితి.

పాడుచేసుకోవటం తేలికే.

సుకృతం కలిసొచ్చి, బుద్ధికి వాస్తవం తెలిసి, మోక్షాన్ని సాధించాలని మనం భావించిన నాడు కారిపోయిన కాలాన్ని తిరిగి పొందగలమా? మారిపోయిన అనుకూల పరిస్థితుల్ని వెతికి పట్టుకోగలమా?

చచ్చిపోయిన చెట్టు పునః చిగురించనట్లు పాడైపోయిన మన దేహేంద్రియ మనోబుద్ధులు శక్తివంతంగా చరించ లేకపోవచ్చు.

దీపం ఆరక ముందే చేసేదేదో చేసేయాలి.

మనోబుద్ధులు ఉడికి ఆవిరి కాకముందే సాధించేదేదో సాధించాలి. ఈ విషయాన్ని శాస్త్రం స్పష్టం చేసింది.

నీవు ఏది సాధించాలో నీకు తెలియకపోయినా, శాస్త్రం ప్రేమతో దయతో నీకు తెలియచేసింది. నీవు బంధాలను తొలగించుకొని మోక్షాన్ని పొందాలని కాంక్షించే ముముక్షువువని తెలిపింది. ముముక్షువువైన నీవు జిజ్ఞాసువు కావాలి. జిజ్ఞాసువు వైన నీకు జ్ఞానం కలగాలి. జ్ఞానం కలగాలంటే ప్రమాణం ఉండాలి.

ప్రమాకరణం ప్రమాణం

జ్ఞానాన్ని కలిగించేదే ప్రమాణం. అదే శాస్త్రం. మోక్ష శాస్త్రం.

అది వేదాంత శాస్త్రమే. ఉపనిషత్తులే.

వేదాంతోనామ ఉపనిష త్ప్రమాణం.

శాస్త్రాలు - శాసనాలు

"అలా వెళ్ళకు - అది తినకు" అని పెద్దలు పిల్లలకు చెప్పినపుడు ఆ మాటలు పిల్లలకు కష్టంగానే ఉంటాయి. ఉండాలి కూడా. లేకుంటే వారు పిల్లలెలా అవుతారు?

పెద్దలు తమ స్వేచ్ఛను అడ్డుకుంటున్నారనే అపోహ పిల్లల మనసులలో ఉండిపోతుందే గాని, అలా చేయడం తమ బాగు కొరకేననే సత్యం అవగతం కాదు.

పెద్దల, ఆత్మీయుల ఆదేశాలకన్నా శక్తివంతమైనవి, ప్రయోజనకరమైనవి శాస్త్ర విషయాలు. శాస్త్రము నిర్దేశించే ఆచార వ్యవహారాలు మనకు శ్రీరామరక్షగా మిగుల్తాయి. కనుకనే వాటిని **"ఆజ్ఞాకైంకర్యం"** అన్నారు. శాస్త్ర నిర్దేశములో సమర్పణ భావం ఉండుట చేతనే శాస్త్ర నియమాలు ఆజ్ఞాకైంకర్యా లయ్యాయి.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ

"ఏది చేయాలి - ఏది చేయకూడదు" అనే విషయంలో శాస్త్రమే మనకు ప్రమాణము అని గీతాచార్యుని ప్రబోధము.

శాస్త్రాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. శాస్త్ర హృదయాన్నెరిగి మసలుకోవాలి. మన గొప్పను ప్రదర్శించుకొనే ప్రయత్నములో శాస్త్రానికి విపరీత భావాలను జోడించ కూడదు. లేని అర్థాలను సృష్టించకూడదు.

శాస్త్రాన్ని వడపోసే పద్ధతి మంచిది కాదు. ఈ వడపోతలో ఒక్కొక్కసారి సత్యము కారిపోయి అసత్యము మిగిలిపోయే ప్రమాదము లేకపోలేదు.

వేదంలో కొందరికి ఉపనిషత్తులు అనంగీకారమట. కొందరికేమో కర్మకాండ అస్పృశ్యమట. ఇవన్నీ ఆచారాలని, సమాచారాలని భావిస్తున్నారే గాని అనాచారాలని, దురాచారాలని గుర్తించలేకపోతున్నారు. నేల విడిచి సాము చేసే ప్రయత్నములో వేదమాతను నిరసిస్తున్నామనే సత్యాన్ని కూడా గ్రహించలేకపోతున్నారు.

మన భావాలకి అనుగుణంగా ఉండాలని శాస్త్రార్థాన్ని వక్రీంచకూడదు. శ్రద్ధాభక్తులతో శాస్త్రమాతను సమీపించాలి. నమ్రతతో, విశ్వాసంతో అనుసరించాలి.

"నా బుద్ధి చెప్పినట్లు పోతాను. నా అంతరాత్మ ప్రబోధం నాకుంది. నేనేమి చేయాలో నా మనసే చెబుతుంది" అంటూ పలవరిస్తూ ఉంటారు కొందరు. ఇవన్నీ పిచ్చిమాటలు.

బుద్ధి చెప్పినట్లు నడిచే ఈనాడు బాధావలయంలో చిక్కియున్నాం. అంతరాత్మ ప్రబోధాలు అగ్నిప్రమాదాలే నని మన అనుభవాలే చెబుతున్నాయి. మనసు చెప్పినట్లు నడిచే మారణహోమాన్ని సృష్టించుకున్నాం.

మతి ననుసరించేవాడు వానరుడు. శ్రుతి ననుసరించేవాడు మానవుడు అన్నారు పెద్దలు.

శాస్త్ర నిర్ణయాలు మనసులోని కల్మషాలను తొలగించి హృదయాన్ని పవిత్రం చేసేందుకు ఉపకరిస్తాయి. పవిత్ర హృదయంలో పరమాత్మ వసిస్తాడు.

పవిత్రమైన అద్వైత సంప్రదాయంలో చరించే పుణ్యాత్ములు కర్మల అశక్తతను తెలియచేయాలే గాని కర్మలను నిరసించకూడదు. కర్మశూన్యతకు, జడత్వానికి దారితీసే బోధల్ని చేయకూడదు.

భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కర్హిచిత్

'భావంలో సదా అద్వైతం ఉండాలి. కాని క్రియలో అద్వైతం అనుసరణీయం కాదు' అనే సత్యాన్ని విస్మరించకూడదు.

కర్మమార్గంలో చరించేవారు కర్మాచరణ ఫలసిద్ధి కొరకు ఏర్పాటైనది కాదని, అంతఃకరణ శుద్ధికి ప్రతిపాదించబడినది అనే సత్యాన్ని మరువకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల నాచరించాలి. అలాగని కేవలం కర్మాచరణములోనే కూరుకుపోకుండా అద్వైతభావ సుమాలతో ఆంతరంగిక హృదయవనం శోభించేలా చూసుకోవాలి.

శాస్త్ర విషయ నిర్ణయంలో జనావళిని చాలా మంది కలవరపెడుతున్నారు కనుకనే పవిత్ర మార్గాన్ని చూపేందుకు తాము భగవద్గీతకు భాష్యము వ్రాస్తున్నట్లు చెప్పుకున్నారు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి. చెప్పడమే కాదు, ఆ విషయంలో వారు కృతకృత్యు లయ్యారు. గీతార్థమును వాస్తవముగా గ్రహించుటకు మార్గాన్ని సుగమం చేశారు.

దైవ భావన మనసులో కదిలినప్పుడే మనలో భక్తి నిలిచి మనం భక్తుల మైతే మన భక్తి క్షణిక మవుతుంది. మనం భక్తులుగా కొన్ని క్షణాలే ఉంటాము. భగవంతునితో మనకుండే నిత్యసంబంధాన్ని గుర్తించి జీవించగలిగితే సదా మనం భక్తులమై ఉంటాము. నిత్య భక్తులమై ఉంటాము. ఆ తరువాత మన నుండి ఏది జరిగినా అది నిత్యార్చనే అవుతుంది.

త్రివేణీ సంగమం

ఆశించిన ఫలితం ఆచరణలో ఆకృతిని దాల్చాలి అంటే, అందించే వ్యక్తి ఉన్న మూడు మార్గాలలో ఒక దానిని ఉపయోగించవచ్చు. ఈ విధంగానే, మన భారతావనిలో శాస్త్రాలు కళకళలాడుతూ బోధిస్తాయి.

ధర్మాచరణలోనే దైవశక్తి సమకూరుతుంది. ధర్మాచరణ సాగాలి అంటే ధర్మావగాహన ఉండాలి. అట్టి అవగాహనను శాస్త్రాలు అందిస్తాయి. చెబుతాయి. ఈ చెప్పే విధానములో ఉండే ప్రత్యేకతలను బట్టి ఒకే విషయాన్ని ఉద్బోధిస్తున్నా, అవి అనేక విధాలుగా గోచరిస్తూ ఉంటాయి.

యజమాని సేవకుని ఆజ్ఞాపించి పని చేయిస్తాడు. ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేసి శిస్తు కట్టిస్తాయి. ఇది ఒక ఆజ్ఞ. ప్రభువాజ్ఞ. అందరూ పాటించవలసిన ఆజ్ఞ. ఇష్టాయిష్టాలు ఇక్కడ చెలామణి కావు. చెప్పింది చేయటమే. ఇది ప్రభు సమ్మితము. వేదాలు ప్రభు సమ్మితాలు. తిరుగులేని జ్ఞానంతో ఆజ్ఞాపించే శక్తి గలవి. అందుకే అవి ప్రమాణాలై శోభిస్తున్నాయి. చెక్కు చెదరని, మొక్కవోని తేజముతో, శక్తితో ప్రకాశిస్తూ ఉన్నాయి. **(యద్వేదాత్ ప్రభు 'సమ్మితా దధిగతం శబ్ద ప్రమాణాచ్చిరమ్).**

ఇక రెండవ విషయం, పురాణాలు. ఇవి కూడా వేద జ్ఞానాన్నే అందిస్తాయి. వేద ప్రయోజనం ఏమిటో పురాణ ప్రయోజనం కూడా అదే. కాకపోతే, దుర్గమ మనుకున్న దానిని సుగమం చేస్తాయి పురాణాలు. జటిలమైన విషయాన్ని కూడా సరళంగా బుద్ధికి పట్టిస్తాయి. కథల రూపంలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూ కట్టి పడేస్తాయి. ఆజ్ఞలు కాకుండా ఆప్యాయతతో ప్రియంగా బోధిస్తాయి. కనుక పురాణాలు ప్రభు సమ్మితాలు కావు; మిత్ర సమ్మితాలు. స్నేహ పాత్రంగా తోడు నిలుస్తాయి. **(యచ్ఛార్థ ప్రవణాత్ పురాణ వచనాదిష్టం సుహృద్సమ్మితాత్).**

ఉపయుక్తమైన విషయం యజమాని చెప్పినా, మిత్రుడు చెప్పినా ఆచరించ దగినదే. కాకపోతే, ఆజ్ఞాపించి ప్రభువు చేయిస్తే, ఆప్యాయంగా మిత్రుడు చేయిస్తాడు. ఈ విషయాన్ని ఇంకా బాగా గ్రహించి మూడవ విషయంలోకి వెళ్దాము.

'మద్యపాన నిషేధం, ధూమపాన నిషేధం' - అని ప్రభువు లేదా ప్రభుత్వం ఆజ్ఞాపిస్తే ప్రజలు ఇష్టమున్నా లేకపోయినా ఆచరించక తప్పదు కదా!

కాని, మిత్రుడు మద్యపానం ఎలా మంచిది కాదో, ధూమపానం వల్ల ఆరోగ్యం ఎలా పాడవుతుందో హితోపదేశం చేస్తాడు. ఈ విషయంలో ఎక్కడెక్కడ, ఎవరెవరికి ఏమి జరిగిందో, ఎలా జరిగిందో కథారూపంగా కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తాడు. ప్రేమతో వివరిస్తాడు.

కష్టాలెదురైనా ధర్మాన్ని వీడకూడదు. అధర్మంతో వచ్చే సుఖాలు అభిలషణీయాలు కావు. ధర్మంతో పాండవులు ఎలా శోభించారో, అధర్మంతో కౌరవులు ఎలా పతనమయ్యారో హాయిగా, రుచికరంగా వినిపిస్తాడు. స్నేహితునిలో మార్పును సృష్టిస్తాడు. వేదాలు ఆజ్ఞాపించి ప్రభు సమ్మితాలుగా భాసిస్తే, పురాణాలు కథలు వల్లించి మిత్ర సమ్మితాలుగా, లేదా సుహృత్సమ్మితాలుగా శోభిస్తున్నాయి. ఇది మంచి మిత్రుడుగా పురాణాలు చేసే మంచి పని. స్నేహితుడు అసత్యం పలకడు. చెడు చేయడు. నిజ మిత్రుడు ఏది చేసినా, ఏది పలికినా అది మన మంచికే. పురాణాలు అక్షరాలా అలాగే ఉన్నాయి. ఉంటాయి.

ఇక మూడవ విషయం, కావ్యాలు. ఇవి కూడా హితం చేసేవే. అయితే, వేదాలవలె ఆజ్ఞాపించవు. స్నేహితునివలె కేవలం సత్య భాషణమే చేయవు. సత్యమును స్నేహితునివలె ప్రియంగా చెప్పటంతో పాటు కాస్త సరసాన్ని తగుపాళ్ళలో సమరసంచేసి అందిస్తాయి. సత్యాన్నే ప్రవచిస్తున్నా, చమత్కారాన్ని జోడించి రసపూర్ణంగా భాషించటం భార్యకే తెలుసు. కనుక కావ్యాలు కాంతా సమ్మితాలు **(కాంతా సమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యాశ్రియా).**

కాంతలలో స్వేచ్ఛాకాంతులు వెల్లివిరుస్తూ ఉంటాయి. అవసరమైతే ఉప్మాలో ఉత్ప్రేక్షని, ఆవకాయలో అతిశయోక్తిని రంగరించి వడ్డించినా అందులో అధికోత్సాహమే గాని నీరసం ఇసుమంతైనా ఉండదు. ఈ విధమైన స్వాతంత్ర్యాన్ని స్నేహితుడు తీసుకోడు. ప్రభువు అభిలషించడు. కవులు ఏదైనా చెబుతారు; ఎలాగైనా చెబుతారు. "పార్వతి చాలు గంగను విడువు" అని శివునికే మొరపెట్టుకొని జ్ఞాన దాహాన్ని తీర్చుకో గలరు. ఆ పని పురాణాలు, వేదాలు చేయలేవు.

మిత్రుడు కేవలం హితాన్ని మాత్రమే బోధించి స్నేహితుని మార్చాలని చూస్తాడు. భార్య అలా కాదు. భర్తను మార్చే ప్రయత్నంలో కొంత ఊహని కూడా జోడిస్తుంది. భావుకతను కలుపుతుంది. మొత్తానికి ఏదో కలగూరతో కమ్మగా వడ్డిస్తుంది. నడ్డి విరిగేటంత పని చేస్తుంది. ఇదంతా సరసమే. సమరస చమత్కారమే. మార్పును వాంఛించి భుజాని కెత్తుకున్న పనిభారమే.

ముగ్గురు మూడు రకాలుగా చెబుతున్నా విషయ మొక్కటే. ప్రయోజనమూ ఒక్కటే. ప్రభు సమ్మితాలుగా వేదాలు, మిత్ర సమ్మితాలుగా పురాణాలు, కాంతా సమ్మితాలుగా కావ్యాలు, కవితలు మనిషిని ప్రగతి మార్గంలో నడిపిస్తున్నాయి.

కొందరు వేదార్థాన్ని, ఉపనిషద్వైభవాన్ని వినిపిస్తారు. కొందరు పురాణ ప్రవచనం చేస్తారు. మరి కొందరు కవిత అల్లుతారు. అన్నీ మానవ కళ్యాణానికే. కాని, కొందరు మూడు కార్యాలు ముచ్చటగా చేయగలుగుతారు. వారు త్రివేణి సంగమం లాంటివారు. మునక వేస్తే చాలు. ముక్తికి చేరువగుటయే గాని మునిగిపోవటం ఉండదు.

సింహనాదం

ఒక విషయాన్ని గూర్చి ప్రసంగించి, సమాప్తి చేయునపుడు పునరాలోచన చేయుటను సాధారణంగా సింహావలోకనము అంటారు. ఇది చాలా సంకుచితమైన నిర్వచనము. "సింహావలోకనము" అనేది న్యాయము. ఇందులో అనేకములైన విశిష్ట విషయాలు చోటుచేసుకొని ఉన్నాయి.

విషయాన్ని ప్రస్తావించునపుడు భాషాభావం వలన గాని, ఏమరుపాటు వలన గాని, స్మృతి లోపముచేత గాని, సన్నివేశ ప్రతిబంధకము వలన గాని పూర్ణంగా తెలుపలేక పోవచ్చు. ఇట్టి క్లిష్ట పరిస్థితులలో రెండు విషయాలు చోటుచేసుకుంటాయి. మొదటిది **అనుక్తం.** రెండవది **దురుక్తం.**

ఉక్తం అంటే చెప్పబడింది. **అనుక్తం** అంటే చెప్పవలసిన విషయములో కొంత విషయము చెప్పబడనిది; లేదా చెప్పవలసిన దానిని స్పష్టంగా చెప్పలేకపోయినది. **దురుక్తం** అంటే చక్కగా చెప్పకపోవుటయే గాక దోషయుతంగా చెప్పబడింది. ఈ విషయాలను జాగ్రత్తగా మనసులో పెట్టుకొని బోధకుడు బోధించాలి. అప్పుడే **ఉక్తం** స్ఫూర్తిని నింపుకొని **సూక్తం** అవుతుంది.

దీనినే శాస్త్రంలో **అనువాద ప్రక్రియ** అంటారు. చెప్పవలసింది చక్కగా చెప్పుట జరిగినదా? లేక, తెలియక తొలగింపు లేవైనా జరిగినవా? చెప్పకూడనివి చెప్పుట జరిగినదా? లేక పొరపాటున దోషాలు తొంగి చూశాయా? వీటిని మదిలో ఉంచుకొని బోధను సమాప్తి చేయునపుడు ప్రవచించిన విషయమును ముక్తసరిగ తిరిగి చెప్పడం జరుగుతుంది. దీనినే **అనువాదము** అంటారు. ఈ ప్రక్రియను ప్రకాశింపజేసే న్యాయమే **సింహావలోకన న్యాయము.**

'సింహావలోకన న్యాయము' అనగానే ఇందులో మనకు మూడు పదాలు తెలుస్తున్నాయి. 1. సింహము 2.అవలోకనము 3. న్యాయము. అవలోకనము అంటే చూచుట అని అర్థము. సింహావలోకనము అంటే సింహము చూచినట్లు చూచుట అని అర్థము.

తల వంచుకొని గేదె ముందుకు నడుస్తుంది. తలను పైకెత్తి గుఱ్ఱం పరుగు దీస్తుంది. తలను ఊపుతూ గోమాత కదుల్తుంది. కాని వెనుకకు తిరిగి చూస్తూ నడిచేది సింహము ఒక్కటే. ఇదే సింహావలోకనము. ఈ విషయమును న్యాయముగా నిర్ణయించి, బోధనా ప్రక్రియను మహర్షులు సుగమం చేశారు.

నది ముందుకు సాగినట్లు విషయాన్ని చెప్పుకొంటూ ముందుకు పోయే బోధకుడు శ్రోతలను ప్రభావితం చేయలేడు. పైగా సందేహాలతో మనసును నింపేస్తాడు. తాను చెప్పిన విషయము శ్రోతలకు అర్థమైనదా లేదా అనే విషయంలో వక్తకు సందేహ ముండకూడదు. ఈ పరిస్థితి రాకుండా వక్త బోధలోనే జాగ్రత్త పడాలి. సింహావలోకన న్యాయాన్ని అనుసరిస్తూ ప్రసంగించాలి. సింహావలోకనము అంటే విషయమంతా పూర్తి అయిన తరువాత చెప్పవలసింది కాదు అనే సత్యము ఇప్పటికే మీకు అవగతమై ఉంటుందని భావిస్తున్నాను. బోధ జరిగినంతసేపు సింహావలోకనము జరుగుతూనే ఉంటుంది. ఇక్కడే శ్రోతలకు విషయం సుగ్రాహ్య మవుతుంది. ఇక్కడ జరిగేది సింహావలోకనమే గాని పునరుక్తి కాదు అనే సత్యాన్ని కూడా గ్రహించాలి.

సింహావలోకన న్యాయము చాలా విస్తృతమైన న్యాయము. ఇది చెప్పవలసిన విషయంలోనే గాక, చేయవలసిన విషయంలో కూడా చోటుచేసుకొని ఉంటుంది. బోధకే గాక క్రియకు కూడా వర్తిస్తుంది.

కృతం అంటే చేయబడింది. **అకృతం** అంటే చేయవలసిన దానిలో కొంత చేయబడనిది; లేదా చేయవలసిన దానిని చక్కగా చేయలేకపోయినది. **దుష్కృతం** అంటే చక్కగా చేయలేకపోవుటయే గాక దోషయుతంగా చేయబడింది. ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించుకొంటూ వ్యవహరించాలి. అప్పుడే **కృతం** కళ్యాణప్రదమై **సుకృతం** అవుతుంది.

దీనినే శాస్త్రంలో **అనుకృత ప్రక్రియ** అంటారు. ఇది చాలా ఉపయుక్తమైనది. చేయవలసిన కార్యమును చక్కగా చేయుట జరిగినదా? లేక, తెలియక కొన్నిటిని విడిచిపెట్టుట జరిగినదా? చేయకూడనివి చేయుట జరిగినదా? లేక, పొరపాటున చెడు చేయబడినదా? వీటిని దృష్టిలో ఉంచుకొని చేసిన దానిని పునరావలోకనము చేసుకుంటూ నడవడము జరుగుతుంది. దీనినే **అనుకృతము** లేదా అనుసరణము అంటారు. ఈ జీవన ప్రక్రియను కూడా సింహావలోకన న్యాయము ప్రకాశింప చేస్తుంది.

కొందరు పడుకొనే ముందు ఆనాడు తమ ద్వారా జరిగిన కర్మలను సింహావలోకన న్యాయము ననుసరిస్తూ మదింపు వేసుకుంటారు. ఇది మంచిదే. వాస్తవానికి ఇది దినాంతములో జరుగవలసింది కాదు; దినమంతా జరుగవలసింది. అప్పుడే కర్మలు శుద్ధిపడతాయి. లేకపోతే వారం రోజులు చేసిన దోషాలను ఒక్క క్షణంలో భగవంతుడి ముందుంచి, క్షమించమని ప్రార్థించి, మళ్ళీ నూతన దోషాలకు శ్రీకారం చుట్టడమే అవుతుంది.

ముద్ద ముద్దకు ఆకలి తగ్గినట్లు, గుటక గుటకకు దాహం తీరినట్లు, అడుగు అడుగుకు దూరం తగ్గినట్లు, శ్వాస శ్వాసకు ప్రాణం చిక్కినట్లు కర్మలలో తీరు తెలుసుకొంటూ కర్మ తేరును వైభవంగా నడుపుకుంటూ పోవాలి. నిత్యమూ అవలోకనములో కళ్యాణం తొంగిచూస్తే, ఆ తరువాత అంతా నిత్యకళ్యాణమే. ఇదంతా సింహావలోకన న్యాయమే.

సింహావలోకన న్యాయపరిధిలోకి ఒక్క 'బాలెన్స్‌షీటు'ను మాత్రమే తీసుకోకుండా దినసరి జమాఖర్చులను కూడా తీసుకోవాలి అని చెప్పడమే నా ప్రధానోద్దేశ్యము.

అయితే, ఇక్కడ ఒక్క విషయాన్ని మరచిపోకూడదు. సింహావలోకన న్యాయములో కర్త మృగరాజు. సింహము. ముందు నడుస్తూ, వెనుక చూసుకుంటూ చరించే వైభవము మృగరాజుకే సాధ్యం. అలాగే సింహావలోకన న్యాయమును అనుసరిస్తూ పలవరించడం, ప్రవర్తించడం సింహమువలె ధీరులైన వారికే సాధ్యం. కాని ఏదైనా కొందరికి అసాధ్యంగా గోచరించవచ్చు. నిజం చెప్పాలంటే ఎవరికీ ఏదీ దుస్సాధ్యం కాదు. **సాధనమున పనులు సమకూరు ధరలోన** అన్నాడు వేమన. దీనినే ప్రగతి కాముకులు సదా స్మరించాలి మననమున.

సింహావలోకన న్యాయమును సదా మన ప్రవర్తనలో దర్శించుకొంటూ పోవడం అలవరచుకోవాలి. ఇది జీవితానికి ఎనలేని శోభనిస్తుంది.


ఇతిహాసములు - పురాణములు

ఇందులో...

రామాయణము

మహాభారతం

శ్రీమద్భాగవతము



శ్రీమద్రామాయణము

ముందు మోము తెల్లన

వెనుక కురులు నల్లన

చందురుని వంటి అందమైన ముఖాన్ని ముందు ఉంచి, చీకటి వంటి నల్లని కురుల్ని వెనుక ఉంచడంలో ఆంతర్య మేమిటో?

ముందున్న అందాన్ని చూసి మురిసిపోకు. వెన్నంటి వచ్చే వెతల్ని చూచి నడువు అని తెలుపుటకా? లేక, సుఖం వెనుకే దుఃఖం దాగి ఉంది అని చెప్పుటకా? ఏది ఏమి అయినా,

ఇది గాలిబ్రతుకు. క్షణక్షణానికి పడమటవైపు వాలిపోతున్న బ్రతుకు. రాలిపోతున్న బ్రతుకు. కాలంలో కాలిపోతున్న బ్రతుకు.

గాలి ఉన్నంతవరకే మేడలు, మేడమూ.... ఆ తరువాత, అవన్నీ గాలితోపాటు కూలిపోయే మేడలే. గాలిమేడలే.

వార్పు దొరకని జీవికి ఓదార్పే చల్లని కూర్పు. బాధల సుడిగుండంలో బోధలే రక్షకులు. మంచి మాటలే మార్గగాములు.

జీవితం చదరంగమే కాదు. రణరంగము కూడా. చేదు అనుభవాలు చుట్టుముట్టి బాధిస్తున్నా, చిత్తపరిపాకం చెదరకుండా సాగిపోవడం నేర్చుకోవాలి. ఆ నేర్పు కావాలి. జీవికి ఆ నేర్పు రావాలి.

ప్రాణ సమానంగా ప్రేమించినా, అవగాహన లేనివారు మనల్ని విడిచి వెళ్ళినపుడు చిత్తక్షోభ కలుగుతుంది కదూ? అట్టి సమయాలలో,

"చలా హి ప్రాణినాం మతిః"

"జీవుల మనసులు చంచలమైనవి" అనే మాట ఎంత ఓదార్పు నిస్తుంది!

కళ్ళముందే కనిపిస్తున్న సుఖం క్షణంలో అదృశ్య మైనపుడు,

"దుర్లభం హి సదా సుఖమ్"

"సుఖమనేది ఎల్లప్పుడూ ఉండదు కదా!" అనే మాట ఎంత ధైర్యాన్నిస్తుంది!

ఆత్మీయుడైన నవయువకుడు ప్రమాదంలో గతించినపుడు,

"ధ్రువం హ్యకాలే మరణం న విద్యతే"

"కాలం తీరనిదే చావు రాదు" అనే పలుకు ఎంత ఊరట నిస్తుంది!

మంచికి పోయి వంచనకు గురి అయినపుడు,

"మృదుర్హి పరిభూయతే"

"మెత్తని వానిని అందరూ మొత్తుతారు" అనేది ఎంత హాయినిస్తుంది!

యజమానితో పాటు యజమాని కుమారుడు కూడా బాధపెట్టినపుడు, లేదా తండ్రివలె దారితప్పిన తనయుని చూసినపుడు,

"న హి నిమ్బాత్ స్రవేత్ క్షౌద్రమ్"

"వేపచెట్టు నుండి తేనె కారుతుందా?" అనే వాక్యం ఎంత సమంజసం!

మరణశయ్యపై కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిని చూస్తూ అందరూ నిస్సహాయులై నిలబడి యున్న వేళ

"ఛిద్యమాన మివాశక్త స్త్రాతు మన్యో నగో నగమ్"

"ఒక వృక్షాన్ని ఖండిస్తూ ఉంటే ప్రక్కనున్న వృక్షం ఏమి చేయగలదు?" అనే ఆలోచన మనసును ఎంతగా బుజ్జగిస్తుంది!

ఇవి ఎలా ఉన్నాయి? ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ఇవి వాక్యాలు కావు. జీవితారణ్యంలో దారి తెలియక పరిభ్రమించే బాటసారులకు కరదీపికలు. ఆశాజ్యోతులు. ఇంతకీ, ఈ విజ్ఞాన వెలుగులు ఎక్కడివి?

ఇవి రామాయణ రత్నదీపం నుండి విరజిమ్మబడే జ్ఞానజ్యోతులు.

చేదు పూల నుండి తియ్యని తేనెను జుర్రుకొనే తేనెటీగల తెలివిని ఎంతని శ్లాఘించాలి?

ఇది స్తుతించడానికి కాదు. జీవించి సుఖించడానికి.

కష్టాల బావినుండి సుఖాలనే జలాలను చేదుకోవాలి. అది ఎలా సాధ్యమో తెలిపే గ్రంథమే రామాయణం.

ఇది కాలపరీక్షకు తట్టుకున్న గ్రంథము.

అన్నీ చదివి వెలితి పొందినవారు రామాయణాన్ని చదివి వెలుగును దర్శిస్తారు.

అన్ని కాలాల్లో, అందరినీ సంతృప్తిపరచే ఉదాత్తమైన గ్రంథం. అభ్యుదయానికి, ఆదర్శానికి నిదర్శనమే రామాయణ కావ్యం.

భారతజాతిని ధర్మజాగరణలో నిలిపిన గ్రంథం.

భారతీయ సంస్కృతీ వైభవమును అంబారీ నెక్కించి విశ్వమంతా ఊరేగించిన గ్రంథం.

చివర ఎక్కడో తెలియని చరిత్ర

కడ ఎక్కడో కనిపించని కథ

ఇది ఆరు కాండల కావ్యం. ఇరవైనాలుగు వేల శ్లోకాల గ్రంథం.

రసభరితమైన రఘునాథుని రమణీయ చరితము.

వాల్మీకి వాక్సుధ. రసోద్వేగము గల రచన.

ఆలోచనామృతమైన సాహిత్యం, ఆపాత మధురమైన కవిత్వం గంగా ప్రవాహంలా ప్రవహించింది ఈ కావ్యంలో.

హిమవన్నగము వలె ఉన్నతమైన ఊహలు

సముద్రలోతు వలె అగాధమైన భావాలు

అదొక కమనీయ రచన. వాల్మీకి ముఖ వినిస్సృతమైన రచన. కాదు. అర్చన. కవితార్చన. కవికోకిల పరవశించి, ఆరాధించిన దివ్యార్చన. దేవతార్చన.

బిడ్డను ఒడిలో కూర్చోబెట్టుకొని తల్లి కథ చెప్పినట్లుంటుంది, ఒకచోట.

గురువు తరగతిలో పాఠం చెప్పినట్లు ఉంటుంది, మరొకచోట.

న్యాయవాది న్యాయస్థానం ముందు అమోఘంగా వాదించినట్లుంటుంది, ఇంకొకచోట.

వైద్యుడు వ్యాధిని, చికిత్సను వివరించి చెప్పినట్లుంటుంది, వేరొకచోట.

ఇది ఆదికావ్యం. ప్రజాదరణ కావ్యము.

వ్యక్తిధర్మము

కుటుంబధర్మము

సంఘధర్మము ఈ ధర్మత్రయాన్ని వంటబట్టించే త్రివేణీ సంగమమే రామకథ. అభ్యుదయానికి, ఆదర్శానికి నిదర్శనమే రామకథ. సీతారామకథ.

భారతం జరిగి ఐదువేల సంవత్సరాలైంది.

భారత కథకు ముందు యుగంలో రామాయణం జరిగింది.

ఇన్నివేల సంవత్సరాలుగా ఒక కథ లేదా కావ్యము ప్రజల్ని ప్రభావితం చేస్తూ వస్తున్న దంటే, మారే దేశకాల పరిస్థితులకు ఆ రచన ఎంత అనుగుణంగా ఉందో ఆలోచించండి.

రామాయణం అందరికీ కావాలి అద్దంలాగా. ఎందుకో తెలుసా? అందులో అందరి పాత్రలూ ఉన్నాయి. రామాయణాన్ని చదివేవారందరు అందులో తమ చోటెక్కడో అన్వేషించి పట్టుకుంటారు. గుట్టుచప్పుడు కాకుండా మనసులో ఓ మూల దాచేసు కుంటారు.

రామాయణాన్ని జిజ్ఞాసువులు తరచి తరచి చూస్తారు. ఎందుకు చదవాలి? అని అజ్ఞాని ప్రశ్నిస్తాడు. ఇంకా తెలుసుకోవాలి అని జ్ఞానులంటారు. ఎంతకూ అంతుపట్టదు అని పరిశోధకు లంటారు.

వాలిని వెనుకనుండి చంపడం అధర్మం కాదా?

దశరథునితో అబద్ధం చెప్పమని రాముడు సుమంత్రునికి చెప్పలేదా?

నిండు చూలాలైన సీతమ్మను అడవుల పాల్జేయడం న్యాయమా?

ఇలాంటి ప్రశ్నలెన్నో?

ఇవన్నీ విమర్శలు కావు. పరామర్శలు.

రామునిలో ఒక్క తప్పును కూడా చూసి సహించలేని అంతర్మథనమే ఈ ప్రశ్నల వెనుక నిలిచియున్న వాస్తవం.

రాముడు అధర్మపరుడు కాడు- అది ఎలాగో తెలుసుకోవాలనే తపన.

నిజానికి, అదొక తరహా ఇంటరాగేషన్.

దారి తప్పిన నడకే గాని గమ్యాన్ని నిరపించే బాట కాదు. మాట లేదు.

ఒక వ్యక్తి రామాలయంలో నిత్యమూ జరిగే రామాయణ ప్రవచనం వింటుండేవాడు. ఒకరోజు తన కుమారుడు కూడా తండ్రితో కలసి శ్రవణానికి బయలుదేరాడు. వద్దని తండ్రి కుమారుని వారించాడు.

ఎందుకో తెలుసా? తన వృత్తి చోరవృత్తి. రామాయణం విని తన కుమారుడు ధర్మ జీవనాన్ని ఎంచుకుంటాడేమో! చోరవృత్తిని త్యజిస్తాడేమో? అనే భయం.

మరి, రోజూ తానెందుకు వింటున్నట్లు? రామాయణాన్ని శ్రవణం చేసి తాను మారనపుడు కొడుకు మాత్రం ఎందుకు మారుతాడు? దీనిని మనస్తత్వశాస్త్ర దృక్కోణం నుండి పరిశీలించాలి.

తాను వింటున్నాడు. అయినా మారలేదు. కానీ, మారమని అంతర్యము ఘోషిస్తూ ఉంది. నేటివరకు ఎలాగో తట్టుకున్నాడు. ఇలా తట్టుకొని నిలిచే కాఠిన్యం తన కుమారునికి ఉంటుందో, లేదో అనేదే సందేహం. అందుకే రామాయణాన్ని శ్రవణం చేయవద్దని చెప్తాడు కుమారునితో.

రామాయణం ప్రభావం అలాంటిది.

ఒక్కసారి వింటే చాలు. వంటబట్టే వరకు వ్యక్తిని విడవకుండా వెంటనడిచే కావ్యం అది.

ఒక సన్నివేశాన్ని ,చదవడం పూర్తికాగానే ఇంకా ఉంటే బావుండేది అనిపిస్తుంది. ఎప్పట్నుంచో చదువుతున్నా అప్పుడే అయిపోయిందా? అనిపిస్తుంది.

అదొక నిత్యదాహం. తీరని ఆశ. తనివి తీరని పిపాస.

వాల్మీకి మహర్షి మనసుతో మాట్లాడడు. హృదయంతో భాషిస్తాడు.

బరువైన తేలిక పదాలతో హృదయాల్ని కుదిపేస్తాడు.

వేదం సనాతన మైతే, సనాతన ధర్మ ప్రదర్శనమే రామాయణం.

దివినుండి భువికి దిగిన నాదాత్మకమైన వేదమే రామాయణం.

వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా!

"వేదవేద్యుడగు పరమాత్మ దశరథుని కుమారుడైన శ్రీరాముడుగా జన్మించగా, వేదము ప్రాచేతసుడగు వాల్మీకి వలన రామాయణంగా ఆవిర్భవించింది".

ఈ విధంగా చూస్తే రామాయణం దేవుడైన నారాయణుని కథ అవుతుంది. కానీ, రాముణ్ణి దేవుడుగా వాల్మీకి చిత్రించలేదు. మానవునిగానే చిత్రించాడు.

వాల్మీకి చిత్రించిన రామునిలో మనకు మానవుడు గోచరిస్తాడు.

మానవునిలో రాముని నిలపాలంటుంది రామాయణము. అంతే.

ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజే

తాను మానవుడని, దశరథుని కుమారుడని రాముడు యుద్ధకాండలో చెప్పుకున్నాడు. మానవుడై జన్మించి, కష్టాల్లో కూరుకుపోయినా మార్గాన్ని వీడకుండా ధర్మ జీవనాన్ని గడిపి, మానవులందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు శ్రీరాముడు.

పూర్ణపురుషుడుగా రాముడు జన్మించలేదు. జీవితంలో మహోన్నత విలువలతో జీవించి పూర్ణపురుషు డయ్యాడు. ఇలా చూసినపుడే రాముడు ఆదర్శానికి నిదర్శనంగా భాసిస్తాడు.

Human I am, human let me remain

"నేను మానవుణ్ణి. నన్ను అలాగే బ్రతకనివ్వండి" అని అరవిందయోగి సావిత్రిలో పలికించిన మాటలే ఇక్కడ రాముని నుండి వినిపిస్తున్నాయి.

రాముడు మానవమాత్రుడుగా గోచరిస్తాడు. సామాన్యునిలా కనిపిస్తాడు. మనలాగే ఉంటాడు. కానీ మనం ఆయన లాగా ఉండలేము.

నీలాగా నాలాగా రాముడు శోభిస్తాడు. రామునిలా మనం శోభించగలిగితే జీవితం ధన్యమవుతుంది. ఆ పని చేసేందుకే రామాయణం ఆవిర్భవించింది.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్
యః పఠేద్రామ చరితం సర్వపాపైః ప్రముచ్యతే

"రామకథ పవిత్రమైనది. పాపములను హరిస్తుంది. పుణ్యప్రద మైనది. వేదములతో సమానమైనది. రామకథను పఠించువాడు సర్వపాపాల నుండి విముక్తు డవుతున్నాడు"; అని రామాయణ పఠనము యొక్క ఫలాన్ని వాల్మీకి శ్రీమద్రామాయణం బాలకాండములో తెలుపుతాడు.

కనుక ఇది పుణ్యకథ. పుణ్యనది లాంటిది. పావనగంగ వంటిది.

వాల్మీకి గిరి సంభూతా రామాంభోనిధి సంగతా
శ్రీమద్రామాయణీ గంగా పునాతి భువనత్రయమ్

"శ్రీమద్రామాయణము గంగానది వంటిది. వాల్మీకి యనే హిమవన్నగము నుండి ఆవిర్భవించింది. గంగానది సాగరములో సంగమించునట్లు, రామాయణ మహానది రామ సాగరంలో సంగమిస్తున్నది. ఈ రామాయణ గంగ ముల్లోకములను పవిత్రం చేస్తూ ఉంది".

ఇంతకీ ఈ పుణ్యకథ ఎవరిది?

రామునిదా? సీతమ్మదా? రావణునిదా?

కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్
పౌలస్త్యవధ మిత్యేవ చకార చరితవ్రతః

నిత్యవ్రతుడైన వాల్మీకిమహర్షి ఈ కావ్యమును "రామాయణము", "సీతా చరితము" "పౌలస్త్యవధము" అను పేర్లతో రచించినట్లు శ్రీమద్రామాయణము బాలకాండములోని నాల్గవ సర్గయందు స్పష్టం చేయబడింది.

ఈ కావ్యానికి మూడు పేర్లు.

1. రామాయణము 2. సీతాచరితము 3. పౌలస్త్యవధ

1. రామకథ :-

రామస్య అయనమ్ రామాయణమ్ - రాముని పొందేలా చేయునది రామాయణము. ఇది బాహ్యానికి రామకథ. ఆంతర్యానికి పరమాత్మకథ.

2. సీతకథ:-

రామాయాః అయనమ్ రామాయణమ్ - రామా అనగా స్త్రీ, అంటే సీత, ఆమెయొక్క కథ రామాయణము అని అర్థము. ఇది బాహ్యానికి సీతకథ. ఆంతర్యానికి జీవాత్మగాథ. 'రమ్' ధాతువు పుంలింగ మైనపుడు రామ+అయనం=రామాయణమై రామకథ అవుతుంది. అలాగాక స్త్రీలింగ మైనపుడు రామా+అయనం=రామాయణమై సీతకథ అవుతుంది.

3. రావణవధ:-

"పౌలస్త్యవధ" అని పిలుచుటచేత రామాయణము రావణ సంహారమే అని తెలియుచున్నది. ఇది బాహ్యానికి రావణవధ. ఆంతర్యానికి అజ్ఞాన నాశము.

రావణుని పాత్రను ప్రక్కకు నెట్టి రాముని ఊహించుట సాధ్యపడదు.

రామరావణ పాత్రలు ధర్మాధర్మ స్వరూపాలు.

రామునికి ధర్మమే ప్రాణం. రావణునికి అధర్మమే ఊపిరి.

రామునిది సత్యమార్గం. రావణునిది అసత్యమార్గం.

సత్యధర్మాలు జీవితానికి శోభనిస్తాయి అంటుంది రాముని పాత్ర.

అసత్య అధర్మాలు జీవితానికి క్షోభను కల్పిస్తాయి అని తెలిపేందుకు రావణుని పాత్ర.

రాముడు బాగా చదువుకున్నవాడు. రావణుడు అంతకు తక్కువేమీ కాదు.

చదివింది రామునికి వంటబట్టింది. రావణునికి అజీర్ణం చేసింది.

రాముడు సూర్యోదయమైతే, రావణుడు అస్తమయం వంటివాడు.

ధర్మం కొరకు భార్యనే పరిత్యజించాడు రాముడు.

అధర్మంతో పరుల భార్యలను అపహరించాడు రావణుడు.

అది రాముని విజ్ఞత. ఇది రావణుని అజ్ఞత.

ఎన్ని కట్టెలు పడేసినా 'చాలు' అనదు నిప్పు.

ఎన్ని నదులొచ్చి పడినా 'వద్దు' అనదు సముద్రం.

ఎంత నీరు పోసినా నిలుపుకోదు జల్లెడ.

కామము చిల్లుల జల్లెడయే. దీనికి చెల్లు రాయలేని వాడే రావణుడు.

రావణుడు గొప్పవాడే. కానీ మంచివాడు కాడు. మంచి లేని మహిమకు మరణమే శరణ్యము.

He is not great, who is not greatly good

"గొప్పదైన మంచితనం లేనివాడు ఎన్నడూ గొప్పవాడు కాలేడు" అంటాడు షేక్స్పియర్. స్త్రీలోలత్వం చంపుకోలేక బిడ్డల్ని చంపుకున్నాడు. బంధువుల్ని చంపుకున్నాడు. తమ్ముళ్ళను చంపుకున్నాడు. లంకానగరాన్నే శ్మశానంగా మార్చేశాడు.

చివరికి ఏం మిగిలింది?

తాను కూడా మిగలకుండా పోయాడు. అపఖ్యాతి ఒక్కటే నిలిచిపోయింది.

ఇదే రావణుని పాత్ర.

వాలాగా జీవించి సుఖించండి అని తెలిపేందుకు రాముని పాత్ర.

వాలాగా జీవించి నశించకండి అని తెలిపేందుకు రావణుని పాత్ర.

రామాయణ పుణ్యకథ

1. ధర్మాత్ముడైన రాముని గాథ
2. మహాసాధ్వి యైన సీతమ్మ గాథ
3. మహావీరుడైన రావణుని గాథ

పరమాత్మ అడుగుజాడల్ని పట్టుకొనేందుకు రామకథ. జీవాత్మ తరించేందుకు సీతకథ. అజ్ఞాన నాశమునకు రావణవధ.

నామాలు ఎన్నయినా, ఇవన్నీ మన చిరునామాను తెలుసుకొనేందుకే.

ఇలా వాల్మీకి దృష్టి అనేక కోణాల్లో పయనించింది.

రామాయణ శ్రుతిలో వాల్మీకి ఆలపించిన రాగాలు అమోఘాలు.

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్

ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥

"కవిత్వమనే కొమ్మపై కూర్చుని "రామ-రామ" అని మధురాక్షరములను మధురముగా ఆలపించే వాల్మీకి కోకిలకు నమస్కారము".

వాల్మీకి గొంతులో కోకిల స్వరాలే గాదు. సింహగర్జనలూ ఉన్నాయి.

వాల్మీకే ర్మని సింహస్య కవితా వన చారిణః

శృణ్వన్ రామకథా నాదం కో న యాతి పరాంగతిమ్ ॥

కవిత్వమనే అరణ్యంలో వాల్మీకి అనే సింహము సంచరిస్తూ ఉంది. ఆ సింహము రామకథను గర్జిస్తూ ఉంది. ఆ నాదాన్ని ఆలకించినవాడు తరించకుండునా?"

వాల్మీకిలో కోకిల సుస్వరం ఉంది. సింహగర్జనమూ ఉంది. కోకిలలా మధురంగా చెప్పడమే గాక, సింహంలా గంభీరంగా చెప్పడం కూడా వాల్మీకికి అలవడింది. శారద కల పండింది. మన జన్మ తరించింది.

వాల్మీకి కోకిల స్వరములో మధుర రవాలతో పాటు, మధురాక్షరాలు దొర్లుతున్నాయి. అక్షరత్వము సిద్ధించింది.

అక్షరత్వ మున్నందున రామాయణం క్షరం కాలేదు. కాలప్రవాహంలో కరిగిపోలేదు. నిత్యనూతన కళలతో అనుదిన ప్రవర్ధమానంగా శోభిస్తూనే ఉంది. భవిష్యత్తులో ఇంకా శోభిస్తుంది కూడాను.

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే

తావ ద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి

"ఈ భూప్రపంచమున గిరులు, నదులు ఉన్నంత వరకు రామాయణకథ లోకంలో నిలిచి ఉంటుంది" అని శ్రీమద్రామాయణము బాలకాండములో బ్రహ్మదేవుడు కవియైన వాల్మీకితో అంటాడు.

శ్రీమద్రామాయణము ఆపన్న ప్రసన్నుడైన శ్రీరాముని గాథ. కనుక ఇది అక్షరం. అనవద్యం. అమృతం.

రామాయణము అమృతసాగరము. అందుకే దానిలోని భాగాలకు కాండములని పేరు పెట్టాడు వాల్మీకి.

కాండము అనగా జలము అని అర్థము. ప్రతి అమృతబిందువు ప్రాణప్రదమే. రామాయణంలో ప్రతి అక్షరము మోక్షప్రదమే. అక్షయపదమే. అందుచేత రామాయణము సుధాసాగర మైంది.

ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్

ప్రతి అమృతబిందువు ప్రాణప్రద మైనట్లు, రామాయణంలో ప్రతి అక్షరము పాపనాశమేనని వాల్మీకి వాక్సుధ.

రామాయణము సాగరమే కదూ! అయితే,

దూరాన నిలిచి చూచేవారికి కవిత్వకెరటాల శబ్దమాధుర్యాలు చెవికి అందుతాయి. దిగిన వారికి ఒళ్ళు చల్లబడుతుంది. ఉల్లము తేలిక పడుతుంది. కావ్యంలోని అర్థమాధుర్యాలు హృదయాన్ని స్పృశిస్తాయి.

లోతుకెళ్ళిన వారికి ఆణిముత్యాలు లభిస్తాయి. అక్షరసత్యాలు ప్రాప్తిస్తాయి.

కుక్షి శుద్ధిపడి, అక్షి సిద్ధపడి మోక్షము లభిస్తుంది.

ఇదీ వాల్మీకి ప్రవహింప చేసిన రామాయణ మహానది.

రసానంద సాగరాన్ని సదా స్పృశించే సజీవ కావ్య స్రోతస్విని.

మునిజన సంవేద్యంగా, అఖిల భక్తజన హృద్యంగా మనకు ప్రాప్తించిన ఆద్యగ్రంథము. ఆదికవి నుండి వెలుగు చూసిన రామాయణ కల్పవల్లి. కావ్యతల్లి. ఇదియే వాల్మీకి రామాయణం.

మరి అవాల్మీకాల విషయ మేమిటి? అవాల్మీకం అంటే వాల్మీకి రచన గానిది అని అర్థము.

అవాల్మీకాలు పలుపలు విధాలుగా ప్రవహించాయి.

ఏది ఎలా ఉన్నా, వాల్మీకమే ప్రమాణం.

వాల్మీకం ప్రమాణం అనగానే తక్కినవి అప్రమాణం అనే ధ్వని ఉండనే ఉంది. ఏం చేద్దాం? చెప్పండి.

అందరి కన్నూ ఆదికావ్యం పైనే. ఆదికవిని అధిగమించాలనే అత్యాశ లేకున్నా, అనుకరించి ఆనందించాలనే ఉబలాటం తప్పదు కదా! అమృతాన్ని అపహాస్యం చేస్తున్న కావ్యాన్ని ఎవరు కౌగిలించుకోరు?

ఈ ప్రయత్నంలోనే అవాల్మీకాలు కోకొల్లలుగా దొర్లాయి. అనేక భాషలలో రామాయణాలు అసంఖ్యాకంగా అరుదెంచాయి.

అయితే, వీరంతా వాల్మీకి అన్నదే రాశారా? రామాయణంలో ఉన్నదే రాశారా?

అలా జరిగితే అవి అవాల్మీకా లెలా అవుతాయి? అవాల్మీకా లంటేనే జహద జహల్లక్షణాల సంయోజనం. ఉన్నవి కొన్ని తొలగించి ఉంటారు. లేనివి కొన్ని తగిలించి ఉంటారు. ఈ కూడికల, తీసివేతల పనితనంలోనే అవి వాల్మీకాలు కాకుండా మిగిలాయి. ప్రత్యేక నామాలతో శోభిస్తున్నాయి.

అవే తులసీ రామాయణం, భావార్థ రామాయణం, కంబరామాయణం, అధ్యాత్మ రామాయణం, ఆనంద రామాయణం, రంగనాథ రామాయణం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, గోపీనాథ రామాయణం, చెంపూ రామాయణం, విచిత్ర రామాయణం, నిర్వచనోత్తర రామాయణము - ఇలా చెప్పుకొంటూ పోవాలంటే ఎన్నని? ఎన్నయితే నేమి? అన్నీ అవాల్మీకాలే.

అయితే, వీటి ప్రభావ ప్రాశస్త్యా లేమిటి? అనేదే మన ముందు నిలిచియున్న ప్రశ్న, లేదా సమస్య.

ఈ ప్రశ్నకు సమాధానం వెదికే ముందు, ఈ సమస్యకు పరిష్కారాన్ని కనిపెట్టే ముందు లేదా కనుగొనే ముందు అసలు వాల్మీకి రామాయణాన్ని ఎందుకు వ్రాశాడు? అనే విషయంపై మన దృష్టి సారించక తప్పదు. వాల్మీకం ఎందుకో తెలిస్తే, అవాల్మీకాలు ఎందుకొచ్చాయో తెలుస్తుంది.

వాల్మీకి రామాయణాన్ని బట్టి వాల్మీకి రామునికి సమకాలికుడు అని తెలుస్తూ ఉంది. రాముని జీవితకాలంలోనే వాల్మీకి రామాయణ రచన చేశాడు. ఇది నిర్వివాదాంశం. ఇకపోతే, ఎందుకు వ్రాయవలసి వచ్చింది? ఈ రచనకు ఉపక్రమించడానికి దారితీసిన పరిస్థితు లేమిటి?

1. తనపాపదీ తీరాన బోయవాడు క్రౌంచపక్షిని చంపడం చూసి కరుణామయుడైన కవి హృదయం స్పందించి శోకమయం కావడం..... అది శ్లోకరూపం ధరించడం.

2. ఇదిలా ఉండగా, లోకనిందకు గురియై భర్తకు దూరమై అరణ్యాల పాలైన సీతమ్మ వాల్మీకి ఆశ్రమంలోనే ఉందికదూ?

పక్షికి ప్రాప్తించిన శోకము పడతిని హింసించిన లోకము -

శోకము, లోకము మదిలో మెదిలి మానిషాద శ్లోకంగా రూపొందింది.

ఇది ఆశ్చర్యం. పరమాశ్చర్యం. కదూ!

3. "ఆశ్చర్యపడకండి. ఇదంతా నా సంకల్పమే. నా ప్రేరణే. రామకథను రచించు. నారదుడు చెప్పింది నీవు వినియే ఉన్నావు. నా అనుగ్రహంతో వినిపించనిది కూడా నీకు కనిపిస్తుంది" అని బ్రహ్మదేవుడు పలకడం, వాల్మీకి ఆదికావ్యానికి శ్రీకారం చుట్టడం. ఇంతేకదూ!

మహాసాధ్వియైన సీతమ్మపై నిందవేసిన లోకాన్ని చూసి కలత చెందియున్న దయామయుని హృదయాన్ని పక్షి శోకము కుదిపేసింది.

వ్యాధుడు పక్షిజంటను శాశ్వతంగా వేరు చేశాడు. రావణుడు సీతారాముల్ని తాత్కాలికంగా వేరు చేశాడు. క్రౌంచపక్షులు ఇక కలిసే దుండదు. కానీ సీతారాములు కలిశారు. ఏం లాభం?

లోకం కోడెత్రాచై కాటువేసింది. సీతమ్మను శాశ్వతంగా రామునికి దూరం చేసింది. ఈ దారుణ బాధను కోమలమైన కవిహృదయం భరించలేకపోయింది. లోకం పోకడకు దుఃఖించింది. అంతటితో ఆగలేదు. లోకం కళ్ళు తెరిపించే ప్రయత్నం చేసింది.

సీతాయా శ్చరితం మహత్. సీతమ్మ కరుణామయ గాథను వ్రాసి లోకానికి చాటాలని అభిప్రాయపడ్డాడు ఆదికవి. ఈ అన్యాయం మరొకరికి జరగకూడదని భావించాడు. కన్నీళ్ళను సిరాగా మార్చి కరుణారస భరితమైన రామాయణాన్ని రచించాడు.

కుశలవులకు బోధించాడు. నిప్పులాంటి తల్లిపై నిందలు వేసిన, నిందలు మోపిన లోకం సిగ్గుతో తలవంచేలా చిన్నారుల చేతులకు చిఱుతలు తగిలించి కావ్యగానం చేయించాడు.

అది గానం కాదు. యుద్ధభేరీ నినాదం.

అమాయకుల జీవితాలతో ఆట్లాడుకొనే సమాజంపై కలాన్ని కత్తిలాగా ఝుళి పించిన సాంస్కృతిక విప్లవం.

ఒకరి పొరపాట్లు మరొకరికి గ్రహపాట్లుగా మారకూడదని,

ఒకరి వికృతపు చేతలు మరొకరికి నొసటి రాతలు కాకూడదని, మ్రోగించిన [illegible],

అదురెరుగని వీర శంఖారావం.

కవితాలక్ష్యం విశ్వకల్యాణమే కదూ?

కావ్యలక్ష్యం విశ్వశ్రేయమే కదూ?..... అయితే ఆ కార్యం సఫలీకృతమైంది. వాల్మీకికి కార్యసిద్ధి లభించింది.

కాస్త ఆగండి. అవాల్మీకాలను గూర్చి ఇప్పుడు ఆలోచించండి.

ఏ విశ్వశ్రేయాన్ని కాంక్షించి వాల్మీకి ఆదికావ్యం రచించాడో, ఏ మానవ సమాజాన్ని ఉద్ధరించడానికి రామాయణాన్ని అందించాడో, అదే స్ఫూర్తితో అభ్యుదయాన్ని కాంక్షిస్తూ, ఆదర్శాన్ని వాంఛిస్తూ ఎందరో మహాత్ములు తమదైన, అరుదైన బాణీలను సమకూర్చుకొని రామకథను గానం చేశారు.

రూపాలు వేరే గాని, పదార్థం, ప్రయోజనం ఒక్కటే.

జీవనది సాగిపోతుంటే, మధ్యమధ్యన ఉపనదులు వచ్చి కలుస్తాయి.

కాలువలు కలుస్తాయి. వాగులు చేరుతాయి. అన్నీ కలిసి సాగరాన్ని చేరి శాంతిస్తాయి. వాల్మీకి రామాయణ మహానదిలో అలాగే అవాల్మీకాలు తోడై నడిచాయి.

కాలువల్లాగా కొత్త కథలు కలిశాయి.

వాగుల్లా నూతన వ్యాఖ్యానాలు వరించి వచ్చాయి.

ఇవన్నీ నదిశోభను పెంచాయే గాని తగ్గించలేదు.

పొంగించాయే గాని కృంగదీయ లేదు.

"ఇక్షురసాన్ని ఎగతాళి చేసేలా ఉంది" అని రసాఖాన్ స్తుతించిన "రామచరిత మానసము"ను ఆ కాలంలో తులసీదాస్ వ్రాసి ఉండకపోతే నేడు ఉత్తర భారతదేశము మనకు పరదేశంగా మిగిలి ఉండేది.

బెల్లం చుట్టూ ఈగలు చేరినట్లు

ఆదికావ్యాన్ని ప్రేమతో అందరూ ఆశించారు.

సంస్కారానికి అనుగుణంగా సంతర్పణ చేశారు. సందడి చేశారు.

ఇది శుభపరిణామమే నని నా అభిప్రాయం.

దీని వెనుక అనంతుని అభయహస్తం ఉందనే నా నమ్మకం.

అవాల్మీకాల వల్ల ఆదికావ్యానికి కీడు జరుగలేదు.

నిజం చెప్పాలంటే, ప్రక్షిప్తాల వల్లే ప్రమాదం వాటిల్లింది.

అవాల్మీకాల్ని అందించిన ఎందరో మహాత్ములు తమ హృదయంలోని వెలుగును వెలికితీసే ప్రయత్నం చేశారే గాని, వల్మీకంలో వేలు పెట్టలేదు. వాల్మీకంలో చేయి దూర్చలేదు.

వాళ్ళ పాటేదో వాళ్ళు పాడారు. వారి రాగాన్ని వారు ఆలపించారు. అంతేగాని మరొకరి గానంలో అపశ్రుతిని జోడించే ప్రయత్నం చేయలేదు. కనుక సాగరానికి దూరంగా నిలబడి భక్తితో దణ్ణం పెట్టినట్లు, వాల్మీకానికి వందన మాచరించి తమ కార్యాన్ని తాము నిర్వర్తించుకున్నారు.

ఎటొచ్చి, ప్రక్షిప్తాల ప్రబుద్ధులే వాల్మీకికి నామాలు వేయాలని చూశారు. వ్యాఖ్యలు, సమీక్షలు అంటూ తమ ఛాందసాన్ని, మత మౌఢ్యాన్ని వాల్మీకానికి అంటగట్టే ప్రయత్నం చేశారు.

కానీ, అంతా శ్రీరామరక్ష. అవేమీ అంటుకోలేదు. జ్ఞానాంజనము ధరించిన మహాత్ములు పవిత్ర నేత్రాలతో వాల్మీకాన్ని చూడగానే, రసానుభూతి కొరకై, అంటుకొనే శక్తి లేక, అంటిపెట్టుకొని యున్న ప్రక్షిప్త అంటుజాడ్యాలను హెచ్చరిస్తూ మరీ తీసిపారేశారు.

ఆత్మబంధువులారా!

ఆదికవి రచించిన ఆదికావ్యం ఆదిత్యప్రకాశంతో కవితాగగనంలో శోభిస్తున్నా, దేశకాల పరిస్థితుల ననుసరించి, రామాయణాన్ని నూతన ఫక్కీలో ఎందరో మహాత్ములు రచించారు.

అందరి రచనలు ప్రయోజనాన్ని ఊహించినవే అయినా, ప్రయోగాలలో, పద్ధతులలో ఒక విధంగా సాగలేదు.

1. తులసీ రామాయణం

మంగల కరని కలిమల హరని తులసీ కథా రఘునాథ కీ!

రఘురాముని చరితము కళ్యాణప్రదమైన స్థితిని సమాజంలో ఆవిష్కరిస్తుందని, కలియుగ దోషములను నివారిస్తుందని జనావళికి హామీ ఇస్తూ రామచరిత మానసాన్ని ప్రారంభించి రచించాడు తులసీదాసు. హిందూ సమాజంలో నూతన తేజాన్ని నింపాడు. "భక్తుడైన వాడు ఒక్కసారైనా తులసీరామాయణాన్ని తప్పక చదవాలి" అంటాడు గాంధీజీ.

నారాయణునిలోని నరుణ్ణి దర్శించినవాడు వాల్మీకి.

నరునిలో నారాయణుణ్ణి దర్శించినవాడు తులసీదాస్.

"తులసీ రామాయణం భక్తుల పాలిటి పారిజాతం. హిందువులకు వేదం వంటిది. ముస్లిములకు ఖురాను లాంటిది" అని శ్లాఘించాడు మహాకవి రహీమ్.

2. కంబరామాయణం

"రామాయణాన్ని తమిళంలో రచించాలని, తమిళ ప్రపంచానికి అందించాలని నేను అభిలషిస్తున్నా. పాలకడలిని ఆపోశనం పట్టాలని పిల్లి చేసేప్రయత్నం ఎలాంటిదో నా ప్రయత్నం కూడా అలాంటిదేనని నాకు తెలుసు" అంటూ కంబరు కవి తమిళ రామాయణాన్ని నమ్రతతో ప్రారంభించాడు. అవధులు లేని వాల్మీకి పాండిత్యానికి జోహారులర్పిస్తూ ఉపక్రమించాడు.

తమిళ ప్రజలకు రామాయణాన్ని అందించి, సమాజ రథచక్రాలను నూతన మార్గంలో త్రిప్పాలని కంబరు అభిప్రాయపడ్డాడు. తన రామాయణాన్ని ఆనాటి సమాజం ఆదరించదేమో, నిరసిస్తుందేమో అనే భావన కూడా కంబరులో లేకపోలేదు. అయినా ఈ మహోత్తమ కార్యానికి కంబరు వెనుకాడలేదు. కంబరు ఏమంటున్నాడో చూడండి.

వయ్యం ఎన్నై ఇగరు మాసిన
కైద ఉమ్మి తియంబువదు తీయ దెనిల్

పాయిల్ కేళ్వి ప్పులమయిన్ ఒన్ పుగల్

దైవ మాక్కదై మాట్చి తిరిక్కవే ॥

"వాల్మీకి రామాయణాన్ని చదివి, అందలి దివ్యత్వాన్ని అవగతం చేసుకున్న నేను నా ఆనందాన్ని ప్రపంచంతో పంచుకోవాలనే అభిలాషను, ఆవేశాన్ని నిగ్రహించుకోలేక పోతున్నాను. నేను అజ్ఞానినని ప్రజలు పరిహసించనీ. నా నుండి దొర్లే గోరంత తప్పుల్ని కొండంత చేసి చూపనీ. రామాయణ కావ్య రచనను నేను విరమించుకోలేను" అంటాడు రసవత్తర భావోత్కర్షకు మారుపేరైన కంబరు కవి.

3. భావార్థ రామాయణము

మహారాష్ట్ర దేశంలో ప్రాకృతంలో గ్రంథాలు రచించి, ఆనాటి పండితుల ఆగ్రహానికి, అసూయకు గురియైన మహాత్ములలో సంత్ ఏకనాథ్ ఒకడు. సమాజం విషయము అలా ఉంచి, తన ఇంట్లోనే సంస్కృత విద్వత్తు కలిగిన కుమారుడగు హరిపండితుని నిరసనను ఎదుర్కోవలసి వచ్చింది ఏకనాథ్.

మరాటీ భాషలో రామాయణం వెలువడాలి అనేది పాండురంగదేవుని సంకల్పం. ఏకనాథ్ చక్కని పనిముట్టు అయ్యాడు. భావార్థ రామాయణం దివ్యంగా ఆవిర్భవించింది. మహారాష్ట్ర ప్రజలకు విజ్ఞాన మణిదీపమై భాసించింది. సమాజంలో నూతన వెలుగుల్ని ఆవిష్కరించింది.

శబ్దాలంకార సంవిధానంతో, వాక్య నిర్మాణ కౌశలంతో, అవరోధం లేకుండా, అలవోకగా సాగిపోయే పఠన సౌలభ్యాన్ని, శ్రవణ సుభగత్వాన్ని రంగరించి, రాగ రంజితమైన భావార్థ రామాయణాన్ని అందించాడు సంత్ ఏకనాథ్ మహారాజ్. ఈ కార్యం వెనుక రాముని అనుగ్రహమే ప్రధానం కాని తన అర్హత కాదు అంటాడు.

తూ కైసా ఝూలాసి వక్తా పుసాల మాఝి యోగ్యతా

మా ఝె అంగీ మూర్ఖపణ మా ఝె మీ జాణే సంపూర్ణ

నకరీ మహణతా రామాయణ శ్రీరామ ఆపణ కథా ప్రేరి!

"రామాయణానికి నీవు వక్త ఎలా కాగలవు? అని నా అర్హత నన్ను ప్రశ్నిస్తూ ఉంది. నాలాంటి మూర్ఖుడు రామాయణాన్ని వ్రాయగలడా? నా నిలువెల్ల మూర్ఖత్వమే. రామాయణాన్ని రాసే శక్తి నాకు లేదని నాకు బాగా తెలుసు. శ్రీరాముడే ప్రేరేపించి, నాచేత ఈ పని చేయించాడు" అంటాడు ఏకనాథ్.

4. అధ్యాత్మ రామాయణము

"వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం" వ్యాసునికి తెలియని విషయం ప్రపంచంలో లేదని పండితుల మాట. నిజమే కదూ! భారత, భాగవత పురాణాది గ్రంథాలు రచించడమే గాక వేదాన్ని సంస్కరించి సంవిధాన మొనర్చిన ఘనత ఆయనకే దక్కింది. వ్యాస భగవానుని అపూర్వ సృష్టియే ఈ అధ్యాత్మ రామాయణము.

విభిన్న సిద్ధాంతాలతో, పాండిత్య వైషమ్యాలతో దారి తప్పిన సమాజాన్ని సక్రమ మార్గంలో ఉంచేందుకు రామాయణ రచనను ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు వ్యాస భగవానుడు. సంస్కృతభాషలో రచించాడు.

తావ త్సర్వాణి శాస్త్రాణి వివదన్తే పరస్పరం

యావజ్జగతి నాధ్యాత్మ రామాయణ ముదేష్యతి!

"అధ్యాత్మ రామాయణము లోకంలో ప్రాచుర్యమును పొందనంతవరకే సర్వ శాస్త్రాలు పరస్పర వాదాలతో కలహించుకుంటూ ఉంటాయి" అని ప్రారంభ పలుకుల్లోనే పలికాడు వ్యాస భగవానుడు.

సంకుచిత భావాలతో అజ్ఞానారణ్యంలో సంచరిస్తున్న మానవ సమాజాన్ని విశాల భావ స్ఫూర్తితో విజ్ఞాన వీధులలో విహరింప చేయాలని సంకల్పించి ఈ రచనను వ్యాసుడు చేపట్టినట్లు తెలుస్తోంది. విజ్ఞానం ఉదయించిన చోట వికృతాలు, వైషమ్యాలు తలఎత్తవు కదా!

ప్రచరిష్యతి తల్లోకే ప్రాణ్యదృష్ట వశాద్యది

తస్యాధ్యయన మాత్రేణ జనాయాస్యన్తి సద్గతిం

"అధ్యాత్మ రామాయణ ప్రచారము జనుల అదృష్టము. ఈ గ్రంథమును అధ్యయనము చేసినవారు సద్గతిని పొందుతారు" అన్నాడు వ్యాసభగవానుడు.

లోకంలోని దురదృష్టాన్ని, దుర్గతిని పోగొట్టే ప్రయత్నంలో వ్యాసభగవానుడు అధ్యాత్మ రామాయణాన్ని రచించాడు.

5. రంగనాథ రామాయణము

ఇది తెలుగులో ద్విపద కావ్యము. దీని రచయిత గోనబుద్ధారెడ్డి. 13వ శతాబ్దములో ఈ రచనను చేసినట్లు తెలుస్తూ ఉంది.

తెలుగులో వెలువడిన రామాయణాలలో దీనికే అగ్రతాంబూలం అందింది. ద్విపద కావ్యమైనందున పాడుకోడానికి, చదువుకోడానికి అనువుగా ఉండి చక్కని ప్రాచుర్యాన్ని పొందింది.

భాస్కర రామాయణము ధీటైన పద్యకావ్యము. కానీ అది ఒక కవి చేతిమీదుగా సాగిన రచన కాదు. రంగనాథ రామాయణాన్ని మించలేక పోవడానికి అది కూడా ఒక కారణము.

రంగనాథ రామాయణము ప్రజాదరణ పొందింది. జనప్రియంగా సాగింది. స్త్రీలు ఇంటిపనులు చేసుకుంటూ పాడుకొనే రామాయణము ఇదే. తోలుబొమ్మలను ఆడించువారు పాడేది రంగనాథ రామాయణమే.

దేశకవిత్వము సాధారణంగా గేయకవిత్వమే. అందుచేత ద్విపద కావ్యాలకున్న ప్రాచుర్యము పద్యకవిత్వానికి ఉండదు. జన సామాన్యానికి దగ్గరగా పోయేది ద్విపద కావ్యమే. ఇది గ్రహించిన రచయిత రామాయణాన్ని ద్విపదకావ్యంగా రచించి,

సామాన్య జనులకు కూడా అందుబాటులో ఉండేలా చేశాడు. ఈ విధంగా జనబాహుళ్యానికి రామకథను చెప్పి, సమాజంలో రమణీయ బాటను నిర్మించి, అభ్యుదయ మార్గాన్ని సూచించాడు.

ఆది కవీశ్వరుఁడైన వాల్మీకి
యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ
జెప్పిన తెలుఁగున శ్రీరాము చరిత
మొప్పఁజెప్పెదఁ గథాభ్యుదయ మెట్లనిన ॥

అని ప్రారంభించాడు కవి. వాల్మీకి రామాయణాన్ని ఉన్నదున్నట్లు తెనిగిస్తా నన్నాడే కాని, వాల్మీకంలో లేని అనేక విషయాలను జోడించి చెప్పాడు. "ఊర్మిళ నిద్ర, లక్ష్మణుని నవ్వు" లాంటి ఎన్నో విషయాలను రచించాడు. అలా చేయడమే మంచి దయింది. దాని వల్లనే జన బాహుళ్యానికి దగ్గరైంది ఈ రామాయణము తెలుగునేల మీద.

తెలుగులో అనేక రామాయణాలు వెలువడ్డాయి. వాటివాటి ప్రత్యేకతల్ని అవి నిరూపించు కున్నాయి. కానీ బహుళ ప్రచారానికి నోచుకున్నది రంగనాథ రామాయణమే.

6. గోపీనాథ రామాయణము

తెలుగులో వెలువడిన రామాయణాల్లో గోపీనాథ రామాయణము నాకు బాగా నచ్చిన గ్రంథము. దీని కర్త గోపీనాథము వేంకటకవి. ఇతడు వాల్మీకమును అనుసరిస్తూనే రచన సాగించాడు. తన గ్రంథాన్ని నరులకు అంకిత మివ్వకుండా శ్రీకృష్ణునికి సమర్పించిన భాగవతోత్తముడు గోపీనాథం వేంకటకవి.

గోపీనాథ రామాయణము వెలువడి వంద సంవత్సరాలే అయింది. వేంకటగిరి సంస్థానాధీశుడైన సర్వజ్ఞ కుమార యాచేంద్ర భూపతి ఆనాడు కవిని సత్కరించి, కృతిని విస్తరింప చేశాడు.

విద్వద్వరేణ్యులని చెప్పుకుంటూ, కడుపుకూటికి అడ్డదారులు త్రొక్కుచు, పారమార్థిక చింతన ఏ మాత్రము లేకుండా, అన్నీ తమకే తెలిసినట్లు గర్విస్తూ, రూకలకు రచనలు చేసి, కుయుక్తులతో సత్కవులను వంచించు దుష్కవులను దుయ్యబట్టే కార్యాన్ని కూడా స్వీకరించాడు గోపీనాథం వేంకటకవి.

నృపతుల వేడినన్ గరుణ నిచ్చిన నిత్తురు దంతివాజిర
త్నపట ధనాగ్రహారములు దప్పక యన్నియు నస్థిరంబు లా
విపుల కృపా పయోధి యదువీరుని వేఁడినఁ బ్రీతినిచ్చు ని
త్యపదము నట్టి వానిఁ గొనియాడక యన్యుల వేఁడ నేటికిన్

అని భక్తి వైరాగ్యములతో నిండిన తన నిర్మల హృదయాన్ని స్పష్టం చేశాడు గోపీనాథం వేంకటకవి.

1923లో ఈ గ్రంథాన్ని వావిళ్ళవారు ముద్రించారు. ఆ తరువాత పునర్ముద్రణలు ఆరు దశాబ్దాల వరకు జరుగలేదు. 1987లో పునః వెలుగు చూసిన గోపీనాథ

రామాయణాన్ని మూడు సంవత్సరాల క్రితం వేంకటకవి గారి మునిమనుమడు నన్ను కలిసి రెండు సంపుటాలుగా వెలువడిన ఈ రామాయణాన్ని భక్తి గౌరవాలతో నాకు సమర్పించాడు. మండూకప్లుతి న్యాయంగా మొదట అక్కడక్కడ చూశాను. ఆ తరువాత సంపూర్ణంగా చూశాను. సంతసించాను. గద్యపద్యాలతో నడిచిన ఈ గోపీనాథ రామాయణము గణనీయమైనది తెలుగులో.

7. మొల్ల రామాయణము

రామాయణము జనసామాన్యమునకు అందాలని కృషి చేసిన రచయితలలో నెల్లూరు మండలానికి చెందిన కవయిత్రి మొల్ల ఒకతె. రామాయణాన్ని పద్య గద్య కావ్యంగా ఈమె రచించింది.

గోపవరం గ్రామంలో వెలసియున్న శ్రీకంఠమల్లేశ్వర స్వామి అనుగ్రహంతో తాను రామాయణాన్ని రచిస్తున్నట్లు మొల్ల తన గ్రంథంలో పేర్కొన్నది. విద్యాసంపద తనకు లేదని వినయంగా చెప్పుకున్నది.

అనువాద రీతుల మీదనే సున్నితంగా ధ్వజమెత్తింది మొల్ల. తేట తెలుగులో కందువ మాటలతో కమ్మని కవిత్వమును చెప్పడం మరచి, సంస్కృతమూలము కంటే ప్రౌఢంగా రచించడం వల్ల ప్రయోజన మేమిటని ప్రశ్నించింది ఈ కవయిత్రి.

తేనె సోక నోరు తీయన యగురీతి
తోడ నర్థమెల్ల తోచకుండ,
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూఁగ చెవిటివారి ముచ్చటగును.

అని నిశితంగా విమర్శించింది. ఈ భావాన్ని మనసులో ఉంచుకొని తాను రామాయణ రచనకు ఉపక్రమించింది. తనలోని రామభక్తికి పరవశిస్తూ, జనసామాన్యానికి రామాయణాన్ని దగ్గరగా తీసికొని పోవాలనే తపన మొల్లలో స్వచ్ఛంగా కన్పిస్తుంది.

అది రఘురాము చరితము
నాదరముగ విన్నఁ గ్రొత్తయై లక్షణ సం
పాదమ్మై పుణ్యస్థితి
వేదమ్మై తోఁచకున్న వెఱ్ఱినె చెప్పన్?

అని ఋజుత్వంతో పలికింది మొల్ల. నచ్చి చెప్పిన కావ్యమే గాని పిచ్చిపట్టి పలికింది కాదని విమర్శకులను హెచ్చరించింది.

చెప్పుమని రామచంద్రుడు
చెప్పించిన పలుకు మీదఁ జెప్పెద నే, నె
ల్లప్పుడు నిహపర సాధన
మిప్పుణ్య చరిత్ర, తప్పు లెంచకుడు కవుల్

అని పలికింది వినయ కవయిత్రి మొల్ల. మల్లెలకన్న తెల్లనైన మనసు గల మొల్ల నిర్మల రామభక్తితో రచించిన కావ్యమే మొల్ల రామాయణము. ముప్పు తొలగించాలనే సంకల్పముతో చేపట్టిన కావ్యములో తప్పులు ఎంచవద్దని పెద్దలకు విన్నవించుకున్నది. ఈ విధంగా భక్తితో, సామాజిక స్పృహతో, ఈశ్వరానుగ్రహమును తోడు చేసుకొని అనేకమంది రామకథను రచించారు.

కళ్యాణ గుణాభిరాముడైన శ్రీరామచంద్రుని సుగుణములకు సమ్మోహితులై, ఇలాంటి నాయకుడు దొరకుట అలభ్యమని భావించి, కొందరు కవులు తమ ప్రతిభతో రామకథను దివ్యంగా వర్ణించారు.

రఘువంశ కావ్యాన్ని వ్రాసిన మహాకవి కాళిదాసు రఘువంశీయుల సుగుణములే తన రచనకు ప్రేరకములని చెబుతాడు.

సంస్కృతములో "అనర్ఘ రాఘవ నాటకము"ను రచించినవాడు మురారి కవి. ఈ నాటకాన్ని తాను ఎందుకు వ్రాయవలసి వచ్చిందో ఇలా చెబుతాడు.

యది క్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్య చరితం
గుణై రేతావద్భి ర్జగతి పున రన్యో జయతి కః?
స్వమాత్మానం తత్తద్గుణ గరిమ గంభీర మధుర
స్ఫురద్వాగ్బ్రహ్మణః కథ ముప కరిష్యంతి కవయః ॥

ఈ శ్లోకంలో తన రచనకు కారణమును చెబుతున్నాడు మురారి. రఘురాముని చరితమును పూర్వము ఎందరో కవులు రచించారు. అయినా అలాంటి మహానాయకుడు విశ్వ సాహిత్యంలో మరొకడు లభించడు. అట్టి రాముని చరిత్రను వ్రాసినపుడే పాండిత్యానికి, కవిత్వానికి సార్థక్యము. అందుకే తాను అనర్ఘ రాఘవ నాటకాన్ని రచించినట్లు చెబుతాడు మురారి.

ఎందరు చెప్పినా
ఎంతగా చెప్పినా
ఎన్నిసార్లు చెప్పినా
తనివి తీరనిది, నిత్యనూతనమైనది రామకథ.
బావుంది. ఇన్ని రామాయణాలు ఉండగా,

చైతన్య రామాయణము

ఎందుకు? ఎవరి కొరకు? ఏమి సాధించాలని? - చెబుతాను.
నా కథ చెప్పేముందు ప్రస్తావనగా రెండు మాటలు......

రామచంద్రుని గుణానుకీర్తనము పుణ్యప్రదము. ముక్తిప్రదము. రాముడు ధీరోదాత్త నాయకుడు. అట్టి సుగుణాభిరాముని కళ్యాణ చరితమును కమనీయంగా రచించిన వారిలో ఒకరైన కవిబ్రహ్మ తిక్కన తన "నిర్వచనోత్తర రామాయణము"నకు హేతువును ఇలా చెబుతాడు.

ఎత్తతి నైనను ధీరోదాత్తన్న
పోత్తముడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్యమౌట
నుత్తర రామాయణోక్తి యుక్తుడ నైతిన్

అని తన మనోభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు ఉభయ కవి మిత్రుడు తిక్కనార్యుడు. రామకథారచన కార్యాన్ని జీవిత లక్ష్యంగా భావించి, రచించి, తరించిన మహానుభావు లెందరో ఈ పుణ్యభూమిలో.

అంతేకాదు. రామకార్యమే నిజమైన పని యని, తక్కినదంతా శని యని భావించినవారూ ఉన్నారు.

ఏ పనికో జన్మించితి నని నీ వెంచవలదు శ్రీరామ నే ॥ నేపనికో ॥
శ్రీపతి శ్రీరామచంద్ర నీ చిత్తానికే తెలియదా నే ॥ నేపనికో ॥
వాల్మీకాది మునులు నరులు నిన్ను
వర్ణించిన నా యాస దీరునా
మేల్మియై యుండు సద్భక్తులు
మెచ్చుదురే త్యాగరాజ నుత నే ॥ నేపనికో ॥

అని కీర్తిస్తూ, రామ గుణానుకీర్తనమే తన జీవితానికి ముఖ్య ప్రయోజనము అంటాడు త్యాగరాజస్వామి.

ఇక, నా కథ

ఇది చైతన్య రామాయణం. రామ చైతన్యాన్ని వర్ణించే గ్రంథం. రామాయణ చైతన్యాన్ని వివరించే గ్రంథం.

నాకు దైవ నియోగం
మీకు ప్రసాద వినియోగం.
పైనుండి అందింది పిలుపు ... క్రింద అందించబోయేది మేలుకొలుపు.
మూడు దశాబ్దాలుగా చేసిన కొలువు
గ్రామ గ్రామాన కనుల పండుగగా సాగిన భక్తి చెలువు - ఏకమై నాకు ఈ రామాయణ రచనా భాగ్యాన్ని ప్రసాదించాయి.
కవినై వ్రాయలేదు.
పండితుణ్ణై ప్రవచించలేదు.
తియ్యని రామకథను, పవిత్రమైన రాముని గాథను తెల్లని కాగితంపై వ్రాశాను. అంతే. ప్రజాభాషలో వ్రాశాను. జనప్రియంగా చెప్పాను.
సరళభాషలో వ్రాశాను. వాడుక భాషలో వ్రాశాను. వేడుకగా వ్రాశాను. వేడుకుంటూ వ్రాశాను. నన్ను వాడుకోమంటూ వ్రాశాను.

శేముషీ సింధువునై వ్రాయలేదు. ఆర్తజన బంధువునై వ్రాశాను.

"నేనా! దద్దమ్మను. రామన్న కథ రాయడం నాకు సాధ్యమా!" అని పెద్దమ్మ పాదం పట్టుకున్నాను. అమ్మలగన్న అమ్మను వేడుకున్నాను.

దాశరథి గాథను దద్దరిల్లేలా వ్రాయమని పెద్దమ్మ ధైర్యాన్ని నూరిపోసింది.

నా అదృష్టానికి పొంగిపోతూ శతధా ధన్యుణ్ణై రచన కుపక్రమించాను.

ఇది సాహసమే నని నాకు తెలుసు.

గంగానదిని పూర్ణంగా ఆపోశనం పట్టాలని భావించే గోరువంక ప్రయత్నం అని నాకు తెలుసు.

అయినా ప్రారంభించాను. ప్రయత్నించాను.

త్రికరణశుద్ధితో రామాయణాన్ని రచించేవారికి, అంబోధిని దాటిన ఆంజనేయుడు అండగా ఉంటాడనే మాట మీద విశ్వాసమున్నవాణ్ణి.

దైవకృప ఎలా ఉంటుందో జీవితంలో చూసినవాణ్ణి.

రామాయణాన్ని కొందరు కథగా వ్రాశారు.

కొందరు మూలానికి శ్లోక తాత్పర్యాలు సమకూర్చారు.

కొందరు యథాతథంగా భావాన్ని అందించారు.

కావ్యంలోని కవితా పరిమళాన్ని కొందరు వెదజల్లారు.

నేను ఇవేమీ చేయలేకపోయాను.

మహిమను వర్ణించి మనిషిని తీర్చిదిద్దే ప్రయత్నం చేశాను.

అది నా జీవితలక్ష్యం. దైవశాసనం.

ఆంధ్రావనిలో నేడు నాకు ఉండేది ఊడే ఉద్యోగం కాదు. ఊరేగే ఉద్యమం. చూస్తూ నమ్మలేని సభలు.

సమయాల్ని పాటిస్తూ, నియమాల్ని అనుసరిస్తూ సకాలానికి సభాస్థలికి గలగలమంటూ నదిలా కదిలొచ్చే జనప్రవాహం.

ప్రసంగించినంత కాలం నిస్తరంగ జలధిలా నిశ్చేష్టులై కూర్చుని,

ఆశ్చర్యంతో

ఆర్ద్రతతో

ఆనందంతో

మూగబాధతో

పకపకమనే నవ్వులతో కొంతసేపు

తడి ఆరని కన్నులతో మరికొంతసేపు

రెండు గంటల్ని రెండు నిముషాలుగా భావించి

జీవిత లక్ష్యాన్ని, మార్గాన్ని పొందామనే తృప్తితో లేచిపోయే అశేష జనావళి నేడు ఆంధ్రావనిలో ఎక్కడైనా సుందర చైతన్య సభలలో ప్రత్యక్షం!

ఆహా! ఏమి వైభవం! ఏమి ప్రాభవం! ఎవరిది ఇదంతా!

ఇదంతా సనాతనధర్మ వైభవమే!

ఏనాటి పుణ్యఫలమో!

వాసుదేవుని కృపా వీక్షణమో,

వ్యాసవాల్మీకాదులు అభిషేకించిన పుణ్యతీర్థం నన్ను కరుణించింది.

తీర్థపుగిన్నె నా చేతికి వచ్చింది.

వినమ్రుడనై, వినీతుడనై వినియోగ భారాన్ని భుజాల కెత్తుకున్నాను. వితరణశీలి నయ్యాను.

నమ్మకమున్న వాణ్ణే గాని అమ్మకం తెలియని వాణ్ణి.

అయితే నేమి? అమ్మిపెట్టేవాడు అచ్యుతు డయ్యాడు.

వేడుకంతా వేదికవద్దే.

చెప్పినట్లు చేయమన్న వాని చరిత్రను వ్రాసి మూడు సంవత్సరాల క్రితం విడుదల చేశాను. వేలాది కాపీలు గంటలో ఎగిరిపోయాయి.

చేసినట్లు చేయమన్న వాని చరిత్రను ఇప్పుడు వ్రాస్తున్నాను. ముస్తాబు కాకముందే మాకంటే మాకని ముచ్చటపడుతున్నారు వేలాదిమంది భక్తులు.

నమ్మి నడచిన బ్రతుకు నమ్ము కాదు.

జీవికి ఏనాడైనా ప్రధానమైంది సొమ్ము కాదు.

మూడు దశాబ్దాలు ఆంధ్రావనిలో గీతాప్రవచనం చేశాను. తేట తెలుగులో ఉపనిషత్తులు వినిపించాను. భాగవతామృతాన్ని త్రాగించాను. రామాయణ సాగరం వైపుకు నడిపించాను. **ఓం నమో భగవతే వాసుదేవాయ** అనే దివ్య ద్వాదశాక్షరీ మంత్రాన్ని మిన్ను ముట్టేలా వాడవాడలా ప్రతిధ్వనింప చేశాను.

సత్సంగాలు నెలకొల్పాను. సన్మార్గాన్ని బోధించాను. చేయవలసిన సందడి అంతా చేశాను. మహర్షుల వైభవాన్ని దర్శించిన నా హృదయం విశ్రాంతిని విసర్జించింది. నిద్రను నిర్జించింది. ఆరోగ్యాన్ని విస్మరించింది.

నోరు మూతను పారేసుకుంది. కంఠం పగ్గాన్ని త్రెంచుకుంది. కాళ్ళు సంకెళ్ళను ఛేదించుకున్నాయి. చేతులు కట్లను వదిలించుకున్నాయి.

ప్రవచనాలు జోరుగా సాగాయి. పాటలు శ్రావ్యంగా కాసెట్ల కెక్కాయి. ఊరూరు ప్రయాణా లయ్యాయి. చాప పరచినట్లు గ్రంథాలు వెలువడ్డాయి.

పరిశ్రమ ఫలించింది. పరిస్థితి మారిపోయింది.

ఇంతకాలం విని ఆనందించిన వారందరు ఇకమీదట కని తృప్తి చెందాలని తపన చెందుతున్నారు. ధర్మజీవనాన్ని గడిపేందుకు నడుం బిగిస్తున్నారు.

ఇప్పుడు రామాయణం వారికి చాలా అవసరమై ఉంది. ఈ క్షణం కొరకే వేచియున్న నేను కలం కదిలించి, రాత్రింబవళ్ళు శ్రమించి, సాధకజన లోకానికి రామాయణాన్ని అందించాలని సంకల్పించాను.

దానికి తోడు

ఈనాటి సమాజానికి రామాయణం అవసరం ఎంతో ఉంది.

తల్లిదండ్రుల మాట బిడ్డలు వినరు.

బిడ్డల భవిష్యత్తును తల్లిదండ్రులు పట్టించుకోరు.

భర్త మాట భార్య వినదు. భార్య సుఖాన్ని భర్త కనడు.

గురువులపై శిష్యులకు గౌరవం లేదు. శిష్యులపై గురువులకు వాత్సల్యం లేదు. స్నేహితుల మధ్య నమ్మకాలు నశించాయి. బంధువుల మధ్య దూరాలు పెరిగాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు, పాలకులు, పాలితులు - అంతా కాలుష్యమే. కాపట్యమే.ఈ వ్యసనాన్ని పారద్రోలి,

సద్వ్యవస్థను ఆహ్వానించాలని

ధర్మవ్యవస్థను సమాజంలో ఆవిష్కరించాలని అభిలషించి, ఆశపడి

దేశకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని

సామాజిక స్పృహను మదిలో నింపుకొని

అధఃపతన మవుతున్న ఆధునిక సమాజానికి

సనాతనధర్మ ప్రగతిని అందించాలని

అజ్ఞాన అనారోగ్యంతో నీరసించిన సమాజానికి

దివ్యారోగ్యాన్ని ప్రసాదించే జ్ఞానరక్తాన్ని ఎక్కించాలని, పట్టించాలని

పట్టుపట్టి, పట్టుదలతో రామాయణాన్ని రచించాను.

ఇది చైతన్య రామాయణం

భక్తులకు సారథి. విమర్శకులకు వారధి. సాధకులకు పెన్నిధి. నిజానికి రామప్రభువు సన్నిధి.

రామాయణంలో చైతన్యమూర్తి రామభద్రుడు.

చైతన్యునిలో అదృశ్య శక్తి శ్యామభద్రుడు.

కళ్ళ ముందు రాముడు

మనసు వెనుక శ్యాముడు

నేను మధ్యవర్తిని. మీకు మధ్యవర్తిని. మీ మధ్యవర్తిని.

చైతన్య రామాయణమంతా వాల్మీకమే.

అవాల్మీకాలు సుందరంగా గోచరించిన చోట వాటి చిరునామాలు తెలుపుకుంటూ నడిచాను.

రాముని ఆలయమే రామాయణం. అది భక్తుల పాలిటి దేవాలయం.

విగ్రహం రామునిది. ప్రతిష్ఠ వాల్మీకిది.

నా దేమిటంటారా? పంచర్యాలు. సేవలు.

మెట్లు శుభ్రం చేయడం, దారిని సుగమం చేయడం, సున్నం కొట్టడం,

రంగులు పులమడం - అంతే.

రాజు కట్టిన వంతెనపై ప్రాకి చీమ నదిని దాటుతుంది.

వాల్మీకి రామాయణాన్ని ఆశ్రయించి నేను నా కార్యాన్ని పూర్తి చేసుకున్నాను.

చీమకు చేవ ఎంతో - మీకు తెలుసు.

చైతన్యుని శక్తి అంతే - అని నాకు తెలుసు.

కృషి రవ్వంత. కృప కొండంత. అంతే అంతా.

చైతన్యగాన లహరి

పల్లవి: నీ చరిత పాడుకోనా
మనసార వేడుకోనా

అనుపల్లవి: నా శ్రమలు తీరిపోగా
తొలి భ్రమలు పారిపోగా ॥ నీ చరిత ॥

చరణములు:

1. కట్టినాను నీ కొరకే
పూల గూడు నా మదిలో
వచ్చెద వని ఎదురు చూచితిని
వచ్చి ఉంటివని ఎరుగనైతిని ॥ నీ చరిత ॥

2. మనసు నిండా నీవేలే
నా హృదయ మంతా నీదేలే
తొంగి తొంగి కళ్ళు చూడనీ
పొంగి పొంగి మనసు పాడనీ ॥ నీ చరిత ॥

3. ఇలలో విరబూసిన కళ
నెల నెల వెన్నెల
వెలయించినావు నమ్మినందుకు
అన్ని కళలలో న న్నిలా ॥ నీ చరిత ॥

4. నా మనసు వాడని పువ్వు
పరిమళమును దాని కివ్వు
అనంతమైన నీ వలపులో
నా తలపును చేర నివ్వు ॥ నీ చరిత ॥

బాల కాండము

ఏకం సత్

'ఉన్నదొక్కటే' అన్నది వేదం. దానికే ఋషుల ఆమోదం.

పైనున్న ఆకాశం ఒక్కటే. క్రిందున్న భూమి ఒక్కటే.

పీల్చేది ఒకే గాలి. త్రాగేది ఒకే నీరు.

విశ్వమంతా ఒకే గృహం. మానవులంతా ఒకే కుటుంబం.

ఒకే దేహంలో వివిధ అంగాలవలె ఒకే పరమాత్మలో జీవులందరూ ఏకమై ఉన్నారు.

ఇది యజ్ఞదృష్టి. దీనికి అనుకూలంగా జీవించడం యజ్ఞజీవనం.

వా దన్నది ప్రక్కకు నెట్టి జీవించడమే యజ్ఞజీవనం. నిస్వార్థజీవనం.

స్వార్థము అనర్థాన్ని అందిస్తుంది.

నిస్వార్థజీవనం బ్రతుకుకు పరమార్థాన్ని ప్రసాదిస్తుంది.

స్వార్థపు తెరలు వీడిపోతే,

అహంకార, మమకారపు పొరలు ఊడిపోతే,

సౌభాగ్య సందాయకంగా సమాజంలో యజ్ఞజీవనం ఆవిష్కరింపబడుతుంది.

ఇదే నిత్యాగ్నిహోత్రం.

ఇది ఆరని వెలుగు. చల్లారని అగ్ని.

మనిషి భోగజీవి కాకూడదు. భావజీవి కావాలి. త్యాగజీవి కావాలి.

ఇదే యజ్ఞ శంఖారావం.

యజ్ఞభావంతో విశ్వకళ్యాణాన్ని వాంఛించి జీవించు వారే ఋషులు.

అందుకే వారు

విశ్వానికి మిత్రులు. హితులు. యతులు.

ఆశలు లేనివారు. స్వార్థము ఎరుగనివారు.

ఈర్ష్యలు తెలియనివారు. అసూయలు అర్థంకాని వారు.

ఒక్క మాటలో చెప్పాలంటే,

చిన్నపిల్లలవంటివారు. బాలుర వంటివారు.

ఇది బాలకాండము.

అంటే, ఒకరి బాల్యానికి సంబంధించింది కాదు.

ఎందరో బాలురకు సంబంధించింది.

రాముని బాల్యానికి సంబంధించింది కనుక దీనికి బాలకాండ అని పేరొచ్చినట్లు చెప్తూ ఉంటారు.

రాముని బాల్యము వాల్మీకి రామాయణంలో వర్ణించబడలేదు.

కనుక పై భావము పొసగదు. అతకదు.

ఈ కాండము బాలురకు సంబంధించింది. అందుచేత బాలకాండము.

ఎందరో బాలురు ఈ కాండములో కనిపిస్తారు.

విశ్వామిత్రుడు, నారదుడు, వాల్మీకి, భరద్వాజుడు, వసిష్ఠుడు, గౌతముడు, ఋష్య శృంగుడు, శతానందుడు, వామదేవుడు - ఇంకెందరో .....

ఎందరైతే నేమి?

అందరూ బాలురే. కల్మషం తగలనివారే. కపటం తెలియనివారే.

భావార్థ రామాయణాన్ని మరాటీ భాషలో రచించిన సంత్ పురుషుడు ఏక్‌నాథ్ మహరాజ్. ఆయన కూడా బాలురతో చేరిపోయాడు.

సాధూంచె మీ తాన్ హై బాలక్

"సాధుమహాత్ముల వద్ద నేను బాలుణ్ణి"; అంటాడు ఏక్‌నాథ్.

కంబరామాయణాన్ని తమిళభాషలో రచించిన భక్త కవిశేఖరుడు కంబరు. ఆయన కూడా బాలురతో కలిసిపోయాడు.

అరైయు మాడరం కుమ్బడ ప్పిళ్ళైగళ్

తరైయిర్ కీరిడిల్ తచ్చరుం కాయవరో

ఇరైయుం కేళ్ప ఇలాదవెన్ పున్ కవి

ముఱైఇ నులుణరన్ద దారు మునివరో

"రామచంద్రుని పుణ్యగాథను వ్రాస్తున్నా. నా మాటలు చప్పగా ఉండొచ్చు. భక్తులు బాలురు. ఉన్మాదులు. వారి మాటలు లెక్కపెట్టవద్దు. పిల్లలు పిచ్చిపిచ్చిగా గీచే గీతల్ని చూచి వాస్తుశిల్పి కోపగించుకుంటాడా?" అనేసి బాలురతో చేరిపోయాడు.

బాలురందరూ ఒకచోట చేరినవేళ

నిజానికి అదొక ఆనందమేళా.

ఈ బాలకాండములో మనకు ఆ భాగ్యం లభిస్తుంది.

వారిని దర్శించే భాగ్యం, వారితో క్రీడించే అదృష్టం ప్రాప్తిస్తుంది.

ముద మంగళమయ సంత్ సమాజూ

జో జగ జంగమ తీరథ రాజూ

"సాధు సమాగమము ఆనందప్రదము. కళ్యాణమయము.

వారు లోకంలో కదిలే పుణ్యతీర్థముల వంటివారు"

అంటాడు చక్కెరను వెక్కిరించే విధంగా రామకథను రచించిన తులసీదాసు. ఈ

పుణ్యతీర్థాలలో ఎలా గ్రుంకులిడాలి?

బిను సత్ సంగ్ బిబేక న హోయీ

రామకృపా బిను సులభ న సోఈ

"విమలమతులైన సత్పురుషుల సాంగత్యము లేకుండా వివేకము ఉదయించదు. రామానుగ్రహం లేనిదే సత్సంగప్రాప్తి కలుగదు"

ఈ కాండములో మనకు పై రెండూ ప్రాప్తిస్తాయి.

మేలి గుణముల జాబిల్లి, మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుని గుణానుకీర్తనమును వ్యాదయంగమంగా గానం చేస్తాడు నారదమహర్షి.

రసజ్ఞ మహోజ్ఞంగా రచిస్తాడు వాల్మీకిమహర్షి.

ఈ కాండములోనే -

రామ వైభవం

సాధు సమాగమం

యజ్ఞ ప్రాభవం ...

అహల్యకు ఆహ్లాదం ఇక్కడే.

చేదు విరిగేది, తీపి పెరిగేది ఈ కాండములోనే.

శాపాలు కరిగేది, పాపాలు తరిగేది ఇక్కడే.

తాటక సుబాహులనే కామక్రోధాల విషానికి విరుగుడు ఇక్కడే.

అంతేకాదు. ఇంకా ఎంతో ఉంది వింత.

బాలురైన ఋషుల క్రీడలే యజ్ఞాలు. వారు వసించు ప్రదేశాలే ఆశ్రమాలు.

వాల్మీకి ఆశ్రమం, గౌతమాశ్రమం, సిద్ధాశ్రమం, మన్మథాశ్రమం, అగస్త్యాశ్రమం ఇలా ఎన్నో ఆశ్రమాలు -

అలాగే ఎన్నో యజ్ఞాలు.

దశరథుని అశ్వమేధ యాగము, పుత్రకామేష్టి యాగము, సిద్ధాశ్రమంలో విశ్వామిత్రుడు నిర్వహించిన యజ్ఞము, జనకపురిలో విదేహరాజు నిర్వహించిన యజ్ఞము, మరెన్నో....

త్యాగమే ఇక్కడ యజ్ఞమని పిలువబడుతోంది.

సమర్పణ అనేది జీవికి అత్యుత్తమ ధర్మము.

సమర్పణభావం యజ్ఞానికి ప్రాణం వంటిది.

యజ్ఞకర్మ ద్వారా దాత, గ్రహీత ఇద్దరూ ఉత్తమ ఫలితాన్ని సాధిస్తారు.

సమాజంలో అభ్యుదయం శోభిస్తుంది.

ఇదేదో అసాధ్యమైన కార్యం కాదు.

కపిలె ద్వారా బావినీటిని పొలాలకు మళ్ళించడం వంటిది.

తోడుతూ ఉంటే నీరు ఊరినట్లు, యజ్ఞకర్మల వల్ల చిత్తం చిగురిస్తూ ఉంటుంది.

పంచుతూవుంటే జ్ఞానం పెరుగుతుంది. ధనం పెరుగుతుంది. ప్రేమ పెరుగుతుంది.

శాంతి పెరుగుతుంది.

జీవుని బంధించే కర్మలు ఇక్కడ విముక్తినిచ్చే యజ్ఞాలుగా మారిపోతాయి.

యజ్ఞార్థాత్కర్మణో౽న్యత్ర లోకో౽యం కర్మ బంధనః

తదర్థం కర్మ కౌన్తేయ ముక్త సంగ స్సమాచర ॥

"అర్జునా! యజ్ఞకర్మకంటె అన్యమైన కర్మలు లోకంలో బంధాలను సృష్టిస్తాయి. నీవు ఫలాపేక్ష లేకుండ నిస్సంగుడవై కర్మలాచరించు" అంటాడు భగవద్గీతలో పరమాత్మ.

సంపన్నులు యజ్ఞాలు చేయలేరు. సద్భావసంపన్నులే చేయగలరు.

ఉన్నవాడు పెట్టలేడు. హృదయ మున్నవాడే పెట్టగలడు.

మన స్సున్నవాడికే చేతులుంటాయి.

He who gives all, keeps all

"అందించేవాడే ఆస్తిపరుడు" అంటాడు విశ్వకవి రవీంద్రుడు.

సహ యజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః

అనేన ప్రసవిష్యధ్వ మేషవో౽ స్త్విష్ట కామధుక్ ॥

బ్రహ్మదేవుడు ప్రజలతో పాటు యజ్ఞములను కూడా సృష్టించి,

యజ్ఞభావంతో జీవించ మన్నాడు.

యజ్ఞమయుడు పూర్ణపురుషుడు. కనుక వాంఛారహితుడు. వాంఛాతీతుడు.

తృప్తి చెందిన అతని మనసే కామధేనువు.

సదా అతనికి బ్రహ్మసంబంధమే.

అదే సీతారామ కళ్యాణం.

పెళ్ళిభోజనం కూడా మనకు ఈ కాండములోనే.

ఇక ఆలస్యమెందుకు అంటారా?

సరే. మేము సిద్ధమే. ప్రారంభించండి.

ఆదికావ్యము - ఆదికవి

నారదుడు చెప్పిన రామకథ వాల్మీకికి ఆనందమును, పారవశ్యమును కల్గించింది. వాల్మీకి నారదమహర్షిని శ్లాఘించాడు. అర్చించాడు. ఆనందాశ్రువులు రాల్చాడు.

వాల్మీకి భక్తికి నారదుడు చలించాడు. హృదయ స్పందనలో వాల్మీకిని ఆలింగనం చేసుకున్నాడు. గురుపూజానంతరము తాను గురువై బోధించిన విషయాన్ని కూడా నారదుడు మరచాడు. జ్ఞానులు కర్తృత్వమును ఎక్కువకాలం మనసులో ఉండనివ్వరు.

నారదమహర్షి ఆకాశమార్గాన దేవలోకమునకు వెళ్ళాడు. మహర్షి బోధించిన రామకథ వాల్మీకి వీనులలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. రమ్యమైన రామకథను మననం చేసుకుంటూ పులకాంకితు డవుతున్నాడు వాల్మీకి.

ఆ స్థితిలోనే తన శిష్యుడైన భరద్వాజునితో కలిసి స్నానము ఆచరించుటకు తమసానదికి బయలుదేరాడు వాల్మీకి. తమసానదీ తీరాన బురద లేని రేవును చూచి,

అకర్దమ మిదం తీర్థం భరద్వాజ నిశామయ
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనోయథా ॥

"భరద్వాజా! ఈ రేవును చూడు. బురద లేదు. మనోహరంగా ఉంది. ప్రసన్నంగా ఉంది. ఇది మహాత్ముని మనసువలె ఉంది" అన్నాడు వాల్మీకి.

ఇచ్చట నది యందలి జలమును సత్పురుషుని మనసుతో పోల్చడం జరిగింది. ఇది బహు చక్కని ఉపమానము. సజ్జన హృదయం నిర్మల జలము వంటిది అంటున్నాడు వాల్మీకి మహర్షి.

రేవులో బురదలేదు. అంతేగాదు. పూడిక తెలియునట్లు జలము నిర్మలంగా, ప్రసన్నంగా ఉంది. అందుచేత ఆ రేవు మనోహరంగా ఉంది.

రేవులో అలలు లేవు. బురద లేదు. అందుచేత ప్రసన్నంగా ఉంది. అట్టి రేవును మంచివాని మనసుతో పోల్చినారు వాల్మీకి.

ఎవని మనసులో సంకల్పాలు అనే అలలు ఉండవో, అజ్ఞాన పంకము లేదో అట్టివాని అంతఃకరణ నిర్మలంగా ఉంటుంది. అలలు, బురదలేని రేవులో పూడిక తెలియునట్లు, సంకల్పాలు నిరోధించబడి, అజ్ఞానము అంతరించిన హృదయ మడుగులో అధిష్ఠాన పరబ్రహ్మ దర్శనీయుడు అవుతాడు.

ఈ శ్లోకంలో మహర్షి తెలిపిన ఉపమాన ఉపమేయములను గ్రహిస్తే వాల్మీకి యొక్క హృదయస్థితి మనకు అర్థం కాకపోదు. అలలు, బురద లేని రేవులాగా తన ఆంతర్యం తయారై ఉంది. లేనిచో రామకథను ఎలా వ్రాయగలడు? రాముడు ప్రవేశించే ముందు ఎవరి హృదయమైనా అలాగే ఉండాలి. ఉంటుంది.

"నాయనా! భరద్వాజా! ఆ జలపాత్రను క్రిందపెట్టి, నాకు వస్త్రమును ఇమ్ము. పవిత్రమైన ఈ తమసా తీర్థమునందు స్నానం చేస్తాను" అన్నాడు మహర్షి.

భరద్వాజుడు గురుదేవునకు నారపంచెను అందించాడు. దానిని తీసుకొని తరువాత నదీతీరము నందలి విశాలమైన వనప్రదేశమును దర్శిస్తూ వాల్మీకిమహర్షి సంచరిస్తూ ఉన్నాడు.

అలా విహరిస్తూ ఉండగా, దారి ప్రక్కన, ఒక చెట్టుపై క్రీడించుచున్న క్రౌంచ పక్షుల జంట మహర్షి దృష్టిని ఆకర్షించడం జరిగింది.

కామమోహితమై ఉన్న క్రౌంచపక్షుల జంటలో మగపక్షిని బోయవాడు బాణంతో కొట్టాడు. అది విలవిల తన్నుకుంటూ, క్రిందపడి, రక్తసిక్తమైన దేహముతో మరణించింది. అది చూచి పెంటిపక్షి మగపక్షి చుట్టూ తిరుగుతూ విలపించ సాగింది. గుండె చెరువయ్యేలా రోదించసాగింది.

ఆ సన్నివేశము ధర్మాత్ముడైన వాల్మీకి హృదయాన్ని ద్రవింపజేసింది. మనసును కలవర పరచింది. దయామయుడైన వాల్మీకి మనసు వికలమైంది. అంతరంగం శోకసముద్రంలా తయారైంది. మహర్షి నిషాదునివైపు తిరిగి,

మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీస్సమాః
యత్ క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహితమ్॥

నిషాద=ఓ కిరాతుడా!, త్వం=నీవు, యత్=ఏ కారణము వలన, క్రౌఞ్చ మిథునాత్=క్రౌంచ పక్షుల జంటనుండి, కామమోహితమ్=కామముచే మోహితమై ఉన్న, ఏకమ్=ఒక దానిని, అవధీః=చంపితివో, (తత్=అందువలన); శాశ్వతీః=చాలా, సమాః=సంవత్సరములు, ప్రతిష్ఠాంతు=ఉండుటను, మా గమః=పొందకపోయెదవు గాక!

"ఓరీ బోయవాడా! నీవు క్రౌంచపక్షుల జంటనుండి కామమోహితమై యున్న ఒక పక్షిని కొట్టి చంపావు. కనుక నీవు ఎక్కువ కాలము జీవించ కుందువుగాక!" అని శపించాడు.

క్రౌంచపక్షిని జూచి, జాలిపడి మహర్షి ఆవేదనతో పలికిన ఆ మాటలు ఛందోబద్ధమైన శ్లోకరూపాన్ని ధరించాయి. తీవ్రమైన ఆవేదనలో తన నుండి అప్రయత్నంగా వెలువడిన ఆ పలుకులు అందమైన శ్లోకరూపాన్ని పొందడం వాల్మీకికి ఆశ్చర్యాన్ని కల్గించింది.

ఆ మాటలు నాలుగు పాదాలుగా విభజించుటకు అనువుగా ఉన్నాయి. పాడుటకే కాదు. పాడుతూ ఆడటానికి కూడా అనువుగా శోభిస్తున్నాయి. ఆ శ్లోకాన్ని మహర్షి మళ్ళీ మళ్ళీ మననం చేసుకున్నాడు. విస్మయాన్ని పొందాడు.

వాల్మీకిది సున్నిత హృదయం. ఆయన మనస్సు కోమలం. పక్షి మరణాన్ని చూసి చేసికొని వాల్మీకి కలత చెందాడు. అందుకే వాల్మీకికి రాముడు లభించాడు.

పక్షి యొక్క శోకాన్ని సమంగా వాల్మీకి కూడా అనుభవించాడు. ఆయన దుఃఖం తన కొరకు కాదు. ఆయన శోకం లోకం కొరకే. అందుచేత అప్రయత్నంగా, అసంకల్పితంగా ఆ దివ్యాత్ముని మాటలు శ్లోకరూపాన్ని దాల్చాయి. శోకము లోకంతో కలిసి శ్లోకంగా మారింది.

వాల్మీకి ఆశ్రమం చేరాడు. ఈ శ్లోకాన్ని శిష్యులకు వినిపించాడు. తానూ పదే పదే మననం చేయసాగాడు. తన ధ్యాస మాత్రం పక్షిమీద, శ్లోకం మీదే ఉంది. ఈ స్థితిలో సృష్టికర్త, చతుర్ముఖుడు అయిన బ్రహ్మదేవుడు వాల్మీకిని చూచుటకు ఆశ్రమానికి వచ్చాడు.

బ్రహ్మదేవుని చూడగనే వాల్మీకి విస్మితు డైనాడు. వెంటనే లేచాడు. చేతులు జోడించి నమస్కరించాడు. అర్ఘ్యపాద్యాదు లిచ్చి అర్చించాడు. కుశలమును ప్రశ్నించాడు.

పితామహుడైన బ్రహ్మదేవుడు ఎదురుగా కూర్చొనియున్నాడు. అయిననూ వాల్మీకి మనసు ఆ క్రౌంచపక్షి మీదనే ఉంది. తాను అప్రయత్నముగా పలికిన శ్లోకమును గూర్చియే ఆలోచన సాగుతున్నది.

వాల్మీకి ఆంతర్యమును బ్రహ్మదేవుడు గ్రహించాడు. చిరునవ్వును చిందిస్తూ చతుర్ముఖుడు, "మహర్షీ! నీవు పలికింది శ్లోకమే. ఆ విషయంలో సందేహము లేదు. నా సంకల్పం వల్లనే ఆ శ్లోకము నీనుండి పుట్టింది. నీవు నారదుని ద్వారా శ్రీరాముని చరితమును ఆలకించియున్నావు.

రామస్య చరితం సర్వం కురు త్వ మృషి సత్తమ

"ఋషిశ్రేష్ఠుడా! శ్రీరాముని సంపూర్ణ చరితమును నీవు కావ్యరూపమున రచించు".

"బ్రహ్మర్షీ! శ్రీరాముడు ధర్మాత్ముడు. సుగుణవంతుడు. బుద్ధిమంతుడు. నారదుడు నీకు చెప్పిన దానిని వినినది వినినట్లుగ రచించు. అంతేకాదు. శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత, భరతుడు, రాక్షసులు - వీరందరికి సంబంధించిన చరిత్రములు అందరికీ తెలిసినవియే గాకుండా, రహస్యమైన విషయాలు కూడా నీకు తెలుస్తాయి.

"మహర్షీ! నీనుండి వెలువడే ప్రతిమాట సత్యమై ఉంటుంది. నీ రచనలో ఒక్క మాట కూడా అసత్యం కాదు. ప్రారంభించు. రామకథ నంతా శ్లోకబద్ధం చెయ్యి.

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే
తావ ద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి

"ఈ ప్రపంచమున గిరులు, నదులు ఉన్నంతవరకు నీవు రచించే రామకథ కూడా ఉంటుంది" అని పలికి బ్రహ్మదేవుడు అంతర్హితుడయ్యాడు.

రామాయణము పర్వతాలకొరకు, నదులకొరకు కాదు. పర్వతాలు అంటే పురుషులని భావం. నదులంటే స్త్రీలని అర్థం. ఈ ప్రపంచంలో జీవులు ఉన్నంతవరకూ వారి జీవితాలను పవిత్రం చేసే రామాయణము స్థిరంగా ఉంటుంది.

రామాయణంలో ప్రవచించిన సత్యాలు పర్వతాలవలె చెక్కుచెదరకుండా స్థిరంగా ఉంటాయి. రామాయణం వినిపించే ధర్మాలు నదీప్రవాహంలా సాగుతూనే ఉంటాయి.

బ్రహ్మదేవుడు అంతర్ధాన మయ్యాడు. వాల్మీకి, శిష్యులైన భరద్వాజాదులు ఆశ్చర్యపడ్డారు. అందరూ అమితానందభరితులై పదే పదే ఆ శ్లోకమును పఠించసాగారు. పరస్పరము దానిని గూర్చి ముచ్చటించుకోసాగారు. పరమాత్మ ధ్యాన తత్పరుడైన వాల్మీకి మహర్షి అత్యుత్సాహ వంతుడై శిష్యులతో,

కృత్స్నం రామాయణం కావ్య మీదృశైః కరవా ణ్యహమ్ ॥

"సంపూర్ణ రామాయణ కావ్యమును ఈ శ్లోకవృత్తముతోనే రచిస్తాను" అన్నాడు.

జై జై ఆదికవి వాల్మీకిమహర్షి కీ

కాల ప్రభంజన కల్లోలంలో
కలవరింతలు మామూలే.
కన్ను తెరిస్తే కల ముగిస్తే
కళలన్నీ ఇక మన ముల్లే.

రోదన తెలియని సాధనలోనే
బాధలు కనుమరు గవుతాయి.
యాతన తెలియని చేతనలోనే
నూతన వెలుగులు శోభిస్తాయి.

ఉలి దెబ్బలకు ఉల్లము చెదరక
రాయి రూపమై వెలసింది.
వెతలు చిత్తమును చిత్తు చేయగా
చెత్త దూరమై పోతుంది.
చిత్తే నీవుగా ఉంటుంది.

పూర్వా సంధ్యా ప్రవర్తతే

ఆ రాత్రి గురుశిష్యులు హాయిగా నిద్రపోయారు. తెల్లవారుతూ ఉంది. పెద్దవాడు కనుక విశ్వామిత్రుడు ముందుగా నిద్రలేచాడు. నదికి వెళ్ళి స్నానాదులు పూర్తి చేసికొని వచ్చాడు. నిద్రించుచున్న రామలక్ష్మణులను చూశాడు.

రాముని రూపము మనోహరంగా ఉంది. ఇలాంటి బిడ్డను కనిన తల్లి జన్మ ధన్యమైంది అని భావించాడు విశ్వామిత్రుడు. రాముని నిద్ర లేపబోతూ, ముందుగా రాముని మాతృదేవి యగు కౌసల్యను మనసులో నిలుపుకుంటున్నాడు.

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్

"కౌసల్య యొక్క సత్పుత్రుడ వగు ఓ రామా! తెల్లవారుతోంది. ఓ నరశ్రేష్ఠుడా! లెమ్ము. భగవత్ప్రీతి కరమైన కార్యములు ఆచరించవలసి యుంది" అన్నాడు విశ్వామిత్ర మహర్షి.

పుత్రుడు సద్బుద్ధి అయితే తల్లిదండ్రులకు సత్కీర్తి లభిస్తుంది. బిడ్డలు ఆచరించు సత్కార్యములు తల్లిదండ్రులను స్మృతికి తెస్తాయి. రాముని చూడగనే విశ్వామిత్రునకు కౌసల్య స్మృతిలో మెదిలింది.

కౌసల్య మంచి బిడ్డను కన్నది. ఆమె కడుపు చల్లగ ఉండుగాక! అనుకుంటున్నాడు విశ్వామిత్రుడు.

కర్తవ్యాన్ని తెలిపేందుకు నిద్రలేపేవాడే సద్గురువు. కర్తవ్యాన్ని విస్మరించి విషయ వాసనా నిద్రలో మగ్నమై యున్నవారిని నిద్ర లేపుతాడు గురువు. కర్తవ్యాన్ని తెలుపుతాడు. అజ్ఞాన నిద్రనుండి నిద్రలేపువాడే నిజమైన గురువు.

బ్రతుకుకు గమ్యం భగవంతుడు. భగవ త్సాక్షాత్కారమే జీవిత లక్ష్యము. లక్ష్యమును అలక్ష్యము చేయువారికి, నిర్లక్ష్యము చేయువారికి సుఖశాంతులు మిగలవు. లక్ష్యమును శిష్యునకు గురువు అందిస్తాడు. అందుచేతనే విశ్వామిత్రుడు **"కర్తవ్యం దైవ మాహ్నికమ్"** దైవ సంబంధమైన కార్యమును ఆచరించవలసి ఉంది అంటున్నాడు.

ఈ విధంగా విశ్వామిత్రమహర్షి ఆనాడు సరయూనదీ తీరాన రామునికి సుప్రభాతం పలికాడు. నేడు కూడా కలియుగ అవతార దైవం శ్రీ వేంకటేశ్వరునికి వినిపించే సుప్రభాతంలో కూడా విశిష్టమైన ఈ శ్లోకమే ప్రథమ శ్లోకం.

భగవంతుని నిద్ర లేపడము అనేది భక్తి మార్గంలో విశిష్టమైన ప్రథమ సాధనగా శోభిస్తూ ఉంది. లేపడానికి భగవంతుడు నిద్రించేవాడా? భగవంతునికి సుప్రభాతం వినిపిస్తూ, మనలో నిద్రాణమైయున్న ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేయడమే ఇక్కడ గమనించదగిన విశేషము. కర్తవ్యాన్ని మనసుకు స్ఫురింప చేయడమే ఇచ్చట కేంద్ర విషయము. విశ్వామిత్రుడు కూడా ఒకవైపు రాముని నిద్రలేపుతూ, మరొకవైపు తనలో తాను మేలుకొంటున్నాడు.

త్యాగరాజస్వామి కూడా అలాగే పరవశించి రాముని ఒక కీర్తనలో నిద్ర లేపుతాడు.

మేలుకో దయానిధీ మేలుకో దాశరథీ
మేలుకో దయానిధీ మిత్రోదయమౌవేళ ॥

అంటాడు. విశ్వామిత్రునికి రాముని గాంచగనే కౌసల్య మనసులో మెదిలితే, త్యాగరాజ స్వామికి దశరథుడు హృదయంలో కదుల్తాడు. ముందుగా నేను మనవి చేసినట్లు సత్పుత్రుడు తల్లిదండ్రులను స్మృతికి తెస్తాడు అనేది అక్షర సత్యం. అక్షయసత్యం.

నేనెవరికీ భయపడను అని చెప్పినంత మాత్రాన తాను అభయ స్థితిలో ఉన్నాడని అర్థం కాదు. టెర్రరిస్టులు కూడా ఎవరికీ భయపడరు. చావుకు కూడా భయపడరు. అంత మాత్రాన వారు అభయమూర్తులు అవుతారా?

నీవు భీతి చెందకుండా ఉండటమే కాదు. పరులు కూడా నిన్ను చూసి భీతి చెందకుండా ఉండాలి. భీతి చెందితే, ఇక ఆ తరువాత పాముకు, తేలుకు, పులికి, మనకు భేదమేముంది?

పువ్వులా నిర్భయంగా నవ్వగలిగితే, మేఘంలా హాయిగా చరించ గలిగితే, నదిలా చల్లగా ఉండగలిగితే, గాలిలా మెల్లగా వీచగలిగితే అప్పుడే మనం అభయమూర్తులము.

అహల్యా శాప విమోచనం

ప్రాతఃకాలమున నిద్రలేచి రామలక్ష్మణులు అహ్నికములు పూర్తి చేశారు. విశ్వామిత్రుని, మునుల నందరిని సేవించారు. నదులలో శ్రేష్ఠమైన గంగానదిని దాటారు.

విశాలనగరమును దర్శించారు. రాముని కోర్కెపై విశాలపుర వృత్తాంతమును విశ్వామిత్రుడు వినిపించాడు. దేవేంద్రుని కథను వివరించి, క్షీరసాగర మథనము, అమృతము ఆవిర్భవించుట మున్నగు ఎన్నో విషయాలను కళ్ళకు కట్టినట్లు వివరించాడు.

చాలా దూరము ప్రయాణము చేసి మరునాడు మిథిలా నగరాన్ని సమీపించారు. అచ్చట ఒక వనమునందు నిర్జన ప్రదేశములో సుందరంగా, శూన్యంగా గోచరిస్తున్న ఆశ్రమమును రాముడు చూశాడు. మనుషులే లేని ఆ సుందరమైన ఆశ్రమము ఎవరిదో, ఏమిటో తెలుపమని రాముడు విశ్వామిత్రుని ప్రశ్నించాడు.

"రామా! ఇదొక పవిత్రమైన ఆశ్రమము. దేవతలు కూడా పూజించే దివ్యమైన ఆశ్రమము. దీనిని గౌతమాశ్రమం అంటారు. పూర్వము మహాత్ముడైన గౌతమ మహర్షి తన భార్య అహల్యతో గూడి అనేక సంవత్సరాలు ఇక్కడ తపస్సు చేశాడు" అని విశ్వామిత్రుడు ఉపక్రమించి చెబుతున్నాడు.

గౌతముడు ధర్మశాస్త్రకర్త. గొప్ప తపస్సంపన్నుడు. గౌతముని తపోవైభవము వలన తనకు పదవీచ్యుతి కల్గుతుందేమో అనే అభిప్రాయం ఇంద్రుడికి ఏర్పడింది.

ఒకనాడు గౌతముడు స్నానార్థమై గంగానదికి వెళ్ళాడు. మహర్షి ఆశ్రమంలో లేడని గ్రహించిన ఇంద్రుడు గౌతముని వేషమును ధరించి ఆశ్రమంలో ప్రవేశించాడు.

"సుందరీ! నా మనసు నీ స్వాధీనమై ఉంది. నీ అందం నన్ను నేను మరచేలా చేస్తోంది. నిన్ను అభిలషించి వచ్చాను. నన్ను అనుగ్రహించు. నా హృదయం నీ సంగమమును కోరుతూ ఉంది," అని ఇంద్రుడు అహల్యతో పలికాడు.

వచ్చినది తన భర్తయే నని భావించిన అహల్య, "సంగమించుటకు ఇది ఋతుకాలం కాదు" అన్నది.

"దేవీ! కాముకులు ఋతుకాలము వరకు వేచి యుండలేరు. చక్కని నడుము గలదానా! (సుమధ్యమే) నన్ను తృప్తిపరచుము" అన్నాడు గౌతముని వేషంలో ప్రకాశిస్తున్న దేవేంద్రుడు.

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన
మతిం చకార దుర్మేధా దేవరాజ కుతూహలాత్

"మునివేషంలో ఉన్నది దేవేంద్రుడే అని గ్రహించి కూడా, దుర్బుద్ధి యైన అహల్య దేవప్రభువైన ఇంద్రునియందు మక్కువ కలిగి అంగీకరించింది".

ఉభయులూ కృతకృత్యు లయ్యారు. "ప్రభూ! దేవేశా! నేను కృతార్థురాల నయ్యాను. నీవు తొందరగా వెళ్ళిపో. మనిద్దరి బాగును కాంక్షించి గౌతముడు రాకముందే వెళ్ళిపో" అన్నది ఇంద్రునితో అహల్య.

ఇంద్రుడు నవ్వుతూ, "సుందరీ! నేను సంతోషించాను. వెళ్తున్నాను", అని పలికి గౌతముడు వచ్చునేమో అనే భయంతో పర్ణశాల నుండి బయటికి వచ్చాడు.

అప్పటికే గౌతముడు ఆశ్రమానికి వచ్చేశాడు. సమిధలను, దర్భలను చేతబట్టుకొని, నదిలో స్నాన మాచరించి వస్తున్న గౌతముడు అగ్నిలా వెలిగిపోతున్నాడు.

గౌతముని చూచి ఇంద్రుడు కొయ్యమొద్దులా నిలబడిపోయాడు. గౌతముడు ఇంద్రుని గుర్తించాడు. జరిగినదంతా క్షణంలో గ్రహించాడు. "దుష్టుడా! నా రూపమును ధరించి చేయరాని దుష్కార్యమును చేశావు. నీవు నపుంసకుడవు అయ్యెదవుగాక!" అని శాపం పెట్టాడు.

అహల్యవైపు తిరిగి, "అనేక వేల సంవత్సరాలు నీవు ఈ ఆశ్రమంలోనే ఉంటావు. వాయుభక్షణం మాత్రం చేస్తూ ఏ ఆహారము లేకుండా, ఎవ్వరికీ కనబడకుండా ధూళిలో పొరలాడుతూ, తపస్సు చేస్తూ ఇక్కడే ఉంటావు" అని శపించాడు గౌతముడు.

పశ్చాత్తాపముతో చేసిన తప్పుకు లజ్జపడుతూ అహల్య దుఃఖించింది. కృంగిపోతూ కనిపించింది. పశ్చాత్తాపముతో కుమిలిపోతున్న అహల్యను చూచి, "దశరథ కుమారుడైన శ్రీరాముడు ఇక్కడ ప్రవేశించగనే నీవు పరిశుద్ధ మవుతావు. ఆ రాముని సత్కరించి అర్చించిన పిదప శాప విముక్తిని పొందిన నీవు నన్ను చేరి సుఖిస్తావు" అని పలికి మహాతపస్సంపన్నుడు, తేజోవంతుడు అయిన గౌతముడు ఆ ప్రదేశమును విడిచి, హిమవత్పర్వతమునకు వెళ్ళి తపస్సు నారంభించాడు.

"రామా! పద. పుణ్యాత్ముడైన గౌతముని ఆశ్రమమున ప్రవేశించు. అహల్యను ఉద్ధరించు" అన్నాడు విశ్వామిత్రుడు. రామలక్ష్మణులు విశ్వామిత్రుని అనుసరించుచు ఆశ్రమంలో ప్రవేశించారు.

తపస్సుచే పునీతురాలైన అహల్య కనిపించింది. దేదీప్యమానంగా శోభిస్తూ ఉంది అహల్య. మంచు కప్పిన చంద్రుని వలె, నీటియందు ప్రతిబింబించిన సూర్య బింబమువలె, మేఘముల మధ్య పూర్ణచంద్రుని వలె అస్పష్టముగ తెలియుచున్నను అహల్య అసమాన తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంది.

గౌతముని శాపకారణంగా ఆమె ఇంతవరకు ఎవ్వరికి కనిపించలేదు. రాముని పాదస్పర్శతో శాపాంత మగుటచేత ఆమె వారికి ఇప్పుడు కనిపిస్తూ ఉంది.

శాపము నిచ్చునపుడు గౌతముడు పలికిన వచనములు ఆమె మదిలో మెదిలాయి. అహల్య వచ్చిన వారిని ఆదరించింది. ఆతిథ్య మిచ్చింది. అతిథి పూజ చేసింది. రాముడు అహల్యను అనుగ్రహించాడు.

దేవతలు దుందుభులు మ్రోగించారు. సుమవృష్టి కురిపించారు. గంధర్వులు గానాలాపనలు చేశారు. అప్సరసలు నాట్య మాడసాగారు.

గౌతముడు మునిగణ పరివేష్ఠితుడై అదే సమయానికి అక్కడికి వచ్చాడు. రాముని సేవించాడు. పునీతయైన అహల్యను గ్రహించాడు. ఇది వాల్మీకి రామాయణంలో అహల్య గాథ!

బుద్ధిని పురిబెట్ట నవసరం లేకుండా కొన్ని గాథలు తేలికగా అర్థమవుతాయి. బుద్ధిని ఎంత పిండినా కొన్ని గాథలు అగాధాలుగా మిగిలిపోతాయి.

అహల్య గాథకు సంబంధించి పాఠకుల మనస్సులలో అనేక సంశయాలు చోటు చేసుకొని ఉంటాయి. దీనికి అనేక కారణాలున్నాయి. 1. మూలాన్ని ఉన్న దున్నట్లు గ్రహించకపోవడం 2. అప్రమాణమైన అనేక విషయాల్ని విశేషంగా గ్రహించి ఉండటం 3. ఉన్నదున్నట్లు గ్రహిస్తే పాత్రల ఔచిత్యం దెబ్బతింటుందేమో నని లేని భారాన్ని బుద్ధి కెక్కించి మోయడం. పరమపవిత్రమైన అహల్యగాథను ఇప్పుడు మనం యథోచితంగా విశ్లేషిద్దాం!

అసలు విషయానికొస్తే అహల్య ఇంద్రుడని తెలిసి సంగమించిందా? లేక గౌతముడని భ్రమించిందా?

ఈ విషయంలో సందేహం అనవసరం. గౌతముని రూపంలో వచ్చింది ఇంద్రుడని అహల్యకు మొదట తెలియకపోవచ్చు. అందుచేత ఋతుకాలం కాదు అన్నది.

కానీ కాముకులు ఋతుకాలాన్ని చూడరు అని అతడు పలికి నపుడు ఆ వచ్చిన వాడు గౌతముడు కాడని అహల్యకు తెలిసిపోయింది. గౌతముడు ధార్మికుడే గాని కాముకుడు కాదు. గౌతముడు న్యాయశాస్త్రమును ప్రసాదించిన ధర్మశాస్త్రవేత్త.

"చక్కని నడుము గలదానా! నన్ను తృప్తిపరచు" అని అడిగినపుడు వచ్చినవాడు ఇంద్రుడేనని అహల్య గుర్తించింది. చాలా కాలంగా ఇంద్రునికి తనపై కన్ను పడి ఉన్నదని అహల్యకు తెలుసు.

ఇంద్రుడంతటివాడు తన పొందుగోరి వచ్చాడని భావించింది. ఇంద్రుని పొగడ్త కూడా ఆమెను బలహీన పరచింది.

మనస్తత్త్వ శాస్త్ర పరిధిలో నుండి వీక్షించినపుడు ఈ సందర్భంలో అహల్యను తరచి చూడటము అలా ఉంచి తూచి అర్థంచేసుకోవాలి.

కొందరు స్త్రీలు అధికులు తమను వాంఛించినపుడు అదొక గౌరవంగా, గొప్పగా భావించి లొంగిపోతారు. మరికొందరు స్త్రీలు పొగడ్తల మధ్య కరిగిపోయి తలవంచుతారు.

పై రెండు లక్షణాలు ఈ దశలో అహల్యలో సుస్పష్టంగా తెలుస్తున్నాయి. కనుక గౌతముని రూపంలో వచ్చినవాడు ఇంద్రుడని అహల్యకు తెలుసు. అలా కానపుడు కృతార్థురాలు కాగానే "దేవేశా! ముప్పు రాకముందే త్వరగా తప్పుకో!" అని ఎలా

అనగలిగింది? ఇంద్రుడు రూపాన్ని మార్చలేదుగదా! తెలిసి దిగజారింది గనుకనే తపస్సంపన్నుడైన గౌతముడు శాపం పెట్టాడు. తన మనసు నుండి అహల్యను తీసి పారేశాడు.

తన సౌందర్యాన్ని చూసుకొని గర్వించే స్త్రీ తన అధికారాన్ని చూసుకొని అహంకరించే పురుషుడు ఏనాడైనా పతనం గాకపోరు అని అహల్య వృత్తాంతములో సందేశం ఇమిడి ఉంది.

సేవక్ సఠ్ నృప కృపన కునారీ
కపటీ మిత్ర సూల్ సమచారీ ॥

"బుద్ధిహీనుడైన సేవకుడు, లోభియైన రాజు, దుష్టురాలగు భార్య, మోసగాడగు మిత్రుడు జీవితంలో పదునైన కంటకములని మరువ కూడదు" అంటాడు సంత్ తులసీదాస్.

ఇంద్రుడు అహల్యను బలాత్కరించి అనుభవించినట్లు అధ్యాత్మ రామాయణము చెప్పుచున్నది. ఇది కాల్పనిక విషయమే. అహల్య పాత్ర అపవిత్రంగా కనిపించ గూడదనే తపనే ఈ ప్రస్తావన వెనుక కేంద్ర విషయంగా తెలుస్తూ ఉంది. తన బుద్ధే బలహీనంగా యున్న అహల్యను ఇంద్రుడు బలాత్కరించాల్సిన అవసరమేముంది?

అహల్య బ్రహ్మదేవుని కుమార్తె, గౌతముని భార్య. మహాత్ముడైన గౌతముని భార్య విషయ పిపాసకు అతీతురాలై ఉండి ఉండాలి. పైగా బ్రహ్మదేవుడు ప్రత్యేక శ్రద్ధతో సృష్టించిన అతిలోక సుందరి. అపురూప మంజరి. అసమాన మనోహరి.

అలాంటి సౌందర్యవతి, జ్ఞాన సంపన్నురాలైన అహల్య ఎవరినైనా ఆకర్షించే విధంగా ఉంది. ఇంద్రుడు ఆమెను ఆశించడంలో గొప్పేముంది? కానీ సృష్టికర్త ప్రత్యేక శ్రద్ధతో పోతపోసిన పుత్తడిబొమ్మ, గౌతముని యోగాగ్నిలో జాజ్వల్యమానంగా రూపుదిద్దుకున్న తపస్విని సామాన్యుల వలె దిగజారడ మేమిటి? అనేదే మ్రింగుడుపడని విషయం.

ఇక్కడే జాగ్రత్తగా ఆలోచించాలి. ధర్మమార్గము అంత సులభమైనది గాదు. జ్ఞానబాట అందరూ చరించేది కాదు. ఏక్షణాన ఎక్కడ ఏ కంటకా లుంటాయో, ఎక్కడ గోతులుంటాయో, నూతులుంటాయో, మూతులు అంటుకుపోతాయో ఎవరూ ఊహించలేరు.

క్షురస్య ధారా నిశితా దురత్యయా
దుర్గం పథ స్త త్కవయో వదన్తి ॥

"ఆ మార్గము పదునైన కత్తి అంచువంటిది. దానిపై ప్రయాణము కష్టమని, దానిని సాధించుట దుస్తరమని మహర్షులు చెబుతారు", అంటాడు కఠోపనిషత్తులో నచికేతునితో యమధర్మరాజు.

అనేక సంవత్సరాల సాధన ఒక క్షణంలో వృథా కావచ్చు. ఎన్నో సుగుణాలను ప్రోదిచేసికొని సంపాదించుకొనిన మూర్తిమత్వం ఎప్పుడో ఎక్కడో ఒక్క క్షణాన ఆంతర్యంలో చెలరేగే సంకల్ప సుడికి బలియై ముక్కచెక్కలైపోవచ్చు.

బ్రహ్మదేవుని చేత ప్రత్యేకంగా సృష్టించబడిన స్త్రీ, తపోధనుడైన గౌతమునికి ఎంతోకాలం సేవచేసిన భాగ్యవతి అహల్యయే అలా బలహీనతకు గురియైనపుడు ఇక సామాన్యుల విషయమేమిటి?

ముందు చూస్తే మురిపించే చలనచిత్రాల అశ్లీల బొమ్మలు, వెనుకనుండి అసభ్యపు గీతాల మర్మర ధ్వనులు, ఎడమవైపు నుండి ఎండగట్టే వెండితెర విశేష సంచికలు, కుడివైపు నుండి మెడబట్టి కుదిపేసే దూరదర్శనాలు - వీటి మధ్య శాపగ్రస్తులు గాకుండా మిగిలేవారెవరుంటారు?

పతనం సహజం. పతనాన్ని చూసి పరితపించాల్సిన అవసరం లేదు. పతనాన్ని ప్రగతిగా ఎలా మార్చుకోవాలో ఆలోచించాలి. అహల్య గాథ మనకు అందించే బోధ ఇదే.

పతితులైన వారికి పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తము. పశ్చాత్తాపమే ప్రగతికి సోపానము. అహల్య పశ్చాత్తాపంతో కుమిలిపోయింది. పసిబిడ్డలా రోదించింది.

జ్ఞానాన్ని ఆశించువారికి ఈ ప్రపంచ పాఠశాలలో బాధలే బోధలు. అశ్రువులే ఆచార్యులు. కన్నీటితో తడిసిన బ్రతుకులే కళాత్మకంగా శోభించాయి. శోభిస్తున్నాయి. శోభిస్తాయి కూడా. పసిబిడ్డలా విలపించే వారికే పరమాత్మ లభిస్తాడు.

But what am I?

An infant crying in the night;

An infant crying for the light;

And no language but a cry;

"నే నెవరు?
చీకటిలో విలపించే శిశువును,
వెలుగుకై రోదించే శిశువును,
ఏడుపేగాని వేరొక భాషనెరుగని శిశువును"
అంటాడు టెన్నిసన్ మహాకవి.

అయితే పతనమైన వారంతా పశ్చాత్తాపంతో శిశువులాగ విలపిస్తే సరిపోతుందా? సరిపోదు. సరిపెట్టుకొంటూపోతే సిరి లభించదు. జ్ఞానసిరి ప్రాప్తించదు.

పశ్చాత్తాపముతో పాటు పురుషార్థాన్ని పటిష్టం చేసుకుంటూ నడక సాగించాలి. అప్పుడే ప్రగతి లభిస్తుంది. ఆచరణను కదపకుండా కేవలం పశ్చాత్తాపముతో కుములుట అనేది కారును నడపకుండా కారులో కూర్చోవడమే అవుతుంది. మరి గమ్యం చేరేదెలాగు?

నీటితో భూమిని తడిపినట్లు పశ్చాత్తాపంలో స్రవించిన కన్నీటితో హృదయ క్షేత్రాన్ని మెత్త బరచుకోవచ్చు. కానీ మొక్కలు నాటడం చేయకపోతే ఫలాలు సిద్ధించనట్లు, సాధన సాగించకపోతే జీవితంలో ప్రగతి లభించదు.

పశ్చాత్తాపముతో కుమిలిపోతున్న అహల్య ఆచరించవలసిన సాధనయే గౌతమ మహర్షి శాపవచనములో నిండి ఉంది.

ఇహ వర్ష సహస్రాణి బహూని త్వం వసిష్యసి

వాయుభక్షా నిరాహారా తప్యన్తీ భస్మశాయినీ

అదృశ్యా సర్వభూతానా మాశ్ర మేస్మి న్నివత్స్యసి

"చాలా సంవత్సరములు నీవు ఇక్కడే వసిస్తావు. ఎవ్వరికి కనబడకుండా, ధూళిలో పొరలుతూ, ఆహారము ఏమియును లేక గాలిని మాత్రమే భుజించుచు ఈ ఆశ్రమమునందు తపస్సులో వసించు". ఇది గౌతముని శాపం.

మనిషి పతనానికి బాహ్య ఆకర్షణలు, ఆంతర్యపు అలజడులే ప్రబల కారణాలుగా తెలుస్తున్నాయి. బాహ్యంలో ఇంద్రుడు రచ్చకీడుస్తుంటే, ఆంతర్యంలో ఇంద్రియాలు రెచ్చగొట్టాయి అహల్యని. ఈ రెండిటిని నియమించే సాధనయే శాపంలో స్పష్టమైంది.

1. ఎవ్వరికి కనిపించకపోవడం 2. ఆహారం లేక గాలిని భుజించడం

ఈ రెండిటివలన బాహ్యప్రపంచపు పెనుగులాట నివారించబడింది. అలాగే

3. పవనాహారము, ధూళిలో సంచారము 4. నిరంతర తపస్సు

ఈ రెండిటివలన ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము సాధింప బడుతూ ఉంది. దమశమాదులు లభ్యమవుతాయి.

ఈ విధంగా గౌతముని శాపంలో అహల్యకు సాధన సమకూరింది.

పాపం చేసిన వారు పాప ఫలితానికి భీతిచెంది పశ్చాత్తాపాన్ని చెందుతారు. కానీ కాలక్రమేణ దానిని మరచి మళ్ళీ చేసిన పాపాలే చేస్తూ ఉంటారు. ఇదియే ప్రబలమైన ప్రగతి నిరోధకము.

తప్పు చేయడం సహజం. పశ్చాత్తాపం చెందడం కూడా సహజం. కానీ చేసిన తప్పునే మళ్ళీ మళ్ళీ చేయడం అసహజం. అమానుషం. దురదృష్టం. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే పరితపించిన హృదయాన్ని పవిత్రమైన తపస్సు వైపు త్రిప్పాలి. అహల్య విషయంలో గౌతముడు అదే చేశాడు.

అహల్య అనేక సంవత్సరాలు తపస్సులో గడిపింది. పాపం క్షణంలో చేయవచ్చు ప్రక్షాళనానికి జన్మలే సరిపోకపోవచ్చు.

కానీ ఇక్కడ మరొక ముఖ్య విషయాన్ని గమనించవలసి ఉంది. చేసిన పాపానికి అహల్య అనేక సంవత్సరాలు ధూళిగా పడి ఉండింది. వాయు భక్షణంతో అజ్ఞాతంగా జీవించింది. కానీ రామపాదస్పర్శ జరిగినపుడే ఆమెకు శాపాంతం అవుతుందన్నాడు గౌతముడు.

అనేక సంవత్సరాలు తపస్సు చేసినా భగవానుని అనుగ్రహం లేనిదే ముక్తి లభించదు. మన సాధనలన్నీ, గగనమున మేఘములను నిలిపినట్లు, సుకృత మేఘాలను హృదయాకాశంలో నిలుపుతాయి. చల్లనిగాలి మేఘములను వర్షింపచేయునట్లు, భగవంతుని అనుగ్రహ పవనాలు సుకృత మేఘాలను వర్షింపచేసి మన హృదయ మడుగును జ్ఞానామృతంతో నింపుతాయి.

సాధన సఫలీకృతం కాగానే సాధ్యరూపుడైన భగవానుడు పిలవకుండానే నీ హృదయంలోకి ప్రవేశిస్తాడు. రాముడు గౌతమాశ్రమంలో ప్రవేశించగనే ముందుగా తాను వెళ్ళి అహల్యకు నమస్కరిస్తాడు. భక్తికి భగవంతుడు తలవంచుతాడు.

ఏ ప్రదేశంలో అహల్య శీలాన్ని పోగొట్టుకున్నదో, అక్కడికే వచ్చాడు "శీలవాన్" అని కీర్తించబడిన శ్రీరాముడు. నీవూ తాపసివి కాగలిగితే నీ ఇంటికి కూడా రాముడు వస్తాడు. లోకకల్యాణార్థమై విశ్వామిత్రుని లాగా నీవు అద్భుత కార్యాలు చేపడితే, కోదండ ధారియై రాముడు కాపలా ఉంటాడు.

గౌతమాశ్రమానికి ఇంద్రుడూ వచ్చాడు. రామచంద్రుడూ వచ్చాడు. ఇంద్రియాలు బలహీనమైనపుడు ఇంద్రుడు వస్తాడు. బ్రతుకును అన్యాయంగా మారుస్తాడు.

ఇంద్రియ నిగ్రహంతో తపస్సు నాచరించినపుడు రాముడు విచ్చేస్తాడు. బ్రతుకును భగవన్మయంగా మారుస్తాడు.

అహల్య గౌతముని విషయంలో తీరని అపచారం చేసింది. అయినా పశ్చాత్తాపంతో అహల్య రోదించగనే గౌతముడు కనికరించి శాపాంతం తెలిపాడు.

తనను ఖండించిన గొడ్డలికి సువాసన నందిస్తుంది చందనవృక్షం. తనను హింసించిన వారికి కూడా ప్రేమను పంచుతుంది సాధుహృదయం.

Good to forgive; Best to forget

Living, we fret Dying, we live

'మన్నించుట ఉచితం. మరచుట సముచితం. ఎరుకలో వ్యాకులం మరపులో జీవనం' అంటాడు రాబర్ట్ బ్రౌనింగ్.

ఇంద్ర అహల్యలను శపించిన తరువాత గౌతముడు తపస్సు చేయుటకై హిమవత్పర్వతానికి వెళ్ళాడు. శాపం పెట్టడం వలన నశించిన శక్తి తపస్సువల్ల సిద్ధిస్తుంది.

కోపంలో వ్యయమైన శక్తి శాంతంలో తిరిగి ప్రాప్తిస్తుంది. లోభములో కోల్పోయిన జ్ఞానము త్యాగములో సిద్ధిస్తుంది. కామంలో తరిగిపోయిన ఆనందం ప్రేమలో లభిస్తుంది. ఇవే సాధనలు. సాధకులను నడిపించే జ్ఞాన దివిటీలు.

అహల్య శాపకాలమున శిలారూపమున ఉన్నట్లు అధ్యాత్మ రామాయణమునందు ఉన్నది. రామచరిత మానసములో కూడా తులసీదాసు అలాగే రచించాడు. కంబరు కూడా తమిళంలో అలాగే రచించాడు. ఏకనాథ్ కూడా శిలగా మారినట్లే వ్రాశాడు. ఇవన్నీ కాలాంతరములో వచ్చాయి. వాల్మీకంకన్నా భిన్నంగా ఉన్నాయి.

సాతతస్తస్య రామస్య పాదస్పర్శా న్మహాత్మనః

అభూత్సురూప వనితా సమాక్రాంతా మహాశిలా ॥

అని పద్మపురాణము నందు ఉన్నది. ఇక్కడ కూడా అహల్య శిలగా మారినట్లే ఉంది.

దారిని శిలయై తాపము తాళక వారము కన్నీరును రాల్చగ

శూర అహల్యను చూచి బ్రోచి తారీతి ధన్యుచేయవే త్యాగరాజ గేయమా ॥

శ్రీరామ పాదమా నీ కృపజాలునే చిత్తానికి రావే ॥

అని త్యాగరాజస్వామి కూడా అహల్య శిలగా మారినట్లే రచించాడు.

దేవేంద్రుని నపుంసకుడగునట్లు గౌతముడు శపించాడు అని వాల్మీకంలో ఉంది. సహస్ర రంధ్రములతో దేహము నిండుగాక! అని తులసీ రామాయణము.

ఇచ్చట తులసీదాసు చాలా భావగర్భితముగ శాపాన్ని ఇప్పించాడు. పుణ్యమువలన ఇంద్రపదవి లభిస్తుంది. పుణ్యము క్షీణించగనే పదవి నశిస్తుంది.

దేహము వేయి రంధ్రములకు నిలయంగా శపించాడు గౌతముడు. చిల్లులున్న కుండలో నీరు నిలువదు. అలాగే ఇంద్రుడు ఆర్జించిన పుణ్యమంతా ఈ శాపకారణంగా కారిపోతుంది అని అర్థము.

శాపవిముక్తి కాగానే అహల్య రాముని అర్చిస్తుంది. ఇది వాల్మీకం. ఇక్కడ ఏకనాథ్, తులసీదాస్ అహల్యను రమణీయంగా మాట్లాడిస్తారు.

రామునికి నమస్కరిస్తూ అహల్య చెబుతుంది:

"రామా! నేను పతితను. పాపాత్మురాలను. నీవు పతిత పావనుడవు. నే చేసిన పాపానికి గౌతముడు నన్ను శపించాడు. ఆ శాపము నాకు వరంగా పరిణమించింది. నాకు నా భర్త ఈ శాపమును అనుగ్రహించనిచో నీపాదస్పర్శ నాకు లభించునా? ఋషులు శాపాలు పంచేవారు కారని, వరాలిచ్చే వారేనని అనుభవం ద్వారా తెలుసుకున్నాను. పరమశివుని శిరస్సును ధరించిన పరమ పావని గంగ ఏ పాదపద్మముల నుండి ఆవిర్భవించినదో అట్టి చరణకమలములను సేవించే భాగ్యము నాకు కలిగింది.

"తండ్రీ! నాకు ఏ కోరిక లేదు. నాకు ఏ వరమూ అవసరము లేదు. సదా నీ చరణపంకజమున భ్రమరమై తిరుగునట్లు అనుగ్రహించు", అని అహల్య ప్రార్థిస్తుంది.

ఏకనాథ్ విరచితమైన భావార్థ రామాయణంలో కూడా అహల్య అలాగే అంటుంది.

గౌతమ శాప్ నవ్హేతో వర్

తేణే రఘువీర్ భేటావిలా ॥

"గౌతముడు నాకు శాపాన్నివ్వలేదు. వరాన్ని ప్రసాదించాడు. అతని కారణంగానే నాకు శ్రీరామచంద్రుని దర్శనభాగ్యం లభించింది"

అహల్య ప్రార్థన ముగియగనే రామచరితమానసములో తులసీదాసు మహాశయుడు తనతో తాను మాట్లాడుకుంటాడు. కర్తవ్యాన్ని మనసుకు తెలుపుతాడు.

అసప్రభు దీన బంధు హరి కారన్ రహిత దయాల్

తులసీ దాస సఠ తోహి భజు ఛాడీ కపట్ జంజాల్....

"శ్రీరాముడు దీనబంధువు. అతని నిర్హేతుకజాయమాన కటాక్షము భక్తుల యందు ప్రసరిస్తుంది. మూఢుడవైన ఓ తులసీ! బంధకారణములను త్యజించి శ్రీహరినే సదా స్మరించు" అంటూ వినమ్రుడై తనను మూర్ఖుడుగా వర్ణించుకుంటాడు సంత్ శిరోమణి భక్త తులసీదాసు.

ఇంతవరకు రాముడు మనకు రఘుపతిగా, రాఘవుడుగా, రాజకుమారుడుగా పరిచయ మయ్యాడు. అహల్య శాప విమోచనము కాగానే రాముడు పతిత పావనుడయ్యాడు. ఇక మిథిలకు వెళ్ళి జానకిని చేపట్టగానే సీతారాముడు అవుతాడు. అక్కడ నుండి మన ఇష్టం. ఎంతైనా కీర్తించవచ్చు.

రఘుపతి రాఘవ రాజారాం

పతిత పావన సీతారాం.......

అహల్య తప్పు చేసింది. పశ్చాత్తాపం చెందింది. తపస్సు చేసింది. రాముని కృపకు పాత్రురాలై తరించింది. అలాగే మనం కూడా చేసిన పాపాలకు పశ్చాత్తాపము చెంది, అవి తిరిగి పునరావృతం కాకుండా తపస్సు నాచరించి తరించాలి. ఇదియే అహల్య శాప వృత్తాంతములో మనము గ్రహింపదగిన సందేశము.

"అహల్య" అనగా దున్ననిది అని అర్థము. బంజరు భూమి లాంటిది. బీడు భూమి. దున్నని భూమి ఏ పంటకు పనికిరాదు. అలాగే తపస్సు లేని అహల్య అయోగ్యురాలై గౌతమునికి దూరమైంది. తపస్సు చేసి రాముని కృపకు పాత్రురాలై, దున్నిన భూమి వలె, జ్ఞానపంటను పండించుటకు సుక్షేత్రంగా మారింది.

కష్టించినవారికే ఫలాలు లభ్యమవుతాయి. కష్టాలు, కన్నీళ్ళు సత్యమార్గంలో నిత్యసోపానాలని మరువకూడదు. భగవంతుడు కొందరికి బాధల రూపంలోనే దర్శనమిస్తాడు.

Dear me, how great is God!

Dear me, how God is small!

Small as the smallest thing,

great as the troubles of all!

ఓ దేవుడెంత పెద్దవాడు!

ఓహో దేవుడెంత చిన్నవాడు!

అణువు కన్నా అల్పమైనవాడు,

అందరి బాధలకన్నా పెద్దవాడు!

అని జర్మనుకవి ఏంజలిస్ సైలేషియస్ భగవంతుని ముచ్చటగ వర్ణించుకున్నాడు.

'అహల్య' అనే పదంలో 'అ' అచ్చులకు సంకేతం కాగా, 'హల్' శబ్దం హల్లులకు ప్రతీకమైంది. ఈ విధంగా అహల్య సర్వాక్షర రూపమైంది. కనుకనే ఆమె సిద్ధి లోకంలో ప్రసిద్ధిగా మారింది. ఆమె మార్గంలో ఎందరో రాముని పాదాలను ఆశ్రయించి తరించారు. రామచంద్రుని చరణకమలముల వైభవమును ప్రథమంగా దర్శించినది అహల్యే గనుక ఆ తరువాత అందరికీ ఆమె మార్గదర్శకమైంది.

నీ పద పంకజములను నే నెరనమ్మినాను ॥ నీ పద ॥

కోపముతో ముని తాపసి ఇచ్చిన

శాపమున అహల్య అనుదినము

చాప రాయి తను తాప మోర్వలే

నామెను గని పరితాపము దీర్చిన ॥ నీ పద ॥

అని త్యాగరాజస్వామి రామభద్రుని ముక్తిదాయక చరణకమలములను అనేక విధాల కీర్తించి పరవశు డయ్యాడు. అహల్య భక్తిని అనుస్మరిస్తూ గానం చేశాడు.

"కామిని పాపము కడిగిన పాదము" అని అహల్య నుద్ధరించిన శ్రీరాముని చరణకమల వైభవమును గానం చేస్తూ, అవి బ్రహ్మ కడిగిన పాదములని మురిసిపోతాడు అన్నమాచార్యులు.

బండరాతి బ్రతుకులైనను, మన్నులాంటి మనుజులైనను పరమాత్మ కొరకు నిరీక్షించువారు నిరాశ చెందరని, నిరంజన రూపులై తరిస్తారని అహల్య గాథ నిరూపించింది.

విశ్వామిత్ర మహర్షి

విశ్వకళ్యాణానికి కృషి చేసిన విమల చరితుడు విశ్వామిత్రమహర్షి. మహాతపస్వి. ఉన్నది ఒక్క బాలకాండలోనే. తానంటూ లేకపోయినా, అన్ని కాండలలో ఉన్నదంతా ఆయన ప్రభావమే. ఏ వీధిలో ఊరేగినా, విగ్రహం శిల్పి చేసిందే. రామాయణమనే అసమాన శిల్పసుందరి వెనుక అదృశ్య శిల్పి విశ్వామిత్రుడే.

యాగసంరక్షణ కొరకు రామలక్ష్మణులను దశరథమహారాజు నుండి తీసుకొని వచ్చిన విశ్వామిత్రుడు మిథిలానగరంలో మళ్ళీ దశరథునికి తిరిగి అప్పగించాడు.

తీసుకోవడం తేలికైన పని. తిరిగి అప్పగించడంలోనే వ్యక్తి ఔన్నత్యం, ఔదార్యం చోటుచేసుకొని ఉంటాయి.

బాలరాముని గ్రహించాడు విశ్వామిత్రుడు. కొండంత రాముణ్ణి చేసి దశరథునికి అందించాడు.

అస్త్రశస్త్రాలు ప్రసాదించాడు. జీవితపాఠాలు నేర్పాడు. యాగ సంరక్షణము ద్వారా యావద్విశ్వానికి రాముని పరిచయం చేశాడు. అహల్య వృత్తాంతము ద్వారా రాముని పతితపావనుడుగా ప్రపంచానికి చాటాడు. మిథిలకు తీసికొని వెళ్ళి భూపతుల నోరు మూయించాడు. రాముని వీర్యతేజమును ప్రకటింప జేశాడు. లోకకళ్యాణమును ఆవిష్కరిస్తూ సీతారాములను ఏకం చేశాడు.

అన్నీ చేశాడు. ఆశలు లేనివాడు.

ఎన్ని కఠోర తపస్సులు! ఎన్ని గెలుపులు! ఎన్ని ఓటమిలు. ఎన్ని సంపదలు? ఎన్ని ఆపదలు? ఎన్ని సన్మానాలు? ఎన్ని అవమానాలు?

ఎన్ని విచిత్రాలు! విడ్డూరాలు! విన్యాసాలు! వినోదాలు! విషాదాలు? ఇవన్నీ కలబోస్తేనే విశ్వామిత్రుడు.

సమిష్టికి కృషి చేసిన మహర్షిని కోపిష్టి అని నిందించినా పాపిష్టి అని దూషించినా తిరిగి ప్రశ్నించని తపోధనుడు. మార్గమును విస్మరించని త్యాగమయుడు.

అన్నీ మహత్యాలే. ఆయనదేమో ఋషిత్వమే. మహత్వం, ఋషిత్వం ఐక్యమై మహర్షిత్వం సిద్ధించింది మహిలో.

మహిలో ఎన్నున్నా, తన మనసులో ఏమీ లేవు.
తన మహిమంతా ప్రపంచానికి, తానేమో ఒంటరిగా హిమాలయానికి.
శాంతి తీరాలలో ప్రపంచాన్ని చేర్చి దూరతీరాలను వెతుక్కొంటూ వెళ్ళాడు.
విశ్వానికి మిత్రత్వాన్ని నేర్పిన మహర్షి.
విజ్ఞాన మిత్రోదయాన్ని దర్శించాలని వెళ్ళిన తపస్వి!

అయోధ్యా కాండము

పువ్వుకు నవ్వు
నదికి రేవు
దాచుకోలేవు
కాచుకో నువ్వు......

ఇది అయోధ్యాకాండము.

అణువణువూ రసమయం
సరస రచనామయం.
భాషలో సౌందర్యం
భావంలో సంయమనం
ఉట్టిపడి ఊరేగే
కరుణా రసవత్కాండం....
రాతిగుండెల్లో రసధునుల్ని నింపి
మధుర కవితా మకరంద సంపదల్ని తెలిపి,
మధుమయ ఫణితులతో
సహృదయ హృదయంగమంగా
అందానికి అందమై
మనసుకు మరందమై
వివేక విందు నందించుకాండ
అయోధ్యాకాండ......
అవి రూపాలా! కావు.
అపురూప చిత్రకారుని అసమాన కుంచెనుండి జాలువారిన
సజీవ చిత్ర ఖండికలు.
అవి మాటలా! కావు.
కవితాగగనంలో ఊరేగే కవిచంద్రుని కలం నుండి జారిపడిన
అమోఘ అక్షర నక్షత్రాలు.
ఇందులోని
అసమాన ధర్మం హర్షణీయం
అమోఘ ప్రేమ వర్షణీయం
దివ్యాదర్శం సముత్కర్షణీయం....

అమృతమున్నచోటే హాలాహలం
అయోధ్యలోనే యుద్ధానికి ఆరంభం
కలతలకు, కన్నీళ్ళకు ప్రారంభం.
ఈ కాండము
బ్రతుకుకు అద్దంపడుతుంది.
అర్థం చెబుతుంది.
అర్థం అనర్థమని,
వ్యర్థమని
ధర్మమే పరమార్థమని
సమర్థవంతంగా చెబుతుంది.
పచ్చని రాజ్యంలో కార్చిచ్చు రేపింది మంథర
కోరికలు కోడెత్రాచులని నిరూపించింది కైక.
తండ్రి తనయుల ధర్మవత్సలతకు
అన్నదమ్ముల అనుబంధానికి
ఆలుమగల అనురాగానికి
స్నేహితుల సఖ్యతకు
పాలకుల, పాలితుల సద్భావనకు
ఈ కాండము ప్రతీక. ప్రదీపిక.
ఒడిదుడుకుల మధ్య ఊగే ఊయలే జీవితం.
నా తండ్రి చెబితేగాని నేను సీతను పెండ్లాడను - ఇది బాలకాండము.
నా తండ్రి చెప్పిన తర్వాత నేను అయోధ్యలో నిలవను - ఇది అయోధ్యాకాండము.
ముడిపడడం విడిపడేందుకే అంటుంది బాలకాండ
విడిపడడం ముడిపడేందుకే అంటుంది అయోధ్యాకాండ.
ఈ కాండములోనే
వేడుక చూడలేక ఏడుపొచ్చింది మంథరకు
నారచీరను కట్టుకొనుట చేతకాని నారి ఆరితేరినట్లు నడిచివెళ్ళింది అడవికి.
దాంపత్యబంధం విడదీయలేనిదని, విడదీయరానిదని
విడమరచి చెబుతుంది ఈ కాండము.
పవిత్రమని, పాపఘ్నమని మరీ మరీ పలుకుతుంది ఈ కాండము.
శీల సంపాదనము
ధర్మ ప్రవర్తనము

అనే రెండు రెక్కలతో అలసట లేకుండా విహరిస్తుంది
అయోధ్యాకాండా విహంగము.
రాళ్ళను కరిగించే రామభరతుల హృదయావేదన
రాళ్ళవలె కరగని కైకేయీమంథరల కర్కశ నివేదన.
వ్యక్తి సర్వతోముఖ వికసనానికి
సమాజ అభ్యుదయ విలసనానికి
వెనుక నిలిచి వెన్నుతట్టే
విమల ధర్మకాండ అయోధ్యాకాండ.
భరతునివంటి త్యాగధనులు
సుమిత్రవంటి మౌనయోగులు
మనసు విప్పి మాట్లాడిన మధుమయకాండ.
ఇచ్చినవాడు ఎదురుచూచేది ఫాయిదా
పుచ్చుకున్నవాడు నిరీక్షించేది వాయిదా
ధర్మం చెడితే ధనం చేయగలిగింది దహనమే అని
ధర్మశంఖాన్ని పూరించిన ధార్మికకాండ.
భార్యకు భర్తగా
తల్లిదండ్రులకు పుత్రుడుగా
సోదరులకు బహిః ప్రాణంగా
ప్రజలకు రాజుగా
యాచకులకు దాతగా
ఆధిక్యాన్ని కాదని, ఆదర్శాన్ని కాంక్షించిన
శ్రీరాముడు ఇక్కడే
ధర్మమూర్తిగా జాజ్వల్యమాన మౌతాడు.
మనసులోని మర్మం ముఖంలో దర్శనం
భవనం యొక్క అందం గుమ్మంలో ప్రదర్శనం
గ్రంథంలోని వైభవం ఆరంభంలోనే సుదర్శనం ....
అయోధ్యాకాండములోని ప్రథమశ్లోకం
"గచ్ఛతా" అనే పదంతో ఆరంభం కావడమే విశేషం.
మేనమామగారింటికి భరతుడు వెళ్తూ (గచ్ఛతా) పాపరహితుడు, శత్రుసంహారకుడు
అయిన శత్రుఘ్నుని వెంటబెట్టుకొని వెళ్లాడు - ఇది శ్లోక భావం.
'గచ్ఛ్' అను ధాతువునకు వెళ్ళుట అని అర్థము.

ఈ కాండములో

1. శత్రుఘ్నుని వెంటబెట్టుకొని భరతుడు వెళ్ళాడు.
2. వనవాసానికై రాముడు అడవికి వెళ్ళాడు.
3. పుత్రశోకాన్ని భరించలేక దశరథుడు పరలోకం వెళ్ళాడు.
4. కోసలరాజ్య సింహాసనం అయోధ్య నుండి నందిగ్రామానికి వెళ్తుంది.

ఆహా(... వాల్మీకి కోకిలా!

నీ కంఠంలో ఎన్ని కమనీయ స్వరాలు?

కవికోకిలా!

నీ కలంలో ఎన్ని రమణీయ నాట్య భంగిమలు?

'గచ్ఛతా', వెళ్ళడం అని, అందరూ వెళ్ళేలా చేశావు.

మరి మేము?

మేమూ వెళ్తాం. అయోధ్యాకాండలోకి.

పదండి ...... పదండి .... తొందరగా

బాలకాండ వలె పెళ్ళిభోజనాలు లేవు.

ఇక్కడ అన్నీ కందమూలాలే

ఫలపుష్పాలే .....

ఆరగించాల్సింది కష్టాల్నే

పానం చేయాల్సింది కన్నీళ్ళనే

తప్పదుమరి...... పదండి.

మనం ఓడిపోవాలని భగవంతుడు మనల్ని సృష్టించాడా? గెలవాలనే పట్టుదలను పోగొట్టుకొని గెలుపును ఓటమిగా మనం మార్చుకుంటున్నాం.

అర్థం కాని దానిని ఆచరించటం సాధ్యపడదు. అర్థమైతే ఆచరించ కుండా ఉండలేము. ఆచరించినపుడే అర్థమైనదని భావము. దారి తెలిసిన వాడు దారి తప్పగలడా? అపశ్రుతులన్నీ సంగీతం రాని వారివే.

జ్ఞానానికి మించిన పవిత్ర వస్తువు లేదు. స్పష్టత కన్నా అందమైనది జగత్తులో ఉండదు.

అయోధ్య

అయోధ్య అనగా యుద్ధము లేనిచోటు. ఆక్రమించుటకు వీలుగానిది. పోరులేని ఊరు. పోరాటాలు, ఆరాటాలు లేని ఊరు.

మానవ హృదయమే అయోధ్య. అయోధ్యలో రాముడున్నాడు. హృదయంలో ఆత్మారాము డున్నాడు.

నిత్యానంద లక్షణే యస్మిన్ యోగినో రమన్తే ఇతి రామః

"యోగులు రమించే నిత్యానంద స్వరూపమగు చైతన్యమే శ్రీరాముడు".

చైతన్యమే సత్యము. నిత్యము. అమరము. అజేయము. ఇదియే ఆత్మ. ఆత్మకు సంబంధించిన విషయము ఆత్మజ్ఞానము. ఆత్మ నిత్యమైనందున ఆత్మజ్ఞానము అమృతమై భాసిస్తుంది.

ఆత్మకు అన్యమైన దంతయు అనాత్మ. అది అనిత్యము. మృతం. అనాత్మకు సంబంధించిన విషయము అశాశ్వతమైనది. కాలపరిధి లోనిది.

కళ్ళుతెరచి ప్రపంచంలో కాలుపెట్టింది మొదలు కళ్ళుమూసి కాష్టంలో కాలూనేవరకు మనిషికి అనాత్మప్రపంచంతోనే సంబంధం.

తినడం, త్రాగడం, తిరగడం, తూలడం.....ఇంకేముంది జీవితం? నిన్న చేసిన పనులే నేడూ చేస్తున్నాం. నేడు చేస్తున్న పనులే రేపటికి మిగిలి ఉన్నాయి. నిన్నటి పనులు నేడు సుఖాన్ని పంచలేకపోయాయి. నేటి పనులు రేపు ఆనందా న్నిస్తాయా?

రోత పుట్టించే దేహాన్ని ఒకవైపు మోస్తూ, అలాంటి మరొక దేహంపై మోజు పెట్టుకుంటాడు మనిషి.

అడ్డంగా బలిసియున్న అశ్వశునకాదుల యందు ఏ మాంసము, ఎముకలు, రక్తము, చర్మము ఉన్నదో, నిలువుగా, సొగసుగా నిలబడియున్న మనిషిలో కూడా ఆ రక్తమాంసాదులే కదా ఉండేది?

ఇలాంటి దేహాలపై ఏర్పరచుకొనే మోహమే సర్వ అనర్థములకు మూలం. మోహం కలిగిన తరువాత శునకానికి సురేంద్రునికి తేడాలేదు.

ఈ మోహకూపంలో పడినవారికి ఏడుపులే గాని వేడుక లుండవు. వారికి రోదనాస్త్రాలే గాని శోధనాస్త్రాలు లభించవు. ధర్మానికి, అధర్మానికి తేడా తెలియదు. అట్టి వారు పశుతుల్యులు అని తీవ్రంగా పలికింది నీతిశాస్త్రము.

ఆహార నిద్రా భయ మైథునాంచ సామాన్యమేతత్ పశుభి ర్నరాణామ్
ధర్మోహి తేషా మధికో విశేషో ధర్మేణ హీనాః పశుభి స్సమానాః

"ఆహార నిద్రాభయ మైథునములు మానవులకు, పశువులకు సామాన్యములు. ధర్మమును గ్రహించుటయే మానవునిలో విశిష్టమైన లక్షణము. ధర్మహీనులైన మానవులు పశువులతో సమానము".

ధర్మము అమృతమును అందిస్తుంది. అధర్మము మృత్యువును ముందుంచు తుంది. హృదయంలో శోభించే పరమాత్మను పొంది, బాహ్యకర్మలయందు దానికి వైరుధ్యము లేకుండా జీవించాలి. ఇదియే ధర్మం.

ద్వివిధోహి వేదోక్తో ధర్మః ప్రవృత్తి లక్షణో నివృత్తి లక్షణశ్చ జగతః
స్థితి కారణమ్ ప్రాణినాం సాక్షా దభ్యుదయ నిశ్శ్రేయస హేతుః

"వేదము రెండురకాల ధర్మములను చెప్పింది. ఒకటి ప్రవృత్తి. రెండవది నివృత్తి. ఈ రెండు ధర్మాలే ప్రపంచ మనుగడకు కారణములు. ప్రాణుల అభ్యుదయ నిశ్శ్రేయ సలకు హేతువులు" అని శ్రీశంకరాచార్యులవారు గీతాభాష్యంలో చెబుతారు.

ఏం చేయాలో చెప్పేది ప్రవృత్తి కాగా, ఎలా ఉండాలో తెలిపేది నివృత్తి. ఈ రెండూ తెలిసినవాడు ధర్మజ్ఞుడు. ఈ మార్గమును తెలిసి, అదే త్రోవలో పయనించు ధర్మాత్ముడు సత్యాత్ముడై శోభిల్లుతాడు.

ప్రవృత్తిధర్మాలు లౌకికకర్మలను శుద్ధిచేసి సమాజంలో అభ్యుదయాన్ని సృష్టిస్తాయి. నివృత్తిధర్మాలు అలౌకికమైన జ్ఞానాన్ని ప్రసాదించి జీవులకు మోక్షాన్ని ప్రసాదిస్తాయి. నిశ్శ్రేయస అనగా మోక్షమే.

అభ్యుదయ నిశ్శ్రేయసలకు హేతువైన ధర్మములతో వ్యక్తి సంబంధమును కలిగి యుండాలి. ఇదియే ధర్మజీవనము.

కానీ మానవులు అనాత్మ సంబంధం వల్ల అభ్యుదయ నిశ్శ్రేయసలను విస్మరించి అధర్మంగా చరిస్తూ పాపాచరణలో మునిగి ఉంటారు.

ధర్మశీలురకు శ్రేయస్సు ప్రధానం కాగా అధర్మపరులకు ప్రేయస్సు ముఖ్యంగా ఉంటుంది. ప్రేయస్సు కల్గించే సుఖం అనిత్యం, అశాశ్వతం అని అధర్మపరులు గ్రహించ లేరు.

తాత్కాలిక సుఖాన్ని ఎరగాజూపి శాశ్వతానందాన్ని కబళించేది ప్రేయస్సు. ఆరంభంలో కష్టంగా తోచినా అంత్యంలో శాశ్వతానందాన్ని ప్రసాదించేది శ్రేయస్సు.

ధర్మాచరణములో ప్రతి కష్టము సుఖంగా మారుతుంది. ప్రతి బాధ ఆనంద ప్రదంగా మారి తీరుతుంది.

ధర్మము మనిషికి శ్రేయమును ప్రసాదిస్తుంది. ఇహమున అభ్యుదయమును, పరమున మోక్షమును అనుగ్రహించేదే ధర్మము.

ఈ ధర్మాధర్మముల భయంకర సమరమే జీవితము. హృదయమే యుద్ధభూమి. ప్రతి మానవ హృదయములో నిరంతరము ఈ ధర్మాధర్మాలకు మధ్య గొప్ప సంగ్రామము జరుగుతూ ఉంటుంది. పరస్పర వైరుధ్య భావాలమధ్య జరిగే సంఘర్షణయే ఈ భయంకర సంగ్రామము.

సంగ్రామము లేని గ్రామమే అయోధ్య. ప్రతి మానవ హృదయము అయోధ్య కావాలి. అప్పుడే హృదయంలో ఆత్మారాముడు నిలుస్తాడు.

ధర్మానుష్ఠానంవల్ల సంఘర్షణలు సమసిపోతాయి. శాంతి చేకూరుతుంది. అధర్మము సంఘర్షణలను రేపి, సంతాపాలకు నాంది పల్కుతుంది.

అధర్మప్రవర్తనతో బ్రతుకును కల్లోలంగా మార్చుకోవద్దని అయోధ్యాకాండ బోధిస్తుంది. ధర్మము ప్రగతికి, అధర్మము పతనానికి దారితీస్తా యని హెచ్చరిస్తుంది.

ఈ అయోధ్యాకాండ ధర్మప్రధానమైన కాండ. ఈ కాండములో అసలు యుద్ధమే లేదు. రామాయణంలో యుద్ధము లేని కాండము అయోధ్యాకాండమే.

బాలకాండలో రామునికి, రాక్షసులకు యుద్ధం జరుగుతుంది. అరణ్యకాండలో ఖరదూషణాదులతో రామలక్ష్మణులు పోరాడుతారు. కిష్కింధాకాండలో వాలిసుగ్రీవుల పోరాటముంది. సుందరకాండలో హనుమంతుడు రాక్షసులతో పోరాడుతాడు. యుద్ధ కాండలో రామరావణ సంగ్రామమే ఉంది. యుద్ధములేని ఏకైక కాండ ఈ అయోధ్యా కాండయే. అందుచేత ఇది ధర్మప్రధానమైన కాండగా ప్రసిద్ధిగాంచింది. అంతేగాదు. ఎక్కడ గృహ కల్లోలాలు తలెత్తినా అయోధ్యాకాండను పారాయణచేసి శాంతిని అనుభవించడం ఆచారంగా కూడా నిలిచింది.

రామాయణంలో రాజ్యంకొరకు సంఘర్షణకు గురియైన రాజ్యాలు మూడు తెలుస్తున్నాయి. ఈ మూడు కూడా ప్రత్యేకించి సోదరులమధ్య సంఘర్షణగా తెలుస్తున్నాయి. అవి 1. అయోధ్య 2. కిష్కింధ 3. లంక.

అయోధ్యలో రామ భరతులకు సంఘర్షణ. కిష్కింధలో వాలి సుగ్రీవులకు సంఘర్షణ. లంకలో రావణ విభీషణులకు సంఘర్షణ.

కిష్కింధలో తమ్ముడైన సుగ్రీవుని తరిమికొట్టి వాలి రాజ్యాన్ని ఆక్రమించాడు. రాముని సహాయంతో సుగ్రీవుడు వాలి మరణానికి కారకుడై, కిష్కింధలో రాజ్యాభిషిక్తు డయ్యాడు.

లంకలో రావణుని మరణానికి విభీషణుడు కారణమయ్యాడు. రావణుడు మరణించక ముందే సాగరతీరాన రామునిచే అభిషిక్తు డయ్యాడు. రావణవధానంతరము లంకలో రాజయ్యాడు.

ఒక్క అయోధ్యలోనే పరిస్థితి తారుమారుగా తెలుస్తుంది. తమ్ముడైన భరతుడు రాజ్యాన్ని పాలించాలని రాముడు అభ్యర్థిస్తుంటే, అన్నయైన రాముడే పరిపాలించాలని భరతుడు కన్నీళ్ళతో ప్రార్థిస్తాడు.

కిష్కింధ లంకలలో అన్నల మరణానికి తమ్ములు కారకులుకాగా, అయోధ్యలో అన్నగారికొరకు తమ్ములు ప్రాణత్యాగం చేయడానికి కూడా వెనుకాడరు.

ఇది అయోధ్య యొక్క ప్రత్యేకత.

అయోధ్య ధర్మనిలయం. శాంతినిలయం. ఈ అయోధ్యాకాండములో ధర్మాధర్మముల విశ్లేషణ అద్భుతంగా నడిచింది.

మిన్నువిరిగి మస్తకంపై పడుతున్నా చలించని ధీరోదాత్తులైన ధర్మపరులు ఒకవైపు శోభిస్తుండగా, మన్నుకు, సున్నకు విలువనిచ్చి తమను తాము రక్షించుకోవాలని, రమణీయంగా తీర్చుకోవాలని జీవితాలతో క్రీడించే అధర్మపరులు మరొక వైపు మిణుకు మిణుకు మంటూ గోచరిస్తూ ఉంటారు.

ధర్మంకోసం రాజ్యాన్ని, సర్వాన్ని త్యజించేందుకు సిద్ధమైన ధర్మాత్ములు ఒకవైపు, అధర్మంతో అన్యాయం చేసి అయినా సుఖించాలనే అధర్మశీలురు మరొకవైపు ఈ కాండములో ప్రధానపాత్రలు పోషిస్తారు.

కదలి రావలసింది ఏమిటో, వదలి పోవలసింది ఏమిటో ఈ కాండములోనే మనం గ్రహించాలి. పట్టువిడుపులు మనిషికి ఇక్కడే తెలియాలి.

రామాయణంలో ఈ కాండము అద్భుతమైనది. వాస్తవానికి ఇది అద్వితీయం. అమోఘం. మానవ ధర్మజీవన వృక్షము ఈ కాండము మీదనే ఆధారపడి ఉంది.

సంతోష పరిచేవి సమీపానికి వచ్చినపుడు ఆనందించ వద్దని నేను చెప్పటం లేదు. వాటిని నీ దగ్గరకు చేర్చింది పరమాత్మే అనే సత్యాన్ని మరచిపోవద్దు అంటున్నాను.

తృప్తి చెందే క్షణాలు ఎప్పుడు నీకు లభించినా హాయిని అనుభవించవద్దు అని నేను బోధించను. నీవు సుఖించేందుకు కాలాన్ని అనుకూలంగా మలచిన దివ్యాత్ముని విస్మరించవద్దు అంటున్నాను. అతణ్ణి చక్కగా అర్థం చేసుకొనేందుకు అంతకు మించిన పవిత్రకాలం మరొకటి ఉండదు అంటున్నాను.

సాధకులకు ఆదర్శం శతృఘ్నుడు

అయోధ్యాకాండము ప్రారంభమైంది.

గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః
శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నో నీతః ప్రీతి పురస్కృతః

ఇది అయోధ్యాకాండములో ప్రథమసర్గలో ప్రప్రథమ శ్లోకం.

“అప్పుడు భరతుడు తన మేనమామగారింటికి వెళ్తూ అనఘుడు, తనను ప్రీతితో అనుసరించువాడు, నిత్య శత్రుసంహారియైన శత్రుఘ్నుని కూడా తనవెంట తీసుకు వెళ్ళాడు” ఇది పై శ్లోకం యొక్క భావం.

ధర్మప్రధానమైన అయోధ్యాకాండములోని ఈ ప్రథమ శ్లోకము ధర్మసాధానికి ప్రథమ సోపానమై శోభిస్తూ ఉంది. అందుచేత ఈ శ్లోకాన్ని భక్తులు, పెద్దలు ఎంతగానో శ్లాఘిస్తారు. గౌరవిస్తారు. ఈ శ్లోకం ప్రబోధించే ధర్మసూక్ష్మాలను, ధర్మావలంబనకు అనువైన అంశాలను పరిశీలిద్దాం.

తన మేనమామయైన యుధాజిత్తు ఆహ్వానంమేరకు భరతుడు మామగారింటికి ప్రయాణమయ్యాడు. వెళ్తూ వెళ్తూ శత్రుఘ్నుని వెంటబెట్టుకొని వెళ్ళినట్లు పై శ్లోకం చెబుతూ వుంది.

రామాయణంలో శత్రుఘ్నుని పాత్ర ఒక విలక్షణమైనది. తేజోవంతమైనది. భావస్ఫూర్తి కలిగినది. అదొక సుకుమార సజీవ పాత్ర.

రామాయణంలో శ్రీరాముడు కథానాయకుడు. ఆయనిది ప్రధాన పాత్ర. భరతుడు ఉపనాయకుడుగా తెలుస్తాడు. కథానాయకుని లక్ష్మణుడు సేవిస్తాడు. ఉపనాయకుని శత్రుఘ్నుడు సేవిస్తాడు. సేవకులిరువురూ సుమిత్ర కుమారులే.

సేవలో సంతృప్తిచెందే బిడ్డలను ప్రసవించిన, ప్రసాదించిన సుమిత్ర జన్మ ధన్యము. ఆమె పాత్ర కూడా రామాయణంలో చాలా విశిష్టమైంది. ఆమె మితభాషి. హితభాషి. అందరికీ మిత్రురాలై సుమిత్ర అయింది. సుమిత్ర కుమారులు సుబుద్ధులు కాకపోతారా?

సుమిత్రవలె సుమిత్రానందనుడైన శత్రుఘ్నుని పాత్ర శ్రీమద్రామాయణంలో ఎక్కువగా కనిపించదు. ఉత్తరకాండలో శత్రుఘ్నుని పాత్ర శోభిస్తుంది.

లక్ష్మణశత్రుఘ్నులు రామభరతులకు అంకితమైపోయారు. రాముడున్నచోట లక్ష్మణుడుంటాడని ఊహించవచ్చు. అలాగే భరతుని ప్రక్కన శత్రుఘ్ను డుంటాడని భావించవచ్చు.

భరతుడు మేనమామ ఇంటికి వెళ్తున్నాడు. అతనికి ఆహ్వానం ఉంది. కానీ శత్రుఘ్నుడు ఎందుకు వెళ్ళాడు? పైగా ఆహ్వానం కూడా లేదు. ఈ విషయాన్ని విశ్లేషిస్తూ ఆలోచిస్తే అనేక సద్విషయాలు, సాధనావిషయాలు బయటపడతాయి.

1. భరతుడు వెళ్తూ వెళ్తూ శత్రుఘ్నుని వెంటబెట్టుకొని వెళ్ళాడు. సంకల్పము భరతునిదే గాని శత్రుఘ్నునిది కాదు. ఇది శత్రుఘ్నుని శరణాగతి.

లక్ష్మణుడు శ్రీరాముని అనుసరిస్తూ సేవిస్తాడు. శ్రీరాముని సమీపించుటకు, సేవించుటకు తనకు అర్హత లేదని భావించిన శత్రుఘ్నుడు భక్తుడైన భరతుని అనుసరిస్తాడు. ఒక సత్పురుషుని ద్వారా సద్రూప చైతన్యమైన పరమాత్మను చేరవచ్చునని భావిస్తాడు. గుర్తు తెలిపేవాడు గురువేనని విశ్వసిస్తాడు. మహాత్ములను సేవించునపుడు వారి సంకల్పాలకు అనుగుణంగా చరించడం ప్రధానం. అందుచేత భరతుని సంకల్పాన్ని అనుసరించి వెళ్ళాడు శత్రుఘ్నుడు.

2. లక్ష్మణుడు రామునితో విలీనమై జీవించునట్లు, శత్రుఘ్నుడు భరతునితో విలీనమౌతాడు. వ్యక్తిని నీడ అనుసరించునట్లు సత్పురుషుడైన భరతుని శత్రుఘ్నుడు అనుసరిస్తాడు.

3. శత్రుఘ్నుడు తన ప్రయాణ విషయమై తల్లియైన సుమిత్రకుగాని, తండ్రియైన దశరథునికిగాని, భార్యయైన శ్రుతకీర్తికిగాని చెప్పినట్లు తెలియుటలేదు. వెళ్తూ వెళ్తూ భరతుడు శత్రుఘ్నుని తీసికొనివెళ్ళినట్లు మాత్రమే శ్లోకం చెబుతూవుంది.

ప్రయాణ సమయాల్లో ఎవరి వస్తువుల్ని వారు మరచిపోకుండా గొనిపోవునట్లు, భరతుడు శత్రుఘ్నుని తీసుకొనివెళ్ళాడు. తన వస్తువులను తీసుకొనిపోవుటకు అన్యుల అనుమతి అవసరం లేదు. అలాగే శత్రుఘ్నుని గొనిపోవుటకు భరతుడు కూడా ఎవ్వరి అనుమతి తీసుకోలేదు.

సత్పురుషుని లేదా గురువుని అనుసరించు నపుడు ఎవరి అనుమతి అవసరం లేదని శత్రుఘ్నుడు ఆచరించి చూపాడు.

4. భరతుడు శుద్ధబుద్ధి. శత్రుఘ్నుడు నిర్మలమైన మనస్సు. నిర్మలమైన మనసు శుద్ధబుద్ధిని అనుసరించునట్లు శత్రుఘ్నుడు భరతుని అనుసరిస్తాడు.

మనిషికి మనసు దూరంగా ఉండలేదు. శత్రుఘ్నుడు భరతుని విడిచి ఉండలేడు. భరతునికి ఏది ఇష్టమో అదే తన అభీష్టమని భావిస్తాడు శత్రుఘ్నుడు. సత్పురుష సాంగత్యములో ఈ సత్యాన్ని సాధకులు సదా ఆంతర్యంలో అవధరించాలి.

5. భరతుడు తన మేనమామ యుధాజిత్తు ఇంటికి వెళ్తున్నాడు. శత్రుఘ్నునికి అది మేనమామ గృహం కాదు. అలాంటప్పుడు భరతుడు పిలిచినా "నేనెందుకు వెళ్ళాలి? నాకేమి ప్రయోజనం?" అని శత్రుఘ్నుడు ఆలోచించలేదు.

"అనుకూలస్య సంకల్పః" భరతుని సంకల్పానికి అనుగుణంగా చరించడమే గాని తన కంటూ ప్రత్యేకమైన ఆలోచనలు లేనివాడు శత్రుఘ్నుడు. ఇది శరణాగతిలో పరాకాష్ఠ

ఒకనాడు కృష్ణార్జునులు షికారు వెళ్ళారట. మార్గమధ్యంలో "అర్జునా! ఆ కొంగలు చూడు. ఎంత చక్కగా బారులుతీరి కూర్చుని ఉన్నాయో?" అన్నాడట కృష్ణుడు.

"అవును బావా! చాలా బావున్నాయి. బారులుతీరి మరీ బావున్నాయి కొంగలు" అని జవాబు ఇచ్చాడట అర్జునుడు.

మరికొంతసేపటికి శ్రీకృష్ణుడు "అర్జునా! ఆ కాకుల్ని చూశావా! ఎంత చక్కగా కూర్చుని ఉన్నాయో?" అని ఇంతకుపూర్వం చూపిన పక్షులనే చూపిస్తూ అన్నాడట.

"అవును కృష్ణా! ఆ కాకులు చక్కగా ఆకులు పరచినట్లు ఉన్నాయి" అని ప్రతి వచనం పలికాడట పార్థుడు.

"అర్జునా! ఏమిటి నీ మనోస్థితి? నేను కొంగలంటే కొంగలంటావు. కాకులంటే కాకులంటావు. నీ విచక్షణ ఏమైంది? నీ మనసు ఎక్కడికి వెళ్ళింది?" అన్నాడట అచ్యుతుడు.

"కృష్ణా! నా మనసు ఎక్కడకీ పోలేదు. నీ దగ్గరే ఉంది. కాకులైతే నాకెందుకు? కొంగలైతే నాకెందుకు? నీ రాగంలో శ్రుతి కలపడమే నా యోగం. నీవు కొంగంటే కొంగే. నీవు కాకంటే కాకే;" అన్నాడట అర్జునుడు.

ఇదియే శరణాగతి. శత్రుఘ్నుడు సాధించుకొనిన స్థిరమతి. అమోఘ నియతి. అపూర్వగతి.

శరణాగత వైభవమును తన జీవితములో అసమాన రీతిలో వ్యక్తపరచిన శత్రుఘ్నునికి ఈ శ్లోకములో మూడు విశేషణాలు చెప్పబడ్డాయి.

1. అనఘః అనగా పాపరహితుడు అని అర్థము. మనసులో సమస్తమైన కల్మషములు నశించినవాడని భావము. సత్పురుషుని ఆశ్రయించిన సాధకుడు సాధన ద్వారా పాపములను క్షాళనం చేసుకోవాలి. ఆ తరువాతనే భగవదనుగ్రహం లభిస్తుంది. ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది. గురుబోధ హృదయంలో స్థిరపడుటకు సాధకుడు పాపరహితుడై యుండాలి.

తపోభిః క్షీణ పాపానాం శాంతానాం వీతరాగిణామ్
ముముక్షూణా మపేక్ష్యోఽ యం ఆత్మబోధో విధీయతే ॥

"తపస్సు ద్వారా పాపములను నశింపజేసికొని, రాగద్వేషములనుండి విముక్తుడై, ప్రశాంతచిత్తుడైన ముముక్షువునకు అపేక్షింపదగిన ఆత్మబోధ చెప్పబడుచున్నది" అని ఆదిశంకరులు ఆత్మబోధ ప్రకరణగ్రంథములో తెలుపుతారు.

ఘోరమైన, క్రూరమైన, పాపభూయిష్ఠమైన ఆలోచనలు, కర్మలు ఆధ్యాత్మిక మార్గంలో అడ్డుగోడలై నిలుస్తాయి. ప్రతిబంధకాలై పీడిస్తాయి. కనుకనే వీటినుండి విశ్వాన్ని విముక్తం చేయమని వేదఋషులు ప్రార్థించేవారు.

యదిహ ఘోరం యదిహ క్రూరమ్ యదిహ పాపం
తచ్ఛాంతం తచ్ఛివం సర్వమేవ సమస్తునః

"ఈ ప్రపంచంలో ఏది భయంకరమో, క్రూరమో, పాపమో, దానినంతయూ శాంతింపజేసి, మాకు శ్రేయమును, శాంతిని ప్రసాదింతురు గాక!" అని విశ్వకళ్యాణాన్ని వాంఛిస్తూ ఋషులు ప్రార్థించేవారు.

శత్రుఘ్నుడు పాపములను పోగొట్టుకొని మహాత్ముడైన భరతుని గురువుగా భావించి ఆశ్రయించాడు.

2. నిత్య శత్రుఘ్నః అనగా నిత్యశత్రుసంహారి అని భావము. దుఃఖమును ప్రసాదించు కోరికలే మనిషికి నిత్యశత్రువులు. శత్రువులను కలిగియున్నవాడు ఎలా సుఖంగా జీవించలేడో, కోరికలకు నిలయమైనవాడు కూడా సుఖపడలేడు.

గురువును సేవించే సాధకుడు కోరికలను అదుపులో ఉంచుకోవాలి. నిగ్రహించాలి. కామమును నిత్యశత్రువుగా శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో వర్ణించారు.

ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా

కామరూపేణ కౌన్తేయ దుష్పూరే ణానలేనచ ॥

"అర్జునా! కామము జ్ఞానికి నిత్యశత్రువు. పూరించుటకు శక్యముగాని అగ్ని వంటిది యగు ఈ కామముచే జ్ఞానము ఆవరింపబడియున్నది" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత - కర్మయోగములో తెలిపియున్నారు.

కామమును నిత్యశత్రువుగా గీత కూడా అభివర్ణించింది. కనుక కోరికలను ముముక్షువు తురదముట్టించాలి. విషయములను అనుభవించినంత మాత్రాన కోరికలు శాంతింపవు.

న జాతు కామః కామనా ముపభోగేన శ్యామతి

హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే ॥

"కామ విషయములమ అనుభవించుటచేత కామము తృప్తిపొందదు. ఇంధనము సమకూర్చినంత కాలము అగ్ని ఎలా శాంతించదో కామము కూడా అంతే" నంటాడు ధర్మశాస్త్రవేత్త మనువు.

సత్పురుషుని ఆశ్రయించి జ్ఞానమును పొందగోరు ముముక్షువు శత్రుఘ్నునివలె పాపరహితుడై ఉండాలి. కామరహితుడై ఉండాలి. అంతేగాదు.

3. ప్రీతి పురస్కృతః గురువును ప్రీతితో అనుసరించేవాడై ఉండాలి. ఆసక్తి లేనిచోట అవధాన ముండదు. ప్రేమ లేనిచోట భక్తి కుదరదు. జ్ఞాన సముపార్జనలో నైరాశ్యాలు, వైకల్యాలు పనికిరావు. గురుసాన్నిధ్యంలో ఆనందంగా జీవిస్తూ, గురువును ప్రీతితో అమసరించు ముముక్షువుకు జ్ఞానప్రాప్తి కల్గుతుంది.

ఈ మూడు లక్షణాలు కలిగియుండుటచేత శత్రుఘ్నుడు ముముక్షువులకు మార్గ దర్శకుడయ్యాడు.

సుమిత్ర సౌజన్యం

పుత్ర వియోగ దుఃఖంతో కుమిలిపోతున్న కౌసల్య శోకాన్ని గాత్రవైభవంతో అదృశ్యం చేసిన అమోఘమైన పాత్ర రామాయణంలో సుమిత్ర. ఆమె వచనామృత ప్రవాహంలో పయనించడమే వాస్తవానికి ఒక దివ్యమైన విజ్ఞానయాత్ర. ఆత్రము లేని, క్షాత్ర మెరుగని ధర్మవిలసితమైన ఆమె భావయాత్రలో కొన్ని నిముషాలు ప్రయాణం చేసిన కౌసల్య రోజంతా తనను పట్టి పీడించిన దుర్భర శోకమునుండి సునాయాసంగా బయటపడింది. మిత్ర జీవనానికి అద్దంపట్టే పాత్ర సుమిత్ర. పవిత్ర భావ సంయమనానికి ప్రతిరూపమే సుమిత్ర.

"అక్కా! కౌసల్యా! నీ వెందుకిలా దుఃఖిస్తున్నావు? దైన్యంతో బాధపడుతున్నా వెందుకు? రాముడు సకల గుణాభిరాముడు. పురుష శ్రేష్ఠుడు. ఇహపరములయందు కీర్తిని ప్రసాదించే ధర్మాన్ని వదలని పుణ్యచరితుడు. రాముణ్ణి గూర్చి నీవు దుఃఖించాల్సిన పని ఏముంది?

"రాముడు ధర్మచేతస్కుడై అడవికి వెళ్ళాడేగాని చేతగానివాడై కాదు. తండ్రిని అసత్యవాదిని చేయలేక తాను బాధల్ని కొనితెచ్చుకున్నాడు. అలాంటి ధర్మాత్ముడైన బిడ్డ విషయంలో ఇలా దుఃఖించడం సబబేనా?

"రామునికి ఏ లోటుందని నీవు బాధపడుతున్నావు? రాముని తండ్రిలా సేవిస్తూ కంటికి రెప్పలా కాపాడే నా బిడ్డ లక్ష్మణుడు తోడుగా వెళ్ళాడు. అరణ్యాలలోని కష్టాలన్నీ బాగా తెలిసిన సీత సేవాధర్మంతో భర్తను అనుసరించి వెళ్ళింది.

కీర్తి భూతాం పతాకాం యో లోకే భ్రమయతి ప్రభుః

ధర్మ సత్యవ్రత పరః కిం న ప్రాప్త స్తవాత్మజః

"ధర్మ సత్యాలే ధనమని భావించిన సమర్థుడైన నీ బిడ్డ తన కీర్తిపతాకాన్ని ఈ లోకంలో ఎగురవేస్తున్నాడు. అతనికి కొరత ఏమి ఉన్నది? అతనికి అందని ఫలమేముంది?" అన్నది సుమిత్ర.

ఈ శ్లోకంలో సుమిత్ర భావగర్భితముగ, దివ్యమైన భాష్యం చెప్పింది. ప్రభువు అనే పదానికి నూతన నిర్వచనా న్నిచ్చింది. కీర్తిపతాకాన్ని ఎగురవేసేవాడే ప్రభువని నిర్ణయించింది. స్ఫూర్తిలేక, కీర్తిలేక, దీప్తినెరుగని రాజు వాస్తవానికి ప్రజలపాలిటి దురదృష్టమేనని ఆమె అభిప్రాయం.

కౌసల్య రాముని కొరకు దుఃఖిస్తుంటే, అది సముచితం కాదని సుమిత్ర నిర్ద్వం ద్వంగా ఖండిస్తూ వుంది. రాముడి కొరకు కౌసల్య దుఃఖించడ మెందుకు? పట్టాభిషేకం భంగమైందని. కొడుకు రాజు కాలేదని. అంతేకదూ!

సుమిత్రవాదం వేరు. అసలు పట్టాభిషేకం భంగం కాలేదంటుంది సుమిత్ర. నిజానికి రాముడే ప్రభువు అని వాదిస్తూ వుంది. ఎందుకంటే అతని కీర్తిపతాకం రెపరెప లాడుతున్నది అంటున్నది.

రాముడు రాజై ఉంటే ఒక కోసల రాజ్యానికే పరిమితం ఆయన కీర్తి. కానీ, వనవాసము వల్ల ఆ దివ్యాత్ముని కీర్తి లోకమంతా వ్యాపించింది అంటూ వుంది సుమిత్ర. అంతేకాదు ఈ కీర్తి కాలానికి, దేశానికి పరిమితం గాకుండా యుగయుగాలుగా నిలిచి పోతుంది అని ఆమె భావన. ఇంతటి కీర్తి లభించే సమయంలో దుఃఖపడడం అసమంజసమని కౌసల్యకు హితవు చెప్తూ వుంది.

రాముని కీర్తి పతాకము ఎగురుతున్నది గనుక అతను ప్రభువే. రాజ్యము లేనంత మాత్రాన కొరతలేదు. ఇక బాధెందుకు? ధనహీను డయ్యాడని కౌసల్య దుఃఖిస్తూ ఉందా? ఆ విషయాన్ని కూడా సుమిత్ర సమ్మతించడంలేదు. సత్యధర్మాలే రాముని ధనమని చెప్తూ ఉంది.

రాజ్యము వల్ల లభించే ధనం స్థిరం కాదు. రాముడు సాధించిన ధనమే అక్షయ ధనము. ఆయన వద్ద వున్నది సత్యధనము, ధర్మధనము అంటున్నది సుమిత్ర.

"సత్యంవద - ధర్మంచర" ఈ రెండు వ్రతాలలో అన్ని వ్రతాలు ఇమిడి ఉన్నాయి. ఈ విధంగా వ్రతధనము నార్జించియున్న వానికి లౌకిక సంపదల అవసరమేమిటి?

కౌసల్య దుఃఖము సమంజసము కాదని, రాజ్యమనే కోణము నుండి, సంపదలనే కోణము నుండి యథోచితమైన విమర్శను విశ్లేషించి మరీ చెప్పింది సుమిత్ర. అయితే కౌసల్యకు ఈ సందర్భంలో ఒక సంశయము కలిగే అవకాశముంది. దానివల్ల కొరత ఏర్పడే పరిస్థితీ వుంది. అదేమిటంటే -

కీర్తిపతాకము ఎగురుతున్నందున రాజ్యము పోలేదని, సత్యధర్మాలు చేతికందిన వ్రతాలై ఉన్నందున ధనక్షయం కలుగలేదని సుమిత్ర ఈ శ్లోకంలో వాదించింది. అంతేకాదు. నెగ్గింది కూడా. కానీ రాముడు అయోధ్యలో ఉంటే పౌరులంతా సేవచేసేవారు. నేడు ఒంటరిగా అరణ్యంలో ఉన్న రామునికి సేవలెలా అందుతాయి? అనే సంశయం కౌసల్యకు ఏర్పడవచ్చు. దానిని కూడా నివారిస్తూ మూడు శ్లోకాల్లో రామునికి ప్రకృతి ఎలా సేవ చేస్తుందో ముచ్చటగా చెప్పింది సుమిత్ర.

"అక్కా! పవిత్రమైన శీలం కలవాడు రాముడు. రాముని వైభవాన్ని తెలిసినవాడే గనుక సూర్యుడు తన కిరణములచే రాముని శరీరాన్ని తపింపచేయడు. .

రాముని ధర్మనిరతిని గూర్చి తెలిసిన వాయుదేవుడు సమశీతోష్ణంగా చరిస్తూ రామునికి ఆహ్లాదాన్ని కలిగిస్తాడు.

"రాత్రిపూట బయట పడుకొని నిద్రిస్తున్న రాముని చంద్రుడు తనకిరణాలచే తాకి, తండ్రి బిడ్డను కౌగిలించుకున్నట్లు రాముని ఆలింగనం చేసికొని ఆనందింప చేస్తాడు. అంతేకాదు,

యాశ్రీః శౌర్యం చ రామస్య యా చ కల్యాణ సత్వతా
నివృత్తారణ్య వాసః స్వం క్షిప్రం రాజ్య మవాప్స్యతి ॥

"రామునియందు లక్ష్మి, శౌర్యము, కళ్యాణప్రదమైన బలము ఉన్నాయి. ఏ సంకోచము లేకుండా అరణ్యవాసమును పూర్తిచేసికొని త్వరగా రాజ్యమును రాముడు పొందుతాడు"; అన్నది సుమిత్ర.

రామునితో పాటు లక్ష్మి కూడా వెళ్ళింది అంటుంది సుమిత్ర. ఇక్కడ లక్ష్మి అంటే సంపద. దానిని కీర్తిపతాకంగా సుమిత్ర వర్ణించింది. కానీ సీత ఎవరో కాదు. లక్ష్మీదేవియే సీత. సీతారాములు లక్ష్మీనారాయణులే గనుక వారికొరకు దుఃఖించడం సముచితం కాదని కౌసల్యను హెచ్చరించడం కూడా ఇక్కడ ధ్వనిస్తూ వుంది.

సుమిత్ర తిరిగి ప్రారంభించి చెప్తూవుంది. "రామమాతా! కౌసల్యా! రాముడు సూర్యునకు సూర్యుడు. అగ్నికి అగ్ని. ప్రభువుకు ప్రభువు. సంపదకు సంపద. కీర్తికి కీర్తి. ఓర్పుకు ఓర్పు. దేవతలకు దేవత. అట్టి రామునికి అయోధ్య అయితే నేమి? అరణ్యమైతే నేమి?

పృథివ్యా సహ వైదేహ్యా శ్రియా చ పురుషర్షభ
క్షిప్రం తిసృభి రేతాభిః సహ రామోఽ భిషేక్ష్యతే ॥

"పురుషోత్తముడైన రామునకు భూమి (**పృథివ్యా**), సీత (**వైదేహ్యా**), లక్ష్మి(**శ్రియా**) అను ఈ ముగ్గురితో కలిసి రాజ్యాభిషేకం జరుగుతుంది" అన్నది సుమిత్ర.

ఇక్కడ శ్రీరాముడు సాక్షాత్తు నారాయణుడే అని ధ్వనించేలా ప్రసంగించింది. భూమితో, సీతతో, లక్ష్మితో కలిసి రాజ్యాభిషేకం జరుగుతుంది అంటే, భూదేవితో, శ్రీదేవితో శోభించిన నారాయణుడు సీతతో కూడా కలిసి అయోధ్యలో కొలువై యుంటాడని భావము. తన ధర్మప్రవచనాన్ని ధారాప్రవాహంగా సాగిస్తోంది సుమిత్ర.

"అక్కా! వనవాసమును పూర్తిచేసికొని రాముడు క్షేమంగా తిరిగివస్తాడు. నీవు శోకమోహాదులను విడిచిపెట్టు. నేను సత్యము చెప్పుచున్నాను. నీ కుమారుడు ఉదయించిన చంద్రునివలె వచ్చి నీ పాదాలకు నమస్కరించడము చూసి నీవు పొంగి పోతావు. ఆనందాశ్రువుల్ని విడుస్తావు.

"కౌసల్యా! రామునికి అమంగళము ఎన్నటికీ జరుగదు. నీవు దుఃఖించడం మానేయి. నీవు ఇతరులను ఓదార్చడానికి బదులుగ నీవే ఇలా దుఃఖించడం న్యాయమా? నీవు పామరులవలె ఇలా విలపించ కూడదు.

"రాముని వంటి పుత్రునికి జన్మనిచ్చిన నీవు పామరులవలె ఇలా విలపించ కూడదు. రామునివంటి ధర్మప్రవర్తన గలవారు ఈలోకంలో మరొకరు లేరు.

"నా మాట నమ్ము. రాముడు తప్పక తిరిగి వస్తాడు. అతడు వచ్చి నీ పాదాలకు నమస్కరిస్తుండగా తన్మయత్వం చెందిన నీవు వర్షాకాలములో మేఘాలు పర్వతమును తడిపినట్లు ఆనందాశ్రువులతో రాముని తడుపుతావు" అని మాటలు చెప్పి ఓదార్పుట యందు నేర్పరియైన సుమిత్ర కౌసల్యను శాంతపరచింది.

ఇది వాల్మీకిమహర్షి సుమిత్రకు అందించిన యోగ్యతాపత్రము.

"వాక్యోపచారే కుశ లానవద్యా" మాటల ద్వారా ఉపచారము చేయుటలో కౌశల్యము గల సుమిత్ర దోషరహితమైనది **(అనవద్యా).**

కౌసల్యను ఓదార్చే ఈ సందర్భములో రాముడు తప్పక తిరిగివస్తాడు అనే వాక్యాన్ని, అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని, పునరుక్తి అనే విషయాన్ని ప్రక్కకునెట్టి, అనేక సార్లు ప్రయోగించింది సుమిత్ర.

అదే సుమిత్ర తన కుమారుడైన లక్ష్మణుడు వెళ్ళేటప్పుడు సందేశాత్మక ఆశీర్వచనము నందిస్తూ **"గచ్ఛ గచ్ఛ"** వెళ్ళు వెళ్ళు అన్నదే గాని "వెళ్ళిరా" అని చెప్పలేదు.

రాముని మాత్రమే నమ్ముకొని జీవిస్తున్న లక్ష్మణుడు రాముని ఆస్తివంటి వాడు. యజమాని ప్రయాణంచేసి తిరిగిరాగానే ఆయనతోపాటు ఆయన పెట్టె కూడా వచ్చునట్లు, రాముడు వనవాసము పూర్తిచేసికొని అయోధ్యకు తిరిగివస్తే వెంట లక్ష్మణుడు తప్పక వస్తాడు. కనుక లక్ష్మణుని ప్రత్యేకించి "వెళ్ళిరా" అని చెప్పాల్సిన అవసరం లేదు. "ఏనుగు పాదంలో అన్ని జీవాల పాదాలున్నట్లే" అనే భావంతో మాట్లాడింది సుమిత్ర.

అదియును గాక, తన అధీనంలో ఉన్న తన కుమారుని పంపడం వరకే తన బాధ్యత. వెళ్ళిన తరువాత లక్ష్మణుడు రాముని అధీనంలో ఉంటాడు. తిరిగి రావడం రాముని ఆజ్ఞపై ఆధారపడి ఉంటుంది. కనుక 'గచ్ఛగచ్ఛ' వెళ్ళు వెళ్ళు అన్నదేగాని "వెళ్ళిరా" అని అనలేదు. ఈ విధంగా మాట్లాడే నేర్పరితనము, జ్ఞానము ఉన్నందున నేర్పరి **(కుశలా)** అని వాల్మీకిచే యోగ్యతాపత్రాన్ని పొందింది.

"గచ్ఛ గచ్ఛ" అంటూ రాముని అనుసరించమని చెప్పడంలో ఇది కేవలం ఒక్క లక్ష్మణునికి మాత్రమే సంబంధించిన సందేశమని భావించకూడదు. ధర్మ మార్గము ననుసరించమని తన కుమారుని ద్వారా యావద్విశ్వానికి తన సందేశము నందిస్తున్నది త్యాగమయి సుమిత్ర.

మరొక్క ముఖ్య విషయం. మాటలయందు నేర్పరియైన సుమిత్రను దోషములు లేనిది **(అనవద్యా)** అన్నాడు వాల్మీకి.

కొందరు మాటలలో నేర్పరితనాన్ని ప్రదర్శించాలని లేనిపోనివి కల్పిస్తూ, అతిశయోక్తి, ఉత్ప్రేక్ష్యాది అలంకారాలను బలంగా పోషిస్తూ, అబద్ధాల మేడెక్కి అభినయిస్తుంటారు. సుమిత్ర మాటల్లో అలాంటి దోషాలు లేవంటున్నాడు ఆదికవి. ఆమె నేర్పరితనములో అసత్యమును నేర్వనితనము చోటుచేసుకొని వుంది. బుజు మార్గములో పలుకుటే గాని అబద్ధాల బూజు అతికించుకోలేదు. అలా ఎందరు మాట్లాడగలరు? అవన్నీ మిత్రవాక్యాలు. సుమిత్ర వాక్యాలు. ఆమెకే అలా భాషించడం సాధ్యం.

సుమిత్ర మాటల నాలకించిన కౌసల్యకు గుండెబరువు తగ్గింది. శోకము ఉపశమించింది. శరత్కాలమేఘాలు జలమును కొద్దిగా కలిగియున్నట్లు కౌసల్య దుఃఖము బాగా క్షీణించింది.

బాధల్లో బోధలు అందించడం, ఇతరుల బరువుల్ని సునాయాసంగా దించడం, తాను కష్టాల్లో కూరుకుపోయి నపుడు కూడా అన్యులను బాధావిముక్తుల్ని గావించి సంతోషపరచడం ఎవరికి సాధ్యం? ఎవరికి సాధ్యమైనా, వారు మాత్రం ఈ ప్రపంచంలో మిత్ర బాంధవ్యానికి ప్రతీకలే. అట్టి మైత్రికి ప్రతిరూపమే సుమిత్ర.

రామాయణంలో విశిష్టమైన పాత్రలుగా మనకు తెలిసేవాటిలో సుమిత్ర ఒకటి. స్త్రీ పాత్రలలో ఇంత ఉదాత్తమైన, అమోఘమైన పాత్రను మనం అరుదుగా చూస్తాం.

సుమిత్ర పాత్ర రామాయణంలో రెండుసార్లు మాత్రమే మెరుపుతీగలాగా ప్రకాశిస్తూ భాషిస్తుంది. వనవాసానికి వెళ్ళేముందు లక్ష్మణుడు తనకు నమస్కరించి నపుడు ఒకసారి, సీతారామలక్ష్మణులు అరణ్యానికి వెళ్ళిన తరువాత దశరథుడు కౌసల్య మందిరములో పరితపించే టప్పుడు మరొకసారి సుమిత్ర అమోఘవచనాలు మనం వినగలుగుతాము.

రాముని వనవాసానికి కారణముంది. కానీ తన కుమారుడైన లక్ష్మణుడు వన వాసానికి వెళ్ళడానికి కారణ మేదైనా ఉందా? "నాయనా! ఈ సమస్య నీకు సంబంధించింది కాదు. నా ముద్దులపట్టీ! నీవెందుకు వెళ్ళాలి?" అని సుమిత్ర లక్ష్మణునితో అన్నదా? అదే సుమిత్ర గొప్పతనం. లక్ష్మణుడు నమస్కరించినపుడు దీవించి పంపింది.

తన కుమారుని వెళ్ళవద్దని కౌసల్య బ్రతిమలాడింది. రాజాజ్ఞను ప్రతిఘటించమని చెప్పింది. కానీ సుమిత్ర నోరుతెరచి ఒక్కమాట అనలేదు.

అడవికి వెళ్ళవలసిన తన కుమారుని వెళ్ళవద్దని కౌసల్య అడ్డుపడితే, వెళ్ళనవసరంలేని తన కుమారునికి అడ్డునిలవకుండా పంపింది సుమిత్ర.

అరణ్యానికి వెళ్ళడానికి లక్ష్మణుడు తల్లి దగ్గర అనుమతి తీసుకున్నట్లు గాని, ఆమె అనుమతినిచ్చినట్లు గాని మనకు రామాయణంలో గోచరించడం లేదు. వెళ్తూ వెళ్తూ నమస్కరిస్తాడు తల్లికి లక్ష్మణుడు. అంతే. తాను చరించే ధర్మమార్గానికి తన తల్లి అడ్డురాదని లక్ష్మణుని విశ్వాసం. తన బిడ్డ ధర్మమార్గముననే పయనిస్తాడు అని తల్లికి నమ్మకం. ఆహా.. తల్లి బిడ్డల మధ్య ఎంత చక్కని అవగాహన? వారిరువురిలో మనకు తెలిసేది ధర్మయుతమైన జ్ఞానము కాదు. జ్ఞానయుతమైన ధర్మము. బిడ్డను వనవాసం పంపడం దుర్భరమైన విషయమే. అయినా నిస్సంకోచంగా, సంతోషంగా పంపింది సుమిత్ర. వ్యక్తిగత సుఖాలకన్నా ఉన్నతాశయాలకే ప్రాధాన్యత నిచ్చే విశిష్టమైన పాత్ర సుమిత్ర.

కౌసల్య పూజామందిరంలో రాముడు తన రాజ్యాభిషేకవార్తను కౌసల్యతో చెప్పినపుడు సీతతోకూడా సుమిత్ర అక్కడే ఉంది. కానీ ఒక్కమాట పలకలేదు. పొంగిపోయి ఏదో ఏదో పలవరించలేదు. "లక్ష్మణా! నీకొరకే రాజ్యాన్ని అంగీకరించాను.

సర్వసుఖాలు అనుభవించు" అని రాముడు లక్ష్మణునితో చెప్పినపుడు కూడా హర్షాతిశయాన్ని ప్రదర్శించలేదు.

అంతేగాదు. వనవాసవార్త విన్నపుడు కూడా స్థిమితంగా ఉండిందేగాని మతి చెడి రోదించలేదు. సుఖదుఃఖాలలో చలించకుండా ఉండే పాత్రలు ఇప్పటికి మనకు రెండు కన్పించాయి. ఒకటి రాముడుకాగా రెండవది సుమిత్ర.

కౌసల్యాదశరథులను ఓదార్చే సందర్భంలో సుమిత్ర మరొక చక్కని విషయం చెబుతుంది. రాముడు ధర్మాత్ముడు గనుక సూర్యుడు తన తాపంతో రాముని బాధించడని, వాయువు ఆహ్లాదంగా హాయిని చేకూర్చుతుందని చెబుతుంది. **"ధర్మో రక్షతి రక్షితః"** ఎవరు ధర్మమును రక్షిస్తారో, వారిని ధర్మము రక్షిస్తుంది అనే విషయంలో పూర్తివిశ్వాసం కలిగిన పాత్ర సుమిత్ర.

ధర్మ ప్రవర్తనకు, ధర్మజీవనానికి అలవాటుపడిన సుమిత్రను కేవలం ఒక గృహిణిగా, రాణిగా చూడలేము. లక్ష్మణుని వంటి త్యాగధనుని ప్రపంచానికి ప్రసాదించిన త్యాగమయి సుమిత్ర. ఆమెది విశ్వవాణి.

కోసలదేశానికి చెందినది కనుక దశరథుని పెద్ద భార్య కౌసల్య అయింది. కేకయ దేశానికి చెందినది కనుక మరొక భార్య కైకేయి అయింది. సుమిత్ర నామధేయంలో అలాంటి పరిమిత భావాలు మనకు కనిపించవు. యావద్విశ్వానికి సంబంధించిన పౌరసత్వం ఆమెది. సుమిత్రలాంటి మహాతల్లిని కన్న భరతమాత ధన్యురాలు.

ఉన్నాము కనుక ఏదో ఒకటి మాట్లాడుకొంటూ ఉంటాము అని కొందరు కబుర్లు ఆడుతూ ఉంటారు.

మాట్లాడదగింది ఉన్నది కనుక మాట్లాడి, అది అయిపోగానే మాటలు ఆపేస్తారు మరికొందరు.

మొదటివారి వద్ద ఉన్నవి మాటలే. నీటి మూటలే.

రెండవ వారి వద్ద జ్ఞానం ఉంది. వారి మాటలు వినేవారి మనస్సులలో ఊరేగుతాయి.

అరణ్య కాండము

పసిపాపకు తల్లి ఎద
తాపసికి అడవిపాద
అవశ్యం. అనివార్యం.
తియ్యని పాలకై తల్లి పాలిండ్ల కోసం
తడుముతూ తల్లడిల్లుతుంది పసిపాప.
తీపిబ్రతుకుకై తండ్రిపాదాలను వెతుక్కుంటూ
తపిస్తాడు పసిహృదయం గల తపస్వి.

కడుపు ఆకలి తీరేది
కంటికి కునుకు పట్టేది కూనకు తల్లి ఒడిలోనే .... ఆ గుడిలోనే
ఇంద్రియ కుదుపు ఆగేది
వీర్యపాదుపు సాగేది తాపసికి వనంలోనే .... అరణ్యంలోనే

అయోధ్యను విడిచాం. అరణ్యంలో ప్రవేశిస్తున్నాం.

ఇది అరణ్యకాండము

కరుణా రసపూర్ణ సుమధుర సాధనా కాండము.

"ప్రవిశ్య" ..... "ప్రవేశించు" అంటూ ఈ కాండమును ప్రారంభిస్తున్నాడు వాల్మీకి.

జీవికి ప్రవేశద్వారము బంధమా!
అయితే, నిర్గమద్వారము మోక్షమే.

ప్రవేశ నిర్గమ ద్వారాలు రెండూ ఈ కాండములోనే గోచరిస్తాయి.
దండకావనంలో ప్రవేశం ... "తద్వనం"లో నిష్క్రమణం.
మాతృగర్భం నుండి ప్రవేశం ..... ముక్తిసౌధంలోకి నిష్క్రమణం.

ఈ మధ్య నడిచేదే అరణ్యాకాండము
అదియే జీవులకు జీవనభాండము.
ఇది అరణ్యం .... వనం.... నందనవనం..... తపోవనం....... తద్వనం.

సీతారామలక్ష్మణులు ప్రవేశించిన దండకావనం.
అత్రి అనసూయలు వీడ్కొల్పిన నందనవనం.

సుతీక్ష్ణ శరభంగ అగస్త్యాదులు వసించిన తపోవనం.
పరమపావని శబరి దర్శింపజేసిన తద్వనం.... ఇదే అరణ్యకాండము.

సాధన ప్రసూనాలను పరిమళింపజేసే కాండము.
పసిడి బ్రతుకును పల్లవింపజేసే కాండము.

ఖరదూషణులను అసురులూ ఇక్కడే
సుతీక్ష్ణ శరభంగులనే ఆచార్యులూ ఇక్కడే ....
కామం కరిగిపోవాలి అని చెప్పేందుకు రాక్షసుల వేట
ప్రేమ వెలిగిపోవాలి అని తెలిపేందుకు ఋషుల మాట.

అసురులై పుట్టి అసురులుగా అంతరించిన ఖరదూషణాదులు
అసురులై పుట్టినా ఆనందంగా తరించిన విరాధ కబంధాదులు.

వైరుధ్యమును నిర్మూలించిన విరాధుడు
బంధము వీడే మార్గము తెలిపిన కబంధుడు ....
రాక్షసవృత్తి మంచిది కాదన్న మారీచుడు.....

శరభంగుని తపస్సుతో ఆరంభం. శబరి మోక్షంతో సమాప్తం.

"నాథా! ఆ మృగాన్ని తెచ్చి నా కివ్వరాదా!
చాలా ముద్దొస్తుంది;" అంటూ ఉల్లములను ఉరకలెత్తించే మగువ మంజుభాషలు.

తరులను, విరులను వాటేసుకొని, "నా సీత ఎక్కడ?"
అని ఎద చేపే బాధతో కుదిపేసే రాముని విప్రలంభము ....

మాసాలు చెప్పుకున్నా తనివి తీరని రుచికరమైన సమాసాలు
సాహితీద్వారము తెరచి ఆకలి తీరేలా వడ్డించిన కమ్మని ఉపమాలు
కమనీయ వేదాంతాన్ని కలబోసి వాల్మీకి చక్రవాకం వార్చిన వాక్పాకం.

ఆర్తి ఆకలిని ఆర్చేందుకు
ఆదికవి చేసిన వంట లెన్నని? ......

బంధాలను విడగొట్టే పదబంధాలు
అందాలను అందించే అక్షరశిల్పాలు
సంధుల సంవిధానం కూర్చిన శిల్పవిధానం

సమకూర్చిన అక్షరసోపానాలతో అమర్చిన మధురాక్షర సౌధం.

చెట్టు పచ్చన
కోయిల నల్లన
గానము తియ్యన ....

పచ్చని కవితాశాఖలపై కూర్చుని
వెచ్చని, నులివెచ్చని పోకడలతో
వాల్మీకి కోకిల తియ్యగా పాడిన తీరు - ఆ జోరు
వర్ణించను సనకాదులే సరిపోరు.
సీతాపహరణంలో
రణం తప్పదు. అదే, -

రావణుని మరణం

మగువకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించిన జటాయువు
అసుర జీవనాన్ని ఎదిరించి ఎండగట్టుటకు వీచిన వాయువు


ఆయువు తీరిన జటాయువును
గుండె కత్తుకున్న గుణాభిరాముడు
ఎదురు చూచిన జటాయువు ఆర్తి బాపుటకా?
ఎత్తి మోసిన గరుడుని అప్పు తీర్చుటకా?


పక్షి అయితే నేమి? అక్షి చేసిన పుణ్య మెంతని?
కుక్షి శుద్ధి పడాలి. ముక్తి ముంగిట నిలవాలి.


శబరి పుణ్యలోకానికి.........
రాముడు పంపా తీరానికి ....


కుదురుతుంది వీడని పొత్తు.
ఇక వదుల్తుంది పట్టిన మత్తు.

చివరగా, మనలో మనమాట.
అయోధ్యాకాండము అంతా అయోధ్యలోనే జరుగలేదు.
అరణ్యకాండము మటుకు అరణ్యంలోనే, వనంలోనే, ఆంధ్రావనం లోనే.
అయ్యో! ఈరోజు ఏ వారము? అంటే,









"రాముని వారము" అని మునుపెవరో అన్నారట.


అదేమోగాని, మనము మాత్రము రాముని వారమే
రాముని పరివారమే
మన గమ్యము ఎప్పుడూ రామకృపా పారావారమే ....
అరణ్యకాండ మంతా ఆంధ్రావనిలోనే జరిగింది.


భవ్యమైన రామభద్రునికి
భద్రాచలమే వాసమైంది
భద్రత కుంటుపడినా - అతనికి
ఆర్ద్రత వంట బట్టింది - మనకు ....

ప్రతి పురంలో రామమందిరం
ప్రతి కాపురంలో రామనామం
తేపొస్తే 'రామా' తుమ్మొస్తే 'రామా'
ఎవరికుంది ఈ భాగ్యం. - ఆంధ్రావని సౌభాగ్యం!
చోటిచ్చిన తెలుగమ్మను మరువని రామయ్య తండ్రి
పెట్టాడు ఆంధ్రావనికి సువర్ణభిక్ష
సురులు పొందలేని భక్తిభిక్ష
రామభక్తి భిక్ష!
కనుకనే,
తెలుగువారు వెలుగువారే
రామభక్తిలో మెలుగువారే.

సుఖపడటానికి కోరికలు తీర నవసరం లేదు అనేది అర్థమైతే, ఆ తరువాత కోరికలు ఉంటే కష్టం కాదు; కోరికలు తీరకుంటే నష్టమూ లేదు. కోరుకునే శక్తి మనిషికి భగవంతుడు ప్రసాదించిన వరం. ఆ శక్తితోనే భగవంతుణ్ణి కూడా కోరుకుంటున్నాం. కోరితే తప్పు లేదు. కోరింది రాలేదని విలపిస్తే అర్థం లేదు.







ధర్మమూర్తులుగా సీతారాములు

సీతారాములు దారిలో నడుస్తున్నారు. సీతమ్మ రాముని చూచి ఊహించనిరీతిలో ఇలా భాషించింది.

"ఈ మునివృత్తి చాలా జాగ్రత్తగా ఆచరింపవలసింది. మునిధర్మం చాలా సూక్ష్మ పద్ధతిని అవలంబించి ఆచరించాలి. కామము వలన పుట్టిన వ్యసనాలకు దూరంగా ఉన్నవాడే దీనిని ఆచరించగలడు" అంటూ ప్రారంభించి మెల్లగా చెప్పసాగింది సీతమ్మ తల్లి.

సీతమ్మ రామునితో చెప్తోంది.

"కామము వలన కలిగే వ్యసనాలు మూడుగా తెలుస్తున్నాయి. మొదటిది అసత్య భాషణం. ఇది చాలా పెద్ద వ్యసనం. తక్కినవి రెండు దీనికంటె గొప్పవి. అవి పరస్త్రీ గమనము, అకారణ హింస.

"రామా! మొదటి వ్యసనమైన అసత్యభాషణము నీకు అలవడలేదు. పూర్వము నీవు ఎప్పుడూ అసత్యమాడి ఎరుగవు. ఇకముందు కూడా నీవు అబద్ధమాడవు"; అన్నది సీతమ్మ.

శ్రీరాముని లాగా ఎందరు పురుషులు భార్యల దగ్గరనుండి ఈ విధమైన యోగ్యతా పత్రాన్ని పొందగలరు? "ఆ - ఆయనంతే! పొరపాటున కూడా భార్యతో నిజం చెప్పకూడదని పెళ్ళిపీటల మీదనే ఎవరికి వినిపించకుండా లోపలే ప్రమాణం గొణిగేసుకున్నాడట. ప్రాణాన్నైనా త్యజిస్తాడు గాని నిజం మాత్రం చెప్పడు", ఇలాంటి మాటలే ఎక్కువశాతం భార్యల నుండి వింటుంటాము.

భార్యకు తనపై పూర్ణవిశ్వాసం ఉండేలా జీవించగలవాడే భర్త. మెడలో తాళికట్టడం, గుడిలో గంటకొట్టడం ఏమంత ఘనమైన కార్యం కాదు. కళా కాదు. ఎవరైనా చెయ్యొచ్చు. రామునిలా ఆదర్శాన్ని నిలుపగలవారే భర్త అనే పదానికి వన్నె తెస్తారు.

సీతమ్మ ధారావాహికంగా మాట్లాడేస్తోంది.

"రామా! మొదటి వ్యసనమైన అసత్యభాషణము నీవెలా ఎరుగవో, రెండవ వ్యసనమైన పరభార్యా గమనము నీ విషయంలో అసంభవము. పరస్త్రీ వాంఛ నీకు గతంలో కలుగలేదు. ఇప్పుడు లేదు. భవిష్యత్తులో ఉండబోదు" అన్నది సీతమ్మ.

జై జై శ్రీరామచంద్ర భగవాన్ కీ!

"రామా! నీ అర్ధాంగిని తప్ప మరొక స్త్రీని నీ మనసు వాంఛించదు. నీవు ధర్మాత్ముడవు. సత్యసంధుడవు. పితృవాక్పరిపాలకుడవు. సత్యధర్మాలు నిన్నే ఆశ్రయించి ఉన్నాయి. నీవు జితేంద్రియుడవు.

"రామా! ఇంతవరకు నీలో ఈ మూడు వ్యసనాలు ఉండేవి కావు. కానీ నేడు వనవాస సమయాన ఆకస్మికంగా మూడవ వ్యసనము నీకు కల్గింది. అదియే నిష్కారణ హింస, నిర్హేతుక శత్రుత్వము.

"దండకారణ్యములోని సాధువులను రక్షించుటకు రాక్షసులను వధిస్తానని నీవు ప్రతిజ్ఞ చేశావు. ఇప్పుడు నీ మనస్సు ఆ విషయమునందే లగ్నమై ఉంది. ఈ విషయము నా మనసును కలత పెడ్తూ వుంది. సదా అన్ని విధాల నీ క్షేమాన్నే ఆశించు నా మనస్సు తీవ్రంగా వ్యథ చెందుతూ వుంది.

"రామా! నీవు దండకారణ్యంలో ప్రవేశించుట నాకు సమ్మతం కాదు. కారణం కూడా చెప్తాను. విను. దండకారణ్యంలో ఎదురుపడిన క్రూరమృగాలను చూసి వాటిపై బాణాల్ని సంధించకుండా ఉండగలవా? రాక్షసుల్ని సంహరించకుండా ఉండగలవా?

"అగ్నికి దగ్గరగా వున్న కట్టెలు అగ్ని యొక్క తేజస్సును, బలాన్ని వృద్ధి చేస్తాయి. అలాగే క్షత్రియునికి దగ్గరగా వున్న ధనుర్బాణాలు అతని తేజోబలాలను పెంపొందిస్తాయి. దీనికి ఒక చిన్న ఉపాఖ్యాన ముంది. అది కూడా చెబుతాను.

"పూర్వము ఒక పవిత్రమైన ఆశ్రమం ఉండేది. ఆశ్రమవాసియైన ముని సత్యమునే పలుకుచుండేవాడు. ఆ ఆశ్రమ సమీపంలో మృగాలు, పక్షులు కూడా నిర్భయంగా చరిస్తూ ఉండేవి.

"ఒకనాడు ఆ మహర్షి తపస్సును భగ్నం చేయాలని సంకల్పించిన ఇంద్రుడు భటుని రూపమును ధరించి, చేతిలో ఖడ్గమును పట్టుకొని ఆశ్రమానికి వచ్చాడు. "మహాత్మా! నేను మళ్ళీ వచ్చి తీసుకుంటాను. అంతవరకు ఈ ఖడ్గాన్ని మీ దగ్గర దాచండి" అని చెప్పి దానిని మునికి ఇచ్చి వెళ్ళాడు.

'ఇక అప్పట్నుంచి తన విశ్వాసాన్ని ఋజువు చేసుకొనే ప్రయత్నంలో ఆ ఖడ్గాన్ని వదలిపెట్టకుండా చేతపట్టుకొనే తిరిగేవాడు ఆ మహర్షి.

"ఎప్పుడూ ఖడ్గాన్నే పట్టుకొని తిరగడం వల్ల క్రమేపి తపస్సు క్షీణించింది. వీరకృత్యాలు సాగించాలనే ఉబలాటం కలిగింది. అంతే. స్వధర్మం పూర్తిగా పోయింది. వీరకృత్యాలు - ఘోరకృత్యాలై దుర్భర నరకాన్ని ప్రసాదించాయి.

"అగ్ని సంబంధము ఎలా ప్రమాదకరమో శస్త్ర సంబంధము కూడా ప్రమాదకరమే. రామా! ఈ ఉపాఖ్యానముగాని, శస్త్రముల విషయంగాని నీకు తెలియదని నా ఉద్దేశ్యం కాదు. నీ యందు నాకు గల గౌరవము, ప్రేమలే నాచే ఇలా మాట్లాడించాయి."

"రామా! నీకు, దండకారణ్యంలోని రాక్షసులకు ఏవిధమైన వైరమూ లేదు. వారిని నిష్కారణంగా నీవు చంపాలని నిర్ణయించుకోవడం నాకు నచ్చడం లేదు. నీకు అపరాధం చేయని వారిని చంపడం మంచిది కాదు. స్వధర్మాన్ని అనుష్ఠించే క్షత్రియులకు ఆర్తరక్షణం కొరకు ఆయుధాలు ఉపకరించాలి.

క్వచ శస్త్రం క్వచ వనం క్వచ క్షాత్రం తపః క్వచ

"ఆయుధ మెక్కడ? అరణ్య మెక్కడ? క్షత్రియధర్మము ఎక్కడ? తప స్సెక్కడ? రామా! ఇదంతా పరస్పర విరుద్ధము. చూడు. ఆయుధము పట్టడం వల్ల మనసు వికారం చెందుతుంది. మనం తిరిగి అయోధ్యకు వెళ్ళిన తరువాత అక్కడ ఆయుధాలు ధరించవచ్చు.

"నీవు అయోధ్యను వదలి మునివలె అరణ్యానికి వచ్చావు. నీవు మునివృత్తిలోనే జీవించాలి. అప్పుడు అత్తమామల మాటను నిలబెట్టిన వాడవు అవుతావు.

ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ప్రభవతే సుఖమ్
ధర్మేణ లభతే సర్వం ధర్మసార మిదం జగత్

"ధర్మము వల్లనే సంపద కల్గుతుంది. ధర్మము వల్లనే సుఖం లభిస్తుంది. ధర్మము వల్లనే సమస్తమూ సిద్ధిస్తుంది. ఈ ప్రపంచమంతా ధర్మసారమే.

"తపో నియమాలను, వ్రతధర్మాలను పాటిస్తూ శరీరాన్ని కృశింపచేసుకొని ధర్మరతులైన వారు ధర్మాన్ని సంపాదించుకుంటారు. అంతేగానీ కేవలం సుఖించడంవల్ల సుఖం లభించదు **(న సుఖా ల్లభ్యతే సుఖమ్).**

"రామా! నిర్మలుడవై నిత్యమూ ధర్మాన్ని అనుష్ఠించు. నీకు త్రిలోకములయందు తెలియనిది లేదు. నీకు ధర్మాధర్మాలు బోధించే శక్తిసామర్థ్యాలు ఎవరికున్నాయి? సహజంగా స్త్రీకి ఉండే చపలత్వం చేత ఇదంతా చెప్తున్నాను. నీవు ఆలోచించు. లక్ష్మణుని కూడా సంప్రదించు. ఏది నీకు నచ్చితే అది ఆచరించు" అని ప్రథమంగా సీతమ్మ సుదీర్ఘంగా భాషించింది.

సీతమ్మకి భర్తయందు గల భక్తి ఎలాంటిదో, ఏపాటిదో రామునికి తెలుసు. పతిభక్తిని విడువకుండా సీతమ్మ పలికిన ధర్మవచనాలకు సంతసించిన శ్రీరాముడు సీతమ్మతో మెల్లగా ఇలా చెప్పాడు.

"జానకీ! నీవు ధర్మజ్ఞురాలవు. నాపై నీకున్న ప్రేమను అభివ్యక్తం చేస్తూ, కుల మర్యాదను వృద్ధిచేసే విధంగా నీవు పలికిన హితవాక్కులు చాలా చక్కగా ఉన్నాయి.

"కానీ ఆర్తరక్షణం కొరకు శత్రువులు ఆయుధాలు ధరించాలని నీవే చెప్పావు. ఇక నేను ఆలోచించవలసింది, చెప్పవలసింది ఏముంది?".

"సీతా! దండకారణ్యంలో వసించు మునులు ఇతరులకు శరణ మివ్వగలవారు. అట్టివారు ఆర్తులై నన్ను శరణుజొచ్చారు. వారు ధర్మమూర్తులు. సాత్త్వికులు. క్రూరులైన రాక్షసులవల్ల చాలా భీతి చెందియున్నారు. మాంసభక్షకులైన రాక్షసులు వీరిని చంపి తింటున్నారు.

"మునులు నన్నాశ్రయించారు. అనుగ్రహించమని ప్రార్థించారు. నేను వారి పాదములను స్పృశించి ఇలా ప్రతిజ్ఞ చేశాను" అని రాముడు జరిగిన విషయమునంతా మళ్ళీ సీతకు చెప్పాడు.

అరణ్యకాండము ప్రారంభములోనే కదా ఇదంతా జరిగింది. ఇప్పుడే కొన్ని సర్గల ముందు ముగిసిన సంభాషణమును మళ్ళీ తిరిగి రాముడు సీతకు చెప్పడమేమిటి? ఇదంతా సీతకు తెలిసిన విషయమే కదా? అనే సందేహము మీకు రావచ్చు.

రాముడు అసందర్భంగా, పెంచుకుంటూ మాట్లాడే స్వభావం కలవాడని గాని, లేక సీతమ్మకు మరచిపోయే స్వభావ ముందనిగాని అర్థరహిత పరిశోధనలను ఇక్కడ మనం చేయనవసరం లేదు.

చెప్పిన విషయాన్నే పునరుక్తి లేకుండా చెప్పగలగడం వాల్మీకిలోని ప్రత్యేకత. అయోధ్యాకాండములో సీతాస్వయంవర వృత్తాంతాన్ని సీతమ్మ అనసూయాదేవికి చెప్పినపుడు వాల్మీకి అనుసరించిన నాటకీయత, విషయ విశ్లేషణము ఎంత నవ్యంగా, సవ్యంగా, భవ్యంగా, దివ్యంగా సాగిందో అక్కడ మీకు తెలిపియున్నాను. *

ఈ సందర్భంలో కూడా అనేక నూతన విషయాల్ని రాముడు ప్రస్తావిస్తూ భాషించడం మీరు చూస్తారు. అంటే, నూతన విషయాన్ని నాటకీయత కొరకు, వైశిష్ట్యము కొరకు వాల్మీకి ప్రవేశ పెట్టాడా? అనే సందేహము కూడా మీకు రావచ్చు.

అలాంటి సందేహానికి కూడా అవకాశము లేదు. ఎందుకంటె, ప్రస్తుతము శ్రోతగా వింటున్న సీతమ్మ పూర్వము ఈ విషయాల్ని ఆలకించి ఉంది. లేని విషయం ప్రవేశిస్తే ఆమెయొక్క పూర్వపక్షానికి గురికాక తప్పదు.

కాకపోతే, ఉన్న విషయాన్నే సందర్భానుసారంగా, విభజించి రచించడం, పాత్రలచేత పలికించడం వాల్మీకిలోని అసమాన రచనా చాతుర్యం. ఆదికవిగా తాను చేసిన ఈ ప్రయోగాన్ని ఈనాటికీ కనీసం అనుకరించే స్థాయికి కూడా కవితాలోకం చేరుకోలేక పోయింది అనే విషయం గమనార్హం. ఇక రాముడు చెప్పేది విందాం.

"సీతా! ఎవరివద్దకు వెళ్ళి అనుగ్రహించమని నేను ప్రార్థించాలో అట్టివారు నా వద్దకు వచ్చి నన్ను ప్రార్థించడం చాలా సిగ్గుపడాల్సిన విషయం.

"నేను మీకు ఏ సేవ చేయాలి? అని నేను వారిని అడిగాను. వారిలా పలికారు. "రామా! సమయాల్ని అనుసరిస్తూ నియమాల్ని పాటించే ఋషుల్ని రాక్షసులు వధించి భక్షిస్తున్నారు. రామా! ఆ రాక్షసులు ఇష్టము వచ్చిన రూపాన్ని ధరిస్తారు. మమ్మల్ని హింసిస్తారు. అంతేకాదు. హోమములు చేయునపుడు, పవిత్ర సమయాలయందు వచ్చి మమ్మల్ని పీడిస్తారు."

"రామా! మేము తాపసులము. శక్తిహీనులము కాము. రాక్షసులను మేమే వధించ గలము. అది మా తాపస జీవనానికి తగదు.

* స్వామీజీ రచించిన "చైతన్య రామాయణం" చూడండి.

"రాఘవా! తపస్సనేది సులభసాధ్యమైన విషయం కాదు. తపస్సుకు ఎన్నో అవరోధాలు కలుగుతూ ఉంటాయి. ఈ కారణంగా రాక్షసులు మమ్మల్ని భక్షిస్తున్నా, శక్తి కలిగి కూడా అశక్తులవలె పడియున్నాము. శాపం పెట్టలేక పోతున్నాము. కనుక నీవు సోదరప్రేమతో మమ్మల్ని రక్షించు. మాకు రక్షకుడివి కా! అన్నారు మునులు", అని సీతమ్మతో జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ పలికాడు రాముడు. విషయ వివరణములో వాల్మీకి నాటకీయతను మీరు గుర్తించే ఉంటారని భావిస్తాను. అక్కడ చెప్పని నూతన విషయాల్ని ఎంత చక్కగా ప్రస్తావించాడో మీరు ఈ పాటికి గమనించే ఉంటారు. లేదా, మరొక్కసారి చదివి పోల్చుకోండి.

రాముడు సీతమ్మతో చెప్పున్నాడు.

"సీతా! మునుల ప్రార్థనను ఆలకించిన నేను వారిని రక్షిస్తానని మాట ఇచ్చాను. వారికిచ్చిన మాటను నాలో ప్రాణాలున్నంతవరకు తప్పను. నాకు సత్యం ప్రాణంకన్నా ముఖ్యమైనది. మధురమైనది.

అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే స లక్ష్మణామ్
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః ॥

"సీతా! ప్రాణాల్నిగాని, లక్ష్మణునిగాని, నిన్నుగాని విడిచిపెట్టగలను. కానీ చేసిన ప్రతిజ్ఞను, ముఖ్యంగా బ్రహ్మజ్ఞానము గల మహితాత్ములకు చేసిన ప్రతిజ్ఞను విడువలేను.

"సీతా! వాళ్ళు నన్ను అర్థించకపోయినా వారిని రక్షించవలసిన బాధ్యత నా మీద ఉంది. వారికి మాట ఇచ్చిన తరువాత వేరే చెప్పాలా?"

"సీతా! నీకు ఏ దోషం తెలియదు. నీవు సహృదయురాలవు. నామీద గల విశేష ప్రేమచేత అలా పలికావు. చాలా సంతోషంగా వుంది. సీతా! ఇష్టంలేని వారికి ఎవ్వరూ చెప్పరు కదా! **(న హ్యనిష్టోఽ_ను శిష్యతే).**

"సీతా! నీవు నా సహధర్మచారిణివి. నా ప్రాణములకంటే నీవే అధికము;" అని పలికి సీతాలక్ష్మణులతో కలిసి ధనుర్ధారియైన రాముడు దండకారణ్యంలో ముందుకు సాగిపోయాడు.

ఈ సందర్భములో సీతారాముల్ని మనం చక్కగా అర్థం చేసుకొని మన జీవితాల్ని సరిజేసుకోవాలి. సీతమ్మ ధర్మాన్ని గూర్చి, రాముని అకారణ హింసను ఖండిస్తూ ఎంతగానో వాదించింది. రాముడు ఎంత ఓపిగ్గా విన్నాడు? మరొక భర్త అయితే "నీకేం తెలుసని నాకు చెప్పొచ్చావు? నన్ను చవటని భావించావా? బయట ఎంతెంతవారో నన్ను చూసి నోరు కదపరు. మెదపరు" అంటూ ఎంత చెత్తను నెత్తికెత్తేవాడో? అలా పాడైపోతాయి కుటుంబాలు మాట్లాడడం చేతకాక.

సహధర్మచారిణి అయిన భార్య భర్త విషయంలో చక్కని సలహాదార్లై ఉండాలి. ఒకవేళ భార్య అంతటి జ్ఞానవంతురాలు కాకపోవచ్చు. అంతమాత్రాన జీవితంలో తీసుకొనే

అతి ముఖ్యమైన నిర్ణయాలలో ఆమె మరుగున పడకూడదు. ధర్మపత్నికి లేని జ్ఞానాన్ని సమకూర్చి ఆమె తనకు సహకరించేలా చేసుకొనే బాధ్యత కూడా భర్తకు సంబంధించిందే.

ఇంతకీ సీత చెప్పినట్లు రాముడు విని ఆచరించాడా? లేదు. ఆమె మాటలను శ్రద్ధగా విన్నాడు. కానీ తన నిర్ణయమే సముచితంగా ఉన్నందున ఆమె సలహా పాటించ లేదు.

జీవిత భాగస్వామిని యైన భార్యకు ఆర్షసంస్కృతిలో ఎలాంటి స్థానం ఇవ్వబడిందో గుర్తించమని మీకు నేను మనవి చేస్తున్నాను. ధర్మాత్ముడైన రాముని నిర్ణయం తనకు నచ్చలేదంటూ సీతమ్మలాంటి మహాసాధ్వి భాషించడం మీకు ఆశ్చర్యంగా లేదూ? మన సంస్కృతిలో స్త్రీకి వాక్స్వాతంత్ర్యం ఉందో లేదో ఆలోచించండి. రామాయణ కాలంలోనే సీతమ్మ అంత చక్కగా తన వాదాన్ని వినిపించింది. రాముడు శ్రద్ధగా ఆలకించడం కూడా జరిగింది. ఇదంతా వాక్స్వాతంత్ర్యము లేకుండా జరిగిందంటారా? లేక, ఈరోజుల్లో భార్య విభేదించి పలికే వాక్యాలను రామునిలాగా ప్రశాంతంగా ఆలకించే భర్తలు ఎందరుంటారు? మన సంస్కృతిలో మాత్రమే స్త్రీకి పురుషునితో సమానంగా జీవించే హక్కు ప్రసాదించబడింది.

ఏదో ఏదో చేసేవాడు
ఏదో చేయమని చెప్పేవాడు

ఏది చేయాలో
ఏది ఆలోచన చేయాలో చెప్పేవాడు ప్రచారకుడు.

ఎలా చేయాలో చెప్పేవాడు
ఎందుకు చేయాలో చెప్పేవాడు ప్రబోధకుడు.

ప్రచారము కర్మ. ప్రబోధము జ్ఞానం.
జ్ఞానం లేని కర్మ తిమిరమే.
జ్ఞానం కలిగితే కర్మ తేజమే.

జటాయువు కైవల్యము

ప్రాణాపాయ స్థితిలో పడియున్న జటాయువు నోటినుండి రక్తము స్రవిస్తోంది. నురుగు జారుతోంది. జటాయువు రామునితో మెల్లగా ఇలా పలికింది.

"రామా! గొప్పదైన ఓషధిని అన్వేషించునట్లు ఏ దేవిని నీవు వెదకుచున్నావో, ఆ దేవిని, ఆమెతోపాటు నా ప్రాణాల్ని కూడా రావణుడు తీసికొనిపోయాడు.

"రామా! నీవు, లక్ష్మణుడు లేని సమయం చూసి, దుష్టుడైన రావణుడు సీతను అపహరించాడు. అది చూసిన నేను ఆ దుష్టుణ్ణి నివారించాను. నిరోధించాను. వాడితో పోరాడాను.

"రామా! అది నేను విరిచేసిన ధనుస్సు. అదిగో నేను విరగగొట్టిన కవచము, రథమూ. అక్కడ పడియున్న సారథిని కూడా నేనే చంపాను. చివరగా అలసిపోయిన నన్ను రావణుడు ఖడ్గముచే ఖండించాడు.

"నా రెక్కలను ఖండించి, సీతను ఎత్తుకొని ఆకాశమార్గాన వెళ్ళాడు. రాక్షసునిచే వధించబడి ప్రాణం పోయే పరిస్థితిలో ఉన్నాను" అని జటాయువు హీనస్వరంతో పలికింది.

సీత వార్తను తెలిపి, మరణయాతనను అనుభవిస్తున్న జటాయువును చూచి రాముడు కన్నీళ్ళు కార్చాడు. ధనుర్బాణాలను క్రింద పడేసి రెండు చేతులతో జటాయువును కౌగిలించుకున్నాడు. ఏడుస్తూ నేలపై పడ్డాడు. జటాయువును చూపి రామలక్ష్మణులు ఇద్దరూ దుఃఖించారు. రాముడు లక్ష్మణుని చూచి ఇలా పలికాడు.

రాజ్యం భ్రష్టం వనేవాసః సీతా నష్టా పితా మృతః
ఈ దృశీయం మమాలక్ష్మీః నిర్దహేదపి పావకమ్ ॥

"రాజ్యం పోయింది. వనవాసము ప్రాప్తించింది. సీత అపహరించబడింది. ఇప్పుడు మన తండ్రి జటాయువు మరణించాడు. లక్ష్మణా! నా దురదృష్టాన్ని చూశావా! అది అగ్నిని కూడా దహించే స్థితిలో ఉంది.

"నాయనా! నేను అగ్నిలో దూకినా మరణిస్తాననే నమ్మకం లేదు. ఆ అగ్నికూడా చల్లబడవచ్చు. సౌమిత్రీ! సాగరాన దూకినా ప్రయోజనం లేకపోవచ్చు. నా స్పర్శవల్ల సముద్రము ఎండిపోవచ్చు.

"లక్ష్మణా! నన్ను ఎన్ని కష్టాలు చుట్టుముట్టాయి. నాలాంటి దురదృష్టవంతుడు ప్రపంచంలో ఉంటాడా? నావల్లనే కదా తండ్రిలాంటి ఈ జటాయువు మరణిస్తున్నాడు. నాయనా! సౌమిత్రీ! అందరినీ పోగొట్టుకుంటున్నాను. నిన్ను కూడా దూరం చేసుకుంటా నేమో!" అంటూ రాముడు భోరున విలపించాడు.

రామలక్ష్మణులు తండ్రిని కౌగిలించుకున్నట్లు జటాయువును పట్టుకొని పెద్దగా రోదించారు. జటాయువు దేహాన్ని ప్రేమతో నిమిరారు. తడిమారు. "తండ్రీ! నా ప్రాణ సమానురాలైన సీత ఎక్కడుంది?" అని రాముడు జటాయువును అడిగాడు.

జటాయువు మాట్లాడలేక పోతున్నది. "లక్ష్మణా! జటాయువు ప్రాణాలు దుర్బల మయ్యాయి. దేహంలో నిలువలేక పోతున్నాయి. ఏ క్షణమైనా ఎగిరిపోయేలా ఉన్నాయి.

"కంఠస్వరం బాగా క్షీణించింది. నాకు సహాయం చేయాలని పోరాడి, రాక్షసునిచే హతుడై, అన్నిటికన్నా తియ్యనైన ప్రాణాలను విడిచేందుకు సిద్ధంగా ఉన్నాడు.

"ఓ జటాయూ! ఓ తండ్రీ! నీవు మాట్లాడగలిగితే సీత విషయము ఒక్కసారి చెప్పు. నీవు ఎలా వధించబడ్డావో మరొక్కసారి చెప్పు; రావణుడు సీతను ఎందుకు అపహరించాడు? నేను అతనికి ఏమి అపకారం చేశాను?" అని రాముడు ప్రశ్నించాడు.

జటాయువు మెల్లగా కళ్ళు తెరచి సెలయేళ్ళవలె అశ్రువులను స్రవిస్తున్న రాముని కళ్ళల్లోకి చూస్తూ, "రామా! రావణుడు సీతను ఆకాశమార్గాన హరించాడు. నేను యుద్ధం చేసి అలసిపోయి ఉన్న సమయంలో రావణుడు నా రెక్కలు ఛేదించాడు. సీతను తీసికొని దక్షిణదిక్కుగా పారిపోయాడు.

"రామా! నా ప్రాణాలు అల్లాడుతున్నాయి. నాకేమీ కనిపించడం లేదు. మృత్యు శకునాలు తెలుస్తున్నాయి.

"రామా! రావణుడు సీతను విందముహూర్తములో హరించాడు. ఆ ముహూర్తములో అపహరించబడిన సంపద త్వరలోనే యజమానికి చేరుతుందని శాస్త్రవచనము. అది రావణునికి తెలియదు.

"రామా! సీతను అపహరించిన రావణుడు గాలమును మ్రింగిన చేప లాంటివాడు. వాడు తొందరగా నశిస్తాడు. నీవు దుఃఖించకు. వాణ్ణి నీవు యుద్ధములో సంహరిస్తావు. సీతను పొందుతావు" అని మాట్లాడుతున్న జటాయువు నోటి నుండి రక్తము స్రవించసాగింది.

"రామా! రామా! రామా! రావణుడు విశ్రవసుని కొడుకు. కుబేరుని సవతి సోదరుడు. రామా! రామా! రామా! రా....!" అంటూ కళ్ళు త్రిప్పేసి, మెడను వంచేసి, జటాయువు ప్రాణాలు విడిచేసింది.

రాముడు దుఃఖంతో కుమిలిపోయాడు. "లక్ష్మణా! మన తండ్రి మనల్ని వదలిపెట్టి వెళ్ళాడు. దండకారణ్యంలో హాయిగా జీవిస్తూ ఉండిన నాయన నావల్లే మరణించాడు. నాకు మేలు చేయాలని తాను మరణాన్ని కౌగిలించుకున్నాడు.

"లక్ష్మణా! దశరథుడు నాకు ఏవిధంగా పూజ్యుడో ఈ పక్షిరాజు కూడా అంతే. చూశావా! నాయనా! ఇద్దరి మరణానికి నేనే కారణమయ్యాను. నాలాంటి దురదృష్టవంతు డుంటాడా? తండ్రుల మరణానికి కారకుడైన కుమారుడుగా మిగిలిపోయాను.

సర్వత్ర ఖలు దృశ్యన్తే సాధవో ధర్మచారిణః
శూరాః శరణ్యాః సౌమిత్రే తిర్యగ్యోనిగతే ష్వపి ॥

"లక్ష్మణా! చూశావా! శూరులు, శరణ్యులు, ధర్మాత్ములు, సాధువులు పక్షి జాతిలో కూడా కనిపిస్తున్నారు కదూ!

"లక్ష్మణా! జటాయువు మరణం నన్ను కృంగదీస్తున్నది. పైగా నా కొరకు మరణించాడనే బాధ నన్ను తీవ్ర దుఃఖానికి గురిచేస్తున్నది. జటాయువు మరణంలో ఈ క్షణాన నాకు కలిగిన దుఃఖం సీతాపహరణము వల్ల కూడా కలుగలేదు. సీతా వియోగము కంటే జటాయువు మరణమే నాకు దుర్భరంగా ఉంది.

"నాయనా! లక్ష్మణా! కట్టెలు తీసికొనిరా! అగ్నిని ప్రతిష్ఠించు. నాకొరకు ప్రాణాలు విడిచిన తండ్రికి దహనసంస్కారము చేస్తాం"; అన్నాడు రాముడు.

లక్ష్మణుడు కట్టెలు తెచ్చాడు. అగ్నిని మథించాడు. రామలక్ష్మణులు జటాయువును చితిపైకి ఎక్కించారు. ఏడుస్తూ చితికి నిప్పంటించారు. బంధువుల్లా దుఃఖిస్తూ, చూస్తూ నిలబడిపోయారు.

మంటలు లేచాయి. జటాయువు కాలిపోతూ ఉంది. రామునిలో ఆరని మంటలు లేచాయి. "తండ్రీ! పోతున్నావా! ఇక నీ రూపం మాకు కనిపించదు కదూ" అని రాముడు తనలో తాను మాట్లాడుకుంటూ దగ్ధమవుతున్న జటాయువు దేహాన్ని చూస్తూ ఆగని కన్నీటిని స్రవింపచేస్తున్నాడు.

ఏనాటి బంధమో ఇది! ఏ జన్మ సంబంధమో! విడదీయలేని అనుబంధం ఋణాను బంధమో! ప్రేమానుబంధమో!

పుట్టిందెక్కడో! పెరిగిందెక్కడో? జాతి ఏమిటో? గోత్ర మేమిటో? రాముణ్ణి తలుస్తూ కన్నతండ్రి దశరథుడు మరణించాడు. రాముణ్ణి తిలకిస్తూ కనని తండ్రి జటాయువు కన్ను మూసాడు.

జటాయువు మరణమే రాముని ఎక్కువగా క్రుంగదీసింది. జటాయువు కొరకు తన కళ్ళలో ఎంతకాలంగా ఈ కన్నీళ్ళు కాపురముంటున్నాయో? లోకానికి, శోకానికి వీడని బంధం ఉందని బోధించే కన్నీళ్ళు కులగురువులే కదూ!

వాడుక లేదుగాని, ఏడుపులో ఎంత వేడుక ఉంది. ఎంత తియ్యదనముంది. లేకుంటే అందరూ ఎందుకు ఏడుస్తారు? రాముడు కూడా ఏడుస్తున్నాడే! రాముణ్ణి కూడా ఏడిపించే ఓ ఏడుపా! నువ్వు ఏడిస్తే ఎలా ఉంటుందో! నిన్ను ఏడిపించాలని కాదు గాని, నీలా ఏడవగలమో లేదో చూడాలని. అంతే.

జటాయువు కాలిపోయింది. బొందె పోయింది. బూడిద మిగిలింది. యుగాలు జీవించినా క్షణాల్లో అదృశ్యం కావలసిందే కదూ!

కొందరు ఉండి ఏడిపిస్తే, కొందరు పోయి ఏడిపిస్తారు. అందరూ ఏడిపించేవారే. వేడుక చూసేవారే.

జటాయువు అరవై వేల సంవత్సరాలు జీవించింది. ఎంత పుణ్యం చేసిందో పోయేముందు రాముని సహచర్యాన్ని పొందింది. చివరి క్షణంలో రాముని కోసం పోరాడింది. ధర్మం కోసం శ్రమించింది. అసువులు బాసింది. అయితేనేమి?

పోయేందుకు వచ్చిన దేహం ఎలాగూ నిలవదు. రాలిపోయేముందు రామదర్శనం ఎంతమందికి లభిస్తుంది? రాముని ఒడిలో మరణం ఎవరికి ప్రాప్తిస్తుంది?

కోమల చిత అతి దీనదయాలా! కారన బిను రఘునాథ కృపాలా
గీధ అధమ ఖగ ఆమిష భోగీ! గతి దీన్హి జో జాచత్ జోగీ!
సునహు ఉమా తే లోగ్ అభాగీ! హరి తజ హోహిం బిషయ అనురాగీ!

"పార్వతీ! రాముని చిత్తము కోమలము. రాముడు దీనదయాళుడు. వారిది నిర్హేతుక కటాక్షము. గ్రద్ద నీచమగు పక్షి. మాంసాదులను భక్షిస్తుంది. అయినా రాముని కృపకు పాత్రురాలై యోగులు పొందలేని ఉత్తమగతిని పొందింది. ఉమా! అలాంటి రాముని చరణకమలములను త్యజించి విషయానురక్తి గల మానవుడు ఎంత దురదృష్టవంతుడు?" అని శివుడు పార్వతితో చెప్పినట్లు తులసీదాసు రామచరిత మానసంలో తెలుపుతాడు.

రెక్కలు తెగిపడియున్న జటాయువును సీతమ్మ హృదయానికి హత్తుకొని "తండ్రీ! అంటూ దుఃఖించింది. ప్రాణం విడిచేముందు రాముడు జటాయువును తన ఒడిలో పెట్టుకొని దుఃఖిస్తున్నాడు. జటాయువు భాగ్యమే భాగ్యము!

రాముడు వెళ్ళి రెండు పెద్ద మృగాలను చంపి తెచ్చాడు. మృగమాంసాన్ని తీసి, దర్భలు భూమి మీద పరచి, ఆ మృగమాంసాన్ని జటాయువుకు పిండప్రదానం చేశాడు రాముడు.

ఏ మంత్రమును ఉచ్చరించడము వలన స్వర్గప్రాప్తి కలుగుతుందో, పితృదేవతలకు సంబంధించిన అట్టి మంత్రాన్ని రాముడు పలికాడు.

రామలక్ష్మణులు గోదావరికి వెళ్ళి జటాయువుకు జలతర్పణా లిచ్చారు. జటాయువు ఉత్తమగతిని పొందినట్లు వాల్మీకి వర్ణించాడు.

స గృధ్రరాజః కృతవా న్యశస్కరం సుదుష్కరం కర్మ రణే నిపాతితః
మహర్షి కల్పేన చ సంస్కృత స్తదా జగామ పుణ్యాం గతిమాత్మనః శుభామ్ ॥

దుష్కరమైన, కీర్తిదాయకమైన పని చేసి, యుద్ధములో ప్రాణాలు విడిచింది జటాయువు. అట్టి జటాయువుకు మహర్షి వంటి రాముడు సంస్కారములు చేయుట వలన జటాయువు పుణ్యప్రదమైన, మంగళప్రదమైన లోకాలకు వెళ్ళింది.

జటాయువు వృద్ధజీవి. అయినా యువకునిలాగా రావణునితో పోరాడింది. ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా హోరాహోరీగా తలపడింది. రావణుని తీవ్రంగా గాయపరచింది. ఆ ధర్మపోరాటంలో ప్రాణాలు పోగొట్టుకుంది.

ఇది మన ప్రాచీన భారతీయ సంస్కృతీ వైభవము. సమాజంలో ఒక స్త్రీకి జరిగే అన్యాయాన్ని పక్షి కూడా ప్రతిఘటించింది. ఆ మహాకార్యంలో అసువులు బాసింది.

ఈ రోజు ఆ పరిస్థితి ఉందేమో ఆలోచించండి. ఎవరికి అన్యాయం జరిగినా దిక్కులేదు. స్త్రీలకు ప్రత్యక్షంగా అన్యాయం జరుగుతున్నా కళ్ళప్పగించి చూచే స్థితికి దిగజారిపోయాం. ప్రతిఘటించే శక్తి లేని దుర్బలుల మయ్యాం.

స్వేచ్ఛగా కళాశాలలకు వెళ్ళలేని విద్యార్థినులు, కార్యాలయాలకు వెళ్ళలేని మహిళలు, రాత్రిపూట ఒంటరిగా ఇంటికి రాలేని గృహిణులు ఎంతటి మానసిక వ్యథకు గురిఅవుతున్నారో సానుభూతితో ఆలోచించే హృదయాలే లేకుండా పోయాయి. పైగా మానభంగాలు, మారణహోమాలు దినచర్యలుగా మారిపోయాయి.

జటాయువు లాంటి యువకులు నేడు అవసరం. సంస్కృతిని రక్షించే వ్యక్తులు నేడు సమాజానికి కావాలి. ధర్మపోరాటానికి సిద్ధపడే మనస్తత్వాలు తయారు కావాలి. ఈ వీరజటాయువు గాథ పాఠకులలో సామాజిక చైతన్యాన్ని జాగృతం చేస్తుందని విశ్వసిస్తున్నాను.

చెప్పినంత మాత్రాన ఒకరు చూసింది మరొకరు చూడలేకపోవచ్చు. చెప్పిన వ్యక్తిపై విశ్వాసముంటే అతను చెప్పింది నిజమని నమ్మవచ్చు. కాని, నమ్మకాలు అజ్ఞానాన్ని వమ్ము చేయలేవు.

సూర్యోదయం జరగటం లేదని, సూర్యుడు స్వయం ప్రకాశమే నని, సదా ప్రకాశరూపుడే నని ఒకరికి అర్థమయ్యేలా మరొకరు చెప్పగలిగితే, ఆ తరువాత విన్నవాడికి సూర్యోదయం గోచరించవచ్చు. కాని, ఉదయాస్తమయాలు సూర్యునికి లేవు అనే అతని జ్ఞానాన్ని ఎవ్వరూ వమ్ము చేయలేరు.

మాయ, మిథ్య
మనసు, మహి - లాంటివి ఉన్నా, అర్థమైనపుడే లేనివిగా ఉంటాయి.

పరమపావని శబరి

అది పంపాసరోవరం. ఎందరో మహర్షులు చరించి తరించిన పుణ్యస్థలం. మహోన్నత వృక్షాలతో, మనోహరమైన లతలతో నయనానందమును కూర్చే ఆ పుణ్య భూమి నందనవనంలా శోభిస్తోంది.

దివ్య పరిమళాలను వెదజల్లు తెల్లకలువలు, ఎఱ్ఱతామరలు, నల్లకలువలతో రంగురంగులుగా ప్రకాశించే ఆ పంపాసరోవరము అందమైన తివాసీలా తెలుస్తోంది. సుమపరిమళంతో, తియ్యని జలముతో పంపాసరోవరం ఆశ్రితులను ఆనందింప చేస్తోంది.

పంపాతీరాన పుష్పించిన మామిడి వృక్షాలూ, పొన్నచెట్లు, జాజితీగలు, మఱ్ఱి చెట్లు, మల్లెపొదలు, మొగలి డొంకలు, దానిమ్మచెట్లు విరగబూసి ఉన్నాయి. జోరుగ కాసి ఉన్నాయి. పుష్కలంగా పండి ఉన్నాయి.

తేనె లొలుకు తియ్యమామిడి చెట్లను చూస్తూ, నిర్మలమైన వనంలో నిర్భయంగా చరించే మృగ సమూహాన్ని వీక్షిస్తూ, రామలక్ష్మణులు రమ్యమైన మతంగ మున్యాశ్రమం చేరారు. వివిధ వృక్షాలచే కప్పబడి, పారిజాత సుమ సౌరభంతో శోభించే ఆ పవిత్ర పుణ్యాశ్రమంలో వసించే శబరిని చూశారు రామలక్ష్మణులు.

మల్లెల తెల్లదనంతో మనసు కలిపి వచ్చిన నల్లనయ్యను, తేనె తీపి కలబోసిన ప్రేమతో వెంట నడచి వచ్చిన ఎఱ్ఱనయ్యను చూచి, ఎదపొంగే ఆనందంతో ఎదురొచ్చింది శబరి. కల పుష్పించిందని, కథ ఫలించిందని, నిండిన నేత్రాల నుండి రాలకుండా కన్నీటిని కళ్ళల్లోనే ఆపుకొని, నిండుకుండలా కదిలొచ్చి రాముని పాదాలను తన అశ్రువులతో అభిషేకించింది. పూలమనసుతో పూజించి పులకరించింది.

ఏనాటికైనా నీ వాకిట నిలుస్తాడు రాముడని
ఆనాడు ప్రేమతో పలికాడు మతంగముని
కలిసొచ్చిన భాగ్యాన్ని నేడు కనులారా చూసుకొని
మాటరాక మూగదై మనసుతో అంది రమ్మని.....

శబరి వృద్ధురాలు. కడు సిద్ధురాలు. హద్దులెరుగని తపస్సుతో శుద్ధబ్రహ్మను సాక్షాత్కరించుకొనిన ప్రసిద్ధురాలు. పరమ తపోనిధి మతంగమహర్షి శిష్యురాలు.

అర్ఘ్యపాద్యాదులు సమర్పించి అన్నదమ్ములను అర్చించింది శబరి. ఆమె సద్భక్తికి సంతసించాడు సుగుణాభిరాముడు. ఆమె సంయమనానికి ఆనందించాడు సలక్షణుడైన లక్ష్మణుడు.

పలకలేక, పలుకురాక పరవశిస్తున్న శబరి హృదయ పారవశ్యాన్ని తిలకించిన రామభద్రుడు తానే ముందుగా మాట కదిపాడు.

కచ్చిత్తే నిర్జితా విఘ్నాః కచ్చిత్తే వర్ధతే తపః
కచ్చిత్తే నియతః క్రోధ ఆహారశ్చ తపోధనే ॥

"తపోధనురాలా! నీ తపస్సు విఘ్నము లేకుండా సాగుతోంది కదా! తపస్సు వృద్ధి చెందుతోంది కదా! క్రోధమును పూర్తిగా జయించావా? ఆహార నియమాన్ని పాటిస్తున్నావు కదా!

"శబరీ! నీ మనసుకు సుఖం లభించిందా? నీవు చేసిన గురుసేవ ఫలించిందా?" అని ప్రశ్నించాడు రాముడు ఆదరంతో.

తాపసియై దండకారణ్యంలో తన్మయత్వం చెందిన రాముడు తపోభూమికల్పి సున్నితంగా స్పృశిస్తూ, సాధనలే శ్వాసలుగా భావించి జీవించిన శబరిని జాగృతం చేస్తూ ప్రశ్నించాడు.

ఏదో ఒక వృత్తి చేసుకుంటూ మనిషి జీవిస్తాడు. ఏదో ఒక వృత్తిని (సంకల్పాన్ని) కదిలించుకుంటూ మనసు మనుగడను సాగిస్తుంది. వృత్తులే ప్రవృత్తిని నిర్ణయిస్తాయి. వాటి నివృత్తికి కృషి చేసేదే తపస్సు. ఆ మార్గంలో నిరంతరం తపించేదే తపస్సు. దీనినే యోగంలో చిత్తవృత్తినిరోధ మన్నారు.

అనేక జన్మలయందు చేసిన పనులు, చూసిన రుచులు మనసులో దాగి ఉంటాయి. కారాగృహము నుండి బయట పడాలని ఊహించే ఖైదీలాగా, పంజరం నుండి బయట పడాలని పరితపించే పక్షిలాగా మనసులో దాగియున్న ప్రవృత్తులు బాహ్యవిషయాల యందు రమించాలని ఉబలాట పడుతుంటాయి. ఇవియే వాసనలు. వీటిని వ్యుత్థాన సంస్కారము అని కూడా అంటారు.

తపస్సు వృత్తులను నిరోధిస్తుంది. ఈ నిరోధప్రవాహము నిరాటంకంగా సాగడాన్ని సరళధ్యానము అంటారు. నిరోధసంస్కార ప్రభావము వ్యుత్థానసంస్కారమును అదృశ్యం చేస్తుంది. తపస్సులో ఇది మనకు గోచరించే క్రమ పరిణామము. ఇట్టి విరళము కాని సరళధ్యానము సాగుతున్నదా? అని రాముడు శబరిని ప్రశ్నిస్తున్నాడు.

వృత్తి పావల్యా చిత్స్వరూప్ త్రైమన్ హోతే సుఖరూప్
మనీ అసతా దుఃఖ సంతాప్ కేల్యా హీ తప్ అతిమిథ్య

"వృత్తి చైతన్యరూపంగా లయిస్తే మనసు సుఖిస్తుంది. మనసు ఉన్నంతవరకూ దుఃఖాలు, సంతాపాలు తప్పవు. అవి పోగొట్టుకోకుండా తపస్సు చేయడమనేది ఊహా మాత్రమే" అంటూ శ్రీరాముడు శబరికి బోధచేసినట్లు చెబుతుంది భావార్థ రామాయణము.

తపస్సు నిరాటంకముగా సాగుతూ ఉండవచ్చు. అంతమాత్రాన సరిపోదు. సాధనలో ప్రగతి గోచరించాలి. అందుచేత నీ తపస్సు వృద్ధిచెందుతూ ఉందా? అని రాముని రెండవ ప్రశ్న.

ఆహారం పెడితే మనిషి పెరగాలి. నీరు పోస్తే మొక్క ఎదగాలి. ఆహారం తిన్నా మనిషి క్షీణిస్తూ, నీళ్ళు పోసినా మొక్క నశిస్తూ ఉందంటే లోపం ఎక్కడో ఉండాలి. ఆ లోపాన్ని తొలగించి నపుడే ప్రగతి సాధ్యపడుతుంది. భక్తిలో ఆ విధమైన ప్రగతి లభిస్తూ ఉందా? అంటున్నాడు రాముడు.

ద్రవీభావ పూర్వికాహి మనసో భగవదాకారతా సవికల్పక వృత్తి రూపా భక్తిః

"మనసు ప్రేమపారవశ్యంలో ద్రవీభవించి భగవంతుని ఆకారమును పొందుటయే భక్తి" అని మధుసూదన సరస్వతి నిర్వచించారు.

ఈ స్థితి తేలికగా అందరికీ లభించదు. కళ్ళకు గంతలు కట్టి చూడమంటే ఎలా అసాధ్యమో అవరోధాల మధ్య నిలిచి ఆత్మానందాన్ని పొందడము కూడా అసాధ్యమే. కనుక అడ్డుతెరలు తొలిగాయా! లేదా! అని ప్రశ్నిస్తూ "క్రోధాన్ని పూర్తిగా జయించావా?" అని అడిగాడు రాముడు.

క్రోధము కామమువలన ఏర్పడుతుంది. ఇవి రజోగుణము నుండి పుడుతాయి. రజోగుణము మనసులో ఉన్నంతవరకు కామక్రోధాలు నిరోధింపబడవు.

క్రోధము మనసును పాడుచేస్తుంది. క్రోధము శాంతిని హరిస్తుంది. అగ్నిలాగా దహించి వేస్తుంది. క్రోధమనే అగ్నికి కామము నెయ్యి లాంటిది. ఈ కామక్రోధాలే ఆధ్యాత్మిక మార్గంలో ప్రబల శత్రువులు. కనుక వాటిని నిశ్శేషంగా నిర్మూలించావా? లేదా? అని రాముడు శబరిని ప్రశ్నించాడు. కామక్రోధాల వేగాన్ని నిరోధించినవారు మాత్రమే ఈ ప్రపంచంలో సుఖవంతులు.

శక్నోతీ హైవ యస్సోఢుమ్ ప్రాక్శరీర విమోక్షణాత్

కామ క్రోధోద్భవం వేగమ్ సయుక్త స్స సుఖీ నరః ॥

"ఎవడు ఈ జన్మమునందే దేహమును చాలించుటకు పూర్వమే కామక్రోధముల వలన కలిగిన సంక్షోభమును అరికట్ట గలుగుచున్నాడో వాడే యోగి; వాడే సుఖి అగుచున్నాడు" అని భగవద్గీత-కర్మసన్యాస యోగమునందు శ్రీకృష్ణపరమాత్మ బోధించి యున్నాడు.

క్రోధము మనసుయొక్క స్వభావము. మనము గ్రహించే ఆహారము యొక్క సూక్ష్మాంశమే మనసుగా మారుతూ ఉంది. రాజసి కాహారమును గ్రహిస్తే అది మనసును రజోగుణంతో నింపి, రజోగుణ సముద్భవములైన కామక్రోధాదులను కదిలిస్తుంది. కనుకనే ఆహార నియమమును పాటిస్తున్నావా! అని రాముడు శబరిని ప్రశ్నించాడు.

ఈవిధమైన సాధనల వల్ల మనసు సుఖించాలి. అట్టి సుఖం లభ్యమైనదా? అని ప్రశ్నించాడు రాముడు. ఇవన్నీ జరిగినపుడే గురువును సేవించినందుకు ఫలం. గురుసేవ ద్వారా నిత్యానందాన్ని పొంది తరించడమే శిష్యుల ఏకైక లక్ష్యం.

"శబరీ! గురుసేవకు ఫలితం లభించిందా?" అని రాముడు ప్రశ్నించాడు. రాముడు అడిగిన ఆరు ప్రశ్నలకు కలిపి ఒక్కమాటలో సమాధానం చెప్పింది శబరి.

అద్యప్రాప్తా తపః సిద్ధి స్తవ సందర్శనా న్మయా

అద్య మే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః

"రామా! నేడు నీ దర్శనభాగ్యం లభించుటచేత నాకు తపస్సిద్ధి లభించిందని భావిస్తున్నాను. నేను చేసిన తపస్సు, నేను చేసిన గురుసేవ సఫలము లైనాయని విశ్వసిస్తున్నాను".

పరమాత్మను దర్శించడమే సమస్త సాధనలయొక్క లక్ష్యము. గురుసేవ ద్వారా భగవంతుని దర్శించవచ్చునని నిరూపించిన పవిత్రాత్మురాలు శబరి. పవిత్రమైన జీవితం గడిపిన నిర్మల భక్తుల ఇంటికి పిలవకుండానే భగవంతుడు వస్తాడనే ఆదర్శాన్ని అందించిన ప్రేమమూర్తి శబరి.

పరమాత్మ హృదయాన్ని చూస్తాడు. మధురమైన ప్రేమకు లొంగుతాడు. షడ్రసోపేతంగా విందును సిద్ధం చేశాడు దుర్యోధనుడు. శ్రీకృష్ణునికి దానియందు అభిరుచి లేదు. పిలవకపోయినా విదురుని ఇంటికి వెళ్ళి పండ్లతొక్కలను ప్రియంగా ఆరగించాడు. అవే కృష్ణునికి చాలా రుచిగా ఉండినాయి. పరమాత్మ రస స్వరూపుడు. ఆయన సారగ్రాహి.

శబరి రామునికి నమస్కరించి చెబుతోంది.

"తండ్రీ! నీవు చిత్రకూటపర్వతముపై ఉన్నప్పుడే నేను సేవించిన మునులందరూ దివ్యమైన విమానాలెక్కి స్వర్గానికి వెళ్ళిపోయారు. వారు వెళ్తూ నాతో ఇలా పలికారు.

"శబరీ! రాముడు పవిత్రమైన నీ ఆశ్రమానికి వస్తాడు. రామలక్ష్మణులకు అతిథి సేవలు అందించిన తరువాత నువ్వు ఉత్తమ లోకాలకు చేరుతావు" అని పలికారు.

"రామా! ఈ పంపాతీరమున లభించే ఉత్తమమైన ఫలాలను, పదార్థములను నీకోసం భద్రపరచి ఉంచాను"; అని పలికింది శబరి.

మహర్షులకు చేసిన సేవలు వృథాకావు. శబరి ఉత్తమోత్తమమైన ఫలితాన్ని అందుకొని సంతోషించింది. రాముని రాకను ముందుగానే తెలియచేసి రాముని కొరకు నిరీక్షిస్తూ ఉండమని ఋషులు చెప్పి వెళ్ళారు. శబరి వద్దకే రాముడు వస్తాడని మరీ చెప్పి వెళ్ళారు.

శబరికి మహర్షుల వచనాలపై అకుంఠిత విశ్వాసముంది. వారి వచనాలు వృథాకావనే నమ్మకం ఉంది. ఆమె నమ్మకం వమ్ము కాలేదు. ఆమె నిరీక్షణకు ఫలితం లభించింది. రాముడు లక్ష్మణసమేతుడై రానేవచ్చాడు. శబరిని ఆశీర్వదించాడు.

మహాత్ములను సమీపించవచ్చు. వారి మాటలు ఆలకించవచ్చు. కానీ ఆలకించిన విషయాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించువారే పరమాత్మ కృపకు పాత్రులై తరిస్తారు.

రాముని కొరకు వనములో లభించే ఉత్తమ పదార్థములను భద్రపరచి ఉన్నట్లు శబరి చెప్పిందే గాని ఫలాలను ఆమె పెట్టినట్లు గాని, రాముడు తినినట్లు గాని వాల్మీకి రామాయణంలో లేదు.

కొడుకు పేరు సోమలింగం అన్నట్లు లేని విషయానికి కాల్పనిక గాథలు ఎన్నో పుట్టుకొచ్చాయి. రాముడు శబరి ఎంగిలి చేసి పెట్టిన ఫలాలను ఆరగించాడని ఒక విషయం లోకంలో గొప్పగా ప్రాచుర్యమై ఉంది.

అది ఎవరు చేసిన ఎంగిలో తెలియదు గాని మొత్తానికి పెద్ద రుచికరంగా తయారైంది. వాల్మీకము నందుగాని, అధ్యాత్మరామాయణము నందుగాని, కంబరామాయణము నందుగాని, తులసీరామాయణము నందుగాని ఈ ప్రసక్తి రాలేదు. మరి ఎలా పుట్టుకొచ్చినట్లు?

శ్లో॥ ఫలానిచ సుపక్వాని మూలాని మధురాణిచ
స్వయ మాస్వాద్య మాధుర్యం పరీక్ష్య పరిభక్ష్యచ ॥
శ్లో॥ పశ్చా న్నివేదయామాస రాఘవాభ్యాం దృఢ వ్రతా
ఫలా న్యాస్వాద్య కాకుత్థ్సః తస్యై ముక్తిం పరాం దదౌ ॥

"చక్కగా పండిన పండ్లను, మధురములైన ఫలమూలాదులను శబరి స్వయంగా ఆస్వాదించి, వాటియందలి తియ్యదనాన్ని పరిశీలించి, తాను భక్షించి ఆ తరువాత రామునికి సమర్పించింది. రాముడు ఆ ఫలాలను ఆరగించి ఆమెకు ముక్తిని ప్రసాదించాడు" అని పద్మపురాణము ప్రవచించింది.

బహుశ దీనిని ఆధారముగా తీసుకున్నా రేమో! భద్రాచల రామదాసు ఈ విషయాన్ని దాశరథీ శతకములో ప్రస్తావించారు.

ఉ॥ ఎంతటి పుణ్యమో శబరి యెంగిలి గొంటివి వింతగాదె నీ
మంతన మెట్టిదో యుడుతమైని కరాగ్ర నఖాంకురంబులన్
సంతస మంద జేసితివి సత్కుల జన్మములేమి లెక్క వే
దాంతము గాదె నీ మహిమ దాశరథీ కరుణా పయోనిధీ!

"రామా! శబరి ఎంగిలి తిన్నావు. ఆశ్చర్యంగా ఉంది. ఆమె ఎంత పుణ్యం చేసుకున్నదో? ఉడుతను చేత పట్టుకొని మునిగోళ్ళతో గీరి తృప్తి పరచావు. దానిపై అంత ప్రేమ కలుగుటకు కారణమేమో తెలియడం లేదు. దీనిని బట్టి చూడగా నీవు జాతి కులాలను చూచేవాడివి కాదని తెలుస్తోంది. వేదాంతమే నీ వైభవమని స్పష్టమవుతోంది. దాశరథీ! కరుణాపయోనిధీ! నీ మహిమ అసమానము" అన్నాడు గోపన్న.

ఒకవేళ ఆనాడు కులపిచ్చితో సమాజాన్ని కుళ్ళబెడుతున్న వారి మనోజాడ్యాన్ని దులపాలని భావించి అలా ఎంగిలి ఎన్నుకున్నాడేమో?

జాతి కులాలకన్నా భక్తి అమోఘమైనది. ఈ సందర్భములోనే తాను జాతికులాలను చూచేవాడు కానట్లు రాముడు రామచరితమానసంలో చెబుతాడు.

రాముని శబరి కన్నులారా చూచింది. రాముని స్తుతించే శక్తి తనకు లేదని, తాను మందమతి నని, నీచ జాతి స్త్రీనని రామునితో సవినయంగా మొరపెట్టుకుంటుంది.

అధమ తేఀ అధమ అధమ అతినారీ! తిన్హ మహమై అతి మంద అ ధారీ!
కహ రఘుపతి సును భామిని బాతా! మానౌ ఏక్ భగతి కర నాతా!
జాతి పాంతి కుల్ ధర్మ బడాయీా! ధనబల్ పరిజన గుణ చతురాయీా!
భగతిహీన నర సోహై కైసా! బిను జల బారిద దేఖి అ జైసా!

"రామా! నేను అధములలో అధమమైన నీచజాతి స్త్రీని. మందమతిని. మూర్ఖురాలను. హే పాపవినాశకా! నిన్ను నేను ఎలా స్తుతించేది?" అన్నది శబరి.

"శబరీ! నామాట విను. నాకు కేవలము భక్తి ప్రధానము. జన్మము, వంశము, కులము, ధనము, శక్తి, సామర్థ్యము కంటె భక్తియే నాకు ముఖ్యము. భక్తి లేని వ్యక్తి జలము లేని మేఘము వంటివాడు" అని శబరికి రాముడు సమాధానమిచ్చాడు తులసీ రామాయణంలో.

రామునికి ఏదో పెట్టాలని శబరి భావించలేదు. ఆమె పెట్టేదేదో తినాలని రాముడు రానూలేదు. పెట్టేందుకు శబరివద్ద ఏముంది? తినవలసిన అవసరం రాముడి కేముంది?

ఒకవేళ సమర్పించ దలచుకుంటే శబరి ఏమి సమర్పించాలని ఉందో, రాముడు గ్రహించాలని భావిస్తే దేనిని గ్రహించాలని భావిస్తున్నాడో మనం గ్రహిస్తే చాలు. మన జన్మలు చరితార్థ మవుతాయి.

రామునికి అతిథిపూజలు చేయుటకు ఆశ్రమంలో ఉండమని ఋషులు శబరికి చెప్పారు. ఆ తరువాత ఉత్తమ లోకాలకు వెళ్ళమన్నారు.

ఈ దేహం ప్రతిక్షణము రాముని సేవకే నిరీక్షిస్తూ ఉండాలి. రాముని సేవలోనే తృప్తి చెందాలి. రామానుగ్రహంతో తరించిపోవాలి. దేహాన్ని దైవసేవ కొరకే నిలుపుకోమని వాల్మీకి రామాయణంలో ఋషులు శబరికి చెప్పారు.

యావ దాగమనం తస్య తావద్రక్ష కళేబరమ్
దృష్ట్వైవ రాఘవం దగ్ధ్వా దేహం యాస్యసి తత్పదమ్ ॥

"శబరీ! రాముడు నీవద్దకు వచ్చేవరకు ఈ దేహాన్ని రక్షించుకో. రామదర్శనం కాగానే దేహాన్ని అగ్నికి సమర్పించి పరమాత్మను పొందు" అన్నది అధ్యాత్మరామాయణము.

తీరం చేరిన తరువాత తెప్ప అవసరం లేదు. పరమాత్మను పొందిన తరువాత దేహము యొక్క అవసరం లేదు. అంతవరకు దేహాన్ని రక్షించుకోవాలి. దేహ మనుగడ కూడా దైవసేవ నిమిత్తమే.

"రామా! వనములో లభించే ఉత్తమ పదార్థాలు నీ కొరకు జాగ్రత్తచేసి ఉంచాను" అని శబరి పలికినపుడు రాముడు ఆ విషయమునందు ఆసక్తి చూపలేదు. అసలు పట్టించుకున్నట్లు కూడా లేదు.

రాముడు శబరిని ఏదో అడగాలనుకుంటున్నాడు. ఆమెనుండి ఏదో ఆశిస్తున్నాడు. అదేమిటో చెప్పబోయే ముందు రాముడు ఎవరితో భాషిస్తున్నాడో ఆ శబరిని భక్తురాలిగా కాకుండా మహాజ్ఞానిగా వాల్మీకి పరిచయం చేయడం గమనించదగిన విషయం.

ఏవ ముక్త స్స ధర్మాత్మా శబర్యా శబరీ మిదమ్
రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్య మబహిష్కృతామ్ ॥

"ఫలాదులు భద్రపరచి ఉన్నట్లు శబరి చెప్పిన మాటలు విన్న రాముడు సదా జ్ఞానములో రమించు శబరితో ఇలా పలికాడు" అన్నాడు వాల్మీకిమహర్షి.

జ్ఞాన భూమికలో ప్రవేశించే ముందు పాఠకుల మనసులను సిద్ధం చేస్తూ శబరిని జ్ఞానిగా పరిచయం చేస్తున్నాడు వాల్మీకి.

"శబరీ! కబంధుడు నిన్ను గూర్చి, నీ గురువు ప్రభావాన్ని గూర్చి చెప్పాడు. ఆ వైభవాన్ని చూడాలని అభిలషిస్తున్నాను" అన్నాడు రాముడు.

రాముడు మతంగవనాన్ని చూడాలని కోరుతున్నా డని గ్రహించింది శబరి. గురు వైభవమును తెలిపే ఆ వనాన్ని చూపాలని లేచింది. ఈలోగా మనల్ని ఉపనిషద్వన విహారము చేయించాలని భావిస్తాడు వాల్మీకిమహర్షి.

ఏతత్తు వచనం శ్రుత్వా రామ వక్త్రాద్వినిః సృతమ్
శబరీ దర్శయామాస తా ఉభౌ తద్వనం మహత్ ॥

"రాముడు అలా పలకగానే రామలక్ష్మణులకు గొప్పదైన ఆ వనమును శబరి చూపింది" అంటాడు వాల్మీకి.

తద్వనం అనే పదాన్ని ప్రయోగించి ఒకేసారి ఆత్మజ్ఞాన పర్వతశిఖరాన్ని అధిరోహించి కూర్చున్నాడు వాల్మీకిమహర్షి.

తద్వనం అంటే, తత్+వనం, తద్వనం అనగా ఆ వనము అనే బాహ్యార్థంతో తృప్తిపడేందుకు సిద్ధపడకూడదు. దానిని నిగూఢంగా శోధిస్తే విచిత్రాలన్నీ గోచరిస్తాయి.

తత్ హ 'తద్వనం' నామ, తద్వనం ఇతి ఉపాసితవ్యం

తత్=ఆ భగవంతుడు, తద్వనం నామహ='తద్వనం' అను పేరు కలవాడు. తత్=దానిని, వనం=భజనీయం, ఇతి=అని, ఉపాసితవ్యం=ఉపాసించాలి.

"పరమాత్మ 'తద్వనం' అనే పేరుతో ప్రసిద్ధుడు. కనుక బ్రహ్మము "తద్వనం" అని తెలిసి ఉపాసించాలి" అన్నది కేనోపనిషత్తు.

శ్రీ శంకరాచార్యుల వారు కేనోపనిషత్తులోని పై మంత్రముపై వ్యాఖ్యానిస్తూ ఇలా అంటారు.

తస్య ప్రాణి జాతస్య ప్రత్యగాత్మ భూతత్వాత్ వనం వననీయం
సంభజనీయం। అతః తద్వనం నామ ప్రఖ్యాతం బ్రహ్మ।

"ప్రతి ప్రాణియందును అంతరాత్మ రూపంగా ప్రతిష్ఠింపబడి యున్న కారణమున ఆ బ్రహ్మ **(తత్)** భజనీయము **(వనం)** అని శంకరభాష్యము.

కనుక వైభవోపేతమైన మతంగవనము కేనోపనిషత్తు ప్రవచించిన 'తద్వనమే'. రామలక్ష్మణులకు ఆ వనాన్ని చూపించుటకు శబరి బయలుదేరింది. సోదరులు ఆమెను అనుసరించారు. వనంలో ప్రవేశించారు.

శబరి చెబుతూ ఉంది.

"రామా! మృగపక్షులతో కూడి మేఘమండలంలా గోచరించే ఇదే మతంగవనం. మా గురువులైన మహర్షులు మంత్రాలతో అర్చించి గంగాది పుణ్యతీర్థాలను ఇక్కడికి రప్పించేవారు".

"రామా! వృద్ధాప్యం వల్ల వణుకుతున్న చేతులతో పుష్పాలను సమర్పించే దేవతా స్థానము అదిగో - అదే.

"రామా! చూశావా! వారి తపోమహిమ! ఇప్పటికీ ఆ వేది దివ్యప్రభలతో శోభిస్తోంది".

"అదిగో రాఘవా! దీర్ఘోపవాసాలచే దుర్బలులైన మహర్షులు కదలలేక సంకల్ప మాత్రాన సప్త సముద్రాలను ఇక్కడికి రప్పించారు. అవి - ఆ ప్రక్కనున్నాయి చూడు, అవే".

"రఘునందనా! స్నానం చేసి, మహాత్ములైన ఆ ఋషులు చెట్లపై ఆరేసిన వారి నారచీరలు తడి ఆరలేదు చూశావా!"

"వారు పూజకు ఉపయోగించిన పూలు ఇవిగో. వారు సమర్పించిన మాలలు అవిగో. అవి వాడకుండా అలాగే ఉంటాయి"; అని వనాన్నంతా చూపింది శబరి.

అది **తద్వనం.** అదే మతంగవనం.

సప్త సముద్రాలను ఒకచోట నిలిపేదే ఆ వనం. ఎంతో ఉందనుకొనే విశ్వాన్ని ఇంతేనని ఒకేచోట చూపెట్టగలిగే వనం. అయితే చూడాలి మనం. మహర్షులు చూశారు. శబరి చూసింది. రామలక్ష్మణులకు చూపింది.

వెళ్ళి చూడాలి. చూసి చెప్పాలి. అదే తద్వనం.

ఇందుకే ఋషులు అరణ్యాల్లో వసించేవారు. వనాల్లో నిలిచి తద్వనాన్ని దర్శించేవారు. వారు దర్శించిన దానిని కోరినవారికి చూపేవారు.

యావ ద్విశ్వమంతా వారికి తద్వనంలోనే లభిస్తుంది. కనుక వారికి కావలసింది రెండే వస్తువులు.

1. గునపము 2. గంప

"నాకు ఏమీ అవసరము లేదు. ధనరాశులు అవసరం లేదు. నేను అరణ్యానికి వెళ్తున్నాను. నాకు కావలసింది గునపము, గంప - ఈ రెండే" అని రాముడు దశరథుని అంత:పురములో అరణ్యవాసానికి వెళ్ళేముందు అంటాడు.

"అన్నా! నిన్ను వదలి నేను అయోధ్యలో ఉండలేను. నీతోపాటు నేనూ వస్తాను. గునపము, గంప తీసుకొని ముందు నడుస్తాను" అని అయోధ్యాకాండములో లక్ష్మణుడూ అంటాడు.

తాపసజీవనంలో అవసరమైనవి గునపము-గంప, ఈ రెండే.

'తద్వనం'లో అవసరమైనవి ఈ రెండే.

త్రవ్వేందుకు గునపం. ఎత్తిపోసేందుకు గంప.

శాస్త్రలోతులను త్రవ్వి ఆశ్చర్యకరమైన విజ్ఞాన మణులను వెలికి తీసేందుకు విచారము అనే గునపము.

గునపము ద్వారా త్రవ్వి తీసిన మణులను ఎత్తి పోసేందుకు ఉపకరించేదే గంప అనే ప్రచారము.

విచారము ద్వారా శాస్త్రలోతుల్ని త్రవ్వితీయడము -

వచ్చిన జ్ఞానమణుల్ని సమాజంపై గంపలతో క్రుమ్మరించడం -

ఇవి ఋషుల కర్మలు. మహర్షుల కార్యాలు.

ఇవే సత్సంగాలు. ఇవే జ్ఞానయజ్ఞాలు. అన్నీ 'తద్వన' ప్రసాదాలే.

'తద్వనం'లో లభించిన జ్ఞానపుష్పాలే.

అవి వాడేవి కావు. ఊడేవి కావు అంటోంది శబరి.

మహర్షులు దర్శించిన 'తద్వనం'లో లభించిన జ్ఞానపుష్పాలు దేశకాలాలకు పరిమితం కావు.

కాలప్రభంజనానికి ఆ పూలు వాడవు.

దుండగుల దండయాత్రలకి వాటి రేకులు ఊడవు.

అవి దివ్యప్రభలతో శోభిస్తూనే ఉంటాయి. తద్వనం ఎప్పుడూ నిత్యకళ్యాణంగా అలరారుతూనే ఉంటుంది.

అవి తడి ఆరని బట్టలు అంటోంది శబరి.

విజమే. విమర్శనాగాలులు వాటిని ఎండగట్టలేవు. అవి జ్ఞానగంగా స్వరూపాలు. కనుక ఎప్పుడూ చల్లగానే ఉంటాయి. చల్లబరుస్తూనే ఉంటాయి.

చీకిపోని, మాసిపోని దివ్య చీనాంబరా లవి.

ప్రహర్ష మతులం లేభే ఆశ్చర్యమితి తత్త్వతః

శబరి చూపిన, చెప్పిన తద్వనాన్ని "ఆశ్చర్యం" అని ఒక్కమాటతో చెప్పి చూశారు రామలక్ష్మణులు. అంతకన్నా ఎవరు మాత్రం ఏం చెప్పగలరు?

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చిదేనం ఆశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః

ఆశ్చర్య వచ్చైన మన్య శ్శృణోతి శ్రుత్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥

"ఆత్మను ఒకడు ఆశ్చర్యమైన దానివలె చూస్తాడు. మరి ఒకడు ఆశ్చర్యమైన దానివలె పలుకుతాడు. ఒకడు ఆశ్చర్యమైన దానివలె వింటాడు. విన్నా మరొకడు తెలుసుకోలేక పోతున్నాడు" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత సాంఖ్యయోగంలో తెలుపుతారు.

అదే తద్వనం. అదే మతంగవనం. అదే ఆశ్చర్యం అద్భుతం.

మతంగవనంలో పూలు వాడకపోవడానికి కబంధుడు కారణంకూడా చెప్పాడు రామలక్ష్మణులకి. ఆ పూలు చెట్లనుండి పూసినవి కావు. గురుసేవ చేయుచున్న శిష్యుల స్వేదబిందువులే పూలుగా మారాయన్నాడు. అందుచేత అవి వాడవు.

గురుసేవ ఎప్పుడూ వాడదు. అది వాడని పువ్వులా ప్రకాశిస్తూనే ఉంటుంది. సనాతన ధర్మజీవన బాటలో లభించే విజ్ఞానమంతా గురుసేవలో శిష్యులు గ్రహించిందే కనుక అది నిత్యనూతనంగా విరాజిల్లుతూనే ఉంటుంది.

"రామా! నిన్ను సత్కరించుకొని నేను సంతృప్తిని పొందాను. నీవు కూడా వినదగింది విన్నావు. చూడదగింది చూశావు. నాకు ఆజ్ఞ ఇస్తే ఈ నా కళేబరాన్ని త్యజిస్తాను. ఏ మహాత్ములను గతంలో ఇక్కడ సేవించానో వారి వద్దకే వెళ్ళాలని అభిలషిస్తున్నాను" అని రామునితో పలికింది శబరి.

అర్చితోఽహం త్వయా భక్త్యా గచ్ఛ కామం యథా సుఖమ్

"శబరీ! నన్ను భక్తితో ఆరాధించావు. నీవు కోరిన చోటికి సుఖంగా వెళ్ళు" అన్నాడు రాముడు.

భక్తితో రాముని అర్చించిన శబరి కోరిన చోటికి వెళ్తావుంది. రాముని ఎవరైతే భక్తితో అర్చిస్తారో వారు తప్పకుండా అభిలషించిన మోక్షాన్ని పొందుతారు.

వృద్ధురాలైన శబరి నారచీరను, జింకచర్మమును వస్త్రముగా ధరించింది. అగ్నిని ప్రతిష్ఠించుకుంది. నిరాశ లేకుండా ఇంతకాలం తాను రాముని కోసం ఎంత ఉత్సాహంతో నిరీక్షించిందో తనకొరకు అదే ఉత్సాహంతో నిరీక్షిస్తున్న అగ్నిహోత్రునికి దేహాన్ని హోమద్రవ్యంలా సమర్పించింది.

వెంటనే దివ్యదేహాన్ని పొంది రామలక్ష్మణులకు నమస్కరిస్తూ స్వర్గానికి వెళ్ళింది. దివ్యమైన అలంకారాలతో, దివ్యమైన పుష్పమాలలతో వెలిగిపోతూ విమానం ఎక్కి వెళ్ళిపోయింది. శబరి ధన్యజీవి. పుణ్యజీవి.

ఎంతని నే వర్ణింతును శబరీభాగ్యమె

దాంతులు వరకాంతలు జగమంత నిండియుండగ ॥ ఎంతని ॥

కనులార సేవించి, కమ్మని ఫలముల నొసగి

తనువు పులకరించ పాదయుగములకు మ్రొక్కి

ఇనకులపతి సముఖంబున పునరావృత్తి రహిత పద

మును పొందిన త్యాగరాజ నుతురాలి పుణ్యంబును ॥ ఎంతని ॥

అని శబరి భాగ్యాన్ని పరవశించి గానంచేశారు త్యాగరాజస్వామి.

అరణ్యకాండము సాధనకు సంబంధించిన కాండము. ఈ కాండములో మనకు రెండు పాత్రలు ప్రత్యేకంగా గోచరిస్తాయి. ఒకటి శూర్పణఖ కాగా రెండవది శబరి.

శూర్పణఖ కామరూపం. క్రోధస్వరూపం. ముక్కు చెవులు పోగొట్టుకొని దుఃఖిస్తుంది. వికారస్వరూపంగా మారి విలపిస్తుంది. కామక్రోధాల పరిస్థితి ఎప్పుడూ అంతే. కనుక సాధకులైనవారు కామక్రోధాలను నిగ్రహించుకోవాలి. శూర్పణఖ లాగా జీవితం పాడుకాకుండా చూసుకోవాలి.

శబరి ప్రేమస్వరూపం. ప్రేమమూర్తి అయిన శబరి రాముని దర్శించింది. రామునితో భాషించింది. రాముని పాదాలను అర్చించింది. దివ్యమైన దేహాన్ని పొందింది. రాముని అనుగ్రహానికి పాత్రురాలై ఉత్తమలోకాలకు వెళ్ళింది.

ఈ రెండు పాత్రల్ని మనసులో ఉంచుకొని సాధకులు తమ జీవితాల్ని చరితార్థం చేసుకోవాలి.

తస్మి న్ననన్యతా తద్విరోధి షూదాసీనతా చ ॥

భగవంతుని యందు అనన్యమైన భక్తిని, దానికి వ్యతిరేకమైన విషయముల యందు ఉదాసీనతమ కలిగియుండేలా జీవించమని నారదమహర్షి భక్తిసూత్రాలలో సూచిస్తాడు.

సదా హృదయంలో భక్తి నిండాలి. కామము ప్రవేశించకుండా చూసుకోవాలి.

కిష్కింధా కాండము

పొదుగు పిడికె డంత
పిండితే పాలే కుండంతా

దీపము చూస్తే గోరంత
వెలుగును చూస్తే కొండంత

చింతలు తొలగిన నాడు మనసే విందుల వాక
దారులు తెలిసిన నాడు బ్రతుకే ఆశారేఖ.

ఇది కిష్కింధాకాండము.

రామాయణ జీవనది ఈ కాండములోనే ఒక మలుపు తిరిగింది.

అదొక చక్కని మలుపు.
ఊహకు చిక్కని తలపు.

పట్టాలపై రైలు ఉంటుంది. రైలుబండిలో మనం ఉంటాం.
చీలు దారిలో బండి ఎటో! దారి ఏదో!
పాయింట్లు మారితే,
దారే మారిపోతుంది.
గమ్యమే జారిపోతుంది.
తిరిగే వాళ్ళమే గాని త్రిప్పేది మనం కాదు.
తిరిగి తిరిగి అలసిన వాళ్ళను త్రిప్పేందుకు ఎవరో ఉంటారు.
వారే కబంధులు.
బంధాలను అందాలుగా మార్చే కబంధులు. జీవికి బంధువులు.
సుగ్రీవునితో మైత్రీబంధాన్ని సూచించిన వాడు కబంధుడే.
బాహుబంధాల్లో చిక్కించుకున్నా బ్రతుకు అందాన్ని చేజిక్కించాడు.
సుగ్రీవుని చిరునామా తెలిపి, రామలక్ష్మణులను ఋష్యమూకానికి కబంధుడు మరలించకుండా ఉన్నట్లయితే ప్రయాణము ఎటు సాగేదో! ప్రమాదము ఎలా తొలిగేదో!

కాంతికి, శాంతికి కేంద్రస్థానమై శోభించాడు కబంధుడు.
కిష్కింధాకాండ భవనానికి చక్కని పునాది కబంధుడే.
కాలిన పుడమిని చల్లబరుస్తుంది కాలము నెరిగిన కబంధము
కలత చెందిన రాముని ఊరడించాడు బందీయైన కబంధుడు

తియ్యని ఆశాలతను ప్రాకించాడు
తెల్లని విశ్వాస పుష్పాల నందించాడు
చల్లని మైత్రి మధువును చిలికించాడు

మంచి మాటల తైలంతో చీకట్లు ముసిరిన జీవితాలలో ఆనంద దీపాన్ని వెలిగించాడు.

వెలిగించుకోవాలి ప్రతి మనిషీ దీపం
సరిచేసుకోవాలి తనలోని లోపం

లోపం జీవికి పాపం కాకూడదు
జీవితంలో అది శాపంగా మారకూడదు

పిలవకుండా మిత్రులు వస్తారు
పిలిచినట్లు శత్రువులు వస్తారు

పరమాత్మ నీకు మిత్రుడైతే అందరూ నీకు మిత్రులే.
పరమాత్మ జాడ తెలియని నాడు విశ్వమంతా శత్రువులే.

వెలుగున్న చోట మిగలవు తిమిరాలు
ప్రేమున్న చోట ఉండవు తరగతులు

మనోగతులు మారితే మానవులకు సద్గతులే
అవి మారని నాడు ఎదురయ్యేవి దుర్గతులే

జీవబ్రహ్మల సంబంధమే రామసుగ్రీవుల మైత్రి
ఆత్మైక్యంలో ప్రాప్తిస్తుంది శాంతియుత ధాత్రి

ధర్మానికి సారథి దాశరథి
దాటించనున్నాడు జీవన మహోదధి

అధర్మజీవనము ఏనాడైనా ఖాళీ
అని తెలిపేందుకే నేల రాలాడు వాలి

ఆగి సేద తీర్చుకొనేందుకు చలివేంద్రము
యోగి విశ్రమించేందుకు ప్రస్రవణము

వేచి చూడడంలో వేడుకుంది
ఆగి ఆలోచించడంలో అందముంది

తీపి బ్రతుకు కావాలి అందరికి
తియ్యగా బ్రతకడం తెలిసింది ఎందరికి?

రాజుల్ని జయిస్తే రాజ్యాలు లభిస్తాయి
నిన్ను నీవు జయిస్తే సుఖాలు ప్రాప్తిస్తాయి

ఆకాశంలో తారలెన్నో ఉంటాయి
తారాపథంలో తారలా ఎందరుంటారు?

మణులలో దారంలాగా
ధర్మానికి ఆధారమై
దారి తెలియని వారి వెంట నిలిచిన ధర్మధార. ఆవిడే తార.
తారుమారైన జీవితాలను తాలిమితో తీర్చిదిద్దే తార. జీవికి
తార. జీవన సితారా.

తద్వనంలో శబరిని చూపుతుంది అరణ్యకాండము
మహద్వనంలో స్వయంప్రభను తెలుపుతుంది కిష్కింధాకాండము

మహర్షుల తద్వనాన్ని సంరక్షించింది శబరి
హేమ మహద్వనాన్ని పరిరక్షించింది స్వయంప్రభ.

ఇద్దరూ తపస్వినులే. ఇరువురూ పరిరక్షకులే.
తపోధనులే ఏనాడైనా రక్షకులు. పరిరక్షకులు. వనరక్షకులు.
ఉపనిష ద్వనరక్షకులు.

రామలక్ష్మణులకు శబరి ఆతిథ్యం
అంగద హనుమదాదులకు స్వయంప్రభ ఆతిథ్యం

బాహ్యంలో ప్రకాశిస్తూ ఊర్ధ్వంగా వెళ్తుంది శబరి
ఆంతర్యంలో శోభిస్తూ అంతర్ముఖ మవుతుంది స్వయంప్రభ.

శబరిలా తరలిపోవాలి
స్వయంప్రభలా తరించాలి
తరించాలనుకుంటే తీరానికి తరలిపోవాలి
సాగర తీరానికి తరలిపోవాలి
భవసాగర తీరానికి తరలిపోవాలి

ఎగురుతూ వెలగాలని, వెలుగుతూ ఎగరాలని వెలుగుల తోరణాలను ఆవిష్కరించిన రామాయణ మహామాలారత్నం హనుమంతుడు, శతయోజన విస్తీర్ణంగల సముద్రాన్ని గోష్పదంలా భావించి, ఒక్క పట్టున పిట్టగోడను దాటినట్లు లంఘించి, "ఇలా దాటాలి భవసాగరాన్ని" అని ప్రదర్శించి చూపడానికి సిద్ధపడ్డాడు.

ఏడిస్తే ఏమీ రాదు
ఎగిరిన వాళ్ళకే ఏదైనా

బాధైనా భరించాలి భారము తీరేదాకా
చేదైనా సహించాలి చిత్తము అణగేదాకా

ధైర్యం ముందు నడవాలి
దైవం వెనుక నిలవాలి. వెలగాలి.

తారాపథము

సుగ్రీవుని ధ్వని వాలి చెవిన పడింది. వెంటనే క్రుద్ధుడయ్యాడు వాలి. గ్రహణం పట్టిన సూర్యునిలాగా తేజోహీను డయ్యాడు. వెంటనే భూమి కంపించేలా అడుగులు వేసుకుంటూ వాలి బయలుదేరాడు.

వాలి ధర్మపత్ని తార వాలిని సమీపించింది. ప్రేమతో వాలిని కౌగిలించుకుంది. భర్త హితము కోరి ప్రియమైన వాక్కులు పలికింది.

నిత్యము ఎవరిని ధ్యానించడం వలన సమస్త పాతకములు నశిస్తాయని శాస్త్రము నిర్దేశించిందో అట్టి పంచకన్యలలో తార కూడా ఒకతె. అహల్య, ద్రౌపది, సీత, తార, మండోదరి - ఈ ఐదుగురు సాధ్వీమతల్లులు 'పంచకన్యలు'గా కీర్తించబడ్డారు.

ద్రౌపది మినహా మిగిలిన నలుగురు మహిళలు మనకు రామాయణంలో దర్శన మిస్తారు. బాలకాండలో అహల్య వైభవం చూశాము. సీతమ్మ వైభవం సాగుతూ ఉంది. ఇప్పుడు తార పాత్ర ప్రవేశించింది. వివాహితులైన స్త్రీలను శాస్త్రము కన్యలుగా కీర్తించిందంటే వారి ఔన్నత్యము, పవిత్రత ఎలాంటిదో మనం గ్రహించవచ్చు.

మహాపతివ్రత, వాలి ధర్మపత్ని అయిన తార ఇప్పుడే మనకు ప్రథమంగా కన్పించింది. ఇక్కడే ప్రథమంగా నోరు విప్పి మాట్లాడింది.

సాధు క్రోధమిదం వీర నదీవేగ మివాగతమ్
శయనా దుత్థితః కాల్యం త్యజ భుక్తామివ స్రజమ్ ॥

"ఓ వీరుడా! ఉదయం నిద్రనుండి లేచినవాడు నలిగిపోయిన పూలమాలను విసిరి పారేస్తాడు. నదీవేగంలా నీకు వచ్చిన కోపాన్ని నీవూ అలాగే విడిచిపెట్టు".

ఇది తార పలికిన మొదటి మాట. మంచి రత్నాల మూట. వాలి భవిష్యత్తుకు బంగారు బాట.

రాత్రి పరుండే ముందు ధరించిన పూలదండ ఉదయం నిద్రలేచిన తరువాత నిరుపయోగం. వాడిన పూదండ దేనికీ పనికిరాదు. క్రోధం కూడా వాడిన పూలమాల వంటిది అంటున్నది తార.

క్రోధం బుద్ధిని పాడుచేస్తుంది. విజ్ఞానాన్ని వక్రింపచేస్తుంది. శత్రుత్వాన్ని పెంచుతుంది. సుఖాన్ని కాలరాస్తుంది. అలాంటి క్రోధాన్ని విడిచిపెట్టమని చెప్తూ ఉంది. క్రోధము దుఃఖ కారణమని, నిరుపయోగ మని చెప్తూ ఉంది.

మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా నశోచతి
కామం హిత్వాఽ ర్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్ ॥

"అభిమానం వదిలినవాడు అందరికీ ప్రియుడవుతాడు. క్రోధం విడిచినవాడు శోకరహితుడవుతాడు. కామాన్ని వదలినవాడు సంపన్ను డవుతాడు. లోభాన్ని త్యజించిన వాడు సుఖవంతుడవుతాడు"; అని ధర్మరాజు మహాభారతం - వనపర్వములో చెబుతాడు.

తార ప్రథమంగా మాట్లాడిన శ్లోకంలో మొదటి మాట **"సాధు"**. సద్వచనము సంబోధన లోనే స్పష్ట మవుతుంది. "సాధు" అని చాలా బాగుగా సంబోధించింది తార.

సాధుః అంటే మంచివాడు అని అర్థము. వాలిని మంచివాడా అంటూ సంబోధించింది. మంచిమాటను మంచివాళ్ళే వినగలరు. తాను చెప్పే మంచిమాటను మంచి బుద్ధితో స్వీకరించమని "సాధు" అనే పదాన్ని తార ప్రయోగించింది.

ఈ ప్రథమ శ్లోకంలో నలిగిపోయిన పూలదండవలె క్రోధాన్ని విడిచిపెట్టమని చెప్పింది తార. "సాధు" అంటే చక్కగా అని కూడా అర్థము. క్రోధాన్ని బాగుగా విడిచి పెట్టమని కూడా భావము. నిశ్శేషంగా నిర్మూలించమని విన్నపము.

ఈ మాట చెప్పబోయే ముందు తార వాలిని స్నేహపూర్వకంగా కౌగిలించుకుంది అన్నాడు వాల్మీకి. తాను వాలికన్నా వేరుగా లేనట్లు, వాలి సమస్యతో తాను ఏకమై ఆలోచిస్తున్నట్లు తెలుపుటయే తార వాలిని కౌగిలించుకొనుట లోని గూఢార్థము.

తార వాలితో చెబుతోంది.

"వీరుడా! ఇప్పుడు నీవు యుద్ధానికి వెళ్ళడం నాకు సుతరామూ ఇష్టం లేదు. నేను నిన్ను ఎందుకు వెళ్ళవద్దని చెప్తున్నానో దానికి కారణం విను.

"ఇంతకుముందే సుగ్రీవుడు నీపై కయ్యానికి కాలుదువ్వాడు. నీవు వెళ్ళి అతణ్ణి కొట్టి పరాజితుణ్ణి చేశావు. నీ ధాటికి తట్టుకోలేక పారిపోయాడు.

"నీవు అలా కొట్టి ఓడించి తరిమిన వ్యక్తి, మళ్ళీ, గాయాలు మానకముందే నిన్ను పోరాటానికి పిలుస్తున్నాడంటే నాకేదో సందేహంగా ఉంది.

"అంతేకాదు. ఈసారి సుగ్రీవుని గర్జనలో ఏదో దర్పం తెలుస్తోంది. ఇలా పిలవడానికి వెనుక ఏదో పెద్ద కారణమున్నట్లు నా మనసు శంకిస్తోంది" అన్నది తార.

వాలి చేతిలో ఘోరంగా పరాజితుడైన సుగ్రీవుడు నిర్భయంగా మళ్ళీ యుద్ధానికి గీరడం వెనుక ఏదో పథకం ఉన్నట్లు తార సందేహించింది. సుగ్రీవుని అరుపులోని దర్పాన్ని కూడా గ్రహించింది. అంతేకాదు. ఆ దర్పం వెనుక అదృశ్యంగా ఉన్న దర్పకుణ్ణి కూడా చక్కగా దర్శించగలిగింది తార.

భర్తను 'సాధు' అని సంబోధించి తన వాక్చాతుర్యాన్ని, సరళత్వాన్ని ప్రదర్శించింది. సుగ్రీవుడు మళ్ళీ వచ్చి కయ్యానికి పిలవడం వెనుక ఏదో పథకం ఉన్నట్లు అనుమానించి తన సూక్ష్మబుద్ధిని నిరూపించుకుంది.

"వీరుడా! సుగ్రీవుడు ఒంటరిగా వచ్చివుంటా డని నేను భావించడం లేదు. అతని వెనుక ఎవరో సహాయం చేసేవారు ఉండి ఉండాలి. వారి అండ చూసుకొనే సుగ్రీవుడు అలా గర్జిస్తున్నాడు.

"సుగ్రీవుడు సహజంగా గొప్ప నేర్పు కలవాడు. బుద్ధిమంతుడు. ఎదుటివ్యక్తిని పరీక్షించకుండా సుగ్రీవుడు స్నేహం చేయడు" అన్నది తార.

సుగ్రీవుని అరుపును విని మహోద్రేకంతో మండిపడి ముందు కురుకుతున్న వాలిని 'సాధూ' అంటూ ఆపి, అతని ఆవేశ ప్రవాహానికి తన ఆలోచనల్ని ఆనకట్టలుగా పేర్చుకుంటూ, అంచె లంచెలుగా వాలిని అవగాహనా అంచులవైపు నడిపిస్తోంది తార.

మొదట తన అనుమానాన్ని తెలిపింది. అది ఎలా వాస్తవమో సహేతుకంగా వర్ణించింది. సుగ్రీవుని వెనుక ఎవరో ఉన్నట్లు రూఢిపరచింది. ఒకవేళ ఉంటే ఏమైంది? అని వాలి భావించవచ్చు. అలా అంచనా వేసి కష్టాలపాలు కావద్దని పరోక్షంగా హెచ్చరిస్తూ సుగ్రీవుని ప్రస్తావన తెచ్చింది.

నిపుణుడైన సుగ్రీవుడు ఎదుటివ్యక్తి పరాక్రమాన్ని బేరీజు వేయకుండా స్నేహం చేయడు అని బరువైన వాదాన్ని వినిపించింది. వాలి విషయం, వాలి పరాక్రమం సుగ్రీవునికి బాగా తెలుసు. అట్టివాడు ఒకసారి దెబ్బలు తిని వెళ్ళి వెంటనే తిరిగి వచ్చి యుద్ధానికి రమ్మని దర్పంతో గర్జిస్తున్నా డంటే, తనకు సహాయం చేయడానికి వచ్చినవాడు వాలికన్నా బలహీనుడైతే సుగ్రీవుడు అలా ప్రవర్తించగలడా? కనుక సుగ్రీవుని శక్తిని ఈ సమయంలో తక్కువగా అంచనా వేయకూడదని సలహా ఇస్తోంది తార. రాబోయే ఆపదను సూచిస్తోంది.

"వీరుడా! దీనికి ముందే మన కుమారుడైన అంగదుడు నాతో ఒక విషయం చెప్పి ఉన్నాడు. బాగా ఆలోచించవలసిన విషయం. చెబుతాను. విను."

"అంగదుడు కిష్కింధ సరిహద్దులలోకి ఇటీవలే వెళ్ళివచ్చాడు. అక్కడ మన గూఢచారుల ద్వారా ఒక వార్తను విన్నాడు. విన్నది విన్నట్టుగా నాతో చెప్పాడు.

"రామలక్ష్మణులనే ఇద్దరు సోదరులు మన ప్రాంతానికి వచ్చారట. వారు ఇక్ష్వాకు వంశీయులట. దశరథుని కుమారులని చెప్పాడు. రామలక్ష్మణులు అసమాన పరాక్రమ వంతులని, వీరులని, శత్రుంజయులని తెలిసింది."

"వారిద్దరూ నీ తమ్మునికి సాయం చేయడానికి వచ్చారట. పైగా రాముడు ప్రళయ కాలాగ్ని లాంటివాడని చెప్పుకుంటున్నారు.

నివాసవృక్షః సాధూనా మాపన్నానాం పరా గతిః
ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైక భాజనమ్ ॥

"బాటసారులకు ఛాయనిచ్చు చెట్టువలె సాధువులకు రాముడు నివాస వృక్షము వంటివాడు. ఆపదలలో ఉన్నవారికి అతడే గతి. దుఃఖితులకు ఆశ్రయ మైనవాడు. కీర్తిభాజనుడట"; అన్నది తార.

సుగ్రీవుని వెనుక నిలిచియున్న శక్తి ఎవరో కూడా మెల్లగా తానే చెప్పేసింది. రాముని పరాక్రమ మెలాంటిదో, స్వభావ మెలాంటిదో కూడా విప్పి చెప్పింది. నిజమే కావచ్చు. రాముడు సుగ్రీవునికి ఎందుకు సహాయం చేస్తాడు? అగ్నిసాక్షిగా రామ సుగ్రీవులు స్నేహం కట్టుకున్నట్లు తారకు కూడా తెలియదు కదా!

ఇక్కడే తార వైభవోపేతమైన జ్ఞానంతో భాసిస్తోంది. రాముని గుణవిశేషాలను వర్ణిస్తూ, రాముని సహాయం పొందుటకు సుగ్రీవుడు ఎలా అర్హుడో చెబుతోంది.

1. సుగ్రీవుడు సాధువు. రాముడు సాధువులకు నివాసవృక్షము.
2. సుగ్రీవుడు ఆపన్నుడు. రాముడు ఆపన్న శరణ్యుడు.
3. సుగ్రీవుడు ఆర్తుడు. రాముడు ఆర్తజన సంశ్రయుడు.
4. సుగ్రీవుడు కీర్తిమంతుడు. రాముడు కీర్తిభాజనుడు.

రాముడు సహాయం చేయడానికి కావలసిన లక్షణాలన్నీ సుగ్రీవునిలో ఉన్నాయి. కనుక రాముడు సుగ్రీవునికి అండగా వచ్చి ఉంటాడు అని తేల్చి చెప్పింది. పైగా రాముడు అసమాన పరాక్రమవంతుడు. సరే! అంతా బావుంది. ఇంతకీ ఏమి చేయాలి? అది కూడా తారే చెప్తోంది.

"వీరాధివీరా! యుద్ధంలో రాముని జయించడం తేలిక కాదు. రాముని శక్తి అలాంటిది. నామాట విను. రామునితో శత్రుత్వము పెట్టుకోవడం మనకు శ్రేయోదా యకము కాదు.

"నాకు తోచిన మంచిమాటను నీ మేలు కోరి చెబుతున్నా. కోపగించుకోకుండా విను. సుగ్రీవునితో విరోధము మానేయ్. సుగ్రీవుని యువరాజు చేసేయ్."

"సుగ్రీవుడు నీ తమ్ముడు. నీ లాలనకు అర్హుడు. మంచివాడు. సుగ్రీవుని వంటి బంధువు నీకు ఈ ప్రపంచంలో లభించడు. ఎక్కడున్నా అతడు నీ తమ్ముడు కాకపోడు.

"అతనిని ప్రేమతో చూడు. అతని కివ్వాల్సిన గౌరవాన్ని అతని కివ్వు. ఎల్లప్పుడూ విశ్వసించదగిన సుగ్రీవుని నీ ప్రక్కనే ఉంచుకో. సోదరప్రేమను అతనికి పంచు. నీ తరువాత వానిగా అతనికి గుర్తింపు నివ్వు. నీకు ఈ సమయంలో ఇదొక్కటే చక్కని మార్గము.

అహం హి తే క్షమం మన్యే తవ రామేణ సౌహృదమ్
సుగ్రీవేణ చ సంప్రీతిం వైర ముత్సృజ్య దూరతః

"విరోధాన్ని విడిచిపెట్టి సుగ్రీవునిపై ప్రేమ చూపడం, రామునితో స్నేహం చెయ్యడం ఈ రెండే నేను కోరుకుంటున్నాను" అని పరిష్కారాన్ని కూడా వాలి ముందు పరచేసింది తార.

చూశారా! తార ఎంత సారగ్రాహియో! బాధ్యతా భారవాహియో!

భయంకరమైన పరిస్థితుల్లో భర్త సమస్యను చక్కని విశ్లేషణతో విమర్శించుకొని, సముచిత రీతిలో స్నేహపూర్వకంగా, హేతుబద్ధంగా భర్తకు వివరించి, చేవ కలిగిన పరిష్కారాన్ని కూడా అందించి, సహధర్మచారిణి, ధర్మపత్ని అనే మాటలకు దివ్యశోభను కల్పించింది పరమ సాధ్వీమణి తార.

ఆమె సూచించిన పరిష్కారంలో ధర్మబద్ధమైన విషయాలు ఎలా చోటు చేసుకొని ఉన్నవో చూడండి.

ఈ వ్యవహారంలో మొత్తానికి ముగ్గురు వ్యక్తులు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. **1.** సుగ్రీవుడు - కాలుదువ్వేవాడు **2.** వాలి - కయ్యానికి సిద్ధపడేవాడు **3.** శ్రీరాముడు - కనుమరుగై యున్నవాడు.

1. సుగ్రీవుని ప్రేమించడం, అతనికి యౌవరాజ్య పట్టాభిషేకం చేయడం - ఇదీ సుగ్రీవుని విషయంలో తార సూచించిన విషయం. ఆమె సూచన మేరకు చేస్తే ధర్మబద్ధంగా సుగ్రీవునికి ఇవ్వవలసిన రాజ్యాన్ని ఇచ్చినట్లూ అవుతుంది. వైరుధ్యాన్ని తొలగించు కోవడం జరుగుతుంది. బుద్ధిమంతుడైన సుగ్రీవుడు వాలికి తోడుగానూ ఉంటాడు.

2. తమ్ముణ్ణి గౌరవించి, ప్రేమించా డన్న కీర్తి వాలికి లభిస్తుంది. రామునివంటి మహావ్యక్తితో సఖ్యం ఏర్పడుతుంది. ఆపదలూ కరిగిపోతాయి. తమ్ముణ్ణి తరిమేశాడనే అపఖ్యాతి కూడా వాలికి మిగలదు.

3. ఇక రాముని విషయం. ధర్మాత్ముడు, దివ్యాత్ముడు అయిన రామునితో స్నేహం చేయడం వల్ల రామునికి సముచితమైన మర్యాద నిచ్చినట్లూ ఉంటుంది. వారి వీరత్వాన్ని గౌరవించినట్లూ ఉంటుంది.

ప్రతాపము, అహంకారము, దంభములతో విర్రవీగి విపత్తులను ఆహ్వానిస్తున్న భర్త యొక్క అనిశ్చిత ఆలోచనలకు తెరవేయాలని, తెర దించాలని ప్రయత్నించింది తార.

యదితే మత్ప్రియం కార్యం యది చావైషి మాం హితామ్
యాచ్యమానః ప్రియత్వేన సాధువాక్యం కురుష్వ మే

"వీరుడా! నాకు మేలు చేయాలని నీవు భావించేట ట్లయితే, నేను నీ మేలు కోరే దానినని నీవు అభిప్రాయపడేట ట్లయితే నేను చెప్పినట్లు చక్కగా ఆచరించు. నిన్ను నేను శాసించడం లేదు. శరణు జొచ్చి పలుకుతున్నాను.

"నా మాట విని కోపాన్ని విడిచిపెట్టు. దేవేంద్రునితో సమానుడైన రామునితో నీకు విరోధము మంచిది కాదు"; అన్నది చివరగా తార.

"తారా! నా తమ్ముడు, పైగా నా శత్రువు గర్జిస్తూ నన్ను కయ్యానికి పిలుస్తుంటే నన్ను చేతులు ముడుచుకొని కూర్చోమంటావా! వీరుడైన వానికి అంతకన్నా మరణమే నయం."

"ఇక రాముని విషయ మంటావా! ఆ విషయంలో నీకు దిగులు అవసరం లేదు. రాముడు ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు అని నీవే చెప్తున్నావు కదా! అలాంటివాడు పాపము ఎలా చేస్తాడు? అధర్మంగా ఎలా ప్రవర్తిస్తాడు?" అంటూ ముందుకు నడిచాడు వాలి.

తార వాలిని వెంబడించి అడుగులు వేస్తోంది. వాలి వెనుదిరిగి తారను చూశాడు. "ఇంకా నా వెనుకే వస్తున్నా వెందుకు? నీకు నా మీదున్న ప్రేమను, భక్తిని చూపావు కదా! చాలు. వెనుదిరిగి అంతఃపురం లోకివెళ్ళు."

"నేను వెళ్ళి సుగ్రీవునితో పోరాడుతాను. వాడికి బుద్ధి చెబుతానే గాని ప్రాణం తీయను. నీవు వెళ్ళు. నా వెంట రాకు" అన్నాడు వాలి.

పోయేవాళ్ళు పోతూ ఉంటారు. ఎవరు మాత్రం ఎంతవరకు వెంట నడుస్తారు? "నా వెంట రావద్దు" అంటున్నాడు వాలి తారతో. అంతేమరి! ఇక అతని ప్రయాణము ఒంటరి ప్రయాణమే.

తంతు తారా పరిష్వజ్య వాలినం ప్రియవాదినీ
చకార రుదతీ మన్దం దక్షిణా సా ప్రదక్షిణమ్

"ప్రియముగా మాట్లాడునది, నేర్పు గలది అయిన తార మెల్లగా ఏడుస్తూ వాలిని కౌగిలించుకుంది. అతనికి ప్రదక్షిణం చేసింది".

భర్తకు విజయాన్ని కాంక్షిస్తూ స్వస్త్యయనాది మంత్రాలు పలికింది. చింతాక్రాంతు రాలైంది. సఖులతో కలిసి అంతఃపురములోకి వెళ్ళింది.

తాను చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసింది తార. భర్త తన మొండిపట్టును విడిచిపెట్టలేదు. ఇక చెప్పి లాభం లేదని భావించింది. తనవి హితవచనాలే అయినా అరణ్యరోదనమేనని భావించి తన భాషణాన్ని సాగించకుండా త్రుంచేసుకుంది.

భర్తకు నచ్చచెప్పాలని అనేక విధాల ప్రయత్నించింది. అది కూడా కటువుగా కాకుండా ప్రియంగా, నేర్పుతో మాట్లాడింది. ఆమెలోని విశిష్టమైన ఈ లక్షణాలను చూచి ప్రియవాదిని, దక్షిణ (నేర్పు గలది) అని వాల్మీకి తారను స్తుతించాడు.

భర్త ఎలాగూ వినడం లేదని గ్రహించిన తార భగవంతుని ప్రార్థించాలని భావించి, తనను తాను కుదుట పరచుకుంది. స్వస్త్యయనము చేసి లోనికెళ్ళింది.

ప్రథమదర్శనంలోనే తార పాత్ర ఎంతో జాజ్వల్యమానంగా ప్రకాశించింది. ఆమె మాటను, మనసును ఎంతగానో శ్లాఘించాడు వాల్మీకిమహర్షి. విషయాన్ని బాగా ఆకళింపు చేసుకోవడమే కాక విషయాన్ని బాగా అందించగలిగింది కూడాను.

"సాధు" అనే పదంతో తన అభిప్రాయాన్ని వినిపించేందుకు ప్రారంభమైన తార "సాధు" అనే పదాన్ని ఉచ్చరిస్తూ తన భాషణాన్ని సమాప్తి చేయడం కూడా గమనించ దగిన విషయం.

'సాధు' అంటే బాగుగా అని అర్థము. విషయ విశదీకరణలో, విశ్లేషణములో ఉపక్రమ ఉపసంహారముల యందు తార బాగుగా వర్తించిందని, ప్రవర్తించిందని భావము. కానీ ఏమి లాభం?

న రోచతే తద్వచనం హి తస్య కాలాభిపన్నస్య వినాశకాలే

ఉపయుక్తమైన, హితకరమైన మాటలను పలికింది తార. కానీ వినాశకాలము దాపురించడం వల్ల ఆ మాటలు వాలికి రుచించలేదు అంటాడు ఆదికవి.

వాలి వధ - ధర్మ మీమాంస

రామాయణంలో అనేక యుద్ధాలు జరిగాయి. అనేకమంది మరణించారు కూడా. గొప్ప వీరులు కూడా మరణించారు. కానీ వాలివధ ఒక్కటే వివాదాస్పదమైంది. ఇంకా అవుతూ ఉంది.

"నీవు అధర్మం చేశావు" అని వాలిని రాముడు విమర్శించాడు ఆనాడు ఒక్కసారి. "నీవూ అధర్మం చేశావు. అధర్మాన్ని ఆచరించడం నీకు తగునా?" అని ఆనాటి నుండి నేటి వరకు రాముని ఎందరో ప్రశ్నిస్తున్నారు. దీనిపై అనేకములైన వాదాలు వినిపిస్తూ ఉంటాయి.

"రాముడు వాలిని చంపడం ధర్మమా? అధర్మపరుడైన వాలిని చంపడం న్యాయమే. అలాంటప్పుడు వెనుక నుండి ఎందుకు చంపాలి? తన స్నేహితుడైన సుగ్రీవుని సుఖం కొరకు వాలిని అధర్మంగా చంపడమేనా? సుగ్రీవుని సుఖాన్ని మాత్రం రాముడు ఎందుకు వాంఛిస్తున్నాడు? సీతాన్వేషణలో సహకరిస్తాడు సుగ్రీవుడు అనే కదూ? అయితే తన సుఖానికి రాముడు వాలిని చంపాడా? ఇదే వాస్తవమైతే, ధర్మమనే పదానికి అర్థం మిగులుతుందా? స్వార్థమే ధర్మమైతే, రావణాసురుని తప్పు పట్టగలమా?" ఇలాంటి ప్రశ్నలు దొంతరలుగా వచ్చి ముందు నిలుస్తాయి ఈ సమస్యను కదిపితే.

ఇప్పటికే మోయలేని విధంగా వాదాలు వినిపిస్తుంటే, నా వాదంతో మీకు భారాన్ని అధికం చేస్తానేమో అనే భయం నా ఆంతర్యంలో చలిస్తోంది. ఈ సంశయం తలయెత్తింది కనుక సాధ్యమైనంత వరకు విషయాన్ని జటిలం చేయకుండా సున్నితంగా స్పృశించి నా అవగాహనను మీ ముందు ఉంచుతాను.

రామసుగ్రీవుల మైత్రి జరిగే నాటికి రాముడు కష్టాల ఊబిలో కూరుకుపోయి ఉన్నాడు. కన్నీటి వాగులో మునిగిపోయి ఉన్నాడు. సీతను అన్వేషిస్తూ ఆవేదనతో కుమిలిపోతున్నాడు.

విధి విజృంభించి రాముని కబంధహస్తాలలో బంధించింది. పురుషప్రయత్నంతో బంధాలను ఛేదించుకున్నాడు రాముడు. కానీ సీత లభించినపుడే తన బ్రతుకులో అందాలు చిగురిస్తాయి.

సీతాన్వేషణలో రామునికి సహకరించ గలవాడు సుగ్రీవుడే అని చెప్పి కబంధుడు పుణ్యలోకాలకు వెళ్ళాడు. రాముడు సుగ్రీవుని వెతుక్కుంటూ ఋష్యమూకము వద్దకు వచ్చాడు. హనుమంతుని సహాయంతో రామసుగ్రీవుల మైత్రి జరిగింది.

ఇది చాలా ఆదర్శమైన మైత్రీబంధము. రామసుగ్రీవు లిద్దరూ రాజ్యభ్రష్టులు. భార్యలను పోగొట్టుకున్నవారు. శోకములో మునిగి యున్నవారు. దారి ఏమిటో తెలియని

స్థితిలో ఉన్నవారు. స్వరాజ్యానికి దూరులైన వారు. ఇలాంటివారు స్నేహితులు కావడంలో ఆశ్చర్య మేముంది? సమప్రవృత్తి లేదా సమవృత్తి గలవారి మధ్యే కదా స్నేహము?

కబంధుని సలహా ప్రకారం రాముడు సుగ్రీవుని వద్దకు వచ్చాడు. సుగ్రీవుని దీనావస్థను చూశాడు. వాలి అధర్మపరుడని గుర్తించాడు. వాలిని వధించాలనే నిర్ణయానికి వచ్చాడు రాముడు.

ఇక్కడ ఒక్క విషయాన్ని మనం గమనించాలి. వాలిని చంపమని సుగ్రీవుడు అడగలేదు. రాజ్యం కావాలని కూడా సుగ్రీవుని మనసులో లేదు. వాలి అపహరించిన తన భార్య రుమను ఎలాగైనా తిరిగి పొందాలనేదే అతని రంధి.

వాలి తనకు అపకారం చేస్తాడేమో అనే సంశయంతో భయపడుతున్నాడు సుగ్రీవుడు. తనకు అభయాన్ని ప్రసాదించమని రాముని ప్రార్థించాడే గాని వాలిని వధించమని చెప్పలేదు.

రాముడు స్వతంత్రించి "నీ భార్యను అపహరించిన వాలిని బాణాల్తో కూల్చేస్తాను" అన్నాడు. కనుక వాలిని వధించడ మనేది రాముని సంకల్పమే గాని సుగ్రీవుని అభీష్టము కాదు, ఈ దశలో.

దశ అంటే జ్ఞాపక మొస్తోంది. రామాయణగాథ ప్రధానంగా రెండు దశల మధ్య నడిచిన గాథ. ఒకటి దశరథుడు కాగా రెండవది దశకంఠుడు.

ఇద్దరూ గొప్పవారే. ఇద్దరూ విషయపిపాసకు లోనైనవారే. ఇద్దరూ కామాన్ని జయించలేని వారే. అయితే ఒకరు కామాన్ని ధర్మబద్ధంగా అనుభవించారు. మరొకరు అధర్మంగా అనుభవించారు.

రావణుని అంతఃపురంలో అందమైన స్త్రీలు వేలసంఖ్యలో ఉన్నారు. వారందరు రావణుడు మోహించి తెచ్చుకున్నవారే. రావణుని ఆటబొమ్మలే. కీలుబొమ్మలే.

దశరథుని అంతఃపురంలో కూడా తక్కువేమీ లేరు. ముచ్చటగా, ముఖ్యంగా ముగ్గురు తెలుస్తున్నా, మూడువందలయాభై మంది స్త్రీలు అంతఃపురములో ఉన్నారు. వారందరు దశరథుని భార్యలే.

కాకపోతే, రావణుడు స్త్రీలను అధర్మంగా అపహరించి తెచ్చుకున్నాడు. దశరథుడు ధర్మబద్ధంగా వరించి తెచ్చుకున్నాడు. అంతే తేడా. ధర్మబద్ధమైన కామమును శాస్త్రము సమర్థిస్తుంది. అధర్మంతో కూడిన కామాన్ని నిరసిస్తుంది.

ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ

"జీవులలో ధర్మవిరుద్ధము కాని కామము నేనే" అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్తూ, ధర్మయుతమైన కామము నిషిద్ధము కాదు అని తెలిపాడు.

కామము నిషిద్ధము కాకపోవచ్చు. కానీ ప్రసిద్ధము మాత్రము కాదు. యుద్ధము చేసైనా మనసు నుండి దూరం చేయదగినదే.

ధర్మవిరుద్ధము కాని కామము దశరథునిది. ధర్మవిరుద్ధమైన కామము దశకంఠునిది. ఈ రెండూ కామముయొక్క దశలే. ఒకటి ఆరంభంలో తెలుస్తూ ఉంది. మరొకటి అంత్యంలో కనిపిస్తోంది. ఈ మధ్య నడిచేదే రామాయణ గాథ. రాముని గాథ. ధర్మగాథ. ధర్మబోధ.

రాముడు కామాన్ని జయించాడు. ధర్మాన్ని ఆశ్రయించాడు. కామం పంచే భోగాలను త్యజించాడు. ధర్మం పెట్టే బాధల్నే వరించాడు. కామంతో సుఖించడంకన్నా ధర్మంతో మరణించడం మేలని భావించాడు. అందుకే రాముడు ధర్మావతారంగా కీర్తించబడ్డాడు.

ధర్మమైనా, అధర్మమైనా కామము మోహము వల్లనే పుడుతుంది. రాగము కామము వల్ల ఏర్పడుతుంది. కామరాగాల్ని శ్రీ శంకరాచార్యుల వారు బహుచక్కగా నిర్వచిస్తారు.

కామాః, తృష్ణా అసన్నికృష్టేషు విషయేషు

"లేని దాని కొరకు కదిలే కోరిక కామము".

రాగః రంజనా ప్రాప్తేషు విషయేషు

"ఇదివరకే ఉన్నదానియందు ఆసక్తి రాగము".

దశరథునిది రాగబంధము. రావణునిది కామబంధము. రెండూ మోహబంధాలే. మాయాబంధాలే. దుఃఖరూపాలే.

దశరథుడు రాగకారణంగా మరణిస్తే, రావణుడు కామకారణంగా మరణిస్తాడు. మోహమునకు గమ్యము మరణమే. రామాయణమునందు ఆద్యంతాలలో ఈ రెండే నిలిచి ఉన్నాయి.

ఇవే రెండు దశలు. దశరథుడు, దశకంఠుడు అనే దశలు. ఒక దశ అంతరించగనే అరణ్యవాసము ప్రారంభ మవుతుంది. రెండవ దశ అంతరించగనే అరణ్యవాసము సమాప్త మవుతుంది.

ఈ రెండు దశల మధ్య నడిచేదే సాధకుని సాధనాదశ. అదే అరణ్యవాసము. ధర్మాన్ని ఆధారంగా పట్టుకొని కామాన్ని, మోహాన్ని నిరోధించే నిర్మలదశ. నిత్యదశ.

తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాది రాక్షసాన్
యోగీ శాంతి సమాయుక్తః ఆత్మా రామో విరాజతే ॥

"ఆత్మజ్ఞాని మోహసాగరాన్ని దాటి, రాగద్వేషాది రాక్షసుల్ని సంహరించి, ఆ తరువాత శాంతిని పొంది ఆత్మారాముడై శోభిస్తున్నాడు" అని నిత్యమైన రామకథను ఒక్క శ్లోకంలో నింపి చక్కగా ప్రవచించారు "ఆత్మబోధ" ప్రకరణగ్రంథంలో ఆదిశంకరాచార్యులవారు.

దశరథుని రాగముతో కూడిన మరణముతో ప్రారంభమై, దశకంఠుని కామముతో కూడిన మరణముతో సమాప్తమయ్యే ఈ రెండు దశల మధ్య శ్రీరాముని తాపసజీవనము మనకు గోచరిస్తుంది.

రాగానికి దూరమై అరణ్యాలకు చేరిన రాముడు, కామాన్ని వధించి తిరిగి అయోధ్యకు చేరుతాడు. జీవితమంతా ఏ సన్నివేశంలో చూచినా రాముడు ధర్మమూర్తిగా జాజ్వల్యమాన మవుతాడు.

రాముని జీవితం అడుగడుగునా త్యాగమయం. బ్రతుకంతా ధర్మమయం. ప్రేమమయం. జ్ఞానమయం. ధర్మం కొరకు కష్టాల్ని కొనితెచ్చుకున్న రాముడు సుఖం కోసం అధర్మమార్గాన చరిస్తాడా?

యుద్ధకాండలో ఒక క్లిష్టదశలో రావణుడు రథాన్ని, ధనుర్బాణాల్ని పోగొట్టుకొని నిరాయుధుడై నిలుస్తాడు. ఆ సమయంలో రాముడు ఎదురుగా నిలబడి బాణాన్ని ఎక్కుపెట్టి ఉన్నాడు. నారిని చెవిదాకా లాగితే చాలు. రావణుడు శ్మశానంలో ఉంటాడు. కానీ రాముడు ఆ పని చేయలేదు. రావణుడి పోరాటపటిమను ప్రశంసించాడు. విశ్రాంతి తీసికొని మరునాడు యుద్ధానికి రమ్మని పంపించాడు. అదీ రాముడంటే.

తన భార్యను అపహరించినవాడు నిరాయుధుడై ఎదుట నిలబడినపుడు చంపకుండా వదలిపెట్టిన ధర్మాత్ముడైన రాముడు, సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని అధర్మంగా చంపుతాడా? ఒక్కక్షణం మంచి మనసుతో ఆలోచించమని విమర్శకులను చైతన్య రామాయణం కోరుతోంది.

ఇక వాలివధను విశ్లేషిద్దాం.

రుమను వాలి అపహరించాడని సుగ్రీవుని ద్వారా వినగానే ధర్మాత్ముడైన రాముడు వాలిని వధిస్తానని సుగ్రీవుడు అడగకుండానే చెప్పేశాడు.

తనకు జరిగిన అన్యాయమే సుగ్రీవునికి కూడా జరిగింది. తనకు అన్యాయం చేసిన రావణుని కూల్చేస్తానని శపథం చేసి బయలుదేరిన రామునికి మధ్యలో సుగ్రీవుడు తటస్థపడ్డాడు. తన కథను విప్పి చెప్పాడు. సుగ్రీవునికి న్యాయం చేయకుండా రాముడు తనకు ఎలా న్యాయం చేసుకోగలడు? ఎదురైన అవరోధాన్ని నిరోధించకుండా తాను ఎదురుచూసే అవరోధాన్ని ఎలా తొలగించగలడు? ఒకవేళ అలా చేస్తే రాముడు ధర్మమూర్తి అవుతాడా? స్వార్థపరుడుగా మిగలడా?

యౌవరాజ్య పట్టాభిషేకాన్ని కాలదన్ని, ధర్మానికి పట్టాభిషేకం చేయాలని కానల్లో ప్రవేశించిన రాముడు సుగ్రీవునికి పట్టాభిషేకం చేయకుండా ఎలా ఉండగలడు?

అయితే, సీతాన్వేషణలో సుగ్రీవుడు తనకు సహకరిస్తాడు అనేకదా రాముడు వాలిని వధించింది?

ఈ ప్రశ్నను లేవనెత్తి రామునిపై అపరాధాన్ని మోపాలనే దానికన్నా మించిన ఘోరాపచారము మరొక టుండదు. సీత ప్రసక్తి రాకముందే, అధర్మపరుడైన వాలిని వధిస్తానని రాముడు తనకు తానే చెప్పాడు. వాలిని చంపడ మనే కర్మ ద్వారా మోహాన్ని

కూర్చోబెట్టి, రావణుని వధించడ మనే కర్మ ద్వారా మోహాన్ని శాశ్వతంగా పడుకోబెట్టాలని రాముడు సంకల్పించాడు. ఇది ఫలితాన్ని ఊహించని మహోత్తమ కార్యము.

సీతాన్వేషణలో తనకు సుగ్రీవుడు సహకరిస్తాడనే ఉద్దేశ్యముతో కనుక రాముడు వాలిని వధించి ఉంటే, నిజానికి రాముడు వాలితోనే స్నేహాన్ని కట్టుకొనేవాడు. వాలి కూడా రాముని నిందించే సమయంలో ఇదే సూచించాడు.

"రామా! సుగ్రీవునికి మేలు చేయాలని భావించి దేనికొరకు నన్ను వధించావో, ఆ కార్యసాధనకై ముందుగా నీవు నాకు చెప్పివుంటే, నీ భార్యను అపహరించిన దుర్మార్గుడైన ఆ దశకంఠుని కంఠానికి త్రాడుకట్టి ఈడ్చుకొనివచ్చి చంపకుండా నీ ముందు పడేసి వుండేవాడిని" అంటాడు వాలి రామునితో అర్భకునిలాగా.

రామబాణంతో మైకం కప్పిన వాలికి తాను ఏమి మాట్లాడుతున్నాడో, ఎవరితో మాట్లాడుతున్నాడో తెలిసిరాలేదు. తన భార్యను అపహరించిన రావణుని జయించుట కొరకు సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని రాముడు ఆశ్రయించాలా! ఆహా! ఎంత వ్యర్థమైన మాట! అనర్థమైన మాట! రాముడు సీతనైనా మరచిపోతాడేమో గాని ధర్మాన్ని మాత్రం విడిచిపెట్టడు అని కపిశ్రేష్ఠునికి తెలియదు పాపం.

కనుక రాముడు వాలిని వధించింది తన కొరకు కాదు. సుగ్రీవుని కొరకూ కాదు. కేవలం ధర్మం కొరకే అనే విషయంలో ముందుగా మీరు నాతో ఏకీభవించాలి.

ధర్మం కొరకు రాముడు వాలిని వధించాలని భావించాడు. అనుకోకుండా దాని ద్వారా సుగ్రీవుని సమస్య కూడా పరిష్కారమైంది. రాముడు ధర్మాశ్రయుడు. అధర్మపరుడైన రావణుడు పరస్త్రీలను అపహరించడమనే కార్యాన్ని చూసి తీవ్రంగా రాముడు కలతచెంది యున్నాడు.

రుమను వాలి అపహరించిన విషయం చెవిని పడగానే, దేనిని ప్రతిఘటిస్తూ తాను బయలుదేరాడో అలాంటి విషయమే ఇక్కడ ఎదురైంది.

కానీ ఈ విషయం రామునికి సంబంధించింది కాదు. దీనిని కష్టపడి పరిష్కరించడం వల్ల రామునికి ఒరిగేది కూడా లేదు. అయినా, రాముడు వాలిని చంపాడు. ఎందుకని? ధర్మం కోసం. స్వార్థం కోసం కాదు.

వాలిని వధించడం దోషం కాదని తేలిపోయింది కదూ! ఇక మన ముందున్న అతి ముఖ్యమైన ప్రశ్న! రాముడు వాలిని చెట్టు వెనుక నిలబడి ఎందుకు చంపాలి? లేదా దాగియుండి ఎందుకు చంపాలి? ప్రచ్ఛన్నంగా నిలిచి చంపడం ధర్మమా?

ఇంతకీ, రాముడు వాలిని దాగిఉండి చంపినట్లేనా? అదలా ఉంచండి. రాముడు వాలిని ప్రచ్ఛన్నంగా ఉండే వధించాడు అని నిర్ణయించిన సంస్కృత వ్యాఖ్యాతలు అలా చేయడానికి గల కారణాన్ని కూడా వివరించారు.

తదా విదిత తదీయ ప్రభావతయా వాలీ ప్రహ్వో భవేత్ -

తదా తద్వధోం న యుక్తః ప్రతిజ్ఞా చ వ్యాహన్యేత్,

తదుద్ధారా తన్మిత్రం రావణోఽ పి శరణం వ్రజేత్

దేవకార్య చ లుప్యేత్, అతః ప్రచ్ఛన్నో వాలిన మవధీత్ !

ఇది భక్తశిఖామణి శ్రీ గోవిందరాజులు వ్యాఖ్య.

వాలిని వధిస్తానని రాముడు సుగ్రీవునికి మాట ఇచ్చి ఉన్నందున ఈ విధంగా చంపకూడని రీతిలో వాలిని వధించడం జరిగిందని నిర్ణయించిన గోవిందరాజీయం అటు తరువాత కారణాన్ని విశదపరుస్తూ పైవిధంగా వ్యాఖ్యానించడం జరిగింది.

"వాలికి ఎదురుగా నిలబడి వధించేందుకు రాముడు ప్రయత్నించగనే రాముని ప్రభావానికి తలవంచి వాలి శరణాగతుడు కావచ్చు. అప్పుడు తన మిత్రుడైన సుగ్రీవునికి ఇచ్చిన వాగ్దానం విచ్ఛిన్నం కాదా! అంతేకాదు. ఇది ఇలా జరుగగానే, వాలి స్నేహితుడైన రావణుడు కూడా వచ్చి రాముని కాళ్ళమీద పడి "నేను నిన్ను శరణంటున్నాను. నన్ను క్షమించు" అంటే, అప్పుడు రాముని అవతార వైశిష్ట్యమే పోతుంది కదా! అందుచేత రాముడు ప్రచ్ఛన్నుడై వాలిని వధించాడు" అని తన నిర్మల భక్తిహృదయంతో కొండను త్రవ్వారు గోవిందరాజులు.

ఇది సబబేనా? అసలు రాముని అవతారము ఎందు కొచ్చినట్లు? అవతార వైశిష్ట్యములో దుష్టశిక్షణ ప్రధానాంశము కాదు. సాధు సంరక్షణము, ధర్మ సంస్థాపనము - ఈ రెండే అవతార వైభవములో ఉపక్ర మోపసంహారాలు. మధ్యలో దుష్టశిక్షణ జరిగిపోతుంది.

పోనీ, దుష్టుణ్ణి ఎందుకు శిక్షించాలి? శిష్టులైన వారిని దుష్టుడు శిక్షిస్తున్నాడు కనుక. హింసిస్తున్నాడు కనుక. ధర్మచ్యుతికి పాల్పడుతున్నాడు కనుక. అంతేనా!

అయితే దుష్టుడు మారితే ఏమి జరుగుతుంది? సాధుసంరక్షణము, ధర్మ సంస్థాపనము జరిగినట్లే కదా! పైగా దుష్టునిలో పరివర్తన జరిగి దుష్టుడు శిష్టుడైనట్లే కదా!

చెడ్డవాడు మారడం మంచిదా! చావడం మంచిదా! మారడు కనుక చావడం మంచిది. సామాన్యంగా చచ్చేలా లేనపుడు పైన చెప్పిన రెండు కారణాలను సాధించే కార్యంలో, భగవంతుడు అవతారమునెత్తి ఈ మూడవది అయిన దుష్టశిక్షణను చేస్తాడు.

ఒకవేళ చెడ్డవాడు మారిపోయే పరిస్థితి వచ్చినపుడు వాణ్ణి ఎందుకు చంపాలి? అవతారము దేనికొరకు వచ్చిందో అది సాధించబడినట్లే గదా? రాముణ్ణి చూసినపుడే గదా వారు మారి శరణాగతులైంది! అది అవతార వైభవమే గదా! మరి గోవిందరాజులు

అలా ఎందుకు భావిస్తారు? రాముడు అవతార మెత్తినాడు కనుక వాలి, రావణాదులు చావాల్సిందే గాని మారేందుకు అవకాశం లేదు. వారిని మారనివ్వం. అవసరమైతే రాముణ్ణి చెట్టుక్రిందకో పుట్ట వెనక్కో పట్టుకుపోతాము. లేదా మోసుకు పోతాము అని చెప్పడం ఏమిటో! నాకు మాత్రం మ్రింగుడు పడడం లేదు. ఈ విషయాన్ని పాశ్చాత్యులు ఎలా పరిగణిస్తారో ఆలోచించడం చాలా ప్రధానమైన విషయమని మీకు మనవి చేస్తున్నాను.

ఈ విషయాన్ని అవాల్మీక రామాయణాల్లో ఆయా రచయితలు తీవ్రంగా పరిగణించినట్లు ఉన్నారు. యుద్ధకాండలో విభీషణ శరణాగతి సమయంలో రామునిచేత అందంగా ఒక మాట చెప్పిస్తారు.

"అయ్యా! విభీషణుడు 'శరణు' అనగానే లంకానగరాన్ని ఇస్తానని ప్రతిజ్ఞ చేశావు కదా! ఒకవేళ రావణుడే వచ్చి శరణని పలికితే ఏం చేస్తావు?" అని రాముని ప్రశ్నించి నపుడు,

"రావణుడు వచ్చి నన్ను శరణు వేడాలేకాని, అయోధ్యను రావణుని కిచ్చి, నా ముగ్గురు తమ్ములతో కలిసి మళ్ళీ అడవికి వెళ్ళి జీవిస్తాను." అని శరణాగత వత్సలుడైన రామునిచేత పలికిస్తారు.

సరే ఇంతకీ, వాలిని వెనుకనుండి ఎందుకు చంపినట్లు? ఇది అర్థం కావాలంటే, వాలిని రాముడు మొదటే ఎందుకు చంపలేదు? అనేది అర్థం కావాలి.

"సుగ్రీవా! కిష్కింధకు పోదాం పద. నువ్వు ముందు నడువు. నీవు నామ మాత్రంగా నిలబడి వాలిని యుద్ధానికి పిలువు" అన్నాడు రాముడు.

ఇక్కడ రాముని మనోభిప్రాయ మేమిటి? సుగ్రీవుని నామమాత్రంగా ఉండమన్నాడు. అంతేగాని పోరాడ మని చెప్పలేదు. సుగ్రీవుడు కూడా అలాగే భావించి ఉంటాడని నేను ఊహిస్తున్నాను.

"సుగ్రీవా! పద నాయనా! కిష్కింధకు పోదాంపద. నువ్వు వెళ్ళి వాలిని యుద్ధానికి పిలువు. వాలి నిన్ను తుక్కు తుక్కుగా కొడితే చూడాలని ఉంది" అని రాముడు ముందుగా చెప్పి ఉన్నట్లయితే, సుగ్రీవుడు గుడ్డ బిగించి ఉండేవాడేనా? ఈ తుక్కు స్నేహ మెందుకని, విప్పుమ ఆర్పేయమని ఆంజనేయునికి చెప్పి, క్షణంలో చెట్టెక్కి కూర్చొని ఉండేవాడు.

సుగ్రీవుడు వాలిని పిలవాలి. అంతే. నామమాత్రంగా నిలబడి ఉండాలి. చాలు. వాలి రాగానే రాముడు కూడా ముందుకొచ్చి వాలికి ఎదురు నిలవాలని భావించి ఉంటాడు.

అదే వాస్తవమైతే, వాలి రాగానే రాము డెందుకు రాలేదు? పైగా సుగ్రీవుని చితకబాదుతున్నా రాముడు వచ్చి ఎందుకని ఆదుకోలేదు?

ఈ విషయాన్నే సుగ్రీవుడు ప్రశ్నించాడు. దానికి రాముడు చెప్పిన సమాధానం; "మీరిద్దరూ ఒకే విధంగా ఉన్నారు. వాలి ఎవరో, సుగ్రీవుడు ఎవరో నేను గుర్తించలేక పోయాను".

తీరా బాణం వదలిన తరువాత అది నీకు తగిల్తే నా జీవిత మేమవుతుంది?" ఇదీ రాముడు చెప్పిన సమాధానం.

ఈ సమాధానంతో తృప్తి చెందాడు సుగ్రీవుడు ఒకవైపు వాలి కొట్టిన దెబ్బలు బాధిస్తున్నా. రాముడు చెప్పిన సమాధానం మీకు అంగీకారమేనా? ఏమో! నా మటుకు నేను ఆ సమాధానంతో తృప్తి చెందలేను.

సుగ్రీవుని రాముడు గుర్తించలేకపోయాడు అనేది నమ్మశక్యం గాని విషయంలా ఉంది. వాలిసుగ్రీవుల మధ్య తేడా రామునికి అవగతం కాలేదు అనడం, అందువల్లనే బాణప్రయోగం చేయలేక పోయినట్లు చెప్పడం అసంగతంగా తోస్తోంది.

మనమే గుర్తు పట్టగలం. అలాంటప్పుడు రాముడు గుర్తు పట్టలేడు అంటే ఎవరు నమ్ముతారు? ఏముంది అక్కడ గుర్తించడానికి? కొట్టేవాడు వాలి. తినేవాడు సుగ్రీవుడు. అంతే కదూ!

సుగ్రీవుడు మహాయోధుడు. అలాంటి వీరుని అంత చులకనగా మాట్లాడటం బాగాలేదు. వాలి వంటి బలశాలి కాకపోవచ్చు. అంతమాత్రాన సుగ్రీవు డేమైనా బలహీనుడా! ఇది తన జీవితసమస్య కనుక ప్రాణాలకి తెగించి పోరాడి ఉండవచ్చు. దెబ్బలు తినేవాడు సుగ్రీవుడు అని నిర్ణయించడం సబబేనా! అందుకనే రాముడు బాణంతో కొట్టలేదు. ఇదే కదూ! మీరు వినిపించే పూర్వపక్షం!

అయితే ఇంకొక విషయం చెబుతాను. పోనీ, కొట్టేవా డెవరో, తినేవా డెవరో రామునికి తెలియకపోవచ్చు. చివరగా పరిగెత్తే టప్పుడైనా తెలియలేదా రాముడికి? పరిగెత్తే పరాక్రమవంతుడు తన చెలికాడేనని.

ఒకవైపు సుగ్రీవుడు మతంగవనం వైపు దౌడుతీస్తూ ఉంటే, తాను పూర్వము మాయలేడి వెంట పరిగెత్తినట్లు, సుగ్రీవుని వెంట పరుగెత్తేవాడు వాలి అని కూడా రాముడు గ్రహించలేకపోయాడా? మరి అప్పుడెందుకు చంపి ఉండకూడదు?

అది కూడా మరచిపోదాం. రాముడు చెట్టు వెనుక దాగియున్నాడు కదా? ఆయన ప్రక్కనే చెలిమి కలిపిన హనుమంతుడు ఉన్నాడు కదా! ఆంజనేయుణ్ణి అడిగి ఉంటే వాలి ఎవరో సుగ్రీవు డెవరో చెప్పేవాడు కదా! పోనీ ఆ పనైనా చేశాడా రాముడు! సుగ్రీవుని దేహం పచ్చిపుండులా, మాగిన పండులా అయ్యేవరకు చూస్తూనే ఉన్నాడు.

తినగలిగి నంతవరకు సుగ్రీవుడు తిని వస్తే, మీలో ఎవరెవరో నేను గుర్తు పట్టలేక పోయానని రాముడు త్రేపడం ఏం బావుంది? మీ విషయం ఏమో గాని, నా వరకు నాకు నచ్చలేదు.

"వాలిని వధిస్తాను" అని రాముడు సుగ్రీవుడు అడగక ముందే చెప్పాడు. అయితే ఎలా చంపాలని భావించాడు? అనే విషయంలో రాముడు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసి ఉన్నాడు.

అమోఘాః సూర్యసంకాశా నిశితా మే శరా ఇమే
తస్మిన్వాలిని దుర్వృత్తే పతిష్యన్తి రుషాన్వితాః

"అమోఘములైనవి, సూర్యునితో సమానమైనవి, తీక్షణమైనవి అయిన నా బాణములను నేను వాలిపై ప్రయోగిస్తాను"; అని శ్రీమద్రామాయణము నందలి కిష్కింధా కాండములోని 10వ సర్గ 32వ శ్లోకంలో రాముడు పలికాడు.

కిష్కింధకు వెళ్ళక ముందు, వాలిని చూడక ముందు రాముడు ఈ విధంగా మాట్లాడాడు. వాలిపై బాణములను ప్రయోగిస్తాను అనే వాక్యాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించాలి.

'బాణములు' అనే బహువచనాన్ని ఎప్పుడు పలికాడో వాలితో ఎదురెదురుగా నిలబడి యుద్ధం చేయాలనే రాముడు భావించాడు. అప్పుడే బాణములను ప్రయోగించే అవకాశము ఏర్పడుతుంది. ప్రక్కనుండో, వెనుకనుండో ప్రచ్ఛన్నంగా కొట్టేటట్లయితే బాణములు అవసరం లేదు. ఒక్క బాణము సరిపోతుంది.

సుగ్రీవుడు కిష్కింధలో వాలిని యుద్ధానికి పిలిచాడు. వాలి వచ్చాడు. ఇరువురూ కలిసి పోరాడుతున్నారు. అయినా రాముడు బాణాన్ని ప్రయోగించలేదు. అలా చేయడానికి కారణం రాముడు చెప్పినట్లు వాలిసుగ్రీవులు ఒకే విధంగా ఉండడం మాత్రముకాదు.

వాలియొక్క పరాక్రమాన్ని ఇప్పుడే రాముడు ప్రథమంగా చూశాడు. ఎదురు నిలబడితే మాత్రం వాలి రాముల మధ్య యుద్ధము కొన్ని రోజులైనా సాగుతుంది. వాలి అలాంటి బలవంతుడు.

వాలిని వధించలేము అనే సంకోచం రాముని మదిలో ఏ కోశానా లేదు. రాముడు ఆలోచించే విషయం వేరు. వాలికి ఎదురుగా నిలిచి రోజుల తరబడి చంపడమా! లేదా ఒకే బాణంతో కొట్టి చంపడమా!

సుగ్రీవుడు రుమ కోసం తీవ్రంగా బాధపడుతున్నాడు. రోజుల తరబడి యుద్ధం సాగుతూ ఉంటే, సుగ్రీవుని శోకం పొడిగింపబడుతూ ఉండటమే గాక వృద్ధి చెందుతూ కూడా ఉంటుంది. అది రామునికి ఇష్ట ముండదు.

"చిరం దుఃఖస్య పాపిష్ఠం"

"దుఃఖాన్ని ఎక్కువకాలం భరించడం కష్టము" అని సుమంత్రునితో చెప్పి, దశరథుడు రథాన్ని ఎందుకు ఆపలేదని అడిగితే, వినిపించలే దని రాముడు చెప్పమనిన విషయాన్ని మనము అయోధ్యాకాండములో చూసి యున్నాము.

ఈ రెండు మార్గాలలో వాలిని ఎలా చంపాలి? అని రాముడు ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఈలోగా వాలి తనివితీరా సుగ్రీవుని కొట్టడం, సుగ్రీవుడు పారిపోవడం కూడా జరిగింది.

లక్ష్మణ హనుమంతులతో కలిసి కిష్కింధలో సుగ్రీవుని చూసేలోగా రాముడు ఆలోచించుకున్నాడు. ఆలస్యాన్ని సుగ్రీవుడు భరించలేడు కనుక వాలిని ఒకే బాణంతో కూల్చేయాలని నిర్ణయించుకున్నాడు.

ప్రథమపోరాటములో చంపకపోవడానికి ఏదో ఒక కారణాన్ని చెప్పదలచు కున్నాడు కనుక ఇద్దరూ ఒకేలా ఉన్నా రని చెప్పి సుగ్రీవుని నమ్మించాడు. ఈసారి గజ పుష్పలతను గుర్తుగా ధరించమన్నాడు.

గెలిచినవాడు మాలను ధరిస్తాడు. గెలవకముందే సుగ్రీవుని ధరించమన్నాడు. అలా చేయడం సుగ్రీవుని గుర్తుపట్టుటకు అని రాముడు చెప్పాడు. కానీ అది కానేకాదు. అది జయమాలే. జయము సుగ్రీవునిదే అనే భావంతోనే రాముడు దానిని ధరింప చేశాడు. అదికూడా ఆంజనేయునికి చెప్పకుండా లక్ష్మణునికి చెప్పాడు.

సుగ్రీవునికి తాను విజయాన్ని సమకూర్చి పెడతాడు. తన ప్రతినిధిగా లక్ష్మణుని పంపి సుగ్రీవుని కంఠాన్ని అలంకరించ మన్నాడు రాముడు. అదికూడా గజపుష్పలతతో. వాడిపోయిం దనుకున్న జీవితం వికసించబోతోంది అని సుగ్రీవునికి తెలుపడానికే రాముడు అలా చేశాడు. అది బైటకు చెప్పేశాడు కూడా.

అద్య వాలి సముత్థం తే భయం వైరం చ వానర
ఏకే నాహం ప్రమోక్ష్యామి బాణమోక్షేణ సంయుగే॥

"సుగ్రీవా! ఈ రోజు నేను ఒకే ఒక్క బాణాన్ని ప్రయోగించి వాలి వలన నీకు ఏర్పడిన భయాన్ని, వైరాన్ని తొలగిస్తాను" అన్నాడు రాముడు, పద్నాల్గవ సర్గలోని పదవ శ్లోకంలో.

ఒక్క బాణంతో చంపుతానని పలకడం, అది కూడా ఈరోజే అనడంలో రాముడు ఒక నిర్ణయానికి వచ్చినట్లు మనకు స్పష్టంగా తెలిసిపోయింది.

ఈ నిర్ణయానికి రావడం వెనుక సుగ్రీవుని దుఃఖాన్ని పొడిగించడం ఇష్టం లేకనే గాని, వాలిని ఎదురుగా చంపలేక మాత్రము కాదు. రాముని వద్ద ఉన్న అస్త్రశస్త్రాలు ఎలాంటివో, విశ్వామిత్ర అగస్త్యాదులు ప్రసాదించిన దివ్యాస్త్రాలు ఎలాంటివో మనం చూసియే ఉన్నాము.

Owing to the protective virtue of Indra's necklace, Rama could not have met Vaali face to face and vanquished him, just as Ravana

could not be conquered by Gods. Rama could kill Vaali only when himself unseen.

"వాలికి ఇంద్రుడు ప్రసాదించిన రత్నహారము రక్షణగా మెడలో ఉన్నంతవరకు రాముడు వాలికి ఎదురుగా నిలబడి వాలిని వధించలేడు, రావణుని దేవతలు వధించ లేనట్లు. అందుచేతనే రాముడు వాలిని ప్రచ్ఛన్నంగా ఉండే వధించగలిగాడు" అంటారు రాజగోపాలాచారి తన ఆంగ్ల రామాయణంలో.

రాముణ్ణి మానవుడుగా చిత్రించాలనే ప్రయత్నంలో అనవసరంగా వాలిని దేవుణ్ణి చేశాడు రాజాజీ. ఎంతో రసవత్తరంగా కథ చెప్పిన రాజాజీ ఈ ఒక్కచోట ఎందుకో అలా మాట్లాడేశారు.

వాలికి ఎదురుగా నిలబడి రాముడు వధించలేడు అనడం కంటే వాలి చావడు, చిరంజీవి అంటే బావుండేది. వాలికి వరాలు ఉండొచ్చు. అంతమాత్రాన చావును అధిగమించగలడా? మృత్యుంజయుడు కాగలడా?

వాలికి మృత్యువు అనివార్యం అయినప్పుడు ఆ మృత్యుకారణాన్ని రాముడు చేజిక్కించుకోలేడు అనడం సమంజసమా! పైగా దేవతలు రావణుని జయించలేనట్లు, రాముడు వాలిని జయించలే డనడం ఏం బావుంది? ఈ ఉపమానం చప్పగా ఉండటమే గాక తలనొప్పిని కూడా కల్పిస్తోంది.

రావణుణ్ణి వాలితో పోల్చడం బావుంది. రాముణ్ణి దేవతలతో పోల్చడం ఏం బాగుంది? పోనీ ఆ ఉపమానాన్ని బట్టి చూసినా దేవతలు రావణుణ్ణి సంహరించ లేక పోవచ్చు. రాముడు సంహరించాడు కదా! రావణుణ్ణి సంహరించినట్లే వాలిని కూడా వధిస్తాడు రాముడు. మరి అసాధ్య మేమిటి?

ఇక్కడ ఒక విషయాన్ని రాజాజీ మరచిపోయారు. అరణ్యకాండములో శరభంగ మహాముని ఆశ్రమానికి సీతారామలక్ష్మణులు చేరేసరికి ఇంద్రుడు ఆకాశంలో నిలిచి రాముని వైభవాన్ని చెప్పిన విషయాన్ని మనం చూసియే ఉన్నాము. గొప్ప కార్యాన్ని రాముడు సాధిస్తాడని, ఆ తరువాత తాను రాముని దర్శిస్తానని ఇంద్రుడు చెప్పడం కూడా మనము విన్నాము.

రాముని పరాక్రమాన్ని గూర్చి ఇంద్రాదులే అలా కీర్తిస్తూ ఉంటే, ఇంద్రుడు ఇచ్చిన హారము ప్రభావం వల్ల వాలిని రాముడు వధించలే డనడం నిర్హేతుకంగా కన్పిస్తోంది.

వాలిని అధర్మపరుడుగా రాముడు నిర్ణయించాడు. ధర్మాత్ముడైన సుగ్రీవునికి సహాయం చేయాలని, వాలిని వధించాలని భావించాడు. ఆలస్యం జరుగకుండా తొందరగా ముగించాలని అభిలషించాడు.

త్వరగా చంపాలనుకున్నాడే గాని ఎదురుపడాలని అనుకోలేదు. దాగి కొట్టాలని తలచలేదు. అధర్మపరుణ్ణి చంపడంలో పద్ధతులు, ప్రక్రియలు అవసరమని రాముడు భావించలేదు. వాలితో యుద్ధం చేయడానికి రాముడు రాలేదు. అధర్మపరుడైన వాలిని చంపాలనే వచ్చాడు. వచ్చిన పని పూర్తి చేశాడు. రాముడు చెట్టు చాటున దాగి కనుక వాలిని బాణంతో కొట్టి ఉంటే, నాకు తోచిన మరొక వాదాన్ని గూర్చి కూడా నేను మీకు వినిపించి ఉండేవాణ్ణి. కానీ రాముడు చెట్టు మాటున దాగి కొట్టినట్లు ఆధారాలు లేవు.

మొదటిసారి కిష్కింధకు వచ్చినపుడు, సుగ్రీవుడు వాలి చేతుల్లో దెబ్బలు తిని పారిపోయినపుడు రాముడు చెట్టుమాటున నిలబడి వాలి పరాక్రమాన్ని చూసింది నిజమే. రెండవసారి వచ్చినపుడు రాముడు చెట్టుమాటున దాగినట్లు లేదు.

వాల్మీకంలో పదమూడవ సర్గ ప్రారంభంలో రామసుగ్రీవులు కిష్కింధకు రెండవసారి బయలుదేరుతారు. పదహారవ సర్గ చివరలో ముప్పై ఐదవ శ్లోకంలో వాలిపై రాముడు బాణాన్ని వదిలాడు. అంటే, రామసుగ్రీవులు వనం నుండి బయలుదేరినది మొదలు కిష్కింధలో రాముడు వాలిపై బాణప్రయోగం చేసేవరకు మధ్యలో 118 శ్లోకాలు నడిచాయి. ఈ నూట పద్దెనిమిది శ్లోకాల్లో రాముడు చెట్టుమాటున దాగినట్లు ఎక్కడా చెప్పలేదు.

రాముడు వాలిపై బాణప్రయోగం చేశాడు. చెట్టుమాటున నిలిచి మాత్రం కాదు. రాముడు వింటి నారిని లాగినపుడు ఆ శబ్దానికి మృగాలు, పక్షులు కూడా భయపడి చెల్లాచెదరైనట్లు చెప్పాడు వాల్మీకి.

మేఘగర్జనంలా ధ్వనించిన ఆ శబ్దం వాలికి వినిపించలేదా! రాముడు విడిచిన బాణం వక్షస్థలాన్ని ఛేదించినట్లు వాల్మీకి చెబుతాడు. "నేను మరొకవైపు తిరిగి ఉంటే నన్ను కొట్టావు" అంటాడు వాలి. మరొకవైపు తిరిగి ఉంటే బాణం వక్షస్థలాన్ని ఎలా తాకింది?

సుగ్రీవునితో పోరాడటములో వాలి గుర్తించకపోవచ్చు కానీ రాముడు మాత్రం ప్రచ్ఛన్నంగా ఉండి మాత్రం కొట్టలేదు. వాలిపై రాముడు బాణాన్ని సంధించడాన్ని వాలి గమనించలేదు. అంతే.

కనుక వాలి వధ విషయంలో రాముడు అనుసరించిన పద్ధతి అధర్మమని గాని, అయుక్తమని గాని చెప్పేందుకు వీలులేదు. ఈ సత్యాన్ని వాలికూడా గ్రహించాడు కనుకనే, తన తప్పిదానికి క్షమించమని రాముని వేడుకున్నాడు. శరణాగత వత్సలుడైన రాముడు కరుణించాడు.



సుందర కాండము

రసోవైసః
భగవంతుడు రసస్వరూపుడు.
రసరూపమే సారభూతము. అదే అందం. ఆనందం.

A thing of beauty is a joy for ever.

'అందమైన వస్తువు సదా ఆనందదాయకమే' అన్నాడు కీట్సు మహాకవి.
ఆనందాన్ని తనలో దాచుకున్న అందమే సౌందర్యం.
మాటకందని
మనసు పొందని
మేను మరచే ఆనందం. అదే సౌందర్యం. జీవికి సౌందర్యం. జీవన సౌందర్యం.

ఇది సుందరకాండము

Beauty is the only thing that time cannot harm.

కాలం కబళించ లేనిది సౌందర్య మొక్కటే- అని ఒస్కార్ విల్డె.
కాలిపోయేవి
రాలిపోయేవి
పారిపోయేవి - అన్నీ, ఆరిపోయే దీపాలే.
వెలిగే దీపాన్ని వెతికి పట్టుకోవాలి.
ఆరని దీపాన్ని అన్వేషించి సాధించాలి.
అదే సీతాన్వేషణము. ఆత్మాన్వేషణము.
పూచిన పున్నమి రాత్రివేళలో పవనసుతుడు సాగించిన అంతరాన్వేషణము.
సీతాన్వేషణము అనే సెలయేరులా ప్రారంభమై, సాగి సాగి, సాగరరూపాన్ని దాల్చింది
ఈ కాండము. రసానంద సాగరమైంది.
తేనెల లోని తియ్యదనాన్ని
వెన్నెల లోని చల్లదనాన్ని -కలబోసి
వాల్మీకి కోకిల ఆలపించిన రసమయ కావ్యగానమే సుందరకాండము.
శబ్ద సౌందర్యం
అర్థ సౌందర్యం
రస సౌందర్యం - కావ్యాన్ని ఆస్వాదించడానికి అవసరమైన ఈ మూడు
సౌందర్య సురభిళాలు సురుచిరంగా విరజిమ్మబడ్డాయి సుందరకాండములో.

శిలా తలం ప్రాప్య యథా మృగేంద్రః
మహా రణం ప్రాప్య యథా గజేంద్రః
రాజ్యం సమాసాద్య యథా నరేంద్రః
తథా ప్రకాశో విరరాజ చంద్రః

ఆకాశంలో పైకి వస్తున్న చంద్రుణ్ణి, శిలాతలముపై నిలిచిన సింహము లాగా, రణరంగంలో
ప్రవేశించిన గొప్ప ఏనుగు లాగా,
రాజ్యము నధిష్ఠించిన ప్రభువు లాగా ప్రకాశిస్తున్నట్లు వర్ణించి,
'ఇంద్ర-ఇంద్ర' అంటూ అంత్యప్రాసల దొంతరతో, పదకూర్పుల మహేంద్రజాలంతో
మృదంగ ధ్వనులను పలికిస్తూ, శ్రవణ సుభగత్వాన్ని అందించడం శబ్దసౌందర్యానికి
మచ్చుతునక.

ప్రవిశన్న భ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః
ప్రశ్చన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే

మాటిమాటికి మేఘాలలో కనిపిస్తూ, కనుమరు గవుతున్న హనుమంతుడు మబ్బుల్లో
దోగాడే చంద్రునిలా కనిపించడం లాంటి అర్థసౌందర్యా లెన్నో!
మేఘాల వెనక్కి వెళ్ళినపుడు సీతమ్మ ఇలా కనిపించదేమో ననే ఆలోచన, బైటికి వచ్చి
నపుడు సీతమ్మ కనిపిస్తుందనే ఆశ చూచేవారికి కల్పిస్తూ, మబ్బుల్లో దోబూచులాడే
మారుతాత్మజుని గమనవైభవము, భావసౌందర్యానికి మచ్చుతునక.
ఇక రససౌందర్యమా!
లలిత శబ్ద సంయోజనంతో, భావబంధురంగా, నవరస భరితమై శోభిల్లింది
ఈ సుందరకాండము.
వియోగ బాధలో సీతారాముల నుండి వ్యక్తమైన విప్రలంభము - శృంగారరసము -
మధువనంలో మర్కటముల విన్యాసాలలో హాస్యరసము -
అక్షకుమారుని వధించుటలో హనుమ చూపిన వీరరసము -
జంబుమాలి వధలో గోచరించిన రౌద్రరసము -
రావణుడు సీతమ్మపై కళ్ళెర్ర జేసిన భయానక రసము -
రాక్షసాంగనలు సాధ్వీమతల్లిని హింసించిన భీభత్సరసము -
సాగరోల్లంఘనము లోని అద్భుతరసము -
జానకి బాధతో విలపించిన దశలో ప్రవహించిన కరుణరసము -
సీత కనిపించని సమయంలో నిరాశలో నీరసించినపుడు శాంతరసము -
ఎక్కడ కొరికినా చక్కెరబొమ్మలో మాధుర్యమే
ఎక్కడ చూచినా సుందరకాండలో సౌందర్యమే. రస సౌందర్యమే.

సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరం కపిః
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్.

రాముడు సుందరుడు. రామకథ సుందరము. సీతమ్మ సుందరము. ఆమె వసించే
వనము సుందరము. రామాయణకావ్యము సుందరము. హనుమంతుడూ సుందరుడే.
రామమంత్రము కూడా సుందరమే. సుందరము కానిది అందు వెదకినా దొరకదు.

ఎడదల యెలమావిపై కూర్చుని, వాల్మీకి కోకిల చేసిన సుందర కావ్యగానం శ్రోతల
యెదలను ఎరుగని రసానంద లోకాలకు పట్టుకు పోతుంది.
అందరిలో ఉంటూ, అందని సౌందర్యాన్ని ముందుంచిన కాండము.
మనసుల్ని మురిపించే కాండము.
మేనుల్ని మరపించే కాండము.
మైమరపించే కాండము.
మూలకథ ఆగింది ఈ కాండంలో
లీలాకథనం అద్భుతంగా నడిచింది ఈ కాండంలో
భారతీయ ఆదర్శ నారీరత్నం జాజ్వల్యమానమైంది ఈ కాండంలో
రావణుని ఘనవైభవం
సీతమ్మ శీల ప్రాభవం - మధ్య
ఆంజనేయుని అసమాన పరాక్రమం వెల్లడైంది ఈ కాండంలో.
రాముని కనిన కందోయితో రావణుని చూడలేని సీతమ్మ.
ప్రభుకార్యంలో ప్రాణత్యాగానికైనా వెనుకాడని హనుమ.
అధర్మమే ఊపిరిగా జీవించే రావణుడు హనుమత్సీతల నడుమ.
సంఘర్షణల మధ్య
నీచోన్నతాదర్శాల మధ్య
అవిరళంగా సౌందర్యాన్ని కురిపిస్తూ సాగిన అసమాన కాండము
ఈ సుందరకాండము.
పఠన యోగ్యము. పారాయణ యోగము.
అంతా అర్పణమే. సమర్పణమే. ఇంద్రియ మనోబుద్ధుల తర్పణమే.
ఈ తర్పణమే తరణము. భవసాగర తరణం. దుస్తర భవసాగర తరణం.
కోటలో పాగా వేసిన వానరుడే
తోటలో పాగా తీసిన వన్నెకాడు.
కటాక్ష వీక్షణానికై క్షణక్షణము పరితపించిన దుర్నిరీక్ష్య సౌభాగ్యం ఒక వింత సౌందర్యం.
ఎదురు చూడడమే యెద సౌందర్యం. ఎ[illegible]గలోని సౌందర్యం.
ఒడదల మధ్య ఎడదలను పొంగించే కాండమే సుందరకాండము.
బాధల మధ్య బోధలను తెలిపే కాండమే సుందరకాండము.
విషాన్ని అమృతంగా మార్చి
వికారాన్ని మనోహరంగా తీర్చే
అమల జీవన సౌందర్య కాండమే సుందరకాండము.
మన ముందర భాండము. అమృతభాండము.
త్రాగుదాం కడుపారా
త్రేపుదాం మనసారా.

ముద్దుటుంగరము - ముక్తి సాధకము

వానరోఽ హం మహాభాగే దూతో రామస్య ధీమతః
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్ ॥ (1)
ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా
సమాశ్వసిహి భద్రం తే క్షీణ దుఃఖ ఫలాహ్యసి ॥ (2)

మహాభాగే=గొప్ప భాగ్యవంతురాలా!, అహం=నేను, ధీమతః=బుద్ధిమంతుడైన, రామస్య=రాముని యొక్క, దూతః=దూతను, వానరః=వానరుడను. దేవి=ఓ సీతాదేవీ! రామనామాంకితమ్=రామనామము చెక్కిన, ఇదమ్=ఈ, అంగులీయకం చ=ఉంగరమును కూడా, పశ్య=చూడు.

భావము 1 :- గొప్ప భాగ్యము గల ఓ తల్లీ! నేను బుద్ధిమంతుడైన రాముని దూతను. వానరుణ్ణి. రాముని పేరుగల ఈ ముద్రికను చూడు.

మహాత్మనా=మహాత్ముడైన, తేన=ఆ రామునిచే, దత్తమ్=ఇవ్వబడినది, తవ=నీ యొక్క, ప్రత్యయార్థమ్=నమ్మకము కొరకు, ఆనీతమ్=కొనిరాబడినది, సమాశ్వసిహి=ఆశ్వాసము నొందుము, తే=నీకు, భద్రమ్=శుభమస్తు, క్షీణ దుఃఖఫలా=నశించే దుఃఖ ఫలముతో ఉన్నదానవు, అసి హి=ఐతివి కదా!

భావము 2 :- ఈ ఉంగరము మహాత్ముడైన రాముడు ఇచ్చింది. నీకు నమ్మకము కలుగుట కొరకు తీసుకొని వచ్చాను. స్వాంతనము పొందు. నీకు శుభం కలుగుగాక! నీ దుఃఖఫలము అదృశ్యమయ్యే సమయము ప్రాప్తించింది.

ఈ రెండు శ్లోకాలు సుందరకాండము 36వ సర్గ ప్రారంభంలో 2, 3 వరుస సంఖ్యలలో ఉన్న అమూల్య రత్నాలు. నిత్యపారాయణానికి దివ్యమైన శ్లోకాలు.

సీతమ్మ మొదట హనుమంతుని నమ్మలేదు. రావణుడని భావించింది. తరువాత రాముని రూప గుణ సౌందర్యాలను వర్ణించాడు హనుమ. అప్పుడు పూర్ణంగా నమ్మింది.

తనను సీతమ్మ పూర్ణంగా విశ్వసించిన తర్వాత హనుమంతుడు రామనామాంకితమైన అంగులీయకమును ప్రదానము చేయడం వింతగానే తోస్తుంది. ఇది ముందే ఇచ్చుండాలి. నమ్మకము కొరకే తెచ్చినట్లు కూడా చెప్పాడు. ఆ మాటే వాస్తవమైతే ముందే ముద్రికను సీతమ్మకు ఇచ్చి ఉండాలి.

అలా చేయకుండా, జానకి పూర్ణంగా విశ్వసించిన తరువాత రామనామము గల ముద్దుటుంగరాన్ని సీతమ్మకు ఇచ్చాడు. ఈ విషయాన్ని ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవాలి. హనుమంతుడు ఈ సందర్భమున పరమాత్మ ఆజ్ఞ చేత, పరమాత్మ కార్యాన్ని నిర్వర్తించడానికి అరుదెంచిన గురుదేవుడుగా భాసిస్తున్నాడు. ఈ కోణంలో నుండి విషయాన్ని అర్థం చేసుకోవాలి.

ప్రథమంగా హనుమంతుడు సీతమ్మకు రామకథను వినిపించాడు. కానీ అతడు రావణు డేమో అనే సందేహం కలిగింది సీతమ్మకు. అందుచేత హనుమంతుని విశ్వసించలేక రోదించింది. ఇది ప్రథమదశ శిష్యునికి.

గురువు శాస్త్రాన్ని అందిస్తాడు. శిష్యుడు ఆలకిస్తాడు. అయినా నమ్మడు. ఇతడు కపటగురు వేమో అని భావిస్తాడు. అనేకమంది చేత మోసపోయి ఉంటాడు కనుక దయామయుడైన గురువును కూడా దగాకోరుగా భావిస్తాడు.

హనుమంతుడు "అమ్మా" అని పిలుస్తున్నా, సీతమ్మకు నమ్మకం కలగలేదు. రావణాసురుడు కూడా పంచవటిలో అలాగే ప్రవర్తించాడు. ఈ లంకలో అమ్మ అనే పదానికి అర్థం లేదు అనుకుంటుంది సీతమ్మ.

సద్గురువు జ్ఞానబోధ చేస్తూ మన జీవితంలో ప్రవేశించినా, గతంలో తాయెత్తులు కట్టించుకొని, కుంకుమపూజలు చేసి, దానాలిచ్చి, వ్రతాలు ఆచరించి, దగాకోర్లను చూసిన అంతఃకరణ అనుభవజ్ఞానం కల ఆచార్యుని తేలిగ్గా నమ్మలేదు. సీతమ్మ కూడా అందుకే హనుమంతుని విశ్వసించలేక సందేహించింది.

హనుమంతుడు రామకథ చెప్పినా సీతమ్మ విశ్వసించలేదు కనుక ఆ తరువాత రాముని గుణవైభవాన్ని, స్వరూపవైభవాన్ని హనుమ కీర్తించాడు. గురువు కూడా రెండవ దశలో అంతర్భావాలను, నిజవైభవాన్ని తెలియచేస్తూ తాత్త్విక సందేశాన్ని అందిస్తాడు.

ఈ దశలో సీతమ్మ హనుమను విశ్వసించింది. ఉపనిష ద్రహస్యాల్ని వివరించి శిష్యుని అంతఃకరణము లోని సంశయాల్ని గురువు తొలగిస్తాడు. అప్పుడు శిష్యుడు సీతమ్మలాగా గురువును పూర్ణంగా విశ్వసిస్తాడు. ఇప్పుడు శిష్యుడు శ్రద్ధావంతు డయ్యాడు.

శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధిః శ్రద్ధా!

"శాస్త్రవిషయము నందును, గురువచనము నందును సత్యబుద్ధిని కలిగి వుండుటయే శ్రద్ధ" అంటారు శ్రీ శంకరాచార్యస్వామి.

శిష్యునికి శ్రద్ధ కుదిరింది. ఇప్పుడు గురువు మంత్రోపదేశం చేస్తాడు. అదియే రామనామాంకితమైన ముద్రిక. అంగుళీయకము.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. శ్రద్ధ గలవానికి జ్ఞానము ప్రాప్తిస్తుంది అని భగవద్గీత. గురుదేవుని మీద, శాస్త్రవిషయము మీద విశ్వాసం కలిగితే జ్ఞానం లభిస్తుంది. అదియే రామనామము చెక్కబడియున్న ఉంగరము.

మనసును పరమాత్మ యందు లగ్నము చేయుటకే మంత్రము. నామము మనలను నామి యైన పరమాత్మ భావాలతో నింపుతుంది. అంగుళీయకము సీతమ్మకు రాముని దర్శింపచేసింది. నామము భక్తునికి నారాయణుని దర్శింపచేస్తుంది.

ముద్దుటుంగరములో రాముడు ముద్దుముద్దుగా కనిపిస్తున్నాడు జానకికి. ఉంగరము రాముడు కాదు. కానీ రాముడు ఉంగరంలో దర్శనమిస్తాడు. ఉంగరము ద్వారా తన ఉనికిని గుర్తుచేస్తాడు.

భక్తుడైన వానికి విగ్రహములో పరమాత్మ మంజులంగా గోచరిస్తాడు. విగ్రహము పరమాత్మ కాదు. కానీ పరమాత్మ విగ్రహంలో కూడా ఉన్నాడు. విగ్రహం ద్వారా నీలో నిగ్రహాన్ని నిలిపి, ఆ తరువాత తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు.

"వానరోహం, దూతః" అని తనను గూర్చి చెప్పుకున్నాడు హనుమంతుడు. "నేను వానరుణ్ణి, రామదూతను" అన్నాడే కాని తన పేరు చెప్పలేదు ఈ రెండు శ్లోకాల్లోనూ. రామనామాంకిత ముద్రికను అందించే దశలో గురువు పేరు లేనివాడు. అందుకే హనుమంతుడు తన పేరు చెప్పలేదు. అనామధేయుడే ఆచార్యుడు. అన్ని రూపాలు తానే అయినవాడు. అన్ని నామాలు తానే అయినవాడు.

పేరు నాశించేవాడు గురువు కాలేడు. విలువ రామనామానికే గాని తనకు కాదు. అందువలన నేను రామదూతను అన్నాడు హనుమంతుడు. పైగా వానరుణ్ణి అని చెప్పుకున్నాడు.

వానరుడు అంటే కోతి అని భావించనవసరం లేదు. వా-నరా! "నరుడేనా?" అమోఘమైన శాస్త్రవిషయాలను వివరించి గురువు బోధిస్తున్నా, ఇతడు సామాన్యమైన మానవుడేనేమో! నాలుగు పుస్తకాలు చదివి, రెండు మాటలు చెప్తున్నాడేమో అని అవగాహన లేనివారిచే శంకించబడి వానరుడుగా తెలుస్తుంటాడు.

రామనామమే రామనామాంకితమైన ముద్రిక. దానిని రాముడు ఇచ్చాడు అంటున్నాడు హనుమంతుడు. గురువు మనకు ఇచ్చే మంత్రము గురువు నుండి వచ్చింది కాదు. భగవంతుడు గురువు ద్వారా అనుగ్రహించింది. గురుహస్తమే గోవిందుని హస్తమని మనం భావించాలి. గురుదేవుని చల్లని చూపుల్లోనే పరమాత్మ అనుగ్రహం నిండి ఉంటుంది.

"భద్రం తే!" నీకు శుభము కలుగుతుంది అన్నాడు హనుమంతుడు. ప్రభుముద్రికను పొందినవారికి శుభములు చేకూరుతాయి. నామము నాలకించు వారికి శుభం కలుగుతుంది. గురుదేవుని అమృతగళము నుండి మంత్రమును శ్రవణం చేసిన వారికి శుభం కలుగుతుంది. ఇది కలగాలనే ముముక్షువులు సదా వాంఛిస్తూ ఉంటారు.

భద్రం కర్ణేభి శ్రృణుయామ దేవాః

"మేము సదా శుభమైన దానినే మా వీనులతో విందుము గాక!" అని ఉపనిష ద్రుషులు అధ్యయనం చేసేవారు.

గురువు నుండి శుభాన్ని ఆలకించి, శుభఫలాన్ని పొందే శిష్యులు శుభచరితులు. కనుకనే హనుమంతుడు సీతమ్మను **మహాభాగే** గొప్ప భాగ్యము కలదానా! అని సంబోధించాడు. గురువును పొందిన శిష్యులే ఈ ప్రపంచంలో భాగ్యవంతులు.

చివరగా "నీ దుఃఖఫలము నశించే సమయము సమీపించింది" అన్నాడు హనుమంతుడు.

గురుమంత్రము దుఃఖమును శాశ్వతముగా నశింపచేస్తుంది. అంతేకాదు. శాశ్వతమైన ఆనందమును ప్రసాదిస్తుంది. స్వరూపజ్ఞానమును కలిగించి తరింప చేస్తుంది.

అధిష్ఠానం సమస్తస్య జగతః సత్య చిద్ఘనమ్
అహమస్మీతి నిశ్చిత్య వీత శోకో భవే న్మునిః ॥

"సమస్తమైన జగత్తునకు అధిష్ఠానమై, సత్య చిద్ఘనస్వరూపమైన పరబ్రహ్మము నేనై యున్నాను అని నిశ్చయజ్ఞానము కలిగిన మననశీలుడు దుఃఖము నుండి విడిపడుచున్నాడు" అని రుద్రహృద యోపనిషత్తు ప్రవచించింది. ఈ విధంగా దుఃఖనాశము కలుగుతుందని రామనామాంకితమైన ముద్రికనిస్తూ హనుమంతుడు సీతమ్మను ఊరడించాడు.

ఉంగరము రామునిదే గాని హనుమంతునిది కాదు. ఉంగరాన్ని అందుకొనేది కూడా సీతమ్మే గాని హనుమంతుడు కాడు. హనుమంతుడు సీతారాముల మధ్య కేవలం సంధానకర్త మాత్రమే.

అలాగే మంత్రము గాని, నామము గాని పరమాత్మదే గాని గురువుది కాదు. మంత్రాన్ని గ్రహించే భాగ్యవంతుడు శిష్యుడు. జీవబ్రహ్మల మధ్య సంధానకర్తగా గురువు వ్యవహరిస్తాడు.

రామకార్యమే గాని తాను ఏవిధమైన స్వార్థము ఎరుగడు హనుమంతుడు. పరమాత్మ కార్యమే గాని తనదంటూ, తనకంటూ ఏదీ లేనివాడు గురుదేవుడు.

దివ్య దర్శనానుభూతి

గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్
భర్తార మివ సంప్రాప్తా జానకీ ముదితా భవత్ ॥

"సీతమ్మ భర్తయొక్క చేతికి అలంకారమైన ఉంగరమును తీసికొని చూస్తూ భర్తను పొందినంత ఆనందాన్ని పొందింది".

హనుమ ఇచ్చిన ఉంగరాన్ని తీసుకున్నది సీతమ్మ. దానిని చూస్తూ రాముణ్ణే చూసినట్లు ఆనందాన్ని పొందింది. గురువు నుండి మంత్రాన్ని గ్రహించిన శిష్యుడు మంత్రాన్ని సాక్షాత్తు భగవత్స్వరూపంగా దర్శించాలి.

విగ్రహము రూపము. మంత్రము శబ్దము. శబ్దరూపాలలో భగవచ్చైతన్యాన్ని దర్శించడానికి సాధకుడు ప్రయత్నించాలి. భగవంతుని రూపాన్ని చూసినా, లేదా శబ్దాన్ని విన్నా సాక్షాత్తు భగవంతునే దర్శించినట్లు అనుభూతిని పొందాలి. భావస్ఫూర్తి లేనివారికి దైవదీప్తి కలుగదు.

ఉంగరాన్ని ఇక్కడ **కర విభూషణమ్** అనే పదంతో చెప్పడంలో మహర్షి ఏదో తన హృదయంతో మాట్లాడుతున్నాడు. ఉంగరము కరవిభూషణము. అంటే చేతికి అలంకారము.

చేయి పనిచేయుటకు ఉపయోగిస్తుంది. చేతులతో మనము ఎన్నో కార్యాలుచేసి వుంటాము. ఎంతో ధనాన్ని సంపాదించి ఉంటాము. ఎన్నో గౌరవాలు అందుకొని ఉంటాము. ఎన్నిటినో పట్టుకొని ఉంటాము.

ఎన్ని చేసినా మనసులో వెలితి తొలగిందీ కాదు. బ్రతుకులో వెలుగు వచ్చిందీ లేదు. ఇప్పుడు చేతికి అలంకారము వచ్చింది. ఇక మనం చేయవలసిన పని ఏదో తెలిసింది. గురువు ఇచ్చిన మంత్రాన్ని సదా మననం చేయడమే. లభించిన నామాన్ని వదలకుండా స్మరించడమే. ఈ కార్యమే మనము ఇక ఆచరించవలసింది. ఈ అభిప్రాయంతోనే వాల్మీకి అంగుళీయకమును కర విభూషణంగా వర్ణించారు.

రామునికి దూరమైన సీతమ్మ ఎంతగానో దుఃఖించింది. రామవిరహంలో క్రుంగిపోతోంది. బంగారులేడిని వాంఛించి, రాముని ప్రయత్నించి దూరం చేసుకుంది. ఈ రోజు పరితపిస్తూ దుఃఖిస్తోంది.

రాముని కొరకు సీతమ్మ పరితపిస్తూ ఉంది. కనుకనే రాముడు ముద్రికను పంపాడు. పరమాత్మకు దూరులమై దుఃఖించే మనం కూడా పరమాత్మ కొరకు పరితపించగనే భగవంతుడు గురువు ద్వారా మంత్రాన్ని అనుగ్రహించి మనల్ని ఆనందింప చేస్తాడు.

పసిడిలేడిని వాంఛించి పరమాత్మను దూరం చేసుకుంది సీతమ్మ. ప్రాపంచిక విషయభోగాలను వాంఛించి మనం కూడా పరమాత్మను దూరం చేసుకుంటాం. సీతమ్మ ముద్రికను పొంది సంతోషించినట్లు మనం కూడా నామాన్ని పొంది ఆనందించాలి.

తతః సా హ్రీమతీ బాలా భర్తృ సందేశ హర్షితా
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్ ॥

"భర్త యైన రాముని నుండి హనుమంతుడు తెచ్చిన వార్తను బాలయైన సీతమ్మ అందుకుంది. కాస్త సిగ్గుపడింది. చాలా ఆనందించింది. ప్రియమైన పలుకుతో హనుమంతుని ప్రశంసించింది" అంటున్నాడు వాల్మీకి.

హనుమంతుని నుండి రాముని వార్తను అందుకొనిన సీతమ్మను 'బాల' అని వాల్మీకి చెప్పడం గొప్ప విశేషం. ఒక్క సీతమ్మే కాదు. గురువు వద్ద మంత్రాన్ని గ్రహించాలని భావించే వారందరు బాలలై ఉండాలి. అప్పుడే అర్హులవుతారు.

బాలలకు ఈర్ష్య ఉండదు. అసూయ లుండవు. అభిమాన అహంకారా లుండవు. నిర్మలహృదయులై ఉంటారు. నిష్కాపట్యంతో మెలుగుతారు. అలాంటివారే గురు

మంత్రాన్ని గ్రహించుటకు అర్హులవుతున్నా రని శిష్యుని యొక్క అధికారి లక్షణాన్ని "బాల" అనే పదం ద్వారా వాల్మీకి సూచిస్తున్నాడు.

రామనామాంకిత ముద్రికను అందుకోగానే సీతమ్మ సిగ్గుపడింది (హ్రీమతీ) అంటున్నాడు వాల్మీకి. హనుమ ప్రదానము చేసిన ఆ ఉంగరాన్ని చూడగానే సీతమ్మ ఎందుకు సిగ్గుపడింది? సిగ్గుపడవలసిన అవసరమేముంది? ఇక్కడ వాల్మీకి హృదయాన్ని మనం వెతికి పట్టుకోవాలి. రామనామాంకిత ముద్రికను చూడగానే ఈ ఉంగరాన్ని రాముడు కరవిభూషణంగా ధరించి యుండిన రోజులలో జరిగిన సంఘటనలు మదిలో మెదిలుంటాయి. గిలిగింతలు పెట్టుంటాయి. లేకపోతే సిగ్గుపడవలసిన అవసరమే లేదు.

1. "చాలు. ఇక తినలేను" అని భోజనం వడ్డిస్తున్న సీతమ్మను చెయ్యి ముందుకు చాచి రాముడు వారించినపుడు, ఈ ఉంగరమే ముందు కనిపించేది. ఆ ముద్రిక యందలి మణిలో ఒకొక్కసారి సీతమ్మ ప్రతిబింబం కూడా కనిపించేది. ముద్రికలోని తన ప్రతిరూపాన్ని చూసుకొని సీతమ్మ పరవశించి పోయేది. నేను రామునికి దూరంగా లేను అని భావించుకొని ఆనందించేది. నేడు అదే ఉంగరాన్ని చూస్తోంది. రాముని చూస్తూ, "రుచిగా ఉందికదా! ఇంక కొద్దిగా తినండి" అని సీతమ్మ పలికిన పలుకులు గుర్తుకు వచ్చి ఉంటాయి.

2. "సీతా! ఇలా రా!" అని ఏదో రహస్యం చెప్పడానికి రాముడు చెయ్యి చాచి, వ్రేళ్ళు కదిలిస్తూ పిలిచినపుడు, వ్రేలికున్న ఈ ఉంగరమే కనిపించేది. రాముడు తనకు దగ్గరగా రమ్మని పిలిచినప్పుడంతా ఈ ఉంగరమే కనిపించేది. రాముడు ఏమి చెప్పేవాడో, సీతమ్మ తల్లి ఏమి విన్నదో అవన్నీ గుర్తు వచ్చి ఉంటాయి. సిగ్గేసి ఉంటుంది.

ఆనాడు రాముడు దగ్గరికి రమ్మని పిలిచినప్పుడల్లా ముందుగా ఈ ఉంగరమే కనిపించేది. ఇప్పుడు కూడా ముందుగా ముద్రికే కన్పించింది. రాముడికి నన్ను దగ్గర చేయడానికే వచ్చిందేమో! అనే భావన సీతమ్మ మదిలో మెదిలుంటుంది. సిగ్గు దొరలి వచ్చుంటుంది.

3. "నా కొరకు నా మిత్రులు నిరీక్షిస్తున్నారు. నాకిప్పుడు సమయం లేదు నీ మాటలు వినడానికి. మళ్ళీ పిలుస్తాలే. వెళ్ళు" అని రాముడు సీతమ్మతో పలికిన వేళల్లో, "వెళ్ళు" అని చేత్తో సంజ్ఞ చేసినపుడు, కరవిభూషణమైన ఈ ఉంగరము కనిపించేది.

"ఏమే! ముద్రికా! రాముని కరాన్ని అలంకరించి, నన్ను "వెళ్ళు-వెళ్ళు" అనేదానివి కదా! ఇప్పుడు నా చేతికి చిక్కావు. ఇప్పుడేమంటావు? రాముడంటే నీకు చాలా ఇష్టం కదూ! నన్ను కూడా దూరంగా పంపేసి నీవే ఉండేదానివి కదూ! మరి ఇప్పుడు రాముడికి దూరమై నాలాగే ఎలా ఉండగలుగుతున్నావు? మరి రాముడి వద్దకు వెళ్దామా! చెప్పు. రాముడు ఎక్కడున్నాడో చెప్పు. నీకు తెలిసి ఉంటుంది. నువ్వు అక్కడ్నుంచే వచ్చావు కదా!

"ముద్దుటుంగరమా! నీవెంత మంచిదానివే! నేనే నిన్ను అర్థం చేసుకోలేక పోయాను. ఆనాడు "వెళ్ళు-వెళ్ళు" అంటూ నన్ను కొన్ని క్షణాలు దూరం చేసి ఆనందించేదానివి. పాపం! ఈరోజు నేను రామునికి నిజంగానే దూరమయ్యాను. ఆ వియోగాన్ని నీవు కూడా భరించలేకపోయావు. దూరమైన నన్ను రాముని దగ్గరకు చేర్చాలని పరుగులెత్తు కుంటూ వచ్చావా! సముద్రాన్ని దాటి వచ్చావా!" అని ముద్రికతో మాట్లాడుతూ సీతమ్మ సిగ్గుపడుతోంది.

4. రాముడు తన అమృతహస్తముతో సీతమ్మను ఎప్పుడు స్పృశించినా ముందు ఈ ముద్రిక స్పర్శ తగులుతూ ఉండేది. అది జ్ఞాపక మొచ్చిఉంటుంది. అందుకేనేమో సీతమ్మ సిగ్గు పడుతోంది.

5. సతీపతుల మధ్య ఎప్పుడైనా గిల్లికజ్జాలు వచ్చినపుడు కొన్ని నిముషాలు సీతారాములు పరస్పరం మాట్లాడుకోకుండా ఉండేవారు. కాని ఇద్దరూ ఉండలేక పోయేవారు. మళ్ళీ ఎలా కలిసిపోవాలో తెలిసేది కాదు. అప్పుడు రాముడు తన ఉంగరాన్ని తీసి నేలపై పడేసేవాడు బాగా కనిపించేలాగా. సీతమ్మ ఇదే అదననుకొని "ఇదిగోనండీ! మీ ఉంగరం ఇక్కడ పడిఉంది" అని ఇస్తే "అబ్బ! దొరికావా! వెతకలేక విసిగిపోయాను" అనేవాడు. ఎవరినో?

మళ్ళీ ఇద్దరూ ఆనందంగా మాట్లాడుకొనేవారు. "ముద్రికా! రాముడు నిన్ను పారేసుకుంటే నేను వెతికి ఇచ్చేదాన్ని కదా! ఈరోజు రాముడు నిన్నుకాదు. నన్ను పారేసుకుని అన్వేషిస్తున్నాడు. ప్రత్యుపకారబుద్ధితో నన్ను రామునికి అందించాలని వచ్చావా?" అని భావించి సీతమ్మ సిగ్గుపడుతోంది. ఆ తరువాత, రాముని ఆనవాలు లభించినందుకు సీతమ్మ సంతోషించింది **(సంతుష్టా)**.

గురువు మంత్రమనే ముద్రికను శిష్యునకు ప్రసాదించినపుడు మొదట సిగ్గు పుడుతుంది. ఆ తరువాత ఆనందం కలుగుతుంది.

దివ్యమైన ఆధ్యాత్మికబాటను వదలి ఇంతకాలం దూరంగా ఉన్నానే అని సాధకునకు సిగ్గు పుడుతుంది. పోనీలే! నేడైనా నాకు గురువు అనుగ్రహం లభించింది. మంత్రం ప్రాప్తించింది. ఇక హాయిగా మంత్రయోగినై జీవిస్తాను. నామయోగినై బ్రతుకుతాను అని ఆనందం కలుగుతుంది.



యుద్ధ కాండము

జీవిత మొక పోరాటం
జీవన మొక ఆరాటం

పోరాటంలోనే ఆరాటం తీరుతుంది
ఆరాటాన్ని తీర్చేందుకే పోరాట ముంది

అంతా పోరాటమే.
బ్రతుకంతా పోరాటమే.

యుద్ధం బ్రతుకుకు అద్దం లాంటిది.

ఇది యుద్ధకాండము

కదన రంగానికి చేరింది ఈ కాండములో కవికోకిల

యోధులు కాలేని వారు
యోగులు కాలేరని

పోరాటపటిమ లేని వారికి
ఇహపరాలు మిగలవని

కదన కాహళులను మ్రోగించింది
సమర సంగీతాన్ని మొరయించింది

పోరాటమే జీవికి ఊపిరి
పోరాడితేనే చిక్కింది ఊపిరి

పోరాటంలో దొరికిన ఊపిరి
ఉన్నంతవరకు
పోరాటంలోనే ఊగుతుంది. పోరాటంలోనే ఊరేగుతుంది.
తల్లి కొరకు విలపించడం పసిపాపలో పోరాటం
కాళ్ళుచేతులు కొట్టుకోవడం ఆ దశలో బ్రహ్మాస్త్రం

పోరాటంలో కదుల్తాయి కరచరణాలు
పోరాటాన్ని కదిలిస్తాయి అంతఃకరణాలు

బాహ్యంలో పోరాటాలకు
ఆంతర్యపు ఆరాటాలే కారణాలు
విజావికి, అవియే నిత్యపోరాటాలు. సమర కవాటాలు.
ధర్మాధర్మాలకు
న్యాయాన్యాయాలకు
మంచిచెడులకు
సత్యాసత్యాలకు
నిరంతర సంఘర్షణయే సమరం.

ఇది విరమించను వీలుకాని యుద్ధం
సావధానంతో సాగాల్సిన సమరం

రామునికి దూరమై ఉంది సీత లంకలో
జీవికి దూరమై ఉంది శాంతి లోకంలో

సీత లేని రాముడు
శాంతి లేని జీవుడు

రాముడు దాటాడు సాగరం
మనం దాటాలి మోహసాగరం

అంతమయ్యారు రావణ కుంభకర్ణులు రాముని చేత
అంతం కావాలి రాగద్వేషాలు నీచేత, నాచేత

రాముని చేరిన సీతకు కాంతి
ఆత్మను చేరిన మనసుకు శాంతి

తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాది రాక్షసాన్
యోగీ శాంతి సమాయుక్తః ఆత్మారామో విరాజతే

మోహసాగరాన్ని దాటి
రాగద్వేషాది రాక్షసుల్ని మొట్టి
శాంతితో స్నేహం కట్టి
వెల్గొందాలి జీవుడు. అతడే ఆత్మారాముడు అని ఆదిశంకరులు.
దూరమైన దయిత
దగ్గరైతే సమత-రామునికి,
దూరమైన మమత
చేరువైతే సమత-జీవునికి,

మహి నుండి పుట్టింది మైథిలి
మాయనుండి పుట్టింది మనోచెలి

ఆద్యంతాలు అర్థంగాని అయోనిజ
అయోమయంలో అల్లాడే మనసు మజా

మైథిలికి కష్టాలే నేస్తాలు
మనసుకి కన్నీళ్ళే రాస్తాలు.
దశకంఠుడు దూరమైతే సీతకు శాంతి
దశేంద్రియాలు దగ్గమైతే చిత్తానికి కాంతి

జయాపజయాల వింత మెలిక
రామరావణుల సంగ్రామమే ఇక

కొయ్యకు నిప్పు పెట్టే దేముంది?
కామికి ముప్పు నిలిపే దేముంది?

నిప్పు దహించేది కఱ్ఱనే
కామం దహించేది కామినే.

లంకలో అయినా
లోకంలో అయినా
కామికి మిగిలేవి కష్టాలే. కడగండ్లే.

పోవాలి కామం
రావాలి రామం

పట్టాభిషిక్తుడైతే రాముడు అయోధ్యారాముడు
సాక్షాత్కారమైతే జీవుడు ఆత్మారాముడు.

సర్వేషు రమన్తే ఇతి రామః

అందరిలో రమించే ఆత్మచైతన్యమే శ్రీరాముడు.
అందరూ రాముళ్ళు కావాలి

ఇదే వాల్మీకి ఆశయం
రామాయణ ఆదర్శం

ఆత్మ యనే రామునితో
మనసైన మైథిలి
హృదయమనే అయోధ్యలో కలిసిపోవడటం
కలిసి ఉండటం
పట్టాభిషేకం. జీవికి వీడిన శోకం.
అదియే సాక్షాత్కారం
ఆత్మసాక్షాత్కారం.

ఇదే ఆదికవి అందించే అమరసందేశం. అమృతసందేశం.
సందేశాలు ప్రేరణ నిస్తాయి. ప్రేరేపిస్తాయి.
కాని ప్రవర్తించేది మనిషి. ప్రవర్తించాలి అది తెలిసి.
ఉన్నదానిని ఆవిష్కరించేదే కావ్యం
లేనిదానిని అందించేది కాల్పనికం.

Religion awakens the Divinity already in man.

మనిషిలో నిగూఢంగా ఉన్న దివ్యత్వాన్ని వెలికి తీసేదే మతం
అంటారు స్వామి వివేకానంద
అది ఎలాగో తెలిపేదే రామాయణం.
అదిగో రణం
ఇదిగో మరణం..... జీవికి ఇవి తప్పవు.
అవి ఉండనీ అలా
స్మరణం సాగనీ ఇలా....
ఎలా! అలా.... అలా...... కాదు.
ఇలా...... ఇలా...... పదండి రంగానికి
జీవన రణరంగానికి.

మనం ఏ పని చేసినా ప్రేమతో చేయాలి. జ్ఞానంతో చేయాలి. ప్రేమ కార్యాలలో తృప్తి ఉంటుంది. ఆనందం ఉంటుంది. శాంతి ఉంటుంది.

సుఖశాంతులు పనులకు సంబంధించినవి కావు. మనిషికి సంబంధించినవి. వేడుకలలో ఏడ్చే వారిని మనం చూడటం లేదా? సంబరాలలో సంతాపం చెందేవారు ఎందరు లేరు? నీవు హాయిగా ఉంటేనే, పరిసరాలు, పనులు, కాలాలు తృప్తి నిస్తాయి. సుఖం నీకు సంబంధించినదే గాని బాహ్యానికి సంబంధించింది కాదు.

విభీషణుడు ధర్మాత్ముడు

ఉత్తములు, ఉదారులు, ధర్మాత్ములు అయిన ఇద్దరి వ్యక్తుల చరిత్రలు రామాయణంలో స్వచ్ఛంగా కనిపిస్తున్నా, కొందరికి అవి వివాదాస్పదంగా గోచరిస్తాయి. అవి 1. సుగ్రీవుడు, 2. విభీషణుడు.

రాముడు సుగ్రీవుని శరణు పొందగా, విభీషణుడు రాముని శరణు బొందినాడు. సుగ్రీవుని వెతుక్కుంటూ రాముడు ఋష్యమూకానికి వస్తే, రాముని వెతుక్కుంటూ విభీషణుడు సాగరతీరానికి చేరాడు. స్నేహితుడై, దాసుడైనవాడు సుగ్రీవుడు. దాసుడై, దాసుడుగా మిగిలినవాడు విభీషణుడు. ఇద్దరూ రామునికి దాసులే. ఇద్దరూ స్నేహితులే.

ఇద్దరికీ రాముడు రాజ్యాన్ని అనుగ్రహించాడు. ఇద్దరి అన్నలను రాముడు వధించాడు. అన్నలిద్దరూ అధర్మపరులే. అసమాన పరాక్రమవంతులే. అన్నల మరణానికి తమ్ముళ్ళు కారణమయ్యారు. అన్నలు మరణించాలని తమ్ముళ్ళు కోరుకున్నారు కూడా.

సుగ్రీవ విభీషణులిద్దరూ రామునికి శరణాగతులే. స్నేహితులే. దాసులే. స్నేహం చేసిన తరువాత గాని రాముడెవరో తెలియలేదు సుగ్రీవునికి. రాముడు ధర్మాత్ముడని చూడకముందే తెలుసు విభీషణునికి. అన్నల మరణానికి కారణం కావడంవల్ల, అన్నలు మరణించగనే రాజ్యభారాన్ని స్వీకరించడంవల్ల తమ్ముళ్ళైన విభీషణ సుగ్రీవులు వివాదాస్పదులుగా వాసికెక్కారు. దేశద్రోహులుగా, కులనాశకులుగా అర్థంగాని వారి మనస్సులలో నిలిచిపోయారు.

సూక్ష్మమైన విషయాల్ని సునిశితంగా పరిశీలించి అర్థం చేసుకోవలసిన బాధ్యత మేధావులమీద ఉంది. తొందరపాటు వల్లగాని, ఆవేశంచేత గాని, అవగాహనా లోపం వల్లగాని, ముందే మనసులో నాటుకున్న భావపరంపరల ఒత్తిడి వల్లగాని విషయాన్ని సక్రమంగా గ్రహించలేక, మేధావులైనవారు దురభిప్రాయాన్ని వెల్లడిచేస్తే దాని ప్రభావం సమాజం మీద విపరీతంగా పడుతుంది.

విభీషణుని దేశద్రోహిగా, కులనాశకుడుగా చిత్రించి మాట్లాడాడు ఇంద్రజిత్తు. అదే వాదం కొందరు మేధావుల నుండి కూడా వినపడినపుడు ఆశ్చర్యంగా ఉంటుంది. అధర్మపరుడైన ఇంద్రజిత్తు వాదాన్ని భుజాలపై కెత్తుకొని మోయడం, దానిని సమర్థిస్తూ, సనాతన భావ వైశిష్ట్యాన్ని మరొక వికృత మలుపులో చూపాలని ప్రయత్నించడం శోచనీయం. దురదృష్టకరం. విభీషణునిపై ఇంద్రజిత్తు మోపిన అభియోగాలు సమంజస మైనవేనా?

విభీషణుడు దేశద్రోహియేనా? ఎవరిని దేశద్రోహి అంటారు. దేశబంధువని ఎవర్ని పిలుస్తారు? దేశానికి కీడు చేసేవాడు దేశద్రోహి అవుతాడేగాని దేశానికి మేలుచేసేవాణ్ణి దేశద్రోహి అనరు. లంక నాశనం కావడానికి కారకుడైన రావణుడు దేశద్రోహిఅవుతా డేమో గాని విభీషణుడు మాత్రం కాదు.

ఒక దేశపు రాజు మరొక దేశం మీద దండయాత్ర చేసినపుడు, స్వలాభాపేక్షతో స్వజనులను వీడి, పరులతో చేతులు కలిపిన వాణ్ణి దేశద్రోహి అంటారు. రాముడు రాజ్యంకొరకు దండెత్తి వచ్చినవాడూ కాదు. విభీషణుడు రాజ్యాన్ని ఆశించి రాముణ్ణి ఆశ్రయించినవాడూ కాడు.

విభీషణుడు ధర్మాత్ముడు. ఈ విషయాన్ని అరణ్యకాండములో రామలక్ష్మణులతో శూర్పణఖే చెప్పింది. దానిని కుంభకర్ణుడూ అంగీకరించాడు కూడా. చివరికి రావణుడు కూడా సమ్మతించాడు. విభీషణుని ధర్మవచనాలు వినకపోవడం వల్లనే తనకు దుర్గతి ప్రాప్తించిందని అంగీకరించాడు.

విభీషణునికి లంక మీద మోజుంది. సింహాసనం మీద లేదు. లంకకు వినాశము రాకూడ దని శక్తివంచన లేకుండా తాను కృషి చేశాడు. రావణుని సన్మార్గంలోకి త్రిప్పాలని అనేకసార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు.

ఒక్క విషయం మన మిక్కడ అర్థం చేసుకోవాలి. విభీషణునికి రాజ్యంమీద గాని, సింహాసనం మీదగాని ఆసక్తి ఉన్నట్లయితే రావణునికి సదుపదేశం చేయడు. రావణుణ్ణి బాగుచేయాలని ఆశించడు. రావణుడు సన్మార్గంలో చరిస్తూ ఉంటే విభీషణునికి రాజ్యమెలా సంక్రమిస్తుంది? సాధువైన రాజును ప్రజలు ఎందుకు పోగొట్టు కుంటారు? పరులెందుకు పగబూనుతారు అలాంటి రాజుపై?

విభీషణునికి రాజ్యకాంక్ష ఉంది అనటం నిరాధారమైన విషయం. రాముడు గొప్పవాడని, అందగాడని విభీషణుడు ప్రేమించలేదు. రావణుడు స్వార్థపరుడని, దుష్టుడని గర్హించలేదు. అతని ఘర్షణ అంతా ధర్మాధర్మాల మధ్యేగాని, వ్యక్తులమధ్య కాదు. రాజ్యాల మధ్య కాదు.

రాముడు ధర్మాత్ముడని విభీషణునికి తెలుసు. అలాగే రావణుడు అధర్మ పరుడని కూడా తెలుసు. అధర్మాన్ని అసహ్యించుకొని రావణుణ్ణి త్యజించాడు. ధర్మాన్ని ప్రేమించి రాముని సమీపించాడు.

తన ఒక్కడి సుఖం కోసం రాజ్యాన్నంతా దుఃఖకూపంలో తోయడానికి రావణుడు వెనుకాడలేదు. రాజ్యక్షేమం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసినవాడు విభీషణుడు.

విభీషణుడు రావణునికి బుద్ధి చెప్పడం సీతాపహరణం జరిగినప్పుడే కాదు. నూతనంగా స్త్రీలను లంకకు తెచ్చినప్పుడల్లా అది ధర్మం కాదని విభీషణుడు హెచ్చరిస్తూనే ఉండేవాడు. ఈ విషయం ఉత్తరకాండలో స్పష్టంగా తెలుస్తుంది.

ఈ దృశైస్త్వం సమాచారైః యశోర్థ కులనాశనైః
ధర్షణం ప్రాణినాం జ్ఞాత్వా స్వమతేవ విచేష్టసే ॥

రావణుని వికృతచేష్టల వల్ల ధర్మానికి గ్లాని ఏర్పడుతూ ఉందని, అది కేవలం వ్యక్తి వినాశంతో పోదని, కులనాశానికి కూడా దారి తీస్తుందని అనేక సార్లు విభీషణుడు హెచ్చరించాడు. అయినా రావణుడు వినలేదు.

పరమసాధ్వి, మహాపతివ్రత అయిన సీతమ్మను రావణుడు అపహరించాడు. ఇక అది సహించలేక పోయాడు విభీషణుడు. అనేకసార్లు చెప్పి చూశాడు. సీతమ్మను రామునికి ఇచ్చెయ్యమని చెప్పాడు. అయినా రావణుడు వినలేదు. పాపపంకిలంలో తానిక ఉండడం కూడా అధర్మమేనని భావించాడు.

దుష్టుడైన రావణుని నుండి స్వదేశాన్ని రక్షించాలంటే రాముని ఆశ్రయించడమే ఏకైకమార్గమని భావించాడు. ఒకవేళ రాముని అనుగ్రహంతో తానే రాజై స్వచ్ఛమైన పరిపాలనను విభీషణుడు లంకావాసులకు అందించాలని అభిలషించాడా? అలా అభిలషించినా తప్పేమీ లేదు. దేశశ్రేయమే ఆ విషయంలో కూడా ప్రధానంగా తెలుస్తూ ఉంది.

నిజమే. తీరా రావణుడు మరణించిన తరువాత రాజ్యాన్ని లంకావాసులకు గాని, విభీషణునకు గాని ఇవ్వకుండా రాముడే ఉంచేసుకుంటే ఏమయ్యేది? రాముడు అలాంటివాడు కాడని మనకన్నా విభీషణునికి బాగా తెలుసు.

తనదైన అయోధ్యను త్యజించాడు రాముడు. వాలి వధానంతరము లభించిన కిష్కింధను సుగ్రీవునికి త్యాగం చేసిన ధర్మాత్ముడు రాముడు. లంకను రాముడు అభిలషించడు. అంగీకరించడు. ఈ విధమైన సంకుచిత భావాలతో కుంచుకుపోయే వ్యక్తుల మనసులలో కూడా అనుమానం తలెత్తకుండా రావణవధకు ముందే సాగరతీరంలో విభీషణుని పట్టాభిషిక్తుణ్ణి చేశాడు ధర్మాత్ముడైన శ్రీరాముడు.

అధర్మపరుడైన రావణుని ఇతర రాక్షసులలాగా తానూ సమర్థించి ఉన్నట్లయితే రావణునిచేత అవమానింప బడేవాడు కాడు విభీషణుడు. విభీషణుడు ధర్మపరాయణుడు. ధర్మాశ్రయుడు. ధర్మాసక్తుడు. ఆ మహాత్ముడు బాల్యము నుండి భావకుడే. సాత్వికుడే. ధార్మికుడే. ఈ విషయాలన్నీ ఉత్తరకాండలో చక్కగా తెలుపబడ్డాయి. విభీషణుని గూర్చి మహర్షి వాల్మీకి ఇలా అంటారు:

విభీషణస్తు ధర్మాత్మా నిత్యం ధర్మ వ్యవస్థితః
స్వాధ్యాయ నియతాహార ఉవాస విజితేన్ద్రియః

"విభీషణుడు ధర్మాత్ముడు. ధర్మమునందే నిత్యమూ ప్రవర్తించేవాడు. నియమితమైన ఆహారమును గ్రహిస్తూ, ఇంద్రియనిగ్రహము కలిగి జీవించేవాడు" అని విభీషణుని పవిత్ర జీవితాన్ని గూర్చి చెబుతాడు మహర్షి.

రామునితో వైరము మంచిది కాదు, కోపాన్ని విసర్జించు, అంటూ రావణునికి విభీషణుడు బోధించిన విషయం సాధకులకు ప్రాతః స్మరణీయమని నా అభిప్రాయము.

త్యజాశుకోపం సుఖ ధర్మ నాశనం
భజస్వ ధర్మం రతికీర్తి వర్ధనమ్

"అన్నా! సుఖాన్ని, ధర్మాన్ని నాశనం చేసే కోపాన్ని త్యజించు. సుఖాన్ని, కీర్తిని పెంపొందించే ధర్మాన్ని అనుష్ఠించు" అని బోధించిన పావనమూర్తి విభీషణుడు.

ధర్మజీవనానికి అలవాటు పడిన పవిత్రాత్ముల్ని కేవలం లౌకిక కోణం నుండి చూసి అర్థం చేసుకోవాలని ప్రయత్నించకూడదు. ధర్మం సూక్ష్మమైంది. సూక్ష్మ బుద్ధిగల విమలచరితులే ధర్మాత్ముల్ని, ధర్మరహస్యాల్ని అర్థం చేసుకోగలరు.

రావణుడు దురాత్ముడే. అధర్మపరుడే. విభీషణునికి అది నచ్చలేదు. బాగానే ఉంది. రావణుణ్ణి విభీషణుడు విడిచిపెట్టాడు. తటస్థంగా ఉండిపోవచ్చు కదా? రావణునికి శత్రువైన రాముని ఎందుకు ఆశ్రయించాలి? అది రాజ్యాసక్తితో చేసిన పని కాదా? ఇలా కూడా కొందరు విభీషణుని విమర్శిస్తూ ఉంటారు.

ఇదొక విచిత్రమైన విమర్శ. విమర్శే సిగ్గుతో తలవంచుకొనే విమర్శ యిది. రామునిలోని సుగుణాలు, రామునియందు ప్రకాశించే ధర్మమే విభీషణుని రాముని వైపుకు ఆకర్షించిందని మనం గ్రహించాము.

తటస్థంగా ఉండవచ్చు కదా! రామునితో ఎందుకు కలవాలి? కలిశాడు పో, రహస్యా లెందుకు చెప్పాలి? ఇంద్రజిత్తు, రావణుల వధలకు ఎందుకు కారణం కావాలి?

తటస్థంగా ఉండాలి అని ఆశించడం తలలేని వాళ్ళు, తల చెడినవాళ్ళు చేసే ఆలోచన. "తటస్థం" అనే పదానికి అర్థం తెలియని వాళ్ళు ప్రతిపాదించే వాదం అది. ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియనపుడు వ్యక్తి తటస్థంగా ఉంటాడు. లేదా, ధర్మాధర్మాలు సమతూకంలో ఉన్నప్పుడు వ్యక్తి తటస్థంగా ఉంటాడు. అంతేకానీ భూమ్యాకాశాల లాగా రావణరాములు తెలుస్తూ ఉంటే ఇక తటస్థ విధానం ఎందుకు? తమస్సు నిండితే తప్ప.

రావణునిది అధర్మంగా నిర్ణయించి రావణుని త్యజించి ధర్మమూర్తియైన రాముని ఆశ్రయించినపుడు తన పక్షమే మారిపోయింది. అలాంటప్పుడు రామునివద్ద రహస్యాలు విభీషణుడు ఎందుకు దాచిపెడతాడు? రావణ ఇంద్రజిత్తులు లంక నాశనానికి కారకులని గ్రహించినపుడు వారి వధను విభీషణుడు ఎందుకు గర్హిస్తాడు?

విభీషణుడు ధర్మమూర్తి. ధర్మాన్నే ఆశ్రయించి ఉంటాడు. ధర్మము నందే తనకు అకుంఠిత విశ్వాసము. రాముడు ధర్మస్వరూపుడు. అందుచేత ధర్మమూర్తియైన విభీషణుడు ధర్మాత్ముడైన రాముని ఆశ్రయించాడు. విభీషణునిపై ఈ విశ్లేషణమును సమాప్తి చేసే ముందు విభీషణుని ధర్మాసక్తి బాల్యంలోనే ఎలా ఉండేదో, ధర్మ జీవన విషయంలో విభీషణుని అవగాహన ఎలాంటిదో చెప్పడం సముచితమని భావిస్తున్నాను.

బాల్యంలో విభీషణుడు గొప్ప తపస్సు నాచరించాడు. విభీషణుని దీర్ఘకాల తపస్సుకు బ్రహ్మదేవుడు మెచ్చి, వరమును కోరుకోమని చెప్పాడు. విభీషణుడు బ్రహ్మదేవుని ఈ క్రింది విధమైన వరాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు.

పరమాపదతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్
నహి ధర్మోభి రక్తానాం లోకే కించి న దుర్లభమ్ ॥

"బ్రహ్మదేవా! పెద్ద ఆపదలొచ్చి పడినపుడు కూడా నా మనసు ధర్మమును విడిచిపెట్టకుండా ఉండు గాక! ధర్మమునందు ఆసక్తి కలవారికి ఈ ప్రపంచంలో దుర్లభమంటూ ఉండదు" అని ఆశించాడు. బ్రహ్మదేవుడు అనుగ్రహించాడు.

తన భావాలు ధర్మానికి భిన్నంగా నడువకూడదని, తనకెప్పుడూ ధర్మము నందే ఆసక్తి ఉండాలని బ్రహ్మదేవుని నుండి వరములను పొందిన ధన్యాత్ముడు, ధర్మాత్ముడు విభీషణుడు.

ఇప్పుడు అర్థం చేసుకోండి. పావనాత్ముడైన విభీషణు డెక్కడ? పాపియైన రావణుడెక్కడ? విభీషణుడు మానస సరోవర మైతే రావణుడు బురదగుంట లాంటివాడు.

విభీషణస్తు ధర్మాత్మా నతు రాక్షస చేష్టితః

"విభీషణుడు ధర్మాత్ముడు. రాక్షసుడైనా రాక్షసప్రవృత్తి లేనివాడు". ఈ మాట పలికింది ఎవరో కాదు. శూర్పణఖ. బండరాళ్ళు కూడా విభీషణుని ధర్మరశ్మికి కరిగిపోయాయి.

రామచరితమానసంలో విభీషణుడు హనుమంతునితో సంభాషించే సందర్భములో విభీషణుని హృదయాన్ని విభీషణుని మాటల్లోనే మనకు వినిపిస్తాడు సంత్ తులసీదాసు.

సునహు పవన సుత రహని హమారీ
జమి దస్నన్హి మహు జీభి బిచారీ
తాత కబహుఁ మోహి జాని అనాథా
కరిహహిఁకృపా భానుకుల నాథా!

"వాయుపుత్రా! రెండు దంతపు వరుసల మధ్య నాలుకలాగా నేను ఈ లంకలో వసిస్తున్నాను. నేను దిక్కులేనివాణ్ణి. అనాథుణ్ణి. భానుకుల నాథుడైన రఘురాముడు నన్ను అనుగ్రహించునా?" అని విభీషణుడు హనుమంతుని అడిగినట్లు రామచరిత మానసము. ఈ చౌపాయి లంకలో విభీషణుని స్థితిని, ధర్మాత్ముడైన రామునియందు విభీషణునికున్న ఆసక్తిని స్పష్టం చేస్తూ వుంది.

ముప్పైరెండు దంతముల మధ్య నాలుక లాగా విభీషణుడు లంకలో ఉన్నాడట. ఇది చాలా చక్కని ఉపమానము. తరచుగా సాధువులు ప్రవచనాల్లో ప్రవచించే పద్విషయము. సాధకులకు చాలా ఉపయుక్తమైన సాధనాంశములను అందించే ఈ ఉపమానాన్ని విశదంగా తెలుసుకుంటాము.

లంకలో దంతాలవంటి రాక్షసులు అనేకులున్నారు. విభీషణుడు లాంటి ధర్మాత్ములు అరుదు. నాలుకలా విభీషణు డొక్కడు కన్పిస్తున్నాడు. దురాత్ముల మధ్య సాధువులు జీవించడం చాలా కష్టం.

నోటిలోని నాలుకను ముందుకు రానివ్వకుండా దంతాలు నిరోధిస్తుంటాయి. ముందుకొస్తే కొరికివేస్తా మంటూ బెదిరిస్తూ ఉంటాయి. కర్కశమైన దంతాల వలె, సాధకుని ప్రగతిని సమాజంలో దురాత్ములు నిరోధిస్తూ ఉంటారు. దంతాల మధ్య పడకుండా నాలుక ఎలా మెలుగుతుందో, దురాత్ములకు చిక్కకుండా సాధువులు ప్రగతి పథంలో సాగిపోతుంటారు.

దంతాలు నిరోధిస్తున్నాయని భయపడి మంచి చేయడం మానదు. అవకాశం దొరికినపుడల్లా దంతాలమధ్య పడకుండా ముందుకొచ్చి ఎండిన పెదవుల్ని తడిపిపోతూ ఉంటుంది. అలాగే దుష్టులు ప్రగతిని చూసి సహించలేక నిరోధిస్తున్నా, మహాత్ములు నాలుకలాగా ముందుకొచ్చి తాపత్రయాలతో ఎండిపోయిన సమాజాన్ని తమ ప్రేమామృతంతో తడుపుతూ ఉంటారు.

దంతాలవలె కర్కశంగా, కఠినంగా దురాత్ములు సమాజంలో జీవిస్తూ ఉంటే, నాలుకలాగా మహాత్ములు రామనామామృత పానం చేస్తూ ఆనందిస్తూ ఉంటారు.

మనిషి ఎప్పుడూ నాలుక లాగే ఉండాలి. దంతాల లాగా ఉండకూడదు. గట్టి తనముగల దంతాలు ఊడిపోతాయి. మెత్తని నాలుక ఊడదు. వాడదు. దుష్టులు రాలిపోతారు. మట్టిలో కలిసిపోతారు. మహాత్ములు నాలుకలాగా చల్లగా ఉంటారు. శాశ్వతకీర్తితో శోభిస్తారు.

ఖండించడం దంతాలకు తెలుసు. ఏకం చేయడం నాలుకకు తెలుసు. దంతాల దంతా విరసమే. నాలుక దెప్పుడూ సమరసమే. కొరికి పడేస్తాయి దంతాలు. బుజ్జగించి జోకొడుతుంది నాలుక. సమాజంలో దుష్టులు గాయాలు చేస్తూ పోతారు దంతాల లాగా. సాధువులు ఓదార్చుతూ ఉంటారు నాలుకలాగా.

నాలుక పుట్టుకతోనే ఉంటుంది. దంతాలు మధ్యలో వస్తాయి. ముందు వచ్చిన నాలుక అలాగే ఉంటుంది. మధ్యలో వచ్చిన దంతాలే మాయమౌతాయి. జ్ఞానము ప్రతి మనిషికీ స్వభావము; స్వరూపమూను. అజ్ఞానము మధ్యలో వస్తుంది. మధ్యలో వచ్చిన అజ్ఞానము మధ్యలోనే పోతుంది. ముందున్న జ్ఞానము చివరలో కూడా ఉంటుంది.

ఒక్క నాలుక ముప్పైరెండు దంతాల మధ్య మెల్లగా చరిస్తూ ఉంటుంది. ప్రతి క్షణము "నిన్ను కొరికి వేస్తాం" అనేటట్లు ఉంటాయి దంతాలు. పాపం! నాలుక మాత్రం ఏమీ మాట్లాడదు. అది నాలుక యొక్క బలహీనతగా భావిస్తాయి దంతాలు.

నాలుక తనలో తాను, "దంతములారా! చాలా పొరబడుతున్నారు మీరు. మాట్లాడక పోవడం నా బలహీనత కాదు. నేను మాట్లాడకుండా ఉండడం చేతనే మీరు హాయిగా ఉన్నారు. నేను ఏదేదో మాట్లాడగలను. ఆ తరువాత బాధంతా మీకే. నేను ముందువెనుకలు చూడకుండా పరుషంగా మాట్లాడితే చాలు. ముప్పు ముందున్న మీకే. కోపమొచ్చినవారు మిమ్మల్ని రాలగొట్టేస్తారు కాని నన్ను ముట్టుకోరు. ముచ్చటగా లోపల ఉండేదాన్ని నేను. బయటపడి రాలిపోయేవారు మీరు."

దుష్టులను రక్షించడానికే ఒకొక్కసారి సజ్జనులు మౌనం వహిస్తూ ఉంటారు నాలుకలాగా. కాలు జారితే తిరిగి తీసికోవచ్చు. నోరు జారితే తిరిగినా తీసికోలేము.

మహాభారతం

తింటే గారెలు

కంటే కొడుకులు

వింటే భారతం.......ఇలాగే వింటున్నాం చాలాకాలం.

"తింటే-కంటే" అని అంటూ ఉంటే జరిగేది స్తవం.

ఒకనాడు ఇవి అడుగంటేవే అనేది అనకపోయినా వాస్తవం.

"వింటే" మాత్రం వంటబట్టేదే నని గంటకొట్టి మరీ చెప్పొచ్చు.

పంచమవేదంగా ప్రఖ్యాతి గడించిన మహాభారతం పద్దెనిమిది పర్వాల పవిత్ర గ్రంథం. పారాశర్యుని వచ స్సరోజమునుండి విరజిమ్మబడిన విజ్ఞాన గంధం. విమల విజ్ఞాన గంధం. నిర్మల సుజ్ఞాన గంధం.

బ్రతుకుకు అర్థం చేప్పే గ్రంథం.

బుద్ధికి అద్దం పట్టే గ్రంథం.

ధర్మాన్ని అందలమెక్కించిన గ్రంథం.

జ్ఞానాన్ని ఆవిష్కరించిన గ్రంథం.

పావనాత్ములైన పాండవులూ ఇక్కడే

కఠినాత్ములైన కౌరవులూ ఇక్కడే

కుయుక్తుల శని శకునీ ఇక్కడే

ఆదిమధ్యాంత రహితుడు, ఆదిదేవుడు అయిన వాసుదేవుడూ ఇక్కడే.

మానవుల మధ్య మాధవుడుగా

భామల మధ్య యాదవుడుగా

కురు పాండవుల మధ్య రాయబారిగా

పార్థుని ముందు సారథిగా

పరమాత్మ జాజ్వల్యమానమైనది ఇక్కడే, ఈ భారతం లోనే.

ఈ భారతావనిలోనే.

ఈ మహాభారతం లోనే.

వినదగిన వింతలన్నీ ఇందులోనే

తినదగిన వంటలన్నీ ఈ విందులోనే

మహాభారతం ధర్మప్రధానమైన గ్రంథం. వ్యక్తి ధర్మాన్ని, కుటుంబ ధర్మాన్ని, సమాజ ధర్మాన్ని, రాజధర్మాన్ని, దేశధర్మాన్ని, విశ్వధర్మాన్ని వైభవంగా విశ్లేషించిన గ్రంథం. ధర్మం చాలా విలువైనది. కానీ సులువైనది కాదు.

సూక్ష్మా గతిర్హి ధర్మస్య సూక్ష్మత్వాత్ బహునిర్ణయః

"ధర్మ మార్గము చాలా సూక్ష్మమైనది. ఈ సూక్ష్మత్వము వలన ధర్మమును ఒక దృక్కోణం నుండి నిర్ణయించేందుకు వీలులేదు" అని శాసించింది శాంతిపర్వము.

తర్కోఽ ప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః నైకో ఋషిర్యస్య మతం ప్రమాణం
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గత స్స పన్థాః ॥

"తర్కానికి స్థిరత్వము లేదు. వేదాలు విభిన్నంగా ఉన్నాయి. ఈ ఋషి పలికిందే ప్రమాణం అని చెప్పేందుకు వీలులేదు. ధర్మతత్త్వము నిగూఢమైనది. కనుక మహాత్ముడు నడిచినదియే ఇతరులకు మార్గము".

ఇది ధర్మమార్గము. ధర్మపుత్రుడు భారతంలో ఆచరించి చూపిన మార్గము.

యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

"ఇందులో ఉన్నది మరొకచోట ఉండొచ్చు. ఇక్కడ లేనిది మాత్రం మరొకచోట ఉండదు" అని భారతాన్ని గూర్చి ఆర్యోక్తి. అందరికీ తెలిసిన సూక్తి.

సూక్ష్మతరమైన ధర్మాన్ని ఎలుగెత్తి చాటింది భారతము. గళమెత్తి పలికాడు వ్యాసుడు.

ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేషః న చ కశ్చిచ్ఛృణోతి మామ్
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే ॥

"చేతులెత్తి చాటి చెప్పాను. గళమెత్తి గర్జించాను. ఎవరూ వినడం లేదు. అర్థకామాలు ధర్మం నుండే పుడుతాయి. ధర్మాన్నెందుకు ఆచరించరు?" అని స్వర్గారోహణ పర్వంలో వ్యాసమహర్షి ప్రశ్నిస్తాడు.

జయ విజయీ భవ!

వేదవ్యాస మహర్షి ప్రణీతమైన మహాభారతం పంచమవేదంగా కీర్తించబడింది. గొప్పదియగుట (మహా) చేత, విపులమై, భారమగుటచేత (భార-తం), ఈ పవిత్ర గ్రంథరాజము మహాభారతమని పిలువబడింది. దీనికి "జయ" అని పూర్వనామము.

యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

"భారతంలో ఉన్నది మరొకచోట గోచరించవచ్చు. భారతంలో లేనిది మరొకచోట చూడలేము" అని ఉక్తి. భారతము యొక్క ఖ్యాతి.

ఈ ఉద్గ్రంథమును వ్రాయుటకు చక్కని వ్రాతగాడు కావలసి వచ్చింది వ్యాసునికి. విఘ్నములు తలెత్తకుండా రచన సాగుటకు వినాయకుడు సరియైన వాడని తోచింది. మనసులో వినాయకుని ఆహ్వానించాడు. మంచి కార్యాలకు ముందుండే దేవుడు గణపతి ప్రత్యక్షమయ్యాడు.

వ్యాస:- మహాగణపతీ! మహాభారతం నా మనసులో అల్లుకుపోయింది. దానిని నేను చెబుతాను. తమరు వ్రాయాలి.

వినాయక:- భారతం వ్రాయడం నా భాగ్యంగా భావిస్తాను. కాని ఒక షరతు. ప్రారంభించిన తరువాత మీరు ఆపకుండా చెప్పాలి.

వ్యాస:- అలాగే - నాదీ ఒక షరతు. నేను చెప్పేది మీరు అర్థం చేసుకుంటూ వ్రాయాలి.

వినాయక:- (నవ్వుకుంటూ) అలాగే.

ఇలాగే నడిచింది మహాభారత రచన.

ఎక్కడైనా ఆలోచించాలని వ్యాసునికి అనిపిస్తే వెంటనే అనేకార్థములు స్ఫురించే శ్లోకాలు చెప్పేవాడు.

అంతే, టి.వి. వార్తల మధ్య వ్యాపార ప్రకటనలవలె గణపతి కలం ఆగిపోయేది. ఆ బ్రేక్‌టైంలో వ్యాసుడు ఊహించుకొనేవాడు. ఈ కారణంగా మహాభారతంలో అక్కడక్కడ మింగుడుపడని ఇనుప గుగ్గిళ్ళవంటి శ్లోకాలు దర్శనమిస్తాయి.

విశ్వకళ్యాణోత్సవమును ఆవిష్కరించడానికి వ్యాసుడు ఉపక్రమిస్తే, తన చేయిని కూడా కలిపాడు గజవదనుడు. దివ్యమైన కార్యాలకు దేవతలు కూడా సహకరిస్తారు.

వ్యాసుడు చెప్పింది వ్రాయడానికి కలం అవసరం కదా! తన దంతమునే విరిచి, దానినే కలముగా ఉపయోగించుకొని, ఏకదంతు డయ్యాడట హేరంబుడు. అందమైన, ఆదర్శమైన కార్యాలకు అందరూ సహకరిస్తారు.

జైజై వ్యాస! - జైజై గణేశ!

భాగవతము

గాలికి చెట్లు చలిస్తాయి. చలించే చెట్లు గాలిని కదిలిస్తాయి. ఆలోచనలతో మనస్సు చలిస్తుంది. చలించే మనస్సు ఆలోచనలను కదిలిస్తుంది.

ఆలోచించటం మనస్సుకు సహజ లక్షణం. మనస్సు దేనిని ఆలోచించాలి? ఎలా ఆలోచించాలి? అనేది మనం నిర్ణయించాలి.

మనస్సు తనకు తానుగా ఆలోచనల్ని కదిలిస్తే, అది ఎటు దారి తీస్తుందో చెప్పలేము. ఒక హద్దును మించి పక్షి ఎలా ఎగరలేదో, మనస్సు కూడా అంతే. హద్దులు దాటి మనసు చరించలేదు. సుద్దు లెరిగి ప్రవర్తించలేదు.

మనస్సులో ఏది నడిచినా అది శ్రేయోమార్గంలో ఉండాలి. ధర్మచింతనంగా సాగాలి. సాధ్యాన్ని దర్శిస్తూ ముందుకు సాగే సాధనగా శోభించాలి. మోక్షాన్ని సాధ్యంగా, జ్ఞానాన్ని సాధనంగా నిరూపిస్తూ వేదాంతం ప్రమాణమై శోభిస్తోంది. జటిలమైన వేదాంతాన్ని ఆపోశనం పట్టలేని సామాన్యులకు కూడా వేదాంతసారాన్ని సులభంగా, సులలితంగా అందించే మహాకార్యంలో ఇతిహాస పురాణాదులు వెలుగులోకి వచ్చాయి.

రామాయణ మహాభారతాలు ఇతిహాసాలు. చూచేందుకు మనిషికి నేత్రాలు ఎలాగో, ధర్మావగాహనకు మనస్సుకు రామాయణ భారతాలు పవిత్రములైన నేత్రాలవలె శోభించాయి. వేలాది సంవత్సరాలుగా జాతిని ధర్మగాడిలో నిలిపి జాగృతం చేశాయి.

రామాయణ మహాభారతాలను ఇతిహాసములు అన్నారు. వాటిని పురాణాలలో చేర్చలేదు. 'ఇతిహాసము' అంటే "అలా జరిగింది" అని అర్థము. **(ఇతి-హా-అసమ్).** 'హా' అనేది నిశ్చయార్థకం. జరిగింది అనే విషయాన్ని ఖచ్చితంగా చెప్పేందుకే 'హ' అనే అక్షరము.

రామాయణం జరుగుతూ ఉన్నప్పుడే వాల్మీకి రామాయణాన్ని రచించాడు. భారతంలో వ్యాసుని పాత్ర అమోఘంగా, అద్భుతంగా గోచరిస్తూ ఉంటుంది. అవి ఇతిహాసములు అనటానికి అంతకు మించిన ఋజువులు అవసరం లేదు.

ధర్మాన్ని ఊపిరిగా ధరించి రామాయణ మహాభారతాలు అసమానంగా శోభించాయి. మానవ జీవితంలో ధర్మము యొక్క అవసరం ఏమిటో, ధర్మాన్ని బ్రతుకులో దూరం చేసుకుంటే మనిషి ఎలా దిగజారిపోతాడో కంటికి కట్టినట్లు రామాయణ మహాభారతాలు చిత్రిస్తాయి.

ధర్మానికి దూరులై, అధర్మంగా చరించేవారు ఎంత గొప్పవారైనా, తపోధనులైనా, యశోధనులైనా ఎద బాధతో క్రుంగిపోతారని, దిక్కులేని చావు చస్తారని రావణ, దుర్యోధనాది పాత్రల ద్వారా సుస్పష్టం చేస్తాయి. ధర్మరూపులై చరించేవారు తాత్కాలికంగా బాధల నెదుర్కొన్నా, శాశ్వతంగా సుఖరూపులై, సర్వోత్తములై శోభిస్తారని

శ్రీరామ, ధర్మరాజాది పాత్రల ద్వారా అద్భుతంగా ప్రవచిస్తాయి. కేవలం ధర్మాధర్మాలను వల్లెవేయటం కాకుండా అధర్మంగా చరిస్తే ప్రాప్తించే దుర్గతి ఎలా ఉంటుందో గుండెకు గట్టిగ పట్టిస్తాయి.

పురాణాలు ఇతిహాసాలు కావు. పూర్వం జరిగిన వాటిని తెలిపేది పురాణం (పురా). కాని, వాటిలో గతమే కాదు; భవిష్యత్తు కూడా ఉంటుంది. అసలు భవిష్య పురాణమే ఒకటుంది. భాగవతం ద్వాదశ స్కంధములో భవిష్యత్తును దివ్యంగా ప్రబోధించటం జరిగింది*.

భక్తుల ప్రార్థనలను ఆలకించి పరమాత్మ పూర్ణావతారంగా గాని, అంశావతారంగా గాని అవతరించడమే పురాణాలలో కేంద్ర విషయంగా ఉంటుంది. పుణ్యాత్ముల పుణ్య ఫలంగా, పాపాత్ముల పాపఫలంగా పరమాత్మ లీలా శరీరమును ధరించి ధర్మాన్ని రక్షించి జ్ఞానామృతమును వితరణ చేయుటము ముఖ్య విషయంగా భాసిల్లుతూ ఉంటుంది.

పురాణాల నడక ఆశ్చర్యంగాను, అద్భుతంగాను ఉంటుంది. అందులో గతంలో జరిగిన చరిత్ర లుంటాయి. భౌగోళిక వర్ణన ఉండి, నూతన ప్రదేశాలు పరిచయం చేయబడుతూ ఉంటాయి. తత్త్వం ఉంటుంది. యోగం ఉంటుంది. భక్తి ప్రధానంగా ఉంటుంది. ధర్మబోధలుంటాయి. సృష్టిక్రమము వర్ణించబడుతుంది. సర్వదేవతా రాధన ఉంటుంది. తత్త్వానుభవాలు, దివ్యానుభూతులు ఉంటాయి. ధర్మావగాహన బోలెడంత ఉంటుంది. భావము భాష ముడిపడి, పోటీపడి నదీప్రవాహంలా సాగే పురాణగాథల్లో భగవద్వైభవము, భక్తి వైభవము, జీవన సౌందర్యము సాగర రూపంలో గోచరిస్తాయి.

పురాణాలన్నీ వ్యాస విరచితములే. కొన్ని పురాణాల విషయంలో మీమాంస లేకపోలేదు. కర్త విషయంలో సంశయం లేకపోలేదు. విష్ణు, గరుడ, భాగవతాది పురాణాదుల విషయంలో అనేక విషయాలు చర్చనీయాంశాలు. సంశయ నిలయాలు. విషయ విశదీకరణము, రచనాశైలి సందేహాలకు అవకాశ మిస్తాయి. ఇక్కడ మనకు అవన్నీ అసందర్భం. అప్రస్తుతం. ఏది ఏమైనా, పురాణాలన్నీ వ్యాస భగవానుని శ్వాసలే అని గ్రహించాలి.

పురాణాలు పద్దెనిమిది ఉన్నా, భాగవత పురాణానికి ఒక విశిష్ట స్థానముంది. దశావతార వర్ణనము, సృష్టి వైభవము, నారద, ప్రహ్లాద, ధ్రువ, అంబరీషాది భక్తుల గాథలు, కపిలుని జ్ఞానము, వేదాంత తాత్పర్యము ఇవన్నీ ఒకవైపు శోభిస్తూ ఉండినా, శ్రీకృష్ణ భగవానుని దివ్యగాథను అద్భుతంగా వివరించిన దశమస్కంధము ఎనలేని కీర్తిని తెచ్చి పెట్టింది. ఈ కారణం చేత అష్టాదశ పురాణాలలో భాగవతము తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొని, పురాణ గగనంలో ధృవతారగా ప్రకాశిస్తోంది. వ్యాసుని వైభవం దేదీప్యమానంగా శోభించింది. భాగవతం సర్వ పురాణముల సారాంశమని ప్రతీతి. అందుచేతనే భాగవతాన్ని విద్వాంసులకు పరీక్షా గ్రంథంగా పేర్కొన్నారు. ఒక్క భాగవతాన్ని పఠిస్తే పరిపోతుంది అనే అభిప్రాయానికి వచ్చారు.

* స్వామీజీ రచించిన "చైతన్య భాగవతము"ను చూడగలరు.

"మహానుభావుడైన మహర్షి రచించిన భాగవతం ఉండగా అన్య శాస్త్రముల యొక్క అవసర మేమున్నది?" అన్నారు.

అది నిర్మలమైన బదరికాశ్రమం. పవిత్ర సరస్వతీ నదిలో స్నానం చేసి, నిత్య కర్మానుష్ఠానం పూర్తి చేసుకొనిన వ్యాసుడు విచార వదనంతో కూర్చొని ఉన్నాడు. అదే సమయానికి ఆ మార్గంలో వెళ్తున్న నారద మహర్షి వ్యాసుని చూశాడు. ఆశ్చర్యపోయాడు.

వ్యాసమహర్షి సామాన్యుడు కాడు. వేదాలను సంస్కరించిన వేదవిదుడు. బ్రహ్మ సూత్రములను అందించిన మహాపురుషుడు. మహాభారత తైలంతో జ్ఞానదీపాన్ని జాజ్వల్యమానం చేసిన మహాజ్ఞాని. వ్యాసుడు చవిచూడనిది లేదని ప్రతీతి. **(వ్యాసోచ్ఛిష్టం జగత్ సర్వం).** అలాంటి వ్యాసుడు దీనుడుగా నైరాశ్యంతో కనిపిస్తూ ఉండటం నారద మహర్షికి మ్రింగుడు పడలేదు. నారదుడు వ్యాసుని సమీపించాడు.

"హే! పరాశరాత్మజా! పావన చరితా! చిత్రములను సృష్టించుటలో నీవు ధాతవు. విచిత్రములను విరజిమ్ముటలో విధాతవు. వేదశాస్త్ర విజ్ఞాతవు. ఇంద్రియ మనోబుద్ధుల విజేతవు. బ్రహ్మతత్త్వ నిర్ణేతవు. పండిత నేతవు. సత్యధర్మాల వినేతవు. నీలో విచారమా? నీకూ విషాదమా? అశాంతి నీ పంచన ఎలా చేరింది?" అని ప్రశ్నించాడు నారద మహర్షి.

"మునీంద్రా! నీవు సర్వలోకముల నెరిగిన విలోకివి. త్రిలోక సంచారివి. వాయు దేవునివలె పవిత్రంగా చరించే తీర్థ స్వరూపుడవు. నిన్ను తెలియనివారు ముల్లోకాలలో లేరు. నీకు తెలియనిది విశ్వమునందు ఉండదు. సృష్టికర్త ప్రేమకు ప్రతిరూపంగా జన్మించావు. స్థితికర్త భజనలో తరించిపోయావు.

"మహర్షీ! ఎందుకనో ప్రస్తుతం నా మనస్సు నైరాశ్యంలో పూడుకుపోయింది. నా హృదయం అశాంతితో అలమటిస్తూ ఉంది. నాకు తెలియని కారణం నీకు తెలియకుండా పోదు. దీనికి పరిష్కారము నీవే చూపాలి. నాపై దయచూపాలి" అని చేతులెత్తి నమస్కరించాడు వ్యాసభగవానుడు.

నారదమహర్షి చిరునవ్వును చిందిస్తూ, చిరుతలకు పనిచెప్పే కార్యానికి శ్రీకారం చుట్టాడు.

"వ్యాసదేవా! జటిలమైన వేదాంత శాస్త్రాన్ని ప్రవచించావు. గహనమైన బ్రహ్మతత్త్వాన్ని సూత్రీకరించావు. ఎంతో చేశావు. ఎంతెంతో చేశావు. జ్ఞానం విశిష్టమైనదే అయినా, భక్తి లేనిదే జ్ఞానం అలవడదు. ప్రారబ్ధ ఫలాల ననుభవిస్తూ, పురుషార్థంలో దిక్కుతోచక చుక్కాని లేని నావల్లాగా చలించిపోతున్న జీవులకు ఏకైక శరణ్యము భక్తియే కదా! భగవానుని ఐశ్వర్యాన్ని అనుభవించేందుకు సహకరించేది మాధుర్య ప్రధానమైన భక్తియే కదా!

"ఎంతో చెప్పావు. చింత మిగిలే ఉంది అంటున్నావు. ఇక ఆలస్యమెందుకు? ఈశ్వర వైభవాన్ని వర్ణిస్తూ భక్తిరస ప్రధానమైన గ్రంథాన్ని రచించు. హరిభక్తిని అందులో నదిలాగా ప్రవహించనీ. హే మునీ! యావత్ప్రపంచము అట్టి పవిత్ర భక్తి గంగలో మునకలేసి తరించనీ!

"ఏమో! అందరి కొరకు జీవించిన అందమైన బ్రతుకు నీది. అందరి నైరాశ్యము కట్టగట్టుకొని వచ్చి నీ హృదయంలో కాపురం పెట్టిందేమో! సర్వుల హృదయాలు తేలికపడేలా సుందరమైన భక్తి గ్రంథాన్ని రచించి హరిభక్తిని విరివిగా వితరణ చేయి. ఆ మహత్కార్యము అందరి హృదయాలను తేలికపరుస్తుంది. ఆ పవిత్ర కార్యంలో నీ ఆవేదన అదృశ్యమవుతుంది. కేవలం ధర్మాలతో బుద్ధి బరువెక్కుతుందేమో గాని హృదయం శాంతించదు. భక్తియే హృదయాన్ని తేలికపరుస్తుంది. ప్రేమ అమృతాన్ని ప్రసాదిస్తుంది. సిద్ధిని కూర్చుతుంది. ప్రసిద్ధిని సమకూర్చుతుంది. తృప్తిని ప్రసాదిస్తుంది.

భగవంతుని అనంత కళ్యాణ గుణములను శ్రవణం చేసి, ప్రేమపూరితమైన భక్తిని చేయుటచేత తాను ముక్తి పొందిన విషయాన్ని కూడా తెలియచేసి నారదమహర్షి అంతర్హితుడయ్యాడు.

వ్యాసుడు నారదుని ఆదేశాన్ని భగవదాజ్ఞగా భావించాడు. శమ్యాప్రాస మనే ఆశ్రమంలో ఉండి భాగవత పురాణాన్ని రచించాడు. రచన పూర్తి కాగానే వ్యాసుని హృదయంలో అశాంతి అంతరించింది. అలౌకికానంద ప్రవాహం పరవళ్ళు త్రొక్కింది.

మహా ప్రస్థానము - పరీక్షిత్తు పరిపాలనము

అర్ధరాత్రి సమయాన విదురుడు ధృతరాష్ట్రుని మందిరానికి వచ్చాడు. "ధృతరాష్ట్ర మహారాజా! నీ బిడ్డలు, బంధువులు కురుక్షేత్రంలో కనుమరుగయ్యారు. నీవు వృద్ధుడవయ్యావు. శబ్దాలను చెవులు గ్రహించలేకుండా ఉన్నాయి. అయినా, నీకు ప్రపంచంపట్ల వ్యామోహం చావలేదు".

"అన్నా! దుష్టులైన నీ బిడ్డలు పాండవుల్ని ఎంతగా హింసించారో లోకానికి విదితమే. ఇంటికి నిప్పు పెట్టడం మొదలుకొని నిండుసభలో ద్రౌపదిని అవమానించినంత వరకు అన్నీ దౌష్ట్యాలే. దుశ్చర్యలే. రాజ్యాన్ని అపహరించారు. సంపదను దోచుకున్నారు".

"భ్రాతా! నీ బిడ్డలు ఏ పాండవులను మోసంచేసి కష్టాలకు గురిచేశారో, కానలలో కాపురం పెట్టించారో, ఆ పాండవులు పెట్టే అన్నము తిని బ్రతుకుతున్నావు. ఇది నీకు ఉచితమా?" అన్నాడు విదురుడు.

"విదురా! నేను జీవశ్చవంలా బ్రతుకుతున్నాను. నీ మాటలతో నన్ను ఎందుకు చిత్రవధ చేస్తావు? నన్ను ఏం చెయ్యమంటావు? పైగా ఇది రాత్రి సమయము" అన్నాడు ధృతరాష్ట్రుడు.

"రాజా! రాత్రింబవళ్ళు చక్షుష్మంతులకే గాని అంధులకు గాదు. నా మాట విను. పగటిపూట ధర్మరాజు నిన్ను వెళ్ళనివ్వడు. రాత్రి సమయమే అనువైనది".

"నీ కుమారుడైన దుర్యోధనుని వధించిన భీమసేనుడు పడేసే కబళాన్ని కాపలా కుక్కలా తింటూ పడి ఉండేకన్నా, ఇప్పుడైనా వివేకంతో అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేసుకోవటం మంచిది" అని విదురుడు పలికాడు.

విదురుని సలహాను అంగీకరించాడు ధృతరాష్ట్రుడు. గాంధారి, ధృతరాష్ట్ర విదురులు అర్ధరాత్రి సమయాన ప్రయాణమై హిమాలయాలకు వెళ్ళారు.

కృష్ణుని అవతార సమాప్తి- అర్జునుని ఆగమనము

అర్జునుడు కొన్ని మాసాలుగా హస్తినాపురంలో లేడు. ద్వారకలో శ్రీకృష్ణునివద్ద ఉండినాడు.

ధృతరాష్ట్ర, గాంధారి, విదురులు అంతఃపురాన్ని విడిచి వెళ్ళారు అనే వార్త ధర్మరాజును చాలా క్రుంగదీసింది.

ఈలోగా ద్వారక నుండి అర్జునుడు వచ్చాడు. అర్జునుని ముఖం విషాద ఛాయలతో నిండి కాంతిహీనంగా గోచరిస్తోంది. ధర్మరాజు ఉద్విగ్న మనస్కుడయ్యాడు.

"అర్జునా! నీవు ఆరోగ్యంగా ఉన్నావా? ద్వారకలో మనవారందరు కుశలమా? శ్రీకృష్ణుడు కుశలంగా ఉన్నాడా?" అని ధర్మరాజు ప్రశ్నించగనే అర్జునుడు ప్రవాహంలా పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక "అన్నా!" అంటూ ధర్మరాజు పాదాలపై బడి బోరున విలపించాడు.

"అగ్రజా! అయిపోయింది. అంతా అయిపోయింది. జగత్తే కాంతిహీనమై పోయింది. ఏ దివ్య జ్యోతి నా రథంలో ప్రకాశిస్తూ ఉంటే భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యాదులను చెండాడానో ఆ దీపం నాకు దూరమైంది. పార్థా! అర్జునా! సఖా! అనే ప్రేమ పలుకులకు ఇక నా చెవులు నోచుకోవు"; అని అర్జునుడు దుఃఖిస్తూ ఉన్నాడు.

శ్రీకృష్ణుడు ఈ ప్రపంచమును త్యజించినాడు అనే వార్త చెవిని పడగానే కుంతీదేవి నిశ్చేష్టురాలైంది. తన మనోబుద్ధులను శ్రీకృష్ణుని పాదారవిందములయందు లగ్నంచేసి అనాయాసంగా దేహాన్ని త్యజించింది.

శ్రీకృష్ణుడు లేని ఈ ప్రపంచం దీపం లేని ఇల్లు వంటిదని ధర్మరాజు భావించాడు. నీరు లేని బావిని కప్పలు త్యజించునట్లు ఈ జగత్తును త్యజించాలని పాండవులు భావించారు.

తన మనుమడు ఉత్తరాభిమన్యుల పుత్రుడైన పరీక్షిత్తునకు ధర్మరాజు రాజ్యాన్ని ఇచ్చాడు. మరుక్షణమే గృహాన్ని త్యజించి సన్యాసిలాగ ఉత్తర దిశగా బయలుదేరాడు. ద్రౌపదితో పాటు సోదరు లందరు ధర్మరాజును అనుసరించారు. ఇదే మహా ప్రస్థానము. హిమాలయముల వైపు నడక సాగించిన పాండవులు తమ దేహాలను

చాలించారు. సదా శ్రీకృష్ణుని చరణకమలముల యందు చిత్తమును లగ్నంచేసిన విదురుడు ప్రభాస తీర్థమువద్ద దేహాన్ని చాలించాడు.

కలికి కళ్ళెము

శ్రీకృష్ణ నిర్యాణము జరిగిన క్షణంలోనే ప్రపంచంలో కలి ప్రవేశించింది. కలి అంటే కలహము అని అర్థము.

ఒకనాడు రాజు అయిన పరీక్షిత్తు సరస్వతీ నదీతీరాన ఒక వింత దృశ్యాన్ని చూశాడు. రాజు లక్షణములు లేక కేవలం రాజు వేషమును మాత్రమే ధరించిన ఒకడు ఒంటికాలిపై నిలబడియున్న వృషభాన్ని కఱ్ఱతో కొడుతూ ఉన్నాడు. ప్రక్కనే ఉన్న గోమాతను కూడా కాలితో తన్నుతూ కనిపించాడు.

పరీక్షిత్తు కలత చెందాడు. వృషభ రూపంలో ఉన్నది ధర్మ దేవతయేనని గ్రహించాడు. గోమాత రూపంలో ఉన్నది ధరణి అని తెలిసింది. హింసించుచున్న దండధరుడు కలిపురుషుడే అనేది కూడా అవగతమైంది.

కృత యుగంలో ధర్మం చతుష్పాదాలతో శోభించింది. తపస్సు, దయ, శౌచము, సత్యము - ఈ నాలుగే చతుష్పాదములు. అహంకారము తపస్సును పాడు చేసింది. వ్యభిచారము శౌచాన్ని పోగొట్టింది. త్రాగుడు దయను ధ్వంసం చేసింది. ప్రస్తుతం సత్యం ఒక్కటే మిగిలి ఉంది. ఏకపాదంతో ధర్మదేవత నిలిచి ఉంది. దానిని కూడా హరించాలని కలి ప్రయత్నిస్తూ ఉన్నాడు. ఈ దారుణాన్ని చూచి గోరూపంలో భూమాత రోదిస్తూ ఉంది.

ధర్మానికి, ధరణికి అభయ ప్రదానం చేసి కలిని దండించుటకు పరీక్షిత్తు సిద్ధపడ్డాడు. కలిపురుషుడు ధర్మమూర్తి యైన పరీక్షిత్తు పాదములపై బడి శరణువేడాడు. పరీక్షిత్తు ఆజ్ఞ మేరకు ఎక్కడ ఉండమంటే అక్కడ ఉంటానని చెప్పాడు.

ధర్మప్రభువు అయిన పరీక్షిత్తు, "కలీ! జూదము, మద్యపానము, వ్యభిచారము, హింస ఈ నాలుగు స్థానములలో నీవు ఇష్టపడిన చోట ఉండవచ్చు" అన్నాడు. అంటే, తన ధర్మపాలనలో ఈ నాలుగు రాక్షస గుణాలు ఉండలేవని పరీక్షిత్తు అభిప్రాయము.

ఈ రహస్యం గాని రహస్యం కలికి కూడా తెలుసు. అందుచేత మరొక స్థానాన్ని కేటాయించమని ప్రాధేయపడ్డాడు. "స్వర్ణము"ను కేటాయించాడు పరీక్షిత్తు. స్వర్ణము అంటే ధనమే. బంగారులో చేరిపోయాడు కలి.

అంతే కాదు. సమయం కొరకు నిరీక్షిస్తూ ఉన్నాడు. ధనం కాంచనంగా మళ్ళీ రాక్షస కృత్యాలన్నీ సాగించవచ్చునని కలి అభిప్రాయము. కాలం కొరకు ఎదురు చూస్తున్నాడు కలహరూపుడు, కల్మషరూపుడు అయిన కలి. **"ధనం మూలం ఇదం జగత్"** అనే బోర్డు తగిలించుకొని సంచరిస్తున్నాడు. అతని వెనుకే 'జై' కొడుతూ నడుస్తున్నాయి అహంకారము, మోసము, హింస, ద్వేషము, లోభము, దోపిడి, అబద్ధాలు అన్నీను. తనకు కేటాయించిన ఐదు స్థానాలలో ఏదో ఒక చోట నుండి పరీక్షిత్తుని కూడా ఆవరించాలని ఆలోచిస్తున్నాడు కలి.

విషమ ఘడియలు

పరీక్షిత్తునకు ఒకనాడు వింత ఆలోచన కలిగింది. తన కొరకు తాత అయిన అర్జునుడు ఏమి దాచి ఉంచినాడో చూడాలి అనే బుద్ధి పుట్టి, అదే పనిగ అన్వేషిస్తూ ఉంటే, ఒక పెట్టెలో సువర్ణ కిరీటము కనిపించింది. అది జరాసంధునిది. జరాసంధుని కుమారుడు అర్థించినా భీముడు దానిని ఇవ్వకుండా తీసుకొని వచ్చాడు. కనుక అది అధర్మసంపద.

పరీక్షిత్తు ఆ సువర్ణ కిరీటాన్ని తలపై ధరించాడు. అంతే. సమయం కొరకు నిరీక్షిస్తూ ఉండిన కలిపురుషుడు దాని ద్వారా పరీక్షిత్తు బుద్ధిలో ప్రవేశించాడు. అంతే. ఇంకేముంది? ఏదైనా జరుగుతుంది. కలహానికి, కయ్యానికి శ్రీకారం చుట్టాడు కలి.

పరీక్షిత్తు వేట - కలి ఆట

సువర్ణ కిరీటాన్ని ధరించి పరీక్షిత్తు వేటకు వెళ్ళాడు. వేటాడి అలసిపోయాడు. దప్పిక తీవ్రమైంది. ఎంతగా వెతికినా ఆ అరణ్య ప్రాంతంలో జలాశయము కనిపించ లేదు. అన్వేషణ సాగిస్తూ ఉండగా ఆశ్రమం ఒకటి అగుపించింది.

అది శమీక మహర్షి ఆశ్రమము. పరీక్షిత్తు ఆశ్రమాన్ని సమీపించాడు. అదే సమయానికి శమీకుడు ధ్యానంలో అంతర్ముఖుడై ఉన్నాడు. దాహంగా ఉందని నీరు ప్రసాదించమని మహర్షిని అభ్యర్థించాడు. మహర్షి కళ్ళు తెరవలేదు. మారు పలకలేదు.

పరీక్షిత్తు సహనాన్ని కోల్పోయాడు. మహర్షి అహంకారి అని నిర్ణయించుకున్నాడు. ఇలాంటి ఆలోచన రావటం కూడా కలి ప్రభావమే.

పరిసరాలను పరికించి చూశాడు పరీక్షిత్తు. అక్కడే చచ్చిపడి ఉన్న పాము ఒకటి కనిపించింది. వికలమైన చిత్తముతో, గాయపడిన హృదయంతో కలత చెందియున్న పరీక్షిత్తు ఆ మృత సర్పాన్ని శమీకుని మెడలో వేశాడు. ఇదంతా కలి మహిమే.

శమీకుని ప్రశాంతతలో మార్పు లేదు. తన తప్పిదం పరీక్షిత్తునకు తెలిసి వచ్చింది. పశ్చాత్తాపంతో వెనుదిరిగి హస్తినకు వచ్చేశాడు.

శమీకుని కుమారుడు శృంగి. గొప్ప తపస్వి. తండ్రికి జరిగిన అవమానం తెలుసుకొని మరో ఆలోచన లేకుండా పరీక్షిత్తుని శపించాడు. మహాత్ముడైన తవ తండ్రికి చేసిన ద్రోహానికి ఆనాటికి ఏడవరోజు తక్షకుడనే సర్పరాజు కాటుకు గురియై పరీక్షిత్తు మరణించునట్లు శృంగి శాపం పెట్టాడు.

శాప విషయం తెలిసి శమదమాదులు కలిగిన శమీకుడు కలత చెందాడు. పరీక్షిత్తు తొందరపాటులో ఒక విధంగా తప్పు చేస్తే, అదే విధమైన తొందరపాటులో శృంగి కూడా

దారి తప్పినట్లు గ్రహించాడు. విడిచిన బాణం లాగ శృంగి శాపము వెనుదిరిగి రాదని గ్రహించిన శమీకుడు తన ధర్మంగా జరిగిన విషయాన్ని ముని బాలుర ద్వారా పరీక్షిన్మహారాజుకు చేరవేశాడు.

మృత్యు ముఖంలో పరీక్షిత్తు

శాపవార్తతో పరీక్షిత్తునకు కనువిప్పు కలిగింది. వివేక వైరాగ్యాలు హృదయాన్ని కుదిపేశాయి. ఇహపర సుఖాలు తుచ్ఛమని బుద్ధి తీర్పునిచ్చింది. మనస్సు మహిని మరచిపోయింది. మాధవుడే హృదిలో నిలిచిపోయాడు.

రాజ్యాన్ని తన కుమారుడైన జనమేజయ మహారాజుకు అప్పగించాడు. తీవ్ర వైరాగ్యంతో ప్రాయోపవేశము చేసేందుకు గంగా తీరానికి చేరాడు పరీక్షిత్తు. ఈ విషయం తెలిసి ఎందరో మహాత్ములు, ఋషి పుంగవులు గంగా తీరాన్ని చేరారు. మహాత్ముడు, ధర్మాత్ముడైన పరీక్షిత్తు పరిక్లేశాన్ని చూసి పరితపించారు.

పరీక్షిత్తు చేతులు జోడించి వారికి నమస్కరించాడు. "మహాత్ములారా! వివేకాన్ని కోల్పోయి, అర్థరహితమైన పనిచేసి అనర్థాన్ని, అమంగళాన్ని కొనితెచ్చుకున్నాను. ఈ ప్రపంచంలో నా మనుగడ ఇక వారం రోజులు మాత్రమే. ఈలోగా నేను తరించే మార్గ మేమిటో తెలియచేయండి. పరమాత్మ సన్నిధిని చేరే మార్గాన్ని ఎరుక పరచండి" అని ప్రార్థించాడు.

ఏడు రోజులలో ముక్తి ఎలా సిద్ధిస్తుంది? అని మహర్షులు ఆలోచించసాగారు. ఈలోగా పరీక్షిత్తు పుణ్యఫలంగా పరబ్రహ్మ స్వరూపమైన శుకబ్రహ్మ ఆ ప్రదేశానికి వచ్చాడు.

పరీక్షిత్తు శుకుని పాదాలకు మ్రొక్కి తనను కడతేర్చమని ప్రార్థించాడు. పరీక్షిత్తు యోగ్యత కలిగిన శ్రోత యని గుర్తించాడు శుకబ్రహ్మ. శుకావధూత భాగవతంలో ప్రథమంగా పలికిన శ్లోకం ఇదే.

వరీయా నేషతే ప్రశ్నః కృతో లోకహితం నృప
ఆత్మవి త్సమ్మతః పుంసాం శ్రోతవ్యాదిషు యః పరః ॥

"రాజా! నీవు అడిగిన ప్రశ్న వరిష్ఠమైనది. లోకహితమైనది. ఆత్మవిదులకు సమ్మతమైనది. శ్రోతలకు శుభములను ప్రసాదించునది".

"రాజా! పూర్వీకు లందరు కాలగర్భంలో కలిసిపోయారు. తాతలు గతించారు. తండ్రులు గతిస్తున్నారు. భార్యాబిడ్డలు గతించనున్నారు. గతులు తెలిసే దెప్పుడు? మతులు నిలిచే దెప్పుడు? చిత్తము ఉండేది బాధల కొరకేనా? ఛాతి ఉండేది బాదుకొనేందుకేనా? పూలు, కాయలు లేని చెట్టును పక్షులు వదలి వెళ్ళునట్లు ప్రాణాలు పోగానే దేహాన్ని అందరూ త్యజిస్తారు. ఇంటిలోని ధనాన్ని పరులు అనుభవిస్తారు. ఒంటిలోని ధాతువులను జంతువులు ఆరగిస్తాయి.

తస్మాద్భారత సర్వాత్మా భగవా నీశ్వరో హరిః
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్య శ్చేచ్ఛతాఽ భయమ్ ॥

"రాజా! మోక్షమును కోరువాడు సర్వాత్మరూపుడు, భగవానుడు, ఈశ్వరుడు, శ్రీహరి అయిన పరమాత్మ విషయమునే శ్రవణం చేయాలి. కీర్తించాలి. స్మరించాలి.

ఆశించదగినవాడు అచ్యుతు డొక్కడే. కీర్తింపదగినవాడు కృష్ణుడే. వ్యవహారము మనిషిని బంధించదు. మమకారమే బంధిస్తుంది. అన్నీ ఉండినా భక్తిహీనుడు ఈ ప్రపంచంలో శక్తిహీనుడే" అన్నాడు శుకబ్రహ్మ.

"మహాత్మా! నాకు ఏడు రోజులలో మరణము ఎదురు చూస్తున్నది. ఈ వారం రోజులలో నేను తరించగలనా?" అని ప్రశ్నించాడు పరీక్షిత్తు.

"రాజా! పూర్వము ఖట్వాంగుడు అనే రాజు ఉండేవాడు. అతనికి ఒక ముహూర్త కాలమే ఆయుషు ఉన్నదని అతనికే తెలిసిపోయింది. వెంటనే, సర్వమును త్యజించి, చిత్తమును శ్రీహరియందు లగ్నంచేసి, తదేకధ్యానంతో తరించిపోయాడు. నీకు ఏడు రోజుల గడువు ఉంది. సందేహించకు. పరమ పవిత్రమైన భాగవత పురాణాన్ని నా తండ్రి వ్యాస భగవానుని వద్ద నేను ఆలకించాను. అది నీకు వినిపిస్తాను. నీవు తరించిపోతావు" అని చెప్పి భాగవతాన్ని ప్రారంభించాడు శుకావధూత.

పరీక్షిత్తు భక్తి శ్రద్ధలతో భాగవతాన్ని శ్రవణం చేసి వారం రోజుల్లో తరించి పోయాడు. అప్పటి నుండి భాగవత సప్తాహాలను విధి నియమాలతో నిర్వహించటం ఆచారమైంది.

భక్తుల జీవిత గాథలను, సృష్టి వైభవాన్ని, సాధన వైశిష్ట్యాన్ని, పరమాత్మ కృపా విశేషాన్ని, మోక్ష మార్గాన్ని భాగవతము వివరించినట్లు మరొక గ్రంథము అందించలేదు. భాగవతామృతాన్ని పానం చేసినవారు భగవత్స్వరూపులై శోభిస్తారు అనుటలో సందేహం లేదు.

నిగమ కల్ప తరోర్గళితం ఫలం శుకముఖా దమృత ద్రవ సంయుతమ్
పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికా భువి భావుకాః ॥

"భాగవతము వేద మనెడి కల్పవృక్షము నుండి జారిన పండు. శుకుని అమృత వచనాలతో తడిసిన అమృతఫలము (చిలుక కొట్టిన పండు); భావ మెరిగిన రసికులు ఈ భాగవత ఫల రసాస్వాదనం చేస్తారు" అని భాగవతము.



చైతన్య గాన లహరి

పల్లవి: చల్లని వెన్నెల నవ్వుల చిన్నా!
తెల్లని వెన్నల మువ్వల నాన్నా!

అనుపల్లవి: నీ కొరకే నే బ్రతికున్నా
ని న్నొదలలేను ఎవ రేమన్నా ॥ చల్లని ॥

చరణములు:

1. గంగా యమునా నర్మద చంద్రభాగా కావేరి
కృష్ణా జలాలలో జలకమాడి
నల్లని మేనున తెల్లని ముత్యాల
మాలలతో గుండెల్లో దాగిపోరా ॥ చల్లని ॥

2. మల్లెలు మొల్లలు సంపంగి జాజులు
వాసనలు వెదజల్లి మురిపింప
నవరత్న మాణిక్య స్వర్ణఛత్రము క్రింద
మహరాజుగ మాలో వెలిగిపోరా ॥ చల్లని ॥

3. పాలు మీగడలు తియ్యని జున్నులు
పనస నారికేళాదు లారగించి
వల్లవ తరుణులు ఉయ్యాల లూపుచుండ
ఊగుచు నిద్రలోకి సాగిపోరా ॥ చల్లని ॥

4. నారద తుంబుర శ్రీ వ్యాస శుకబ్రహ్మ
అర్జున భీష్మాదులు అందజేరి
మందర స్థాయిలో లాలిపాట పాడుచుండ
మా ముందర అందముగ నిద్రపోరా! ॥ చల్లని ॥




ప్రస్థానత్రయము

ఇందులో...

ఉపనిషత్తులు - శ్రుతిప్రస్థానము

శ్రీమద్భగవద్గీత - స్మృతిప్రస్థానము

బ్రహ్మ సూత్రములు - న్యాయప్రస్థానము



ఉపనిషత్తులు

సుఖాలు - సుఖ కారణాలు

మనం ఈ ప్రపంచంలో దేనిని ఆశించినా, అది సుఖమని మనం ఆశించటం లేదు. సుఖ కారణ మని వెంబడిస్తున్నాము. దేని నైతే సుఖ కారణ మని భావించి మనం అభిలషిస్తూ ఉన్నామో, అది అలా కాదు అని తెలియగానే ఆ క్షణం నుండే ప్రయత్నాలు మానేస్తాము.

వస్తువు సుఖం కాదు

సుఖం అనేది ఒక వస్తువు కాదు; ఒక ప్రదేశం కాదు; కాలము కానే కాదు; సన్నివేశం అసలే కాదు. వీటిల్లో ఏది సుఖమైనా, అది మనల్ని సదా సుఖపెట్ట గలగాలి. సర్వత్ర సుఖపెట్ట గలగాలి.

కాఫీ చేదుగా ఉంటుంది. పంచదారను కాఫీలో కలిపితే కాఫీ తియ్యగా మారుతుంది. అలా ఈ ప్రపంచంలో ఏ వస్తువైనా మన బ్రతుకును మధురంగా మార్చ గలుగుతున్నదా? సుఖం అనేది వస్తువే కనుక అయితే పంచదార కాఫీని తియ్యగా మార్చినట్లు, వస్తువు మనల్ని సుఖపెట్టగలిగి ఉండాలి.

తీపి అనేది చక్కెర ధర్మము. పంచదార లక్షణము. తీపి లేని చక్కెరను మనం చూడలేము. సుఖం అలాంటిది కాదు. సుఖ మనేది వస్తు ధర్మము కాదు. వస్తు లక్షణమూ కాదు. వస్తువు ఉంటుందే గాని, సుఖ వస్తువు లేదు.

హోటల్ కెళ్ళి టిఫిన్ చేస్తాం. రెండు ఇడ్లీలు తిన్నాం. "ఒక దోసె" చెప్పాలను కుంటాం. కాని, దోసె బాగా లేదని, అంతకు ముందే దోసె నారగించి మన ముందు కూర్చుని కాఫీ త్రాగుతున్న వ్యక్తి సైగ చేస్తాడు. అంతే. దోసెను విస్మరించి 'ఉప్మా'ను స్మరిస్తాము.

దోసె సుఖ కారణ మని భావించి ఆశించాము. కాదని తెలియగానే దానిని ఆరగించే ప్రయత్నాన్ని విరమించాము. అన్నీ ఇలాగే ఉంటాయి వస్తు ప్రపంచంలో సుఖాన్వేషణలు.

సమయం సుఖం కాదు

సుఖ మనేది కాలానికి సంబంధించింది కాదు. నేను ఇన్ని గంటలకు నవ్వుతాను అని ఎవరైనా చెబితే అది నవ్వులాటే అవుతుంది. జరిగే వన్నీ కాలంలోనే జరుగుతాయి. ఎప్పుడు ఏది ఎలా జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు. మనం సుఖ పడాలి అనుకున్న కాలం సుఖానికి అనుకూలం కాకపోవచ్చు. పైగా, ఆ సమయంలోనే విషాదము ముంచొకొని రావచ్చు.

పీటల మీద కూర్చొని శోభించవలసిన సమయానికి పాడె నెక్కి అంతిమ యాత్రను సాగించిన వారిని ఎందరినో మనం చూశాం. లాభాలు వచ్చి సుఖపెడతా యని ఏ

క్షణాల కొరకు మనిషి నిరీక్షిస్తాడో, ఆ క్షణాలు నష్టాలను మోసుకొని వచ్చి మోయలేని భారంతో గుండెను నింపేస్తాయి. కాలం మనకు తెలుస్తూ ఉంది. సమయాలు ఈ ప్రపంచంలో ఉన్నాయే గాని సుఖ సమయాలు లేవు. ఆనంద కాలాలు ఉండవు.

సన్నివేశం సుఖం కాదు

ఆ సన్నివేశంలో సుఖ ముంటుంది. ఆ సంఘటనలో సుఖపడతాను అని చెప్పలేము. ప్రపంచంలో సన్నివేశా లున్నాయే గాని సుఖ సన్నివేశాలు లేవు.

కొంత సమయం హాయిగా గడుపుదాము అని మిత్రుల ఇళ్ళకు వెళ్తాం. బంధువుల గృహాలకు వెళ్తాం. కాని, మనం వెళ్ళే సమయానికి వాళ్ళేదో ఇబ్బందుల్లో ఉంటారు. మనతో కలసి ఆనందించలేరు సరికదా వాళ్ళ దుఃఖాన్ని కూడా మనం మోయవలసి ఉంటుంది.

కొన్ని గంటలు సుఖపడతా మని సినిమా కెళ్తే, నిప్పు త్రొక్కిన కోతులు ఎగిరినట్లు గంతులు, అర్థం లేని కథ, అర్థం గాని సన్నివేశాలు, రాగి బిందెను కొబ్బరి పీచుతో తోముతున్నట్లు సంగీతము, వెల్డింగ్ షాపుల వద్ద జిగేలు మని మెరిసినట్లు కళ్ళు పోయేలా లైటింగ్ ఎఫెక్ట్స్ - డబ్బు చెల్లించి చీకట్లో కూర్చొని మధ్యలోనే లేచి రావటం - బాగలేదు అనటం. . . . ఇంతే కదూ? బాగలేదు అంటే ఏమిటి? బాగుంటే సుఖమున్నట్లే. బాగలేదు అంటే సుఖం లేదు అనే కదూ? సన్నివేశాలు, సమావేశాలు ఇలాగే ఉంటాయి.

ప్రదేశం సుఖం కాదు

సుఖం అక్కడ ఉంటుంది. ఇక్కడ ఉంటుంది అని చెప్పనేలేము. తీర్థాటన చేసే వాళ్ళను చూస్తే ఈ విషయం బాగా అర్థ మవుతుంది. ఏమండీ! కాశికి వెళ్ళొచ్చారు కదా? విశ్వనాథుని దర్శన మయిందా? ఆనందంగా ఉన్నారా? అని మనం అడిగితే, "ఏమి తీర్థాటనో లెండి. పండాల బాధతో గుండె బండబారి పోయింది. దర్శన సమయంలో నైనా నిమ్మళంగా ఉండనిస్తారా? దురదగొండి ఆకును రాసి గోకినట్లే. ఉన్నది కాశియే అయినా చంకలో ఎన్ని పిల్లులో! ఏదో వెళ్ళాం. వచ్చాం. ఎంతో కాలంగా వెళ్ళాలనుకున్నాం. వెళ్ళొచ్చాం". ఇదేనా సుఖం? ఏది సుఖ కారణం?

ఆలయంలో అర్చించే బుద్ధి వస్తుందని, ఆశ్రమంలో శాంతించే మనస్సు తోడవుతుందని భావించటం పొరపాటు. అర్చించే బుద్ధి ఉంటేనే ఆలయంలో అర్చన చేయగలం. శాంతించిన మనస్సే ఆశ్రమంలో ప్రశాంతంగా సేద తీర్చుకుంటుంది.

ఏది సుఖం? ఎక్కడ సుఖం?

అది తెలియకే బాధపడుతున్నాం. సుఖ మేమిటో, సుఖహేతు వేదో తెలియకనే తికమక పడుతున్నాం. 'మన' అనే దానిలో సుఖముందా? మనలో సుఖముందా? లేక మనమే సుఖమా? సుఖమే మనమా?

బస్సు ఎక్కగానే ఎవరి ప్రక్కన కూర్చోవాలా? అని ఆలోచిస్తాము. తెలిసినవారు ఎవ్వరూ లేకపోతే లేనివాళ్ళుగా మిగిలిపోతాం. ఎవరైనా కనిపిస్తే వెళ్ళి వాళ్ళ ప్రక్కన కూర్చుంటాం. కులాసాగా రెండు ప్రశ్నలు వేస్తాం. వాళ్ళు సమాధానం చెప్పేలోగా వాళ్ళ స్టాప్ వస్తుంది. 'బై' అంటూ రివ్వుమని దిగేస్తారు. అందరూ దిగిపోయేవారే. ఈ ఒక్క సత్యము మనస్సు కెక్కదు.

సినిమా కెళ్తే చాలు. ఎవరి ప్రక్కన కూర్చుందామా? అని ఆలోచిస్తాము. ఏం లాభం? సినిమా కాగానే వాళ్ళు లేచి తమ దారిన తాము పోతారు. అందరూ లేచిపోయే వారే. ఎందుకనో ఈ ఒక్క సత్యము మూలపడి లేవనంటుంది.

ఉండి ఏడిపించేవి కొన్ని అయితే, పోయి ఏడిపించేవి మరికొన్ని. దగ్గరై బాధించే వారు కొందరైతే దూరమై బాధించేవారు మరి కొందరు. ఎవరున్నా, ఎవరు లేకపోయినా, ఏవి ఉన్నా, ఏవి ఊడినా, పాపం! బాధలు మాత్రం తోడుగానే ఉంటాయి. సుఖాలు మాత్రం నీడగా కూడా నిలవవు.

సుఖం - సుఖి

ఈ ప్రపంచంలో ఏదీ సుఖం కాదు. ఏదీ సుఖ కారణం కాదు. సుఖ మనేది ఒకటి ప్రత్యేకంగా ఉంటే, అందరూ ఆశించేది సుఖమే కనుక అదేదో అందరికీ సుఖాన్ని ఇవ్వగలిగి ఉండాలి.

సుఖాలు లేవు. కాని, సుఖపడాలి అనే భావన నీలో ఉంది. సుఖాభిలాష విరమించటం లేదు. దీనిని కాస్త లోతుగా విచారిస్తే సుఖస్థాన మెక్కడో తేలిపోతుంది.

"నేను ఇప్పుడు సుఖంగా లేను" అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖంగా ఉన్నానని అర్థం.

"నేను ఇప్పుడు సుఖంగా ఉన్నాను" అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖాన్ని ఆశించేవాడుగా ఉన్నానని భావము.

"నేను సుఖపడుతున్నాను. నేను సుఖపడ్డాను" అనే వాక్యాలు నిత్య సుఖానికి సంబంధించినవి కావు. ఒక కారణంగా నీవు సుఖపడినా, సుఖపడుతున్నా, సుఖపడాలి అనుకున్నా అట్టి సుఖాలు నైమిత్తిక సుఖాలవుతాయే గాని నిత్యసుఖం కాలేవు.

ఒక కారణంగా నీకు సుఖం కలిగితే, దానిని నైమిత్తిక సుఖం అంటారు. సుఖానికి నిమిత్తం ఉంది కనుక, నిమిత్తం దూరమైతే సుఖం దూరమవుతుంది. అట్టి సుఖం నిత్య సుఖ మెలా అవుతుంది?

నిమిత్తాపాయే నైమిత్తికాపాయః
ఛత్రోపాయే ఛాయోపాయః

సుఖ కారణం దూరం కాగానే సుఖాలు దూరమవుతాయి. గొడుగు దూరం కాగానే నీడ దూరమవుతుంది.

సుఖమనేది నీకు కలిగేది కాదు. నీ నుండి దూరమయ్యేదీ కాదు. నీవే సుఖం. నీవే ఆనందం. అందుకనే, నీవంటే నీ కిష్టం. నీకు ఏది అయిష్టమో, ఏది ఇష్టమో నేను చెప్పలేను గాని, నీకు నీవు సదా ఇష్టమేనని భేరీ మ్రోగించి చెప్పగలను. నీవు నీకు ఎలా ఇష్టమో నేను నాకు అలా ప్రియము.

కదాచిన్నాహం అప్రియః

"నాకు నేను ఎప్పుడూ అయిష్టంగా లేను".

దొంగ నీకు ఇష్టం కాకపోవచ్చు. దొంగ తనకు తాను ఇష్టుడే. లేకపోతే, జీవించలేడు. ఎవరి విషయమైనా ఇంతే.

అర్థమవుతూ ఉంది కదూ! సుఖ స్థానం నీవే. సుఖ హేతువూ నీవే. అది ఎక్కడో ఉందని అన్వేషిస్తున్నాం. అది మనమే. నీవే. అది నీవే. నీ అనుభవంలోనే ఉంది. కానీ, తెలియటం లేదు. ఇక్కడే శాస్త్రం నీకు సహకరిస్తోంది. అది నీవే అంటున్నది "తత్త్వమసి".

అది నీవే. మరి, నీవు ఇప్పుడున్నావా? లేదా? ఉన్నావు. అయితే, అది కూడా ఉంది. నీకు వేరుగా లేదు. నీవుగా ఉంది. అందుకనే శాస్త్రం **"తత్త్వం భవిష్యసి"** అనలేదు. **"తత్త్వమసి"** అన్నది. అది ఉన్నదే కాని కానున్నది కాదు అని చెబుతున్నది.

శాస్త్రం ఏదో ఏదో చెబుతూ ఉందని పళ్ళు కొరక నవసరం లేదు. నీ అనుభవంలో ఉన్నదానినే శాస్త్రము చెబుతూ ఉంది. నీ అనుభవంలో ఉండి, నీకు అర్థంగాని విషయాన్ని శాస్త్రం నీకు అర్థమయ్యేలా చెబుతోంది. నిరూపిస్తోంది. ఇక్కడే శాస్త్రం ప్రమాణమై శోభిస్తోంది.

సిద్ధమే - సాధ్యం కాదు

ఉన్నది ఆత్మయే. ఆత్మయే నీవు. ఆత్మ ఇప్పుడున్నదే. మరొకప్పుడు తయారయ్యేది కాదు. కనుక ఆత్మ సిద్ధవస్తువే గాని సాధ్యవస్తువు కాదు. ఆత్మ ఉంది. తెలియకుండా ఉంది. ఉన్నది తెలియకపోయినా బాధ లేదు. మరో విధంగా తెలుస్తూ ఉంది. లేనిది ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ఆత్మ తెలియకపోవటమే గాక "నేను దేహము, నేను మనస్సు, నేను ఫలానా" అంటూ అనేక విధాలుగా తెలుస్తూ ఉంది. ఇదే అధ్యాస. **(Super-imposition)** త్రాడులో సర్పమును గాంచే భావన లాంటిది.

త్రాడు త్రాడుగా తెలియటం జ్ఞానం. త్రాడు తెలియకపోవటం అజ్ఞానము. ఉన్న త్రాడులో లేని పామును దర్శించటం అధ్యాస. అధ్యాసయే సర్వ దుఃఖాలకు, బాధలకు కారణం. మరి, అధ్యాసను తొలగించుకుంటే పోతుంది కదా!

అవును. జరుగవలసింది అదే. కాని, అలా జరుగకూడదు. అధ్యాసను తొలగించే ప్రయత్నం చేయకూడదు. ఏది తెలియని అజ్ఞానదశలో అధ్యాస ఏర్పడిందో దానిని

అర్థం చేసుకోవటంలో అజ్ఞానము, అజ్ఞానజనిత అధ్యాస రెండూ అదృశ్యమవుతాయి. అందుకే శాస్త్రం.

అధ్యాస నివారణార్థం న శాస్త్ర పఠనం

వస్తు నిర్ధారణార్థం శాస్త్ర పఠనం.

అధ్యాసను నివారించేందుకు కాదు శాస్త్రాన్ని పఠించేది, వస్తువును నిర్ధారణ చేసేందుకే శాస్త్ర పఠనము.

శాస్త్రం ప్రమాణం

ఉన్నది ఆత్మ. మనం పొందాలి అనుకొనేది ఆత్మయే. ఇదియే మోక్షము. మోక్షము ఉంది, అంటే మోక్షానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉంది. అదియే ఆత్మజ్ఞానము.

ఆత్మ సాధ్యవస్తువు కాదు; సిద్ధవస్తువు అని తెలుసుకున్నాం. ఇప్పుడు మనకు కావలసింది ఆత్మ కాదు; ఆత్మజ్ఞానము. జ్ఞానమును శాస్త్రం అందిస్తుంది. ఇదే ప్రమాణ ప్రమేయ సంబంధం. దీనినే ప్రతిపాదక ప్రతిపాద్య సంబంధం అంటారు.

ఆత్మ ప్రమేయము; శాస్త్రము ప్రమాణము. ఆత్మ ప్రతిపాద్యము; శాస్త్రము ప్రతిపాదకము. నీవే ఆత్మవు కనుక నిన్ను నీకు అర్థమయ్యేలా చేస్తుంది శాస్త్రము. రజ్జువును చూస్తే సర్ప మెలా లేదో నీవు నీకు గోచరిస్తే అజ్ఞానము, అజ్ఞానజనిత సంసారమూ లేదు. అవిద్యా నివృత్తియే విద్య యొక్క ప్రయోజనం. అజ్ఞాన నివృత్తియే జ్ఞానం యొక్క ఫలం. **(బ్రహ్మవిద్యాయాః అవిద్యా నివృత్తిః తతశ్చ ఆత్యంతిక సంసార అభావః).**

మోక్షం కావాలి. మంచిదే. మోక్షం ఉన్నదే కనుక జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కావాలి. జ్ఞానం శాస్త్ర పఠనం వల్ల కలుగుతుంది. ఇదే ప్రమాణ ప్రవృత్తి. శాస్త్ర పఠనానికి గురువును ఆశ్రయించాలి.

అద్దాన్ని చూచేది అద్దం కొరకు కాదు. "ఉండండి. అద్దం చూసుకొని వస్తాను" అంటూ ఉంటారు. అద్దాన్ని చూచేది అద్దం కొరకే అయితే ప్రక్క నుండి కూడా అద్దమును చూడవచ్చు. దూరం నుండి కూడా చూడవచ్చు. కాని, అలా ఎవ్వరూ చూడటం లేదు.

అద్దానికి ఎదురుగా, దగ్గరగా ఉండే అద్దం చూస్తున్నారు. అద్దం కొరకు అద్దమును చూడటం లేదు. అద్దంలో తమను తాము చూసుకొనేందుకు అద్దమును చూస్తున్నారు.

దర్పణే ముఖ దర్శనవత్

శాస్త్రే ఆత్మ దర్శనం

అద్దములో ముఖాన్ని ఎలా దర్శిస్తున్నామో, శాస్త్రంలో మన స్వరూపాన్ని మనం దర్శిస్తూ ఉన్నాం. ఇదే ఆత్మదర్శనం.

అన్య వస్తువుల్ని దర్శించటానికి అద్దమును దర్శించటానికి భేదముంది. కుండను చూచినపుడు ద్రష్టగా నేను, దృశ్యముగా కుండ వేరుగా ఉన్నాం. అద్దమును చూచినపుడు అద్దంలో గోచరించే దృశ్యము కూడా నేనే కనుక దృగ్దృశ్యములు ఏకమే. అద్వితీయమే. ఈ విధంగా శాస్త్రం ఆత్మదర్శనమును ప్రసాదిస్తుంది. **(శబ్దాత్మక శాస్త్రే ఆత్మ దర్శన మేవ, శాస్త్ర మేవ దర్పణం).**

జ్ఞాన ఫలం

ఆత్మ సాధ్యము. ఆత్మజ్ఞానము సాధనము. ఆత్మజ్ఞానానికి శాస్త్రము సాధనము. ఇదియే వేదము. వేదము ప్రమాణం. ప్రమ అంటే జ్ఞానము. జ్ఞానమును ప్రసాదించునది ప్రమాణం **(ప్రమాకరణం ప్రమాణం).** ఇదే వేద ప్రమాణము.

ఆత్మ ఉన్నది. తెలియకుండా ఉన్నది. ఇదియే ఆత్మ యొక్క అజ్ఞానము. ఆత్మజ్ఞానము కలిగితే ఆత్మ అజ్ఞానము నశిస్తుంది **(ఆత్మ జ్ఞానేన ఆత్మ అజ్ఞానం నశ్యతి).** ఈ విధంగా ఆత్మను తెలియ గోరువాడు ఆత్మయే అగుచున్నాడు **(బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి, బ్రహ్మవిత్ పరం ఆప్నోతి).**

వేదములు - అపౌరుషేయములు

వేదాలు పురాతనమైనవి. సనాతనమైనవి. సృష్టికి మూలమైన జ్ఞానము కలవి. అమూల్యమైనవి. వేదాలు జ్ఞానపూరితాలు. శబ్దాత్మకాలు. శబ్దంలో సృజనాత్మక శక్తి ఉంది. పదంలో విజ్ఞానం దాగి ఉంది.

శబ్దాత్మకమైన వేదమంత్రాలు జ్ఞానపూర్ణాలు. అవి మంత్రాలు. మననం చేయువారిని రక్షించేది మంత్రము. **(మననాత్ త్రాయతే ఇతి మన్త్రః).** మంత్రం అర్థవంత మైనది. అర్థం తెలియకపోతే శబ్దవంతమైనది. శబ్దంతో పాటు అర్థం తెలిస్తే మహోత్తర ఫలం. అర్థం తెలియకపోయినా సుస్వర శబ్దంలో మహాఫలం.

అర్థం తెలియకపోయినా వేద శబ్దం ఫలితాన్నిస్తుందా? ఇస్తుంది. అర్థం తెలిసి ఉచ్చరించినా, ఫలం రాకపోయినా, ఫలితం మాత్రం లేకుండా పోలేదు. ఈ విషయాన్ని సామవేదము నిర్ణయించింది.

ఓంకారోపాసనలో అర్థం తెలిసి ఉచ్చరిస్తే ఫలం వీర్యవత్తరమని, అర్థం తెలియక పోయినా ఉచ్చరిస్తే లభించే ఫలం వీర్యవంతమని పేర్కొంది.

తేనోభౌ కురుతో యశ్చైతదేవం వేద యశ్చ న వేద నానాతు విద్యా

చావిద్యా చ యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరం

భవతీతి ఖల్వే తస్యై వాక్షర స్యోపవ్యాఖ్యానం భవతి!

తేన=ఓంకారముచే, యః=ఎవడు, ఏతత్=అక్షర స్వరూపమును, ఏవం=ఈ విధంగా, వేద=తెలుసుకొనుచున్నాడో, యః=ఎవడు, న వేద=తెలియనివాడో, ఉభౌ= వీరిరువురు, కురుతః=చేయుచునే యున్నారు;

కింతు=భేదము ఏమిటి అనగా, విద్యాచ=జ్ఞానమును, అవిద్యాచ=అజ్ఞానమును, నానా=భేదము, యత్=ఏది, విద్యయా=జ్ఞానముతో, శ్రద్ధయా=ఆస్తిక్య బుద్ధితో, ఉపనిషదా =కూడినవాడై, కరోతి=చేయుచున్నాడో, తదేవ=అదియే, వీర్యవత్తరం= విశిష్టమైన శక్తి కలది, భవతి=అగుచున్నది, ఇతి=ఇదియే, ఏతస్య=ఈ ఉపాసనములో ముఖ్యమైన, అక్షరస్య=ఓంకార మనెడి అక్షరము యొక్క, ఉపవ్యాఖ్యానం=ఉపాసనా ప్రకారమును, ఫలమును, భవతి ఖలు=అయినది కదా!

"ఓంకారోపాసనను జ్ఞానం కలవాడు, జ్ఞానం లేనివాడు ఇద్దరూ ఉపాసిస్తూనే ఉన్నారు. వీరిరువురిలో విద్యావిద్యలే భేదములు. జ్ఞానయుతుడై, శ్రద్ధావంతుడై, యోగయుక్తుడై ఆచరించువానికి ఫలము విశేషమైన శక్తి కలదియై ఉన్నది **(వీర్యవత్తరం).**

విజ్ఞానం లేకుండా, కేవలం సాధారణ జ్ఞానంతో అనుష్ఠానక్రమంగా ఆచరించు వానికి సామాన్య ఫలమే కలుగుచున్నది **(వీర్యవత్)** ".

వేదాలు అనంతాలు **(అనంతాః వై వేదాః).** విశ్వంలో నియతి ఉంది. నియతి ఉన్నచోట నియంత ఉండాలి. అనంతమైన విశ్వానికి సంబంధించిన జ్ఞానం నియంతకు ఉండాలి. అందుకే అతడు అనంతుడు. అనంత జ్ఞానం కలిగినవాడు. అనంత జ్ఞానమును ఒకరు సృష్టించలేరు. కనుక అనంత జ్ఞానమును కలిగిన వేదాలు ఏ పురుషుడూ తయారు చేసినవి కావు. కనుక అవి అపౌరుషేయాలు.

వేదాలు నాలుగు. అవి (1) ఋగ్వేదము (2) సామవేదము (3) యజుర్వేదము (4) అధర్వణ వేదము.

ప్రతి వేదము నాలుగు భాగాలు. (1) సంహితలు (2) బ్రాహ్మణములు (3) ఆరణ్యకములు (4) ఉపనిషత్తులు (వేదాంతము).

సంహితా భాగము వృక్షమైతే, బ్రాహ్మణ భాగము పుష్పమని, ఆరణ్యకాలు కాయ అని, ఉపనిషత్తులు పక్వమైన ఫలమని పెద్దల నిర్ణయము.

సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యకాలు కర్మకాండకు సంబంధించినవి. ఉపనిషత్తులు జ్ఞానకాండకు సంబంధించినవి. ఉపనిషత్తులు అపరోక్ష జ్ఞానమును అందిస్తాయి. సంహితాదులు పరోక్షంగా జ్ఞానానికి సాధకుని సిద్ధ పరుస్తాయి. కర్మకాండను ప్రధానంగా తీసుకొని జైమిని మహర్షి పూర్వ మీమాంసను రచిస్తే, జ్ఞానకాండను ప్రధానంగా తీసుకొని వ్యాసుడు ఉత్తర మీమాంస (బ్రహ్మ సూత్రములు)ను రచించాడు.

ఉపనిషత్తులు

వేదాల యొక్క పూర్ణత్వం ఉపనిషత్తులే. వేదాల యొక్క చివరి భాగంలో ఉన్న కారణంగా ఉపనిషత్తులను వేదాంతము అన్నారు. వేదాలు శ్రుతులయితే, ఉపనిషత్తులు శ్రుతి శిఖరాలు.

'ఉపనిషత్' అనేది ఒక పదము కాదు. రూపొందించిన పదం. 'ఉపనిషత్' అను మాటలో 'సద్' అనేది పదము. ఉప, ని అనేవి ఉపసర్గలు. 'స' అనే అక్షరానికి ముందు 'ఇ' ఉంటే 'స' - 'ష'గా మారుతుంది. 'ఉపని' అన్నప్పుడు 'ని'లో 'ఇ' ఉన్నందున 'సద్' షద్‌గా మారి ఉపనిషద్ అయింది.

ఉప, ని అనే రెండు ఉపసర్గలను కలిగిన 'సద్' ఉపనిషత్. ఇది (సద్) 'షదల్‌రే' ధాతువు నుండి జనించినది. 'షదల్' ధాత్వర్థం ఏమిటి?

విశరణ గత్యవసాదనా ద్వా

(1) విశరణ మనగా శైథిల్యము (2) గతి అనగా గమనము (3) అవసాదన అనగా వినాశము.

(1) విశరతి:- **అనర్థవ్రాతాన్ సర్వాన్ విశరతి, శిథిలీ కరోతి**

సర్వానర్థములను సడలింప చేయుటయే విశరణము.

ఉపనిషత్తును అధ్యయనం చేస్తే దేహాభిమానము, అహంకార మమకారాలు, రాగద్వేషాలు మొదలైన అనర్థాలన్నీ శిథిలమై పోతాయి.

(2) అవసాదయతి:- **కారణేన సహ అవసాదయతి**

అనర్థములకు కారణమైన అజ్ఞానము కూడా పూర్ణంగా నశిస్తుంది.

అనర్థములైన కార్యాలు నశించినా, కారణమైన అజ్ఞానము ఉంటే మళ్ళీ కార్యాలు ఉద్భవించే అవకాశం ఉంటుంది. అలాంటి వాటికి అవకాశం లేకుండా అజ్ఞాన కారణమును కూడా సమూలంగా నశింప చేస్తుంది ఉపనిషత్.

(3) గమయతి:- **బ్రహ్మ గమయతి**

బ్రహ్మ ప్రాప్తి లభిస్తుంది.

ఉపనిషత్తును అధ్యయనము చేయువారికి బ్రహ్మము 'ఉప' అంటే సమీపము. సమీపముననే ఉన్నట్లు "ఉప" అనే ఉపసర్గ చెబుతూ ఉంటే, 'ని' అనే ఉపసర్గ 'నిశ్చయ' మని నిర్ధారణ చేస్తూ ఉంది. సమీపమున అంటే, ప్రక్కన అని కాదు. తానే బ్రహ్మము అని అర్థము.

సాధ్యము బ్రహ్మమయితే, అది సాధకుని స్వరూపమేనని కర్త యొక్క నిశ్చయ జ్ఞానము ఉపనిషత్తు వలన కలుగుచున్నది **(సాధ్య విషయం సాధక స్వరూపమేవ).**

కనుక ఉపనిషత్తు అనేది గ్రంథ నామము కాదు. గ్రంథ విషయము. 'ఉపనిషత్' అంటే బ్రహ్మవిద్య అని అర్థము **(ఉపనిషద్విషయం ఉపనిషదేవ).**

దశోపనిషత్తులు

ఉపనిషత్తులు లెక్కకు మించి ఉన్నాయి. ఈ ఉపనిషత్తులలో పది ఉపనిషత్తులను శ్రీ ఆది శంకరాచార్య స్వామి ఎంపిక చేసి వాటిపై సాంప్రదాయక వ్యాఖ్యానమును అందించారు. అవియే దశోపనిషత్తులు.

*** ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరి**

ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం దశ ॥

(1) ఈశావాస్యోపనిషత్తు (2) కేనోపనిషత్తు (3) కఠోపనిషత్తు (4) ప్రశ్నోపనిషత్తు (5) ముండకోపనిషత్తు (6) మాండూక్యోపనిషత్తు (7) తైత్తిరీయోపనిషత్తు (8) ఐతరేయో పనిషత్తు (9) ఛాందోగ్యోపనిషత్తు (10) బృహదారణ్యకోపనిషత్తు.

ఈ పది ఉపనిషత్తులపై శ్రీ శంకరాచార్య స్వామి భాష్యమును అందించారు. ఇది అద్వైతపరంగా ఉంటుంది. తరువాత కొన్ని శతాబ్దముల తరువాత అరుదెంచిన రామానుజ, మధ్వ మొదలైనవారు వీటి మీదనే భాష్యములు అందించారు. కాకపోతే, తమ సిద్ధాంతరీత్యా అద్వైతానికి భిన్నంగా రచించారు. ఈ కారణాన్ని దృష్టిలో పెట్టుకొనే శంకరభాష్యాన్ని అద్వైత భాష్యంగా చెప్పవలసి వచ్చింది. లేకపోతే 'అద్వైత' మని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. ఉపనిషత్తులు బోధించేది అద్వైత జ్ఞానాన్ని మాత్రమే. ద్వైత జ్ఞానము మనకే ఉంది కదా! మళ్ళీ శాస్త్రం ఎందుకు?

శ్రీ శంకరాచార్య స్వామి శాస్త్ర ప్రయోజనమును, శాస్త్ర ప్రతిపాదిత బ్రహ్మజ్ఞాన ప్రయోజనమును తెలుపుతూ మాండూక్య కారికా భాష్య ఉపోద్ఘాతంలో అందంగా ఒక వాక్యం చెబుతారు.

రోగార్తస్యేవ రోగ నివృత్తౌ స్వస్థతా తథా దుఃఖాత్మకస్య ఆత్మనో ద్వైత ప్రపంచో పశమే స్వస్థతా. అద్వైత భావః ప్రయోజనం. ద్వైత ప్రపంచస్య అవిద్యా కృతత్వాత్ విద్యయా తదుపశమః స్యాత్ ఇతి.

"రోగార్తునికి ఏ విధంగా రోగం నయం కాగానే స్వస్థత కలుగుతుందో, దుఃఖితుడైన వానికి ద్వైత ప్రపంచము ఉపశమిస్తే స్వస్థత ప్రాప్తిస్తుంది. ఇదే అద్వైత భావముయొక్క ముఖ్య ఫలము. ద్వైత ప్రపంచము అవిద్యాకృతము. విద్య చేతనే అది ఉపశమిస్తుంది.

ఉపనిషత్తును అధ్యయనం చేసే ముందుగా గురుశిష్యు లిరువురు శాంతి మంత్రాన్ని** పలికి అధ్యయనాన్ని ప్రారంభిస్తారు. ఇది సంప్రదాయము.

బ్రహ్మవి దాప్నోతి పరమ్

---

* ఈశ, కేన, కఠోపనిషత్తులపై పూజ్య స్వామీజీ ఆడియో క్యాసెట్లు ఆశ్రమంలో లభిస్తాయి.

** ఉపనిషత్ పఠనమునకు ముఖ్యమైన శాంతి మంత్రాలను ఈ గ్రంథం చివర ఇచ్చినాము.

భగవద్గీత

అనుక్షణము వినపడుతూ, ఏ క్షణమూ కనిపించని దేదో ఈ దేహంలో ఉంది. కనపడని ఆ సత్యం వినపడని నాడు ఈ దేహం కనుమరు గవుతుంది.

మరణమంటే అందరికీ భయమే. కాని, బ్రతికి యున్నప్పుడే చావు చేరువై యుందని ఎందరు గ్రహించగలరు?

మార్పే మరణం. ఇది అనివార్యమైన జీవనతీర్పు. ఉత్తమ సుఖాలతో కూడిన దీర్ఘజీవితము కూడా ఒకనాడు నిరుపయోగమై వల్లకాటికి చేరేదే. ఇది సత్యం. ఈ కఠిన సత్యాన్ని మానవుని మస్తిష్కం జీర్ణించుకోలేదు. ఇమడలేని చోట మనిషి ముడిపడి ఉండలేడు. అక్కడనుండి విడిపడేందుకు ప్రయత్నిస్తాడు. అలా విడిపడటమే మోక్షము. దీనినే ప్రతిమనిషి వాంఛిస్తున్నాడు.

ఇష్టప్రాప్తి అనిష్ట నివారణ చికీర్షా స్వాభావికా సర్వప్రాణిషు దృష్టత్వాత్

"ఇష్టమైన దానిని పొందుట, అయిష్టమైన దానిని త్యజించుట అనే కోరిక ప్రాణులన్నిటిలో సహజంగా తెలుస్తుంది" అంటారు భాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి.

లాభము ఎవరికైనా ఇష్టమే. కాని, నష్ట మెరుగని లాభము ఈ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. అందుచేతనే ఎంత సంపాదించినా వ్యక్తి సుఖించలేకున్నాడు. సంపన్నుడుగా శోభించలేకున్నాడు. ఈ లోకంలో ధనమెవ్వరికీ అవసరం లేదు. అవసరాలు తీరేందుకు ధనం ఉపకరిస్తుంది. ధనం యొక్క ప్రయోజనం అంతే. ఈ సత్యాన్ని గ్రహించలేక ధన సంపాదనలో తలమునకలయ్యే వారికి కనీస అవసరాలు కూడా తీరక బ్రతుకే అసౌకర్యంగా మారిపోతున్నది. ఈ నిరాశాజీవితం నుండి విడివడాలని మనిషికుంది. కాని, ఏమి చెయ్యాలో తెలియడం లేదు. ఇక్కడే వేదమాత కరుణించి ఓదార్పు వచనం పలికింది.

న విత్తేన తర్పణీయో మనుష్యః

"ధనము చేత మనుష్యునికి సంతృప్తి కలుగదు" అంటూ యమధర్మరాజు అనుగ్రహించే ఐశ్వర్య వరాన్ని నిరాకరించాడు ముముక్షువైన నచికేతుడు కఠోపనిషత్తులో.

పదికోట్లు సంపాదించినవాడు ఇక రెండు కోట్లు అదనంగా వస్తే బాగుండు ననుకుంటాడు. పదిలక్షలు గలవాడు మరో అయిదు లక్షలు లభిస్తే ఆ మజావే వేరు అని చప్పరిస్తూ ఉంటాడు. పదివేలు వెనుక వేసుకున్నవాడు మున్ముందు లక్షాధికారి కావాలని పరితపిస్తూ ఉంటాడు. వంద మిగిలినవాడు వెయ్యి వద్ద వెలగాలనుకుంటాడు. అడుక్కుతినే బిచ్చగాడు అయిదు రూపాయలు వస్తే చాలనుకుంటాడు.

అందరూ కోరుకొనే వారే. కోరిక అనేది సర్వులకు సహజం. ఈ కోరికల రాయుళ్ళు తాము కోరింది లభించినంత మాత్రాన అంతటితో ఆగిపోరు. అడుక్కొనే అడుగుబద్ద కొలత వేస్తూ ఉంటుందే గాని 'చాలు' అని తృప్తిగా కొలువు తీరదు.

మరి, వీరందరు కోరుకొనేది లభించనంత వరకు అందరూ యాచిస్తూనే ఉంటారు గనుక వీరెవరూ ధనికులు కారు. వీరిలో కోటికి పడగలెత్తిన దెవరు? కూటికి లేనిదెవరు? నోటికి తాళం పడనంత వరకు రోకటి పోటుకు దూరం కానివారే. కోటీశ్వరుని దృష్టిలో బిచ్చగాడు దరిద్రుడు. సత్యపరిశీలనలో ఆశల మధ్య అసంతృప్తితో పరుగులెత్తే వారందరూ బిచ్చగాళ్ళే. ఎవరికీ తృప్తి లేదు. సంతృప్తి ఎవరికీ అర్థం కాదు. కనుకనే,

న హి లోకే విత్తలాభః కస్యచిత్ తృప్తికరో దృష్టః

"ధనప్రాప్తి ఈ ప్రపంచంలో ఎవరికీ తృప్తి నిచ్చినట్లు కనబడదు" అన్నారు భాష్యంలో శ్రీ శంకరులు.

సత్యాన్వేషణ మార్గంలో ధనం సరియైన దారి కాదని తేలిపోయింది. ఉన్నవాడికి, లేనివాడికి అసంతృప్తిలో తేడా లేదని కూడా అర్థమైపోయింది. ఇంతవరకు చాలా ఇష్టంగా తోచిన ధనంయొక్క నిజస్వభావం తెలియగానే అది ఇష్టపడదగింది కాదని తేలిపోతుంది. ఒకనాడు 'ఇష్టప్రాప్తి' అంటూ ఊరేగింది ఇప్పుడు "అనిష్ట నివారణ"గా బోర్డు త్రిప్పేసుకుంది.

ఆలోచించగలిగితే ఈ ప్రపంచంలో మనం ఇష్టపడేవన్నీ ఒకనాడు అయిష్టాన్ని, అసంతృప్తిని మిగిల్చేవే. అసంతృప్తి ఎవరికైనా అయిష్టమే కనుక సంతృప్తినిచ్చే దాని కొరకు అన్వేషిస్తూ ప్రతి మనిషి ప్రతి క్షణము ఈ ప్రపంచంలో గాలిస్తున్నాడు. ధూళిని ప్రోగు చేసుకొంటున్నాడు.

లేనిదానిని ఇష్టపడి ప్రయత్నించి పొందుతాము. ఇంతవరకు లేనిది ఇప్పుడు ఉన్నది అని భావిస్తాము. విశ్లేషిస్తే ఇక్కడ ఒక వింత సత్యం బయటపడుతుంది. లేని క్షణాన ఏ అసంతృప్తి ఉండిందో, ఉన్న క్షణాన కూడా అదే అసంతృప్తి ఉంటుంది. ఏది లభించినా "ఇది లభించింది" అనే సుఖం కన్నా "ఏదో లేదు" అనే బాధే క్రుంగదీస్తూ ఉంటుంది.

ఆ లేనిదేదో దాని కొరకు అన్వేషణ ప్రారంభ మవుతుంది. దేనిని పొందినా "ఇది కాదు" అనే ధ్వని లోనుండి వినిపిస్తూ ఉంటుంది. ఇదేమో....అదేమో...... మరొకటేమో.....ఇంకొకటేమో, ఇలా ఏమో....ఏమో.....ఏ......మో......ఏది.....మోక్షమో అంతుపట్టదు. అలాగని అన్వేషణ ఆగదు. ఆవేదన తరగదు.

మందులు అనేకం వాడినా రోగం ఏమాత్రం నయం కానట్లు, ఎన్నిటిని పట్టుకున్నా హృదయాన్ని పట్టి పీడిస్తున్న అసంతృప్తి పోదు. అయితే, పూర్ణసంతృప్తి అనేది మానవాళికి కుందేటి కొమ్మేనా! ఎంతకాలం జీవించినా ఈ ప్రపంచం నుండి నిరాశతో తిరిగి పోవలసిందేనా! ఇది ఒకరికి సంబంధించిన సమస్య కాదు. ఒక కాలానికి సంబంధించింది కాదు. ఒక దేశానికి సంబంధించిందీ కాదు. అన్ని కాలాలకు, అందరి వ్యక్తులకు, అన్ని దేశాలకు సంబంధించిన ఈ సమస్య ఐదువేల సంవత్సరాల క్రితం కురుక్షేత్ర రణరంగంలో అర్జునుని కుదిపేసింది. కుమిలిపోయి రోదించేలా చేసింది. కన్నీరు కార్చేలా ఊపేసింది. తన భయంకర రూపాన్ని ప్రదర్శించి పాండవమధ్యముని మస్తిష్కాన్ని అమాంతం పేల్చేసింది.

తం తథా కృపయావిష్ట మశ్రు పూర్ణాకులేక్షణమ్
విషీదంత మిదం వాక్య మువాచ మధుసూదనః

"ఈ విధంగా కారుణ్యముతో కూడుకొని, కన్నీరు నిండిన నేత్రాలతో దుఃఖిస్తున్న అర్జునుని చూచి మధుసూదనుడు పలుక నారంభించాడు" అంటూ అర్జునుని మానసిక స్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించాడు సంజయుడు.

కురుక్షేత్రంలో ఉభయసేనలను చూచి అర్జునుడు కలతచెందాడు. కన్నీళ్ళు కార్చాడు. కొన్ని గంటల ముందు సమరోత్సాహంతో యుద్ధభూమిలో కాలుమోపిన అర్జునుడు ఇప్పుడు యుద్ధానికి విముఖు డయ్యాడు. ఈ ఉత్సాహ నిరుత్సాహాలకు కారణ మెవరు? అర్జునుడు యుద్ధరంగంలో ప్రవేశించడానికి దుర్యోధనుడు కారణమా? అదే నిజమైతే, ఇప్పుడు యుద్ధవిముఖుడై వెనుదిరగడానికి కూడా దుర్యోధనుడే కారణమా? పరస్పర వైరుధ్యము గల రెండు విషయాలకు ఒకడే ఎలా కారణమవుతాడు?

ఎవరు దేనికి కారణము అనేది అలా ఉంచితే, యుద్ధం చేయాలని నిర్ణయించుకొని రణరంగంలో కాలుపెట్టింది మాత్రము అర్జునుడే అని అంగీకరించక తప్పదు. తీరా దిగాక తెలిసిన లోతు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

తనవారందరు అనివార్యంగా హతులవుతారు అనేది మొదటి ప్రశ్న. యుద్ధం చేసినా విజయం సిద్ధిస్తుందో లేదో అనేది రెండవ ప్రశ్న. సామూహిక మరణాలవల్ల సమాజం అస్థిరతకు గురి అవుతుందేమో అనేది మూడవ ప్రశ్న. అన్నీ కలిసి ముప్పుతిప్పలు పెట్టాయి అర్జునుని. ఇక విలపించకుండా ఎలా ఉండగలడు? చిన్న చిన్న విషయాలకే మనం పెద్దపెద్దగా ఏడుస్తూ ఉంటాము. పార్థుడు మన ప్రతినిధే. కనుక ఆ మాత్రం ఏడ్చినందుకు తప్పు పట్టవలసిన పనిలేదు. ధీరుడు భీరుడయ్యాడనే ఆలోచనకు అసలే తావులేదు. ధీరత్వమనే పదాన్ని నిర్వచించడం మొదలెడితే ఈ ప్రపంచంలో అందరూ భీరులుగనే తెలుస్తారు. ధీరులెవ్వరూ మిగలరు. అరుదుగా ఎవ్వరైనా మిగిలినా వారు మనకు ఎదురుపడరు. ఎద చూపరు.

యుద్ధంలో అనివార్యంగా జనులు చనిపోతారని అర్జునుడు దుఃఖిస్తున్నాడా? లేక, తనవారు మరణిస్తారని శోకిస్తున్నాడా? తనవారు మరణిస్తే చూచి సహించలేని స్థితి అర్జునుడికే కాదు. మనందరికీ ఉంది. ఈ దుఃఖమంతా మమత తెచ్చిన కొరతే.

జీవితంలో మనం ఎందరినో ప్రేమిస్తాము. వారు దూరమైతే దిగులు చెందుతాము. వారు చనిపోతారంటే భరించలేము. విలపిస్తాము కూడా. ఈ విధమైన ప్రేమ వారిపై మనకు కలగడానికి కారణమేమిటి? పోనీ, కారణం ఏదైనా ఉండనీ. ఈ ప్రేమలు శాశ్వతాలా? అదే వాస్తవమైతే తల్లిదండ్రుల్ని వదలిపెట్టి బిడ్డలు దూరంగా ఎందుకు

పోతున్నారు? భార్యాభర్తల మధ్య విడాకులు ఎలా తలెత్తుతాయి? స్నేహితుల మధ్య భేదాభిప్రాయాలు ఎందుకొస్తాయి?

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి

"ఎవరు దేనిని ప్రేమించినా, ఎవరిని ప్రేమించినా వాస్తవానికి అది తన కొరకే". ఇదే వాస్తవమైతే, ఎవరికి ఎవరిమీద ప్రేమ లేదని అంగీకరించాలి కదూ! అవును. ఇది ముమ్మాటికి సత్యం. ఎవరికైనా వారి మీదే ప్రేమ ఉంది. ఇది తెలియక రాగద్వేషాలను పెనవేసుకొని కొందరిని ప్రేమించి సంతసించినా, కొందరిని ద్వేషించి దుఃఖాన్ని కొని తెచ్చుకున్నా అవన్నీ మనసులోని కలతలే. కల్లోల తరంగాలే. ఈ విధమైన వైరుధ్యాలు వైమనస్యానికి, విషాదానికి దారితీస్తాయి. గుఱ్ఱం ముందు బండి నుంచుతాయి.

ఎవరు ఎవరిని ప్రేమించి ఏమి సాధిస్తారు ఈ ప్రపంచంలో? అందరూ పోయేవారే. అందరూ అశాశ్వతమైన మనుగడను కలిగియున్నవారే. ఒక అశాశ్వతుడు మరొక అశాశ్వతునితో కలిసిపోతే శాశ్వత మావిర్భవిస్తుందా?

న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్

"అనిత్యమైన దాని ద్వారా నిత్యమైనది పొందబడుతుందా?" అంటూ ఛీకొడుతూ నిలదీసింది ఉపనిషత్తు.

దేహాలు పుడుతాయి. పుట్టినవి పెరుగుతాయి. పెరిగినవి తరుగుతాయి. తరిగినవి ఒరుగుతాయి. ఒరిగినవి కరుగుతాయి. ఈ విషయంలో శోకానికి తావులేదు. ఇది సహజం. సర్వసహజం.

రుదంతం మూషికం మార్జాల ఇవ అంతకస్త్వాం దృష్ట్వా న దయాలుః భవేత్

"ఎలుక ఏడుస్తోందని పిల్లి విడిచిపెట్టదు. అలాగే పోయేనాడు ఎవరినీ యముడు దయదలచి విడిచిపెట్టడు" అన్నారు స్వయంప్రకాశ యతి.

అందరూ కళ్ళు మూసేవారే. కాలిపోయేవారే. కనుమరుగయ్యేవారే. ఉన్న వాళ్ళు కన్నీళ్ళు ఒలికించినా పోయినవారు మాత్రం తిరిగిరారు. ఉన్నవాళ్ళైనా అదే పనిగ ఏడవడానికి ఎంతకాల ముంటారు? మనమే ఉండనపుడు ఎవరో పోయారని, పోతున్నారని, పోలేదని దుఃఖించడం ఎంత సమంజసం?

దేహాలు నిలిచేవి కావని తేలిపోయింది. బాంధవ్యాలు ఒకనాడు బరువవుతాయి అవి కూడా అర్థమయింది. రాజ్యసుఖాలు కూడా క్షణికమేనని స్పష్టమైంది. పోనీ, ఈ ప్రపంచాన్ని నమ్ముకొని జీవిస్తామా! అంటే, అదీ క్షణక్షణానికి మారుతోంది. చంచల వస్తువులు, చపల హృదయాలు తప్ప ఏమున్నాయి ఈ ప్రపంచంలో?

జీవితంలో సుఖదుఃఖాలనేవి మనసు రూపొందించిన రేఖాచిత్రాలు. ఈ ప్రపంచంలో మనసుకు మార్పులు తప్ప మరేవీ తెలిసిరావు. ఉన్నవే అవి. ఉదయాలు సాయంత్రాలవుతున్నాయి. పగళ్ళు రాత్రు లవుతున్నాయి. రోజులు మారిపోతున్నాయి. వారాలు జారిపోతున్నాయి. మాసాలు పారిపోతున్నాయి. ఋతువులు ఆరిపోతున్నాయి. ఋతుపవనాలు కారిపోతున్నాయి. అలవాట్లు, అగచాట్లు, నమ్మకాలు, అమ్మకాలు అన్నీ మారిపోతున్నాయి.

"నాకేమి? యవ్వనంలో వెలిగిపోతున్నాను" అంటూ ఉంటారు చాలామంది యువకులు. దేహంలో ఏ అంగానికైనా, ఏ టిష్యూకైనా క్యాన్సరు రావచ్చు. ఉన్నపళంగా ఊడిపడే ఈ వ్యాధి కనిపించగనే క్షణంలో జీవితంలోనే ఓడిపోయినట్లు అనిపిస్తుంది. ఏమైంది త్రుళ్ళిపడిన యవ్వనమంతా?

"నన్ను చూడండి. అరవై ఏళ్ళైనా ఎలా ఆరోగ్యంగా ఉన్నానో!" అని విర్రవీగుతూ ఉంటారు కొందరు వృద్ధులు. అలా మాట్లాడుతూనే నడుస్తూ, నాలుగడుగులు వేసి, ఐదవ అడుగు అరటిపండు తొక్కపై వేస్తారు. తొడ ఎముక విరిగిపోతుంది. ఆ క్షణం నుండి బ్రతుకే చీకటిమయమైనట్లు తోస్తుంది. ఇలా ఎప్పుడు ఏది ఈ ప్రపంచంలో ఎలా మారుతుందో చెప్పలేము.

నా ఆశకు ఈ ప్రపంచంలో రూపమెక్కడ? నేను ఆశించే అఖండానందము ఈ జగత్తులో ఎక్కడ నిక్షిప్తమై ఉంది? ఇలా ఆలోచించడం ప్రారంభిస్తే బ్రతుకే శూన్యమనిపిస్తుంది. లేని విలువను ఈ ప్రపంచానికి నేనే ఆపాదించాను అనిపిస్తుంది. నా వాంఛ ఈ ప్రపంచంలో ఫలించదు. ఈ సత్యం తెలియగనే నేను ప్రపంచంలో ఉన్నా ప్రపంచం నాలో ఎగిరిపోతుంది. ఇక నేనెందుకు జీవించడం? **"తం తథా"** ఈ విధంగా ఏదో ఒక శుభముహూర్తాన ప్రతి మనస్సు వ్యథ చెందుతూ, కన్నీరు కురిపిస్తూ, విషాదంలో తలదాచుకుంటుంది. ఈ క్షణం నుండే జీవితానికి సంబంధించిన అవగాహన రెక్కలు తొడుక్కొని విహరించడానికి సిద్ధపడుతుంది. అందుకనే అవగాహననందించే ఈ క్షణం బాధాతప్తమైనా, దానిని శుభముహూర్త మంటున్నాను. శుభ పరిణామానికి దారితీసే పరిస్థితి ఏదైనా అది శుభకరమేనని నా భావం.

నిరంతరం నిర్విరామంగా దుఃఖాన్ని పంచిపెట్టే ప్రపంచంలో ఎలా జీవించాలి? ఇదే అందరి ప్రశ్న. ఈ ప్రశ్ననే త్రిప్పి వేసుకొంటే ఎలా ఉంటుంది? నేను ఎలా జీవించాలి? అంటున్నాం. జీవించకపోతే ఏమయింది? మరణిస్తే ఏం పోతుంది? ఇదీ ఈ దశలో పడవలసిన ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానం దొరకదు. వాస్తవానికి ఈ ప్రశ్న ఉదయించనే ఉదయించదు. ఒకవేళ నీవు ప్రశ్నించాలన్నా నీ ఆంతర్యం వద్దని చెబుతుంది. మరణించడమనే సహజకార్యము అసహజంగా కనిపించడమే ఈ అభ్యంతరానికి కారణము.

"నేను ఉండాలి, నేను ఉంటాను" అని ప్రతి మనిషి ఆంతర్యం ఘోషిస్తుంది. ఇక్కడే జీవితంపై అపారమైన ప్రేమ ఉదయిస్తూ ఉంది. ఈ ప్రేమ నిజానికి అనంత అస్తిత్వాన్ని ఆశిస్తూ ఉంది. దీని కారణంగానే జీవితంలో ఎన్నిటినో ప్రేమించడం జరుగుతూ ఉంది.

Everything is lovable on account of the love of the infinite.

అనంత అస్తిత్వాన్ని అమితంగా ప్రేమించడం చేతనే ఈ ప్రపంచంలో ఎన్నిటినో ప్రేమించడం జరుగుతూ ఉంది.

మరొక విషయం. అనంతంగా ఉండాలని భావించే వారందరు చెట్లవలె, రాళ్ళవలె ఉండటానికి ఇష్టపడటం లేదు. జ్ఞానంతో శోభించాలని కాంక్షిస్తున్నారు. ఇక్కడే అనంత అస్తిత్వము అనంత జ్ఞానంగా కూడా భాసిస్తూ ఉంది. ఈ రెండూ గల స్వరూపము అనంతానందాన్ని వ్యక్తం చేయడం కూడా జరుగుతూ ఉంది. అనంత అస్తిత్వము (సత్), అనంతజ్ఞానము (చిత్), అనంత సుఖము (ఆనందం) - ఇదే **సచ్చిదానందం.** దీనినే ప్రతిఒక్కరూ ఆశించేది.

అర్జునుడు ఆశించేది కూడా ఇదే. ఈ సత్యం తెలియక మమతానురాగాల్ని పెనవేసుకొని, కర్తవ్య విముఖుడై రణరంగంలో రోదిస్తున్నాడు. **"తం తథా"** ఈ విధంగా విలపించే అర్జునుని ఆంతర్యాన్ని అవలోకించిన శ్యామసుందరుడు అమృత పలుకుల్ని ఒలికించేందుకు ఉద్యుక్తు డయ్యాడు. ఈ సందర్భంలోనే **"ఉవాచ మధుసూదనః"** అంటూ శ్రీకృష్ణుని మధుసూదనుడని కీర్తించాడు వ్యాసభగవానుడు. పలికి పులకరించాడు సంజయుడు.

మధువంటే తేనె. తేనె తియ్యనిది. జీవులందరికీ సంసార సుఖాలు తేనెలాగ తియ్యగా ఉంటాయి. కనుకనే సంసారములో తయారు చేసుకున్న మమతలనే మకరందంలో ఈగలై కదలలేక అల్లాడుతూ ఉంటారు. దానిని సంహరించి జీవులను రక్షించేవా డైనందున జనార్దనుడు ఈ సందర్భమున మధుసూదనుడనే నామంతో శోభించాడు.

జీవులపై జగన్నాథుని అపారప్రేమను ఇలాంటి సందర్భాలలో మనం గుర్తించవచ్చు. ఆవేదనను అందించేది, ముందుంచేది కూడా ముకుందుడే అనే సత్యాన్ని కూడా గమనించవచ్చు. అలా చేసి నిన్ను అతనికి సన్నిహితంగా త్రిప్పుకుంటాడు. కాకపోతే,

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽ చ్యుత!

"అచ్యుతా! రెండు సేనల మధ్య నా రథాన్ని ఉంచు" అని పార్థుడు ప్రార్థిస్తే, గుట్టుచప్పుడు కాకుండా గుర్రాలను కదిలించి, బండిని తీసుకెళ్ళి ప్రాణతుల్యులైన ఆత్మీయుల ముందు ఉంచుతాడా గోవిందుడు? భీష్మద్రోణులకు ఎదురుగా రథం నిలిపి **"పార్థ! పశ్య!"** అనే నిగూఢార్థము గల పదాన్ని ప్రయోగిస్తాడా? గాండీవాన్ని పడేసి

గొల్లుమని ఏడ్చేలా చేస్తాడా? అవును. ఇక్కడే వాసుదేవ చైతన్యం అసమాన తేజంతో దేదీప్యమానమై అలరారింది. దుఃఖిస్తున్న అర్జునుని దృష్టిని దుఃఖం నుండి అమాంతం తరలించి, దుఃఖానికి కూడా ఆధారమైన ఆత్మచైతన్యము వైపుకు ఆసక్తిని మరలించింది. ఇది అచ్యుతుని అపారప్రేమకు మచ్చుతునక. "నీ వాడించెడి తోలుబొమ్మలము తండ్రీ! ఏలుకుంటావో, తోలుకుంటావో నీదే భారమంటూ పరమాత్మకు శరణాగతులయ్యేందుకు జీవులకు ఇదో హెచ్చరిక.

అర్జునుని నిమిత్తంగా చేసుకొని మనందరి చేత గీతామృతాన్ని త్రాగించాలని శ్రీకృష్ణ పరమాత్మ సంకల్పించాడు. తెలిసో, తెలియకో అందరూ అన్వేషిస్తున్న సచ్చిదానంద స్థితిని ఎరుక పరచేందుకు నడుం బిగించాడు నవనీతచోరుడు.

సచ్చిదానంద రూపమైన ఈ మోక్షస్థితినే అందరూ అన్వేషిస్తున్నారు. కాకపోతే, అది ఎక్కడ లభించదో అక్కడ వెతుకుతున్నారు. నీవు ఆశించే, అన్వేషించే సచ్చిదానందము నీవే. అలా కాకుండా, నేడు నీవు భావిస్తున్నట్లు నీవు పరిమితుడవే అయితే ఇక పరిపూర్ణుడవు ఎప్పుడూ కాలేవు. అనంతమనేది మరొక దానిచేత సృష్టింపబడేది కాదు. అది ఎప్పుడూ ఉన్నదే. అదే నీవు. అదే నేను. ఇరువురమూ అనంతమే.

అనంతమైన నీలో అనంతశక్తి ఉంది. నిన్ను నేను ఎత్తుకోలేను. నన్ను ఎత్తుకొని నీవు నడువలేవు. కాని, ఎంత ఎత్తుగల మనిషైనా, ఎన్ని కిలోల బరువున్నా, తనను తాను తేలికగా మోసుకొని పోతూ ఉంటాడు. ఈ శక్తి ఎక్కడిది? అంత పెద్ద దేహాన్ని జీవితాంతము మోసేదెవరు? ఎంత పెద్ద దేహమైనా అనంతశక్తి ముందు ఆవగింజే. ఈ అనంతశక్తి చైతన్యమే బరువులెత్తే ఏనుగులో ఉంది. బాధించే దోమలోనూ ఉంది. ఈదే తిమింగలములో అదే ఉంది. ఎగిరే ఈగలో కూడా ఉంది. అది తేలికైనది. బరువైనది కూడా. అణువు అదే. మహత్తూ అదే. దీని వైభవాన్నే శాస్త్రం వర్ణించింది. దీని ప్రాభవాన్నే మహర్షులు కీర్తించారు.

అణువులు జడరూపాలని, దుర్భేద్యములని ఐదారు దశాబ్దముల వరకు విశ్వసిస్తూ వచ్చాము. అణువులు ఛేదింపబడ్డాయని మనకు ఇప్పుడు తెలుసు. అంతే కాదు. జడంగా కనిపించినా అణువులో అనంతశక్తి నిండియున్నదని కూడా తెలుసుకున్నాం.

అణువులోని మాయను మరుగుపరచి మహిమను వ్యక్తపరచారు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు. మనిషిలోని మాయను తొలగించి మహిమను దర్శింపజేశారు సనాతన మహర్షులు. ప్రతి ఒక్కరిలో అనంతశక్తి చైతన్యము ఉందని సశాస్త్రీయంగా, సహేతుకంగా ప్రబోధించారు. నీలో అది ఉండటం కాదు; నీవే అది అని తేల్చి చెప్పారు.

సయ ఏషోఽ ణిమై తదాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో!

"ఈ ప్రపంచమంతయు పరమాత్మచే పూర్ణమై ఉంది. ఆ పరమాత్మయే సత్యము. అదియే ఆత్మ. ఓ శ్వేతకేతూ! అది నీవే అయియున్నావు" అన్నది ఛాందోగ్యోపనిషత్తు.

ఇంతవరకు బాగుంటుంది. ఇక్కడే జిజ్ఞాస మొదలవుతుంది. సచ్చిదానందము నేనే అయినప్పుడు దానిని నేను ఎందుకు పొందలేకున్నాను?

ఉన్నదానిని పొందాలని ఎందుకు ఆశిస్తున్నాను? ఎవరైనా లేని దానినే కదా ఆశిస్తారు. అవును. ఉన్నదానిని ఎవరూ ఆశించరు. అసలే లేనిదానిని కూడా ఎవరూ కాంక్షించరు. ఉన్నది ఉండి, అలా ఉన్నట్లు తెలియనపుడు ఆశిస్తారు. ఇలా ఉంటూ, తెలియకపోవడమే అజ్ఞానము.

ఇదీ అసలు రహస్యం. ఇప్పుడు తెలిసింది నా సమస్య అంతా అజ్ఞానమేనని. సమస్య అజ్ఞానమని ఎప్పుడు తెలిసిపోయిందో, అట్టి అజ్ఞానమును తొలగించే విద్యను పొందడం వలన నన్ను నేను గ్రహించుటకు అవరోధంగా నిలిచిన అజ్ఞానం తొలగిపోతుంది. మోక్షము స్వతస్సిద్ధమై భాసిస్తుంది.

తస్మాత్ కేవలాదేవ జ్ఞానా న్మోక్ష ఇతి ఏషోఽర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ

"జ్ఞానము వలననే మోక్షము ప్రాప్తిస్తుంది. గీత, ఉపనిషత్తుల తుది నిర్ణయమిదే"నని శ్రీ శంకరాచార్యస్వామి గీతాభాష్యంలో తెలిపియున్నారు.

కనుక ప్రస్తుతము తెలిసిరాని బ్రహ్మము మనకు విషయము **(అజ్ఞాతం బ్రహ్మ విషయం)**. బ్రహ్మజ్ఞానమును పొందుటయే ఇక్కడ లక్ష్యము లేదా గమ్యము **(జ్ఞాతం బ్రహ్మ ప్రయోజనమ్)**.

బ్రహ్మము లేదా ఆత్మ లేదా సచ్చిదానందము అజ్ఞాతమని అర్థమైంది. అజ్ఞాతమైన దానిని తెలుసుకొనుటకు జ్ఞానమే ప్రధానంగా తెలుస్తూ ఉంది. అదియే ప్రమాణ మవుతుంది. ఆత్మ అనేది దృశ్య వస్తువు లాంటిది కాదు. కనుక ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాల ద్వారా పొందబడదు. అది తెలుసుకొనే వానికి సంబంధించిన జ్ఞానము. కనుక అది గ్రహించుటకు సులభసాధ్యం కాదు. ప్రమాణం ద్వారానే తెలియాలి.

యత్ స్వతోఽ ప్రాప్తం తచ్ఛాస్త్రేణ బోధితవ్యం!

"సహజంగా గ్రహించుటకు వీలుపడని దానిని శాస్త్రము బోధించినపుడే గ్రహించడం జరుగుతుంది" అని శ్రీ శంకరాచార్యస్వామి ఐతరేయోపనిషద్భాష్య పీఠికలో తెలియజేశారు.

అట్టి ప్రమాణమైన శాస్త్రము అపౌరుషేయమైన వేదమే. గీత కూడా ప్రమాణమైన శాస్త్రమే. గీత ఉపనిషత్తుల సారము. అది మోక్షశాస్త్రము. కనుకనే,

సర్వశాస్త్రమయీ గీతా

భగవద్గీత సర్వశాస్త్ర స్వరూపిణి యని స్తుతించడం జరిగింది.

గీతాశాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహభూతమ్

"సమస్త వేదముల సారరూపమైన జ్ఞానమే భగవద్గీత" అని శ్రీ శంకరాచార్య స్వామి నిర్వచించారు.

గీతోపనిష న్నామ్నాం బ్రహ్మవిద్యాం

"గీత ఉపనిషత్తు అనే పేరును కూడా కలిగి యున్నది" అని శ్రీ శంకరానంద వ్యాఖ్య. అందుచేతనే గీతను ఉపనిషత్తులతో సమానంగా, పవిత్రంగా భావిస్తారు. గీతాశాస్త్రము ఒక్కటే సరిపోతుంది తరించడానికి అని చాలామంది మహాత్ములు అభిప్రాయపడ్డారు.

గీతా సుగీతా కర్తవ్యాకిమన్యైః శాస్త్ర సంగ్రహైః

యా స్వయం పద్మనాభస్యముఖపద్మా ద్వినిస్సృతా

"గీత సాక్షాత్తు విష్ణుదేవుని ముఖకమలము నుండి పుట్టింది. గీత ఉండగా ఇతర శాస్త్రముల అవసరం ఉండదు. కనుక గీతను చక్కగా అనుష్ఠించాలి".

యత్ర స్థితం బ్రహ్మజ్ఞానం వేదశాస్త్ర సునిశ్చితమ్

"వేదములు నిర్ణయించి" నిర్దేశించిన బ్రహ్మజ్ఞానము భగవద్గీత యందు శోభించుచున్నది" అని గీతాప్రాశస్త్యమును కొనియాడింది స్కాంద పురాణము. కనుక ఆత్మజ్ఞానమునకు వేదమే ప్రమాణమైనను, భగవద్గీత యందు ఉన్నదంతయు వేదసారమే గనుక, ఉపనిషత్సారమే గనుక భగవద్గీత కూడా ఆత్మజ్ఞానమును పొందుటకు ప్రమాణమై అలరారుతోంది.

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః

పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్

"ఉపనిషత్తులన్నియు గోవులు. గోపాలనందను డగు శ్రీకృష్ణ పరమాత్మ పాలు పితుకువాడు. అర్జునుడు లేగదూడ. గొప్పదైన గీతామృతమే క్షీరము. సద్బుద్ధి గల ముముక్షువులే పానము చేయువారు" అనే అద్భుతమైన శ్లోకాన్ని ధ్యానశ్లోకాల్లో వీక్షిస్తాము.

ఉపనిషత్తుల సారమే భగవద్గీత అయినందున ఆత్మజ్ఞానమును పొందుటకు భగవద్గీత ప్రమాణమని ఈ శ్లోకంలో ఋజువు చేయబడింది.

ఉపనిషత్తులు ఆవులు. ఆవులు ఒకే రంగులో ఉంటాయని చెప్పలేము. పైగా వాటిని కాయడ మనేది కూడా చాలా కష్టతరమైన విషయము. అంతేకాదు. ఆవుల నుండి పాలు పితకడ మనేది కూడా అందరికీ చేతనయ్యే పని కాదు. ఉపనిష ద్రహస్యాల్ని వెలికి తీయడం అందరికీ సాధ్యం కాదు.

అదలా ఉంచండి. ఒకవేళ ఎవరైనా పాలుపితికి వాటిని పాత్రలో ఉంచితే, వాటిని త్రాగడం ఎంత సులభం? ప్రస్తుతం మన పని అదే కదూ! ఇచ్చేవి ఉపనిషత్తులనే ఆవులు. పితికే వాడేమో గోపాలకృష్ణుడు. బుద్ధి ఉంటే త్రాగేవాళ్ళం మనమే. ఇక పాలంటారా! గీతయే.

క్షీరపానము చేసేవారికి ఆకలి ఉండదు; అనారోగ్యమూ ఉండదు. గీతామృతాన్ని పానం చేసేవారికి అజ్ఞానము ఉండదు; అశాంతి మిగలదు. ఆవుపాలతో ఆకలిని తీర్చుకుంటాం. అలాగని పోయే ప్రతిచోటికి ఆవుల్ని తోలుకొని పోగలమా? ఆదే

పాలైతే, ఫ్లాస్క్‌లో పోసుకొని ఎక్కడికైనా తీసుకొని పోవచ్చు. గీతాజ్ఞానము సులభగ్రాహ్యమగునట్లు ఉపనిషద్ జ్ఞానము కాదు. కనుకనే, మన మీద ప్రేమతో శ్రీకృష్ణ పరమాత్మ ఉపనిష త్సారమైన జ్ఞానక్షీరమును మహాభారతము అనే పాత్రలో నింపి అందించారు.

పాలు సమీకృతాహారము. అందరికీ వంటపడుతుంది. మాసాలు గడవని శిశువు నుండి మీసాలు తెల్లబడిన ముదుసలి వరకు ఉపకరిస్తుంది. ఆరోగ్యవంతుడైన భోగికి, అనారోగ్యవంతుడైన రోగికి ఇద్దరికీ ఉపయోగ పడుతుంది. అందరికీ సమంగా మేలు చేస్తుంది. గీత కూడా ఏ మతం వారికైనా ఉపకరిస్తుంది. ఏ జాతి వారినైనా తరింపచేస్తుంది. కుల భేదము లేదు; వర్ణభేదము లేదు; లింగభేదము లేదు; వయో భేదము లేదు. బుద్ధిమంతులైతే చాలు. ఇది గీతామహాత్మ్యము.

భగవద్గీతలో ప్రతి అధ్యాయమును పూర్తి చేయునపుడు సంకల్ప వాక్యం చెబుతాము. అక్కడ గీతను **"బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే"** అంటాము. **"బ్రహ్మవిద్యాయాం"** అనగా ఆత్మజ్ఞానమును ప్రసాదించే బ్రహ్మవిద్య అని భావము. **"యోగశాస్త్రే"** కర్మయోగమును వివరించే యోగశాస్త్రము అని అర్థము. ఈ రెండునూ గీతయందే ఉన్నాయి.

కర్మజా సిద్ధిః జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణా!

"కర్మయోగము ద్వారా శుద్ధిపడిన తరువాత మనుజుడు జ్ఞాననిష్ఠకు అర్హుడవుతాడు" అని గీత - మోక్షసన్యాస యోగముపై వ్యాఖ్యానిస్తూ శ్రీశంకరులు ప్రవచిస్తారు. దీనిని బట్టి భగవద్గీత ఆచరణ ప్రధానమైన గ్రంథము మరియు అనుభవ ప్రధాన గ్రంథమని కూడా తెలుస్తోంది. ఇక్కడే గీతాశాస్త్రము బ్రహ్మవిద్యగాను, యోగశాస్త్రముగాను తెలుస్తోంది. కనుకనే అసమాన ప్రమాణమై అలరారుతోంది.

ముఖ్యంగా ఒక్క సత్యాన్ని ఇక్కడ మనం వంట పట్టించుకోవాలి. కేవలం విషయాన్ని నిర్వచించినంత మాత్రానే అది ప్రమాణవాక్యం కాలేదు. ఫలప్రదమైన నిశ్చిత జ్ఞానమును ప్రసాదించ గలిగినపుడే అట్టి వాక్యాన్ని ప్రమాణ వాక్యమని గుర్తించాలి. ఈ విషయాన్ని శ్రీశంకరులు కూడా భాష్యంలో సుస్పష్టం చేశారు.

న వాక్యస్య వస్త్వన్వాఖ్యానం క్రియాన్వాఖ్యానం వా ప్రామాణ్యా ప్రామాణ్య కారణమ్! కిమ్ తర్హి? నిశ్చిత ఫలవత్ విజ్ఞానోత్పాదకత్వం! తత్ యత్ర అస్తి, తత్ ప్రమాణ వాక్యం; యత్ర నాస్తి, తత్ అప్రమాణం!

"ఒక వస్తువును గూర్చిగాని, లేదా కర్మను గూర్చి గాని నిర్వచించినంత మాత్రాన ఒక వాక్యమును ప్రమాణమని, లేదా అప్రమాణమని చెప్పలేము. మరి ఏమిటి? ఫలవంతమైన నిశ్చిత జ్ఞానమును అందించే శక్తి కలిగి యుండుటయే. అట్టి నిశ్చిత ఫలమును ఇవ్వగల వాక్యమే ప్రమాణవాక్యము; లేనిచో అది అప్రమాణము" అన్నారు ఆచార్యులు.

ఈ విషయంలో భగవద్గీత రెండవ ఆలోచనకు అవకాశమివ్వకుండా జాజ్వల్యమానమైంది. అర్జునుని శోకమోహాదులను తొలగించి, స్మృతిని కలిగించి, నిశ్చిత ఫలాన్ని ప్రసాదించింది.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాచ్యుత
స్థితో౽స్మి గతసందేహః కరిష్యే వచనం తవ

"కృష్ణా! నీ అనుగ్రహము వలన నా మోహము నశించింది. నాకు స్మృతి జ్ఞానము కలిగింది. సంశయ రహితుడనయ్యాను. నీ ఆజ్ఞను శిరసావహిస్తాను" అని చివరగా అనుభూతితో అర్జునుడు పలికిన మాట.

ఈ విధంగా నిశ్చితఫలము నిచ్చి గీత ప్రమాణమై శోభించింది. అర్జునుని సమస్యను గీత పరిష్కరించింది. నీ, నా సమస్యల్ని పరిష్కరిస్తుంది. అర్జునుని సమస్య సర్వ మానవాళి ఎదుర్కొంటున్న సమస్య. శ్రీకృష్ణుడు అందించిన సమాధానము మానవుల సమస్యల ముడులను విప్పుతూ, నిత్యశాంతిని అనుగ్రహిస్తూ భగవంతుడు ప్రపంచానికి పంచిపెట్టిన శాంతి ప్రసాదము.

అధ్యయనంతో మది సంతసిస్తుంది. ఆచరిస్తే హృది సంతృప్తి చెందుతుంది. అనుభవిస్తే శాంతి స్వరూపమై నిలుస్తుంది.

ఆత్మబంధువులారా!

ఏనాటి పుణ్యఫలమో బాల్యమునందే మనసు బాలగోపాలుని బడికెళ్ళి కూర్చుంది. పలుకులు, పాఠాలు నేర్చింది అక్కడే. మాట లొచ్చింది, పాట లొచ్చింది అక్కడే. సల్లాపాలు, విలాపాలు అక్కడే.

"తండ్రీ! నీవు మహోన్నతమైన తండ్రివి. నేను అర్హత లేని బిడ్డను. ఆశ ఒక్కటే నా ఆస్తి. అదే నా అర్హత. నీ కనికరము నాశిస్తూ కడనే నిలబడి ఉంటాను. ముందుకు త్వరపడి రాను. హద్దులెరిగి ఉంటాను. పారిజాత సుమాలను పట్టుకొన్న చేతులను జోడించి నమస్కరిస్తూ ఉంటాను. నన్ను పవిత్రంగా ఉంచు. తులసీదళములను పట్టుకొన్న హస్తాలతో వందన మంటాను. నీ మాటను తు.చ. తప్పకుండా ఆచరించే శక్తిని ప్రసాదించు;" అంటూ వేడుకోవడమే ఆనాడు బాల్యంలో జరిగింది.

ఆ వేడుకోలు వెన్నుని పాదాల వద్దకు చేరుతుందని, తన వేడుకను వెదజల్లే మహాకార్యంలో నన్ను వాడుకోవడం జరుగుతుందని నేను కలలో కూడా భావించలేదు. కాని, భగవద్వాణి యందు ఒకచోట నాకు గురి కుదిరింది. మది నిలిచింది.

య ఇమం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామే వైష్య త్యసంశయః

"పరమరహస్యమైన ఈ గీతాజ్ఞానమును నా భక్తులకు ఎవ్వడుచెప్పునో వాడు నాయందు ఉత్తమభక్తిని కలిగి, సంశయరహితుడై నన్నే పొందగలడు".

ఇది భగవద్గీతలో నా దైవం పలికిన మాట. సందేహం లేకుండా నా మనసులో చేరిన రత్నాల మూట.

బ్రహ్మ సూత్రములు

తత్త్వశాస్త్ర మనేది ప్రధానంగా మూడు విషయాలను తీసుకొని చర్చిస్తుంది.

(1) నేను (**అహం......జీవః**). అదే నీవు. జిజ్ఞాస అనేది ఇక్కడ నుండే కదుల్తూ ఉంది. 'నేను' ఉన్నాను కనుకనే, దేనినైనా తెలుసుకోవాలి అనుకుంటున్నాను (జిజ్ఞాస).

(2) ఇది (**ఇదం .....జగత్**). నాకు గోచరమయ్యే ప్రపంచము. ఉంటూనే, మార్పు చెందుతూ ఉంటున్న దృశ్యమాన జగత్తు. వ్యవహారానికి యోగ్యమైన ప్రదేశం. స్థావర జంగమాత్మకం.

(3) ఈశ్వరుడు (**తత్...జగత్కారణం**). నియతితో తెలుస్తూ ఉన్న ఈ ప్రపంచానికి కర్త యైనవాడు. ఆధారమైనవాడు. సర్వానికి ఆశ్రయమైనవాడు.

ఈ మూడు విషయాలను చర్చిస్తేనే అది తత్త్వశాస్త్ర మవుతుంది. సరే, ఇంతకీ ఈ మూడూ ఒకటేనా? వేరు వేరా? ఈ మూడిటికీ సంబంధ మేమిటి? ఈ విషయాన్ని లేవనెత్తిన శాస్త్రమే దీనికి సమాధానం చెప్పాలి. అప్పుడే శాస్త్రం ప్రమాణ మవుతుంది. ఏ శాస్త్రము ప్రమాణము? వేదాంతమే. ఉపనిషత్తులే. అక్కడే ఈ మూడు విషయాలు సమగ్రంగా చర్చింపబడ్డాయి.

వేదాంతో నామ ఉపనిష త్ప్రమాణం

ఉపనిషత్తులు ప్రమాణం. కాని, ఉపనిషత్తులలో కొన్ని మంత్రాలు ద్వైతాన్ని సూచిస్తున్నాయి. కొన్ని మంత్రాలు అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నాయి. ద్వైతమే సత్యమైతే, అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్న మంత్రాలను అప్రమాణంగా గ్రహించవలసి ఉంటుంది. ఇక, ఏకవాక్యత ఎలా కుదురుతుంది? కనుక ద్వైతం తెలుస్తూ ఉండినా ప్రమాణం అందిస్తున్న అద్వైతముతో సమన్వయం కుదరాలి. అప్పుడే ఆత్మయొక్క అఖండత్వమునకు తాత్పర్య ముంటుంది.

వేదాంత వాక్యానాం జీవేశ్వరైక్య మేవ తాత్పర్యం

జీవేశ్వరుల ఏకత్వ ప్రతిపాదనమే వేదాంత వాక్యముల తాత్పర్య నిశ్చయం. అది జరిగితేనే మోక్షం అఖండమై భాసిస్తుంది. (**అఖండరూప స్థితి రేవ మోక్షః**).

జీవస్వరూప నిర్ణయం జరగాలి. అంటే, ప్రమాతను గూర్చి విచారించాలి. ప్రమాతృ స్వరూప జ్ఞానం కలగాలి. ప్రత్యక్షాది ప్రమాణాలు దృశ్య వర్గమునందు ఉపకరిస్తాయే గాని ప్రమాతను గ్రహించేందుకు సహకరించలేవు. కనుక ఇక్కడ శాస్త్రమే ప్రమాణమై ఉంది. శబ్ద ప్రమాణమే ఏకైక మార్గమై ఉంది.

జీవుడు ఆత్మయే నని ప్రమాతృ విచారంలో తేలితే, ఆత్మ పరమాత్మల ఏకవాక్యత, జగత్తు ఎలా సత్యము కాదో అన్నీ బోధపడతాయి. అందుచేత విచారము ప్రధానమైంది. (**అతః విచారః కర్తవ్యః**). విచారం దేని విషయంలో? ఆత్మ విషయంలో (**ఆత్మ వస్తునః**).

ఆత్మ స్వతః సిద్ధం కదా! ప్రసిద్ధం కదా! అవును. మరి, ఆత్మ విచారము ఎలా? విచారము అంటే ప్రమాణ విచారము అని అర్థము.

తాను ఉన్నట్లు తెలియనిది ఎవరికి? తానేమిటో తెలిసింది మాత్రం ఎందరికి? ఆత్మ అస్తిత్వం అర్థమవుతూనే ఉంది. **'అహమస్మి'** "నేను ఉన్నాను" అన్నప్పుడే ఆత్మ అస్తిత్వం చెప్పకనే చెప్పినట్లవుతున్నది. ఇది సామాన్య జ్ఞానము.

నీవు ఉన్నావు. మరి ఎలా ఉన్నావు? అని ప్రశ్నించినపుడు, 'నేను దేహమును. మనస్సును. కర్తను. భోక్తను' అనే సమాధానా లొస్తున్నాయి. ఇది విపరీత జ్ఞానము.

సామాన్యజ్ఞానము ఉన్నను విశేషజ్ఞానము లేని కారణంగా విపరీత జ్ఞానము కలుగుతూ ఉంది. ఈ విశేషజ్ఞానమే స్వరూపజ్ఞానము. ప్రత్యక్షాది ప్రమాణాలకు అందక, కేవలం శాస్త్ర ప్రమాణం ద్వారా బోధపడే స్వరూప జ్ఞానం.

ఉపనిషత్తులలో స్వరూపజ్ఞానాన్ని ప్రసాదించే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. కాని, వాటిని విపరీతంగా కాకుండా విశేషంగా అర్థం చేసుకొనేందుకు విశ్లేషణ అవసరం. దీనినే మీమాంస అంటారు. బ్రహ్మసూత్రములు మీమాంసా శాస్త్రము. వేదాంతానికి మూల గ్రంథము.

గ్రంథకర్త వ్యాస భగవానుడు. ఆయనే బాదరాయణుడు. అవునా? కాదా? అనేది అప్రస్తుతం. అసందర్భం. బదరీ వృక్షము యొక్క నీడలో వసించినవాడు కనుక బాదరాయణుడు అని ప్రతీతి.

బ్రహ్మసూత్రములను ఉత్తర మీమాంస అంటారు. వ్యాసుని శిష్యుడైన జైమిని మహర్షి రచించిన ధర్మ ప్రధానమైన శాస్త్రము పూర్వ మీమాంస అయినందున, బాదరాయణుడు రచించిన జ్ఞాన ప్రధానమైన బ్రహ్మసూత్రములను ఉత్తర మీమాంస అన్నారు.

వేదం ధర్మాన్ని రెండు విధాలుగా ప్రతిపాదించింది. ఒకటి ప్రవృత్తి. మరొకటి నివృత్తి. ప్రవృత్తి కర్మమార్గము. నివృత్తి జ్ఞానమార్గము. పూర్వ భాగము కర్మకాండ కాగా, ఉత్తర భాగము జ్ఞానకాండగా ప్రసిద్ధి.

పూర్వభాగము విధి ఉపాసనల ద్వారా జ్ఞానానికి సిద్ధం చేసే ప్రవృత్తి లక్షణ ధర్మం. ఉత్తరభాగము జ్ఞానమును ప్రసాదించి స్వరూప స్థితిలో నిలిపే నివృత్తి లక్షణ ధర్మము.

పూర్వభాగమైన కర్మమార్గముపై జైమిని రచించిన సూత్రములు పూర్వ మీమాంస. ఉత్తరభాగమైన జ్ఞానమార్గముపై వ్యాసుడు రచించిన సూత్రములు ఉత్తర మీమాంస.

బ్రహ్మసూత్రములు అని పిలువబడుతున్న ఈ ఉత్తర మీమాంస సూత్ర రూప గ్రంథం. ఇందులో నాలుగు అధ్యాయాలు ఉంటాయి. ఒకొక్క అధ్యాయంలో నాలుగు

పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలో కొన్ని అధికరణాలు ఉంటాయి. ప్రతి అధికరణములో ఒకటి లేక ఎక్కువ సూత్రములు ఉంటాయి. ఈ విధంగా బ్రహ్మసూత్రములు నాలుగు అధ్యాయాలతో, పదహారు పాదాలతో, నూటతొంభైరెండు అధికరణాలతో, అయిదువందలయాభై సూత్రాలతో దివ్యంగా శోభిస్తున్న మీమాంసా శాస్త్రము.

బ్రహ్మసూత్రములకు శారీరక మీమాంస అనే నామం కూడా ఉంది. శరీరంలో ఉండే జీవుని స్వరూపాన్ని **(త్వంపద శోధన)** నిర్ణయించుటకు ఉద్దేశించిన శాస్త్ర మైనందున శారీరక మీమాంస అనే నామధేయం ఏర్పడింది.

దీనిని భిక్షుశాస్త్రం అని కూడా అంటారు. ఆశ్రమ ధర్మాలలో చివరిది అయిన సన్యాసాశ్రమము నందు ప్రధానంగా భిక్షువులు విచారించదగిన గ్రంథమైనందున దీనికి భిక్షుశాస్త్ర మనే పేరు కలిగింది.

బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు ఏకవాక్యతను ప్రధానంగా విశ్లేషించి నిర్ధారణ చేసే గ్రంథములు. ఉపనిష ద్వాక్యాలనే పువ్వులను ఏరి, వాటిని సూత్రబద్ధం చేసిన జ్ఞాన సుమహారమే బ్రహ్మసూత్రములు అన్నారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి **(వేదాన్త వాక్య కుసుమ గ్రథనార్థత్వాత్ సూత్రాణామ్).**

సూత్రాలను అందరూ వ్రాయలేరు. కొందరు సూత్రాలు వ్రాయాలని ప్రయాణమై, మధ్యలో వాక్యాలను, వ్యాఖ్యలను అందిస్తూ నడక సాగించారు. సూత్ర రచన పరమ పవిత్రమైన కార్యము. పావనాత్ములకే సాధ్యము.

సూత్ర వైభవము

అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతో ముఖం
అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్రవిదో విదుః ॥

(1) అల్పాక్షరమై (2) సంశయ రహితమై (3) సారభూతమై (4) సర్వవ్యాప్తమై (5) అనర్థ పద రహితమై (6) నిర్దోషమై ఉండుదానిని సూత్రం అని సూత్రవిదులు నిర్ణయించారు.

(1) సూత్రములోని అక్షర సంఖ్య అల్పంగా ఉండాలి. సంక్షిప్తంగా ఉండాలి. అల్పాక్షర మంటే అక్షర త్యాజ్యం కాదు. ఉదాహరణకి "రాంగోపాల్" అనే పేరుంది అనుకోండి. అక్షరాలను తగ్గించి, లేదా మ్రింగేసి "రాం-గో" అని పిలవడం కాదు. "రాంగో" అంటే రాంగోపాల్ అనే గ్రహించాలని ఎక్కడుంది? రాం, గో..... "రామా, వెళ్ళు" అని ఎవరైనా గ్రహిస్తే ఏం చేయగలం?

అల్పాక్షర మంటే అక్షరాలను మాయం చేయమని కాదు. ఒక పదంలో ఉండవలసిన అక్షరాలన్నీ ఉంటేనే అది పద మవుతుంది. కనుక అల్పాక్షర మంటే పొడవైన వాక్యం కాకుండా సంక్షిప్తంగా ఉండాలి **(అల్పాక్షరం).**

(2) తక్కువ పదాలతో చెప్పేటప్పుడు విశదీకరణము పూర్తిగా జరుగకపోవచ్చు. నానార్థాలకు అవకాశం కలుగవచ్చు. అస్పష్టత చోటు చేసుకోవచ్చు. అలా లేకుండా ఉంటేనే సూత్రం. కనుక సందేహాలకు సూత్రంలో స్థానం ఉండకూడదు **(అసందిగ్ధం).**

(3) అర్థవంతంగా ఉండాలి. సమర్థమైన విషయ విశదీకరణం జరగాలి. అల్పాక్షరంగా ఉండొచ్చు. అసంశయంగానూ ఉండవచ్చు. సారం లేకుండా అనర్థంగా ఉండకూడదు. రసం లేని చెరకు లాగా ఉంటే ఏం ప్రయోజనం? చెరకు అంటేనే రస ప్రధానం. సూత్రం కూడా సారభూతమై భాసిల్లాలి **(సారవత్).**

(4) సూత్రము ఒక్కటే అయినా ప్రయోజనాలు వివిధంగా తెలుస్తూ ఉంటాయి. ఏది ముఖ్యము? ఏది అముఖ్యము అనే విషయాన్ని ప్రక్కనపెడితే, బహుళ ప్రయోజనకారిగా ఉండాలి **(విశ్వతో ముఖమ్).**

(5) ఇష్టమైన విషయాన్ని విశదీకరించే ప్రయత్నంలో అనవసరమైన శబ్దాలను, పదాలను, విశేషణాలను ప్రయోగించకూడదు. నిశ్చితార్థాన్ని పదం వివరించగలగాలి. సమన్వయం ప్రధానం **(అస్తోభం).**

(6) సూత్రం దోష రహితంగా ఉండాలి. విషయం నిర్దోషంగా శోభించాలి. అవద్యం అంటే దోషం. అనవద్య మంటే దోషం లేనిది అని అర్థము. కనుక సూత్రం అనేది దోషము లేనిదై ఉండాలి. విషయంలో దోషం ఉండకూడదు. స్పష్టతలో దోషం ఉండకూడదు. భాషలో దోషం ఉండకూడదు. తర్కంలో దోషం ఉండకూడదు. వ్యాకరణ దోషం అసలే ఉండకూడదు. సమన్వయ లోపం కూడా ఉండకూడదు.

ఇలా ఉంటేనే, ఉండగలిగితేనే సూత్రం అని సూత్ర విషయము నెరిగిన సూత్ర కోవిదులు నిర్దేశించారు. భగవత్స్వరూపులైన బాదరాయణాచార్యులు ఉత్తర మీమాంస శాస్త్రాన్ని అందుకే సూత్రీకరించారు.

వ్యాఖ్యానాలు – వ్యాఖ్యాతలు

బ్రహ్మసూత్రాలు సూత్రబద్ధమై ఉన్నాయి. వ్యాఖ్యానం లేకుండా వాటిని అర్థం చేసుకోవటం సాధ్యం కాదు అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కనుక అనేకమంది వ్యాఖ్యాతలు నడుం బిగించారు. వ్యాఖ్యానాలను దొర్లించారు. ప్రవహింపచేశారు.

వ్యాఖ్యానాలైతే వచ్చాయి. వ్యాఖ్యాతలు వివిధ మతానుయాయులు కావటం చేత వారి వారి సిద్ధాంతాలకు విశేష సౌందర్యాన్ని కల్పిస్తూ వ్యాఖ్యానించారు. అంతే గాక, తమకు భిన్నంగా ఉన్న సిద్ధాంతాలను పూర్వాపరాలను కూడా చూడకుండా ఖండించే ప్రయత్నం కూడా చేశారు.

అనేక మంది వ్యాఖ్యాతలు బ్రహ్మసూత్రాలకు అద్వైతపరంగా భాష్యాన్ని అందించారు. అద్వైత భాష్యాలను విమర్శిస్తూ "న్యాయామృతము" అనే ద్వైత భాష్యము వెలుగు చూసింది.

ద్వైత ప్రతిపాదిత గ్రంథమైన న్యాయామృతమును విమర్శిస్తూ మధుసూదన సరస్వతి "అద్వైతసిద్ధి" అనే గ్రంథాన్ని రచించారు.

అద్వైత సిద్ధిని ఖండిస్తూ ద్వైతపరంగా "తరంగిణి" అనే గ్రంథము వెలువడింది. తరంగిణిని విమర్శిస్తూ బ్రహ్మానంద స్వామి "చంద్రిక" అనే వ్యాఖ్యను అద్వైతపరంగా రచించారు. దీనినే "గౌడ బ్రహ్మానందీయం" అంటారు.

చంద్రికను విమర్శిస్తూ "వనమాల మిశ్రీయము" ద్వైతపరంగా రాగా, "భాష్య భాను ప్రభ" వనమాల మిశ్రీయాన్ని విమర్శతో పరామర్శించింది.

బ్రహ్మానంద స్వామి చంద్రికను విమర్శిస్తూ అనంతాళ్వారులు "న్యాయ భాస్కర" అనే వ్యాఖ్యను విశిష్టాద్వైతపరంగా రచించారు. న్యాయ భాస్కరను ఖండిస్తూ రాజు శాస్త్రి "న్యాయేందు శేఖర" అనే గ్రంథాన్ని అద్వైతపరంగా అందించారు. ఒక్క గ్రంథముపై ఇన్ని వ్యాఖ్యలా? ఇన్ని తర్జన భర్జనలా? పండితుల గర్జనలా? ఇప్పటికి ఇన్ని. రాబోయేవి ఎన్నో? ఇంతకీ, వీటిలో ఏది పూర్ణన్యాయం చేకూర్చింది? ఏమో! ఇదే ఒక న్యాయ ప్రస్థానము.

మందుల షాపులో ఎన్నో మందులు ఉంటాయి. రోగం ఉందని అన్ని మందులు మ్రింగనవసరం లేదు. ఉన్నవాటిలో మనదేదో మనకు తెలిస్తే ఆ తరువాత అంతా సవ్యంగానే సాగుతుంది.

శ్రీ శంకర భాష్యము - శ్రీ శంకర భాష్య వ్యాఖ్యానాలు

"చుక్కలు ఎన్నయినా చందురుడు ఒకడేలే" అన్నట్లు, బ్రహ్మసూత్రాలకు భాష్యాలెన్నున్నా, శ్రీ శంకరుల భాష్యం అసమానమై అలరారుతోంది. ప్రసన్న గంభీరమై శోభిస్తోంది. సహేతుక వివరణములో, శాస్త్ర వైదుష్యంలో, రచనా పటిమలో, వాక్య సౌందర్యంలో శంకర భాష్యానికి శంకర భాష్యమే సాటి. మేటి.

వీరి భాష్యంలో అఖండాత్మ తత్త్వమే ప్రతిపాదింపబడింది. బ్రహ్మసూత్రాలకు ఉపనిషత్తులే ఆధారము. ఉపనిషత్తులు అద్వితీయమైన ఆత్మ తత్త్వాన్నే ప్రతిపాదించాయి కనుక శ్రీ శంకరులు తదనుగుణంగానే భాష్యాన్ని నడిపారు.

సర్వేషా మేవ శాస్త్రాణాం పరమేశ్వర ఏవ ప్రతిపాద్యే తాత్పర్యం

అన్ని శాస్త్రాలకు పరమేశ్వరుని ప్రతిపాదించుటలోనే తాత్పర్యం. శ్రీ శంకరులు అదే చేశారు. అందుచేత శ్రీవారి భాష్యంపై అనేక భాష్యాలు వెలువడ్డాయి.

శ్రీ శంకరుల భాష్యముపై ఆచార్యుల వారి ప్రధాన శిష్యులైన పద్మపాదాచార్యులు "పంచపాదిక" అనే వ్యాఖ్యానాన్ని రచించారు. పంచపాదికపై వివరణాచార్యులవారు "తత్త్వ దీపన" మనే వ్యాఖ్యానాన్ని అందించారు. ఈ వ్యాఖ్య చతుస్సూత్రికి మాత్రమే లభ్యం అంటున్నారు. పంచపాదికకు ప్రకాశయతి గొప్ప వ్యాఖ్యానమును రచించారు.

శ్రీ శంకరుల వారి సూత్ర భాష్యముపై మహాపండితుడైన వాచస్పతి మిశ్ర జటిలమైన, సుందరమైన వ్యాఖ్యను అందించారు. దాని పేరే భామతి. భామతి వ్యాఖ్యానముపై అమలానందుడు "కల్పతరు"వనే వ్యాఖ్యానమును, అఖండానందుడు "ఋజు ప్రకాశిక" అనే వ్యాఖ్యను రచించాడు.

అప్పయ్య దీక్షితులు 'కల్పతరు' వ్యాఖ్యానముపై "పరిమళ" అనే వ్యాఖ్యను రచించగా, లక్ష్మీ నృసింహ వాజపేయుల వారు 'కల్పతరు' పై "అభోగ" అనే వ్యాఖ్యానమును రచించారు.

ఆనందయతి ఆచార్యుల వారి భాష్యముపై రచించిన "రత్నప్రభ" వ్యాఖ్యానము కడు ప్రశస్తమైనది. అలాగే ఆనందగిరీయం, శంకర పాద భూషణం, భాష్యభాను ప్రభ మొదలైన వ్యాఖ్యలు ఎన్నో ఉన్నాయి.

ఆచార్యుల వారి భాష్యానికి ఇన్ని వ్యాఖ్యానాలు నదీ ప్రవాహాల వలె దొర్లి వచ్చాయంటే వారి అసమాన ప్రజ్ఞా విశేషమును ఎంతని కొనియాడగలము?

సూత్రకారుడు స్తవనీయుడు
భాష్యకారుడు భజనీయుడు

అమోఘమైన, అద్భుతమైన, అసమానమైన బ్రహ్మసూత్రములను రచించిన వేద వ్యాసుడు, భాష్యమును రచించిన ఆదిశంకరులు భగవత్స్వరూపులు. సర్వులకు ప్రాతః స్మరణీయులు.

శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం
సూత్ర భాష్య కృతౌ వందే భగవంతం పునః పునః

అని వ్యాస శంకరాదులను ఏకంగా స్తుతించే సంప్రదాయం ఉంది.

బ్రహ్మసూత్రములను రచించిన వ్యాస భగవానుడు సాక్షాత్తు కేశవుడే. నారాయణుడే. **"మునీనాం అహం వ్యాసః"** మునులలో వ్యాస మునీంద్రుడు తానేనని భగవంతుడు స్వయంగా భగవద్గీతలో తెలిపియున్నాడు.

భగవంతుడైన వ్యాస మునీంద్రుడు రచించిన సూత్రాలకు భాష్యాన్ని ఎవరు వ్రాయగలరు? అందుచేత భగవంతుడైన శివుడే శంకరుడుగా రావలసి వచ్చింది. **"రుద్రాణాం శంకర శ్చాస్మి"**. రుద్రులలో శంకరుడు తానేనని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ప్రకటించాడు.

నారాయణుడే వ్యాసుడై బ్రహ్మసూత్రాలు రచించాడు. పరమశివుడు ఆదిశంకరులై భాష్యాన్ని అందించారు. ఇద్దరూ ఒక్కరే కనుక **"పునః పునః భగవంతం వన్దే"** మళ్ళీ మళ్ళీ అద్వయానంద పరమాత్మకు నమస్కరించుచున్నాను.

ఓం తత్ సత్

చైతన్యగాన లహరి

పల్లవి: హైలెస్సా.......... హైలెస్సా
వేదము నేనని తెలుసా!

అనుపల్లవి: ఎన్నో ఎన్నో చెప్పి ఊరిస్తా
మరుక్షణమే బ్రతుకంతా మారుస్తా ॥ హైలెస్సా ॥

చరణములు:

1. సంసార తిమిరాలు చీలుస్తా
అజ్ఞాన జలములు పీలుస్తా
రాగద్వేషాలు రాల్చేస్తా
శాంతి ప్రేమలు నింపేస్తా ॥ హైలెస్సా ॥


2. మాయాజాలము నంతా గాలిస్తా
మోహజాలము నింక కాలుస్తా
ధర్మాలన్నీ నీకు చేరుస్తా
ధర్మము నే నని నేర్పిస్తా ॥ హైలెస్సా ॥

3. స్వర్గం నీకు చూపిస్తా
మోక్షం నీకు అందిస్తా
అంద మంతా చిందిస్తా
ఆనందం నీవే అనిపిస్తా ॥ హైలెస్సా ॥

4. భ్రమలు లేవని నిరూపిస్తా
బ్రహ్మమే ఉందని వినిపిస్తా
ఉన్నది చైతన్యం అనిపిస్తా
ప్రమాణమై నీకు కనిపిస్తా ॥ హైలెస్సా ॥

భావ సుమాలు

ఇందులో...



నవ్విన పువ్వులు

మధురమైన భావాలను
సుమధురమైన పదజాలంలో తురిమి
మృదుమధురమైన కవితా పల్లకీలో కూర్చోబెట్టి
ఊరేగించేదే కవిత్వమైతే,
దానికి ముందుమాట రాసేందుకు
కవిగా నేను ముందుకు రాలేను.
మీ ముందుకు రాలేను.

కవిత్వ మనేది కేవలం సమదర్శనమే నని
కవి ఏనాడైనా క్రాంతదర్శియే నని

నిజాలను ప్రదర్శించే యత్నంలో
ఋజువులను సృష్టించే ప్రయత్నంలో

యోజనాలను దూరాలుగా, భారాలుగా భావించక
ప్రయోజనాలనే భవ్యంగా, భావ్యంగా తలచి

జననాడిని కుదిపి
జీవనాడిని తెలిపి

జీవన ప్రవంతి నిరాటంకంగా సాగేందుకు
ప్రతిబంధాలను తొలగించి,
రేపటి ఆశకు తెరదించి
నిన్నటి నిరాశకు సమాధి కట్టి

నేటిని మేటిగా నిలిపేందుకు
సర్వాన్ని సర్వంలో కలిపేందుకు - కవిత్వమొక సాధనమైతే,
కవిగా నేను సాధకుణ్ణి.
సాధ్యాన్ని కూడా.

అవలోకించే వారికి సుందర వనాన్ని
అండ చేరే వారికి చైతన్య నిలయాన్ని
ఆస్వాదించే వారికి ఆనందాలయాన్ని

ఈ వనంలో
విరబూసిన వేదాంత సుమాలే చైతన్య స్వరాలు
ఈ నిలయంలో
విరజిమ్మిన విజ్ఞాన సౌరభాలే చైతన్య రాగాలు
ఈ ఆలయంలో
విరివిగ వితరణ చేయబడిన ప్రసాదాలే చైతన్యగానాలు.

ఈ పాటల్లో,
మంచి చెడుల మర్మా లున్నాయి.
ధర్మాధర్మాల సందడు లున్నాయి.
వివేకాన్ని పంచే అంగడు లున్నాయి.
పూజించేందుకు గుడు లెన్నో ఉన్నాయి.
వెల కట్టేందుకు యతిప్రాస లున్నాయి.
వెల కట్టలేని యతి శ్వాస లున్నాయి.
మాసిపోని మాట లున్నాయి.
హద్దులు దాటిన పదా లున్నాయి.

తెల్లని కాగితాలపై తేలియాడే ఈ నల్లని రాతలు
కాలం చెల్లే రాతలు కావు. కాలంలో చెల్లని రాతలూ కావు.
ఇవి జ్ఞానక్షీరా న్నందించే మాతలు
తప్పకుండా తుడుస్తాయి మన తలరాతలు.
ఇందులో,
కవి లేడు. కవిత్వ ముంది.
గాయకుడు లేడు. గాన ముంది.
వేదాంతి లేడు. వేదాంత ముంది.
కర్త లేకుండా సాగిన కర్మ ఇది. యజ్ఞమిది. జ్ఞానయజ్ఞ మిది.
వసంతాన్ని చూచేందుకు కళ్ళు సరిపోతాయి.
అనుభవించేందుకు హృదయ ముండాలి.
సున్నితమైన ఒక హృదయం ఒలికించిన ఈ కవితా సుధలను పట్టి నిలుపు కొనేందుకు సరియైన పాత్ర మరొక సున్నిత హృదయమే. హృదయేశుని రస మందిరమే. సరసమయ నవరస మందిరమే. సమరస మందిరమే.

సద్గురు చరణం

రోము యుద్ధాలు చేస్తే
మనం యజ్ఞాలు చేశాం.
వారి చరిత్రలో అడుగడుగునా సమర వీరులే.
మన చరిత్రలో అణువణువునా సోమయాజులే.

మారిపోయే దారులు
మాసిపోయే చిరునామాలు
మృతి చెందే స్మృతులు..... ఇవే కదూ ఈ ప్రపంచంలో అందాలు?
నూతన ఆశల ఉషోదయంలో, అనుభవ గగనం విడిచిన నిశ్వాసల సవ్వడిలో వినిపించే గుసగుసలు ఇవే కదూ?
నీలాల మబ్బులో నిలకడ లేని మెరపు తీగలు ఎన్ని మెరిస్తే ఏముంది? అవి మెరిసి పోయేవే గాని నిలిచి ఉండేవి కావు. ఉరమున నిలువని ఉరుములు ఎంతకాలం ఊరేగుతాయి?

అరూపానికి రూప మిచ్చేందుకు కాలంతో ఎన్ని కయ్యాలో!
నిశ్శబ్దానికి శబ్దమిచ్చేందుకు గగనంతో ఎన్ని గొడవలో!

గుర్తు తెలియని తనకు గూడు నిర్మించిం దెవరు?
అవధులు లేని ఆకాశానికి నీలిరంగు పూసిం దెవరు?
అలల వలె కదిలే ఆకులకు పచ్చరంగు రాసిం దెవరు?

ఎన్నో.... ఎన్నెన్నో.... మరెన్నో..
అన్ని సందేహాలను వెనుకకు నెట్టి,
ఏదీ కాని, కాలేని వానిని
అన్నీ అనుకోమని ఆలపించి,
మస్తకంలో మాయను తరిమి
మనసులో హాయిని తురిమే
గురుదేవుని సాన్నిధ్యం.... గుడిలో లభించిన ప్రసాదం.

అది పదములు వర్ణించలేని కాంతి
మాటలు వివరించలేని శాంతి.

ఆ సన్నిధిలో
ఎవరు ఎవరిని ప్రేమించాలన్నా ఏదో అడ్డొస్తుంది
ఎవరు ఎవరిని ద్వేషించాలన్నా సిగ్గేస్తుంది.

ఆ క్షణాన
ఆచరణలో అయోధ్య అగుపిస్తుంది
బ్రతుకులో బృందావని తొంగి చూస్తుంది.

ఆ నవ్వులో
విరబూసిన పువ్వే సాహిత్యం
విరజిమ్మిన సుగంధమే సంగీతం.

ఆ గుడిలో
భక్తియే నైవేద్యం
ముక్తియే ప్రసాదం.
ఆ సమయంలో వినిపించేది, కనిపించేది ఒకే పాదం

భవ శంకర దేశిక మే శరణమ్

ఒకే పాదం.... ఒకే పదం....... అదే 'దేశిక' ...... అదే చాలిక.
పాదం నిలిచింది. పూజ కదిలింది. పాదపూజై మిగిలింది.
పువ్వు వంటి మనసుతో
నవ్వు వంటి గురుదేవునికి
పూజ చేస్తున్నా.
పూలల్లో దారంలా సదా నిలిచి ఉండమని, నిండి ఉండమని
గురు పాదపూజలో
నిలిచాయి, వెలిగాయి సద్గురు చరణాలు.
సారముగా నా భక్తికి,
ద్వారముగా నా ముక్తికి.

హంస యానం

తిరిగింది తిరిగింది తిరుగులేని హంస
తరిగింది తరిగింది తిరిగిరాలేని హింస
మంచి మాటలు పలికి
ప్రేమ పాటలు ఒలికి
నిండైన గుండెలను చిలికి చిలికి

కలలను కరిగించి
కళలను పూయించి
మనసులను మరిపించి
శాంతిని కురిపించి
నిన్నటి నలుపును అంతం చేసి
నేటి తెలుపుకు పట్టం కట్టి
గుట్టుగ నిలిచే గట్టి జ్ఞానమును
పదిలముగా గుండెలలో పెట్టి

మత్తును వదిలించి
ఆశను కదిలించి
తాపాలు హరియించి
దీపాలు వెలిగించి
ఆరిపోతున్న వత్తికి చమురు పోసి
ఆరబోసిన మణులను మూటగట్టి
వ్యథలను రొదలను రోదసికి నెట్టి
మాధవుని కొలువులో యెదలను పెట్టి
స్ఫూర్తిని కలిగించి
దీప్తిని రగిలించి
మూర్తిని ముందుంచి
కీర్తిని చిందించి
గుండె గుండెను పలకరించి
గుండెలలో సుధలు చిలకరించి
నిండైన మనసుతో కనికరించి
కమలాక్షుని గాంచి కలవరించి, కల వరించి

తాపమును తొలగించి
పరితాపమును తరలించి
అహమును అర్పించి
అహరహము సమర్పించి
కాలం ప్రాణం పోసిన క్షణం
కాలాన్ని కబళిస్తోంది క్షణం క్షణం
ఉన్న దేదీ కాదు మనం
మనమే మనలో ఉన్న నిజం

అని దారిని మరలించి
చెడు దారిని మరిపించి
భ్రమలను జడిపించి
ప్రేమలను నడిపించి
మనసును పాలించి
చిత్తమును లాలించి
మహిమను గాలించి
ఫలమును సాధించి

ఆచారాన్ని భుజాలు తట్టి
విచారాన్ని భుజమెక్కించి
ప్రచారాన్ని పూలరథంలో
వాడవాడలా వేడుక చేసి
శ్రమను మరచి
ప్రమను పరచి
మనసును ఊరించి
మహిమను ఊరేగించి

తిరిగింది తిరిగింది మహిమ నెరిగిన హంస
తరలింది తరలింది మనుగడ దొరకని హింస.

మధుర ప్రభాతం

పారిపోయిన జ్ఞాపకాలు
జారిపోయిన వ్యాపకాలు...... పూర్తిగ ఆరిపోయిన దశలో
మారిపోయిన మనిషిలో
చేరిపోయిన మరో ప్రపంచం.... నిజానికి అది మాధవ ప్రపంచం.

బాధ దైహికం
వ్యథ మానసికం
ఈ రెండిటిని దాటిన గాథ...... వాస్తవానికి స్వరూపబోధ.....స్వస్వరూప సుధ

అవసరాలు అసత్యాలని
ప్రయత్నాలు అనిత్యాలని
ఉన్నవి ఉద్ధరించవని
అది, ఇది - ఏదీ నీది కాదని
ఏదీ నీకు లేదని,
అనుభవానికి అందిన సందేశం...... అదే స్వభావ సంకేతం.

కనిపించేది నీవు కాదు
వినిపించేది నీది కాదు
అనిపించేది అది కానేకాదు
అదే నీవు;
నీవే అది....... వాస్తవానికి అదే ఆది ..... అదే అనాది
ఆద్యవాదులకు పునాది
అన్నిటినీ ఏకం చేసే సమాధి.

ఇలను ఉంచుకోలేవు;
కలను పంచుకోలేవు.
అలలను అలా కదలనీ;
శిలలను కరిగితే కరగనీ.
కదలని అల
కరిగిన కల
[illegible]డూ కాదు వల...... అది తెలిస్తే బ్రతుకంతా కళకళ

'వ్యాపారం' చేయా లంటావు
'వ్యాపారుల్ని' నమ్మలే నంటావు.
ఇది వ్యాపకమా! వ్యాపారమా!
'పారం' తెలియని ప్రమ
అపారమైన ప్రేమ - నీకు అలవడని నాడు,
వ్యాపారమంతా వ్యాపకమే!
లాభ మనే దంతా నిజానికి నష్టమే!

మాటకు తెలుసా ఎక్కడుందో మూట
పాటకు తెలుసా ఎక్కడి నుండో ఆట
మాటను, పాటను దాటిన నోట
వింత వింత వేటలన్నీ ఆగినచోట
ఊరేదంతా అమృతపు ఊట
ఊరేగేదంతా అవ్యయానంద బాట

బాధలను కప్పేందుకు "విధి" అనేది దుప్పటి
అర్హతను కాల్చేందుకు "అదృష్ట" మనేది కుంపటి

"విధి" కాదెన్నడూ నీకు నిధి
"అదృష్ట" మనే దొక చీకటి గది
"విధి"ని విడిపోనీ
"అదృష్టాన్ని" మాడిపోనీ

అర్హతలే ఏనాడైనా అందల మెక్కుతాయి
అవగాహనలే గొడుగులు పట్టించుకుంటాయి.

శాశ్వత జ్ఞానతేజము కదిలితే
కల్పిత భావ తిమిరమును తరిమితే - జరిగేదేమిటి?
అజ్ఞానానికి నిమజ్జనం!
జ్ఞానానికి నీరాజనం!
జరిగే దేదైనా - నీకు,
నీ వల్ల జరిగిందే
నీ ద్వారా కలిగిందే
నీ కొరకు ఒరిగిందే.....

అవగాహనా చినుకు పడి
మరిగే మనసుకు కునుకు పడితే
భయాలన్నీ పారిపోతాయి
బాధలన్నీ కారిపోతాయి
అభయంలో అంతా ఆనందమే.
ఆనందంలో అంతా అద్వయమే. అఖండమే.

రోగిని చూడకుండా రోగాన్ని నయం చేయడమా!
అజ్ఞాన మేమిటో తెలియకుండా దానికి నివారణమా!
అజ్ఞాన మెక్కడుంది? పోగొట్టాలనే ప్రయత్నంలో తప్ప!
శబ్ద మెక్కడుంది? నిశ్శబ్దం చెడిన దశలో తప్ప!
అజ్ఞాన మేమిటో, ఎక్కడో ఆలోచిస్తే, అసలు అజ్ఞానమే లేదు.
'లేదు-కాదు' అనే దాని చివర ఉన్నదంతా జ్ఞానమే. ప్రజ్ఞానమే. పరిపూర్ణ జ్ఞానమే.

'అవధి' చూపేవాడు గురువు
"అవరోధము"ను చూచేవాడు శిష్యుడు
అధిగమించే దశలో
కష్టమంతా శిష్యునిదే
కరుణంతా గురువుదే.

కళ్ళు మూసిన వారందరూ నిద్రపోయేవారు కారు
కళ్ళు తెరిచిన వారందరూ చూచేవారు కారు
'స్పృహ' లేని కళ్ళే నిద్రిస్తున్నాయి
'స్పృహ' గల నేత్రాలే చూస్తున్నాయి
నీ 'స్పృహ'లో నిస్పృహ తొలగిననాడు
బాధించదు నిన్ను "ఊహ";
బ్రతుకంతా ఆపైన శివః శివః శివః

ద్వంద్వాల కత్తెరలో ముక్కలౌతున్న అందాలు

ద్వంద్వాలనేవి బ్రతుకులో ఏనాడైనా బంధాలే
జీవన రణరంగంలో రాగద్వేషాలు రెండూ శత్రువులే.

దగ్గరై బాధించేది ద్వేషము
దూరమై బాధించేది రాగము
ఈ రెండిటి మధ్య దొర్లిపోయే బ్రతుకు చెండుకు
అడుగడుగునా దెబ్బలే. ప్రతి అడుగునా మడుగులే.

ద్వంద్వాల స్థితి అంతే.
వాటిని నమ్ముకున్న బ్రతుకుల పరిస్థితీ అంతే.

ఏ చోటైనా - రెండున్న చోట తప్పవు గండాలు
అవే బ్రతుకులో సుడిగుండాలు

ఊగే ఊయల ఎంతకాలం ఊరేగుతుంది?
సాగే కల కరిగిపోకుండా ఎంతకాలం కొనసాగుతుంది?
ఊగినంతసేపు రెండు దిక్కులకు ప్రయాణం
ఆగిన క్షణాన నిలిచిన ప్రశాంతతకు దిక్కేమిటి?

సాగినంతసేపు కలలో ఎన్ని చిత్రాలో
మేలుకోగానే మిగిలేవన్నీ విచిత్రాలే.

ఎవరికి ఎవరు ఏమీ కాని ఈ ప్రపంచంలో కల్పించుకొనే వన్నీ
బంధాలే కాని బాంధవ్యాలు కావు.
భిన్నమైన విషయాలకు బాంధవ్య మేమిటి?

ఏకమైన విషయాలలో బాంధవ్య మేపాటిది?
అంతా అయోమయం
మనసు చేసే మాయాజాలం

"నాది - నేను" అనేవి రెండు
ఇవే దుఃఖకారణాలు అనే సత్యం మాత్రం ఒక్కటే.

గురుశిష్యులు - ఇది ద్వంద్వ సమాసము.
గురువు ఒక్కడే - ఇది నిర్ద్వంద్వ సమజీవనం.

సహవాసం చేస్తే రెండుంటాయి...... ఇది సమరం
సాక్షిగా ఉంటే ఒక్కటే .... ఇది శాంతి.

నదులెన్నయినా నీరొక్కటే
కొమ్మలెన్నయినా చెట్టొక్కటే.
చెట్లెన్నున్నా వనమొక్కటే
తారలెన్నయినా ఆకాశమొక్కటే.
పుట లెన్నున్నా పుస్తకమొక్కటే
పూలెన్నున్నా మాల ఒక్కటే
దీపాలెన్నున్నా వెలుగొక్కటే
చరణాలెన్నున్నా పాటొక్కటే.
వాక్యాలెన్నున్నా వ్యాసమొక్కటే
పాత్రలెన్నున్నా నాటకమొక్కటే
ఊహలెన్నున్నా మనసొక్కటే
మార్గాలెన్నున్నా గమ్యమొక్కటే.

ఏవి ఉన్నాయి? ఎన్ని ఉన్నాయి? అనేది ప్రశ్న కాదు.
ఒక్కటిగా ఉన్నాయా? ఒక్కటై ఉన్నాయా? అనేదే ఆలోచన.

విడివిడిగా ఉంటే విడిపూలు.
ముడిపడి ఉంటే అవే అవుతాయి మాలలు.
కలసి శోభించడం మాలల సౌందర్యం
విడిపోయి వాడిపోవడం పువ్వుల సహజగుణం

పువ్వుగా పుట్టడం పుణ్యం
పరిమళం తోడైతే మరీ పవిత్రం
యజ్ఞభావం అలవడి యజ్ఞోపవీతం కలబడి
మరికొన్ని పువ్వులతో కలసి ముడిపడితే
మాధవుని మెడలో పడితే

బ్రతుకు భవ్యం.... జీవి ధన్యం

ఇది మేలుచూపు...... మేలైన చూపు
వాలు చూపు, ఓరచూపు ఎవరిదైనా చిన్నచూపే

ఓ రాజీ వాక్షి! ఓరచూపులు జూచేవేరా

నే నీకు వేరా.......

అని అద్వైతామృతాన్ని జుర్రే ప్రయత్నంలో రామయ్యనే
నిలదీశాడు త్యాగయ్య.

రెండు చేతులున్న పుణ్యానికేమో మనిషి ఏ ఒక్కటీ చెప్పినట్లు చేయడు.
చీకటి వెలుగులు ప్రకృతిని వదలవేమో!
సుఖదుఃఖాలు మనిషిని వీడ వేమో!

రెండు చేతులూ కలసి ఒక్క హారతి పళ్ళెమును త్రిప్పడం లేదా!
కాళ్ళు రెండయినా నడక ఒక్కటే కదా!
కళ్ళు రెండయినా దృష్టి ఒక్కటే కదా!
చెవులు రెండయినా వినికిడి ఒక్కటే కదా!
పెదవులు రెండయినా నవ్వు ఒక్కటే కదా!
రెండున్నాయనే భ్రాంతిలో ఉన్న ఒక్కదానికి దూరం కావాలా?
పెళ్ళి పీటలపై ఇద్దరు ఒక్కటిగ కూర్చుంటే కళ్యాణం.
మనిషి హృదయంలో రెండు ఒక్కటిగ మారితే వ్యక్తి కళ్యాణం. అదే లోక కళ్యాణం.

ఒక్కటే-ఒక్కటే-ఒక్కటే

వెలుగు ఒక్కటే. చీకటి కూడా ఒక్కటే.
ఒకే చీకటిగా కలకాలం కుమలడమా!
ఒకే వెలుగుగా ఎల్లకాలం వెలగడమా!

నీవెలా అనుకుంటావో నాకు తెలియదు.
ఉపనిషత్తు మాత్రం ఇలా సరిపెట్టుకున్నది.

అద్వైతం నావ మాశ్రిత్య
జీవన్ముక్త త్వ మాప్నుయాత్

అద్వైతమనే నావ నాశ్రయించినవాడు జీవన్ముక్తిని పొందుతాడు.
ఇదీ విషయం...... ఇక నీ ఇష్టం.

సందేశ లహరి *

ఏడన్నా! ఏడుపన్నా! ఎందుకో మనిషికి భయం భయం ....
మరి ఈ ఏడు .... తొంభై ఏడు.
ఈ నూతన సంవత్సరమైనా తొలగిస్తుందా?
కీడును ఏడులో
చెడును ఏడుపులో......
వచ్చేది తొంభై ఏడు
పోయింది నలభై ఏడు
ఈ రెండిటి మధ్యకాలమే నా ఈడు .... నాకు తోడు.
ఏడులో విడుదలైన వారికి వేడుకలున్నా ఏడుపులు తప్పవేమో!
లేకపోతే, యాభై వస్తున్నా స్వాతంత్ర్యం భారతికి సాధించి పెట్టిందేముంది?
తోడుగా నలభైయేడులో పుట్టిన పుణ్యానికి అమ్మను ఊరేగించాలనే ఉత్సాహంలో ఊడిగం చేస్తున్నా!
బంధాలు తొలగితే లాభం లేదు. అందాలు చిగురిస్తేనే క్షేమం.
గతము పంచకుండా పోయింది హితమును!
భవిత పంచుతుందో లేదో సమతను!
ఉన్నది మానం .... విన్నది వర్తమానం
మాన మున్నంతవరకు
అభిమానమున్నంత వరకు....... దేహాభిమాన మున్నంత వరకు
ఏముంటుంది జీవి వర్తమానం?
మానం తొలగినపుడే సమానం విమానమెక్కి ఊరేగుతుంది.

ఇది సముజ్జ్వల సువర్ణ సంవత్సరం

ఇది కీడును తొలగిస్తుంది. నీకు తోడుగా నిలుస్తుంది.
మబ్బు కురిసే క్షణం వచ్చిందని మెరుపు మెరిసి మరీ చెబుతుంది.
నీకు బంగారు బ్రతుకు ప్రాప్తిస్తుందని ప్రకాశిస్తూ ప్రవచిస్తోంది సువర్ణ సంవత్సరం.
చల్లనివాడివి కా!
బురద చల్లనివాడివి కా!
చల్లనివాడివి కా!

* నూతన సంవత్సర సందేశం (1997)

ఇతరులపై ప్రేమసుధలు చల్లెడివాడివి కా!
ఇతరులు నీపై విసిరే రాళ్ళను నీ జీవన సౌధానికి గట్టి పునాదిగా వేసుకో!
దూరమైన మిత్రుణ్ణి దగ్గరికి పిలుచుకో. దగ్గరైన శత్రువును దూరం చేసుకో.
చల్లగా పిలువు. మెల్లగా పలుకు. నమ్మకం సొమ్ము కానీ.
అనుమానం అంతరించనీ.
పిండిలో పంచదార లోపించినా ఫరవాలేదు. నీ పలుకులో తియ్యదనం లోపించ కూడదు.
మాట పడకూడదు. మాటను నిలబెట్టుకో. కామాన్ని ఖర్చయిపోనీ.
కాలాన్ని కాపాడుకో. నీకు స్నేహితుడు అవసరమా? లేనపుడు, ఇక శత్రువు మాత్ర మెందుకు? ఇద్దరినీ ఎగిరిపోనీ. దూరతీరాలకు తరలిపోనీ.
తప్పుచేస్తే ఒప్పేసుకో. అంతటితో బాధ తప్పిపోతుంది. ఒప్పుచేస్తే కప్పేసుకో. అంతటితో అసూయ అంతరిస్తుంది.
మబ్బులో జలముంది. మనిషిలో మంచి ఉంది. అందరికీ చోటివ్వు. జలాన్ని క్రిందికి దిగనీ. మంచిని పైకి రానీ.
నవ్వగలిగే నేర్పు ఉంటే బ్రతుకు నగుబాటు కాదు. నాణ్యమైన బాట అవుతుంది. నవ్వు..... నవ్వించు...... నిన్ను ఏడిపిస్తే, నవ్వించకు.... నవ్వేయి. వరదుని నుండి కరుణావరద ఎప్పుడో పొంగింది. ప్రవహిస్తోంది. మనకు సమీపంగా పరుగులు తీస్తోంది. మూత తీయకపోవడంలోనే మన బ్రతుకుకు వాత పడింది. **There is no opening in us for the Divine light........**
కాంతి పిలుస్తున్నా అశాంతితోనే కాపురమైంది. ఆవేదనే గోపురమైంది.
నా మాట విను
బయట పడితే లేవలేవు
లోనపడితే లేవ నంటావు
బయట లోపల పడకుండా ఉంటే,
లేచే పనుండదు; లేపే పనుండదు.

నీవు లేకుండా నీవు ఊరేగాలి

ఇదే నూతన సంవత్సర సందేశం
సువర్ణ సంవత్సర స్ఫూర్తి సందేశం
ఇదే జాతికి సౌజన్యం
ఇక వినిపించేది పాంచజన్యం!

సంక్రాంతి

ధనుస్సును వీడి మకరంలోకి సూర్యుని ప్రవేశం
దివాకరుని కది క్రాంతి. భువికి అదే సంక్రాంతి.

సంక్రాంతి శుభదినాన జలాలన్నీ నిర్మల గంగలే
విశ్వశాంతి ఉదయించిన జగత్తంతా ప్రేమల పొంగులే

ఆరిపోయేందుకు వచ్చేది కాంతి కాదు.
కాలక్రమణాన్ని సూచించేది సంక్రాంతి కాదు.

క్షణకాలమైనా వెలగదు పచ్చగడ్డి
వెలిగినా క్షణముండదు చిచ్చుబుడ్డి

కురుస్తున్నది వెలుపల పెద్ద మంచు
మంచిని మనసులో బుద్ధిగా ఉంచు

మల్లెలై పూయాలి మనసులు
మహర్షులై మెలగాలి మనుషులు

ఆ రోజే జగతికి క్రాంతి.....
ఆ రోజే జీవికి సంక్రాంతి.

మనసులో "మంచి" పూలు పూచిన రోజు
మనిషిలో శాంతిగాలులు వీచిన రోజు
సమతకు సమాజము చేతులు చాచిన రోజు
మనిషిని మనిషిగా మనుజులు చూచిన రోజు
ఏవార మడిగినా 'గురు' వారమేనని
శిష్యులందరు గుమిగూడి పలికిన రోజు
ఏ నోట విన్నా వేదమ్మ పలుకులు
నాదమై ఖేదమును తరిమిన రోజు
అదియే భువికి క్రాంతి...... అదియే బ్రతుకుకు సంక్రాంతి.

శాంతి శాంతి అంటూ చేసుకుంటున్నారు వాంతి
అలజడులు చేస్తూపోతే ఏనాడూ రాదు కాంతి

రంగవల్లులతో వాకిళ్ళు వెలిగిపోతున్నాయి
రంగని నామం కరువై వాక్కులు వెలవెల పోతున్నాయి.

ఏదిక్కడ సంక్రాంతి?
ఎప్పుడిక మనకు నిజకాంతి?

అంటరానితనము మంట కలిసిన దినము
ఇంటికి కరంటు కోత ఉండదనిన దినము
మాయల చదువులు మనిషి కబ్బని దినము
కట్టెలై కట్నాలు కాలిపోయిన దినము
అత్తలు అమ్మలై అగుపించిన దినము
అప్పువాని వలె అల్లు డుండని దినము
దానాలు శ్రమలుగా గోచరించని దినము
శ్రమలు దానాలుగా కనిపించని దినము
శాంతి భిక్షను పెట్టే సన్యాసి రాజు
భిక్షను శాంతిగా గుర్తించని రోజు
సమతా శంఖమును పూరించిన దినము
మానవతా జ్యోతిని వెలిగించిన దినము
అదియే నిజమైన సంక్రాంతి. అప్పుడే మనకు చెక్కు చెదరని శాంతి.

మొక్కవోని సంక్రాంతి నీ సంస్కృతి.
నేటి దేశ దుస్థితికి అదొక్కటే పరిష్కృతి

కల్లోల జగతికి అదే సరియైన వారధి
వారసుడవైన నీవు కావాలి సారథి

రాలినా పొగడలు పరిమళిస్తాయి
కాలినా కాగడాలు కాంతినిస్తాయి

బాధలు బరువులు ఒకవైపు ఉండనీ
బోధలో హృదయాన్ని నిండుగా పండనీ

అన్ని విద్యలలోన అధ్యాత్మమే గొప్ప
లేదేదీ ఇలలో ఆత్మకన్నా గొప్ప

రేకు లెన్ని ఉన్నా పువ్వు అద్వైతమే
కారణ మేదైనా నవ్వు అద్వైతమే
నేనని భ్రమించినా నీవూ అద్వైతమే
నువ్వని పలికినా నేనూ అద్వైతమే.

అద్వైతమే శాంతి..... అద్వైతమే కాంతి.
అద్వైత మెరిగిననాడే నిజమైన సంక్రాంతి.

అందాల చందమామ అందరికీ మామ
శ్యామ - శ్యామ అనుటే మనందరికీ సుషుమ

అరుదెంచాలి అన్నివైపుల శాంతి కిరణాలు
అగుపించాలి అందరికి శ్యామ చరణాలు
నిలవాలి మీ చుట్టు కాంతి వలయాలు
కావాలి మీ ఇళ్ళు శాంతి నిలయాలు.

ఇతరులను మార్చాలి అనుకోవటం తప్పు కాదు; మార్పు అంత అవసరమైతే. అలాగని, మార్చలేకపోతే మార్పురాకపోతే, దానిని మన అసమర్థత గానో, ఇతరుల అయోగ్యతగానో భావిస్తే మాత్రం సుఖం మిగలదు.

'మార్పు' అనే విషయంలో నిజంగా మనకు ప్రగాఢ విశ్వాసముంటే, అది ఇతరులకన్నా మన విషయంలోనే దివ్యంగా ఫలిస్తుంది.

'గిరిధారి' వైభవం*

బండి చిన్నదైనా పెద్ద పెద్ద బరువుల్ని మోస్తుంది.
చెట్టు పెద్దదైనా చిన్న బరువును కూడా మోయలేదు.
పెద్దతనం ఉండవచ్చు.
పరులను భరించే పెద్ద మనస్సు అందరికీ ఉండదు.
నిండు జాబిలిలా ఎందరో జీవితాలను పండించిన 'గిరిధారి' మాసపత్రిక, ఈ సంచికతో పదారు సంవత్సరాలను పూర్తి చేసుకున్నది. పదారు కళలతో గోవర్ధన గిరిధారి శోభించినట్లు, 'గిరిధారి' పత్రిక కూడా షోడశ కళా పూర్ణమై భాసిస్తోంది.

పెద్ద స్థాయి కలిగిన చిన్న పత్రిక గిరిధారి
చిన్న పెద్ద తేడా తెలియని వన్నె పత్రిక గిరిధారి
అన్ని హంగులున్న అందాల పత్రిక గిరిధారి
శ్రమతో పెరిగిన ఆశ్రమ పత్రిక గిరిధారి
అధ్యయనానికి అనువైన పత్రిక గిరిధారి
ఆదాయము లేని ఆదర్శ పత్రిక గిరిధారి
సంపాదనే ఎరుగని సిరిగల పత్రిక గిరిధారి
చేరిన వారిని దరి చేర్చే పత్రిక గిరిధారి
కైవల్య మొసగే కామాక్షి గిరిధారి
వాణీ విలాసాల మాగాణి గిరిధారి
నెల నెల కాసే చల్లని వెన్నెల గిరిధారి
నెల అంతా కాసే అసమాన కళ గిరిధారి
అంబర విభవాన్ని అవనికి దించింది గిరిధారి
భూమాత తలలో జాబిలిని తురిమింది గిరిధారి
అవని తలముపై తిమిరాన్ని తరిమింది గిరిధారి
తెలుగు గుండెలలో వెలుగులను నింపింది గిరిధారి
పదుగు రాడు మాట పాడియై ధరజెల్లు; నిజమో కాదో?
పదుగు రాడిన మాటలే ఈ పదారు పలుకులు.
నేల మారినా
నెలవులు తప్పినా
వత్సరాలు దొరలినా
నిరుత్సాహ మెరుగని నిత్య సౌందర్యవతి గిరిధారి
అపురూప కళావతి గిరిధారి

* ('గిరిధారి' పత్రిక 16 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భమున పూజ్య స్వామీజీ వ్రాసిన వ్యాసం)

గ్రంథాలు గుట్టలై పడుతున్నా ఆరని సిరాయే పత్రిక రక్తం
అవరోధాలు ఎదురౌతున్నా అవిద్య అంతం చూడా లనేదే తన పంతం
ఏది పలికినా, ఎలా పలికినా పద పదము వేదోక్తం
మాట కదిలినా, పాట కులికినా ఏదైనా అది ఋషిప్రోక్తం
పలికే పదాలతో
కులికే వాక్యాలతో
పాడే గీతాలలో
దోగాడే భావాలతో, - ఎక్కడ చూచినా, ఏది స్పృశించినా
వాక్యాలలో ఒదిగిన తియ్యని పలుకులే గాని
పలుకుల కొరకు కదిలిన వాక్యాలు లేని వేదాల ఒరవడి గిరిధారి
సరస రాగాల సవ్వడి గిరిధారి

మాసం మాసం
తీర్థంలా పోస్తూ ఉన్నా,
వర్షంలా కురుస్తూ ఉన్నా
అరగని గిరి గిరిధారి
తరగని సిరి గిరిధారి.
పొద్దుకు హద్దులు ఉండొచ్చు
బుద్ధికి హద్దులు ఉండొచ్చు
బ్రతుకుకు హద్దులు ఉండొచ్చు
భక్తికి హద్దులు లేవంటూ,
ముందే లేచి,
విందులు కూర్చి,
ముకుందుని ముందు
'వందే' అని మనసుంచి,
పదారు సంవత్సరాలు విసుగు లేకుండా చేసిన పాకం
విరామం లేకుండా సాగిన నిర్వాకం
ఏది మిగిల్చినా, అది ప్రసాదం
ఏది చిలికించినా అది అమృతం.
కలవరం లేని కరతలంలో ఏది పడినా కనికరమే. మునివరమే.

తల్లి పాలకై తపన

మీకు ఆరోగ్యం ఎలా ఉంది? అంటే,

యావత్తు (్య) పోయింది. ఆరోగం(ఆరోగం) మిగిలింది అన్నాడట ఒకాయన.

నిజమే. అంతా పోయినా, చింత మాత్రం పోదేమో! ఇంతకీ ఎందుకు ఈ చింత? ఈ ప్రపంచంలో జరిగేదంతా పరమాత్ముని లీలా ప్రదర్శనమే.

తీరుబడి ఉందని విలాసంగా గారడిని వీక్షిస్తుంటే, మంచానపడి మగ్గక తప్పదు. మన్నులో దూరి మరుగున పడక తప్పదు.

మాయను వీక్షించడం మానాలి. మహిమను దర్శించడం అలవరచుకోవాలి. ఆరాటాలు, పోరాటాలు అనవసరం.

తల్లిపాలకై తల్లడిల్లడమే పాపకు తెలుసు. పాలిండ్లెక్కడున్నాయో పాపకేమి తెలుసు? బిడ్డ తలను పట్టుకొని నోటికి చన్ను అందించేది తల్లే కదూ!

తండ్రీ! నీవే నా తల్లివి.

నీ ఒడిలో పడుకోవడమే నా నడవడి. నీ ఒడియే నా గుడి. అదియే నా బడి. నా ఆక్రందనలే గుడిగంటలు. నా అశ్రువులే అభిషేక జలాలు. ఏడుపే నా వేడికోలు.

గట్టిగా ఏడ్చే శక్తిలేని బిడ్డలు మధ్యలో ఆపి, స్తనా లెక్కడున్నాయా? అని తడుము కుంటున్నారు.

తండ్రీ!

నేను అలాంటి బిడ్డను కాను. బాధలు నాకు బరువులు కావు. కష్టాలు నాకు క్రొత్తవి కావు. ఏడుపులో నాకు వేడుక గోచరిస్తుంది. ఎంతసేపైనా ఏడుస్తాను. ఎంత సేపైనా ఏడ్చే శక్తి నాకుంది. అసలు ఏడుపే నా శక్తి.

క్షీరమెక్కడుందో నాకు తెలీదు. జ్ఞానక్షీర మెక్కడ లభిస్తుందో నాకు అర్థం కాదు. అర్థంకా నవసరం కూడా లేదు. దగా చేయని దానశీలివి నువ్వు. మారాం చేసి అందుకొనే బిడ్డను నేను.

నాకు ఓటమి తెలియదు. అలాగని నాది గెలుపూ కాదు.

మురళితో స్నేహం - మున్ముందు సోఽహం

ముకుందుని ముద్దులను మూటగట్టే మోహన మురళి
మూగదైనా ముల్లోకాలను మురిపించే మనోహర రవళి

పలుకు నేర్చిన మురళి కులుకు నెరుగదు
భవ్యమైన జ్ఞాని భాష నెరుగడు

నిండు కుండకు లేదు శబ్దం
పండిన బ్రతుకుకు లే దనర్థం

ఎదురులేని నాదాన్ని యెదలో నింపుకున్న వెదురు కొయ్య
విశ్వమోహనుని చేతిలో నిలిచిన వేణువయ్యె!

గాలికి వలపుందని
స్పర్శకు తలపుందని...... తెలిసిన మురళి
సిగ్గుతో గలగలమని
ఏరులా సాగుతుంది
సిగ్గు విడిచి సరిగమ యని
సిగ్గు తొడిగి పదనిస యని పరుగులు తీస్తుంది

ఊదినంతసేపే ఊరేగింపు
ఆపగానే అంతా నిశ్శబ్దం.... అదే **కేవలం**

తనలో తనకు లేరెవరూ అడ్డు
కాదెన్నడూ తా నితరులకు గడ్డు

పయనిస్తుంది ఖాళీ లోనే గాలి
ఆ పయనం లోనే రాగాల ఖేలి

తనలో తాను ను చూసిన మురళి
తన్మయత్వంతో ఆడింది తేలి

నీవు ఖాళీగా ఉండు
కన్నయ్య నీలో ఉండు..... అని తెలిపే మురళి
లోన ఉన్నదంతా ఖాళీ

తనువంతా వేణువుకి కలుగులే
అవన్నీ సప్తస్వరాల తళుకులే

వెన్నుని చేతికి చిక్కిననాడు
ఇంద్రియ మనోబుద్ధులకు నలుగులే
సమర్పణలో మెరిసిన వెలుగులే

ఇది మురళీమాత సందేశం
జీవు లందరికి జనని ఉపదేశం

వచ్చేనాడు తెచ్చింది లేదు
పోయేనాడు వచ్చేది కాదు

కాలంలో తెలిసే **కల్ల జీవితం**
చివరికి మిగిలే **తెల్ల కాగితం**

ఖాళీలోనే ఖేలి
శూన్యంలోనే పూర్ణం

ఊదక మునుపు ఏదీలేదు
ఊది నిలిపితే ఏదీ మిగలదు

ముందు వెనుక ఒకటే విందు
మధ్యలోనే మదితో పొందు
చిత్తము పంచే చేదు మందు

నడుమ నిలిచింది నిజము కాదు
ఆద్యంతాలలో పూర్ణము మారదు...... కనుక
పూర్ణమేవావశిష్యతే అని పలికే వేణువు
ముముక్షువుల పాలిటి కామధేనువు

ఉల్లిపువ్వు లెన్నయినా
ఒక్క మల్లెపువ్వుకు సరియౌనా!
వెలవెలపోవు వెలుగులు
వెలుగుతేడుకు సరియగునా!



మారే రూపం కాదు అపురూపం
అరూపమే అ(పు)రూప సుందరం
ఆనంద మందిరం
ఆ(ంత)ర్య నందనం

మారని దానిని మనసుకు చెప్పి
తీరని దప్పికను దయతో తీర్చి
ఆరని వెలుగును అందించిన మురళి
జీవుల పాలిటి చల్లని తల్లి

దాహం తీర్చే **మురళితో స్నేహం**
అందిస్తుంది మనకు **మున్ముందు సోఽహం**


మురళి ముందు
ముకుందుడు మున్ముందు


మురళి కావాలి మనము
తరువాత మనదే తేజము


నాకు మనసు ఉంది. నేను మనస్సును కాను. ఈ వాస్తవం వంటబట్టని కారణంగా మనోకల్పితాలు నావిగా, నేనుగా తెలిసి, మనస్సు ఏమిటో నేనేమిటో అర్థం కాకుండా పోతోంది. ఈ కారణం చేత మనో బాధల్ని నేను మోయలేక, నేనెవరో మనస్సుకు అర్థం గాక అంతా అయోమయంగా ఉంది.

ఏది ఏమైనా, మనస్సు నీ అధీనంలో ఉండి నీకు సహకరిస్తూ ఉపకరిస్తే లోటు ఉండదు. నీవు మనస్సు చేతికి చిక్కితే ఆ తరువాత బ్రతుకు బుసకొట్టినా, నస పెట్టినా దానికి కారణం మనస్సే అయి ఉంటుంది.









గురుపూర్ణిమ

పూర్ణము శూన్యము నెరుగదు.
శూన్యానికి పూర్ణము తెలియదు.

పూర్ణం కావాలని అందరికీ ఆశ. పరిపూర్ణం కావాలని ఒకటే ఆశ.
పూర్ణం కావాలా! పూర్ణమై శోభించాలా!
అయితే గురువును చేరు. మారుతుంది బ్రతుకు తీరు.

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు

తల్లిని మరిపిస్తుంది ధేనువు. తల్లిదండ్రులను మరిపిస్తాడు గురువు
గడ్డి తిని పాలిచ్చేది ధేనువు. కన్నీరు మ్రింగి పన్నీరు చల్లేవాడు గురువు
అలాగని, గురువులు ఆవులు కారు; కవులు; క్రాంతదర్శులు.

ఒక కవిగారిని ఎవరో ఆంగ్లంలో అన్నారట "మీరు కవ్స్" (**Cows**) అని.
"అందుకే పాలిస్తున్నాం" - ఠపీమని జవాబు చెప్పేశాడట కవిగారు.

గాలి నిచ్చేది తరువు
జాలి చూపేది గురువు
ఆశించదు దేనినీ తరువు. ఆశ లెరుగనివాడు గురువు.
ఎండుతూ నీడ నిస్తుంది తరువు. శ్రమిస్తూ సుఖాన్ని పంచేవాడు గురువు.
కొట్టినా ఫలాల నిస్తుంది తరువు. చీదరించుకున్నా చేరదీస్తాడు గురువు
ఫలాల పంపకం తరువుది. మోక్షఫలాల సంతర్పణం గురువుది.

జలపూర్ణము చెరువు
ప్రేమ పూర్ణుడు గురువు
దాటిపోదు జలము చెరువును. వదలిపోరు శిష్యులు గురువును.
మేను చల్లబడుతుంది దిగితే చెరువులో. మనసు శాంతిస్తుంది రమిస్తే గురు బోధలో.
చెట్లని పెంచేది ఎరువు

శిష్యుల్ని పెంచేది గురువు
అవని లోపలే ఎరువు. అవలోకిస్తేనే గురువు

దేవ గురుడు బృహస్పతి
గురుదేవు డెప్పుడూ సరస్వతే

గురుసన్నిధిలో

ఉన్నవాళ్ళూ అనుభవిస్తారు
లేనివాళ్ళూ అనుభవిస్తారు
గురువు ఉన్నవాళ్ళు అనుభవించేది ఆనందం
గురువు లేనివాళ్ళు అనుభవించేది దుఃఖం

గురువైభవం

రవిరాజు చూపలేనిది
సురరాజు చూడలేనిది
గురురాజు నిలయం
నటరాజు ఆలయం
మాటలు పోలవు గురుమహిమను పలుకుటకు
కన్నులు చాలవు గురుమహిమను చూచుటకు.

గురుకృపతో

గుండెల్లో తాపాలు తొలగుతాయి
గుడిసెల్లో దీపాలు వెలుగుతాయి

గురుసేవలో

పరువుపోదు. కరువురాదు.
కనుకనే,
అందరికీ పండుగలెన్నో అయితే
గురుబిడ్డ లందరికీ ఒకే పండుగ
అదే గురుపండుగ
శిష్యుల హృదయాల నిండుగ.

గోపీ ప్రేమ

పాటరాని వాడు

ఏడుపు తెలియని వాడు - ఈ ప్రపంచంలో ఉండడని ప్రతీతి.

స్పందనతో కదిలేది రాగసాధన

రోదనలో మిగిలేది జీవి వేదన.

పుట్టుకలో దుఃఖమూ ఉంది, సుఖమూ ఉంది. పుట్టగానే బిడ్డ ఏడ్వటం జరుగుతుంది. ఆ ఏడుపును విని అందరూ ఆనందించటమూ జరుగుతుంది.

బిడ్డ కేకలో

ప్రసవంలోని ప్రమాద భరిత బాధా ఉంది.

విముక్తి లోని ప్రమోదయుత సుఖమూ ఉంది.

కనుకనే,

రాగంలో రోదన, రోదనలో రాగం మేళవింపబడిన మానవ జన్మను కడతేర్చే సాధనలు కూడా రాగ రోదనలే. అవే వేదనా భరిత నివేదనలు. విరహ వేదనలు.

బాధల గీతాలు

బోధల గీతాలు

భక్తుల తాపాలు

పరితాపాలను తొలగించే ప్రకృతి మాత చనుబాలు.

భాగవత మంతా ప్రేమ పాలే.

ప్రేమకు ఒక ప్రత్యేకమైన భాషలేదు.

ప్రేమ అందుకనే చల్లగా ఉంటుంది. ఒకొక్కసారి వేడిగా మారుతుంది. మరొక్కసారి ఆ వేడితో వడి తోడవుతుంది. సవ్వడి చేస్తుంది. ప్రపంచాన్ని కట్టడి చేస్తుంది. ముందు వెనుకలు చూడకుండా ముట్టడి చేస్తుంది. మాట కొట్టొచ్చినట్టున్నా, అట్టడుగున ప్రేమ జున్నే ఉంటుంది. అదే ప్రేమ. గోపీ ప్రేమ. ఆ ప్రేమే విరహమై విలపిస్తే గీతం అవుతుంది. ఈ గీతాలే భాగవతంలో గోపికల విరహ గీతాలు.

భాగవతంలో ప్రధానంగా రెండు విరహ గీతాలున్నాయి. ఒకటి గోపికా గీతం. రెండవది భ్రమర గీతలు.

అది బృందావనం.

ప్రేమవనం.

అక్కడ ప్రేమే జీవనం.

ప్రేమకు కూడా భాష ఉంది. ఆ భాషకు శబ్దం లేదు. కాని ప్రేమ శబ్దం చేస్తుంది. గుండెలో చప్పుడు చేస్తుంది. గుండె శబ్దము అదేనేమో!

భావ జగత్తులో ప్రేమ ఆరని దీపం.

దాన్ని అందరూ చూడలేరు. ప్రేమ భావాలు అందరికీ అంత తేలిగ్గా పట్టవు.

భావాన్ని గ్రహించేందుకు హృదయమే నిఘంటువు.

ప్రేమ లేకుండా పెడితే మనసు కుంచుకు పోతుంది.

ప్రేమతో కొడితే హృదయం తేలిక పడుతుంది.

గౌరవాన్ని ప్రకటించటానికి 'తమరు' అనాలి.

ప్రేమను చూపేందుకు 'నీవు' అంటే సరిపోతుంది. సిరి గల ప్రేమ అలా సరిపెట్టు కుంటుంది.

శుష్క పాండిత్యాలకు శూన్య హృదయాలకు ప్రేమ జీర్ణం కాదు.

ఆహారము లేకపోతే కొంతకాలం బ్రతకవచ్చు.

నీరు లేకపోతే ఎంతో కొంతకాలం జీవితాన్ని సాగించవచ్చు.

ప్రాణం లేకపోతే క్షణం కూడా మనుగడ కొనసాగదు.

కాని, ప్రాణం కన్నా ప్రేమ గొప్పది. అందుకే ప్రాణం కన్నా ప్రేమనే ఎక్కువగా గోపికలు ప్రేమించారు. తమ ప్రాణాల్ని సైతం ప్రాణనాథుడైన గోపాలుని కొరకు చలింప చేశారు.

అయిదు వేళ్ళు ఒకే రీతిగా లేవు, కాని ఒకే చేతిలో ఇమిడి ఉన్నాయి.

ఒకే పనిని చేస్తున్నాయి.

గోపికలూ అంతే.

వారిది ఒకే భావం.

ఒకే హృదయం.

ఒకే బాట. ఒకే పాట.

అందుకే, గోపికలందరు కలిసి పాడిన పాటలు గీతాలు కాకుండా 'గీతం' అని ఏకవచనంగా కీర్తింపబడ్డాయి. అదే గోపికా గీతం.

భాగవత సాగరంలో లభించిన అమృతభాండం.

రాస పంచాధ్యాయిలో ప్రాప్తించిన అమర నాదం.

గోపికల మధ్య శ్రీకృష్ణుడు అంతర్హితుడు కాగానే కృష్ణగతచిత్తులైన గోపికలు విరహవేదనను భరించలేక విలపించారు. ప్రేమతో గీతాలు ఆలపించారు. అవే 'గోపికాగీతం'గా, భక్తుల పాలిట కల్పవృక్షంగా కీర్తింపబడ్డాయి.

ఇక్కడ గోపికల గొంతులు అనేకము.

కాని, గానం ఒక్కటే.

భావ మొక్కటే.

బాధా ఒక్కటే.

పదాలు వేరు. పదార్థ మొక్కటే.

వివరణలు వేరు. విషయ మొక్కటే.

అందరి గుండెలు ఒకేలా కొట్టుకుంటాయి.

తాళ స్వర సమ్మేళనంలో అనేక వాద్యాలు ఒకే లయతో ధ్వనించునట్లు, గోపికల హృదయాలు ఒకే ప్రేమతో పలవరిస్తాయి. పలకరిస్తాయి. పరవశిస్తాయి.

మిఠాయి లన్నిటిలో తీపొక్కటే ప్రధానము.

గోపిక లందరిలో కృష్ణుడొక్కడే ప్రాముఖ్యము.

గోపికలకు ఉపదేశాలు తెలియవు.

సందేశాలు అర్థం కావు.

కర్తవ్యాలు కనిపించవు.

సాధనలు వినిపించవు.

వారి ప్రేమలో నియమాలు నిలవవు. సమయాలు తెలియవు.

మనస్సు మూగబోగా బ్రతుకు పిచ్చిదై పోతుంది.

కనుకనే, భాగవతంలో శుకబ్రహ్మ

'కృష్ణాన్వేషణ కాతరాః - తదాత్మికాః - గోప్యః ఉన్మత్తవచః'

కృష్ణుని కొరకు వెదికి, వెదికి వేసారి దిగులు చెందిన గోపికలు కృష్ణగత చిత్తులై పిచ్చి మాటలు పలికారు అన్నాడు.

అవును. అవి పిచ్చి మాటలు.

ప్రేమ పిచ్చి మాటలు. పిచ్చి పాటలు. ప్రేమపిచ్చి పాటలు.

మధురలో గోపాలుడు
రేపల్లెలో గోపెమ్మలు - మధ్యలో
తగుదునమ్మా అంటూ ఉద్ధవుడు.

కాంతల కమనీయ చెక్కిళ్ళు
నిండినవి కడగళ్ళ వడగళ్ళు

ఉన్ననాడు తెలియదు ఉన్నదెవరో
లేనినాడే తెలియు లేని దెవరో!

ఉన్న వెందుకు ఉన్నది లేనినాడు
లేని దానిని తెలుపుతూ ఉండునేమో!

బాధలు బోధలను ప్రసవించుచుండగా
విద్య లెందుకు వనితలకు వింతగాని

వలచి విలపించువారలె వసుధలోన
నయన జలములె నిజమైన సుధలు గాన

అసమానులు తరచు అహంకారులె గాన
సర్వ సామాన్యమై ప్రేమ పరిఢవిల్లె

కలతను రానీక మమతను పోనీక
హృది గడపపై కాపుర ముండు ప్రేమ

చెవిటిది ప్రేమ మరొకటి వినలేదు
గ్రుడ్డిది ప్రేమ వేరొకటి చూడలేదు.

నవ్వించాలని ప్రేమ నీ ముందు కొస్తుంది
కవ్వించాలని ప్రేమ కనుమరు గవుతుంది.

భువిని ప్రేమ పాలిస్తుంది
దివిని ప్రేమ గాలిస్తుంది.
గాలిలా గగనంలో తిరుగుతుంది.
గాలి లేని చోట జాలి తానే నంటుంది.
అట్టి ప్రేమ
మధురలో మకాం పెడితే,
మగువలు మనసుతో నిలదీస్తున్నారు. రాగాలు తీస్తున్నారు.
అవియే భ్రమర గీతలు. భామల ప్రేమ వ్యంగ్యములు.
గోప భామల ఉత్ప్రేక్ష వ్యంజనములు.

(వి) రామం *

ఎవరెలా పోతున్నారో ఎవరికీ అర్థంగాని ఈ ప్రపంచంలో మరొకరు ఎలా పోతున్నారో, ఎందుకు పోతున్నారో తెలుసుకోవాలని ఉబలాట పడటం అందరికీ మోజు; ఈ రోజుల్లో.

స్వామీ! ఫిబ్రవరి ఐదవ తేది నుండి ఒక పక్షం రోజులు మీరు అజ్ఞాతంగా తపస్సులో ఉంటారని వింటున్నాము. ఎందుకని? కారణమేమిటి? దేనికొరకు?... ఇలా ఎన్నో ఉత్తరాలు. అన్నిటికీ ఒకే ప్రత్యుత్తరం.

బాబూ! వెళ్తున్నా! నిజమే! చెప్పనా ఎందుకనో! విను.

పుట్టగానే నవ్వే పువ్వులా
పలకరించే దెలాగో, ప్రకాశించే దెలాగో - తెలుసుకోవాలని పోతున్నా!

ఉప్పునీటిని త్రాగి మంచినీటిని ఉమ్మే
ఉరుముల మేఘం ఉరములో
ఊరేగే సౌందర్యాన్ని చూడాలని........................... పోతున్నా!

కలువ ఎదలోని సుగంధాన్ని
కుసుమ పాదలోని సౌరభాన్ని
తేలికగా మోసే గాలి హస్తాలతో
కరచాలనం చేయాలని.................................. పోతున్నా!

కాల్చినపుడు కలత చెందక
పూర్వం కన్నా కమ్మని వాసన నిచ్చే
కర్పూరంలా వెలిగే దెలాగో -తెలుసుకుందామని............. పోతున్నా!

విరామ మెరుగకుండా శ్రమించిన కలంలో
ఇంకా ఎంత "ఇంకు" మిగిలి ఉందో చూడాలని............. పోతున్నా!

వచ్చేవారికి స్వాగతం పలుకుతూ
పోయేవారికి వీడ్కోలు చెబుతూ
పగలంతా వగలతో అలసిన వాకిలికి
తలుపు మూసి విశ్రాంతి నిచ్చే దెలాగో వినాలని............. పోతున్నా!

*పూజ్య స్వామీజీ 1996, ఫిబ్రవరిలో ఏకాంతానికి వెళ్తూ వ్రాసినది.

ఎండలో మండుతున్నా
ఎదలో చల్లదనాన్ని దాచుకున్న
చందన వృక్షానికి చదువు నేర్పిందెవరో
అడగాలని.. పోతున్నా!

సేవా సుమాలను విరివిగా అందించే
ప్రేమ మొక్కకు మంచి నీరు పోయాలని..................... పోతున్నా!

శాంతి వెలుగును విరజిమ్మే జ్ఞానదీపానికి
తపోతైలాన్ని నింపాలని................... .... పోతున్నా!

ఆకలితో అలమటించే కుక్షిలా
అచ్యుతుని దర్శించాలనే అక్షికి
మంగళస్నానం చేయించాలని............................. పోతున్నా!

గుండె గుడిలో కొలువైన కొండదేవుడికి
సంకల్పహారతిని సమర్పించాలని........................... పోతున్నా!

సద్దుమణగే వేళ సరిహద్దు ఎక్కడో
శుద్ధి పడిన బుద్ధిని అడిగి చూద్దామని..................... పోతున్నా!

భగ్గుమని భాస్కరుడు మండిస్తున్నా
గుండెను ఎండిస్తున్నా
పిలిచినందుకు మేఘం పలుకుతుందని
వలచినందుకు వర్షం పడుతుందని
ఆశతో ఎదురుచూచే అవని తల్లి
ఆలపించే పాటాల్ని ఆలకించాలని......................... పోతున్నా!

గంధాన్ని విస్మరించి మంచిని స్మరించేలా
మంచిగంధాన్ని స్పృశించాలని............................ పోతున్నా!

అవగాహనా దాగలిపై సహనమనే షరాపు
జ్ఞానమనే సమ్మెటతో బ్రతుకు నెలా కొడుతాడో-చూద్దామని.. పోతున్నా!

కావు కావు మంటూ తెలవారక ముందే
తన మాట వినిపించిన కాకికి
కనకాభిషేకం చేయాలని.................................. పోతున్నా!

'కుహూ-కుహూ' అంటూ
కోమల స్వరముతో వీనులకు విందు చేసిన కోయిలమ్మకు
కీర్తికిరీటం పెట్టాలని.. పోతున్నా!

కావు కావు అన్నది కాకి
ఈ ప్రపంచంలో
సంపదలు శాశ్వతం కావు
పదవులు శాశ్వతం కావు
ఇళ్ళు శాశ్వతం కావు, పెళ్ళిళ్ళు శాశ్వతం కావు
ప్రేమలు శాశ్వతం కావు, భామలు శాశ్వతం కావు
ఆరోగ్యాలు శాశ్వతం కావు
ఆనందాలు శాశ్వతం కావు
ఇలా పలికిన కాకి మాటలు
వేద గుళికలు, పురాణ పలుకులు.
ఈ సత్యాన్ని గ్రహించలేక
కాకి కూతలని కొట్టివేసే సగటు మనిషి ఎదుట
కాకిని కూర్చోబెట్టి సన్మానం చేయాలని........................ పోతున్నా!

కుహూ-కుహూ అంది కోయిల
అరుణోదయ వేళ ...... అదిగో
ఓహో ..... అదిగో ప్రకృతి వైభవం
అహో ..... అదిగదిగో పరమాత్మ ప్రాభవం - అంటూ
తహతహలాడే గుండెతో
మహోత్సునిలా గళం విప్పి
కుహూ-కుహూ అని స్వరం విప్పిన కోకిలమ్మకు
కోవెల కట్టాలని,
'కో' అంటే కోటిమంది కదిలొచ్చే కోకిలమ్మ స్వరాన్ని
పాంచజన్యంలో నింపి
ప్రపంచం ముందు ఉంచాలని, ప్రజల చేతికి పంచాలని, పట్టించాలని-పోతున్నా!
ఎవరెలా పోతున్నా, ఏదెలా వస్తున్నా
తనదారి తనదేనంటూ
ఏదేకంగా సాగిపోయే కాలానికి
కడియాలు తొడగాలని - నా
కాళ్ళను ఇక ఆ వైపు కదిలించాలని............................పోతున్నా!

గూటి చిలుక గూటికి పరిమితమా?
గూళ్ళు ఎన్ని తయారైనా గువ్వ గగనానికే
గుర్తు తెలియని గమనానికే.

శ్రమలు పక్షికి లేవు. ఆశ్రమాలు ఋషికి లేవు.
ఈ సత్యాన్ని మననం చేసుకొనేందుకు
మనసును సరిచేసుకొనేందుకు.......................... పోతున్నా!

కొలంబస్ అమెరికాను
మార్కొని రేడియోను
గ్రహంబెల్ టెలిఫోనును
రైటు సోదరులు విమానాన్ని - కనుగొంటే
ఏదీ కనిపెట్టలేని నేను
నన్ను నేను కనుగొంటామని
అలాంటి కన్ను - కొంటామని.......................... పోతున్నా!

చనిపోయేవారే అందరూ ఈ ప్రపంచంలో
చని వచ్చేవానిగా తయారవ్వాలని.......................... పోతున్నా!

మునినై తిరిగి రావాలని
పనిగట్టుకొని మరీ పోతున్నా
ఏమని ప్రశ్నించే సమాజ ప్రకృతికి
ఆమనినై శోభించాలని.......................... పోతున్నా!

పిలుపు వచ్చింది గనుక పోతున్నా
తలపు వచ్చి కాదు......
కొలువు చేసేందుకు పోతున్నా
కొలువు చూసేందుకు కాదు........
ఇది మేలుకొలుపని పోతున్నా
మేలైన కొలువని.......................... పోతున్నా!

ఒడ్డు చేరే నాకు అడ్డురాకు
పోనీ నన్ను ముందు
ఉందిలే నీకు మున్ముందు
కళ్ళను తడిపే కనువిందు
మువిపర్యుల మాటల విందు
పాటల పసందు
ముక్తికి పొందు.......

శెలవు.

లయకర్త ఆలయం

ప్రాకి ప్రాకి చీమ చేరును పారము.

ఎగుర నేర్వని పక్షి చేరుటెపుడు?

అందుకే,

"సాధనమున పనులు సమకూరు ధరలోన" అని అన్నాడు వేమన.

వేమన మల్లనలు, తిమ్మన తిక్కనలు ఎన్ని చెప్పినా, మన మేమిటో, మన దేమిటో తెలిసిన రోజే బ్రతుకంతా తెల్లన. మనసంతా చల్లన.

బిచ్చమెత్తే ప్రభువు కన్నా, బిచ్చమును దానం చేసే బిచ్చగాడే వాస్తవానికి మిన్న.

కయ్య పండినంత మాత్రాన కడుపు నిండాలని ఎక్కడుంది?

ఉన్నది మనది కాదు; పొట్టలో పడేది మనది.

పెట్టుకున్నది మనది కాదు, పరులకు పెట్టుకున్నది మనది.

ప్రక్కన పెట్టుకున్నది మనది కాదు; ప్రక్కవారికి పెట్టింది మనది.

ఏదీ పెట్టకపోయినా చీవాట్లు పెట్టటమే అలవాటు కొందరికి.

అట్లు తినటం కన్నా చీవాట్లు తినటమే హాయి మరి కొందరికి.

పైరు పెట్టేవారు కొందరైతే, పోరు పెట్టేవారు మరికొందరు.

నారు పెట్టేవారు కొందరైతే, నీరు పెట్టేవారు మరికొందరు.

పని పెట్టేవారు కొందరైతే, పని పట్టేవారు మరికొందరు.

పెట్టి చూచేవారు కొందరైతే, చూచి పెట్టేవారు మరికొందరు.

అడిగడిగి తినేవారు కొందరైతే, అడుక్కు తినేవారు మరికొందరు.

కడుపుకు అన్నం పెట్టేవారు కొందరైతే, కొంపకు కన్నం పెట్టేవారు మరికొందరు.

ఏది ఏమైనా

పట్టేవా డుంటేనే పెట్టేవాడు ఉంటాడు.

పెట్టేవాడికి కీర్తి కిరీటం పెట్టేవాడు పట్టేవాడే.

మాతా! భిక్షాందేహి!

అక్షయ పాత్రను పట్టి అన్నం పెట్టమని అడుగుతాడు యాచకుడు.

అదెంత గొప్పో? కాకపోతే,

యతివరేణ్యుడు యాచకు డెందు కవుతాడు? గురువై యుండి గుమ్మం వద్ద గుర్తు లేనివాడిగా ఎందుకు నిలుస్తాడు? పళ్ళెం నింపుకోలేనివాడు పబ్బం గడుపుకోవటమా? అదెంత సుఖమో!

భిక్షాన్న మాత్రేణ చ తుష్టిమన్తః

భిక్షాన్నము భుజించి తృప్తి చెందుతాడట నిత్యతృప్తుడైన భిక్షువు. ఇదెక్కడి సంప్రదాయమో? ఎవరి సంప్రదాయమో!

ఇంకెవరిది? ఆదిభిక్షువు సంప్రదాయమే. ఆది గురువు సదాచారమే.

కాకపోతే,

కైలాసపతికి కడుపే కైలాసమా! లేకపోతే, ఎందుకొచ్చిన భిక్షాటన?

పేరేమో లోకేశ్వరుడు - ఏం లాభం?

లోకుల కందరికీ లోకువే. లోగడ జరిగిన రగడ ఒకటి చెప్పనా?

అనగనగా ఒక కవి. పుట్టిన కవల పిల్లలలో రెండవవాడు. మొదట పుట్టింది దారిద్ర్య సహోదరి.

ఒకనాడు కవిగారు రాజుగారి వద్దకు వచ్చాడు. "ఏం కావాలి? కోరుకో కవీశ్వరా?" అనే రాజుగారి సంబోధనకు పరవశించి, కవిని పడేసి ఈశ్వరు డయ్యాడట.

అర్థం దానవ వైరిణా గిరిజయాప్యర్ధం శివస్యాహృతమ్
దేవేత్థం జగతీ తలే స్మర హరాభావే సమున్మీలతి
గంగా సాగర మంబరం శశికలా శేషశ్చ పృథ్వీతలమ్
సర్వజ్ఞత్వ మధీశ్వరత్వ మగమ త్త్వా మ్మాం భిక్షాటనమ్ ॥

"జనేశ్వరా! ఏం చెప్పను? ఈశ్వరుని అర్ధ శరీరాన్ని విష్ణువు గ్రహించాడు. మిగిలిన అర్థం వ్యర్థం గాకుండా అర్థాంగి ఆక్రమించుకుంది. హరహరా! శివుడే లేనపుడు మేమెందుకు? అని భావించి గంగమ్మ పుట్టింటికి చేరిపోయిందట(సాగరం). ఇరుగు పొరుగు లేనపుడు ఇందుండి ఏమి లాభం అని ఇందుడు (చంద్రుడు) నింగి కెగిరాడట. ఇక శేషుడంటారా? "పుటుక్కు జరజర డుబుక్కు" జరజర మని జారి నాగలోకానికి చేరాడు. ఆయనకున్న సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం, ఈశ్వరత్వం తమరిని ఆశ్రయించాయి. ఇక మిగిలింది భిక్షాటనమే గదా? అది నన్ను వరించింది" అని చెప్పకనే తన దారిద్ర్యాన్ని చెప్పి, యాచించకనే శివుని అడ్డంపెట్టుకొని ఆడవలసింది ఆడాడు.

ఎవరు ఏ ఆటలు ఆడినా అది నర్తన సుందరుని నటరాజ మందిరంలోని పదలయలే. తిరిగి లయకర్త ఆలయాన్ని చేరే పదనిసలే.

ద్రవిస్తేనే దైవం

అద్దము చాలా అందంగా ఉంటుంది.

అందరూ ఆనందంతో చూచేలా ఉంటుంది.

అద్దం ఏమి చూపెడుతుంది? ముందు నిలిచిన దానిని తప్ప.

అద్దంలో ఎవరికి వారే కనిపిస్తారు. అద్దం చేయగలిగింది, చేయవలసింది అంతే.

ఎప్పుడో చేస్తాం - చూస్తాం అనుకొనేవారు ఏదీ చేయలేరు. ఏ వైభవం చూడలేరు.

If we don't see now, tomorrow we will be the same.

నేడు చూడలేకపోతే రేపు కూడా చూడలేనివారు గనే మిగిలిపోతాము.

గతంలో చీకటి ఉండిందని వర్తమానాన్ని అంధకారంతో నింపుకోకూడదు.

సూర్యోదయమైంది. పద్మం వికసించింది.

గడచిన రాత్రంతా వికసించేందుకు పద్మం ఎంతగా ప్రయత్నించిందో తెలుసా? కనుకనే ఉదయాన వికసించింది.

మన హృదయపద్మం వికసించిందా? ఇది జరుగనపుడు ఎంత కాలం ఊరేగితే మాత్రం ఏం ప్రయోజనం?

విరబూసిన పద్మమే సుగంధాన్ని విరజిమ్ముతుంది.

విమలమతులే విశ్వానికి శాంతిని వితరణ చేస్తారు.

రాయి కదలదు.

నీరు నిలువదు.

ఉన్నచోటే ఉంటుంది రాయి. ఊరేగుతూ ఉంటుంది జలం.

నీవు ద్రవిస్తేనే ఇతరుల్ని స్పృశిస్తావు.

ఇలా జీవించాలి అని తెలిపేందుకే కదిలే నీరు కదలని రాయిని స్పృశించి ముందుకు పోతుంది.

నీవూ కరిగిపో.

ఘనం ద్రవీభవిస్తుంది. సంశయం అవసరం లేదు.

కొయ్య కరుగుతుంది. రాయి కరుగుతుంది.

మబ్బు కరుగుతుంది. మాయ కరుగుతుంది.

అది సాధ్యం కాదంటావా?

పోనీ, ఏది సాధ్యమో చెప్పు.

కరుగుతూ కదలటం ఒక కళ. కరగలేకపోతే ఉన్నచోటే ఉండటం కూడా కళే.

నేను కదలలేని బండను అంటుంది రాయి.

కాని,

అదే రాతిలో అందాన్ని చూస్తాడు శిల్పి.

బండల్లో గుండె చప్పుళ్ళను వింటాడు అక్షరశిల్పి.

సెలయేళ్ళలో సరిగమలు వినేవాడు కవి.

రాళ్ళలో రాగాలను ఆలకించేవాడు శిల్పి.

కవి ఎవరో కాదు.

శిల్పి మరెవరో లేడు;

కవివి నీవేనని ఓ క్షణాన నీవే తెలుసుకుంటావు చెవి పెట్టి.

శిల్పివి నీవేనని ఓ నిముషాన నీవే గ్రహిస్తావు మనసు నిలిపి.

రాతికి శిల్పి అందాన్నిచ్చాడా? కాదు. వికారాన్ని తొలగించాడు.

కఠినమైన వస్తువులో దాగియున్న కోమలత్వాన్ని బహిర్గతం చేశాడు.

బ్రతుకు బజారులో పడి మనిషి ఎంత బండగా మారిపోయాడో!

బండబ్రతుకుల్లో భవ్యమైన అందం నిక్షిప్తమై ఉందని తెలుసుకుంటే చాలు.

భారం తొలగుతుంది. దూరం తగ్గుతుంది. పారం పారిపోగా అపారం సారమై మిగుల్తుంది.

కాకపోతే,

"నేను బండను" అని అంగీకరించే మనిషి

"నేను శిల్పిని" అని అంగీకరిస్తే సరిపోతుంది. సిరి వస్తుంది. అమృతం కురిపిస్తుంది.

ఇక్కడే

అంతఃకరణ అలలతో ఆడుకుంటుంది.

చిత్తము పక్షులతో పరుగు లెత్తుతుంది.

మనసు రాజహంసై విహరిస్తుంది.

'అహం' అంబరముతో విందారగిస్తుంది.

శాంతి రేవ శాంతిః

ఓ చీకట్లు! మీరూ వదలి వెళ్తారా!

వైఫల్యంలోనే వైభవానికి అర్థముందని నాకు తెలుసు. శ్వాస లాడని క్షణాన కూడా నా ఆశలు ఎటువైపు నడుస్తాయో పరీక్షించి చూచేందుకు నా నాథుడు నిరీక్షిస్తూ ఉంటాడని కూడా నాకు తెలుసు. అతడ్ని చేరాలనే ఉత్సాహంలో నిశా సమయంలో కూడా నేను నడకను ఆపలేదు. ఎలాగో అతణ్ణి చేరాను. తీరా అక్కడికి చేరాక ఇంత వరకు నాకు తోడుగా నడచిన చీకట్లు అదృశ్యమయ్యాయనేదే ఇప్పుడు నా బాధంతా.

ప్రాణ సమానంగా కలసి జీవించిన మిత్రులకు కనీసం వీడ్కోలు నిచ్చే అవకాశాన్ని కూడా అతడు నాకు ప్రసాదించలేదు. ఇంతకాలం నాలో ఊపిరిలా కలిసిపోయిన తిమిరాలు ఒక్కమాటైనా చెప్పకుండా తిరిగి వెళ్ళిపోయాయి. ఇంతేనేమో! ఈ ప్రపంచంలో స్నేహాలకి, ప్రేమలకి పరమార్థం ఇదేనేమో!

ఓ మిత్రులారా! ఓ నా చీకట్లూ! యోగ ముండేది వియోగానికా! నవ్వు నవ్వేది ఏడ్చేందుకా! నన్ను కని, పెంచినవారు మీరు. ఇప్పుడు కనిపించకుండా పోతారా? క్షణంలో మాయ మవుతారా! నన్ను నా నాథుని ఒడిలో నిలిపి మీరు దూరమైపోతారా! సుఖాన్నంతా నాకే వదలి మళ్ళీ మీరు కానలలోకి కదలిపోయారా! మీ కళ్ళల్లోని తీవ్రతను కాఠిన్యమని భావించానే గాని, మీ అంతరాలలో నన్ను సుఖపెట్టాలనే అభిలాష ఇంత తీవ్రంగా ఉండిందని గ్రహించలేక పోయాను. మీరు నాకు లేనివారు. ఏమీ కాలేనివారు. మీ ఉనికి నాకిక అర్థంకాదు. మీ జాడలు నాకు తెలిసిరావు. అయినా మీరు నా మదిలో మెదుల్తూనే ఉన్నారు.

నాకు మేలు చేసిన మీకు నా వల్లనే కీడు జరిగింది. చీకట్లుగా మీరు ఎంతో దట్టంగా ఉండేవారు. నన్ను గాఢంగా కౌగిలించుకొనేవారు. మీతోనే జీవించాను. మీలోనే చరించాను. నా నాథుని చూపమని మిమ్మల్నే అర్థించాను. మీరు కనికరించారు. నాకు తోడై నడిచారు. ఓ చీకట్లూ! నా నాథుని ప్రకాశం మిమ్మల్ని అదృశ్యం చేస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. నన్ను అందలమెక్కించి మీరు అంతరించిపోయారు. నా స్నేహంలో మీకు వినాశమే ప్రాప్తించింది. ఇలా జరుగుతుందని మీరు ఊహించి ఉంటే, నాకు సహకరించకుండా ఉండేవారేమో! మీ మార్గాన మీరు సుఖపడి ఉండేవారేమో!

క్షమించమని అడిగేందుకు కూడా నాకు నోరు రావడం లేదు. మీరే విశాల హృదయంతో క్షమించాలి. నా మూగబాధను మీరే తొలగించాలి. ఓ చీకట్లూ! మీరు చెదిరి పోయారా! ఓ ఇక్కట్లూ! మీరు విరిగిపోయారా! అయ్యో! అయ్యో! ఎంత జరిగి పోయింది. ఇంతలోనే ఎంతై పోయింది.

రవీంద్రుని గీతాంజలి

రవికిరణం తాకితే వికసిస్తుంది పద్మం.

కవి కలం తారాడితే పరవశిస్తుంది ప్రపంచం.

రవి, కవి కలిసి ఒక రూపం దాల్చితే

ఆ మూర్తియే రవీంద్ర కవీంద్రుడు.

మహాకవి

మరో రవి

విశ్వకవి రవీంద్రుడు.

గాలికి పాట ఉందని, ఏటికి మాట ఉందని, సెలయేటిలో సంగీత ముందని, గాలి విసురులో సాహిత్య ముందని, పసిడిగిన్నెలో ప్రేమ మధువు నింపుకొని, వెండిగిన్నెలో కవితా వలపు పండించుకొని రాగరంజితమైన శైలిలో రమ్య గీతాలను ఒలికించిన ప్రఫుల్ల కవితా రసైకమూర్తి రవీంద్రుడు.

ఉదయాద్రిపై తలనెత్తిన బాలభానుని నుండి చరమాద్రిలో కాలుజారిన జాబిల్లి వరకు ప్రకృతి సౌందర్యంలో ఆయన పరామర్శించని అందం లేదు. పారమార్థికానికి నవ భారత కవితా ప్రపంచంలో నాందీ వచనం పలికిన కవియోగి రవీంద్రుడు.

మాటలతో కోటలు నిర్మించిన అక్షరశిల్పి.

పదాలకు ప్రాణం పోసి పాటలుగా అల్లిన మధురకవి.

నవత్వంతో నిండిన ఆయన కవిత్వం పసివాడని వసంతం.

ఆయన కలం చిత్రించిన ప్రతి కావ్యం శారదకు కంఠాభరణం. గుండెగుండెను పలుకరించిన ఆయన గీతాలు నిత్యకళ్యాణాలు. ఆ తియ్యని పాటలకు మత్తెక్కి, మైమరచి పులకరించి పరవశించిన విశ్వం - "ఓ విశ్వకవీ!" అని ఆ మహాకవిని ఎలుగెత్తి పిలిచింది. వ్యాసవాల్మీకుల మునిమనుమడికి మంగళహారతు లెత్తింది. ఆయన వినిపించిన "గీతాంజలి"కి నోబుల్ బహుమతి నిచ్చి నీరాజనం పట్టింది.

ప్రఫుల్ల భావ పోషణతో, విస్ఫూర్జిత మధురభాషణతో, లలిత పద గుంఫనముతో, మధుర శబ్ద సంయోజనముతో, వాక్య వైభవంతో, తాత్త్విక తాత్పర్యంతో ఆయన రచించిన గీతాంజలి పాటలు సరస్వతీదేవి పాదాలకు అలంకరించిన కవితా మంజీరాలు.

ఆ కవితా మువ్వల రవళికి జగతి పులకరించింది. ప్రగతి తొంగి చూసింది. విశ్వనాథుని కొలువులో విశ్వకవి ఎలుగెత్తి పాడిన మేలు పిలుపే గీతాంజలి. నిద్రాణమైన జగతిని నూతన వెలుగుల లోనికి నడిపించే మేలుకొలుపే ఈ భావ పుష్పాంజలి. అనంత విరహ విశ్వసంగీతం ఇక్కడే పంచమ స్వరాన పలికింది. మయూరమై పురివిప్పి కులికింది.

రవీంద్రునిది హితభాషణం, స్మితభాషణం, మందస్మిత భాషణం.

Your speech is simple, my Master, but not theirs who talk of you.

I understand the voice of your stars and the silence of your trees.

"హే ప్రభో! నీ తారల మాటల్ని, నీ తరువుల మౌనాన్ని నేను అర్థం చేసుకోగలను. నీ వాక్కు సరళంగా ఉంటుంది. నిన్ను గూర్చి మాట్లాడే వారిలా ఉండదు" అని "ఫ్రూట్ గేదరింగ్" అనే గ్రంథంలో వ్రాస్తాడు రవీంద్రనాథ్ టాగూరు.

కవికి, కవితకు ఉన్న సంబంధం ఆయనకి తెలిసినంతగా తెలిసినవారు అరుదుగా ఉంటారు. క్షీరాబ్ధికి, సుధారసానికి ఉన్న సంబంధమది. పాలసముద్రం నుండి అమృతం పుట్టినట్లు, పాలమనసు గల కవి హృదయం నుండి కవితా పీయూషము పెల్లుబికి రావాలి.

కాని,

ఈ కవితా మంథనములో పరిపక్వతకు నోచుకోని చాలా మంది కవులు అమృతము మాట అలా ఉంచి, హాలాహలాన్ని తోడుకుంటారు. దాన్నే వాడుకుంటారు. వాళ్ళు వాడిపోతారు. వాళ్ళను అనుసరించిన వాళ్ళు ఓడిపోతారు.

కవిత్వమనేది ఒక విధమైన భావైశ్వర్యం. హృదయపారవశ్యం. రసోద్వేగం. చిత్త పరిపాకం.

అరవిందయోగి 'సావిత్రి' గ్రంథంలో తెలిపినట్లు

A finite movement of the Infinite

"పూర్ణత యొక్క విన్యాసమే విశ్వంలో కదిలాడే అపరిపూర్ణత".

కనుక, కవిత్వ మనేది ఒక అన్వేషణ. అదొక పరితాపం. అఖండానందాన్ని వాంఛిస్తూ జీవాత్మ పరితపించే అన్వేషణ. ఆనందాన్వేషణ. ఇది అడుగడుగునా గీతాంజలిలో తొంగిచూస్తుంది. పదపదంలో పలకరిస్తుంది. 'గీతాంజలి' శిల్పాలయంలో ప్రవేశిస్తే సజీవ కవితా శిల్పాలు కరచాలనం చేస్తాయి. అక్షరరూపాలు అభివందనం పలుకుతాయి. ఆయన చెక్కిన కావ్యకన్య కులుకుతూ మనోహరంగా చరిస్తుంది. అనంత యాత్రలో తీరానికి తరలించే ప్రయత్నం చేస్తుంది. గీతపల్లకిలో పదపరుపులు పరచి వాక్యపాన్పుపై కూర్చోబెట్టి, దారిగాని దారిలో నడిపించి ధామం చేర్చుతుంది. పరంధామం చేర్చుతుంది. మార్గంలో మంచిమాట లెన్నో చెబుతుంది. తియ్యని పాటలెన్నో పాడుతుంది. లాలిస్తుంది. పాలిస్తుంది. కాని, చేరవలసింది ఇది కాదు అని కూడా చెబుతూనే ఉంటుంది. పొందవలసింది ఇంకా దూరంలో ఉంది అని హెచ్చరిస్తూనే ఉంటుంది.

The flower sweetens the air with its perfume; yet its last service is to offer itself to thee!

"పువ్వు తన వాసనతో గాలిని పరిమళింపచేస్తుంది. అయినా, తనను నీకు అర్పించు కోవడమే తన కడపటి సేవ" అంటాడు గీతాంజలి - 75వ గీతంలో రవీంద్రుడు.

ఆ పువ్వు ఎవరో కాదు. ఈ కవియే ఆ పువ్వు. ఆ పువ్వులోని సుగంధమంతా ఈ కవితా సౌరభమే. వ్యక్తమయ్యే వైభవాలన్నీ విశ్వానికే. కానీ అంతరాంతరాల్లో కదిలే పరితాపమంతా పువ్వులా పరమాత్మను చేరేందుకే.

ఇది కవి మనోభావము. ఇదే కవి ప్రభావము. రవి ప్రకాశము. "గీతాంజలి అర్థమయ్యే గ్రంథం కాదు" అని చాలామంది అంటూ ఉంటారు. అదే వాస్తవమైతే రవీంద్రుడు ఎందుకు వ్రాశాడో మ్రింగుడు పడని విషయం. ఇక మీదట నోబుల్ బహుమతికి అదే ప్రమాణంగా, అర్హతగా భావించే ప్రమాదం కూడా తల ఎత్తవచ్చు.

అరబ్బీ భాషరాని మనతో ఎవరైనా ఆ భాషలో మాట్లాడితే అది మనకు అర్థం కాకపోవడంలో విచిత్ర మేమీలేదు. అర్థమైతేనే ఆలోచించవలసి ఉంటుంది. ఇదీ అంతే. ఆధ్యాత్మిక అవగాహన లేకుండా కేవలం కవిత్వపందిరి క్రింద మంచం వేసుకొని, మల్లెలు పరచుకొని కూర్చుంటే గీతాలు పాడుకోవచ్చేమో గాని 'గీతాంజలి' అర్థం కాదు. కనుకనే, రవీంద్రుడు గీతాంజలిలో,

From the words of the poet men take what meanings please them; yet their last meaning points to thee!

"కవి మాటలనుండి ఎవరికి నచ్చిన అర్థాలను వారు తీసుకుంటారు. కాని, వాటి అర్థం, ప్రభూ! నిన్నే సూచిస్తుంది" అంటాడు.

గీతాంజలిలో కూడా యోగమేదో ఉంది. అదొక ప్రత్యేక యోగం. ప్రేమమయమైన సమర్పణ యోగం. కనుకనే పరవశించి ఏడుస్తుంది. పారవశ్యంతో ఏడిపిస్తుంది. పాలలో పంచదారలా, నీటిలో ఉప్పులా కరిగిపోయే యోగమది.

సలిలే సైన్ధవం యద్వత్ సామ్యం భవతి యోగతః

నీటిలో పడి నీటిరూపమును పొందు ఉప్పువలె ఇక్కడ యోగమునకు సామ్యము కుదిరింది అన్నది ఉపనిషత్తు.

రవీంద్రుని సమర్పణలో సద్భక్తి ఉంది. అందులో తియ్యని ఆశ కూడా ఉంది. అన్యరాగ విస్మరణము చోటుచేసుకొని ఉంది. వాంఛల నుండి విడిపడాలనే తపన ఉంది. వాంఛాతీత స్థితిలో పవ్వళించాలనే స్పందన ఉంది.

That I want thee, only thee - let my heart repeat without end.

All desires that distract me, day and night, are false and empty to the core.

"నాకు నీవే కావాలి. నీవు మాత్రమే - ఇలా ముగింపు లేకుండా నా హృదయాన్ని మొరపెట్టుకోనీ, అహర్నిశలు నన్ను దారి తప్పించే వాంఛలు మాయలు, శూన్యాలు;" అని గీతాంజలి - 38వ గీతంలో విన్నవించుకున్నాడు విశ్వకవి.

ఇది సమర్పణ

కాని, ఇక్కడ సమర్పించుకొనేవాడు, సమర్పించబడేది, సమర్పణను స్వీకరించే వ్యక్తి అనే మూడు విషయాలు చోటు చేసుకొని ఉన్నాయి.

స్వీకరించేవాడు భగవంతుడు. ఏ కోరిక లేనివాడు. అవసరాలు అర్థం కానివాడు. సమర్పించబడేది భక్తి. అదే గీతం. ఈ సమర్పణలో సద్భక్తి కూడి ఉంది. కనుకనే 'అంజలి' చోటు చేసుకొంది. ఇలా గీతాంజలి సమర్పించబడింది.

ఇక సమర్పించేవాడు ఏదీ లేనివాడు. భక్తుడు. అతడొక బాటసారి. ఇల్లు కూడా లేనివాడు. **(అనికేతః)**. అతడేమి సమర్పిస్తాడు?

తనకు, తన ప్రభువుకు మధ్య నిలిచిన "అహం" కన్యను సమర్పిస్తాడు. నిజానికి ఇదే స్వచ్ఛమైన సమర్పణ.

She who ever had remained in the depth of my being, in the twilight of gleams and of glimpses. She who never opened her veils in the morning light, will be my last gift to thee, my God, folded in my final song.

"నా గుండె గుహలో వ్యక్తావ్యక్త సంధ్య వెలుగుల నడుమ దాగిన ఆమెను, బాలభానుని కాంతిలో తన మేలి ముసుగును తొలగించి కనిపించని ఆమెను నా చివరి పాటలో చక్కగా పొదిగి, దేవా! నీకు ఆఖరి కానుకగా సమర్పించుకుంటాను" అని గీతాంజలి - 66వ గీతంలో తన సమర్పణను ప్రకటించాడు కవి.

కనుక ఇచ్చేవాని వద్ద ఏమీ లేదు; ఉండదు. అహం తప్ప. ఏదీ అవసరం లేని పుచ్చుకొనే వాడు తనకు లేని 'అహం'ని నీవు సమర్పిస్తే, అవసరం లేకున్నా పుచ్చుకొని ఆశీర్వదిస్తాడు. ఇది ఇలా జరుగనినాడు ఏది ఇచ్చినా ఇవ్వవచ్చు. కాని, అది సమర్పణ కాబోదు. ఈ క్రింది శ్లోకం చూడండి ఏం చెబుతుందో!

రత్నాకర స్తవ గృహం గృహిణీ చ పద్మా కిం దేయ మస్తి భవతే జగదీశ్వరాయ।
అభీర వామనయనా హృత మానసాయ దత్తం మనో యదుపతే కృపయా గృహాణ॥

"యదునాథా! నీకు నేను ఏమి సమర్పిస్తాను? నీకు ఇవ్వదగినది నా వద్ద ఏముంది? నీ ఇల్లు రత్నగర్భ యగు క్షీరసాగరము. సర్వ సంపదలకు నిలయమైన లక్ష్మీదేవి నీ అర్ధాంగి. నీవేమో జగత్తున కంతటికి ప్రభువు. అట్టి నీ మనస్సును కృష్ణా! గోపికలు అపహరించినారు. అట్టి మనసు లేని వెలితిని తీర్చుకొనుటకై నా మనసును నీకు

సమర్పిస్తున్నాను. దయతో స్వీకరించు". ఇదే గీతాంజలిలో రవీంద్ర కవీంద్రుని సద్భక్తియుత సమర్పణ.

ఇక్కడ తన సమర్పణ సంకెళ్ళను తొలగించుకుంది. ప్రపంచ కౌగిలింతలనే కట్లను త్రెంచుకొంది. నాథుని ఒడిలో కరిగేందుకు సిద్ధంగా ఉంది.

I am only waiting for love to give myself up at last into his hands.....

They come with their laws and their codes to bind me fast; but I evade them ever, for I am only waiting for love to give myself up at last into his hands.

"అతని చేతుల్లోకి చివరగ నన్ను నేను అర్పించుకొనుటకు నిరీక్షిస్తున్నాను. తమ చట్టాలతో, నియమాలతో వస్తారు నన్ను గట్టిగ బంధించాలని. కాని, నేను ఎప్పుడూ తప్పించుకొంటూనే ఉంటాను వారిని. కారణం నా ప్రియుని కౌగిట్లో ఎలాగైనా కరిగి పోవాలనేదే నా నిరీక్షణ"; అని గీతాంజలి - 17వ గీతంలో తన నిరీక్షణకు నిర్వచన మిచ్చాడు.

తనను గ్రహించే తన ప్రియుని చిరునామా కలిగిన పువ్వును ఉపనిషద్వనము నుండి కోసి మనకు అందిస్తాడు. ప్రియుని పేరును చెప్పేందుకు సిగ్గుపడతాడు.

He it is, the inner most one, who awakens my being with his deep hidden touches.

"అతడే. అతని నిగూఢ స్పర్శతో నా అంతరాత్మను మేలుకొలిపే అంతరాంత ర్యామి" అని గీతాంజలి - 72వ గీతంలో తన ప్రియుని మనకు పరిచయం చేస్తాడు.

విశ్వాధిప స్సర్వభూతేషు గూఢః

"సర్వప్రాణుల యందు నిగూఢముగ యున్న విశ్వనాథుడు" అన్నది శ్వేతాశ్వతరో పనిషత్తు.

ఇలా అతని నివాసాన్ని చిరునామాని తెలుపుతాడు. ప్రత్యేకంగా **నామకరణం** చేయడు. ప్రత్యేక లోకాన్ని సృష్టించడు.

చిరుగాలికి చలించే లతాంతమున శోభించే పువ్వులో తన ప్రియుని చిరునామాను దొంగిలించినవాడు తాను పువ్వుగా మారి, తనను కోసుకోమని కోరుకుంటున్నాడు. ఇదొక అద్భుతమైన అభ్యర్థన. తనపై తాను విధించుకున్న అగ్ని పరీక్ష. తన అర్హతను బహిరంగ పరచే వింత ప్రదర్శన. ఆశించడంలో కానిది, అర్హతను కలిగి యుండటములో అవుతుంది అనే జ్ఞానపూరిత దృఢ విశ్వాసము.

Pluck this little flower and take it, delay not! I fear lest it droop and drop into the dust.

"ఈ చిన్ని పువ్వును జాగు చేయకుండా కోసేసి తీసేసుకో, అది వాడి, వీడి, ధూళిలో కలిసిపోతుం దేమోనని నా భయం" అని గీతాంజలి - 6వ గీతంలో ప్రార్థిస్తాడు.

ఆలస్యాన్ని ఏమాత్రం సహించని అర్హతను వ్యక్తం చేశాడు. కొద్దిపాటి భయం కూడా దీని వెనుక గోచరిస్తుంది. అది గతం అందిస్తున్న వర్తమానం.

ఆలస్యం లేకుండా 'అహం' భావనను అంతం చేసి తన నాథునిలో ఐక్యం కావాలని కవితాత్మ ఉవ్విళ్ళూరుతోంది. అందుకే, మృత్యువుతో తానే మాట్లాడేసుకుంటోంది.

O Thou; the last fulfilment of life, Death, my death, come and whisper to me! Day after day have I kept watch for thee;.......

One glance from thine eyes and my life will be ever thine own.

The flowers have been woven and the garland is ready for the bridegroom. After the wedding the bride shall leave her home and meet her Lord alone in the solitude of night.

"నీవు; ఓ నా జీవిత అంతిమ సాఫల్యమా! మృత్యువా! ఓ మృత్యువా! రా! నాతో గుసగుసలాడు. రోజురోజు నీ కొరకు ఎదురు చూశాను.

నీ కళ్ళనుండి కదిలే ఒక్క వీక్షణంతో నా జీవితం ఎప్పటికీ నీదైపోతుంది.

వరుని మెడలో పడేందుకు పువ్వులతో అల్లిన మాల సిద్ధంగా ఉంది. కళ్యాణం కాగానే వధువు ఇంటిని విడిచి, తన నాథుని ఒంటరిగ ఏకాంత రాత్రిలో కలుసు కుంటుంది;" అని గీతాంజలి - 91వ గీతంలో మృత్యువుతో ముచ్చటించడం జరిగింది.

మృత్యువు సమీపించే సమయంలోనే ఇక్కడ అమృతత్వం కూడా సమీపిస్తున్నది. చీకటి వెలుగులు ఒక్కచోట చేరినట్లుంది. మృత్యువు కాష్టం వైపు నడిపించాలని ఉత్సాహపడుతుంటే, వరుడు కళ్యాణ వేదికపైకి నడిపిస్తూ సంబరపడి పోతున్నాడు. ఈ సంధ్యలో వందన మెలాగో అర్థం కావడం లేదు.

మృతా మోహమయీ మాతా జాతో బోధమయ స్సుతః
సూతక ద్వయ సంప్రాప్తౌ కథం సంధ్యా ముపాస్మహే ॥

"మోహమనే తల్లి చనిపోయింది. జ్ఞాన మనే కుమారుడు జన్మించాడు. రెండు సూతకములు కలిసి అరుదెంచాయి, ఇక సంధ్యవార్చుట ఎట్లు?" అన్నది మైత్రేయో పనిషత్తు.

అహం మరణాన్ని దర్శిస్తూ, తనను తన ప్రియునికి సమర్పించుకొను సంధ్యలో నిలబడి సాధ్యపడని వందనాన్ని సమర్పించడం జరుగుతోంది. ఇక్కడ ఏదో ఓ మూలన కొడిగట్టిన దీపంలా మిణుకు మిణుకు మంటూ, ఏ క్షణాన్నైనా ఆరిపోయేందుకు సిద్ధంగా ఉన్న 'అహం' తన చివరి పలుకుల్ని మెల్లగా వినిపించింది.

I have got my leave. Bid me farewell, my brothers! I bow to you all and take my departure......

I only ask for last kind words from you.

We were neighbours for long, but I received more than I could give. Now the day has dawned and the lamp that lit my dark corner is out. A summons has come and I am ready for my journey.

"నాకు సెలవయింది. సోదరులారా! నాకు వీడ్కోలు పలకండి. తలవంచి మీకు నమస్కరించి నా దారిన నేను పోతున్నాను.

మీ కడపటి కరుణాపూరిత పలకరింపును నేను కోరుకుంటున్నాను.

ఇరుగు పొరుగుగా చాలాకాలం కలిసి జీవించాము. ఇవ్వగలిగిన దానికన్నా ఎక్కువగానే పుచ్చుకున్నాను. తెల్లవారింది. నా గది మూలను ప్రకాశవంతం చేసిన దీపం ఆరిపోయింది. నాకు పిలుపు వచ్చింది. వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను" అని గీతాంజలి - 93వ గీతం.

సంత్ తుకారాం కూడా ఇలాగే వేడుకున్నాడు చివరగ.

శేవట్ చీ వినవణీ! సంత్ జనీ పరిసావీ!
నిసరతో న పడావా! మా ఝూ దేవా తుమ్హాంసీ
ఆతా ఫార బోలోకాయీా! అవఘేః పాయీాః విదిత
తుకా మ్హణే పడతో పాయా! కరా ఛాయా కృపేచీ ॥

"చివరగా ఒక్క విన్నపముంది. ఆలకించండి. ఓ మహానుభావులారా! నన్ను మరచిపోకండి. ఇక అనేక మాట లెందుకు? నన్ను కృప చూడండి".

పువ్వు లాంటి మనసున్న మనుష్యులు రాళ్ళు రువ్విన వారిపై కూడా ప్రేమనే వర్షిస్తారు. ఆ ప్రేమతోనే ఈ ప్రపంచం నుండి తుకారాం నిష్క్రమించాడు.

రవీంద్రుని గీతాంజలికి శ్రుతిలయలు జోడించాను. శ్రుతి-లయ ఉంటే పాట సులభత్వాన్ని, సుభగత్వాన్ని సంతరించుకుంటుంది. ఇక్కడే జరిగింది శ్రుతి లయ కావడం. గీతాంజలిని శ్రుతిపరంగా (వేదపరంగా) సమన్వయించి లయ కూర్చడం.

'గీతాంజలి' ఒక అగాధమైన భావసాగరం. లోతుల్ని చూపాలనే ఉత్సాహమూ ఉంది. సమయం, సందర్భం మరోలా ఉన్నాయి. కనుక, ఇంతటితో ముగిస్తున్నాను.

ఎందరికో స్ఫూర్తి నిచ్చిన గ్రంథం ఈ గీతాంజలి. నాకు కూడాను. మీకూ ఇస్తుందని భావిస్తున్నాను.

నిరుపమ వేదమ్మకు నిజపద నీరాజనం

కాల ప్రవాహానికి ఎదురీది, కలకాలం నిలిచే కాలాతీత జ్ఞానపుష్పాన్ని జడలో తురుముకొని శోభించే వేదమ్మకు

మనసైన నీరాజనం.
మంగళకరమైన నీరాజనం.

అబ్ధి మథనంలో అమృతము ప్రాప్తిస్తే, అంతరంగ మథనంలో అద్వైతం సిద్ధిస్తుందని బోధించిన శ్రుతిమాతకు

కవితా కెంపుల నీరాజనం.
మమతా మాణిక్య నీరాజనం.

ముందు నిలిచిన మనుగడే అర్థం గాని మనిషికి వెనుక నడిపే వెన్నుని మురళీరవాన్ని వినిపించిన వేదనాద కుమారికి

చరాచర సార నీరాజనం.
అమృత స్వరసార నీరాజనం.

భవ సంతప్త హృదయాలకు శివజ్ఞానామృతమును పోయుటలో చలివేంద్రమై విలసిల్లిన ఉపనిషత్కుమారికి

గీర్వాణ నీరాజనం.
స్వరూప నిర్వాణ నీరాజనం.

మతి కందని గతి తానై, జత నోర్వని ద్యుతి తానై, యతిమదిలో శ్రుతిని మీటి పలుకు నేర్పిన ప్రభావతికి, పలుకు కందని జ్ఞానకళావతికి

చిన్ముద్ర నీరాజనం.
రుద్రుని ఎద భద్ర నీరాజనం.

లేని వాటిని ఉన్నవంటూ ఉట్టికెక్కించే ఉన్మాదంలో మతాలు ఉల్లి పువ్వుల్ని ఊరేగిస్తుంటే, ఉన్నవాటిని లేవంటూ "ఉనికి"ని వాడని మల్లెపువ్వులా ఉర్విపై ఊరేగించిన వేదవతికి

భావుక నీరాజనం.
బలమైన తార్కిక నీరాజనం.

బండరాతి గుండెలను కరిగించి, మనసులలో మల్లెలను పూయించి, హృదయాలలో వెన్నెలను కాయించే ఋషి బిడ్డలను ప్రసవించిన వేదాంత జననికి

ప్రామాణ్య నీరాజనం.
బహుముఖ ప్రావీణ్య నీరాజనం.

అమృతాన్ని పానం చేసిన రాహువు రాక్షసుడుగనే మిగిలిపోయినా జ్ఞానామృతాన్ని పానం చేసిన మానవుడు మానవుడుగ మిగలక పోవుటయే గాక మాధవుడుగా వెలిగిపోతాడని ప్రమాణ మందించి నిరూపించిన శ్రుతి శిఖర సంచారిణికి, వేదవిద్యావతికి ....

శ్రుతిరేవ శరణ మితి నీరాజనం.
అఖండ రూప స్థితి రేవ నీరాజనం.

అమ్మా! భారతీ! అందుకో హారతి!

ఎత్తైన భావ సంపదలో, లోతైన హృదయ సౌందర్యంలో నాకు మించినవారు లేరంటూ, హిమాలయాలను, సాగర జలాలను అటు ఇటు ఉంచుకొని శోభించే జననీ! భరతావనీ! జోహారు!

శతాబ్దాల సంకెళ్ళతో చేతులు చలించకపోయినా,జ్ఞాన రుధిర ప్రవాహం క్షణమైనా ఆగని చైతన్య సంజీవినీ! పరమపావనీ! జోహారు!

గంగా తరంగాల సంగీత పొంగులు, యమునా జలాలలో కన్నయ్య నవ్వులు కలబోసి కులికేటి సుకుమార జననీ! మంగళకళ్యాణీ! జోహారు!

హింసాయుత దుండగులను అహింసతో నిలదీసి సమతా సందేశంతో సంబర మొనరించిన సహన ప్రియా! సేవామయా! సదాశయా! జోహారు!

అమ్మా!

కర్మయోగులను కన్నావు. ధర్మవీరులను పెంచావు. త్యాగధనులను పెంపొందించావు. బుద్ధుని మొదలు వివేకానందుని వరకు శాంతిదూతలను, జ్ఞానప్రదాతలను ప్రపంచాని కందించావు. బాహ్యంలో మండుటెండలు రగులుతున్నా, ఆంతర్యంలో పండు వెన్నెలలు పూయించుకొనే విద్యను ఉగ్గుపాలతో నీ బిడ్డలకు నేర్పావు.

అమ్మా! నీ కొంగుపట్టుకొని తిరిగిన నీ బిడ్డలు శాంతికపోతాలు. నీ కీర్తి రథానికి అమర్చిన చక్రాలు.

అమ్మలగన్న అమ్మకు అఖిలజగతి శిరమొగ్గి నీరాజన మిచ్చే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ కలలు పండేరోజు, ఆ కళల పండుగరోజు ఇక ఎంతో కాలం పట్టదు.




విబుధావని విమలకీర్తి విశ్వగగనంలో ఊరేగే సమయం మరెప్పుడో కాదు. దివినుండి దివ్యాత్ములు భువికి బయలుదేరారు.



ఆర్షసంస్కృతీ జగతిలో ఆశాదీపికలు వెలిగాయి.


వేదాంత వెన్నెల విశ్వాన్ని తడుపబోతోంది.

జ్ఞాన శంఖాన్ని పూరిస్తూ శాంతిజ్యోతుల్ని వెలిగించబోతోంది.

రేబవలు ఋషికీర్తిని సంద్రము కీర్తిస్తుంటే, ఋషి వాణిని హృదిలో నిలుపుకొని,



లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు

మసి తుడిచే ప్రయత్నంలో పవిత్రాత్మలు పావురాలై విహరించే రోజులు దగ్గరి కొస్తున్నాయి.

ఇక,

హింసపై అహింస దండయాత్ర చేస్తుంది. ద్వేషాన్ని ప్రేమ కాలరాచేస్తుంది. లోభాలను త్యాగాలు చుట్టుముట్టేస్తాయి. స్వార్థాన్ని సేవలు నిలదీస్తాయి. అధర్మాన్ని ధర్మం జయిస్తుంది. కామాన్ని ప్రేమ దగ్ధం చేస్తుంది.

జ్ఞాన పవనాలు వీచేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రేమ తరంగాలు లేచేందుకు ఉరక లేస్తున్నాయి. ఇక నడువలేనంటూ మంచి పరుగెత్తబోతోంది. ఇక చలించ లేనంటూ శాంతి కూర్చోబోతోంది.

ఆకాశంలో ప్రతి తార అంబరానికి అలంకారమే. భారతావనిలో ప్రతిబిడ్డ అమ్మ ఖ్యాతికి ఆభరణమే.

జయభేరిని మ్రోగించే అలలే అమ్మ బిడ్డలు.

జైత్రయాత్ర సాగించే కళలే అమ్మ తనయులు.

మా అమ్మ శారదను ధనమ్మకు అమ్మలేనంటూ కాయలు కాచిన చేతులతో కవితాపంటను పండించిన కవికృషీవలుడు పోతన మాకు స్పందన.

"నిధి చాల సుఖమా! రాముని సన్నిధి సేవ సుఖమా?

నిజముగ బల్కుమనసా!" అని మనస్సునే నిలదీసిన త్యాగానికి రాజు మా త్యాగరాజు మీదే మాకు మోజు.

అమ్మా! మముగన్న తల్లి! మా కల్పవల్లి!

మనస్సులను పరిమళింపచేసే మంచి మల్లెల మాటలను మాచే పలికించు.

గుండె గుండెను గుడిగామార్చే వెన్నెల పాటలు పాడించు. వేదాంత వెన్నెల పాటలు పాడించు.

తీపిగుండెలో నాలుకను తడిపి రాగసుధను ఒలికించే శక్తిని ప్రసాదించు.

ముళ్ళు చుట్టు ముట్టినా మృదువుగా నవ్వే గులాబీల గుట్టు మాకు నేర్పించు. లోతులకెళ్ళి తురుముతున్నా తుమ్మెదలకు తీపి తేనెలను తినిపించిన మందారాలుగా మము దీవించు.

జై భారత్!

నిత్య ప్రార్థనలు

ఆరంభంలో చూపు అరచేయి

శ్లో॥ కరాగ్రే వసతే లక్ష్మీః
కరమూలే సరస్వతీ
కర మధ్యేతు గోవిందః
ప్రభాతే కరదర్శనం ॥

కర=చేయి, అగ్రే=చివర (వ్రేళ్ళ చివర), వసతే=వసిస్తున్నది, లక్ష్మీః=భాగ్యదేవత యగు లక్ష్మీదేవి, కరమూలే=మణికట్టు వద్ద, సరస్వతీ=జ్ఞానప్రదాయిని యగు శారద, కరమధ్యేతు=చేతి మధ్య (అరచేతిలో), గోవిందః= శ్రీకృష్ణ పరమాత్మ, ప్రభాతే= ఉషోదయమున, కరదర్శనం =కరమును దర్శించటం.

భావము:- చేతి వ్రేళ్ళ చివర లక్ష్మీదేవి ఉంది. మణికట్టు వద్ద సరస్వతీ దేవి ఉంది. అరచేతి మధ్యన గోవిందు డున్నాడు. ప్రభాతవేళ నీ అరచేతిని దర్శించు. ('కరమూలే స్థితా గౌరీ' అని పాఠాంతరము. కరమూలే=మణిబంధము వద్ద, గౌరీ=పార్వతీ దేవి, స్థితా=ఉంది).

అమ్మా! భూమాతా! క్షమించు తల్లీ!

శ్లో॥ సముద్ర వసనే దేవి
పర్వత స్తన మండలే
విష్ణుపత్ని నమస్తుభ్యం
పాదస్పర్శం క్షమస్వమే ॥

సముద్ర వసనే=సాగరమున వసించునది, దేవి=ప్రకాశించు తల్లి, పర్వతస్తన మండలే= గుండ్రముగ, కొండల వలె కుచములు గలది, విష్ణుపత్ని=విష్ణు భగవానుని అర్ధాంగి, నమః=నమస్కారము, తుభ్యం=నీకు, పాదస్పర్శం=నా పాదమును నీపై మోపటం, క్షమస్వ=క్షమించు, మే=నన్ను.

భావము:- ఓ భూదేవీ! గుండ్రముగ, కొండల వంటి స్తనములు కలిగి సాగరమున వసించు ఓ విష్ణుపత్నీ! నా పాదాలతో నిన్ను స్పృశిస్తున్నందుకు నన్ను క్షమించు.

విద్యావతీ! నీవే మా గతి!

శ్లో॥ సరస్వతీ నమస్తుభ్యం
వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి
సిద్ధిర్భవతు మే సదా ॥

సరస్వతీ=శారద, నమః=నమస్కారము, తుభ్యం=నీకు, వరదే=వరప్రదాయిని, కామ రూపిణి= కోరికల రూపములో ప్రకాశించునది, విద్యారంభం=విద్యా ప్రారంభము, కరిష్యామి= చేయుచున్నాను, సిద్ధిః=సిద్ధి, భవతు=కలుగుగాక!

భావము:- ఓ సరస్వతీ దేవీ! నీకు నా నమస్కారము. వరములను అనుగ్రహించు తల్లివి. (విహితమైన) కోర్కెలను తీర్చు మాతవు. నేను విద్యారంభము చేయుచున్నాను. నాకు సదా సిద్ధిని అనుగ్రహింపుము.

లక్ష్మీ ప్రసన్నం

శ్లో॥ నమస్తే౽స్తు మహామాయే
శ్రీ పీఠే సురపూజితే
శంఖ చక్రగదా హస్తే
మహాలక్ష్మి నమోస్తుతే ॥

నమః=నమస్కారము, తే=నీకు, అస్తు=అగు గాక!, మహామాయే=సర్వశక్తి రూపిణి, శ్రీ పీఠే=సంపదకు సన్నిధి, సురపూజితే=దేవతలచే పూజింపబడినది, శంఖచక్ర గదా హస్తే= శంఖము, చక్రము, గదను హస్తమునందు ధరించినది, మహాలక్ష్మి=లక్ష్మి దేవి, నమః =నమస్కారము, అస్తు=అగు గాక!, తే=నీకు.

భావము:- ఓ మహాలక్ష్మి! సర్వశక్తిమయీ!, భాగ్య రూపిణీ! దేవ పూజితా! శంఖ చక్ర గదా పాణీ! నీకు నా నమస్కారము.

శ్లో.. బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షి భూతం
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి ॥

బ్రహ్మానందం=బ్రహ్మానంద స్వరూపము, పరమ సుఖదం=ప్రకృష్టమైన సుఖమును అను గ్రహించువాడు, కేవలం=పరమార్థ స్వరూపుడు, జ్ఞానమూర్తిం=జ్ఞానరూపుడు, ద్వంద్వా తీతం=శీతోష్ణాది ద్వంద్వాలకు అతీతుడు, గగన సదృశం=ఆకాశరూపుడు, తత్త్వమస్యాది లక్ష్యం=తత్త్వమస్యాది వాక్యములకు లక్ష్యమైనవాడు, ఏకం=అద్వయుడు, నిత్యం= నిత్యుడు, విమలం=పరిశుద్ధమైనవాడు, అచలం=చలన మెరుగనివాడు, సర్వధీ సాక్షి భూతం=సమస్త సంకల్పాలకు సాక్షియైనవాడు, భావాతీతం=భావములకు అతీతుడు, త్రిగుణ రహితం =గుణాతీతుడు, తం సద్గురుం=అట్టి సద్గురువును, నమామి=నమస్క రింతును.

భావము:- బ్రహ్మానంద స్వరూపుడు, పరమ సుఖమును ప్రసాదించువాడు, కేవలము జ్ఞానస్వరూపమైనవాడు, ద్వంద్వములకు అతీతుడు, ఆకాశరూపుడు, తత్త్వమసి మొదలైన మహావాక్యములకు లక్ష్యమైనవాడు, అద్వయుడు, నిత్యుడు, పరిశుద్ధుడు, చలన మెరుగని వాడు, సర్వ సంకల్పములకు సాక్షియైనవాడు, భావములకు అతీతుడు, గుణాతీతుడు, అయిన సద్గురువును నమస్కరించుచున్నాను.

తీర్థ స్నానం

శ్లో॥ గంగే చ యమునే చైవ
గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి
జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥

గంగే=గంగ, చ=మరియు, యమునే=యమునా, చ=మరియు, గోదావరి=గోదావరి, సరస్వతి= సరస్వతి, నర్మదే=నర్మద, సింధు=సింధూనది, కావేరి=కావేరి, అస్మిన్ జలే=ఈ జలమునందు, సన్నిధిం=ఉనికి, కురు=చేయుము.

భావము:- ఓ గంగానదీ! యమునా! గోదావరీ! సరస్వతీ! నర్మదా! సింధూ! కావేరీ! ఈ జలమునందు నిలిచిపొండి.

తులసమ్మ! నీ వైభవం తెలుసమ్మా!

శ్లో॥ నమ స్తులసి కళ్యాణి
నమో విష్ణుప్రియే శుభే!
నమో మోక్షప్రదే దేవి
నమః సమ్పత్ప్రదాయిని ॥

నమః=నమస్కారము, తులసి=ఓ తులసీ!, కళ్యాణి=శుభప్రదా!, నమః=నమస్కారము, విష్ణుప్రియే=విష్ణు దేవునకు ప్రియమైన దానా!, శుభే=మంగళ రూపిణీ!, నమః= నమస్కారము, మోక్షప్రదే=ముక్తిదాయినీ!, దేవీ=ప్రకాశినీ!, నమః=నమస్కారము, సంపత్=సంపదను, ప్రదాయిని=అనుగ్రహించుదానా!

భావము:- సర్వ శుభములను ప్రసాదించు తులసమ్మకు నమస్కారము. విష్ణుప్రియ యగు మంగళ స్వరూపిణికి నమస్కారము. ముక్తిని ప్రసాదించు ప్రకాశైక రూపిణికి నమస్కారము. సర్వ సంపదల నిచ్చు తులసీమాతకు నమస్కారము.

గణపతీ! ఇదే మా వినతి!

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్న వదనం ధ్యాయేత్
సర్వ విఘ్నోపశాంతయే ॥

శుక్ల=తెల్లని, అంబర=వస్త్రము, ధరం=ధరించినవాడు, విష్ణుం=సర్వవ్యాపకుడు, శశివర్ణం= చంద్ర కాంతిని బోలిన రంగు కలవాడు, చతుర్భుజం=నాలుగు భుజములు కలవాడు, ప్రసన్న వదనం =ప్రశాంత వదనము కలవాడు, ధ్యాయేత్=ధ్యానించాలి, సర్వ=సమస్తము లైన, విఘ్న= విఘ్నములు, ఉపశాంతయే=ఉపశమించుటకు.

భావము:- శ్వేత వస్త్రధారి, సర్వవ్యాపి, చంద్రకాంతి వర్ణశోభితుడు, నాలుగు భుజములతో ప్రకాశించువాడు, ప్రశాంత వదనంతో రంజిల్లువాడు అయిన గణపతిని సర్వ విఘ్నములు ఉపశమించుటకు ధ్యానించుచున్నాను.

వాసుదేవా! వందనం!

శ్లో॥ వసుదేవ సుతం దేవం
కంస చాణూర మర్దనమ్
దేవకీ పరమానందం
కృష్ణం వందే జగద్గురుం ॥

వసుదేవసుతం=వసుదేవుని కుమారుడు, దేవం=ప్రకాశైకరూపుడు, కంసచాణూర మర్దనమ్ =కంసుడు, చాణూరు డను రాక్షసులను సంహరించినవాడు, దేవకీ పరమానందం= దేవకీ దేవికి పరమమైన ఆనందమును కలిగించువాడు, జగద్గురుమ్=జగద్గురువైన, కృష్ణః =శ్రీకృష్ణుని, వందే=నమస్కరింతును.

భావము:- వసుదేవుని కుమారుడు, దివ్యమైనవాడు, కంసచాణూరాదులను సంహరించిన వాడు, దేవకీదేవికి దివ్యానందమైన వాడు, జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మకు వందనములు.

వెలుగమ్మా! సదా మాలో వెలుగమ్మా!

శ్లో॥ శుభం కరోతి కళ్యాణం
ఆరోగ్యం ధన సంపదః
శత్రు బుద్ధి వినాశాయ
దీప జ్యోతి ర్నమోస్తుతే ॥

శుభం=మంగళము, కరోతి=చేయునది, కళ్యాణమ్=నిధి, ఆరోగ్యమ్=ఆరోగ్యము, ధన సంపదః=ఐశ్వర్యము, శత్రు=శత్రువు, బుద్ధి=ఆలోచన, వినాశాయ=నశించుటకు, దీప జ్యోతిః=దీప వెలుగును, నమః=నమస్కారము, అస్తు=అగుగాక!, తే=నీకు.

భావము:- శుభమును ప్రసాదించునది, జ్ఞానైశ్వర్యమును, సంపదను అనుగ్రహించునది, బుద్ధికి శత్రువైన అజ్ఞానమును అంతమొందించునది యగు దీపజ్యోతికి నమస్కారము.

తినే ముందు వినే శ్లోకం

శ్లో॥ బ్రహ్మార్పణం బ్రహ్మహవిః
బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ .
బ్రహ్మైవ తేన గన్తవ్యం
బ్రహ్మ కర్మ సమాధినా ॥

బ్రహ్మ=బ్రహ్మము, అర్పణం=అర్పించు సాధనములు, బ్రహ్మ=బ్రహ్మము, హవిః=హవిస్సు, బ్రహ్మాగ్నౌ=బ్రహ్మము అనెడి అగ్నియందు, బ్రహ్మణా=బ్రహ్మముచే, హుతమ్= అర్పించ బడినది, బ్రహ్మైవ=బ్రహ్మమే, తేన=అతని చేత, గంతవ్యం=పొందదగినది, బ్రహ్మకర్మ సమాధినా=బ్రహ్మకర్మ సమాధినిష్ఠుడైన వానిచే.

భావము:- హోమ సాధనములు బ్రహ్మమే. హవిస్సు బ్రహ్మమే. అగ్ని కూడా బ్రహ్మమే. హోమము చేయువాడు బ్రహ్మమే. బ్రహ్మ కర్మ సమాధి నిష్ఠుడైన వానిచే పొందబడేది కూడా బ్రహ్మమే.

పవ్వళించే ముందు పారిపోనీ

శ్లో॥ కరచరణ కృతం వాక్కాయజం కర్మజం వా
శ్రవణ నయనజం వా మానసం వాపరాధమ్ !
విహిత మవిహితం వా సర్వమేతత్ క్షమస్వ
జయ జయ కరుణాబ్ధే శ్రీమహాదేవ శంభో! ॥

కరచరణ కృతం=పాణి పాదాలతో చేసినది, వాక్ - కాయజం=మాటతో, మేనుతో చేసింది, కర్మజం=కర్మ జాతము, వా=మరియు, లేక, శ్రవణ నయన జం=చెవుల నుండి, నేత్రాల నుండి కలిగినది, వా=లేక, మానసం=మనస్సుచే కలిగినది, వా=లేక, అపరాధమ్=చేయకూడని కార్యము, విహితం=చేయదగినవి, అవిహితం =చేయకూడ నివి, వా=లేక, సర్వం=సమస్తము, ఏతత్=ఇవన్నీ, క్షమస్వ= క్షమించు, జయజయ=జయము జయము, కరుణాబ్ధే=దయాసాగరా!, శ్రీమహాదేవ= దేవదేవా!, శంభో=శివా! (సుఖ ప్రదాతా!)

భావము:- దేవదేవా! పరమశివా! దయా సాగరా! సుఖ కారణా! కరచరణాలతో గాని, మాటద్వారా గాని, మేనుద్వారా గాని, కర్మద్వారా గాని, వినుట ద్వారా గాని, వీక్షించుట ద్వారా గాని, మనస్సు ద్వారా గాని, చేయవలసిన వాటిని చేయక పోవుట ద్వారా గాని, చేయకూడని వాటిని చేయుట ద్వారా గాని నేను చేసిన అపరాధముల నన్నిటినీ క్షమించు తండ్రీ!

శివమయం

మంత్రము:- నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ మహాదేవాయ
త్ర్యంబకాయ త్రిపురాన్తకాయ త్రికాలాగ్ని కాలాయ
కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ
సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః ॥

నమః=నమస్కారము, తే=నీకు, అస్తు=అగు గాక, భగవన్=భగవంతా!, విశ్వేశ్వరాయ=విశ్వేశ్వరుడు, మహాదేవాయ=దేవదేవుడు, త్ర్యంబకాయ=ముక్కంటి, త్రిపురాన్తకాయ=త్రిపురసంహారి, త్రికాలాగ్ని కాలాయ=త్రికాలాగ్నిని ఆర్పివేయువాడు, కాలాగ్ని రుద్రాయ=మృత్యువు అనెడి మంటను ఆర్పువాడు, నీలకంఠాయ=నీలకంఠుడు, మృత్యుంజయాయ=మృత్యువును జయించినవాడు, సర్వేశ్వరాయ=సర్వులకు ప్రభువైనవాడు, సదాశివాయ=నిత్య మంగళుడు, శ్రీమన్మహాదేవాయ=సర్వదేవతలకు ప్రభువు, నమః=నమస్కారము.

భావము:- ఓ భగవాన్! విశ్వేశ్వరా! మహాదేవా! త్ర్యంబకా! త్రిపురాన్తకా! త్రికాలాగ్ని కాలరూపా! కాలాగ్ని రుద్రా! నీలకంఠా! మృత్యుంజయా! సర్వేశ్వరా! సదాశివా! శ్రీమన్మహాదేవా! నీకు నా నమస్కారము.

శక్తిమయం

శ్లో॥ సర్వమంగల మాంగల్యే
శివే సర్వార్థ సాధకే
శరణ్యే త్రయంబకే గౌరి
నారాయణి నమోస్తుతే ॥

సర్వమంగల మాంగల్యే=మంగళకరములైన వాటికి మంగళమైనదియు, శివే=శివునికి అర్ధాంగియు, సర్వార్థ సాధకే=సర్వార్థములను పొందుటకు సాధనమైనదియు, శరణ్యే=సర్వులకు ఆశ్రయమైనదియు, త్రయంబకే=త్రినేత్రియు, గౌరీ=సుందరమైనదియు, నారాయణి= ప్రకాశించునది, నమః=నమస్కారము, అస్తు=అగుగాక, తే=నీకు.

భావము:- మంగళములకు మంగళమైనదియు, శివసతియు, సర్వార్థములను పొందుటకు ప్రమాణమైనదియు, సర్వులకు ఆశ్రయమైనదియు, త్రినేత్రియు, గౌరియగు పార్వతీ దేవికి నమస్కారము.

మృత్యుంజయం

శ్లో॥ ఓం త్రయంబకం యజామహే
సుగంధిం పుష్టి వర్ధనం
ఉర్వారుక మివ బంధనా
న్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥

త్రయంబకం=మూడు కన్నులు గలవాడు, యజామహే=పూజిస్తున్నాము, సుగంధిం=పరిమళ భరితమైన, పుష్టివర్ధనమ్=సౌభాగ్యమును వృద్ధి చేయువాడు, ఉర్వారుకం=దోసపండు, ఇవ=వలె, బంధనాత్=బంధము నుండి, మృత్యోః=మృత్యువు యొక్క, ముక్షీయ=విముక్తి చేయు, మా=వద్దు, అమృతాత్=అమృతము నుండి.

భావము:- ముక్కంటి, సుగంధ భరితుడు, సౌభాగ్య ప్రదాతయగు పరమశివుని పూజించుచున్నాము. దోసపండు తీగను వీడిన విధంగా మమ్ములను మృత్యువు నుండి విడుదల చేయుగాక! అమృతత్వము నుండి మమ్ములను మరలింపకుండు గాక!

శాంతి మంత్రములు

ఆకాంక్ష

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః
భద్రం పశ్యే మాక్షభి ర్యజత్రాః
స్థిరై రంగై స్తుష్టువాగ్ంస స్తనూభిః
వ్యశేమ దేవహితం యదాయుః
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః
స్వస్తి నః పూషా విశ్వవేదాః
స్వస్తి న స్తార్క్ష్యో అరిష్టనేమిః
స్వస్తి నో బృహస్పతి ర్దధాతు



ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం=ఓం, భద్రం=శుభప్రదమగు దానిని, కర్ణేభిః=వీనులతో, శృణుయామ= మేము విందుము, దేవాః=ఓ దేవతలారా!, భద్రం=శుభ ప్రదమైనదానిని, అక్షిభిః= నేత్రములతో, పశ్యేమ=మేము దర్శించెదము, యజత్రాః=పూజనీయులారా!, స్థిరైః= దృఢమైన, అంగైః =అంగములతో, తనూభిః=శరీరములతో, తుష్టువాంసః=గానము చేయుచు, దేవహితం =దేవ సంబంధమైన, ఆయుః=జీవితమును, వ్యశేమ=పొందెదము, వృద్ధశ్రవాః=సనాతన ఋషులచే స్తుతించబడిన, ఇంద్రః=ఇంద్రుడు, నః=మాకు, స్వస్తిః=శుభమును, దధాతు= ఒసగుగాక, విశ్వవేదాః=సర్వజ్ఞుడగు, పూషా=సూర్యుడు, నః= మాకు, స్వస్తి=శుభమును, దధాతు=ఒసగు గాక!, అరిష్టనేమిః=ఆపదలనుండి రక్షించు, తార్క్ష్యః=వాయుదేవుడు, నః =మాకు, స్వస్తి=శుభమును, దధాతు=ఒసగు గాక!, బృహస్పతిః=బృహస్పతి, నః=మాకు, స్వస్తి=శుభమును, దధాతు=ఒసగు గాక!

భావము:- ఓ దేవతలారా! మా చెవులతో శుభమైనదానినే వినెదము గాక! ఓ పూజనీయులారా! మా నేత్రములతో శుభప్రదమగు దానినే దర్శించెదము గాక! మిమ్ములను స్తుతించుచు మా కొసంగబడిన ఆయుష్కాలమును పూర్ణ ఆరోగ్యముతో, శక్తితో జీవించెదము గాక! సనాతన ఋషులచే స్తుతించబడిన ఇంద్రుడు మాకు శుభము వొనగూర్చు గాక! సర్వజ్ఞుడైన సూర్యుడు మాకు శుభమును కలుగజేయు గాక! ఆపదల నుండి కాపాడు వాయువు మాకు శుభము సనుగ్రహించు గాక! మాలోని ఆధ్యాత్మిక ఐశ్వర్యమును రక్షించి కాపాడు బృహస్పతి మాకు శుభమును ప్రసాదించు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

అభ్యర్థన

అసతో మా సద్గమయ!
తమసో మా జ్యోతి ర్గమయ!
మృత్యోర్మా అమృతం గమయ!
ఓం శాంతిః శాంతిః శాంతిః

అసతః=అసత్తు నుండి, మా=నన్ను, సద్=సత్తునకు, గమయ=నడిపించుము, తమసః =అంధకారము నుండి, మా=నన్ను, జ్యోతిః=కాంతికి, గమయ=నడిపించుము, మృత్యోః =మృత్యువు నుండి, మా=నన్ను, అమృతం=అమృతత్వానికి, గమయ=నడిపించుము.
భావము:- అసత్తు నుండి నన్ను సత్తునకు గొనిపొమ్ము. అంధకారము నుండి వెలుగులోకి గొనిపొమ్ము. మృత్యువు నుండి అమృతత్వమునకు గొనిపొమ్ము!

అధ్యయనం

ఓం సహనావవతు! సహ నౌ భునక్తు! సహ వీర్యం కరవావహై!
తేజస్వి నావధీతమస్తు! మా విద్విషావహై!
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం=ఓం, సహనౌ=మనల నిరువురిని కూడా, అవతు=(భగవానుడు) రక్షించు గాక, సహనౌ= మనల నిరువురిని కూడా, భునక్తు=పోషించు గాక, సహ=కూడా, వీర్యం=మిక్కిలి శక్తివంతముగా, కరవావహై=శ్రమించెదము గాక, నౌ=మనయొక్క, అధీతమ్= అధ్యయనము, తేజస్వి= ప్రకాశవంతము, అస్తు=అగు గాక, మావిద్విషావహై= మనము పరస్పరము ద్వేషము లేకుండా ఉండెదము గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

భావము:- మన ఉభయులను భగవానుడు రక్షించుగాక! మనల నిద్దరిని పోషించు గాక! మన మిరువురము మిక్కిలి శక్తివంతులమై శ్రమించెదము గాక! మన అధ్యయనము తేజోవంతము అగు గాక! మన మిరువురము ఎప్పుడూ ద్వేషము లేకుండా ఉండెదము గాక!

లోక కళ్యాణం

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీం మహీశాః
గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు ॥

స్వస్తి=శుభము, ప్రజాభ్యః=ప్రజలకు, పరిపాలయంతాం=పరిపాలించెదరు గాక, న్యాయేన మార్గేణ=ధర్మ మార్గమున, మహీం=భువిని, మహీశాః= ప్రభువులు, గోబ్రాహ్మణేభ్యః

=గోవులకు, జ్ఞానవంతులకు, శుభం=శుభము, అస్తు=కలుగు గాక!, నిత్యం=ఎల్లప్పుడు, లోకాః=లోకములు, సమస్తాః= అన్నియు, సుఖినః=సుఖము, భవన్తు=అగుగాక!.

భావము:- జనావళికి శుభము కలుగుగాక! పాలకులు ధర్మమార్గాన భువిని పరిపాలించెదరు గాక! గోవులకు, జ్ఞానులకు సదా శుభము కలుగు గాక! సమస్త లోకము సుఖించును గాక!

సుఖ సంపదలు

కాలే వర్షతు పర్జన్యః
పృథివీ సస్య శాలినీ
దేశోఽ_యం క్షోభరహితః
బ్రాహ్మణా స్సన్తు నిర్భయాః ॥

కాలే=సకాలములో, వర్షతు=వర్షించు గాక, పర్జన్యః=మేఘములు, పృథివీ= భువి, సస్యశాలినీ =పుష్కలముగ పంటతో నిండినది, దేశః=దేశము, అయం= ఈ, క్షోభ రహితః =కలత లేనిది, బ్రాహ్మణాః=జ్ఞానవంతులు అందరు, సన్తు =అయ్యెదరు గాక, నిర్భయాః =భయరహితులు.

భావము:- మేఘములు సకాలములో వర్షించుగాక! భూమాత పుష్కలంగా పంటలతో శోభించు గాక! దేశము దుర్భిక్షము నుండి విముక్తిని పొందు గాక! జ్ఞానవంతులు నిర్భయులై చరించెదరు గాక!

పరిపూర్ణం

ఓం పూర్ణమదః పూర్ణమిదం
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమే వావశిష్యతే
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం=సచ్చిదానంద పరబ్రహ్మము, అదః=అది, పూర్ణం=పరిపూర్ణము, ఇదం= ఇదియును, పూర్ణం=పరిపూర్ణమే, పూర్ణాత్=అట్టి పూర్ణము నుండి, పూర్ణం=పూర్ణత్వము, ఉదచ్యతే =ఉద్భవించెను, పూర్ణస్య=పూర్ణము నుండి, పూర్ణం=పూర్ణము, ఆదాయ= తీసినను, పూర్ణం=పూర్ణము, ఏవ=మాత్రమే, అవశిష్యతే=మిగులును

భావము:- అదంతయు పూర్ణము. ఇదంతయు పూర్ణము. పూర్ణము నుండి పూర్ణము ఆవిర్భవించెను. పూర్ణము నుండి పూర్ణమును తీసివేయగా పూర్ణమే మిగులును.

సుందర చైతన్యాశ్రమ ప్రచురణలు

గ్రంథములు

1. చైతన్య రామాయణము(2 భాగములు)
2. చైతన్య భాగవతము (2 భాగములు)
3. చైతన్య పాంచజన్యం
4. విష్ణుసహస్రనామం
5. చంద్రభాగాతరంగాలు
6. సుందర సంపాదకీయాలు -1
7. సుందర సంపాదకీయాలు -2
*8. ఈశావాస్యోపనిషత్తు
9. ఆత్మవిద్యా విలాసము
*10. శ్రీమద్భగవద్గీత (తాత్పర్య సహితం)
11. శ్రీమద్భగవద్గీత (ప్రతిపదార్థ సహితం)
*12. శ్రీమద్భగవద్గీత (డీలక్సు ప్రతి)
13. నిర్వాణషట్కం
14. శివస్తోత్రం
15. శివగీత
16. వ్యాసప్రసాదం
17. వేదాంత పంచదశి
18. రామదర్శనం
19. గాన రామాయణం
20. ముకుందమాల
21. బాలముకుందం
22. పూజా విధానం
23. వేదాంత వెన్నెల
24. చైతన్య లేఖలు - 1
25. చైతన్య లేఖలు - 2
26. చైతన్య లేఖలు - 3
27. కబీర్ గీతావళి
28. గురుగీత
29. స్వామియే శరణం అయ్యప్ప
30. ధ్యాన జ్యోతి
31. విష్ణుసహస్రనామ స్తోత్రం (తాళపత్రం)
32. హరివిల్లు
33. నిగ్రహం
34. గీతాంజలి
35. కీర్తనాంజలి
*36. సుభాషితం
37. జ్ఞానదేవ్ అభంగాలు
38. శుభారంభం
*39. రమణీయం
40. రసమయం
41. మంగళం
42. వాత్సల్యం
*43. వైభవం
44. శరణం
*45. తులసి తీర్థం
46. కబీర్ కవితలు
*47. వసిష్ఠవాణి
48. న్యాయదీపిక
49. ఆనంద లహరి
50. భజనలు - సోత్రములు
51. చైతన్య గీతికలు
52. జ్ఞాన దీపికలు
53. మలయ మారుతం
54. శాంతి సౌరభాలు
55. గోపీ హృదయం
56. విజ్ఞాన కదంబం
57. పండుగలు - ప్రాశస్త్యం
58. సాధువాక్యం
59. దాశరథీ శతకం
60. శ్రీకాళహస్తీశ్వర శతకం
61. భాస్కర శతకం
62. నరసింహా శతకము
63. శంకర చైతన్యం - 1 (శివాపరాధ క్షమాపణ స్తోత్రం)
64. శంకర చైతన్యం - 2 (నిర్గుణ మానస పూజ)
65. శంకర చైతన్యం - 3 (మనీషా పంచకం)
66. శంకర చైతన్యం - 4 (నారాయణ స్మరణం)

* ఈ గుర్తు గలవి ప్రస్తుతం అలభ్యం

67. శంకర చైతన్యం - 5
(లక్ష్మీనృసింహ స్తోత్రం)
68. శంకర చైతన్యం - 6
(ప్రబోధ సుధాకరం)
*69. శంకర చైతన్యం - 7 (శతశ్లోకి)
70. శంకర చైతన్యం - 8
(సాధన పంచకం)
*71. శంకర చైతన్యం - 9 (ఆత్మబోధ)
72. శంకర చైతన్యం - 10
(ద్వాదశ జ్యోతిర్లింగములు)
*73. శంకర చైతన్యం - 11 (తత్త్వబోధ)
74. శంకర చైతన్యం - 12
(భజ గోవిందం)
75. శంకర చైతన్యం - 13
(శివానంద లహరి)
76. శంకర చైతన్యం - 14
(ప్రపంచసారం)
77. శంకర చైతన్యం - 15
(షట్పదీస్తోత్రం)
78. శంకర చైతన్యం - 16
(కనకధారా స్తోత్రం)
79. శంకర చైతన్యం - 17
(మహిష్మతిలో శంకర యతి)
80. శంకర చైతన్యం - 18
(జగద్గుర్వష్టకం)
81. శంకర చైతన్యం - 21
(సౌందర్య లహరి)
82. శంకర చైతన్యం - 22
(ప్రశ్నోత్తర రత్న మాలిక)
83. శివ దర్శనం
84. విజ్ఞాన నౌక
85. ప్రాతఃస్మరణ స్తోత్రం
86. చైతన్య సమీరాలు
87. ధన్యాష్టకం
88. సుందర మందారాలు

ENGLISH BOOKS

1. Atma Bodha
2. Bhaja Govindam
3. Hints on Practical Vedanta
4. A Peep into Vedantic Lore
5. The Milky Way
6. Bhagavatam (1st canto)
7. Hymns unto Him
8. Voice of Valmiki - Bala kanda
9. Voice of Valmiki-Ayodhya kanda
10. Voice of Valmiki-Aranya kanda
11. Voice of Valmiki -Kishkinda kanda
12. Voice of Valmiki -Sundara kanda
13. Voice of Valmiki - Yudha kanda

ఆడియో క్యాసెట్లు

1. నిత్యమంగళం (7 క్యాసెట్ల సెట్)
2. భగవద్గీత (8 క్యాసెట్ల సెట్)
3. చైతన్యగానం - 1
4. చైతన్యగానం - 2
5. చైతన్యగానం - 3
6. చైతన్యగానం - 4
7. చైతన్యగానం - 5
8. చైతన్యగానం - 6
9. చైతన్యగానం - 7
10. చైతన్యగానం - 8
11. గోపికా గీతం
12. శివ కుటుంబం
13. చైతన్య భజనలు - 1
14. చైతన్య భజనలు - 2
15. చైతన్య భజనలు - 3
16. చైతన్య భజనలు - 4
17. చైతన్య భజనలు - 5
18. చైతన్య భజనలు - 6
19. విష్ణుసహస్రనామం
20. ఆనంద వర్షిణి
21. సుందర స్తోత్ర మంజరి
22. జై జై మహాదేవ
23. నా కవితే కోవెల

ప్రవచనముల క్యాసెట్లు

1. ప్రాతఃస్మరణ స్తోత్రం
(7 క్యాసెట్ల సెట్)
2. విష్ణుసహస్రనామం
(18 క్యాసెట్ల సెట్)
3. కేనోపనిషత్తు
(18 క్యాసెట్ల సెట్)
4. తత్త్వబోధ
(13 క్యాసెట్ల సెట్)
5. ఈశావాస్యోపనిషత్తు
(11 క్యాసెట్ల సెట్)
6. నారద భక్తి సూత్రములు
(19 క్యాసెట్ల సెట్)
7. కఠోపనిషత్తు
(26 క్యాసెట్ల సెట్)
8. వేదాంత పంచదశి
(7 క్యాసెట్ల సెట్)
9. వివేకచూడామణి
(7 క్యాసెట్ల సెట్)

ఆడియో సి.డి.లు

1. అందరికీ వందనములు
2. నమః పార్వతీ పతయే

వీడియో క్యాసెట్లు

1. విష్ణుసహస్రనామం - 1
(1 నుండి 8 ఎపిసోడ్స్)
2. విష్ణుసహస్రనామం - 2
(9 నుండి 16 ఎపిసోడ్స్)
3. విష్ణుసహస్రనామం - 3
(17 నుండి 24 ఎపిసోడ్స్)
4. విష్ణుసహస్రనామం - 4
(25 నుండి 32 ఎపిసోడ్స్)
5. విష్ణుసహస్రనామం - 5
(33 నుండి 40 ఎపిసోడ్స్)
6. విష్ణుసహస్రనామం - 6
(41 నుండి 48 ఎపిసోడ్స్)
7. నీ చరిత పాడుకోనా (పాటలు)
8. పాడినా నీ పాటలే
(చైతన్య గీతికల నృత్య రూపకం)
9. చైతన్య - 54
(స్వామీజీ 54వ జన్మదినోత్సవ వేడుకలతో, ప్రవచనాలతో మూడు గంటల క్యాసెట్)

వివరములకు:
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్
సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043
☎: 08418-55777

సుందర చైతన్యం

శ్రీ సుందర చైతన్యానంద స్వామి ధార్మికోద్యమ నిర్మాతలు. ఆధ్యాత్మిక విద్యా ప్రచార వైతాళికులు. జన జాగరణ మహాశిల్పి. వానన తడువని వారును, సూర్యకిరణ ప్రసారము సోకని వారు ఉండవచ్చునేమో గాని, శ్రీ స్వామి వారి పేరును వినని వారును, వారి ప్రసంగామృతంలో ఓలలాడని వారును కానరారు. శ్రీ స్వామి వారు ఆర్షధర్మ ప్రబోధక మహాజ్ఞాన యజ్ఞాలను దేశంలో విస్తృతంగా నిర్వహిస్తూ లక్షలాది ప్రజానీకాన్ని దైవోన్ముఖులను గావించారు. గావిస్తున్నారు.

'Swami Sundara Chaitanyananda is an apostle of purity, unity and divinity. He is one of the greatest spiritual luminaries of our time, awakening people to self-knowledge and peace. Swami Sundara Chaitanyananda is the torch - bearer of Sanatana Dharma. I bless his spiritual activities'. యోగ సమాజ సంస్థాపకులు, కవి యోగి, మహర్షి శ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారు శ్రీ స్వామీజీని ఆశీర్వదిస్తూ పలికిన మాటలివి. మహాత్ముల సంకల్ప బలం పరిపూర్ణ కార్య సిద్ధిప్రదాయక మని ఈ 35 సంవత్సరాల సుందర చైతన్య ఆధ్యాత్మిక మహోద్యమం నిరూపిస్తోంది.

పందొమ్మిది వత్సరాల లేత వయస్సులోనే ఆర్ష సంస్కృతీ పునర్వైభవ ప్రాప్తికి అంకురార్పణ చేసి వ్యక్తి ఔన్నత్యానికి, సమాజ అభ్యుదయానికి కంకణం ధరించి, మానవ జీవన సరళిని సవరించి సంస్కరించేందుకు అహరహము అంకిత భావంతో పరిశ్రమించారు, పరిశ్రమిస్తున్నారు శ్రీ స్వామీజీ. మాటల మధ్య మానవ జీవితానికి అర్థం చెబుతూ, పాటలలో తియ్యగా పరమార్థాన్ని విప్పి చూపుతూ, నిర్జీవ మవుతున్న సమాజానికి జీవిత పాఠాలను సహనంతో నేర్పుతూ, 165 జ్ఞాన యజ్ఞాలను నిర్వహించి, శతాధిక గ్రంథాలను రచించి, ఊరూరా సత్సంగ శాఖలను రాష్ట్రమంతటా నెలకొల్పి, సుమారు ఇరవై వేల మంది జీవిత సభ్యులను కలిగిన 'గిరిధారి' మాసపత్రిక ద్వారాను, రేడియో, టి.వీల ద్వారాను, ఆడియో వీడియో క్యాసెట్ల ద్వారాను, ఆర్షవిద్యావాణిని జనావళికి వినిపిస్తూ ఉన్నారు.

గత మూడు దశాబ్దాలుగా పూజ్య స్వామీజీ ఆంధ్రావనికి అందించిన ఆధ్యాత్మిక సేవలు, ధర్మప్రబోధాలు అనితర సాధ్యాలు. ఈ మహత్తర కార్యక్రమానికి కార్యక్షేత్రంగా పదహారు సంవత్సరాల క్రితం ధవళేశ్వరం సుందర చైతన్యాశ్రమం రూపుదిద్దుకుంది. తపోవనంలా, సుందర నందనోద్యానవనంలా శోభించే ఈ ఆశ్రమం వేలాది సత్సంగీయులకు, భక్తులకు స్ఫూర్తి కేంద్రంగా దినదినాభివృద్ధి చెందింది. అద్భుత కళాఖండమైన ఈ ఆశ్రమం ప్రస్తుతం చైతన్య వానప్రస్థాశ్రమంగా రూపుదాల్చింది.

1997 సంవత్సరంలో అభినవ బృందావనంగా హైద్రాబాద్ సుందర చైతన్యాశ్రమం వెలసింది. పచ్చని పొలాల మధ్య పది ఎకరాల స్థలంలో నిర్మింపబడ్డ ఈ ఆశ్రమం భక్తుల పాలిటి కల్పవృక్షం. భక్తిభావ పరంపరలలో ముంచెత్తే మురళీకృష్ణ భగవానుని ఆలయం, జ్ఞాన ప్రబోధాలతో ప్రతిధ్వనించే శ్రుతి మందిరం, ఈ రెండూ భక్తి జ్ఞాన సమ్మేళనమైన సుందర చైతన్య మహోద్యమానికి సంకేతాలు.

శ్రీ స్వామీజీ రచించిన గ్రంథాలకు అనూహ్యమైన ఆదరణ లభించింది. మరొకరికి అందనిది, దొరకనిది, వారికున్న శ్రావ్యమైన గాత్రం, గంధర్వ వైదుష్యం. స్వామి వారి సభలలో అప్పుడప్పుడు వినిపించే నవ్వుల దొంతరలు, వక్తగళం తప్పిస్తే సూదిమోపితే వినిపించేటంతటి నిశ్శబ్దం అలుముకుంటుంది. వారి భాష, బాణీ అద్భుతం; వారి గళం, కలం ఒకదానితో మరొకటి పోటీ పడుతూ ఉంటాయి, ఒక దాని నొకటి మించిపోవాలనుకుంటాయి.

శ్రీ స్వామివారు తమ దివ్య బోధలతో అలసిపోయిన జీవితాలలో ఆశాలతలను పూయిస్తున్నారు. అలుపెరుగని కంఠంతో మానవాళి అశాంతి తలుపులను మూయిస్తున్నారు. భక్తి, జ్ఞాన ప్రచారం ద్వారా సాత్త్వికతను, ధార్మిక తాత్త్విక అవగాహనను విస్తరింపజేస్తున్నారు.

శ్రీ స్వామి వారిది ప్రచారోద్యమం. జన జాగరణోద్యమం. సమాజాన్ని చైతన్య వంతం చేసే సుందర సముద్యమం. ఆయన భారతీయ విజ్ఞాన సర్వస్వం. సనాతన ధర్మ పరిమళం. ఆర్ష సంస్కృతీ సభ్యతల భాండాగారం. ఇది ఆంధ్రుల భాగ్యం. దేవభాషలో నిక్షిప్తమైన విజ్ఞాన మర్మాలను దేశభాషలో విప్పి మన ముందు పరుస్తున్న శ్రీ స్వామి వారికి మనం సమకాలీనుల మవడం మన పురాకృత పుణ్యఫల విశేషం. శ్రీ స్వామి భక్తాగ్రేసరులు, తపస్సంపన్నులు, ఋషి పుంగవులు. గండుశిలలకు కూడా మానవత్వాన్ని ఆపాదించగల మహిమాన్వితులు. కఠిన పాషాణాలను సైతం కరిగించి, కారుణ్య రసాస్వాదన చేయించగల ప్రజ్ఞాన ధురీణులు. బండబారిన గుండెల్లో కూడా తన పసిడి పలుకుల పండు వెన్నెలలు కురిపించి, మానవత్వాన్ని మేలుకొలిపే మహనీయులు. వేదవాఙ్మయాన్ని, పురాణ ఇతిహాసాలను, ప్రస్థానత్రయాన్ని ఆపోశన పట్టి, ఆ సారాంశాన్ని భావరాగ యుక్తంగా ధారా ప్రవాహంగా నిర్విరామంగా దేశం నలుమూలలా పంచి పెట్టే వారి చైతన్యం అతి సుందరం.

పలు బిరుదములతో యోగి పుంగవులు పూజ్య స్వామీజీని సత్కరించగా, సువర్ణ కంఠాభరణాలతో, హస్త కంకణాలతో, సువర్ణ కిరీటాలతో, గండపెండేర పురస్కారంతో, గజారోహణాలతో, కనకాభిషేకాలతో వివిధ ప్రాంతాలలోని భక్తులు, అనేక సాంస్కృతిక ఆధ్యాత్మిక సంస్థలు వీరిని సన్మానించాయి. ఇంత చేసినా తృప్తి చెందక 'ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగల' మంటూ, శ్రీ స్వామి వారి అవిరళ కృషికి, త్యాగ జీవనానికి, జనులపై వారికున్న అపార కృపకి ఆంధ్రావని భక్తి భావంతో, కృతజ్ఞతా భారంతో శిరమొడ్చి, కరములు జోడించి స్వామివారి పాదపద్మాలకు నమస్కరిస్తోంది.



సమాజ కళ్యాణం


పుణ్యకార్యం - మీరూ భాగస్వాములు కండి.

వ్యక్తి వికాసానికి - సమాజ కళ్యాణానికి అద్దం పడుతుంది ఈ గ్రంథం. అర్థం చెబుతుంది. అవరోధాలను తొలగిస్తుంది. ప్రగతికి పట్టం కడుతుంది.

దీపం పెడితే ఇంటిలో వెలుగు.

ఈ గ్రంథం పట్టుకొంటే వ్యక్తిలో వెలుగు.

మీ ప్రయత్నంలో కనీసం ఒక్కరి చేతనైనా ఈ గ్రంథాన్ని కొనిపించండి. మీరు చెప్పకుండానే వారు చదువుతారు. ఆంధ్ర దేశంలో లక్ష కాపీలన్నా వితరణ కావాలి అనేది మా ధ్యేయం. ఇదొక అద్భుతమైన సేవగా భావిస్తున్నాం. మీరూ చేతులు కలపండి. మీ వంతు పుణ్యాన్ని మూటగట్టుకోండి.






సుందర చైతన్యానంద స్వామికి పొంది
ముంది. ఆధ్యాత్మిక జీవిత ముంది. ఆధుని
విధ్యను, సంస్కృతాన్ని సమున్నతంగా పొం
తమ అద్భుతమైన శక్తిని, సంగీత వైదుష్యము
మన రాష్ట్రంలో సనాతన ధర్మ ప్రచారాని
వినియోగించారు.

స్వామి రంగనాథానంద
అధ్యక్షులు, రామకృష్ణ మిషన్



స్వామి సుందర చైతన్యానంద చేసిన సేవ నన్ను పరవశింప చేసింది. వేదాంత జ్ఞానము ద్వారా సంస్కృతిని పునరుద్ధరించేందుకు ఫలప్రదమైన, ప్రశాంత కార్యక్రమం చేపట్టాలి అంటే చేయదగిన సేవ ఇలాగే ఉండాలి.

స్వామి చిన్మయానంద
చిన్మయ మిషన్



సుందర చైతన్యానంద స్వామికి పరమాత్మ అనుగ్రహం ఉంది. సరస్వతీ కటాక్షముంది. తమ జ్ఞానాన్ని అక్షరాలలో పొదిగే నేర్పు ఉంది. అరుదైన ప్రతిభతో, పరమాత్మ అనుగ్రహించిన విశేష వరాలతో జన చైతన్యానికి ఆవిష్కరణ జరిగింది. సుందర చైతన్యానంద స్వామి దీర్ఘకాల జీవితమును పొందెదరు గాక!

స్వామి చిదానంద
దివ్యజీవన సంఘము, ఋషికేశ్